శ్రీమతే రామానుజాయనమః
శ్రీశ్రీనివాస పరబ్రహ్మణే నమః
అస్మద్ గురుభ్యోనమః
శ్రీరఘునాధదేశికేభ్యోనమః

## భగవద్రామానుజ విరచిత బ్రహ్మసూత్రభాష్యమ్

# శ్రీభాష్యమ్

(ద్వితీయ భాగము)

**SRI BHASHYAM** *by*
Bhagavad Ramanujacharya

Telugu Translation *by*
**Sri Kallakunta Venkata Narasimha Charya**

భగవద్రామానుజ విరచిత బ్రహ్మసూత్రభాష్యమ్

**శ్రీభాష్యమ్** (ప్రథమ)
**ద్వితీయ భాగము**

తెనుగుసేత

**కండ్లకుంట వేఙ్కట నరసింహాచార్యులు**

ప్రథమ ముద్రణ: **నవంబరు, 2019**

© కాపీరైట్స్ ప్రకాశకులవి

ప్రతులు : 500

ప్రకాశకులు : **శ్రీమాన్ కండ్లకుంట సీతారామానుజాచార్య స్వామివారి**
తిరునక్షత్రోత్సవసమితి.
గ్రా. ఎరజర్ల. తా. జి. మానుకోట,
తెలంగాణ.
సెల్: 9989392623

డిటిపి : జి. లక్ష్మీ మార్కండేయ స్వామి, 9533934457

ముద్రణ: **కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్,** హైదరాబాద్.

శ్రీమతే రామానుజాయనమః

# శ్రీభాష్యము – ద్వితీయాధ్యాయము – ప్రథమపాదము

## స్మృత్యధికరణము

సూ॥ **స్మృత్యనవకాశదోషప్రసంగః ఇతిచేన్నఅన్యస్మృత్యనవకాశ దోషప్రసంగాత్ 2–1–1** మొదటి అధ్యాయము నందు ప్రత్యక్షాది ప్రమాణాలచేత తెలియవచ్చే అచేతనము కంటే, దానితో కల్సిఉన్న, దానితో విడివడిన, రెండు విధాలుగా ఉన్న చేతనుడి కంటే – బద్ధముక్తుల – వేరయినవాడు అవిద్య మొదలైన అపురుషార్థాల వాసన కూడా లేనివాడు అనన్తమైన ఉదారణగుణాలకు సాగరము వంటివాడు, సమస్త జగత్తుకూ ఏకైక కారణమైనవాడు చరాచరములన్నింటికీ అన్తరాత్మ ఐన పరబ్రహ్మ వేదాన్తాలచేత మాత్రమే తెల్సుకోదగినవాడు అని చెప్పబడినది. తరువాత ఈ అంశాన్ని ఎదిరించి మాట్లాడే ప్రతిపక్షాల యొక్క ఊహాత్మకవాదాల నుండి ఎటువంటి ఎదురుదెబ్బలు తగులకుండాను వాటిచేత కదల్చరానిదిగా నిలువడానికి రెండవ అధ్యాయము ఆరంభింపబడుతున్నది.

ముందుగా కపిలస్మృతితో వైరుధ్యమున్న కారణంగా వేదాన్త వాక్యాలు బ్రహ్మపరములు కావని తలుస్తారేమోనని శంకించి, దాన్ని తోసిపుచ్చుతున్నారు. స్మృతితో విరోధము ఉన్నప్పటికీ శ్రుతి బ్రహ్మను గురించి తెలుపజాలదు అని ఏకారణంగా అంటున్నారు అని అనేట్లయితే **విరోధేత్వనపేక్ష్యంస్యాత్** విరోధము ఉన్నట్లయితే దాన్ని ఆదరించకూడదు అని చెప్పబడింది కదా! కనుక శ్రుతితో విరోధము ఉన్నట్లయితే స్మృతిని ఆదరింపవలసిన పనిలేదు కదా! నిజమే. **ఔదుమ్బరీం స్పృష్ట్వాఉద్గాయేత్.** మేడిచెట్టు మొద్దుతో చేసిన యూపాన్ని – యజ్ఞంలో ఉపయోగించే పశువును కట్టి వేసే గుంజతాకి పెద్దగొంతుతో **గానము** చేయాలి (దుఃఖము) అని మరొక అర్థం. ఇట్లాంటి వాక్యాల వద్ద శ్రుతికి స్మృతికి వైరుధ్యము ఉన్నా సహజంగానే వేదవాక్యము ద్వారానే అర్థ నిశ్చయము అవుతున్నది. కనుక స్మృతి వాక్యాన్ని ఆదరించవలసిన పనిలేదు. ఇక్కడ మాత్రము వేదాన్తాల చేతనే నిర్ధారణ చేయదగిన తత్వాన్ని అర్థము చేసుకోవడము కష్టము. కనుక పరమఋషి చేత రచించబడిన స్మృతి యొక్క సహాయము లేకుండా ఇదీ ఈ వాక్యానికి అర్థము అని నిశ్చయించడానికి సాధ్యము కాదుకనుక స్మృతి ద్వారా వేదాన్త వాక్యాలు బ్రహ్మను ప్రతిపాదించడము లేదని తేల్చితే వైరుధ్యము ఏమీ

ఉండదు – అనగా చెప్పబడిన విషయము ఇది. – వేదము యొక్క పూర్వభాగమైన కర్మ కాండ యందు చెప్పబడిన అన్ని రకాలైన అభ్యుదయాలకి సాధనాలైన అగ్నిహోత్రము చేయుట, దర్శపూర్ణమాసయాగాలు చేయుట, జ్యోతిష్టోమము చేయడం వంటి కర్మలన్నీ వేదములో చెప్పినట్లు ఉన్నది ఉన్నట్టుగా అంగీకరించినా వేదార్థాన్నీ విశదీకరించే స్మృతులు ఇతిహాసాలు పురాణాలు వేదాల్లోనూ **ఋషిం ప్రసూతం కపిలమ్** గొప్పపుట్టుక గల కపిల మహర్షిని అని మొదలైన వాక్యాలతో పొగిడినందువల్ల అతను ఆప్తుడు – మనకు మేలు కలుగాలని కోరేవాడు, కపటము లేని వాడు అసత్యాన్ని పలుకనివాడు కనుక ఆయన చేత మానవులకు పరమనిశ్శ్రేయసము – మిక్కిలి మేలు కలిగించే పురుషార్థము ఇది అని, దాన్ని సాధించుకోవడానికి ఇదీ చేయాల్సినపని అని తెల్పుతూ కూర్చబడిన స్మృతి గ్రన్థము యొక్క సహాయముతో తప్ప వేదార్థము యొక్క ఉపబృంహణము – వివరించుట – ఏదో కొద్దిగా మాత్రమే చదువుకున్న తెలివితక్కువవాళ్ళకు వేదాన్తార్థము నిశ్చయము చేసుకోవడము సాధ్యము కాదు. ఇటువంటప్పుడు వినికిడి ద్వారా పొందిన వేదములోని అర్థాన్ని గ్రహించడానికి ఆప్తుడి చేత రచించబడిన సాంఖ్యస్మృతిని మొత్తాన్నీ వైరుధ్యము ఉన్నది అని పక్కకు పెడితే ఇంకాదానితో అవసరము లేనప్పుడు దానికి అవకాశమే లేకుండా పోతుంది. కనుక వేదాన్తార్థాన్ని తేల్చిచెప్పే స్మృతి ప్రసిద్ధమైన అర్థాన్నే గ్రహించి ఆస్మృతి చెప్పిందే సరియైన వేదాన్తర్థము, అదే వేదాన్తవేద్యము అనే బలీయప్రమాణము చేత ఒప్పుకోవాలి. అని.

అయితే బ్రహ్మమాత్రమే జగత్తుకారణము అని తేల్చిచెప్పే మనుస్మృతి వంటి గ్రన్థాలకు అవకాశము లేకుండాపోతుంది అని అనకూడదు. అవి ధర్మకార్యాలను – యజ్ఞయాగాదులను – ప్రతిపాదించే పూర్వభాగాన్ని ఉపబృంహణము – విశదీకరణాన్ని – చేస్తున్నాయి. కాబట్టి వాటికి అవకాశము లేకుండాపోతుంది అనడానికి వీల్లేదు. వాటి పనినేరవేరింది. కపిలస్మృతి మాత్రము తత్వాన్ని మాత్రమే తేల్చిచెప్తున్నది. అటువంటి దానికి వైరుధ్యము ఉన్నది – ప్రధానాన్ని జగత్కారణంగా ప్రతిపాదిస్తున్నది – అని దానికి అంగీకరించకపోతే దానికి అవకాశమే లేకుండా పోతుంది. కనుక సాంఖ్యస్మృతికి అవకాశము చిక్కకపోవడము అనే దోషము వస్తుంది కదా అనేట్లయితే – ఈ శంకకు సమాధానము చెప్తున్నారు. న. అన్యస్మృత్యనవకాశదోష ప్రసంగాత్ అని.

సాంఖ్యస్మృతికంటే వేరయిన మనుస్మృతి వంటివాటికి బ్రహ్మను మాత్రమే జగత్కారణంగాచెప్పేవాటికిఅవకాశములేకుండాపోతుంది.మనువుఇట్లాచెప్పినాడు.

**ఆసీదిదంతమోభూతమ్** అని మొదలుపెట్టి **తతఃస్వయంభూః భగవాన్ అవ్యక్తో వ్యంజయన్నిదమ్। మహాభూతాదివృత్తౌజాః ప్రాదురాసీత్తమోనుదః, సోఽభిధ్యాయ శరీరాత్ స్వాత్సిసృక్షుర్వివిధాః ప్రజాః। అపఏవససర్జాదౌ తాసువీర్యమపాసృజత్.** ఇప్పుడు కనిపిస్తున్న ఈ ప్రపంచము ఆ ప్రళయకాలములో లేదు. అప్పుడు చీకటిలో ఏ వస్తువు ఏది అని కనుక్కోలేనట్లే మిక్కిలి సూక్ష్మమై నామరూపాలు లేనిదై తమశ్శబ్దము – తనకు తానే కారణమై ఉన్నవాడు నారాయణుడు – భగవన్తుడు – అవ్యక్తముగా ఉన్నవాడు ఈ జగత్తును తేటగా కనపడేట్లు వెల్లడి చేయదల్చుకొని మహా భూతాలు – భూమి నీరు మొదలైనవి – తో పెరిగినవాడై, తమస్సును పోగొడుతూ ఆవిర్భవించినాడు. ఆయన సృష్టిని చేయాలని ఎంచి, వివిధాలైన – పలురకాల ప్రజలను పుట్టించాలనుకొని వారినందరినీ తన శరీరాన్నుండే బయల్పరచడానికి పూనికొని తొలుతగా నీటిని పుట్టించి వాటిలో వీర్యాన్ని – పుట్టించగల శక్తిని – వదలినాడు అని.

భగవద్గీతలో కూడా **అహంకృత్స్నస్యజగతః ప్రభవః ప్రలయస్తథా।** నేను ఈ సమస్త జగత్తుకూ పుట్టడానికి ప్రలయము కావడానికిన్నీ కారణమవుతున్నాను. **అహంసర్వస్యప్రభవః మత్తఃసర్వమ్ ప్రవర్తతే** నానుండే ఈ సర్వమూ పుడుతున్నది. నావల్లనే సుఖజీవనాన్ని సాగిస్తున్నది అనిన్నీ చెప్పినారు మహాభారతంలోనూ **శ్లో॥ కుతఃసృష్టమిదం సర్వంజగత్స్థావరజంగమమ్। ప్రలయేచకమభ్యేతి తన్మేబ్రూహి పితామహ॥** ఓ తాతగారూ! ఈ జగమంతా ఎవరినుండి పుట్టింది ఈ చరాచరమంతా ఎవని వద్దకు చేరుకుంటుంది! దాన్ని నాకు తెలుపండి. అని అడిగితే ధర్మరాజుకు భీష్ముడు ఇట్లా చెప్పినాడు. శ్లో: నారాయణోజగన్మూర్తిః అనన్తాత్మా సనాతనః. జగద్రూపములో ఉన్నవాడు నారాయణుడు. ఆయన అన్తము లేనివాడు. ఏనాటి నుంచి ఉంటున్నాడో తెలియదు. అని అదే విధంగా **తస్మాదవ్యక్తముత్పన్నం త్రిగుణంద్విజసత్తమ** ఆయన నుండి రజస్తమోసత్వగుణాత్మకమైన అవ్యక్తము పుట్టిందయ్యా! బాపడా! అని **అవ్యక్తం పురుషే బ్రహ్మన్ నిష్క్రియే సమ్ప్రలీయతే.** ఓ బ్రాహ్మణుడా అవ్యక్తము నిష్క్రియుడైన – ఏపనీ చేయవలసిన అవసరము లేని – పురుషుని యందు లీనమవుతున్నది. కలిసిపోతున్నది. అనిన్నీ చెప్పినాడు. భగవన్తుడగు పరాశరుడిట్లా చెప్పినాడు. **శ్లో॥ విష్ణోః సకాశాత్ ఉద్భూతం జగత్తత్రైవచస్థితమ్। స్థితిసంయమకర్తాఽసౌ జగతోఽ స్యజగచ్చసః॥** ఈ జగము విష్ణువు వద్దనుండి పుట్టింది. ఆయన అదుపులోనే ఉన్నది. ఈ జగత్తుకు రక్షణ ప్రలయకారకుడు ఆయననే.

ఈ జగద్రూపముగా ఉన్నవాడు కూడా ఆయనే. జగత్తే ఆయన ఆయనే జగత్తు. అని. ఇక ఆపస్తమ్బమహర్షి **పూః ప్రాణినః సర్వఏవగుహాశయస్య అహన్యమానస్య వికల్మషస్య** ప్రాణులన్నీ కూడా, హృదయగుహలో ఉండేవాడు. దేని నుండి ఎదురులేని, పాపపుణ్య రూపకర్మలు లేనివాడు ఐన పరబ్రహ్మ శరీరాలు సుమా! అని ఆరంభించి **తస్మాత్ కాయాః ప్రభవన్తిసర్వేసమూలం శాశ్వతికః.** ఆయన నుండే శరీరాలుగా చెప్పబడుతున్న ప్రాణులన్నీ పుడుతున్నాయి. ఆయనే అందరికీ మూలకారణమైన వాడు. అతడు ఎల్లవేళలా ఉండేటువంటివాడు. **సనిత్యః** మార్పులులేక ఒక్కరీతిగా ఉండునట్టివాడు అని.

ఒకవేళ కపిలస్మృతి ప్రకారమే వేదాన్త వాక్యాలకు అర్థనిర్ణయమే జరిగితే అప్పుడు ఇప్పటివరకూ చూపిన స్మృతులన్నింటికి మహా అపచారము చేసినట్లు అవుతుంది. దీనికి ఇది అర్థము – వేదాన్త వాక్యాలు ప్రత్యక్షము మొదలైన ప్రమాణాలన్నింటికీ ఊహించడానికి కూడా అందుబాటులో లేని అర్థాన్ని / వస్తువును / బ్రహ్మను ప్రతిపాదించేవి ఐనందున వాటియొక్క అర్థాన్ని తేటగా తెల్సుకోవడానికి కొద్దిగా చదువుకున్నవారికి, ఆ బ్రహ్మను తెల్సుకోవాలని కోరేవారికి స్మృతుల ద్వారా ఉపబృంహణము / విశదీకరణము అవసరమేఐనా, ఆ వేదార్థాన్ని అనుసరించే ఆప్తతములైన వారిచే రచించబడిన వేదార్థ వివరణకే ప్రయత్నించిన చాలాచాలా స్మృతులకు అవకాశము లేకుండా పోకూడదు. కనుక వేదవిరుద్ధమైన అర్థాన్ని ప్రతిపాదించే కపిలస్మృతిని పట్టించుకోనక్కరలేదు. ఉపబృంహణము అంటే శ్రుతుల ద్వారా తెలియవచ్చిన అర్థాన్ని తేటతెల్లం చేయడం. అది విరుద్ధమైన అర్థాన్ని చెప్పే స్మృతితో చేయబడదు.

ఐతే కపిల స్మృతి కంటే వేరుగా ఉన్న వేదార్థాన్ని సరిగా వివరించే వేదము యొక్క పూర్వభాగాన్ని, అందులోని ధర్మాంశాలను / ధర్మకార్యాలను విశదీకరించే ఈ స్మృతులన్నీ సావకాశములు అని అనడానికి వీలు లేదు. పరబ్రహ్మ ఐన పరమ పురుషుడిని ఆరాధించేవి ఐనందున ధర్మాలను కర్మలను చేయండి అని చెపుతున్నందున ఈ స్మృతులు ఆరాధింపబడే పరమపురుషుడిని ప్రతిపాదించకపోతే / తెలుపకపోతే ఆయనను ఆరాధించే ధర్మాలను ప్రతిపాదించడం బొత్తిగా కుదురకుండాపోతుంది. అది ఇట్లాగా ఉన్నది. కర్మలన్నీ పరమపురుషుడిని ఆరాధించేవిగానే ఉన్నవి. అని స్మృతులు చెప్తున్నవి. **శ్లో॥ యతః ప్రవృత్తిః భూతానాంయేన సర్వమిదంతతమ్।**

**స్వకర్మణాతమభ్యర్చ్య సిద్ధింవిన్దతిమానవః** ఈ ప్రాణులన్నీ ఎవరివల్ల తమతమ జీవనాన్ని కొనసాగిస్తున్నాయో ఎవడు ఈ సమస్త ప్రపంచములో వ్యాపించి ఉన్నాడో అట్టి పరమపురుషుడిని తనకు శాస్త్రము చేత విధింపబడిన కర్మలద్వారా ఆరాధించి మానవుడు మోక్షాన్ని పొందగలడు. **శ్లో॥ ధ్యాయేత్ నారాయణం దేవమ్। స్నానాదిషు చకర్మసు। బ్రహ్మలోకమవాప్నోతి। నచేహావర్తతేపునః।** స్నానము మొదలుకొని మానవుడు చేసే కర్మలన్నీ శ్రీమన్నారాయణుడిని తలచుకుంటూనే ఆచరించాలి. అతడు బ్రహ్మలోకాన్ని పొందుతాడు. మళ్ళీ ఈ లోకంలో పుట్టనే పుట్టడు. **శ్లో॥ యైఃస్వకర్మపరైఃనాథ। నరైరారాధితోభవాన్। తేతరన్త్యఖిలామేతాం మాయామాత్మవిముక్తయే।** హేప్రభో! ఎవరైతే తమవైన వర్ణాశ్రమాచారకర్మలతో నిన్నారాధించుతారో వారు ఈ నీ మాయనంతటినీ దాటుకొని పోయి ఆత్మవిముక్తిని పొందుతారు. అని ఇహలోకంలోనూ పరలోకంలోను సాంసారికమైన ఫలాలను అనభవించడానికి సాధనములైన కర్మలను ప్రతిపాదించడము చేత ఈ స్మృతులన్నిటికీ సావకాశత్వము లేదు. ఆ కర్మలన్నీ కూడా పరమపురుషుడిని ఆరాధించేవిగానే ఉంటున్నవి. అదేవాటి స్వరూపము. **శ్లో॥ యేఽప్యన్యదేవతాభక్తాః యజన్తే శ్రద్ధయాఽన్వితాః। తేఽపిమామేవకాన్తేయ। యజన్త్యవిధిపూర్వకమ్॥ అహంహిసర్వయజ్ఞానాం భోక్తాచప్రభురేవచ। నతుమామభిజానన్తి తత్త్వేనాతః చ్యవన్తితే॥** ఓ అర్జునా! ఎవరైతే నన్నుగాక ఇతరదేవతలను శ్రద్ధతో కొలుస్తూ ఉన్నారో వారుకూడా నన్నే డొంకతిరుగుడుగా! శాస్త్రప్రకారముకాకుండా కొలుస్తున్నారు. వాస్తవానికి అన్ని యజ్ఞాలకున్నూ నేనే భోక్తను ఆరాధింపబడే దేవతను, ప్రభువును – ఫలాలనిచ్చేవాడను ఐతే వారు యధార్థమేదో తెల్సుకోలేకున్నారు. కనుక వారు పతనమవుతున్నారు అని. అదేవిధంగా **శ్లో॥ యజ్ఞైఃత్వమిజ్యసే నిత్యం సర్వదేవమయాఽచ్యుత। హవ్యకవ్యభుగేకస్త్వం పితృదేవస్వరూపధృక్.** ఓ స్వామీ! దేవతలందరిలోనూ అన్తరాత్మగా ఉన్నవాడా! అచ్యుతా! అన్నిరకాలయజ్ఞాల చేతనున్నూ నీవే పూజింపబడుతున్నావు. పితరుల రూపములో దేవతలరూపములోనూ నీవొక్కడివే హవ్యకవ్యాలను స్వీకరిస్తున్నావు అని.

**ఋషింప్రసూతం కపిలం** అని కపిలుడిని ఆప్తుడుగా కీర్తించినందున ఆయన చెప్పిన స్మృతి ప్రకారము వేదాన్తార్థమును స్థాపించడమే న్యాయమని ఏ మాటచెప్పినారో అది సరియైనది కాదు. మీరు చెప్పిందే సరి అయ్యేటట్లుంటే శ్రుతిస్మృతులన్నింటిలోనూ గొప్పతెలివితేటలు గల వారందరిలో బృహస్పతి గొప్పవాడుగా కీర్తింపబడినాడు కదా!

ఆయన అభిప్రాయం ప్రకారము ఆయన చెప్పిన లోకాయతన మతమునననుసరించికూడా వేదాన్తార్థాన్ని నిర్ణయించవలసివస్తుంది. అది తమకు సమ్మతమేనా?

ఐతే ఇట్లా అనవచ్చును. కపిలుడు తనయొక్క యోగశక్తి మహిమతో వస్తువుయొక్క యధార్థాన్ని తెల్సుకున్నవాడు కనుక ఆయన చెప్పిన స్మృతి ప్రకారము వేదాన్తార్థాన్ని స్థాపించాలి అని. దీనికి ఉత్తరమిస్తున్నారు.

సూ॥ **ఇతరేషాంచానుపలబ్ధేః 2-1-2.** సూత్రములోని చకారము తు అనే శబ్దము యొక్క అర్థాన్నిస్తుంది. ఇతరేషాం – మనువు మొదలైన స్మృతి కర్తలు చాలామంది కూడా తమ యోగ మహిమచేతనే ఎవడు పరుడు (గొప్పవాడు) ఎవడు అవరుడు అని తత్త్వము యొక్క యధార్థస్థితిని తెల్సుకొన్నవాళ్ళే. వారి మాటలు నిఖిల జగత్తుకూ భవరోగానికి మందువంటివి అని పేరు పొందినటువంటివి. **యద్వైకించనమనురవదత్. తత్‌భేషజమ్.** మనువు చెప్పే చిన్నమాట ఐనా అది భేషజము వంటిది. మందువలె సంసారరోగాలను నశింపచేస్తుంది. భిషక్‌వైద్యుడు అతడు ఇచ్చేది మందుకనుక దానికి భేషజమ్ అనిపేరు. అని శ్రుతులలో ప్రసిద్ధులైన వారికి కపిలునికి తోచిన విధముగా త్త్వము లభించలేదు. కనుక కపిలుడు కనుగొన్న స్మృతి శ్రుతికి విరుద్ధమైనది. పైగా భ్రాన్తివల్ల ఏర్పడినట్టిది. కనుక దాని ప్రకారము వేదాన్తార్థాన్ని నిర్వహించడము వీలుకాదు అని నిశ్చితమయ్యింది. **అని స్మృత్యధికరణము.**

★ ★ ★

## ఇక యోగప్రత్యుక్తి అధికరణము

సూ॥ **ఏతేన యోగః ప్రత్యుక్తః 2-1-3** ఏతేన – కపిలుని యొక్క స్మృతిని తోసిపుచ్చడంతో యోగస్మృతి కూడా తిప్పికొట్టబడింది. ఈ యోగ శాస్త్ర విషయంలో అధికమైన శంక ఏమిటి? దీన్ని నిరాకరించడానికి దాని లాగే ఇది అనే న్యాయాన్ని తెచ్చిపెట్టుకుంటున్నాము. అతి దేశము చేసుకుంటున్నాము. అంటే, యోగ స్మృతిలో కూడా ఈశ్వరుడిని అంగీకరించినారు. మోక్షాన్ని సాధించుకోవడానికి వేదాన్తాల చేత చెప్పబడిన యోగాన్ని మార్గంగా చెప్పినారు. ఈ శాస్త్రానికి వక్త హిరణ్యగర్భుడు. అనగా బ్రహ్మ. ఆయన వేదాన్తాల నన్నింటినీ ప్రవర్తింపచేయడంలో అధికారమున్నవాడు. కనుక ఆయన చెప్పిన యోగస్మృతి ప్రకారము వేదాన్తాలను విశదీకరించడము న్యాయమైనది అని. దీనికి పరిహారము ఏమిటి? అంటే. ఈ స్మృతిలో బ్రహ్మాత్మకము కాని

ప్రధానాన్ని కారణము అని ప్రతిపాదించినారు. ఈశ్వరుడిని ఉపాదాన కారణముగా కాకుండా నిమిత్త కారణంగానే అంగీకరించినారు. వీరు చెప్పిన యోగము ధ్యానమే ప్రధానముగా కలది. కనుక ధ్యేయము (ధ్యానము చేయతగిన)ను నిరూపించాల్సి ఉంది. అంతేకాక ధ్యేయభూతులైన ఆత్మ, ఈశ్వరులు ఇరువురిలో జీవుడు బ్రహ్మాత్మకుడు కాదు. ఇక సర్వేశ్వరుడు ఉపాదానము కాదు. కళ్యాణగుణాలు ఏవీ లేనివాడు. ఇదంతా వేదవిరుద్ధమైన విషయము. ఇక వక్తఐన చతుర్ముఖబ్రహ్మ హిరణ్యగర్భుడు క్షేత్రజ్ఞుడు. జీవకోటిలో చేరినవాడు. కావున రజస్తమో గుణాలచేత ప్రభావితుడయ్యే అవకాశమున్నది. కనుక యోగస్మృతి కూడా ఆయన వ్రాసిన బ్రహ్మపురాణమువలె తమో మూలమైనందున ఈ స్మృతి కూడా ఒకటి యధార్థమై ఉంటే దానికి భిన్నంగా వేరొక వస్తువుగా తలచడమనే భ్రాన్తిని ఆధారంగా మూల కారణంగా చేసుకొని ప్రవచింపబడింది. కాబట్టి ఆ యోగ స్మృతి ఆధారంగా వేదాన్తార్థాన్ని విశదీకరించడము న్యాయముకాదు. **ఇది యోగప్రత్యుక్తి అధికరణము**

★ ★ ★

## ఇక విలక్షణత్వాధికరణము

సూ॥ **నవిలక్షణత్వాదస్య తధాత్వంచశబ్దాత్ 2-1-4** తిరిగి వేదాన్తాలు స్మృతి విరోధులు అని వాదించేవాడు ఎదురుపడుతున్నాడు. సాంఖ్యస్మృతిని నిరాకరించడం ద్వారా జగత్తు బ్రహ్మచేతనే సృష్టించబడింది అని మీరు సిద్ధాన్తమును చేస్తున్నారు కదా! అది పొసగేది కాదు. ఎందువల్లనంటే ఈ ప్రపంచము ప్రత్యక్షాదిప్రమాణాల ద్వారా అచేతనము, శుద్ధముకానిది, ఈశ్వరుడు లేనిది, దుఃఖాత్మకమైనది అని తెలియవస్తున్నది. ఇలాంటి చిదచిదాత్మకమైన జగత్తు మీరు తలకెత్తుకున్న సర్వజ్ఞుడు సర్వేశ్వరుడు హేయప్రత్యనీకుడు ఆనందానికి ఒకే ఒక్క స్థానము ఐన బ్రహ్మపూర్తి భేదమున్న విలక్షణుడు కదా! అట్లాంటివాడినుండి ఇట్లాంటిది ఎట్లా పుడుతుంది? జగత్తు ఈశ్వరుడికంటే విలక్షణమని కేవలము ప్రత్యాక్షాదుల వల్లనే తెలియడంలేదు. వేదశబ్దాన్నించి కూడా విలక్షణత్వము తెలుస్తున్నది. **ఎలాగంటే! విజ్ఞానం చావిజ్ఞానంచ.** విజ్ఞానము అవిజ్ఞానమున్నూ - విజ్ఞానము కలవాడు చేతనుడు, విజ్ఞానము లేనిదిజడము ప్రకృతి అని. **2) ఏవమేవైతాః భూతమాత్రాః ప్రజ్ఞామాత్రాస్వర్పితాః ప్రజ్ఞామాత్రాః ప్రాణేఽర్పితాః.** ఇదే రీతిగా ఈ భూతమాత్రలు - శబ్దస్పర్శ రూపరసగంధాదులు - ప్రజ్ఞామాత్రల యందు ఆధారపడి ఉన్నవి. ఆ

జ్ఞానేంద్రియాలు ప్రాణము నందు ఆధారపడి ఉన్నవి. **3) సమానేవృక్షే పురుషోని మగ్నోఽనీశయాశోచతిముహ్యమానః** భగవన్తుడితోపాటు సమానమైన దేహమనే వృక్షము నందు ఉన్న జీవుడు తన్ను తాను నియన్త్రించుకొనలేక నాధుడనేవాడు లేని ప్రకృతి యందు మోహము కలవాడై దుఃఖించుతున్నాడు. **4) అనీశశ్చాత్మా బధ్యతే భోక్తృభావాత్.** అనీశుడైన జీవాత్మ భోగాలను అనుభవించాలనే ఉద్దేశముతో ప్రకృతికి చిక్కుతున్నాడు. ఇట్లాంటివాక్యాలవల్ల కార్యమైన జగత్తు అచేతనత్వము దుఃఖిత్వము అనే లక్షణాలు కలది అని తెలుస్తున్నది. ఏది దేనికి కారణము అవుతుందో అది దానికంటే (తన కారణాని కంటే విలక్షణము) వేరైనది కాదు. ఎట్లాగంటే మట్టి బంగారు పదార్థాలతో చేయబడిన కుండ, చంద్రహారము/ మెడలో వేసుకొనే గొలుసులవలె. కనుక బ్రహ్మ కంటే విలక్షణమైనందున / సమాన లక్షణాలు లేనిది కాబట్టి ఈ జగత్తు ఆయనను కారణంగా కల్గిన కార్యము కాదు. కాబట్టి సాంఖ్య స్మృతి ప్రకారము కార్యముతో సమానమైన లక్షణాలు ఉన్న ప్రధానమే జగత్కారణమవుతుంది. వేదమనే శాస్త్రము ఇంద్రియాలు చేత తెలియరాని వస్తువును తనకు ఇతర ప్రమాణము అక్కరలేకుండానే నూతన విషయాన్ని తెలియచెప్పేదే ఐనా తప్పనిసరిగా తర్కాన్ని పాటించాల్సి ఉంటుంది. ఎందుకంటే ప్రమాణాలన్నీ కూడా కొన్ని కొన్ని విషయాల్లో, ఒక్కొక్కసారి తర్కాన్ని అనుసరించాల్సి ఉంటుంది. అటువంటప్పుడే అవి ఆయా అర్థాలను నిశ్చయించడానికి ఆధారాలు కాగల్గుతవి. తర్కము అంటే వస్తువు (అర్థము), యొక్క స్వభావాన్ని బట్టి, సామగ్రిని బట్టిగాని నిరూపణ చేస్తూ ఆ అర్థము నందు ప్రమాణాన్ని చూపుతూ దానికి చెందిన ఇతికర్తవ్యతా రూపము ఊహ అనే మరొక పేరున్న జ్ఞానము. ప్రమా అనగా యధార్థజ్ఞానము. దానిని చేకూరుస్తుంది. లేదా కల్గిస్తుంది కనుక ప్రమాణము అని అంటున్నాము ప్రమాంనయతీతి ప్రమాణమ్. ఇతి కర్తవ్యతా ఇట్లాగా చేయాలి అని చెప్పేపద్ధతి. కారణాన్నిబట్టి కార్యాన్ని ఊహించడమే తర్కము లేదా కార్యాన్ని బట్టి ఇది కారణమని ఊహించడము. పంటలు బాగా పండినాయంటే సమృద్ధిగా వర్షాలు కురిసినాయి అని ఊహించడము. వర్షాలు బాగా కురుస్తున్నవి అని అంటే పంటలు బాగా పండుతవి అని భావించడము. ఇదే ఊహ.

అటువంటి తర్కముతో అవసరము ప్రమాణాలన్నిటికీ సమానమే. ఇక శాస్త్రానికైతే అన్నిచోట్లా తప్పనిసరి అంశమే. వాక్యార్థాన్ని నిర్ణయించాలంటే ఆకాంక్షా సన్నిధి యోగ్యతా అనే వానియొక్క జ్ఞానము ఉండాలి. అప్పుడు వాక్యమునకు సరియైన

అర్థాన్ని నిర్ణయించగలము. మనువు కూడా ఇదే విషయాన్ని చెప్పినాడు. **యస్తర్కేణాను సంధత్తే సధర్మో వేదనేతరః** ఎవడైతే తర్కంతో అనుసంధానము చేస్తాడో వాడు మాత్రమే ధర్మాన్ని తెల్సుకుంటాడు. ఇతరుడు తెల్సుకోలేడు అని. శ్రుతి కూడా **మన్తవ్యః** అను పదముతో తర్కముతో కూడిన శాస్త్రార్థాన్ని నిర్ణయించాలనే అంటున్నది.

శ్రుతి సహాయంతో జగత్తు పుట్టుకకు బ్రహ్మ ఒక్కడు మాత్రమే కారణము అని నిశ్చయించితే, అతని కార్యము ఐన జగత్తు లోనూ చైతన్యము సంక్రమించుతున్నది అని ఒప్పుకుంటున్నాము. చేతనుడు గాఢనిద్రలో మునిగి పోయినా, మూర్ఛను పొందినా చైతన్యము కనిపించడము లేదు. అదే తీరుగా అచేతనము జడపదార్థము ఐన కుండ మొదలైనవాటిలో చైతన్యము ఉన్నా, అది పైకి కనుపించడంలేదు. కనుకనే చేతనాచేతన విభాగము చేయబడుతున్నది. అని మీరు అనకూడదు. అది కుదిరేది కాదు. ఒకప్పుడు లేకపోవడము కాకుండా ఎప్పుడు కూడా ఘటాదులలో చైతన్యము కనిపించడము లేదు కాబట్టి దాన్ని మనం అచేతనం జడము అని వ్యవహరించుతున్నాము. కనుకనే వాటిలో చైతన్య శక్తి జతకూడడము, అప్పుడప్పుడూ కలుస్తూ పోతూ ఉండడము లను నిరసించినారు. ఎవనికి ఎక్కడో ఒక్కదగ్గర ఒకానొకప్పుడు కూడా దేనియొక్క కార్యము / క్రియ లభించనేలభించదో అట్లాంటి వానికి ఆయా పనులు చేసే శక్తిని ఎలుగెత్తి చాటేవారు గొడ్రాండ్ల కొడుకుల సభలలో వాళ్ళ తల్లులకు పిల్లలను కనే శక్తి బాగా ఉందని చెప్పండి. ఇంకా వేదాన్తవాక్యాలతో జగత్తుకు బ్రహ్మ ఉపాదానము అని నిశ్చయము చేయబడితే ఘటాదులకు చైతన్య శక్తి, అది పైకి కనపడక పోయినా ఉన్నది నిశ్చయము కల్గుతుంది. అట్లా ఘటాదులలో ఉన్నది అని నిశ్చయము ఐతే వేదాన్తవాక్యాలతో బ్రహ్మ జగత్తుకు ఉపాదాన కారణము అని నిశ్చయము అవుతుంది. అపుడు అన్యోన్యాశ్రయదోషము వస్తుంది. ఎందుకంటే ఒకదానికొకటి పూర్తిగా విలక్షణమైనప్పుడు కార్యకారణభావాన్ని ప్రతిపాదించడానికే వీలుకాదు.

ప్రకృతి వికారాలకు సాలక్షణ్యము – సమానమైన లక్షణాన్ని కల్గి ఉండడము – ఇది అని దేన్ని మీరు ఊహిస్తున్నారు? ఏది లేకపోయినందువల్ల జగత్తుకు బ్రహ్మ ఉపాదాన కారణము అని చెప్పడానికి వీల్లేదని అంటున్నారు? కార్యకారణాలకు అన్ని ధర్మాలూ సమానంగా ఉండాలి అని అనుకునేటట్లయితే కార్యకారణ భావమే చెప్పడానికి కుదరదు. మట్టిముద్దతో చేసిన కుండలు, చిప్పల్లో ముద్దగా ఉండడము అనేది కనుపించడము లేదు. అప్పుడు వాటికి కార్యకారణసమ్బన్ధము లేకుండా

పోతుంది. కనుక పూర్తి లక్షణాలు ఉండాల్సిన అవసరము లేదు. ఏదో ఒక ధర్మము ఉంటే చాలును దానితో సారూప్యము సిద్ధించుతుంది అని భావించితే దానితో జగత్తుకు, బ్రహ్మకున్నూ సత్తా ఆది లక్షణాలు సంభవించుతాయి. అందుకే ఇట్లాగా చెప్పబడుతున్నది. ఏ స్వభావము ఉండడంతో కారణమైన వస్తువు ఇతర వస్తువుకంటే వేరు అయినది / మరొక్కటి అని వేరుచేయబడుతున్నదో అటువంటి స్వభావము దాని కార్యములోనూ సంక్రమించి ఉండడాన్ని కార్యము కారణంతో సాలక్షణాన్ని కల్గి ఉన్నది అని అనవచ్చును. ఏ ఆకారంతోనైతే మట్టి మొదలైన వాటికంటే బంగారము వేరు చేయబడుతున్నదో ఆ ఆకారము సంక్రమించడము అనేది బంగారంతో చేయబడిన కుండలములు మొదలైన వాటిలో కనిపిస్తున్నది. బ్రహ్మ కూడా హేయానికి ప్రతిభటమైన జ్ఞానానందాలు సమస్త జగత్తునూ శాసించి ముందుకు నడిపించగల స్వభావము కలవాడు ఇకపోతే ఆయన కార్యమని మీరు చెపుతున్న ఈ జగత్తు ఆయన కంటే పూర్తి వ్యతిరేకమైన స్వభావము కల్గియున్నది. కనుక జగత్తు బ్రహ్మ ఉపాదాన కారణము కాదు.

ఔనండీ! వైలక్షణ్యము ఉంటున్నప్పటికీ కార్యకారణ భావములోకంలో కనిపిస్తూనే ఉన్నది. ఎట్లాగంటే చేతనుడైన జీవుడినుండి అచేతనాలైన వెంట్రుకలు, నోటిలోని పండ్లు, గోర్లు, తలవెంద్రుకలు పుట్టుతున్నాయి. అదే విధంగా అచేతనమైన ఆవుపేడ నుండి చేతనమైన తేలు పుడుతున్నది. చేతనమైన ఊర్ణనాభి (ఒక జాతి సాలెపురుగు) నుండి అచేతనమైన దారము మొలుస్తున్నది కదా! అని అనకూడదు.

ఎందుకంటే! అక్కడ కూడా అచేతనాంశమే కార్యకారణ భావాన్ని పొందుతున్నది.

అచేతనాలని భావించేవాటికీ చైతన్యముతో కలయిక వేదాలయందు వినిపిస్తున్నది. **తంపృథివీ అబ్రవీత్** అతడిని గురించి పృథివి పలికింది. **ఆపోవా అకామయన్త** నీళ్ళు సంకల్పించినాయి. **తేహేమే ప్రాణాః అహంశ్రేయసే వివదమానాః బ్రహ్మేణం జగ్ముః** ఆ ఇంద్రియాలన్నీ నేను గొప్ప అంటే నేను గొప్ప అని వాదులాడుకొని ఎవరికీ వారి గొప్పతనాన్ని నిర్ధారించుకోడానికి బ్రహ్మవద్దకు వెళ్ళినవి. అని నదులు, సముద్రాలు, పర్వతాలు మొదలైనవాటికిన్నీ చైతన్యము ఉన్నదని పౌరాణికులు అంగీకరిస్తున్నారు. కావున వైలక్షణ్యము లేదు. అని పునః శంక రాగా దానికి ప్రత్యుత్తరాన్ని చెపుతున్నారు.

సూ॥ **అభిమానివ్యపదేశస్తు విశేషానుగతిభ్యామ్ 2–1–5** సూత్రములోని తుశబ్దము లేవనెత్తిన శంకను తొలగించడానికి చేర్చినారు. పృథివీ మొదలైనవాటిని అభిమానించే దేవతలు – **తం పృథివీ అబ్రవీత్** ఇత్యాదిస్థలాల్లో పృథివీ మొదలైన శబ్దాలతో చెప్పబడుతూ ఉన్నారు. ఎందువల్ల నంటే! విశేషానుగతిభ్యాం – విశేషః – విశేషణము దేవతాశబ్దముతో విశేష్యములైన పృథివ్యాదులు చెప్పబడుతున్నాయి. **హన్తాఽహమిమాస్తి స్రోదేవతాః** ఆహా! ఈ ముగ్గురు దేవతలను అని తేజస్సు, నీళ్ళు, నేలలు దేవతాశబ్దముతో విశేషింపబడుతున్నారు. **సర్వాహవైదేవతాః అహంశ్రేయసే వివదమానాః** దేవతలందరూ తమ గొప్పదనము కొరకు తగవుపడుతున్నవారై. **తేదేవాః ప్రాణే నిః శ్రేయసం విదిత్వా.** ఆ దేవతలు (ఇంద్రియాలు) ప్రాణమే మేలైనది అని తెల్సుకొని. అనిన్నీ. అనుగతిః – అనుప్రవేశము. ఒక దాని ద్వారా తాను ప్రవేశించడము/ లోపలకు పోవడము. **అగ్నిః వాక్భూత్వాముఖంప్రావిశత్। ఆదిత్య శ్చక్షుర్భూత్వాఽక్షిణీప్రావిశత్. వాయుః ప్రాణోభూత్వా నాసికేప్రావిశత్.** అగ్నిదేవుడు వాక్కు – మాట – గా అయ్యి ముఖంలోకి/ నోటిలోకి ప్రవేశించినాడు. సూర్యుడు చూపుగా మారి కన్నులలోకి చేరినాడు. గాలి ప్రాణముగా అయ్యి ముక్కులోనికి ప్రవేశించినాడు. ఇత్యాది వాక్యముచేత వాగాదులను అభిమానించడం చేత అగ్న్యాదులకు అనుప్రవేశము వినిపించుతున్నది.

ఇందువల్ల జగత్తు అచేతనమైనందున విలక్షణము కాబట్టి బ్రహ్మకు కార్యము అవడం పొసగదు కనుక తర్కంతో సమర్థింపబడిన కపిల స్మృతి ప్రకారముగానే ప్రధానము ఉపాదానము కావడం తగును అని వేదాన్తాలచేత ప్రతిపాదింపబడుతున్నది అని పూర్వపక్షము ఏర్పడగా సమాధానాన్ని వ్యాసులవారు ప్రసాదిస్తున్నారు.

సూ॥ **దృశ్యతే తు 2–1–06** సూత్రములోని తుశబ్దము చేత పూర్వపక్షాన్ని త్రిప్పికొడుతున్నారు. ఇంతవరకు ఏది చెప్పబడిందో! – జగత్తు బ్రహ్మ కన్న విలక్షణము ఐనది కాబట్టి బ్రహ్మ ఉపాదానము కాదు అని. అది తగినది కాదు. విలక్షణాలే ఐనా వాటికి కార్యకారణభావము కనబడుతున్నది. తేనెటీగలు వంటి విలక్షణాలైన క్రిములు మొదలైనవి అచేతనాన్నుంచి పుడుతున్నవి. అచేతనాంశము నందు మాత్రమే కార్యకారణభావము ఉన్నందున సాలక్షణ్యము ఉన్నదని చెప్పినాము కదా! అని అనేట్లయితే. నిజమే చెప్పినారు కానీ అంతమాత్రము చేతనే మీరనుకున్నట్లు కార్యకారణాలకు సాలక్షణ్యము సిద్ధించదు. ఏదో విధంగా సమాన లక్షణాలు

కలిగిఉండడము అనేది కనిపించితే ప్రతికార్యానికి కారణానికి సాలక్షణ్యము తప్పక దొరుకుతుంది. అందువల్ల అన్ని కారణాలనుండి అన్ని కార్యాలు పుట్టవలసివస్తుంది. ఆ భయంతో మీరు ఒక వస్తువుకు మరొక వస్తువుతో వేర్పాటుకు కారణమైన ఆకారము అను వృత్తి కావాలి సంక్రమించాలి అని సాలక్షణ్యాన్ని అంగీకరించినారు. ఆ నియమము మాక్షికములు – తేనెటీగలు – మొదలైనవాటి నుండి క్రిములు మొదలైనవి పుట్టిన సందర్భములో కనపడడం లేదు. కనుక బ్రహ్మ కంటే విలక్షణమే ఐనప్పటికీ జగత్తు బ్రహ్మనుండి పుట్టింది అని అనడంలో పొసగనిది ఏమీ లేదు. మట్టి, బంగారము, కుండ, కిరీటములు వంటి వాటి వాటిల్లో వలె మరొక వస్తువు నుండి వేరుచేయబడడానికి కారణమైన అసాధారణ ఆకారము అనువృత్తి కావడమనేది, మాక్షికము (తేనెటీగలు) ఆవుపేడ, క్రిమి, వృశ్చికాదులలో కనపడడము లేదు.

సూ॥ **అసత్ ఇతి చేన్న. ప్రతిషేధ మాత్రత్వాత్ 2-1-7** ఒకవేళ కార్యమైన జగత్తు కంటే కారణమైన బ్రహ్మ విలక్షణమైన వాడు ఐనప్పుడు కార్యకారణాలు వేరువేరు ద్రవ్యాలు ఐనందువల్ల కారణమైన పరబ్రహ్మయందు కార్యమైన జగత్తు లేదు కాబట్టి అసత్తు నుండే – శూన్యము నుండి – జగత్తు పుట్టింది అని ఒప్పుకోవలసి వస్తుంది అని అనేట్లయితే. అట్లా అనుకోవడము తప్పు. కార్యకారణాలకు సాలక్షణ్య నియమాన్ని కాదనడము – ప్రతిషేధము చేయడమే – మాత్రమే ముందటి సూత్రములో ఉద్దేశించబడింది. అంతేకాని కారణం కంటే కార్యము మరొక ద్రవ్యము అని అనలేదు. కారణమైన బ్రహ్మనే తనకంటే విలక్షణమైన జగత్తు ఆకారంతో పరిణమించుచున్నాడు అనే విషయాన్ని మాత్రము విడిచివేయలేదు. క్రిమి, తేనెటీగలకు కూడా పరస్పరము వైలక్షణ్యము ఉన్నా కుండలములు – బంగారములకు వలె ద్రవ్యైక్యము – ఒకే ద్రవ్యానికి చెంది ఉండుట – ఉండనే ఉన్నది. ఇక్కడ కొత్తగా మరొక సందేహాన్ని లేవనెత్తుతున్నాడు–

సూ॥ **అపీతౌ తద్వత్ప్రసంగాత్ అసమంజసమ్ 2-1-8** సూత్రములో అపీతౌ అని చెప్పడము ముందుగా ప్రళయము జరిగి తరువాత సృష్ట్యాదులు జరిగినాయని ప్రదర్శించడానికి. **సదేవసౌమ్యేద మగ్రఆసీత్. 2) ఆత్మావా ఇదమేక ఏవాగ్ర ఆసీత్** ఇత్యాది వాక్యాలయందు సృష్టి మొదలైనవన్నీ అప్యయము – ప్రలయము – అనే అవస్థను తెలిపిన తరువాతనే చెప్పబడుతున్నాయి. ఒకవేళ కార్యకారణాలకు రెండింటికీ ద్రవ్యైక్యాన్ని అంగీకరించితే అప్పుడు కార్యమైన జగత్తు బ్రహ్మ యందు ప్రళయవేళ

సృష్టివేళ మొదలైనవాటియందు ఉంటున్నట్లయితే బ్రహ్మకే ఆయా అవస్థలయందు జగత్తుతో పొత్తు ఉంటున్నది కనుక కార్యమైన జగత్తులో ఉండే అపురుషార్థాలు అన్నీ కారణమైన బ్రహ్మకు కలుగుతాయి. ఎట్లంటే కుండలములో ఉండే దోషాలు బంగారానికి అంటినట్లే. దానితో వేదాన్త వాక్యాలన్నీ అసమంజములు అవుతాయి. **యః సర్వజ్ఞః సర్వవిత్. 2) అపహతపాప్మావిజరోవిమృత్యుః 3) నతస్య కార్యంకరణంచవిద్యతే న తత్సమశ్చాభ్యధికశ్చదృశ్యతే.** ఆయనకు చేయవలసిన పనిలేదు అందుకు తగిన పనిముట్టూ లేదు. ఆయనతో సమానుడు ఆయనకంటే ఎక్కువైనవాడు గానీ కనపడడం లేదు. **4) తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి 5) అనీశశ్చాత్మా బధ్యతే భోక్తృభావాత్ 6) అనీశయా శోచతి ముహ్యమానః** అనే వాక్యాల ప్రకారము తెలియవస్తున్న భిన్నభిన్న ధర్మాలు ఒకే వస్తువునందు ఉండవలసి వస్తుంది.

ఇట్లా మీరు అనవచ్చును – చిదచిద్వస్తువులను శరీరంగా కల్గిన బ్రహ్మకే కార్యకారణభావమున్నది. దోషాలేమో శరీరమైన చిదచిద్వస్తువులలో ఉన్నవి. కనుక కారణావస్థలో కానీ కార్యావస్థలో ఉన్నప్పుడు కానీ బ్రహ్మకు దోషాలు అంటవు. అని. ఐతే ఆ మాట తగినది కాదు. జగత్తుకు బ్రహ్మకున్నూ శరీరి, శరీరభావమే సంభవించదు కాబట్టి. ఒకవేళ శరీరి శరీరభావము సంభవించేటట్లయితే శరీరముతో సమ్బన్ధమున్నందువల్ల కలిగే దోషాల నుండి తప్పించుకోజాలడు. వాస్తవానికి చిదచిద్వస్తువులు బ్రహ్మకు శరీరముకాజాలవు.

శరీరమంటే తాను చేసిన కర్మలకు ఫలములు ఐన సుఖదుఃఖాలను అనుభవించడానికి సాధనాలైన ఇంద్రియాలకు ఆశ్రయమైనది. ఐదు రకాలైన ప్రాణాలపై ఆధారపడినిల్చి ఉండే నేల మొదలైన పంచభూతాలయొక్క సముదాయ విశేషము. అటువంటి దానికే లోకంలో వేదంలోనూ శరీరమని ప్రసిద్ధి ఉన్నది. పరమాత్మ **అపహతపాప్మావిజరః 2) అనశ్నన్యోఽభిచాకశీతి. 3) అపాణిపాదో జవనోగ్రహీతా పశ్యత్యచక్షుః సశృణోత్యకర్ణః.** భగవన్తుడికి కాళ్ళూ చేతులూ లేవు. ఐనా వేగంగా ఎక్కడికైనా చేరగలడు. దేన్నైనా పట్టుకోగలడు. కండ్లు లేకున్నా చూడగలడు. ఆయనకు చెవులు లేకున్నా వినగలడు. **అప్రాణోహ్యమనాః** ప్రాణములేనివాడు. మనస్సూ లేనివాడు. ఇత్యాది వాక్యాలద్వారా కర్మలేనందున దాని ఫలభోగము – అనుభవించడమున్నూ – లేనందువల్ల పైగా ఇంద్రియాలను ఉపయోగించుకోవడం ద్వారానే భోగాలను అనుభవించవలసిన అవసరము లేదు కాబట్టి, ప్రాణాన్ని

కలిగి ఉండడమనేది లేదు కనుకనూ చేతనాచేతనాలు ఆయనకు శరీరాలు కావు. అచేతనములో భాగాలై విడివిడిగా ఉండే గడ్డి, కట్టెపుల్లలు, సమిష్టిగా ఉండే భూతసూక్ష్మానికీ ఇంద్రియాలకు ఆశ్రయమై ఉండడము కుదరదు. భూతసూక్ష్మానికి పృథివ్యాదులతో సంఘాతము (ఒక్కదగ్గర చేరి ఉండడమనేది) – లేదు. జ్ఞానము మాత్రమే తన ఆకారంగా కల్గి ఉన్న చేతనుడికి ఇదంతా – (తాను మరొకడికి శరీరమై ఉండడం) – బొత్తిగా కుదరదు గాక కుదరదు.

పోనీ భోగాయతనత్వము – (భోగాలకు ఇల్లు – స్థానము) శరీరము అనిన్నీ అనకూడదు. భోగాలకు నెలవులు ఐన నివాసగృహాలకు శరీరము అని పేరు ప్రసిద్ధి లేవు. ఇంట్లో ఉన్నపుడే కదా! సుఖదుఃఖానుభవము ఎవ్వరికైనా కలుగుతుంది. కనుక అదే భోగాయతనము అని అంటే కాదు సుమా! పరకాయప్రవేశము, (ఇతరులయొక్క దేహాల్లోకి ప్రవేశించడము) పుట్టుక, సుఖదుఃఖాలను అనుభవించడానికి నెలవైన శరీరంలో ప్రవేశించినపుడు కొత్తగా చేరినవానికి అది శరీరమని ప్రసిద్ధి లేదు. వాస్తవానికి అది మరొకనియొక్క శరీరము అని ప్రసిద్ధి ఉన్నది. ఇక ఈశ్వరుడు స్వతస్సిద్ధమైన నిత్యమైన నిరతిశయమైన ఆనందము కలవాడు కాబట్టి అతనికి భోగం కొరకు చిదచిత్తులు ఆయతనము ఐ ఉండడము అనే నియమము కుదురదు. ఇందువల్ల భోగసాధనమై ఉండడము అనే శరీరనియము కొట్టివేయబడింది.

లేదా! ఎవని కోరికకు తగినట్లు స్వరూపము, స్థితి – నిలుకడ ప్రవృత్తులు – పనులకు పూనుకోవడములు – కల్గినది ఏదో అది వానికి శరీరము అని చెప్పేటట్లయితే ఈ సమస్త జగత్తూ ఈశ్వరుని యొక్క ఇచ్ఛకు లొంగిస్వరూప, స్థితి, ప్రవృత్తులను కలిగి ఉంటున్నది కాబట్టి ఈశ్వరునికి శరీరము ఔతుంది అని భావిస్తే అది కూడా సరియైనదికాదు. శరీరాలుగా ప్రసిద్ధాలైన ఆయా చేతనులకు ఉన్న శరీరాలు వారి వారి ఇష్టాలకు అనుగుణమైన స్వరూపాలు కావు. రోగము వచ్చిన వాని శరీరము వాని ఇష్టానుగుణంగా ప్రవర్తించదు. మృతుడైన వానియొక్క శరీరము వానికి లొంగి ఉండదు. ఇక సాలభంజి కలు(బొమ్మలు) మొదలైనవి చేతనుని యొక్క ఇచ్ఛకు లొంగి తమ స్వరూపస్థితి ప్రవృత్తులను కలిగిఉన్నా అవి ఆయా చేతనుల యొక్క శరీరాలు అని ప్రసిద్ధి లేదు. నిత్యుడైన చేతనుడు ఈశ్వరుని యొక్క ఇచ్ఛకు లొంగి ఉండే స్వరూపము కలవాడు కాడు కనుక ఈశ్వరునికి శరీరము కాడు. ఐతే ఏది ఏ ఒక్కని చేత మాత్రమే నియమింపబడేదో, ఏ ఒక్కనిచేత మాత్రమే ధరింపబడుతున్నదో,

ఏ ఒక్కనికి మాత్రమే శేషమై ఉంటున్నదో అది వానికి శరీరము అని చెప్పకూడదు. **"శేషము – సేవ చేసేది"**. క్రియాదులయందు అతి వ్యాప్తి / వ్యభిచారము వస్తుంది. ఒక వస్తువును తెల్సుకోవడానికి ఒక గుర్తు / లక్షణాన్ని చెప్పినట్లయితే అది ఆ వస్తువులో / లక్ష్యములోనే కాకుండా మరొక దానిలోకూడా ఉండేటట్లయితే దాన్ని అతి వ్యాప్తి / వ్యభిచారము అని చెప్తారు. **అశరీరం శరీరేషు 2) అపాణిపాదోజవనోగ్రహీతా** మొదలైన వాక్యాలద్వారా ఈశ్వరునికి శరీరము లేదని ప్రతిపాదింపబడుతున్నది. కనుక జగత్తు బ్రహ్మలకు ఇద్దరికీ శరీర శరీరిభావము కుదురదు. ఒకవేళ కుదిరితే దోషములు బ్రహ్మకు ఏర్పడుతవి. కనుక బ్రహ్మజగత్తుకు కారణము అని చెప్పడములో వేదాన్త వాక్యాలు సమంజసములు కావు అని. దీనికి సమాధానము ఇట్లున్నది.

సూ॥ **న తుదృష్టాన్తభావాత్ 2-1-9** నీవు చెప్పినట్లు అసమంజసత ఏమీ లేదు. ఒక్కదానికే రెండు అవస్థలతో సమ్బన్ధము – అన్వయము – పొత్తు ఉన్నప్పటికీ దేనికి గుణాలు ఉన్నవో, దేనికి దోషాలు ఉంటున్నవో వాటికి ఒక కట్టడి / నియమము ఉంటున్నదని దృష్టాన్తము సిద్ధంగా కనిపిస్తున్నది. సూత్రంలోని తుశబ్దము హేయసమ్బన్ధగన్ధము కూడా ఊహించడానికి అవకాశము లేదనడాన్ని సూచిస్తున్నది. ఇదీ ఇక్కడ చెప్పబడుతున్నవిషయము – చిదచిద్వస్తువులను తనకు శరీరంగా కల్గియున్న పరమాత్మ దానికి ఆత్మ ఐ ఉండడాన్ని బట్టి సంకోచము – ముడుచుకొని పోవుట / కుదించుకొనుట, వికాసము – విచ్చుకోవడములను స్వభావాలుగా కలిగిన కార్యముకారణము అనే అవస్థలు రెండింటితో అన్వయము ఉన్నప్పటికీ వైరుధ్యమును కలవాడు కాడు. ఎందువల్లనంటే సంకోచవికాసాలు ఆయనకు శరీరములో భాగాలుఐన చిదచిద్ వస్తువులకు చెందినట్టివి. శరీరంలో ఉండే దోషాలు ఆత్మకు అంటవు. ఇక ఆత్మలో ఉండే గుణాలు శరీరానికి చెందవు. ఎట్లాగంటే దేవతలు మనుష్యులు మొదలైన పేర్లు గల శరీరాలు గల క్షేత్రజ్ఞులకు శరీరంలో ఉండే / వచ్చే బాలుడు, యువకుడు ముసలివాడు / బాల్య యవ్వన వార్ధక్యాలు అనేవి ఆత్మతో సమ్బన్ధాన్ని లేకుండానే ఉంటున్నవి. ఆత్మకు చెందిన జ్ఞానము సుఖము వంటివి శరీరానికి కలుగవు. ఇంకా **దేవోజాతః మనుష్యోజాతః.** దేవుడుగా ఐనాడు మనుష్యుడు ఐనాడు. అట్లే **సఏవ బాలోయువా స్థవిరశ్చ** వాడే పిల్లగాడు యువకుడు ముసలివాడు అని పిలువడమున్నూ ముఖ్యమే. భూతములు – నింగి, నేల, నీరు, నిప్పు, గాలి అనే పంచభూతాలయొక్క సూక్ష్మరూపాలను శరీరంగా కల్గిన క్షేత్రజ్ఞుడికే

దేవమనుష్యాది భావము ఏర్పడుతున్నది అని **తదన్తర ప్రతిపత్తౌ రంహతిసమ్పరిష్వక్తః** అనే సూత్రమువద్ద చెప్పనున్నారు.

చిదచిదాత్మకమైన జగత్తు అది స్థూలము కావచ్చును, సూక్ష్మమైన కావచ్చును ఏదైనా పరమాత్మకు శరీరము కావడమనేది పొసగదు అని మీరే మాటనైతే అన్నారో అది ప్రమాణానుగుణమైన న్యాయాలతోడ్పాటు కలిగిన వేదాన్తవాక్యాల గుంపులను తెల్సుకోకపోవడము వల్లనూ పైగా తమ బుద్ధికి తోచినట్లు ప్రమాణవిరుద్ధంగా తర్కము చేయడం వల్ల రెచ్చిపోయి చెప్పినటువంటిది. సాధారణంగా వేదాన్తవాక్యాలన్నీ కూడా స్థూలములు సూక్ష్మములు ఐన చేతనాచేతనాలు మొత్తమూ పరమాత్మకు శరీరాలు అని ఘోషించుతున్నవి. ముందుగా వాజసనేయ శాఖలో కాణ్వుల, మాధ్యందిన పాఠాల్లోని అన్తర్యామి బ్రాహ్మణ మనేదాంట్లో **యఃపృథివ్యాంతిష్ఠన్ యస్యపృథివీ శరీరమ్** అని ఆరంభించి పృథివీ మొదలైన అచిత్ పదార్థమంతా **యోవిజ్ఞానేతిష్ఠన్... యస్యవిజ్ఞానం శరీరమ్ 2) యఆత్మనితిష్ఠన్... యస్యాత్మాశరీరమ్** అని చేతనాన్ని విడివడిగా నిర్దేశించి దాని దానికి పరమాత్మ శరీరమై ఉండడాన్ని చెప్పబడుతున్నది. సుబాలోపనిషత్తులో కూడా **యఃపృథివీమన్తరే సంచరన్యస్యపృథివీ శరీరం** అని మొదలుపెట్టి పై అన్తర్యామి బ్రాహ్మణము వలెనే అన్ని అవస్థల్లో ఉన్న చిదచిత్తులు పరమాత్మకు శరీరాలు అని తెలిపి **ఏషసర్వభూతాన్తరాత్మా అపహతపాప్మాదివ్యోదేవఏకోనారాయణః** అని చెప్పిన వాక్యంతో ఆ నారాయణుడు సర్వభూతాలకు ఆత్మ అని చెప్పబడుతున్నాడు. స్మృతుల్లో కూడా **జగత్ సర్వం శరీరంతే** ప్రపంచమంతా నీకు శరీరము **యదమ్బువైష్ణవఃకాయః** ఏ నీరున్నదో అది విష్ణువు యొక్క దేహము **తత్సర్వంవైహరేస్తనుః.** అదంతా శ్రీహరి యొక్క ఒడలే. **తాని సర్వాణితద్వపుః** అవన్నీ ఆయనకు మేనులే. **సోఽభిధ్యాయ శరీరాత్ స్వాత్** అతడు సంకల్పించి తన శరీరాన్నుంచి అనియే చెప్పినారు అనగా భూత సూక్ష్మమైన తన శరీరాన్నుండి అని అర్థము.

లోకంలోనూ శరీరశబ్దము ఘటాది శబ్దాల వలె ఒకే ఆకారంతో ఉన్న ద్రవ్యముతో ఎప్పుడూ విడదీయరాని విధంగా కలిసి ఉండక క్రిములు, పురుగులు, పక్షులు, పాములు, మనుష్యులు, పశువులు మొదలై ఒకదాని కొకటి మిక్కిలి భేదము / తేడా ఉన్న ఆకారాలు గల ద్రవ్యాలయందు ముఖ్యార్థాన్ని చెప్పేదిగాఐ ప్రయోగింపబడుతూ కనుపించుతున్నది. అందుచేత ఆ శబ్దానికి అట్లా ప్రయోగించడానికి / అర్థాన్ని చెప్పడానికి కారణమైన వ్యవస్థను అందరి ప్రయోగాలను అనుసరించే ఏర్పర్చాలి.

నీవు చెప్పిన **"కర్మఫలభోగహేతుః"** మొదలైన ప్రవృత్తి నిమిత్త లక్షణము (అట్లా అర్థం చెప్పడానికి / శబ్దాన్ని ప్రయోగించడానికి గల కారణము) అందరి ప్రయోగాలకు / అన్ని ప్రయోగాలకు అనుగుణంగా లేదు. నీవు ఈశ్వరునికి శరీరాలుగా చెప్పినవాటిలో పృథివీ మొదలైనవాటిలో అవ్యాప్తి దోషము వస్తుంది. అవ్యాప్తి అనగా ఒక వస్తువును గుర్తించడానికి చెప్పిన గుర్తు ఆ వస్తువులో కనిపించకపోవడము. అంటే పృథివీ మొదలైనవి ఈశ్వరుడికి శరీరాలు కాకుండాపోతున్నవి. ఇంకా ఈశ్వరుడు తన సంకల్పము / ఇచ్ఛ ప్రకారము స్వీకరించిన శరీరాల యందు; ముక్తులకున్నూ **సఏకథా భవతి** అతడు తన శరీరాన్ని గాక మరొక శరీరము కలవాడు అగుచున్నాడు. అనగా రెండు శరీరాలు గలవాడవుతున్నాడు. ఇత్యాది వాక్యాలచేత తెలియవస్తున్న శరీరాలయందు నీవు చెప్పిన ఆ లక్షణము అవ్యాప్తము అవుతున్నది. ఎందుకంటే ఈశ్వరుడు ముక్తులయొక్క శరీరాలు వారి కర్మఫలభోగాలననుభవించడానికి వచ్చినవికావు. పరమపురుషుడు తన ఇష్టము ప్రకారము పొందిన విగ్రహాలు పృథివీ మొదలైన భూతాల సముదాయముతో ఏర్పడినవి కావు. తద్విశేషాలూ కావు. **నభూతసంఘసంస్థానో దేహోఽస్యపరమాత్మనః.** ఈ పరమాత్మ యొక్క దేహము భూతాలయొక్క సంఘాతము – కలయిక వల్ల ఏర్పడిందికాదు. అని స్మృతి చెప్పుతున్నది. కనుక భూతసంఘాతరూపము శరీరము అనడము అవ్యాప్తి దోషము పట్టి ఉన్నది. ఇక పంచవృత్తి ప్రాణాధీన ధారణత్వమున్నూ స్థావరాలైన చెట్లు చేమలు కొండలు గుట్టలు రాళ్ళూ రప్పలయందు కూడా అవ్యాప్తమైనదే. స్థావరాలలో ప్రాణమున్నప్పటికీ అది ఐదు పేర్లతో ఐదు స్థానాలలో ఉండి శరీరానికి ధారకమై / నిలిపేది అయ్యి ఉండడము లేదు. అహల్య మొదలైనవారు తాము చేసుకున్న కర్మల కారణంగా రాళ్ళు కట్టెలు మొద్దులుగా మారినా ఆయా శరీరాల్లో ఇంద్రియాలకు ఆశ్రయముగావడము సుఖదుఃఖాలను అనుభవించడానకి కారణాలు కావడమున్నూ అవ్యాప్తాలే.

ఇందువల్ల **ఏ చేతనుడికి ఏద్రవ్యము అన్నివిధాలుగా తన కొరకు మాత్రమే ధరించడానికి నియన్త్రించడానికి వీలవుతుందో తనకు మాత్రమే విధేయమై ఉంటుందో అది అచేతనుడికి శరీరము అని** లక్షణాన్ని అంగీకరించితీరాలి. ఐతే రోగిష్ఠుల యొక్క శరీరాలు చేతనుని యొక్క అభీష్టము మేరకు ఆయా అవయవాలు కదలికలు, చేష్టలు వంటివి లేకుండా ఉండడమనేది అట్లాంటి శక్తి ఉన్నా దాన్ని అడ్డుకొనే రోగాదుల వలన అట్లాగా జరుగుతున్నది. అగ్ని మొదలైన వాటిలో ఉన్న ఉష్ణశక్తిని అడ్డుకొనే

మణులు మొదలైన నిరోధక శక్తులు అడ్డుకొంటున్నందువల్ల వాటిలో ఆ వేడిమి వంటి శక్తులు కనిపించడము లేదు. ఐతే వాటిలో బొత్తిగా లేకుండా పోవడంలేదు. మరణించిన వాని శరీరము చేతనుడు విడిచి వెళ్ళిపోయే వేళలోనే ఆ శరీర శిథిలము కావడం మొదలౌతుంది. ఐతే ఆ జీవుడికి అది ఇంతకుముందు కాలంలో శరీరంగా ఏర్పడిన పంచభూతాల సముదాయంలో ఒక భాగమై ఉన్నది కాబట్టి శరీరము అని వ్యవహరించుతున్నారు. కనుక ఈ సర్వమూ సర్వాత్మయైన పరమపురుషుడి చేత తన కొరకు మాత్రమే, తన విషయంలోనే నియమింపబడేది ధరింపబడేది ఆయనకు మాత్రమే శేషమై ఉండడమే ఒకేఒక్క స్వరూపముగా గలది. కనుక చేతనాచేతనమంతా ఆయనకు శరీరము అవుతున్నది. **అశరీరం శరీరేషు** శరీరాలైనవాటిలో శరీరము లేనివాడు ఇత్యాది వాక్యాలు పరమాత్మకు జీవుని వలె కర్మకారణంగా వచ్చిన శరీరము లేనివాడు అని దాన్ని నిషేధించడం జరుగుతున్నది. ఇంతకుముందు చెప్పిన ప్రకారము సర్వమూ శరీరము అని వినిపిస్తున్నది కాబట్టి. ఇక ముందు రాబోయే అధికరణాలలోనూ ఈ విషయమే ఉపపాదింపబడుతుంది. **అపీతౌ తద్వత్ప్రసంగాద సమంజసమ్. 2) న తుదృష్టాన్తభావాత్** అనే రెండు సూత్రాలతో **ఇతర వ్యపదేశాత్** అనే అధికరణము చేత తేల్చబడిన విషయము తలపింపబడింది.

సూ॥ **స్వపక్షదోషాచ్చ 2-1-10** బ్రహ్మ జగత్తుకు కారణమనే ఈ వాక్యాన్ని తప్పులు లేనిదికాబట్టి మాత్రమే ఆశ్రయించాల్సిన అవసరము లేదు. ప్రధానమే కారణము అనే వారి వాదంలో తప్పులు చాలా ఉన్నాయి కాబట్టి దాన్ని వదిలిపెట్టి దీన్నే ఆశ్రయించాలి. ప్రధానమే జగత్తుకు కారణము అనే వాదంలో జగత్తు సృష్టి చేయడానికి పూనుకోవడం చెల్లదు. అందులో నిర్వికారుడు కేవలం జ్ఞానము మాత్రమే స్వరూపంగా గల పురుషుడు ప్రకృతికి దగ్గరలో ఉండడము వల్ల ప్రకృతియొక్క ధర్మాన్ని తనపై తెచ్చిపెట్టుకోవడము వల్ల జగత్ ప్రవృత్తి జరుగుతున్నది. నిర్వికారుడు చిన్మాత్రరూపుడూ ఐన వాడికి ప్రకృతి యొక్క ధర్మాన్ని తనపై ఆరోపించుకోవడానికి కారణమైన ప్రకృతి సామీప్యము ఎటువంటిది అని విచారించాలి 1) ప్రకృతి ఉండడమే కారణమా? 2) లేక దానిలో ఉండే ఒకానొక వికారమా? 3) కాక పురుషుడిలోనే ఉండిన ఒక వికారమా? అని ప్రశ్నించుకున్నప్పుడు పురుషుడిలో ఉన్నవికారమైతే కారణము కాదు. పురుషుడికి వికారాలు కలుగవు అని వాళ్ళే ఒప్పుకున్నారు. పోనీ ప్రకృతిలోని వికారమా? అని. అంటే అధ్యాసానికి కార్యమవుతున్నదే కానీ అధ్యాసానికి కారణము కాదు. అనగా

జీవుడికి తనలో వివిధ భేదాలను చూపుతున్నది. పొందుతున్నది కానిప్రకృతి కారణము కాదు. ప్రకృతి కేవలము పురుషుడి సన్నిధానములో ఉండడమే కారణమయ్యేటట్లుంటే ముక్తుడికి కూడా అధ్యాసము కలుగవలసి ఉంటుంది. కనుక నీ పక్షంలో జగత్ ప్రవృత్తి ప్రధానానికి పొసగదు. ఈ విషయము సాంఖ్యపక్షాన్ని తిప్పికొట్టే సమయంలో **అభ్యుపగమేప్యర్థాభావాత్** మొదలైన సూత్రాలను వ్యాఖ్యానించినప్పుడు విస్తారంగా వర్ణింపబడగలదు.

సూ॥ **తర్కాప్రతిష్ఠానాదపి 2-1-11** సాంఖ్యులు చెప్పే తర్కము వాదానికి పూనుకున్నప్పుడు నిలిచేది కాదు కనుక శ్రుతి ప్రమాణముగా చెప్పబడే బ్రహ్మకారణవాదాన్నే ఆశ్రయించాలి. ప్రధాన కారణవాదాన్ని కాదు. బౌద్ధులు వైశేషికులునైయాయికులు జైనులు సాంఖ్యులు, పతంజలి, మొదలగువారు చెప్పిన తర్కాలను వారిలో వారే పరస్పరము ఒకరి వాదాన్ని మరొకరు ఖండించుకున్నారు వాటిని గమనిస్తే తర్కము – దానికి ప్రమాణము లేనిది కనుక నిలువజాలదు అని తెలియవస్తున్నది.

సూ॥ **అన్యథాऽనుమేయమితి చేత్ ఏవమప్యనిర్మోక్షప్రసంగః 2-1-12** ఇప్పుడు ఉన్న శాక్యాదుల – బౌద్ధులు తదితరుల యొక్క తర్కాలను దోషాలు గలవిగా వెల్లడించివాటిని పక్కకు పెట్టి మరొకవిధంగా ప్రధాన కారణవాదాన్ని దోషాలు లేనిదిగా చేసి అనుమాన ప్రమాణాలతో నిరూపించుతాము అని అంటే అట్లయినా మానవుని తెలివితేటలతో స్థాపించబడే తర్కమును మాత్రమే ఆధారంగా చేసుకొని నిలుస్తున్నది కాబట్టి ఇపుడు మీరు పూర్వము ఉన్నదాన్ని కాదని కొత్త తర్కాలను ఆధారంగా చేసుకొని ప్రతిష్ఠించిన ప్రధాన కారణవాదాన్ని మరొకదేశంలో మరొకకాలంలో మిమ్మల్ని మించిన కుతర్కాలలో నేర్పరులైన వ్యక్తుల చేత ఊహింపబడిన తర్కాలవల్ల మీవాదంలోని దోషాలు కూడా బట్టబయలు చేయబడవచ్చు. దానితో మీ వాదము నిలదొక్కుకో లేక ప్రతిపక్షవాద ఝుంఝూమారుతానికి దూది పింజల వలె తేలిపోవచ్చు. అందువల్ల తర్కము నిలువలేదు అనే దోషాన్ని ముక్తి దొరుకకపోవడము ఆపలేనిది అవుతుంది. కనుక ఇంద్రియాలకుమించిన, అందరాని వస్తువు / విషయములో శాస్త్రమే సరిఐన ప్రమాణము. దాన్ని వివరించడానికిగాను తర్కాన్ని ఆశ్రయించాలి. దాన్నే ఇట్లాగా విస్పష్టము చేసినారు. **శ్లో॥ ఆర్షంధర్మో పదేశంచవేదశాస్త్రావిరోధినా। యస్తర్కేణానుసంధత్తే సధర్మం వేదనేతరః** ఋషిప్రోక్తమైనదానిని వేదము చెప్పిన

ధర్మోపదేశాన్ని ఎవడైతే వేదశాస్త్రానికి ఎదురుకాకుండా / అనుకూలంగా తర్కముతో జతపరుస్తాడో వాడు మాత్రమే ధర్మాన్ని చేయవలసిన కర్మను తెల్సుకోగల్గుతున్నాడు. ఇందుకు భిన్నమైన పోకడ కలవాడు కాడు. అని వేదము అనే పేరున్న శాస్త్రానికి వ్యతిరేకము / వైరుధ్యము లేకుండా అని అర్థము. కనుక ప్రధాన కారణవాదము వేదానికి విరోధి ఐనందువల్ల, వేదార్థాన్ని విశదీకరించడమనే రూపంలో ఉన్న వేదోపబృంహణతర్కాన్ని స్వీకరించడానికి సాంఖ్యస్మృతి చేరతీయదగినది కాదు. ఆదరించదగదు. **ఇది విలక్షణత్వాధికరణము**

★ ★ ★

## ఇక శిష్టాపరిగ్రహాధికరణము

సూ॥ **ఏతేనశిష్టాపరిగ్రహాఃవ్యాఖ్యాతాః 2-1-13** శిష్టాః - మిగిలినవి. వేటికి వేదము యొక్క పరిగ్రహము - అంగీకారము ఒప్పుదల ఉండదో అవి శిష్ట అపరిగ్రహములు. శిష్టములున్నూ అపరిగ్రహములు ఏవో అవి శిష్టాపరిగ్రహములు. ఏతేన వేదము చేత అపరిగృహీతమైన సాంఖ్యులయొక్క పక్షాన్ని దోషభూయిష్ఠమని చెప్పి అణచివేసినందున వేదాంగీకారము లేని న్యాయవైశేషిక జైనబౌద్ధపక్షాలు అణగదొక్క బడినాయని తెల్సుకోవాలి.

పరబ్రహ్మ కాడు, ప్రధానము కాదు జగత్తుకు కారణము పరమాణువులే అనే విషయంలో పైన చెప్పిన వారందరూ సైదోడులే. కనుక కారణ వస్తువుకు సమ్బన్ధించిన తర్కానికి అప్రతిష్ఠితత్వము / నిలుకడలేకపోవడంను చెప్పడము కుదురదు అని అధిక ఆశంక. అంతమాత్రముతో పొత్తు ఉన్నా అన్నీ తర్కము పైననే ఆధారపడి ఉన్నట్టివే కనుక పరమాణువులయొక్క స్వరూపము ఏమిటి? అని అన్నప్పుడు శూన్యాత్మకములు – అనగా స్వరూపము లేనివి అని, కావని, జ్ఞానాత్మకములు – జ్ఞానమే స్వరూపముగా కలవి అని, అర్థాత్మకాలు – వస్తువులరూపంలో ఉన్నవి అని, అవిక్షణికములు, క్షణములో నశించిపోతవి అని అంటే, అవి నిత్యములు అని ఏకాన్తములు కాదు అనేకాన్తములు అని, సత్యములు అని అంటే కాదు అసత్యములు అని పలురకాల తగవులాటలు కనిపిస్తున్నవి. కనుక తర్కాప్రతిష్ఠితత్వమే అని పరిహారము చెప్పబడింది.

ఇక్కడ బౌద్ధులలోని ఒక వర్గము వారైన మాధ్యమికులు శూన్యవాదులు ఏమీ లేదని అంటారు. యోగాచారులనబడేవారు జ్ఞానాత్మకము / జ్ఞానము ఉంటుంది అని

అంగీకరించుతారు. క్షణికత్వము మాత్రము మూడు రకాల బౌద్ధులచేత అంగీకరింప బడింది. ఏకాన్తత్వము అనేది జైనులు తప్ప అందరిచేత ఒప్పుకోబడింది. సత్యత్వము వైశేషికాదులకు ఇష్టమైనది. అసత్యత్వాన్ని యోగాచారులు ఆమోదించినారు. వీరందరూ పరమాణువులే మూలకారణమని వాదిస్తారు. **ఇది శిష్టాపరిగ్రహాధికరణము**

★ ★ ★

## ఇక భోక్త్రాపత్త్యధికరణము

సూ॥ **భోక్త్రాపత్తేరవిభాగశ్చేత్ - స్యాత్లోకవత్ 2-1-14** తిరిగి సాంఖ్యుడు ఎదిరిస్తున్నాడు. ఏదైతే చెప్పబడిందో – స్థూలము, సూక్ష్మమూ ఐన, చిదచిద్వస్తువులను శరీరంగా కలిగిన పరబ్రహ్మ కార్యకారణరూపుడైనందున జీవబ్రహ్మలకు స్వభావ విభాగము తగును – అని, ఆ విభాగము కుదురదు. బ్రహ్మ శరీరము కలవాడైనప్పుడు అతనికి భోక్తృత్వము వస్తుంది. భోక్తృత్వము – సుఖదుఃఖాలను అనుభవించడము. సశరీరుడు ఐనందువల్ల జీవుడికి, ఈశ్వరుడికిన్నీ శరీరముతో కూడి ఉన్నందువల్ల దాని ద్వారా వచ్చే సుఖదుఃఖాలను అనుభవించక తప్పదు.

ఔనండీ! **సంభోగప్రాప్తిరితిచేన్న వైశేష్యాత్** అనే సూత్రము దగ్గర ఈశ్వరుడికి భోగాలతో సమ్బన్ధమే లేదని పరిహారాన్ని చెప్పినారు కదా! అని అనకూడదు. అక్కడ జీవుడి చేత ఉపాసింపబడేందు కొరకు హృదయమనే ఇంటిలో అతడికి సన్నిహితుడుగా ఉన్నాడు. శరీరము లోపల ఉన్నంత మాత్రాన భోగములు అనుభవించే ప్రసక్తే లేదు అని చెప్పబడింది. ఇక్కడనేమో జీవుడివలెనే బ్రహ్మకు కూడా శరీరము ఉన్నది కాబట్టి ఆ జీవుడి వలెనే సుఖదుఃఖాలను అనుభవించాల్సిన విధి తప్పదు అని చెప్పబడుతున్నది. లోకంలో చూస్తున్నాముకదా! శరీరాన్ని కలిగి ఉన్న జీవులు శరీరంలో వచ్చే బాల్యము వృద్ధాప్యము వంటి వికారాలను పొందకపోయినా శరీరంలోని ధాతువులు – రక్తమాంసాదులు – ఎక్కువ తక్కువలు పొందినపుడు వాటి కారణంగా సుఖదుఃఖాలను అనుభవించుతూనే ఉన్నారు కదా! వేదము కూడా **నహవై సశరీరస్య సతఃప్రియాప్రియమోః అపహతిరస్తి. అశరీరంవావ సన్తం నప్రియాప్రియే స్పృశతః.** శరీరంతో కూడి ఉన్నవానికి ప్రియాప్రియములు నశించిపోవు. శరీరము లేనివానికి ప్రియా ప్రియాలు అంటవు అని చెప్పుతున్నది. కనుక సశరీరుడైన బ్రహ్మ జగత్తుకు కారణము అని చెప్పితే జీవుడు ఎవడో ఈశ్వరుడు ఎవరో అని విభాగము చేయలేము

కాబట్టి ఇతరుల సాయము లేకుండా బ్రహ్మ ఒక్కడే కారణము అవుతున్నాడని చెప్పినపుడు మట్టి బంగారముల వలె జగత్తులో ఉన్న అపురుషార్థాలు మొదలైన అన్ని విశేషాలు ఆశ్రయించుతాయి కాబట్టి ప్రధానమే జగత్తుకు కారణము అని చెప్పడము చాలా మేలైనది. అని పూర్వపక్షము ఏర్పడింది.

దీనికి సమాధానము ఇట్లాగా చెప్పబడుతున్నది. స్యాత్ లోకవత్ అని. జీవేశ్వరుల విభాగము చేయడము వీలవుతుంది. జీవుడికి శరీరంలో వచ్చిన ధాతువుల యొక్క సమానత్వము, ఎక్కువ తక్కువలు కావడములవల్లనే శరీరస్థితిలో మార్పు కలిగి సుఖదుఃఖానుభవము కలుగడం లేదు. ప్రధాన కారణము వేరుగా ఉన్నది. అదే వాడి కర్మ. అది పుణ్యపాపాల రూపంలో ఉంటుంది. దానివల్ల సుఖదుఃఖానుభవము. కానీ శరీరము ఉన్నందువల్ల కాదు. **నీవు చెప్పిన నహవై సశరీరస్య** అనే శ్రుతివాక్యము కర్మలవల్ల వచ్చిన దేహానికి సంబన్ధించిన ముచ్చటను చెప్తున్నది. **సఏకథాభవతి త్రిథాభవతి. సయదాపితృలోకకామోభవతి. సతత్రపర్యేతి జక్షత్ క్రీడన్ రమమాణః.** ఆముక్త పురుషుడు ఒక్కడుగా ముగ్గురుగా అవుతున్నాడు. అతడు ఎప్పుడైతే పితృలోకాన్ని చూడాలనే కోరిక గలవాడవుతున్నాడో అప్పుడు ఆయన రుచి కల పదార్థాలను తినుకుంటూ ఆడుకుంటూ రమించుతూ / ఆనందించుతూ పోతాడు. అని కర్మ బన్ధాలనుండి విముక్తుడై సంసారంలోనికి ప్రవేశించక ముందు ఎటువంటి జ్ఞానానంద స్వరూపముండేదో దాన్ని పొంది శరీరాన్ని కలిగియున్న వాడికి కూడా అపురుషార్థము యొక్క వాసన ఐనా లేదని తెలుస్తున్నది కదా! అపహత పాప్మ ఐన పరమాత్మకు స్థూల సూక్ష్మరూపాలుగా ఉన్న జగత్తంతా శరీరమే ఐనప్పటికీ కర్మలతో సమ్బన్ధముండడము అనే దానియొక్క వాసన కూడా లేదు కాబట్టి బొత్తిగా అపురుషార్థము యొక్క గన్ధము అంటదు.

లోకవత్ – లోకములో వలెనే. రాజు గారియొక్క ఆజ్ఞను అనుసరించి నడుచుకొనేవారు, దాన్ని అతిక్రమించేవారు ఆయా కారణాలచేత సుఖదుఃఖాలను అనుభవిస్తున్నారు. వారి వలెనే రాజుగారికి శరీరము ఉన్నది కాబట్టి శాసకుడైన రాజుకు కూడా తన శాసనాన్ని అనుసరించినడుచుకోవడము లేక ఉల్లంఘించడాల వల్ల సుఖదుఃఖానుభవము కలుగడం లేదు. ద్రమిడాచార్యుడనే బ్రహ్మసూత్ర భాష్యకారుడు – ప్రాచీనుడు – ఇట్లాగా చెప్పినాడు. రాజుగారు పాములతో నిండిన భయంకరమైన పలురకాల ఇబ్బందులను కల్గించే అడివిలో ఉండినా చామరాదులతో విసరబడుతూ

అక్కడి దోషాలను ఏమీ అనుభవించడు. పైగా తన వద్దకు వచ్చిన వారిని ఇష్టప్రాప్తి అనిష్ట నివారణలద్వారా ఏలుకుంటాడు. స్వయంగా తాను అన్తఃపురంలో ఉన్న విధంగానే సాధారణ జనులు అనుభవించని సుగన్ధాదులను ధరిస్తాడు. ఆనందించుతాడు. అట్లాగే లోకాలన్నింటికీ ప్రభువైన సర్వేశ్వరుడు తన సామర్థ్యమనే చామరంతో సంసారంలోని ఏ దోషాలతోనూ అంటుబడడు. బ్రహ్మలోకము వంటి లోకాలను కాపాడుతాడు. విశ్వములో ఉన్నవాళ్ళలో ఎవ్వడూ అనుభవించని భోగాలను అనుభవించుతాడు అని. ఆయన అవికారుడు నిర్దోషి అని శ్రుతిచెపుతున్నది కాబట్టి మట్టి బంగారాల వలె బ్రహ్మయొక్క స్వరూపపరిణామాన్ని మేము ఒప్పుకోము.

కొందరు బ్రహ్మ కారణవాదంలో భోక్త భోగ్యము అనే విభాగము లేదని అనుమానపడి సముద్రమును తరంగాలు నురుగులతో కూడి, అవి వేరే ఐనా వాటితో కూడిన దాన్ని దృష్టాన్తంగా చూపి ఆ విధంగా బ్రహ్మలో విభాగాన్ని తెలిపేదిగా ఈ సూత్రాన్ని వ్యాఖ్యానించారు. అది సరియైనది కాదు. తన శక్తులన్నీ ఉడిగిపోయి అవిద్య అనే దానికి చిక్కి ఉపాధితో కూడినవాడైన బ్రహ్మ నుండి సృష్టి జురుగుతున్నదని ఒప్పుకునే వారు ఈ విధమైన ఆక్షేపము పరిహారాన్ని చెప్పడము పొసగేది కాదు. కారణంతో అన్తర్గతమైన శక్తి గలవాడై అవిద్యా ఉపాధికి చిక్కినవాడు భోక్త అవుతున్నాడు. ఉపాధిభోగ్యము అవుతున్నది. విలక్షణాలు ఐన ఆ రెండూ – భోక్త భోగ్యము కావడము, భోగ్యం భోక్తకావడము అనేది జరిగే పనికాదు. స్వరూపమే పరిణామము చెందుతుంది అని అనడాన్ని వాళ్ళు ఒప్పుకోరు. **నకర్మ అవిభాగాత్ ఇతిచేన్న. అనాదిత్వాత్** అనే సూత్రముతో క్షేత్రజ్ఞులు, వాళ్ళ కర్మలు అనాదులు అని ప్రతిపాదించినారు కాబట్టి. స్వరూపమే పరిణామాన్ని చెందుతున్నదని ఒప్పుకున్నా భోక్తభోగ్యములు విభజించబడవు అనే ఆశంక ఎవ్వడికీ కలుగదు. ఎందుకంటే మట్టిబంగారము మొదలైనవాటి యొక్క పరిణామాలైన కుండ, చిప్ప, దండకడియము, కిరీటమువంటి విభాగాలవలె భోక్తభోగ్యాలను విభజించడము సాధ్యపడుతున్నది. స్వరూప పరిణామము నందు కూడా బ్రహ్మకే భోక్తృభోగ్యత్వములు అనేవి రెండూ వచ్చి పడుతవి. కనుక తిరిగి వారివాదము అసమంజసమైనదే. బ్రహ్మ ఒక్కడే ఉన్నాడని అంటున్నందువల్ల మరొకడు లేడు కనుక ఒక్క బ్రహ్మకే భోక్తృత్వం భోగ్యత్వము రెండూ ఏర్పడుతవి. **ఇది భోక్త్రాపత్తి అధికరణము**

★ ★ ★

## ఇక ఆరమ్భణాధికరణము

సూ॥ **తదనన్యత్వం ఆరంభణ శబ్దాదిభ్యః 2-1-15 అసదితి చేన్న ప్రతిషేధమాత్రత్వాత్** ఇత్యాది సూత్రాలలో కారణమైన బ్రహ్మకు కార్యమైన జగత్తుకున్నూ అనన్యత్వాన్ని – రెండూ వేరు కాదు అనడాన్ని – ఒప్పుకొని బ్రహ్మకు జగత్ కారణత్వాన్ని ఉపపాదించినారు. ఇప్పుడు ఆ అనన్యత్వాన్ని ఆక్షేపించి సమాధానము చెప్పబడుతున్నది.

ఇక్కడ కాణాదులు / వైశేషికులు కారణము కంటే కార్య అనన్యము కాదు. విలక్షణమని గుర్తించి తద్వారా మరొక వస్తువుగా వ్యవహరిస్తున్నారు. కాబట్టి దారాలు – బట్ట, మట్టిముద్ద – ఘటము మొదలైనవాటిలో కార్యము ఇది కారణము ఇది అని అంటున్నపుడు రెండూ ఒకటే అనే జ్ఞానము కలుగడంలేదు. వాటిని వ్యవహరించినపుడు వాచకమైన శబ్దము భిన్నంగా ఉంటున్నది – దారాలు బట్ట అని అనబడడం లేదు. బట్టను దారాలు అని అనడం లేదు. బట్ట అనో దారము అనో అంటున్నాము. కార్యములో భేదముంటున్నది. మట్టి ముద్దతో నీళ్ళను తేవడం లేదు. కుండతో గోడను కట్టడం లేదు. కాలభేదం వల్లనూ కార్యకారణాలు ఒక్కటి కావు. కారణము ముందరికాలములో ఉంటున్నది. కార్యము తరువాతి కాలములో అస్తిత్వాన్ని పొందుతున్నది. ఆకార భేదమూ కనపడుతున్నది. ఎట్లాగంటే ముద్ద ఆకారములో కారణము ఉంటున్నది. లావుగా మూతి సన్నగా కుండ ఉంటున్నది. అట్లే మట్టి ఉంటుండగానే కుండ పగిలింది అని అంటున్నాము. సంఖ్యాభేదమూ కనిపిస్తున్నది. దారాలు చాలా ఉంటున్నవి. కార్యమైన బట్ట ఒక్కటే కనపడుతున్నది. ఇట్లా కార్యకారణాలు పలురకాలైన భేదాలు కనపడ్తుంటే కార్యకారణాలు అనన్యములు వేరు కావు అనడం సరియైనది కాదు. పైగా రెండూ ఒకటే అయినపుడు కారక వ్యాపారము దండుగ అవుతుంది. అనగా రెండూ ఒకటే ఐనపుడు మట్టిముద్దను / కారణాన్ని, కుండగా / కార్యంగా చేసే పని దండుగనే కదా! కారణమే కార్యమైనపుడు కారకవ్యాపారము చేత సాధ్యమయ్యేది ఏమిటి? సాధించేది ఏమిటి? కార్యము ఉనికిలో ఉండగా కారణము కార్యములో ఉపయోగించేదిగా కావాలి అనేటట్లయితే ఎప్పుడూ కారకవ్యాపారమును మానుకోకుండా ఉండాల్సి వస్తుంది. అన్నీ అన్నివేళల్లో ఉంటున్నందున నిత్యము ఇది, అనిత్యము ఇది అనే విభాగము లేకుండా పోతుంది.

ఇక కార్యము ఉన్నదే ఐనా ఇంతకుముందు వెల్లడికాలేదు. ఇపుడు కారక వ్యాపారముతో బయట పడుతున్నది. కావున కారక వ్యాపారము అర్థవన్తము అవుతుంది. నిత్యానిత్యవిభాగమున్నూ చేయ వీలవుతుంది అని అంటారేమో! ఆ మాట సరికాదు. అభివ్యక్తి అనేది మరొక అభివ్యక్తిపై ఆధారపడి దాని సాయాన్ని కోరేటట్లయితే దానికి మరొకటి, దానికి ఇంకొకటి దానికి మరొకటి ఇట్లా చెప్పుకుంటూ పోతే అనవస్థ (నిలకడలేమి) వస్తుంది. అది ఒక దోషము. అభివ్యక్తి (కనబడడము) కి మరొకదాని యొక్క సాయము అక్కరలేకపోతే కార్యము ఎప్పుడూ అందుబాటులో ఉండవలసి యుంటుంది. అదే నిత్యోపలబ్ధి. లేదా కార్యాన్ని పుట్టించుతున్నాము అనేట్లయితే లేని వస్తువునే ఉత్పత్తి చేస్తున్నాము గనుక అసత్ నుండి కార్యము పుడుతున్నది అని అసత్కార్యవాదులు కావాల్సి వస్తుంది.

ఇంతేగాకుండా! కారకవ్యాపారము – పుట్టించేందుకైన పని – అభివ్యంజకము – ఉన్నదాన్ని వెల్లడిచేసేది – ఐనప్పుడు ఘటం కోసము చేసిన కారకవ్యాపారము చిన్నముంతను కూడా వెల్లడిచేస్తుంది. సంప్రతిపన్న అభివ్యంజక భావములందు – మనము గుర్తించిన వెల్లడి చేయగల అంశాలయందు – అనగా దీపాదులయందు వెల్లడించే నియమవిశేషాలు ఉండి తీరాలని నియమము కనబడడము లేదు. ఉన్నవస్తువును తెలిసేటట్లు చేస్తున్నపుడు దానికి వ్యంజకమైన మరొకవస్తువు/ అంశము ఏదో ఒకటి ఉంటున్నది. సరేకాని దీపము మొదలైన వాటిలో దీపాన్ని ఇది దీపము అని వెల్లడించే మరోవస్తువేదీ ఉండడము లేదు కదా! కుండను వెతుకడం కొరకు వెలిగించిన దీపము గురిగిలాంటి వాటిని చూపించకుండా ఉండదు. కనుక లేనిదైన కార్యాన్ని పుట్టిస్తున్నది కనుక కారకవ్యాపారము అర్థవంతమవుతున్నది. ఇందువల్ల సత్కార్యవాదము సిద్ధించదు.

దేనికి ఏది తప్పనిసరో అది దానికి నియతకారణము. కుండకు మట్టివలె. అటువంటి నియత కారణాన్ని చేబూనడమే సత్తు నుండి కార్యాన్ని సాధిస్తుంది అని అనగూడదు. కారణశక్తి నియమము వల్లనే ఆ వస్తువు పుడుతున్నది.

ఔనండి! అసత్ కార్యవాదికి కూడా కారక వ్యాపారము పొసగదు. పుట్టడానికి ముందుకాలంలో కార్యమైన వస్తువు లేదు కనుక కారణము కార్యానికంటే వేరు కావాల్సి ఉంటుంది. కారణములో విశేషము / తేడా లేదు కాబట్టి దారాల్లో ఉండే కారక వ్యాపారము చేత ఘటము పుట్టడం జరుగాల్సి వస్తుంది. అని ఊహించవద్దు.

ఏ కార్యాన్ని ఉత్పత్తిచేయడానికి ఏది తగిన శక్తిని కలిగి ఉంటుందో అది మాత్రమే, దానిలోనున్న కారక వ్యాపారము చేత ఆవిధమైన వస్తువే పుడుతుంది.

ఇక్కడ కొందరు ఇట్లా అంటున్నారు. కారణం కంటే కార్యము వేరుకాదు. యధార్థంగా గమనిస్తే కారణాని కంటే వేరుగా కార్యమనేది ఒక వస్తువు లేదు. అవిద్య కారణంగానే సకల కార్యాలు పుడుతున్నాయి. వాటిని వ్యవహరిస్తున్నారు కూడా! కనుక కారణమైన మట్టి అనబడే ద్రవ్యము నుండి ఘటము / కుండ మొదలైన వికారాలు లభించుతున్నవి. ఇట్లా లభించే వాటి కంటే వేరుగా – వ్యతిరిక్తంగా – ఘటము శరావము అనబడే కార్యాలు వ్యవహారాన్ని మాత్రమే ఆలంబనగా – ఆధారంగా చేసుకొని ఉంటున్నవి. కనుక అవి మిథ్యా కారణమైన మట్టి అనబడే ద్రవ్యమే సత్యము. అదే తీరుగా ఎట్లాంటి విశేషాలు లేని, సత్తా మాత్రమే కల ప్రపంచానికి కారణమనబడే బ్రహ్మ కంటే వేరుగా అహంకారము మొదలైనవాటిని ఆలంబనంగా చేసుకుని ఉన్న సమస్త ప్రపంచం మిథ్య. కారణమైన సన్మాత్రం బ్రహ్మ మాత్రమే సత్యము. అందువలన కారణం కంటే వేరుగా కార్యము అనేది లేదు కనుక కారణం కంటే కార్యం వేరుకాదు.

ఐతే ముత్యపు చిప్పలో వెండిలాగా ఘటాదికార్యాలు అసత్యములు అనే ప్రసిద్ధి లేదు కనుక మీరు చెప్పిన దృష్టాన్తము తప్పు పొసగదు అని అనకూడదు. ఆ ఘటాది కార్యాలలో మేము మాదైన యుక్తితో మట్టి అనబడే ద్రవ్యము మాత్రమే సత్యమని నిరూపిస్తాము. మట్టి కంటే వేరైనది యుక్తి చేతనే బాధింపబడుతుంది. ఐదే ఇక్కడ మీరు చూపే యుక్తి ఏది? అని అనేట్లయితే చెప్తున్నాము వినండి. మృత్ ద్రవ్యము మాత్రమే ఘటాదులలో అనువర్తమానము అవుతుంది. అదే సత్యము వ్యావర్తమానము దానికంటే వేరుగా ఉండేది. అనగా అనువర్తమానము సత్యము. తొలగిపోయేది వ్యావర్తమానము. అనువర్తమానము అంటే కార్యాలు ఐన వస్తువులన్నింటిలో కనిపించేది. వ్యావర్తమానం అంటే వాటిలోనే ఉండే వివిధము లైన ఆకారాలు. మట్టి కుండగా మారినపుడు దాంట్లో మట్టి కనిపిస్తూనే ఉంటుంది. అదే కుండ పగిలినప్పుడు దాని కపాలాల్లో పెద్ద పెంకుల్లో మట్టి కనిపిస్తున్నది. కాని కుండ ఆకారము కనిపించదు. అదేవిధంగా తొలగిపోయేది వ్యావర్తమానము. అన్నింటిలోనూ కొనసాగుతూ వచ్చేది అనువర్తమానము. కారణము అనువర్తమానము అనబడుతుంది. కార్యము వ్యావర్తమానమనబడుతుంది. రజ్జు సర్పాదులలో అనువర్తమానమైన అధిష్ఠానమైన రజ్జువు (తాడు) మొదలైనవి సత్యములు. వ్యావర్తమానాలైన పాము, భూమి పగులు

నెఱ్రె నీటిధార, మొదలైనవి అసత్యాలు అని కనపడ్తూనే ఉన్నది కదా! ఆ తీరుగానే అధిష్ఠానమై అనువర్తమానమయ్యేది ఐన మృద్ ద్రవ్యమే సత్యము. వ్యావర్తమానాలు / తొలగిపోయేవి ఐన కుండ చిప్ప వంటివి అసత్యాలు. ఇంతేకాదు. సత్తు ఐన ఆత్మకు వినాశము లేదు కాబట్టి, అసత్తు అనబడే కుందేటి కొమ్ము వంటివి బొత్తిగా లభించడం లేదు కాబట్టినీ్నీ ఉపలబ్ధి, వినాశాలు కల్గిన కార్యము సదసత్తుల కంటే అనిర్వచనీయం అని తెలుస్తున్నది. ఉపలబ్ధి = వస్తువు లభించడము. అనిర్వచనీయము ఇది ఇట్లా అని చెప్పలేనిదిగా ఉండడము. అనిర్వచనీయము అంటే ముత్యపు చిప్పలో ఉన్నట్టు కనిపించే వెండివలె అసత్యమే మృషయే. దానికి అనిర్వచనీయత్వము అనేది ప్రతీతి – ఉన్నది అని కనిపించడం, బాధ – యధార్థంగా పరిశీలించి చూస్తే ఆ వెండి అక్కడలేకపోవడం, ఈ రెండింటి ద్వారా అనిర్వచనీయత్వము సిద్ధించుతున్నది.

ఇంకనూ కార్యాన్ని పుట్టించుతున్న మృత్తు మొదలైన కారణద్రవ్యము తాను మార్పు చెందకుండానే కార్యాన్ని పుట్టించుతుందా? లేక ఏదో ఒక విశేషాన్ని (మార్పును) పొంది కార్యాన్ని పుట్టించుతుందా? అని సందేహము కలిగినప్పుడు – వికారాన్ని పొంది వస్తువులను పుట్టించదు. అట్లాగే ఐనప్పుడు ఎప్పుడూ ఉత్పాదకమవుతున్నందువల్ల ఎల్లపుడూ వికారాలను పొందుతూనే ఉండవలసివస్తుంది. విశేషాన్తరాన్ని ఏదో ఒక మార్పును – పొంది పుట్టించుతుంది అని అనేట్లయితే ఒక విశేషాంతరాన్ని పొందినప్పుడు దానికి ముందుకూడా ఏదో ఒక విశేషాన్ని పొందే ఉండవలసి ఉంటుంది. అట్లా ఊహించుకుంటూ పోయినప్పుడు అనవస్థ / నిలుకడ లేకపోవడము వస్తుంది. ఈ రెండూ కాదు. వికారాన్ని చెందకుండానే దేశము, కాలము, నిమిత్త విశేషాలతో సమ్బన్ధించినదై కార్యాన్ని పుట్టిస్తుంది అని అంటే. అట్లా కాదు. దేశాదివిశేషాలతో సమ్బన్ధాన్ని కల్గినదైనా వికారము లేనిది విశేషాన్తరాన్ని పొందినదైనా ఇపుడు చెప్పినట్లు కార్యాన్ని పుట్టించజాలదు. **పోనీ మీరిట్లా అనవచ్చును.** మట్టి బంగారము పాలుల నుండి కుండ, నగ, పెరుగు మొదలైనవి పుడుతున్న విషయము కంటికి కనిపిస్తూనే ఉన్నది. ముత్యపు చిప్పలో వెండి మొదలైన వాటి వలె దేశకాలాదుల చేత పొందబడిన ఉపాధి కల్గినదాంట్లో బాధ అనేది – వెండి లేదు అని ధృవపడడము – కనిపించడం లేదు. కనుక లోకంలో కనిపించేదాన్ని బట్టే వాదానికి దిగేవారు / ప్రత్యక్షాన్ని మాత్రమే ప్రమాణంగా ఒప్పుకునేవాళ్ళు కారణాన్నుంచి కార్యోత్పత్తిని తప్పక ఒప్పుకోవాలి అని ఐతే అది వికల్పమును చేస్తే నిలబడదు. బంగారము మాత్రమే స్వస్తికము ఆభరణాలకు

ఆరంభకము అవుతున్నదా? లేక బంగారు బిళ్ళలా? లేక రుచకాదులకు ఆశ్రయమైన హేమాది (ముడి బంగారము) యా? అని. హేమాది మాత్రమే ఆరంభకము కాదు. బంగారం కంటే వేరయిన కార్యము లేదు కాబట్టి. తన ఆత్మను గురించి ఆత్మ ఆరంభకము కావడంలేదు కనుక. కాదండీ! హేమానికి వ్యతిరేకంగా / వేరుగా స్వస్తికము కనిపిస్తున్నది కదా అని అంటే ఆస్వస్తికము హేమం కంటే వేరుకాదు. దానిలో హేమం ప్రత్యభిజ్ఞ / గుర్తింపు చేయబడుతున్నది. దానికంటే వేరుగా మరొక వస్తువు లభించడంలేదు గనుక. బుద్ధి / తెల్సుకోవడము, శబ్దాన్తరత్వముల చేత వస్తువును మరొకటిగా సాధించినాము అని అంటే. కాదు ఇది ఇట్లాంటిది అని నిరూపించబడని వస్తువులపై ఆధారపడిన బుద్ధి, శబ్దాన్తరాదులు ముత్యపు చిప్పలో కనిపించే తెల్లని పదార్థాన్ని రజతము అని తెల్సుకోవడము దానికొక వాచకమైన శబ్దాన్ని ఏర్పర్చడము వాటి వలెనే భ్రాన్తి వలన ఏర్పడినవి కనుక మరొక వస్తువు ఉన్నదని సాధించలేవు. పోనీ రుచకాదులు స్వస్తి కాదులకు ఆరంభకము కాదు. స్వస్తికములో రుచకము బట్టలో దారాలవలే వేరుచేస్తే చిక్కదు. నేనే కాదు మీరుకూడా దాన్ని సాధించలేరు. లేదా! రుచకానికి ఆశ్రయమైనది హేమము కాదు. రుచకానికి ఆశ్రయమైన ఆకారంలో హేమము స్వస్తికంలో లభించదు.

కావున మృత్తు మొదలైన కారణాలకంటే కార్యము అసత్యముగా కనిపిస్తున్నది కాబట్టి బ్రహ్మ కంటే వేరయిన ప్రపంచమంతా కార్యమైనందున మిథ్యయే ఉన్నట్లు కనిపిస్తున్నది కాని వాస్తవానికి లేనిదే. కనుక బ్రహ్మకన్నా వేరుగా ఉన్నదంతా మిథ్యనే అనే విషయము సుఖంగా అర్థం చేసుకోవడానికి కల్పితమైన మన్ను మొదలైన వాటియొక్క సత్యత్వాన్ని ఆశ్రయించి కార్యమనే దానికి అసత్యత్వము ప్రతిపాదింపబడ్డది. పరమార్థము దృష్ట్యా ఆలోచించితే మన్ను సువర్ణము మొదలైన కారణాలు కూడా ఘటము రుచకముల వలె కార్యము అనబడేదంతా మిథ్యఐనదే. బ్రహ్మకార్యము అవుతున్నందువల్ల కార్యము గాక మరొక్కటి కావడం లేదు. **1) ఐత దాత్మ్యమిదం సర్వం తత్ సత్యం, 2) నేహనానాస్తి కించన. మృత్యోః సమృత్యుమాప్నోతి య ఇహ నానేవపశ్యతి. 3) యత్రహిద్వైతమివభవతి తదితర ఇతరంపశ్యతి. 4) యత్రత్వస్య సర్వమాత్మైవాభూత్ తత్ కేనకం ఏశ్యేత్. 5) ఇంద్రోమాయాభిః పురురూపఈయతే.** ఇటువంటి శ్రుతివాక్యాల చేత బ్రహ్మకంటే వేరయినదంతా మిథ్యయే అని అర్థమవుతున్నది. వేదము చేత తెల్సిన వస్తువుకు ప్రత్యక్షముతో వైరుధ్యము ఉన్నదని

శంకచేయకూడదు. ఇప్పుడు చెప్పిన ప్రకారము కార్యమంతా మిథ్య అని తెలుస్తున్నది కదా! ప్రత్యక్ష ప్రమాణము ఉన్నది అని మాత్రమే చెప్పగలదు. అది రెండవ క్షణములో ఉండేదికాదు గనుక అంతకుమించి దేన్నీ తెలుపజాలదు. ఒకవేళ ప్రత్యక్షానికి శాస్త్రానికి విరోధము ఉన్నప్పటికీ దోషాన్ని కలది అని ఊహించడానికి కూడా అవకాశము లేని చివరలో కలిగేదైన దానికి – స్వరూపము ఉన్నదనడంలో ప్రత్యక్షము మొదలైనవాని అవసరము ఉన్నా కూడా యధార్థ జ్ఞానము కలుగడంలో దేన్నీ సహాయమడుగని, అవకాశము లేని శాస్త్రమే బలవంతము. కనుక కారణమైన బ్రహ్మకంటే వేరుగా ఉన్నట్లు కనిపించేదంతా మిథ్యనే.

ఇది ఇలా ఉన్నందువల్ల ప్రపంచము మిథ్య అని తేలినందువల్ల ప్రపంచంలో ఒక భాగమైన జీవుడు మిథ్య అని అనుకోకూడదు. బ్రహ్మనే జీవభావాన్ని పొందినాడు కదా! బ్రహ్మనే సర్వశరీరాల్లోనూ ఉండి జీవభావాన్ని అనుభవిస్తున్నాడు.

**అనేన జీవేన ఆత్మనా అనుప్రవిశ్య 2) ఏకోదేవః సర్వభూతేషు గూఢః** ఒక్కడే దేవుడు అన్ని భూతాల్లోనూ గుప్తముగా ఉన్నాడు. **3) ఏకోదేవః బహుధానివిష్టః** దేవుడు ఒక్కడే అనేక రూపాలుగా ఉన్నాడు **4) ఏషసర్వేషు భూతేషు గూఢోఆత్మానప్రకాశతే** ఈయన అన్ని భూతాల్లోనూ రహస్యంగా ఉండి బయటికి కనుపించడం లేదు. **నాన్యోఽతోఽస్తిద్రష్టా** ఈయన కంటే చూచేవాడు మరొకడు లేదు. ఇటువంటి వాక్యాలద్వారా ఈ విషయము తెలుస్తున్నది.

అయ్యా! ఒకే బ్రహ్మ అన్ని శరీరాల్లో జీవభావాన్ని అనుభవించుతున్నాడు అని అనేట్లయితే నాకాలులో నొప్పి, తలలో నొప్పి అని అన్నట్లు అన్ని శరీరాల్లోనూ సుఖదుఃఖాలను అనుభవించవలసివస్తుంది కదా! అప్పుడు జీవుడు ఈశ్వరుడు బద్ధుడు ముక్తుడు శిష్యుడు ఆచార్యుడు జ్ఞాని అజ్ఞాని మొదలైన వ్యవస్థ లేకుండా పోతుంది అని శంక చేసినారు.

**జీవాజ్ఞాన వాదము:** ఈ విషయంలో కొందరు బ్రహ్మకు సమానంగా రెండవవాడు లేదు అని ఒప్పుకుంటూనే ఇట్లాగా సమాధానాన్ని చెప్పుతున్నారు. బ్రహ్మ ఒక్కడే కాని ఆయనకు ప్రతిబింబము వంటివారు జీవులు. ఆ జీవులకే సుఖిత్వము దుఃఖిత్వము ఉన్నవి. బ్రహ్మకు లేవు. ముఖము ఒక్కటే ఐనా మణి, కత్తి, అద్దము మొదలైనవాటిల్లో ప్రతిబింబినప్పుడు చిన్నగా పెద్దగా మురికిగా తేటగా కనిపించినట్లే ఆయా ఉపాధులు

– కర్మలు – కారణంగా సుఖము గలవాడు, దుఃఖాన్ని అనుభవిస్తున్నాడు అని వ్యవస్థను చేస్తాము అని. నిజమే కానీ **అనేన జీవేనఆత్మనా అనుప్రవిశ్య** అని జీవులు బ్రహ్మతో భేదాన్ని కలవారుకారు. ఆయనే వారిలో ప్రవేశిస్తున్నాడని తెలుస్తున్నది కదా! అని అంటున్నారా? పరమార్థంగా జీవబ్రహ్మలకు భేదము లేకపోవడము సత్యమే. ఐతే మేము కాల్పనిక భేదవ్యవస్థ ప్రకారము ఇట్లా చెపుతున్నాము. సరే! ఐతే కల్పన ఎవరిని గురించి? బ్రహ్మను గురించి ఐతే కాదు. ఆయన పరిశుద్ధ జ్ఞానస్వరూపుడు. ఆయనను కల్పించలేము. ఆయనలో కల్పనలు లేవు. అది అజ్ఞానము వల్ల ఏర్పడుతుంది. పోనీ జీవుల గురించి అందామా? అంటే అన్యోన్యాశ్రయదోషము వస్తుంది. కల్పనవల్ల వచ్చినవాడు జీవుడు. జీవుడిని ఆశ్రయించి కల్పన ఉంటుంది. కావున అన్యోన్యాశ్రయదోషము తప్పదు అని అనవద్దు. అవిద్య, జీవభావములు రెండున్నూ బీజము – అంకురము (గింజ – మొలక), లవలె అనాదిగా ఉంటున్నవి. ఏది ముందో ఏది వెనుకకో తెలియదు. విత్తనము ఉంటే మొలక – చెట్టు – కాత – విత్తనము, చెట్టు ఉంటేనే విత్తనములు వస్తవి. ఒకదాని మీద ఒకటి ఆధారపడి ఉంటవి. దీన్ని బీజాంకుర న్యాయము అని అంటున్నారు. దీనిప్రకారము సమస్యకు పరిష్కారము చెపుతాము. ప్రాసాదనిగరణము – మేడను మింగడము – వంటివాటివలె పొసగని స్వరూపము ఉన్న, నిజంగా లేని, అవిద్యయందు అన్యోన్యాశ్రయదోషాదులైన వస్తుదోషాలు చేరబోవు. వాస్తవానికి బ్రహ్మ కంటే వేరుకాని జీవులు సహజంగానే పరిశుద్ధులుఐనా ఖడ్గము మొదలైనవాటిలో ప్రతిబింబించిన ముఖములోని నలుపుదనము వలె ఉపాధి – కర్మ – కారణంగా అశుద్ధి ఏర్పడుతున్నది. కనుక అవిద్యాశ్రయత్వము ఏర్పడుతున్నది కనుక కాల్పనికత్వము – లేని దానిని ఉన్నట్లు చూపడము. పుట్టించడము – పొసగుతుంది. ప్రతిబింబములో ఉన్న నలుపుదనము వలె జీవుడిలో ఉన్న అశుద్ధి కూడా భ్రాన్తియే. అట్లా కాకపోయినప్పుడు ఆ అశుద్ధి నుండి విడుదల జరుగనే జరుగదు. ఇదీ ఏర్పడబోయే పరిస్థితి. కనుక భ్రాన్తిగా చెప్పుకోవాలి. జీవులకు ఉన్న భ్రమ ప్రవాహము యొక్క అనాదిత్వం వలె ఉండేది కాబట్టి దానికి కారణాన్ని వెతుకవలసిన పనిలేదు.

జీవ నదులలోని ప్రవాహము ఏడాది పొడుగునా సాగుతూనే ఉంటుంది. ఎక్కడ ఉన్న జలబిందువులు అక్కడనే ఉండవు. ముందుకు సాగిపోతుంటవి పాతనీళ్ళు పోతూ ఉంటే వాటి స్థానంలో కొత్తనీళ్ళు చేరుతూ ఉంటవి. చూచేవాడికి ఒకే ప్రవాహము సాగుతున్నట్లు కనిపిస్తుంది. అది ఎడతెగదు. అట్లాగే జీవుల భ్రమ కూడా

ఒకదాని తరువాత మరొకటి చొప్పున తెగకుండా ఏర్పడి ప్రవాహము వలె ముందుకు పోతుంటుంది. కనుక ప్రవాహ నిత్యత్వము అని అంటారు. ప్రవాహము ఎప్పుడూ ఉంటున్నట్టు అని అర్థం.

**బ్రహ్మాజ్ఞానవాదము** ఐదే ఇది అంతా అద్వైతము యొక్కయధార్థస్థితిని తెలువనివారు భేదవాదము నందు శ్రద్ధను చూపే జనులు తమను గొప్ప ఆదరముతో బహుమాన పూర్వకముగా ఒక్కచూపు చూడాలి అని కోరుకుంటున్నవారి యొక్క రెచ్చిపోయి మాట్లాడుతున్న వాదము. అది ఎట్లాగంటే – జీవుడు కల్పితమైన స్వరూపము కలవాడుగా కాక స్వాభావికమైన / సహజమైన స్వరూపంతో అవిద్యకు ఆశ్రయుడైనప్పుడు బ్రహ్మకే అవిద్యాశ్రయత్వమును చెప్పినట్లవుతుంది. అట్లా కాకుండా జీవుడికి కల్పితమైన ఆకారముతో అవిద్యాశ్రయత్వాన్ని చెప్పితే జడానికి అవిద్యాశ్రయత్వాన్ని చెప్పినట్లవుతుంది. అద్వైతవాదులు బ్రహ్మ జడ(పదార్థాలు) ములను తప్ప అంతకుమించి మరొక పదార్థాన్ని ఒప్పుకోరు. కల్పితాకారముతో కూడిన స్వరూపము కలవానికే అవిద్యాశ్రయత్వము అని భావించితే అది తప్పు. అఖండైకరస స్వరూపము కలవాడికి అవిద్య అనేది లేకుండా విశిష్టమైన రూపము సిద్ధించదు. అవిద్యకు ఆశ్రయమైన ఆకారము మాత్రమే నిరూపింపబడుతున్నది.

ఇంతేకాకుండా సంసారబన్ధము, దానినుండి విడుదల మోక్షము మొదలైనవాటి వ్యవస్థ ఏర్పాటుకోసము కదా జీవుడికి అజ్ఞానము పట్టుకొన్నది అని వాదించుతున్నాము. ఆ వ్యవస్థ జీవాజ్ఞానపక్షములో కూడ నెరవేరదు. అవిద్య నశించిపోవడమే మోక్షమనబడుతున్నది కదా! అటువంటప్పుడు ఒక్కడు ముక్తిని పొందితే అవిద్య అనేది లేకుండా పోతుంది. కాబట్టి తక్కినవాళ్ళు కూడా ముక్తిని పొందుతారు. ఎవ్వడు ముక్తిని పొందుతాడో వాడికి కాకుండా మిగతావాడికి అవిద్య అట్లాగే ఉంటుంది నశించదు అని అనేట్లయితే అప్పుడు ఏ ఒక్కడికీ ముక్తిదొరకదు. ఎందుకంటే అవిద్య నశించలేదు కాబట్టి. ఐతే ప్రతిజీవికి వేరువేరుగా అవిద్యలో భేదాన్ని కల్పిస్తాము. ఎవడి అవిద్యవాడికే ఉంటుంది. ఎవడి అవిద్య నశించుతుందో వాడికి మోక్షము. ఎవడికి నశించలేదో వాడు సంసారములో బద్ధుడు అయ్యే ఉంటాడు అని అనడము తగదు. ప్రతి ఒక్క జీవుడికి అని జీవులలో భేదాన్ని ఆశ్రయించి అంటున్నావు కదా! ఐతే జీవులలో ఉన్న ఆ భేదము సహజమైనదా? అవిద్య చేత కల్పింపబడిందా! నేనైతే జీవుడిలో భేదము సహజమని అనుకోవడము లేదు. నీవు కూడా భేదాన్ని అంగీకరించడంలేదు. జీవుడిలో

భేదాన్ని లేనిదాన్ని పుట్టించడానికే కదా అవిద్య అనేదాన్ని కల్పించినాము. అపుడు అవిద్యా కల్పన దండుగ అవుతుంది. ఇక జీవభేదము అవిద్య చేత కల్పించబడింది అని అంటే। అప్పుడు జీవులలో భేదాన్ని కల్పించే ఈ అవిద్య ఎవరికి? బ్రహ్మకా? లేక జీవులకా? బ్రహ్మకే అవిద్య ఐనప్పుడు నా బాటలో కొచ్చినావు సుమా! కాదు. జీవులకే అవిద్య అని అంటే దీన్ని జీవులలో భేదాన్ని కల్పించడం కొరకే పుట్టించినాము అనే విషయాన్ని మరచినావా? సరే! ప్రతి ఒక్క జీవుడికిన్నీ బద్ధుడు, ముక్తుడు అనే వ్యవస్థ ఏర్పడడం కోసము ఏఏ అవిద్యలైతే కల్పించబడుతున్నాయో వాటి ద్వారానే జీవభేదము ఏర్పడుతుంది అని అనుకుంటున్నావా? జీవభేదము ఏర్పడితే అవిద్యలు ఏర్పడుతవి. అవి ఏర్పడితే జీవులలో భేదము ఏర్పడుతుంది. కనుక అన్యోన్యాశ్రయదోషం వస్తుంది. ఐతే ఇక్కడ బీజాంకుర న్యాయము వర్తించదు. బీజాంకురాలలో ఒక బీజము మరోక బీజాన్ని, ఒక అంకురము మరొక అంకురాన్ని పుట్టిస్తుంది. ఇక్కడైతేనో ఏ అవిద్యల చేత ఏ జీవులు కల్పింపబడుతున్నారో వార్ని ఆశ్రయించే అవి సిద్ధిస్తున్నాయి. తమ పనులను నెరవేర్చుకుంటున్నాయి. అజ్ఞానాన్ని పుట్టిస్తున్నాయి. కనుక అశకనీయత – సాధించడానికి అశక్యత ఏర్పడుతున్నది.

ఇక బీజాంకుర న్యాయము ప్రకారము ముందరిముందరి జీవులను ఆశ్రయించిన అవిద్యలతో తరువాతి తరువాతి జీవులు కల్పించబడుతున్నారని అనుకుంటున్నావా? అట్లయితే జీవులు నశించేవారు అవుతారు. వారికి చేయని పనికి ఫలితము దక్కడము, తాను చేసింది చెడిపోవడము వంటివి వచ్చిపడుతవి. ఇందువల్లనే పూర్వపూర్వ జీవభావులను ఆశ్రయించిన అవిద్యలతో ఉత్తరోత్తర జీవభావులను కల్పించడమనేది కూడా త్రోసివేయబడింది. కాదూ! అవిద్యా ప్రవాహాన్ని అంగీకరించినా ఆయా కల్పింపబడిన జీవభావులందరికి అవిద్యాప్రవాహం వలెనే ప్రవాహ అనాదిత్వము వస్తుంది. జీవుడిగా నిల్చిఉండడము – ధృవరూపము ఉండదు. మోక్షము వచ్చేంతవరకూ జీవుడికి ఇష్టమైన ధృవత్వము సిద్ధించకుండా పోతుంది.

అవిద్య అనేది వస్తురూపము కాదు కనుక అనుపపన్నతే దాని స్వరూపము కాబట్టిన్నీ అన్యోన్యాశ్రయత్వము వంటి దోషాలు చేరవు అని ఏది చెప్పినారో అదే గనక నిజమయితే ముక్తులను పరబ్రహ్మనున్నూ అవిద్య చుట్టుకుంటుంది. వారిద్దరూ శుద్ధవిద్యాస్వరూపులు కనుక అవిద్యా అశుద్ధ స్వరూపము కనుక వారిని చేరబోదు అని అనేట్లయితే అవిద్య అనేది ఉపపత్తిని – పొసగియుండుట – అనుసరించి ఉంటుందా?

అట్లయినపుడు ఇంతకుమునుపు చెప్పిన అన్యోన్యాశ్రయాది దోషాలు జీవులను కూడా చుట్టుకోవు.

ఇంకా జీవుడిని ఆశ్రయించిన అవిద్య, బ్రహ్మ సత్యం జగత్ మిథ్యా అనే జ్ఞానము కల్గిన తరువాత నశించిపోతే జీవుడు కూడా నశించుతాడా? లేదా? ఒకవేళ నశించితే స్వరూపమే లేకుండా పోవడమనే రూపమైన మోక్షము వస్తుంది. జీవుడు నశించకపోతే అవిద్య తొలగిపోయినా మోక్షము దక్కదు. బ్రహ్మ స్వరూపము కంటే వ్యతిరిక్తుడైన జీవుడు ఉంటాడు కాబట్టి.

మణికృపాణ దర్పణాదులలో కనిపిస్తున్న ముఖము నందు మురికి ఉండడము, లేక తేటగా ఉండడము వంటివాటి వలె శుద్ధి, అశుద్ధి మొదలగు వాటి వ్యవస్థ పొసగుతుంది అని దేన్ని చెప్పినారో దానిపై కాస్త విచారించవలసి ఉన్నది. ఇదీ ఆ విమర్శ. అల్పత్వము – కొద్దిగా ఉండడము, మలినత్వము – మురికిగా ఉండడము మొదలైన దోషాలు ఉపాధి కారణంగా వచ్చినటువంటివి కదా! అవి ఎప్పుడు లేకుండాపోతాయి అని. కృపాణాది ఉపాధులు పోయినప్పుడు అనేట్లయితే అప్పుడు అల్పత్వాదులకు ఆశ్రయము ఐన ప్రతిబింబము ఉంటుందా? ఉండదా? ఉంటుంది అనేటట్లయితే ప్రతిబింబస్థానీయుడు ఐన జీవుడు కూడా ఉంటాడు కనుక మోక్షము / విడుదల కాకుండాపోతాడు. నశించుతుంది ప్రతిబింబము అని అంటే ప్రతిబింబము వలెనే జీవుడు నశించుతాడు కాబట్టి స్వరూపము నశించుట అనే లక్షణము కల మోక్షము వస్తుంది. ఇంకా ఎవనికి అపురుషార్థరూపమైన దోషము ప్రతిభాసించుతుందో / కనిపించుతుందో వానికి అది తెగిపోవడమే పురుషార్థము. అపుడు ఉపాధి కారణంగా వచ్చిన దోష ప్రతిభాసము బింబస్థానములో ఉన్న బ్రహ్మకా? లేక ప్రతిబింబ స్థానంలో ఉన్న జీవుడికా? లేక ఈ ఇద్దరికీ కాక మరొకడికా? మొదటి రెండు కల్పాలలో మీరు చెప్పిన దృష్టాన్తము సరిపోదు. ముఖానికి, ముఖము యొక్క ప్రతిబింబానికి అల్పత్వాదిదోషాలు తెలియవు. అవి ముఖము, ముఖ ప్రతిబింబమున్నూ చైతన్యము కలవి కావు. ఇక బ్రహ్మకు దోష ప్రతిభాసము కలిగితే బ్రహ్మావిద్య – బ్రహ్మకు అజ్ఞానము వస్తుంది. ఇక మూడవ కల్పము ప్రకారము జీవబ్రహ్మలు కంటే వేరొక ద్రష్ట లేదు కాబట్టి అది పొసగదు.

ఇంకా అవిద్య చేత కల్పింపబడే జీవుడికి కల్పించడానికి కారణమైనవాడెవ్వడు? అనేది నిరూపించాల్సి ఉన్నది. అవిద్య ఐతే కాదు అది అచేతనము కనుక. పోనీ

జీవుడందామా? అతడూ కాదు. అతడే ఐనప్పుడు ఆత్మాశ్రయము అనే దోషము ఏర్పడుతుంది. తన అవిద్యకు తానే కారణము కావడము ఆత్మాశ్రయము. ముత్యపు చిప్పలోనున్నట్టు కనిపిస్తున్న వెండి వలె జీవభావము అవిద్య చేత కల్పించబడ్తున్నది. ఇక బ్రహ్మనే కారణమైనవాడు అని అంటే. బ్రహ్మకు అజ్ఞానము వస్తుంది. ఇంకా బ్రహ్మ అజ్ఞానము కలవాడు అని ఒప్పుకోకపోతే బ్రహ్మ జీవులను చూస్తాడా? లేదా? చూడడు అని అంటే ముందుగా సంకల్పమును చేసి తరువాత దాని ప్రకారము వింతవింతలైన జగత్ సృష్టి. నామ రూప వ్యాకరణము మొదలైనవి బ్రహ్మ వలన జరుగవు. ఇక చూస్తాడు అని అంటావా? అప్పుడు అఖండమై జ్ఞానైకరసమైన బ్రహ్మ అవిద్య అనేది లేకుండా జీవులను చూస్తాడు కనుక బ్రహ్మకు అజ్ఞానము వచ్చిపడుతుంది – ఇందువల్లనే మాయ అవిద్యా అనే విభాగాలు ఉన్నాయనే వాదమున్నూ త్రోసివేయబడింది. అద్వైతులసిద్ధాన్తములో మాయ అంటే ఇతరులకు భ్రమను కలిగించేది. అవిద్య అంటే తనకు తాను భ్రమలో పడడానికి కారణమయ్యేది.

అజ్ఞానము లేకుండా మాయి ఐనవాడికి కూడా, బ్రహ్మకు జీవుడిని చూడడం జరుగదు. మాయావి ఐనవాడు ఇతరులను చూడకుండా మోహింపచేయలేడు. మోహము – అజ్ఞానము మాయ అనేది మాయావికి ఇతరులను చూడడానికి సాధనము కాదు. పరులు కనపడినప్పుడు వాళ్ళను మోహింపచేయడానికి మాత్రమే సాధనమవుతున్నది. ఇక మాయ బ్రహ్మకు జీవుడిని దర్శింపచేస్తూ జీవుడిని మోహింపచేయడానికి హేతువని అనుకుంటున్నావా? అప్పుడు పరిశుద్ధుడు అఖండ ఏ కరసుడు స్వయంప్రకాశుడు ఐన బ్రహ్మకు ఇతరులను చూపించుతూ ఉన్న మాయ, మాయ అనే మరొక పర్యాయపదాన్ని కల్గిన అవిద్యనే అవుతుంది. విపరీత దర్శనానికి కారణంఅవిద్య.మాయఐతేమిథ్యఐనటువంటిది.తానుబ్రహ్మకంటేవేరుగాఉన్నదంతా మిథ్య అని చూపిస్తూనే బ్రహ్మకు మాత్రము విపరీతమైన దాన్ని చూడడానికి కారణము కాదు. అందువల్ల దాన్ని అవిద్య అని అనలేము అనేది నీ అభిప్రాయమైతే అది సరికాదు. చంద్రుడు ఒక్కడే అని తెలుస్తూ ఉన్నా ఆకాశంలో ఇద్దరు చంద్రులను చూడడానికి కారణము అవిద్యనే అవుతున్నది కదా! ఒకవేళ బ్రహ్మ తనకంటే వేరుగా ఉన్నదంతా మిథ్య అనియే తెల్సుకొంటే అప్పుడు దాన్ని మోహింపచేయలేడు. పిచ్చివాడొక్కడు తప్ప మిథ్యగా / లేనివాళ్ళుగా తెలుస్తున్నవారిని మోహింపచేయడానికి ప్రయత్నించడు. ఇక అపురుషార్థాన్ని, అపరమార్థాన్ని చూడడానికి హేతువు అవిద్య (పురుషార్థము

– పురుషుడు కావాలని కోరేది. కోరనిది అపురుషార్థము. పరమార్థము – మూడు కాలాల్లోనూ ఉండే వస్తువు. ఉండని వస్తువు అపరమార్థము) మాయనైతే బ్రహ్మకు అపురుషార్థాన్ని దర్శించడానికి కారణము కాదు. కనుక ఈ మాయ అవిద్య కాదు అని నీ అభిప్రాయమైతే అది సరికాదు. ఇద్దరు చంద్రులు ఆకాశంలో కనబడుతున్నారు అనే జ్ఞానము దుఃఖహేతువు కాదు కనుక అపురుషార్థము కాకపోయినా అందుకు కారణము అవిద్యనే. దాన్ని తొలగించుకోవడానికే ప్రయత్నించుతున్నారు లోకులు. మాయ అపురుషార్థాన్ని చూపించేది కాకపోయినా అది తొలగింపబడేది కానందున ఎల్లప్పుడూ ఉంటూ నిత్యా అనబడుతూ బ్రహ్మ స్వరూపానికి వెంటనంటి ఉండేది – అనుబన్ధముగా ఉండేది అవుతుంది. ఉండనివ్వండి దోషము – తప్పేమిటి? అని అన్నట్లయితే ద్వైతదర్శనమే దోషము. బ్రహ్మ వెంట నంటి ఉంటుంది కాబట్టి ఆయనకు తాను గాకుండా ప్రపంచమనేది రెండోది ఉన్నది అని చూపిస్తుంటుంది. ఇక మనకు బ్రహ్మ, అవిద్య అనేవి రెండు తత్త్వాలు ఉన్నవి అని తెలుస్తుంటుంది. అపుడు తత్త్వాలు రెండున్నాయి అని చెప్పాల్సి వస్తుంది. ఈ విధంగా ద్వైతదర్శనమే దోషమవుతుంది. అప్పుడు **యత్రహిద్వైతమివ భవతి. యత్రతు అస్యసర్వంఆత్మైవాభూత్. తత్ కేనకంపశ్యేత్** ఇత్యాదులైన అద్వైతాన్ని చాటి చెప్పే శ్రుతివాక్యాలు కన్నెఱ్ఱ చేస్తాయి. అద్వైతశ్రుతులు పరమార్థాన్ని మాత్రమే చెపుతున్నాయి. మాయ అపరమార్థము కాబట్టి శ్రుతులకు విరోధము లేదు అని అంటే ఒక పరిమితి / విభాగము అంటూ లేని ఆనందమే ఒకే ఒక స్వరూపంగా బ్రహ్మకు అపరమార్థమైన మాయ కనుపించడము, మాయతో కలిసి ఉండడమున్నూ అవిద్య లేకుండా పొసగనే పొసగదు.

ఇంకా అపరమార్థము, నిత్యమూ ఐన మాయ వల్ల బ్రహ్మకు ప్రయోజన మేమున్నది? జీవులను మోహింప చేయడమే ప్రయోజనమైనప్పుడు అపురుషార్థమైన ఆ మోహనము వల్ల లాభమేమిటి? ఆట అని అంటావా? ఎడతెగని ఆనందము కలవానికి ఆట దేనికోసము? నిండైన భోగాలున్నవారికి ఆట ఒక పురుషార్థము. లోకంలో అట్లా కనిపించుతున్నదికదా! అన్నట్లయితే అది ఇక్కడ పొసగదు. యథార్థము కాని ఆట వస్తువులతో అపరమార్థాలుగా కనిపిస్తున్న వాటి నుండి పుట్టిన వాటితో అపరమార్థమైన ఆటతో అపరమార్థమైన ప్రతిభాసతో ఉన్నదానివలన పిచ్చివారికే తప్ప మరెవ్వరికీ క్రీడారసము – ఆనందము – పుట్టదు. మాయ చేత చుట్టబడినవాడుగా చెప్పబడుతున్న బ్రహ్మకు వ్యతిరేకంగా అవిద్యాశ్రయుడైన జీవుడిని కల్పించడమనేది కూడా పూర్వము

వలెనే – అన్యోన్యాశ్రయము, ఆత్మాశ్రయము వంటి దోషాలు ఏర్పడుతవని – తెల్సుకొనవలెను. కనుక బ్రహ్మనే అవిద్యకు చిక్కి తనలోనే ప్రపంచమంతా ఉన్నదని భ్రమతో దర్శించుతూ ఉన్నాడు అని బ్రహ్మ ఒక్కడే ఉన్నాడు. రెండవ ప్రసక్తి లేదని చెప్పేవారు అంగీకరించాలి.

బంధ మోక్షముల వ్యవస్థ కుదరదు అని ఏది అన్నారో అది బ్రహ్మాజ్ఞానవాది శంకకాదు. ఎందుకంటే ఉన్నదే బ్రహ్మ ఒక్కడు. ఆయన అజ్ఞుడుఐనాడు. ఆయన తన అజ్ఞానము తొలగిపోయిన వెంటనే ముక్తుడు అవుతాడు. కనుక బద్ధముక్త వ్యవస్థ అనేదే ఉండదు. ఉన్నదని వ్యవహరించుతున్నారు కదా! అనేట్లయితే బద్ధుడు, ముక్తుడు, శిష్యుడు, ఆచార్యుడు మొదలైన వ్యవస్థ అంతా కల్పితమే. కలగంటున్నవాడివలెనే ఒక్క బ్రహ్మకే అవిద్య వల్ల ఎన్ని కల్పనలైనా చెయ్యడానికి అవకాశము ఉన్నది. కలలు గనే ఒకడికి కనిపించిన శిష్యాచార్యాదులు అందరూ అతనికి పట్టిన అవిద్య చేత కల్పింపబడినవాళ్ళే. అందువల్ల అవిద్యలను చాలా వాటిని కల్పించడము యుక్తితో కూడినది కాదు. పరమార్థమైన బంధ మోక్ష వ్యవస్థ, తాను ఇతరుడు అనే వ్యవస్థ కూడా జీవాజ్ఞానవాది (జీవుడికి అజ్ఞానము పట్టింది అనే అతను) చేత అంగీకరింపబడలేదు. అపరమార్థమైనది అని ఒకే ఒక్క అవిద్యచేతనే అన్నీ సరిపోతున్నవి.

ఇందుకు సమ్బన్ధించి ప్రయోగాలు ఇట్లా ఉన్నవి. 1) బన్ధ మోక్ష వ్యవస్థలు స్వ, పరవ్యవస్థలున్నూ తనకు పట్టిన అవిద్య చేతనే కల్పింపబడినట్టివి. అవి అపరమార్థాలైనవి కాబట్టి. కలలో చూడబడిన వ్యవస్థలవలె – వస్తువుల వలె. 2) శరీరాలు కూడా నా వల్ల ఆత్మవన్తములు అవుతున్నవి. అవి శరీరాలు ఐనందువల్ల ఈ శరీరము వలెనే 3) నా శరీరం కాకుండా ఇతర శరీరాలన్నీ నా అవిద్య చేతనే కల్పింపబడినాయి. శరీరము ఐనందువల్ల 3/2) కార్యమైనందువలన 3/3) జడమైనందువల్ల 3/4) కల్పితమైనందువల్ల ఈ శరీరము వలె 4) వివాదంలో చిక్కుకున్న చేతన సమూహం అంతానేనే. చైతన్యము కలవాడిని ఐనందువల్ల. ఏది నేను కాదో అది అచేతనము అయ్యి ఉన్నది. ఎట్లాగంటే కుండవలె. కనుక స్వపరవిభాగము, బద్ధముక్త శిష్యాచార్య ఆది వ్యవస్థలు అన్నీ ఒకే అవిద్య నుండి పుట్టినాయి. కల్పితాలే.

ఇక పరబ్రహ్మ. జీవుడు ఇద్దరు ఉన్నారని చెప్పే ద్వైతవాది చేత కూడా బద్ధముక్తవ్యవస్థ ఉపపాదింపబడేది కాదు. గడచిన కల్పాలు ఎన్నో తెలియదు గనుక అవి అనన్తాలు అని అనుకుంటే ఒక్కొక్క కల్పములో ఒక్కడు ఒక్కడు చొప్పున ముక్తిని

పొందినా అందిరికీ మోక్షము వచ్చినట్లే కనుక ముక్తిని పొందనివాడొకడు ఇంకా మిగిలి ఉన్నాడని అనుకోలేము. ఆత్మలు అనన్తాలు కాబట్టి ముక్తిని పొందనివారు ఇంకా ఉన్నారనేటట్లయితే? అనన్తత్వము అంటే ఏమిటో మీరు అర్థాన్ని చెప్పాలి. లెక్కపెట్టలేకపోవడము – అసంఖ్యేయత్వము అని అంటే మేము ఒప్పము. అల్పజ్ఞులు చాలామంది ఉన్నారు కావున అసంఖ్యేయులు అని అంటే సరిపోవచ్చు కానీ ఈశ్వరుడు సర్వజ్ఞుడు కాబట్టి ఆయన లెక్కబెట్టగలడు. అట్లా కానప్పుడు ఆయన సర్వజ్ఞుడు కాడు. ఆత్మలు ఎన్నో చెప్పడానికి ఒక సంఖ్య అంటూలేదు కాబట్టి ఈశ్వరుడికి ఆ సంఖ్య తెలువకపోవడము అసర్వజ్ఞత్వాన్ని కలిగించదు అని అంటావా? భిన్నము / వేరు అంటున్నపుడు సంఖ్య లేకపోవడం కుదరదు సుమా! ఈ విషయంలో మేము ఒక తర్క ప్రయోగాన్ని చెప్తున్నాము వినండి. ఆత్మలు సంఖ్యను గలవారు. భిన్నులైన వారు కాబట్టి. మినుములు, ఆవాలు, కుండలు, బట్టగుడ్డలు వలె. ఆత్మలు భిన్నములే ఐతే ఘటాదుల వలె జడత్వము వస్తుంది. ఆత్మలు అని అనబడకుండా అవుతవి. నశించిపోవడం / తరిగిపోవడం జరుగుతుంది. అపుడు బ్రహ్మకున్నూ అనన్తత్వము లేకుండాపోతుంది. అనన్తత్వము అంటే – పరిచ్ఛేదము – విడదీయబడడం – వేరుచేయబడడము – లేకుండుట. ఒక్కడే బ్రహ్మ అని అనకుండా ఆయన కంటే ఇతర వస్తువులున్నాయని చెప్పే భేదవాదములో కూడ మరొక వస్తువుకంటె బ్రహ్మ విలక్షణుడు కాబట్టి వస్తువును బట్టి పరిచ్ఛేదము లేదని చెప్పడానికి వీలుకాదు. వస్తువును బట్టి పరిచ్ఛేదము అన్నపుడు బ్రహ్మకంటే వేరుగా ఉన్న మరొక్క వస్తువును బట్టి చెప్పబడుతున్నది కనుక రెండో వస్తువు ఉన్నది అని అర్థమవుతూ ఉన్నది. వస్తువుతో విడదీయబడినవాడిని దేశాన్ని బట్టి, కాలాన్ని బట్టి అపరిచ్ఛిన్నుడు అనడము సరికాదు. మరొక వస్తువు కంటే విలక్షణమైనందున వస్తువును బట్టి చెప్పబడుతున్నది కనుక రెండో వస్తువు ఉన్నది అని అర్థమవుతూ ఉన్నది. వస్తువుతో విడదీయబడిన వాడిని దేశాన్నిబట్టి, కాలాన్ని బట్టి అపరిచ్ఛిన్నుడు అనడము సరికాదు. మరొక వస్తువుకంటే విలక్షణమైనందున వస్తువును బట్టి పరిచ్ఛేదింపబడి కుండలు మొదలైనవి దేశాన్ని బట్టి కాలాన్ని బట్టి పరిచ్ఛిన్నములయ్యే కనపడ్తున్నవి. అదే ప్రకారము చేతనులందరూ బ్రహ్మ కూడా వస్తువుతో పరిచ్ఛిన్నములైనందున దేశకాలాలను బట్టి కూడా పరిచ్ఛేదింపబడుతారు. ఇంత చేసీ **సత్యంజ్ఞాన మనన్తం బ్రహ్మ** ఇత్యాదివాక్యాలనాధారంగా చేసుకొని బ్రహ్మకు అన్ని రకాలుగా పరిచ్ఛేదము లేదు అని చెప్పేవారికి విరోధము వస్తుంది. పైగా ఉత్పత్తి – పుట్టుక, వినాశము – చావు మొదలైనవి జీవులకూ బ్రహ్మకూ కలిగే అవకాశమున్నది. కాలము చేత పరిచ్ఛేదమే

ఉత్పత్తి వినాశాలను పొందుతూ ఉండడము. ఇందువల్ల ఒక్కడు అపరిచ్ఛిన్నుడు ఐన బ్రహ్మకు అవిద్య బాగా వంటబట్టడం వలన బ్రహ్మ మొదలుకొని రెల్లుగడ్డి యొక్క దంటువరకు ఉన్న మొత్తము జగత్తు కనిపిస్తున్నది. సుఖదుఃఖాలను అనుభవించడము వంటి వ్యవస్థలన్నీ స్వప్నములోని వ్యవస్థల వలె అవిద్య యొక్క లక్షణాలు / కల్పితాలు అని అవగాహన చేసుకుంటే అంతా కుదురుతుంది. అందుచేత ఒక్కడే బ్రహ్మ నిత్య, ముక్త, స్వప్రకాశ స్వభావుడు. అతడే అనాదిగా ఉంటున్న అవిద్య ప్రభావము వలన జగదాకారముతో పలురకాల అధ్యాసాలకు లోనవుతున్నాడు. కనుక పరమార్థమైన వస్తువు బ్రహ్మకంటే మరొక్కటి లేదు. అందుచేత జగత్తు ఆయనతో అనన్యమైనది.

ఇంతవరకు బ్రహ్మకే అజ్ఞానం పట్టిందని వాదించిన **"బ్రహ్మాజ్ఞానవాదిని వైశేషికుడు"** ఖండిస్తున్నాడు. ఎటువంటి విశేషాలు లేకుండా స్వయంప్రకాశుడైన బ్రహ్మ అనాదిగా ఉంటున్న అవిద్య చేత తనదైన స్వరూపము కప్పబడినందున తనలోనే అనేకములైన వస్తువులు ఉన్నవని వాటిని దర్శించుతున్నాడు. అనే ఈ మాట ప్రకాశస్వరూపుడు తనలో ఏ విభాగాలు / అవయవాలు లేనివాడు ఐన బ్రహ్మ తనదైన ప్రకాశాన్ని తొలగిపోవడమనే తిరోధానము కప్పివేయడము – ను పొందితే తనదైన స్వరూపనాశనమే – తాను లేకుండా పోవడమనేది – కలిగే అవకాశము ఉన్నది. అందుచేత తిరోధానము స్వయంప్రకాశుడైన బ్రహ్మ తిరోధానాన్ని పొందడము అసంభవము / జరుగని పని. ఇట్లాంటి కారణాల వల్లను, అన్ని ప్రమాణాలు చెపుతున్న దానికి పూర్తిగా భిన్నము తను మాట్లాడిన మాటకే విరుద్ధము అని ఇది వరకే చెప్పబడింది.

కారణం కంటే వేరుగా ఉన్న కార్యము యుక్తులచేత బాధింపబడింది కనుక ముత్యపు చిప్పలోని వెండివలె భ్రమమే అని ఏ మాట చెప్పినారో! ఆ మాట సరి ఐనది కాదు. అక్కడ యుక్తి అనేది లేదు కాబట్టి. తదుపరి కలిగే కార్యాలన్నింటిలో సంక్రమించడం / కొనసాగడం / అనువర్తమానము అవుతున్న కారణము మాత్రము సత్యము, వ్యావర్తమానాలు తొలగిపోయే – కుండ చిప్పవంటి కార్యాలన్నీ అసత్యమని అన్నారో ఆ యుక్తి కూడా ఒకచోట చూచినదాన్ని మరొకచోట లేదు అనడం వ్యావర్తమానత – బాధకము కాదు అనేటువంటి వాక్యాలతో ఇంతకు మునుపు తోసివేసినాము. ఇంకా ఏదైతే లభిస్తుండడము, నశించుతుండము అనే కారణాల చేత సదసదనిర్వచనీయమని, కనుక కార్యము మృషా/ మిథ్యా అని ఏమాట చెప్పినారో

అది కూడా సరియైన మాట కాదు. ఉపలబ్ధి వినాశాలను కలిగి ఉండడము మిథ్యాత్వాన్ని సాధించదు. కానీ అనిత్యమని తెల్పుతుంది. ఎల్లప్పుడూ ఉండే వస్తువును నిత్యము అని పిలుస్తారు. ఒకప్పుడు ఉండి ఒకప్పుడు పోతూ ఉండేదాన్ని అనిత్యము అని అంటారు. ఏ దేశములోని ఏ కాలములో ఏది లభించిందో అదే దేశములో అదే కాలములో లేదు అని బాధింపబడడమే అది మిథ్య అని అనడానికి కారణము. మరొకదేశముతో మరొక కాలముతో సమ్బన్ధము ఉండి ఉపలబ్ధమయ్యే వస్తువు అన్యదేశ అన్యకాలములో సంబన్ధము కలిగి ఉండడముతో బాధింపబడడము దేశాన్తరములో కాలాన్తరములో ఉన్నది అనే విషయాన్ని మాత్రమే సాధించుతుంది తప్ప మిథ్య అని అనబడదు. ఏ దేశములో ఏ కాలములో దొరకనప్పుడు మాత్రమే మిథ్య అని అంటాము ఒకచోట ఉండి మరొకచోట దొరుకకపోతే దాన్ని మిథ్య అని అనము. దీనికి సమ్బన్ధించి ప్రతిప్రయోగాన్ని మేము చెప్తున్నాము. విను. ఘటము మొదలైన కార్యాలు సత్యమే. దేశకాలాదులచేత ప్రతిపన్నమైన ఉపాధియందు బాధింపబడలేదు కాబట్టి. ఆత్మ వలెనే అని.

ఇంకొకమాట చెప్పినారు. వికారాన్ని పొందిన, లేక పొందని కారణమైన దానినుండి కార్యోత్పత్తి జరుగదు. అని, అది సత్యము కాదు. దేశము కాలము, సహకారి కారణమనబడే పనిముట్లతో కలసినప్పుడు పని జరుగుతూనే ఉన్నది. కార్యము ఉత్పత్తి అవుతూనే ఉన్నది. వాటితో సమన్వయము వికృతము, అవికృతము ఐన దానికి కలుగదు అని కూడా అన్నారు. అదీ తగనిదే. తొలుత వికారాన్ని పొందనిదానికే కాలాదులతో సమన్వయము ఉంటున్నది కదా! అవికృతమైన దానికంటే ముందు కూడా దేశకాలాదులతో సమన్వయము ఏర్పడవచ్చును కదా! అని మీరనవచ్చు. కానీ దేశకాలాదుల సమన్వయము ఇతరకారణాలైన ఈశ్వరుని సంకల్పము వికారము చెందడానికి అవసరమైన కర్మ / క్రియలతో సంబన్ధించి ఉన్నది. కానీ వికారాయత్తము కాదు. కనుక దేశకాలములు మొదలైన వానితో సమన్వయమవడం అనే విశేషాన్ని పొందిన కారణమే కార్యాన్ని పుట్టించుతుంది. కనుక మేము చెప్పిన మాటలో దోషము ఏమీ లేదు. కారణము అనేది కార్యానికి అబాధితమైన ఆరంభకము. అంటే కారణమైన బంగారము లేకుండా మిగతావి ఎన్ని ఉన్నా నగలు తయారుకావడం లేదు. ఇది లోకంలో అన్నిచోట్లా కనిపిస్తున్నది. ఇట్లాగా ప్రసిద్ధమైన దాన్ని ఏ ప్రకారంగా కూడా కప్పిపుచ్చలేరు.

వట్టి బంగారము, బిళ్ళలుగా మారి కారణముగా నున్నది, కార్యాన్ని ఆశ్రయించిన ద్రవ్యము మాత్రమున్నూ హేమాదులకు ఆరంభకము కాదు అని అన్నమాటా తగనిదే. కేవల బంగారము మాత్రమే దేశకాలాదులు జతపడినప్పుడు నగలుగా మారడానికి హేతువు అవుతున్నది. కారణమైన బంగారము కంటే వేరయిన కార్యము కనపడడం లేదు అని చెప్పకూడదు. హేమము కంటే వేరుగా ఉన్న స్వస్తికము కనిపిస్తున్నది కదా! బుద్ధి (తెల్సుకోవడము) వస్తువు వేరని తెల్సినపుడు దాన్ని వ్యవహరించడానికి మరొకనామవాచకమైన శబ్దాన్ని ప్రయోగించడము మొదలైనవాటి ద్వారా అది మరొక (పూర్వము తెలిసిన వస్తువుకాదని) వస్తువు అని ఇంతకు ముందే మేము సాధించి చూపినాము. ఈ మరొక వస్తువు అని అనడము ముత్యపు చిప్పలోని వెండి వలె భ్రమకాదు. ఉత్పత్తి వినాశాలకు నడుమ ఉన్న కాలంలో లభిస్తున్నందువల్ల ఆ దేశకాలాలతో సమ్బన్ధము కలది కాబట్టిన్నీ బాధ కనపడడంలేదు. ఈ విధంగా లభించే దానిని బాధించేదైన యుక్తి ఏదీ కూడా లేదు. ఇంతకుముందు లభించని స్వస్తికము ఇపుడు లభిస్తుంటే ఇది హేమము అనే ప్రత్యభిజ్ఞస్వస్తికను ఆశ్రయించినందువల్ల బంగారము యొక్క అనువృత్తి / సంక్రమించుట / కి విరుద్ధము కాదు. వేదాన్త వాక్యప్రమాణాలచేత ప్రపంచము మిథ్య అని అనడానికి సాధనమైన కారణములను కొట్టివేయడము జరిగింది. ఇంకా ఈ సందర్భములో ప్రత్యక్షానికి విరోధము లేదని చెప్పవలసినదంతా ఇంతకుముందే చెప్పబడింది. అంటే ప్రత్యక్షము జగత్తు ఉన్నదని చెపుతున్నది. శాస్త్రం బ్రహ్మ ఒక్కడే ఉన్నాడని చెపుతున్నది ఈ రెండింటికి విరోధము ఉన్నది అని అద్వైతిమతము. ఆ మాట తప్పు శాస్త్రము చెప్పుతున్నదాన్నే ప్రత్యక్షప్రమాణము చూపిస్తున్నది అని విరోధము లేకపోవడాన్ని ఇంతకుముందే పెద్దలు నిరూపించినారు అని.

ఇంకా ఒక్క ఆత్మతో శరీరాలన్నీ ఆత్మలన్నీ ఆత్మలను కలవి అవుతున్నాయి అని ఏ మాట చెప్పినారో అదిన్నీ అసత్యమే. ఒక్క ఆత్మకే అన్ని శరీరాలకు చెందిన సుఖదుఃఖాలను అనుభవించాల్సి వస్తుంది. ఇందుకు ఉదాహరణము ఇది. సౌభరి మహర్షివంటి విలక్షణజ్ఞానులైన వారు ఆత్మ ఒకటే ఐనా అనేక శరీరాలకు సమ్బన్ధించిన సుఖదుఃఖాలను అనుభవించడం కనిపిస్తున్నది. అహమర్థమైన మనస్సుజ్ఞాతృత్వము కలది కాబట్టి ప్రతిశరీరానికి అది విడివిడిగా ఉంటుంది కాబట్టి సుఖదుఃఖాలనుభవము ఉండదు **ఆత్మభేదమువల్ల కాదు అని చెప్పడానికి** వీలులేదు. ఆత్మజ్ఞానము కలవాడే.

అతడే అహమర్థము నేను అని భావించేవాడు. మనస్సు అన్తఃకరణము అనబడేది జడము. దానికే అహంకారమని మరొక పేరు. అది జీవుడికి ఒక భోగసాధనము. శరీరము ఇంద్రియాల వలెనే జ్ఞాతకాదు అని మునుపే ఉపపాదించినాము. శరీరాలన్నీ కూడా, శరీరములు (నశించేవి) జడము, కార్యములు, కల్పింపబడినవి కావడం చేత ఒక్క అవిద్య చేతనే కల్పింపబడినవి అని ఏ మాట పలికినారో అది కూడా సర్వ శరీరాలు అవిద్య చేతనే కల్పితాలు కావు గనుక తప్పుడు మాటనే అవుతున్నది. కల్పితం కాకపోవడమనేది అబాధితము – దేని చేత కూడా కాదు లేదు అనబడకుండడము అని, సత్యము అనీ ఉపపాదించినాము. చేతనుడి కంటే తక్కినదంతా జడము అని కనిపిస్తున్నది కనుక చేతనులందరూ ఒక్కటే. అనన్యులే అని అన్నారో ఆ ముచ్చట కూడా సుఖదుఃఖవ్యవస్థను ఆధారంగా చేసుకొని భేదాలు ఉన్నాయి ఆత్మలలో అని ఉపపాదించినందువల్ల కొట్టివేయబడుతున్నది. ఈ శరీరాలన్నీ నావల్లనే ఆత్మలను కలవిగా ఉన్నాయి. నాయొక్క అవిద్య చేతనే కల్పింపబడినవి. నేనే ఈ చేతన సముదాయమంతా అని ఆత్మలకు ఏ ఐక్యాన్ని ఉపపాదించినారో అది తమ సిద్ధాన్తము యొక్క స్వరూపాన్ని తెలియనందువల్ల భ్రాన్తితో పలికిన పలుకు మాత్రమే. నీ మతంలో నేను నీవు అనబడే అర్థాలకంటే వస్తువుల కంటే – విలక్షణమైనది కదా చిన్మాత్రమైన ఆత్మ.

ఇంకా నిర్విశేష చిన్మాత్రమైన దానికంటే మిగిలింది అంతా మిథ్య అని చెపుతున్న నీవు మోక్షము కొరకు ఆచార్యులను ఆశ్రయించి బ్రహ్మ తత్వాన్ని వినాలను కోవడం అందుకోసం ప్రయత్నించడము అంతా దండుగమారిపనే. అదంతా అవిద్యాకార్యము కాదా! ఎట్లాగంటే ముత్యపు చిప్పలో ఉన్నట్టు కనిపిస్తున్న వెండిని చేతిలోకి తీసుకోవడానికి ప్రయత్నించిన తీరుగా ఉన్నది కాబట్టి. పైగా మోక్షాని కొరకై చేసే ప్రయత్నమూ వ్యర్థమే. అవిద్య చేత కల్పించబడిన ఆచార్యునికి స్వాధీనమైన జ్ఞానము యొక్క కార్యము కాబట్టి **శుకుడు ప్రహ్లాదుడు వామదేవాదుల ప్రయత్నము వలె. తత్త్వమ స్యాదివాక్యాల వల్ల పుట్టిన జ్ఞానము సంసారబన్ధాన్ని తొలగించేది కాదు.** అవిద్య చేత కల్పించబడిన వాక్యము వలన పుడుతున్నది కాబట్టి. పైగా అది స్వయంగా అవిద్యా ఆత్మకము. అవిద్యా కల్పితమైన జ్ఞాతను ఆశ్రయించి ఉన్నది. అవిద్యాకల్పితుడైన ఆచార్యునికి వశమై, ఆయన చెప్పినందువల్ల వినడంతో పుడుతున్నందువల్ల కలలోని బన్ధాన్ని – కట్టుబడిని – తొలగించే వాక్యమువల్ల పుట్టిన జ్ఞానము వలె.

ఇంకా నిర్విశేష చిన్మాత్రమైన బ్రహ్మ మిథ్య. అవిద్యాకార్యమైన జ్ఞానము చేత తెలియబడేవాడైనందువల్ల. అవిద్య చేత కల్పించబడిన జ్ఞాతను ఆశ్రయించిన జ్ఞానము చేత తెలుపబడుతున్నందువల్ల. అవిద్యాత్మకమైన జ్ఞానము చేత చేరదగిన వాడవడము వల్ల. ఏది ఇట్లున్నదో అది అట్లవుతుంది. ఎట్లాగంటే కలలో కనిపించిన గంధర్వుల నగరాదులవలె. **పై రెండు పేరాలలో చెప్పబడిన వాక్యాలన్నీ తార్కిక, అనుమాన ప్రమాణాలు ననుసరించి చేసిన ప్రయోగాలు. ప్రతిదానిలోనూ ముందుగా ప్రతిజ్ఞ, హేతువు దృష్టాన్తాలు చూపబడుతున్నాయి. వాటిని అవగాహన చేసుకోవాలి.**

నిర్విశేష చిన్మాత్రమైన బ్రహ్మ స్వయంగానే ప్రకాశిస్తాడు. ఆయన ఇతర ప్రమాణాల సాయాన్ని కోరడు. ఏదైతే ఆత్మను సాక్షిగా కల్గిన స్వయం ప్రకాశజ్ఞానము కనిపిస్తున్నదో అది జ్ఞేయము నందు ఒకానొక విశేషము సిద్ధించేదిగా ఉండి జ్ఞాతలోనే ఉంటుంది అని మునుపే చెప్పినాము. (జ్ఞేయము – తెల్సుకోబడేది వస్తువు, దానిలో విశేషము – మిగతా వస్తువులలో లేకుండా ఈ ఒక్కదానిలో మాత్రమే ఉండి వాటికంటే ఇది వేరు ఐనది అని నిర్ధారించేది – అది సిద్ధించడము అంటే బుద్ధికి అందడమే. అది జ్ఞాతలో మాత్రమే ఉండి అతని యొక్క మాటల్లో చేతల్లో వెల్లడి ఔతుంది). ఆ జ్ఞానము నిర్విశేషము అని యుక్తి యుక్త జ్ఞానాలు ఏవి చెప్పబడినాయో అవన్నీ వెంటనే చెప్పిన అవిద్యాకార్యత్వాత్ ఇత్యాదులైన అనుమానాలతో హేతువులతో దూరము చేయబడినవి. నిర్విశేషమైన చిన్మాత్రానికి అజ్ఞాన సాక్షిత్వము నేను అనే అహంకారాదులైన జగత్ భ్రమ కూడా పొసగదు. సాక్షిత్వము భ్రమాదులన్నీ కూడా జ్ఞాతలో ఉండే విశేషాలుగా కనపడుతున్నవి. కేవలము జ్ఞానములోనివి కావు. అట్లాంటి నిర్విశేష చిన్మాత్రానికి ప్రకాశత్వము, స్వాయత్తప్రకాశతా – తనంతట తానుగా వ్యవహారయోగ్యమై ఉండడము – సిద్ధించదు. ప్రకాశమంటే ఒకానొక పురుషుడికి ఏదో ఒక విశేషాన్ని కల్గిన వస్తువును గురించి స్వయంప్రకాశత అని మీరు ఉపపాదించినారు. కనుక అటువంటి విశేషము లేని వస్తువుకు ప్రకాశత్వము కలుగదు.

మీరు మీ చెప్పుచేతల్లో ఉండేవారి నడుమ కూర్చుని యధార్థము కాని వస్తువు నుండి కూడా పరమార్థమైన వస్తువు పుట్టుకొస్తుంది అని గొంతెత్తి బిగ్గరగా ప్రకటించెడివారో అది కూడా **అవన్నీ పనులు అబాధితములైనవాటితో సమానాలు. వ్యావహారిక సత్యాలు. యధార్థానికైతే అవిద్యాత్మకాలే** అని మీ అంతట మీరే ఒప్పుకున్నారు గనుక నిరస్తమై పోయింది. ఎక్కడైనా పరమార్థమైన దాన్నుండే

కారణాన్నుంచే అన్ని కార్యాలు పుడుతాయని ప్రతిపాదించే వారమైన మాచే మునుపే నిరసించబడింది. ఐతే మేము చెప్పిన ఈ అనుమానాలకు శ్రుతి విరోధము వస్తుంది కదా అని శ్రుతుల విరోధాన్ని చెప్పలేరు. మీరు చెప్పినట్లు శ్రుతి కూడా అవిద్యాకార్యము అవిద్యాత్మకము కాబట్టి చూపబడిన దృష్టాన్తాలకంటే విశేషము లేక దానితో సమానము ఔతున్నది.

బ్రహ్మ అపారమార్థికమైన జ్ఞానము చేత తెలియబడినా తరువాతి కాలములో ఆవేదము అవిద్య నుండి పుట్టింది. కనుక దాని మాటలు సత్యాలు కావు అనే బాధ కలిగినా బ్రహ్మ మాత్రము సత్యమే అని మీరన్నమాట సరైనది కాదు. చెడ్డ / తప్పుడు కారణము వలన పుట్టిన జ్ఞానముచే తెలుపబడినవాడు / ది అని నిశ్చయము చేసినాక ఆ తరువాత కలిగే బాధా దర్శనము వలన కలిగే ప్రయోజనము ఏముంటుంది? ఎట్లాగంటే శూన్యమేతత్త్వము అని చెప్పే వాక్యజన్యజ్ఞానానికి తరువాతి కాలంలో బాధ కనపడినా / తెల్సినా, ఆ జ్ఞానము దోషము కారణంగా పుట్టిందని నిశ్చయించినందు వల్ల ముందుగా తెల్సిన జ్ఞానము అసత్యము. నిజము కాదు అని తేలుతుంది. ఇంకా **నేహనానాఽస్తికించన, విజ్ఞాన మానందం బ్రహ్మ.** అనే వాక్యాల ద్వారా విజ్ఞానానికంటే వేరుగా ఉన్న వస్తుసముదాయమంతా నిషేధింపబడిన తర్వాత అన్నింటికంటే చివరగా బాధాదర్శనము చెప్పబడుతున్నది. శూన్యమే తత్వమని చెప్పి తరువాత అది కూడా లేదని చెప్పేది పరము / బలీయము అవుతున్నందున దాని ద్వారా బాధ కనిపించుతున్నది. ఏవీలేవు అని అన్నింటినీ నిషేధించిన తరువాత ఇంకా నిషేధించడానికి మిగిలిందేదీ లేదు కనుక దానికే శూన్యవాదానికే బాధదర్శనము అవుతుంది. అనగా ఏమీ లేవు అన్నదాన్ని తప్పు అని చెప్పితే అన్నీ ఉన్నవి అన్నట్లే ఔతుంది. దానివల్ల కలిగేదేమిటంటే ప్రత్యక్షాదిప్రమాణాలన్నీ దోషమూలాలు / దోషముపై ఆధారపడినట్టివి, దుష్టాలు ఐన ఇంద్రియాల ద్వారా జ్ఞానాన్ని కలిగించేవి అవుతవి. అదే తీరుగా తనకు తానే ప్రమాణము ఐనట్టిది, దోషాలు లేనిది ఐన వేదాన్త శాస్త్రము చేత పుట్టిన సర్వశూన్య జ్ఞానము మిగతా ప్రమాణాల ద్వారా తెలియవచ్చిన జ్ఞానాలతో సమానంగా దోష భూయిష్టమే – తప్పుల తడకనే అవుతుంది.

కనుక విజ్ఞాన స్వరూపము ఐనదంతా, యధార్థమైన జ్ఞాతలో ఉన్నటువంటిది. స్వయంగా సత్యమైన అర్థ విశేషాలను తెలియజేసేది. అటువంటి జ్ఞానములో కొంత జ్ఞానము దోషాల వల్ల కల్గినటువంటిది. ఆ దోషము కల్పితము కాక యధార్థమైనది.

కొంత జ్ఞానము దోషము లేనిది. సత్యాలైన కారణాలచేత కలిగినటువంటిది. అని ఎంతదాకా మీరు ఒప్పుకోరో అంతదాక ఇది సత్యార్థము. ఇది మిథ్య ఐన అర్థము అనే వ్యవస్థ ఏర్పడదు. లోకములో వ్యవహారము కూడా జరుగదు. సాధారణంగా లోకవ్యవహారము అది పారమార్థికమైనా లేక భ్రాన్తిరూపమైనదైనా పారమార్థికమైన జ్ఞాతలో ఉన్న అర్థవిశేషాన్ని తెలియజెప్తూ ఆ విశేషాన్ని కలవాడుగా అతడిని తెలియజేస్తుంది. (**పారమార్థిక జ్ఞాతృగత అర్థవిశేషసిద్ధిరూప ప్రకాశపూర్వకాం** = మన మాటల్లో చెప్పుకుంటే మానవుడు పరమార్థము అంటే నిజంగా ఉన్నవాడు అవిద్య చేత కల్పింపబడిన ఊహాజనిత వ్యక్తికాదు. అతనికి జ్ఞానము తెలివి ఉన్నది. దానితో యధార్థమైన ప్రపంచములోని వస్తువులను చూస్తాడు ఇది ఆవు. ఇది గొఱ్ఱె అని వాటికి ఉండే లక్షణాలను బట్టి గుర్తించుతాడు. రెండు వేరు వేరు ఆకారాలను కల్గి ఉన్నవి. స్వభావాలను కల్గి ఉన్నవి అనిన్నీ గుర్తించుతాడు. దీనికి ఇది పేరు. దానికి అది పేరు. అని తెల్సుకొని వ్యవహరిస్తాడు. అందువల్ల అతడిని జ్ఞానము కలవాడు కనుక జ్ఞాత అని తెల్సుకుంటాము, ఆయా వస్తువులను చూచినప్పుడు వాటిలోని భేదాలను గుర్తించినపుడు అర్థాలలో ఉండే విశేషాలను తెలిసి ఉన్నాడని అంటున్నాము. ఆ విధంగా జ్ఞాతలో ఉన్న అర్థ విశేషాలను తెలిసి ఉన్నాడని అంటున్నాము. ఆ విధంగా జ్ఞాతలో ఉన్న అర్థ విశేషసిద్ధిరూపము తెలుస్తుంది. ఇపుడు అతడిని తెల్సినవాడు అని అంటున్నాము. అందుకు కారణం ఆయనలో ఆ విధమైన జ్ఞానము ఉండడమే. సందర్భము వచ్చినపుడు దాన్ని మాటల్లో చేతల్లో ప్రదర్శిస్తాడు. అదే ప్రకాశము దాన్ని ఆధారంగా చేసుకొనే వ్యవహారము జరుగుతుంది. అది పారమార్థిక జ్ఞాతృగత అర్థ విశేష సిద్ధిరూప ప్రకాశపూర్వకము అనబడుతుంది.)

నిర్విశేషసన్మాత్రుడు పరమార్థమైన వాడైనా, అపారమార్థికుడైనా అతడిని వ్యవహరించడానికి హేతువు / విశేషము లేదు కాబట్టి – తక్కినవారిలో ఏదో ఒక విశేషము ఉన్నట్లు ఇతడిలో ఏమీ లేదు కాబట్టి – లోకములోని వారు ఇతడితో వ్యవహారము చేయజాలరు. నిర్విశేషునికీ జరుగదు. విశేషాలకు అధిష్ఠానము లేకుండా భ్రమ కలుగదు కాబట్టి, అన్ని అధ్యాసాలకు అధిష్ఠానమైన సన్మాత్రుడు మాత్రము పరమార్థము ఆయన మీద ఆరోపించిన / కల్పించిన విశేషాలన్నీ అపరమార్థాలు, అని మీరు చెప్పినారు. అది కూడా దోషము దోషాశ్రయత్వము జ్ఞాతృత్వము జ్ఞానాలు అనేవి అపరమార్థాలే ఐనా భ్రమ కలుగడానికి ఆటంకము ఏమీ ఉండదు కాబట్టి అధిష్ఠానము

– దోషము, భ్రమ దేనిపై ఏర్పడుతుందో ఆ వస్తువు లేక వ్యక్తి – నిజముకాకపోయినా భ్రమ కలుగుతూనే ఉన్నది కనుక తోసి వేయబడింది. ఇక అధిష్ఠానము అపరమార్థము ఐనప్పుడు భ్రమ ఎక్కడా కనపడడములేదు. కనుక సన్మాత్రము పరమార్థము అనే తప్పక ఒప్పుకోవాలి అని అంటున్నావా! అయ్యో! అప్పుడు దోషము దోషాశ్రయత్వము జ్ఞాతృత్వము జ్ఞానములు అపరమార్థాలు ఐనా భ్రమ ఎక్కడా చూడలేదు. కనుక దర్శనానుసారము (దర్శనము శాస్త్రము, ప్రత్యక్ష ప్రమాణము) వాటిని కూడా పరమార్థాలే అని తప్పక ఒప్పుకోవాలి. కనుక నీ వాదమంతా హడావిడీ చేయడము నేను బట్టిందే కుందేలు అన్నట్లు పట్టుదల మాత్రమే తప్ప విశేషము ఏమీలేదు.

పరమాత్మకంటే ఇంకా చాలామంది జీవులున్నారని భేదవాదాన్ని అంగీకరించినా గడిచిపోయిన కల్పాలు ఎన్నో తెలియవు. అనన్తాలు. కావున ఆత్మలందరూ ముక్తులు ఐపోయినారు. ఇంకా సంసారములో బద్ధుడైన వాడు ఒక్కడూ ఉండడు. కాబట్టి బద్ధుడు ముక్తుడు అనే వ్యవస్థ చెల్లదు అని మీరు వాదించిన విషయము కల్పాలు అనన్తాలు ఐనట్టే జీవులు కూడా అనన్తము లైన వారే కనుక ఇంకా కొంతమంది ఉండనే ఉంటారు అందువల్ల మీ మాటను పక్కకు పెడుతున్నాము. ఒప్పము.

ఆత్మలు అనన్తములు ఐనప్పుడు అవి అన్నీ పరస్పరము వేరువేరు కాబట్టి మినుములు ఆవాలు కుండలు బట్టగుడ్డలవలె ఎంతొకొంత పరిమితి కలిగి సంఖ్యకలవాళ్ళు – ఇంతమంది అని సంఖ్యావత్త్వము తప్పనిసరిగా తేలుతుంది అని చెప్పిన మాట కూడా తప్పే. కుండలు మొదలైనవి కూడా అనన్తాలే కనుక దృష్టాన్తము సాధ్యవికలము అవుతుంది. ఒక విషయాన్ని ఏదో ఒక ఉదాహరణ/ దృష్టాన్తము, బింబప్రతిబింబాలలో సరిగ్గా సరిపోయేదాన్ని చెప్పి ఇది ఫలానా అని నిర్ణయించుతారు. ఇక్కడ సంఖ్య కలవి అని చెప్పిన కుండలు ఎన్నోతెలువడం లేదు. ఆత్మలు కూడా అంతే. కానీ పూర్వపక్షి ఇంత సంఖ్యగలవి అని దాన్ని చూపి ఆత్మలు కొంతమందే అని సాధించబోయినాడు. కాని అది కుదరడం లేదు. ఆత్మలు ఎక్కడో ఒక దగ్గర ఉంటే కష్టపడి ఐనా లెక్కించవచ్చు. కానీ అవి విశ్వమంతటా ఉన్నాయి కనుక వాటిని ఎంచడము అసాధ్యం అందుచేత దృష్టాన్తము పూర్వపక్షి సాధించదల్చుకున్న అంశాన్ని సాధించలేకపోయింది. కనుక సాధ్యవికలము. ఐతే పది కుండలు, వెయ్యి మినుపగింజలు అని సంఖ్య కనపడుతున్నది గదా! అని అంటే. నిజమే. ఆ సంఖ్య ఘట స్వరూపాలన్నిటికీ చెందినది కాదు. ఒక దేశములో ఒక కాలములో ఉన్న

ఘటాలకు సంబన్ధించిందే. ప్రపంచమంతా ఉన్నవాటికి చెందింది కాదు. ఆ విధమైన సంఖ్యావత్త్వమును ఆత్మల విషయములో మేము కూడా తప్పక ఒప్పుకుంటాము. అంతమాత్రం చేత ఆత్మలందరికి ముక్తిరావడమనే ముచ్చటలేదు. ఆత్మలు అనన్తములైనవి కదా! ఐతే ఆత్మలు పరస్పరము భిన్నములు / వేరువేరు ఐనట్లయితే కుండలు మొదలైనవాటివలె జడత్వము, ఆత్మలు కాకపోవడము నశించడము అనే దోషాలు వస్తాయని మీరు పలికిన పలుకు తప్పు. ఒక జాతికి చెందినవాటిలో ఉన్న భేదము ఆ జాతి వాటికి ఇతర జాతీయత్వాన్ని తెచ్చిపెట్టదు. లోకంలో ఎక్కడైనా కుండల్లో ఉండే భేదము మరొకజాతికి చెందినవాటినిగా బట్ట గుడ్డలుగా, లేదా మరొకటినిగా వ్యవహారాన్ని ఎవ్వరూ చెయ్యడం లేదు. ఎన్ని భేదాలు ఉన్నా ఒడ్డూ, పొడవు ఉన్నా దాని ఆకారాన్ని బట్టి అది కుండ అనియే వ్యవహరింపబడుతున్నది. వాటిలోని భేదము పటత్వాన్ని తెచ్చిపెట్టడం లేదు.

భేదాన్ని అంగీకరించితే వస్తువుతో మరొక వస్తువు వేరుచేయబడుతుంది. అదే మాదిరిగా దేశకాలాలను బట్టి కూడా బ్రహ్మకు పరిచ్ఛేదం ఏర్పడుతుంది. అప్పుడు బ్రహ్మ అనన్తుడు – అంతము లేనివాడు. అని అనడం కుదరదు. అని వాదించిన విషయమున్నూ సత్యముకాదు. తగనిదే వస్తువులను ఆధారంగా చేసుకొని పరిచ్ఛేదము చేయబడిన వాటికిన్నీ తక్కువ ఎక్కువలతో ఇన్నే ఉండాలనే నియమము లేదు కాబట్టి దేశ కాలాలను బట్టి ఏర్పడిన ఇంతమొత్తము / ఇంత పరిమాణము అనెడిది ఇతర ప్రమాణాలపై ఆధారపడి నిర్ణయించేదైనందున సర్వదేశకాలాదులతో సంబన్ధము కలవాడు ఐనా ఇతర ప్రమాణాలతో వచ్చే ముప్పు లేదు. వస్తువుతో పరిచ్ఛేదము ఉన్నంద మాత్రాన అన్నిరకాల పరిచ్ఛేదాలు లేనివాడని అనలేము కనుక ఆనన్త్యానికి ధోకా లేదని అనకూడదు అని అంటారా! అట్లయితే అవిద్యకంటే బ్రహ్మ విలక్షణుడు అని పలికే మీకు కూడా సమానమే. అనగా సన్మాత్రుడైనవానికి అవిద్య కంటే విలక్షణుడు అని ఒప్పుకున్నందున్న బ్రహ్మ కూడా భిన్నుడు – బ్రహ్మ అవిద్య కన్న వేరయినవాడు – ఐనందువల్ల భేదము కారణంగా వచ్చే దోషాలు అన్నీ – జడత్వము, అనాత్మత్వము, క్షయిత్వము వంటివి అంటుకుంటాయి. అందుకని అవిద్యకంటే విలక్షణుడు కాదని తలవంచితే అప్పుడు బ్రహ్మ అవిద్యాత్మకుడు / అవిద్యకంటే వేరుకాక అవిద్య కలవాడే అవుతాడు. జ్ఞానస్వరూపము దూరమవుతుంది. ఆపైన **సత్యం జ్ఞానమనన్తంబ్రహ్మ** అనే వాక్యము అర్థము లేనిదౌతుంది అంటే అది బ్రహ్మను గురించి తెలిపే లక్షణవాక్యము కాబట్టి చెప్పేది ఒకటి ఆచరణలో కనపడేది మరొకటి అయ్యి పొరపాటు అర్థాన్ని

తెలిపేది అపార్థకము అవుతుంది. భేదతత్త్వాన్నే అంగీకరించకపోతే స్వపక్షాన్ని కాపాడుకోవడానికి, ఎదుటి పక్షాన్ని పక్కన పెట్టడానికి అవసరమైన సాధనాలు, దూషణలు ఏవో తెల్సుకొనే వివేకము / తెల్విలేదు కాబట్టి మీవాదమంతా అసమంజసమే అవుతుంది. బ్రహ్మకు ఉన్న అనన్తుడనే ప్రసిద్ధి దేశకాలముల చేత పరిచ్ఛేదము లేకపోవుటవల్లనే కాదు వస్తువును బట్టి కూడా పరిచ్ఛేదము లేకుండుటవల్లనే వచ్చింది. అంతేకాని ఎటువంటి పరిచ్ఛేదము లేకపోవుట అనేది కాకుండా ఒకదానివల్ల పరిచ్ఛేదము మరొకదాని వల్ల పరిచ్ఛేదము లేకపోవుట అనే రెండు లక్షణాలవల్ల కాదు. ఏదో ఒక లక్షణాన్ని బట్టి వైలక్షణ్యము వస్తుంది. అట్లాకాదనుకుంటే అది కుందేటి కొమ్ము వంటిది అవుతుంది. అటువంటిది ఎక్కడా దొరుకదు. ఇక భేదము ఉన్నది అని వాదించేవాళ్ళకైతే చిదచిద్ వస్తువులన్నీ బ్రహ్మకు శరీరమవుతున్నందున అన్నీ తనకు విశేషణాలే అవుతున్నాయి కనుక తన నుండి కానీ, వేరయిన మరొకడివల్లగానీ పరిచ్ఛేదము లేదు.

ఇట్లా చూపెట్టిన కారణాలవల్ల కారణం కంటే భిన్నమైన కార్యమైన జగత్తు సత్యమే కాబట్టి బ్రహ్మ యొక్క కార్యమైన ఈ సమస్త జగత్తూ బ్రహ్మ కంటే వేరయినదే అని పూర్వపక్షము సిద్ధమైతే దానికి సమాధానమును చెపుతున్నాము. తదనన్యత్వం ఆరంభణ శబ్దాదిభ్యః – బ్రహ్మకంటే వేరైనది కాదు. ఆరంభణశబ్దాదులవల్ల.

తస్మాత్ – పరమకారణుడైన బ్రహ్మకంటే అనన్యత్వం జగము వేరుకాక పోవడమనేది దాన్ని ప్రతిపాదించే ఆరంభణ శబ్దాదుల వల్ల తెలుస్తున్నది. ఆరంభణ శబ్దము ఏ వాక్యాలకు మొదట ఉన్నదో అవి ఆరంభణశబ్దాలు **1) వాచా ఆరమ్భణం వికారో నామధేయం మృత్తికాఇత్యేవసత్యం.** మాటతో ఆరంభించడం వికారము వేరు మట్టి అనేది మాత్రము సత్యమైన వస్తువు **2) సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్ ఏకమే వాద్వితీయం తదైక్షత బహుస్యాం ప్రజాయేయేతి. తత్తేజోఽసృజత. 3) అనేన జీవేనాత్మనాఽనుప్రవిశ్య 4) సన్మూలాః సోమ్య! ఇమాః సర్వాః ప్రజాః సదాయతనాః... ఐతదాత్మ్యమిదం సర్వమ్. తత్ సత్యమ్. సఆత్మా. తత్త్వమసిశ్వేతకేతో!** 4) ఓ సోమ్యుడా! ఈ పుట్టుక కలవారు అందరూ సత్ శబ్దముచేత చెప్పబడేవాడినే మూలకారణముగా (ఉపాదాన) కలవారు. ఆయనపైననే ఆధారపడి బ్రతుకుతున్నారు. ఈ కనిపించేదంతా ఈయనను ఆత్మనుగా కల్గిఉంటున్నది. ఆయన సత్యమైనవాడు. ఆయననే ఆత్మ. నీవు కూడా ఆయననేఐ ఉన్నావయ్యా శ్వేతకేతో ఇటువంటివి. వేరే ప్రకరణాలలో ఉన్నా అవి

ఈ విధంగా జగత్కారణాన్ని తెలిపిడి చేసేవే కనుక ఇక్కడ వాటిని కలుపుకోవాలి అని అభిప్రాయము. ఇవి కదా! చిదచిదాత్మకమైన జగత్తుకు పరబ్రహ్మకున్నూ అనన్యత్వాన్ని ఉపపాదించుతున్నాయి. అదెట్లంటే – **స్తబ్ధోఽసి. ఉతతమాదేశమప్రాక్ష్యః. యేనాశ్రుతం శ్రుతం భవతి. అమతంమతం అవిజ్ఞాతం విజ్ఞాతమ్.** స్తబ్ధుడుగా ఉన్నావు. (మొద్దువలె కదలిక మెదలిక లేకుండా) నీవు మీ గురువుగారి ఆ ఆదేశమును (బ్రహ్మను) గురించి అడిగినావా? ఎవరివల్లనైతే విననిదంతా విన్నట్టు అవుతుందో! మననము చేయబడనిది మననము – మతము అవుతుందో, దేన్ని తెల్సుకుంటే తెలియనిది అంతా తెలియవస్తుందో దాన్ని. అని జగత్తు మొత్తానికి బ్రహ్మ ఒక్కడే కారణము కారణం కంటే కార్యము వేరుకాకపోవడాన్నీ మనసులో పెట్టుకొని కారణమైన బ్రహ్మను గురించి తెల్సుకోవడంద్వారా కార్యమైన ఈసమస్తానికి చెందినవిజ్ఞానమంతా తెలియవస్తుందని ప్రతిజ్ఞ చేయగా ఈ సమస్త ప్రపంచానికి బ్రహ్మ ఒక్కడే కారణమనే విషయం తెలియని శిష్యుడు **కథంను భగవః సఆదేశః.** ఓ పూజ్యుడా! ఆ ఆదేశము – ఉపదేశము – బ్రహ్మ కారణము ఎట్లా అవుతాడు అని ఒకదాన్ని గురించి తెల్సుకుంటే మరొకదాన్ని గురించి ఎట్లా తెలుస్తుంది? అది అసంభవము అనే ఉద్దేశముతో ప్రశ్నించగా! జగత్తుకు బ్రహ్మ ఒక్కడే కారణమనే విషయాన్ని ఉపదేశించపూనుకొని లోకప్రతీతి ద్వారా నిర్ణీతమైన కారణము కంటే కార్యము వేరుకాదు అనే అనన్యత్వాన్ని **యథాసోమ్యఏకేనమృత్ పిండేన సర్వం మృణ్మయం విజ్ఞాతంస్యాత్.** ఓ సోమ్యుడా! ఒక్క మట్టిముద్దను గురించి తెల్సుకుంటే మట్టితో నిండియున్న, మట్టితో చేయబడిన వస్తువులన్నీ ఎరుకపడుతాయో అనే ఉదాహరణతో చూపిస్తున్నాడు. ఎట్లాగైతే మట్టిముద్దతో చేయబడిన కుండ, చిప్ప వంటివి అన్నీ మట్టి అనబడే ఆ ద్రవ్యము కంటే వేరు ద్రవ్యానికి చెందినవి కావు అని దేన్ని – ఏ కారణాన్ని – తెలుసుకుంటే తెలుస్తుందో ఆ జ్ఞానాన్ని గురించి అడిగినావా? అని.

ఇక్కడ కాణాదులు – వైశేషికుల యొక్క వాదం ప్రకారము కారణం కంటే కార్యము మరొక ద్రవ్యమే అని శంకించి లోకంలో ఉన్న ప్రసిద్ధిని బట్టే కారణాన్నుంచి కార్యము వేరుకాదు అనే విషయాన్ని (సూత్రకారుడు) **వేదపురుషుడు** ప్రతిపాదిస్తున్నాడు. **వాచారంభణం వికారోనామధేయం మృత్తికేత్యేవ సత్యమ్** అని. ఆరభ్యతే – ఆలభ్యతే – స్పృశింపబడుతున్నది కనుక ఆరంభణమ్ అనబడుతున్నది. రలయోరభేదః – రలలకు భేదము లేదు. కృత్యల్యుటోర్బహులమ్ అనే పాణిని సూత్రము ప్రకారము కర్మార్థములోల్యుట్ ప్రత్యయం వచ్చింది. దానితో ఆరంభణం అనే పదము ఏర్పడింది.

వాచా – వాక్ పూర్వకమైన వ్యవహారముతో అనగా కారణముతో హేతువుతో అని అర్థము. కుండతోనీళ్ళను తీసుకొనిరా! వంటి వాక్కులతో నీళ్ళను తీసుకుని రావడమనే వ్యవహారము జరుగుతున్నది. ఇట్లాగే మిగతా అన్నీ. ఆ వ్యవహారము నడువడానికి – పని జరుగడానికి అదే మట్టి అనబడే ద్రవ్యముతో గుండ్రంగా, లావుగా ఉండడము అనే లక్షణాలు – గుర్తులు ఉన్న వికారః – సంస్థాన (ఆకార) విశేషము, దానికి సమ్బన్ధించి ఘటము) కుండ అనే పేరు, స్పృశ్యతే – నీళ్ళు తీసుకుని రావడము మొదలైన (పనులు) వ్యవహార విశేషాలు నెరవేరడం కొరకు మట్టి అనబడే ద్రవ్యమే మరొక రూపాన్ని మరొకపేరును పొందినది అవుతున్నది. ఇందువల్ల కుండ మొదలైనవన్నీ మట్టి అనేదే సత్యము. మృత్తికాద్రవ్యమనియే, సత్యమ్ – ప్రమాణము ద్వారా లభించుతున్నది. స్పృశింపబడుతున్నది. తెలుస్తున్నది అని అర్థము. అంతేకాని మరొక ద్రవ్యమని కాదు. కావున మట్టి బంగారము మొదలైన ద్రవ్యమే మరొక రూపాన్ని తాల్చినంతమాత్రాన బుద్ధి శబ్దాంతము మొదలైనవి పొసగుతున్నాయి. ఎట్లాగంటే ఒకే దేవదత్తుడు ఆయా అవస్థలలోని భేదాల కారణంగా బాలుడు యువకుడు ముసలివాడు అని బుద్ధి శబ్దాన్తరాదులు ఆయా అవస్థలలో అతడు చేసే వేర్వేరు పనులు తెలియవస్తున్నాయో అట్లాగే. వ్యక్తి / ఆత్మ మారలేదు. కానీ శరీరములో అవస్థలు మారినాయి. అదే మాదిరి మట్టి మారలేదు. దాని ఆకారాలు మారినాయి. అందుచేత వేరువేరు పేర్లు వచ్చినాయి. అది మట్టి అని తెలుస్తున్నది. దాన్ని గురించి తెల్సుకుంటే దాని వికారాలు అన్నీ తెలుస్తవి.

మట్టి ఉంటుండగానే ఘటము పగిలింది నశించింది అని వ్యవహారం లోకంలో ఉన్నది. కనుక కారణం కంటే కార్యము వేరు అని మీరన్నది సరికాదు. మట్టి ఉన్నది. అది ఉత్పత్తి వినాశము అనే రెండు అవస్థలను పొందుతున్నది. ఒక దశలో కుండగా ఉత్పత్తిని పొందుతున్నది. ఆ అవస్థను పొందింది మట్టే కదా! మళ్ళీ వినాశము అనే అవస్థను పొందితే కుండ అనబడే అవస్థను కోలుపోయి వినాశము రూపములో తిరిగి ముడిరూపములో ఉండే అవస్థనే అదే మట్టి పొందుతున్నది. కనుక ఆయా అవస్థలలో ఉన్న ద్రవ్యము – అది ఒక్కటే – నకే ఆయా శబ్దాలు (పేర్లు) వాటి ద్వారా ఆయా పనులు జరుగుతున్నాయి. కనుక ఒకే ద్రవ్యము కారణము కార్యముల రూపములో ఉన్నదనుటే తగును. ద్రవ్యానికి ఆయా అవస్థలు కలుగడమనేది కారకుడైన వానియొక్క వ్యాపారాన్ని బట్టి ఉంటున్నది. అప్పుడది ప్రయోజనకారిగా ఉంటూ అర్థవంతమౌతున్నది అభివ్యక్తి – ఆయారూపాల్లో వెల్లడి కావడము – కి సమ్బన్ధించిన ప్రశ్నలు అన్నీ దాన్ని ఒప్పుకోకపోవడముతోనే పరిహరింపబడినాయి. ఉన్నవస్తువే అభివ్యక్తి

అనబడకుండా ఉత్పత్తి – పుట్టుక రూపములో వెల్లడి అవుతున్నది అని ఒప్పుకుంటే కూడా సత్కార్యవాదానికి వైరుధ్యము ఏమీరాదు ఉన్నదాని నుండే పుడుతున్నది కాబట్టి. మీరు పరస్పర విరుద్ధంగా మాట్లాడుతున్నారు. ముందుగా ఉన్నది అంటున్నారు. అదే పుడుతున్నది అని అంటున్నారు. రెండూ ఎట్లా పొసగుతాయి. ఉన్నదానికి పుట్టుకను చెప్తున్నారు. పుట్టుకలేనిది ఉండేదెట్లా? అని. నిజమే మీకు ఉత్పత్తి వినాశాలు అనేవాటియొక్క యథార్థస్థితి ఏమిటో తెలియదు. అందువల్ల మీకు ఈ సందేహము వస్తున్నది. ఒక ద్రవ్యానికి ఒకదాని తరువాత ఒకటి చొప్పున పలురూపాలతో కలయిక ముందరిముందరి సంస్థానములలో ఉన్నదానికి వినాశము అనబడుతున్నది. తనదైన అవస్థలో ఉండడమే ఉత్పత్తి. అనగా ఒక ద్రవ్యము తనకు సహజమైన రూపములో ఉండి కారక వ్యాపారము కారణంగా వేరువేరు ఆకారాలను పొందినప్పుడు మొదటి ఆకారము నశిస్తున్నది అని అనబడుతున్నది. తరువాతి రూపమును పొందడాన్ని నాశనము అని అంటున్నాము. మట్టి ముద్ద కుండగా మారుతున్నది. అది పగిలితే కపాలము అనబడుతున్నది. అది పగిలితే పెంక/లు అనబడుతున్నది. అది పొడిగా మారితే చూర్ణము అనబడుతున్నది. ఇట్లా మట్టిముద్ద నుండి ఇన్ని రూపాలను పొందుతున్నది. పాతరూపాన్ని కోలుపోయి కొత్తరూపాన్ని పొందుతున్నది. ఇవే ఉత్పత్తి వినాశాలు. ఉన్న మట్టే కొత్త రూపాలను / అవస్థలను పొందుతున్నదిగాని బొత్తిగా లేకుండాపోవడం లేదు.

ఇందువల్ల ఎన్ని అవస్థలను పొందినా ద్రవ్యము ఉండనే ఉంటున్నది. కనుక సత్ కార్యవాదానికి వచ్చిన ముప్పేమీ లేదు. అంతకు మునుపు లేని సంస్థానము పుడుతున్నది గనుక అసత్ కార్యవాదమే నెగ్గుతుంది అనేట్లయితే! అసత్‌కార్యవాదికి కూడా ఉత్పత్తి అనేది ప్రమాణము లేనిది, పొసగనిదిఐతే లేని వస్తువు పుట్టడానికి అవకాశము లేదు గనుక ఉన్న ద్రవ్యమునుండే కొత్త సంస్థానము పుడుతున్నది కాబట్టి సత్కార్యవాదమును అంగీకరించవలసివస్తుంది. అపుడు అసత్‌కార్యవాది సత్‌కార్యవాది అవుతాడు. లేదూ ఉత్పత్తిని – లేనిదాని నుండి పుట్టడాన్ని – అంగీకరిస్తే ఏ వస్తువునుండి పుడుతున్నది దానికి ఏది కారణము, దానికీ ఏది? అని చెప్పుకుంటూపోతే అనవస్థ వస్తుంది.

మాకైతే అవస్థలు అనేవి మరొకద్రవ్యము అనే ప్రతిపత్తి / గుర్తింపు, ఒక అవస్థలో ఉన్నదానితో మరొకరకమైన కార్యము చేయడానికి అవకాశము లేదు కాబట్టి ఆ అవస్థను కల్గినదాన్నే ఉత్పత్తిని పొందింది అని వ్యవహరిస్తాము కనుక ఉత్పత్త్యాదులన్నీ

చక్కగా కుదురుతవి కనుక ఎలాంటి దోషము లేదు. కపాలావస్థ, చూర్ణావస్థ, పిండ (ముద్ద) అవస్థలను వదిలేసి ఘటమనే అవస్థను పొందినట్లే ఒక్కటిగా ఉండడమనే అవస్థను వదిలిపెట్టి బహుత్వావస్థను పొందడము, దాన్ని వదిలి ఏకత్వావస్థను పొందడము జరుగుతుంది అని అంగీకరిస్తాము కనుక విరోధము ఏమీలేదు. (పరబ్రహ్మ ఒక్కడే మొదట ఉన్నాడు. ఆయనే తన సంకల్పముతో తన శరీరం నుండి ప్రకృతిని జీవుడిని పుట్టించి తాను వాళ్ళలో ప్రవేశించి బహుత్వావస్థను పొందినాడు. ఇది సృష్టి. ఉన్నాడనబడే వాడి నుండే ప్రపంచం పుట్టింది. తిరిగి ప్రళయము వచ్చినపుడు కారణమైన దాంట్లో కలుసుకుంటూ పోయి ఆ ప్రపంచమే పరమాత్మలో కల్సి ఉన్నది. పరమాత్మ సద్వస్తువు. ఆయననుండి పుట్టింది ప్రపంచము కావున దీన్ని సత్‌కార్యవాదము అన్నారు.)

అదే ప్రకారము **సదేవసోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయం** అని. ఉన్నదైన ఈ ప్రపంచము – ఇప్పుడు వేరుచేయబడిన నామరూపాలు కలదై నానారూపాలుగా ఉన్న జగత్తు సృష్టికి ముందుకాలములో నామము రూపముల విభాగాలు లేకుండా ఒక్కటిగా (ఒక్క వస్తువు అనబడేటట్లు)నే ఉండింది. ఆ ఒక్కటి – సత్తు – అన్ని శక్తులనూ కలదైనందున, అధిష్ఠాత ఐన మరొకడిని సహాయముగా కోరకుండా, నిమిత్తకారణమైనవాడు లేకుండా ఉన్నది. అందుచేత అద్వితీయము అని అన్నారు. కారణము తానే ఐనందున అనన్యత్వము ఉపపాదింపబడింది. ఉపాదానము తానే అయ్యి నిమిత్తమూ తానే అయినందున అద్వితీయత్వము, కారణము కార్యము తానే ఐనందున అనన్యత్వమున్నూ బ్రహ్మకు దక్కినవి. అట్లాగే **తదైక్షత బహుస్యాం ప్రజాయేయ** అని పుట్టింపనున్న తేజస్సు మొదలుకొని వివిధములైన విచిత్రములైన నిల్చి ఉండే త్రసరూప – పృథివీ అప్ తేజస్సులు – మూడు పరమాణువుల కలయికతో ఏర్పడే అణువును త్రసరేణవు అని అంటారు. తేజో, అప్, అన్నాలను కలిపితే త్రివృత్‌కరణము అని అంటారు. వీటిలో ఎక్కువశాతము ఉన్నదాని పేరుతో ఆ భూతంగా పిలుస్తారు ఇంకా ప్రకృతి, జీవుడు, పరమాత్మ మూడు కలిస్తే – జగత్తుగా తానే అనేకరూపాలను పొందాలి అని సంకల్పించి జగత్తును సృష్టించినాడని చెప్పినందున కార్యమైన జగత్తుకు పరమకారణుడు ఐన పరబ్రహ్మకున్నూ అనన్యత్వము – వేరు వేరు కాకపోవడము – చెప్పబడింది. సచ్ఛబ్దవాచ్యుడైన సర్వజ్ఞుడు సత్యసంకల్పుడు నిరవద్యుడు. ఆయననే **సదేవ ఇదమ్** అని చెప్పడానికి తగిన జగత్తుగా మారినాడు. సత్‌శబ్దవాచ్యమైన జగత్తే

నామరూప విభాగాలు లేకుండా ఒక్కటిగా ఉన్నందున ఏకత్వము సిద్ధిస్తున్నది. అట్లే మరొక అధిష్ఠాతతో అక్కరలేకపోవడమున్నూ ఉన్నది. తిరిగి ఆ సచ్ఛబ్దవాచ్యమైన దానికే విచిత్రమైన స్థిరత్రసరూపజగత్తుగా అనేకరూపాలుగా కావాలనే సంకల్పరూపమైన ఈక్షణము, సంకల్పప్రకారమే సృష్టి పుట్టుక ఎట్లా పొసగుతుంది అని శంకించుకొని చెప్పినాడు వేదపురుషుడు. **సేయందేవతైక్షత. హన్తాఽహమిమాస్త్రిస్రోదేవతాః అనేన జీవేనాత్మనాఅనుప్రవిశ్యనామరూపే వ్యాకరవాణి. ఇతితాసాం తాసాంత్రి వృతంత్రివృతమ్.** ఇత్యాదిగా. **త్రిస్రోదేవతాః** అని అచిద్వస్తువును – ప్రకృతి – అంతటినీ చెప్పి తనను ఆత్మగా కల్గిన జీవుడితో పాటు తాను ప్రవేశించి ఈ జగత్తును విచిత్రనామరూపాలను కలదిగా చేస్తాను అని చెప్పబడింది. అనేన జీవేనాత్మనా – నన్ను ఆత్మగా కల్గిన జీవుడితో ఆత్మగా ప్రవేశించి దీన్ని విచిత్ర నామరూపాలు కలదిగా చేస్తాను అని అర్థము. స్వాత్మనః జీవుడికిన్నీ ఆత్మగా అనుప్రవేశము ద్వారా చేయబడింది నామరూపభాక్త్వము అని చెప్పబడుతున్నది. తత్సృష్ట్వాత**దేవానుప్రావిశత్. తదనుప్రవిశ్యసచ్చత్యచ్చాభవత్.** అని ఇదే విషయాన్ని మరొక శ్రుతి స్పష్టంగా చెప్పింది. జీవుడితో కూడిన జగత్తును పరబ్రహ్మ ఆత్మగా ప్రవేశించినాడు అని. **జీవేన ఆత్మనా అని చెప్పినపుడు "జీవుడిగా ఉన్న నేను" అని అర్థాన్ని చెప్పుకోవాలని శ్రుతప్రకాశికా ఆచార్యులవారి వ్యాఖ్య** సింహేన భూత్వా బహవోమయాఽత్తాః సింహముగా ఐన నేను చాలమందిని తిన్నాను / సింహముగా ఐన నాచేత చాలామంది తినబడినారు. అనే వాక్య ప్రయోగము వలె. **ఆత్మసింహముగా కావడంకుదరదుగనుక సింహపదానికి విశిష్టుడైనవానిగానే అర్థము చెప్పుకోవాలి. అట్లాగే జీవేన అని అన్నపుడు కూడా జీవుడిని శరీరంగా కల్గిన నేను – జీవుడితో విశిష్టుడైన నేను అని తెల్సుకోవాలని ఉత్తమూరి వారి వివరణ గమనించాలి.**

భగవన్తుడు సృష్టిచేసినప్పుడు ప్రకృతిలోనూ జీవుడిలోనూ ప్రవేశించినాడని చెపుతున్నారు కదా! ఆ ప్రవేశము రెండింటిలో విడివిడిగా జరిగిందా? ముందుగా ఎవరిలో జరిగింది? అని సందేహము. ఐతే అనుప్రవేశము అన్నపుడే కొంత వివరణ వస్తున్నది. ప్రవేశము – అనుప్రవేశము అనుపదాల యొక్క అర్థాన్ని పరిశీలించితే తేలిపోతుంది. అనుసృత్యప్రవేశము – ముందుపోయేవాడి వెంట – ఒకని వెంట ప్రవేశించుట. ప్రవేశించినవాడు పరమాత్మ ఎవని వెంట? జీవుని వెంట జీవుడిని ముందు బెట్టుకొని అని కదా అర్థము. ఐతే ఇద్దరూ ఒకేసారి ప్రవేశించడము కుదరదు.

కనుక ఒకరు మాత్రమే ముందుగా పోవాలి. ఐతే పరమాత్మ చిదచిత్తులను శరీరముగా కలవాడు కాబట్టి దానిలోనూ ప్రవేశించి ఉన్నాడనుకోవాలి. కానీ అనుప్రవేశము కనుక ముందుగా జీవుడిని ప్రవేశబెట్టాలి. ఐతే అతడికి కూడా ఈయన ప్రవేశించితేనే కానీ అస్తిత్వము రాదు. అందుకని తాను ప్రవేశించి జీవుడికి జీవత్వాన్ని కలిగించి వాని కర్మ ఫలాలననుభవింప ఆఆ శరీరాలలో ప్రవేశపెడుతూనే ముందుగానే జీవుడిలో దూరి ఉన్నాడు గనుక క్షేత్రజ్ఞుడైన జీవుడిని శరీరాలలో చేర్చుతూ తానుకూడా అతడికి అన్తరాత్మగా ప్రవేశించినాడు. ఆ విధంగా సద్వారకమైన ప్రవేశము చేసినాడని అర్థమవుతున్నది. ఇందుకు దోహదము ఈ ఘట్టము లోని **అనేన జీవేనాత్మనా – మదాత్మక జీవేన ఆత్మతయా అనుప్రవిశ్య "ఏతత్" విచిత్రనామరూపభాక్ కరవాణి ఇత్యర్థః** అనే వాక్యాలు ప్రమాణాలు.

అందుచేత కార్యావస్థలోనున్న కారణావస్థలోనూ ఉన్న స్థూలము సూక్ష్మమూ ఐన చిదచిద్వస్తువులు పరబ్రహ్మకు శరీరాలు అవుతున్నవి. పరమాత్మనేమో వాటికి అన్తరాత్మగా ఉంటున్నాడు. ఈ విషయము అన్తర్యామి బ్రాహ్మణము సుబాలోపనిషత్తు మొదలైన శ్రుతులలో చెప్పబడింది. దాన్ని ఇక్కడ మేము గుర్తుకు తెచ్చినాము. దీనితో ఇంతకుముందు లేవనెత్తబడిన ఆశంక – సర్వంఖల్విదం బ్రహ్మ అని చెప్పబడినపుడు ఇదంశబ్దముతో నున్న సామానాధికరణ్యము ప్రకారము జగత్తులోని దోషాలు పరమాత్మకు వస్తాయి కదా అనే ఆ శంక – తోసివేయబడింది.

జీవునితో కూడిన అచిద్వస్తువునందు బ్రహ్మ ఆత్మగా ఉన్నపుడు నామరూప వ్యాకరణాన్ని / విభాగాన్ని చేసినట్లు చెప్పినందువల్ల చిదచిద్వస్తువులను శరీరమునుగా గల బ్రహ్మనే జగత్తు అనే శబ్దముతో చెప్పదగినవాడు – ఆ పదానికి వాచ్యమైన అర్థము – అవుతున్నాడు. ఆ రెండింటితో కూడి – విశేషణాలుగా కల్గి జగత్తు అనబడుతున్నాడు. కనుక **"సదేవేద మగ్రఏకమేవాసీత్"** ఈ సత్ అనబడేదే సృష్టికి ముందటికాలములో ఒక్కటేఐ ఉండెను. ఇత్యాది వాక్యాలు చక్కగా పొసగుతున్నవి. ఆయనకు శరీరమైన చిదచిద్వస్తువులతో ఉండే అన్ని వికారాలు (బాల్యాదులు) అపురుషార్థాలున్నూ వాటికే చెందుతవి. కనుక బ్రహ్మదోషాలు లేనివాడు కళ్యాణగుణాకరుడు ఐ ఉన్నాడనడమున్నూ గట్టిగా నిలదొక్కుకుని ఉన్నది – ఇదే విషయాన్ని సూత్రకారుడు **అధికంతు భేదనిర్దేశాత్ 2–1–22** సూత్రముతో దీని తర్వాత అధికరణములో చెప్పబోతున్నాడు. అట్లే

**ఐతదాత్మ్యమిదం సర్వమ్** అనే శ్రుతి వాక్యమున్నూ చేతనాచేతనాలన్నిటికీ బ్రహ్మతో తాదాత్మ్యాన్ని ఉపదేశిస్తున్నది. దాన్నే **తత్త్వమసి** అనే వాక్యముతో ముగింపు చేస్తున్నాడు.

అదేమాదిరిగా ఇతర ప్రకరణాలలో ఉన్న వాక్యాలలో **1) సర్వమ్ ఖల్విదం బ్రహ్మ 2) ఆత్మని ఖల్వరే దృష్టే శ్రుతేమతే విజ్ఞాతే ఇదం సర్వమ్ విదితం. ఇదంసర్వం యదయమాత్మా. 3) బ్రహ్మైవేదం సర్వమ్ 4) ఆత్మైవేదం సర్వమ్** అని చెప్పినందువల్ల బ్రహ్మకు జగత్తుకూ అనన్యత్వము తోస్తున్నది. దీన్ని చెప్పినట్లే బ్రహ్మకంటే వేరుగా – అన్యమై ఉండడాన్నీ నిషేదిస్తున్నది. **సర్వమ్ తం పరాదాత్. యోఽన్యత్రాత్మనః సర్వమ్ వేద.** ఎవడైతే ఆత్మయైన పరమాత్మకంటే వేరుగా ఈ ప్రపంచమున్నదని తలుస్తున్నాడో అతడిని సర్వమూ పక్కకు త్రోసివేస్తున్నది. **నేహనానాఽస్తికించన। మృత్యోస్సమృత్యుమాప్నోతియఇహనానేవపశ్యతి.** అని అదేవిధంగా **యత్రహిద్వైతమివభవతి తదితరఇతరంపశ్యతి। యత్రత్వస్యసర్వమాత్మైవాభూత్ తత్కేన కం పశ్యేత్.** అని తెలియని వాడు పరమాత్మ ఒక్కడే అని కాకుండా ఆయన కంటే వేరుగా – ప్రపంచాన్ని, పరమాత్మను ప్రపంచాన్ని రెండింటినీ చూస్తాడని, అన్నీ తెల్సిన విద్వాంసుడు రెండూ లేవు. పరమాత్మ ప్రపంచము అంతా ఒక్క స్వరూపమే అని ఉపాసిస్తాడు, దర్శించుతాడు. అందువల్ల అద్వైతదర్శనము కలవాడని ప్రతిపాదించుతూ జగత్తుకూ పరబ్రహ్మకున్నూ అనన్యత్వమే – ఒక్కటి అయ్యి ఉండడమే యధార్థస్థితి అని ప్రతిపాదించుతున్నది.

అందువల్ల ఆరంభణ శబ్దాదుల వల్ల జగత్తుకు పరమకారణుడైన పరబ్రహ్మకున్నూ అనన్యత్వము ఈ విధంగా ప్రతిపాదింపబడింది.

## సిద్ధాన్తప్రతిపాదన చేస్తున్నారు భాష్యకారులు

ఇచ్చట తేల్చినతత్వము ఇది – చిదచిద్వస్తువులను శరీరంగా కల్గి వాటిని విశేషణాలుగా చేసుకొనివాటితో ఎప్పుడూ విడిగా ఉండకుండా కల్సియున్న బ్రహ్మనే ఎల్లవేళలా సృష్టి స్థితిలయాలలో సర్వశబ్దము చేత / అన్ని శబ్దాలతోనూ చెప్పబడేవాడవుతున్నాడు. ఆయన ఒకప్పుడు తనకంటే వేరుగా ఉండి తనకు శరీరమై ఉన్న విడిగా ఇది ఫలానా అని చెప్పడానికి వీలుగాని సూక్ష్మదశను పొందిన చిదచిద్వస్తువులను శరీరంగా కల్గి ఉంటాడు. అప్పుడు కారణావస్థలోనున్న బ్రహ్మ అని పిలువబడుతాడు. ఒకానొకప్పుడు వేరు చేయబడి నామరూపాల చేత

ఇది చిత్తు ఇది అచిత్తు అని వ్యవహరింపబడడానికి తగిన స్థూలదశను పొందిన చిదచిద్వస్తువులను శరీరముగా కల్గి ఉంటాడు. అది కార్యావస్థలో ఉన్న బ్రహ్మ. కావున కారణమైన బ్రహ్మకంటే కార్యరూపమైన జగత్తు అనన్యము వేరు కాదు. శరీరముఐన చిదచిద్వస్తువుకూ శరీరి ఐన బ్రహ్మకున్నూ కారణావస్థలోనూ కార్యావస్థలోనూ వందలకొద్దీ శ్రుతులు చేత నిర్ధారింపబడినవి రెండు వ్యవస్థలు. 1) స్వభావవ్యవస్థా 2) గుణదోషవ్యవస్థ. 1) ప్రకృతి జీవుడికి భోగ్యమై ఉండడము. దానికి తగినట్లు జీవుడి కర్మఫలానుభవం కొరకు తాను పరిణామాలను పొందడము ప్రకృతి స్వభావము. 2) జీవుడు తాను చేసిన పురాకృత పుణ్యపాప రూపకర్మలకు తగినట్లు ప్రకృతిలో చేరి ఫలాలైన సుఖదుఃఖాలనుభవించడము భోక్తృత్వము జీవుడి స్వభావము 3) ఈ ఇద్దరిని తన ఆజ్ఞకనుగుణంగా ప్రవర్తింపచేయడము ఈశ్వరుని స్వభావము. సర్వమంగళగుణాకరుడు ఈయన ఐతే మిగతా ఇద్దరూ వికారాలు ప్రకృతి పొందితే, అపురుషార్థాలు సుఖదుఃఖాలననుభవించడము జీవునియొక్క బద్ధదశ. ఇదంతా **నతు దృష్టాన్త భావాత్** అను సూత్రము వద్ద చెప్పబడింది.

**బ్రహ్మాజ్ఞానవాదిని ఖండిస్తున్నారు.** ఎవరైతే కార్యమైన జగత్తును మిథ్య అని చెప్తూ కార్యకారణాలకు అనన్యత్వాన్ని చెపుతున్నారో వారికి కార్యకారణాలకు అనన్యత్వము సిద్ధించదు. ఒకటి బ్రహ్మ సత్యము రెండవదైన ప్రపంచము మిథ్యయై నట్టిది యధార్థంగా లేనిది. భిన్నమైన ఈ రెండింటికి వైరుధ్యము ఉన్నది కాబట్టి అనన్యత్వము కుదరదు. ఒకవేళ అనన్యత్వమే కుదిరితే బ్రహ్మ మిథ్య అయ్యి జగత్తు సత్యము కావాల్సి వస్తుంది.

**భాస్కరాచార్యునివాదాన్ని ఖండిస్తున్నారు.**

ఎవరైతే కార్యమైన జగత్తును కూడా పరమార్థమే. సత్యమే అని ఒప్పుకుంటూనే జీవబ్రహ్మలు ఇద్దరూ ఉపాధి కారణంగా వేరవుతున్నారని, సహజంగానైతే మాత్రము వేరుకారని చెపుతూ అచిత్తు బ్రహ్మలకు భేదము ఉండడము లేకపోవడము రెండున్నూ స్వాభావికములే అని చెపుతున్నారో వారికి ఉపాధితో కూడిన బ్రహ్మ కంటే మరొక వస్తువు లేనందున, అవయవాలు లేనివాడై అఖండముగానున్న బ్రహ్మకే ఉపాధి సమ్బన్ధము వలన బ్రహ్మస్వరూపుడైన బ్రహ్మనే హేయాకారముగా – జీవుడిగా పరిణమించుటవల్ల – శక్తిమాత్రమే పరిణమిస్తున్నదని ఒప్పుకున్నపుడు శక్తికి బ్రహ్మకు భేదము లేకపోవుట – అనన్యత్వము – వల్ల జీవబ్రహ్మలకు ఒకరికి కర్మలకు లొంగిఉండడము మరొకరికి అపహత పాప్మత్వము వంటి వ్యవస్థను చెప్పే శ్రుతులు,

అచిత్తు బ్రహ్మలకు పరిణామము, పరిణామము లేకపోవుటనూ వివరించే శ్రుతులు కలత చెందుతాయి.

**యాదవప్రకాశుల మతాన్ని నిరసించుతున్నారు.**

భోక్తృత్వము వంటి వికల్పవికారాలు ఏవీ లేని అన్ని శక్తులతో కూడి ఉన్న సత్ అనబడే ద్రవ్యము మాత్రమే కారణముఐన బ్రహ్మ అది ప్రళయ సమయంలో సుఖదుఃఖానుభవిశేషాలు ఏవీ లేనిదై స్వయంగా ప్రకాశిస్తూ ఉన్నప్పటికీ నిద్రపోయినవాడివలె, అచిత్పదార్థము వలె కదలిక మెదలికలు లేకుండా ఉన్నది. సృష్టిసమయంలో మట్టి అనే ద్రవ్యము కుండ శరావము – చిప్పల వంటిదిగా ఉన్నట్లు, సముద్రములో వలె నురుగు, అలలు బుడగలు మొదలైన రూపములతో భోక్త, భోగ్యము, నియన్త రూపాలుగా మూడు అంశాలను కల్గి ఉంటున్నది. కావున భోక్త, భోగ్యము నియంతృత్వాలు, వాటివల్ల కలిగే గుణాలు దోషాలు శరావత్వ ఘటత్వ మణికత్వాదుల వలె – మట్టితో చేసిన వివిధ ఆకారాల్లో పాత్రలు – వాటితో జరుపుకునే కార్యాల్లో ఉండే భేదాల వలె వ్యవస్థితములై – ఏది ఏ పనికి ఉపయోగించుకోవాలో అందుకు మాత్రమే వాడుకోవాలి అని కట్టడి చేయబడినవై – ఉంటున్నవి. ఘటశరావమణికాదులు వేరువేరు ఐనా అవి అన్నీ మట్టితో చేయబడినందున మట్టిపాత్రలు అని అనబడినట్లు భోక్త భోగ్యము నియన్తలు అందరు కూడా సదాత్మకులు కాబట్టి ఏకత్వాన్ని పొందియుంటున్నారు. కారణము ఏమిటంటే సన్మాత్ర ద్రవ్యమే అన్ని అవస్థలనూ పొందుతున్నది. కనుక బ్రహ్మకూ జగత్తుకు అనన్యత్వము ఉన్నది అని ఎవరు గట్టిగా వాదిస్తున్నారో వార్కి స్మృతులు, శ్రుతులు, ఇతిహాసాలు, పురాణాలు, న్యాయా(శాస్త్రము)లతో విరోధము వస్తుంది. శ్రుతులన్నీ స్మృతులు ఇతిహాసాలు పురాణాలతో కలసి సర్వేశ్వరేశ్వరుడు ఏ దశలోనైనా సర్వజ్ఞుడు, సర్వశక్తులు ఉన్నవాడు సత్యసంకల్పుడు దోషాలు లేనివాడు దేశము కాలములతో విడదీయరాని – పరిమితిలేని – అనవధిక అతిశయ ఆనందము కలవాడు. కారణాలు ఐన వాటన్నింటికీ కారణమైనవాడు ఐన బ్రహ్మను ప్రతిపాదించుతున్నాయి. కానీ ఈశ్వరుడైన వాని కంటే పరుడైన ఈశ్వరాంశకలసత్ మాత్రాన్ని కాదు. అది అట్లాగే కదా! **సదేవ సోమ్యేదమగ్రఆసీత్ ఏకమే వాద్వితీయమ్. తదైక్షత బహుస్యామ్ ప్రజాయేయేతి 2) బ్రహ్మ వాఇదమగ్రఆసీత్ ఏకమేవ. తదేకం సన్నవ్యభవత్. తత్ శ్రేయోరూపమత్యసృజత. క్షత్రం యాన్యేతానిదేవత్రాక్షత్రాణి ఇంద్రోవరుణః సోమోరుద్రః పర్జన్యో యమో మృత్యురీశానః.** సృష్టికి మునుపటి

కాలములో బ్రహ్మ ఉండెను. అతడు ఒక్కడే. అతడు మాత్రమే ఉన్నా వివిధరూపాలుగా ఐనాడు. ముందుగా శ్రేయస్సును మేలును కలిగించేరూపాన్ని సృష్టించినాడు. అది ఆపదల నుండి రక్షించేది. ఈ చెప్పబోయేవన్నీ దేవతా సమ్బన్ధమైన క్షత్రియులు. ఇంద్రుడు, వరుణుడు, చంద్రుడు, రుద్రుడు (అగ్ని) మేఘుడు, యముడు మృత్యువుఐన – ప్రలయకారకుడైన శివుడు అని, **ఆత్మావాఇదమేక ఏవాగ్ర ఆసీత్। నాన్యత్ కించన మిషత్। సఐక్షత లోకాన్ ఉ.సృజా ఇతి.** మొదట్లో ఆత్మా అనెడిది మాత్రమే ఉండెను. దానికి మించి మరొకటి ఏదీ కనపడకుండెను. ఆ ఆత్మ లోకాలను సృష్టించాలని సంకల్పించెను. **ఏకోహవైనారాయణ ఆసీత్. నబ్రహ్మానేశానః నేమే ద్యావా పృథివీ న నక్షత్రాణి నాపో నాగ్నిర్నసోమోనసూర్యః సఏకాకీన రమేత తస్యధ్యానాన్తస్థస్య** ఒక్క నారాయణుడు మాత్రమే ఉండెను. బ్రహ్మ ఈశానుడు – శంకరుడు, ఈ నేలా నింగీ చుక్కలు, నీరు, అగ్ని, చంద్రుడు, సూర్యుడు ఎవ్వరూ లేరు. ఆయన ఒంటరిగా ఉన్నందున ఆడుకోవడం లేదు. (రముక్రీడాయాం) ధ్యానములో అతని యొక్క ఇత్యాదివాక్యాలచేత పరమకారణమైనవాడు సర్వేశ్వరుడు ఐన నారాయణుడు మాత్రమే అని తెలియవస్తున్నది. సద్బ్రహ్మ ఆత్మ శబ్దాలు సమానమైన జగత్కారణాన్ని చెప్పే ప్రకరణములో ఉన్న నారాయణ శబ్దముతో విశేషింపబడినవై ఆయననే తెలియపరుస్తున్నవి. **తమీశ్వరాణాం పరమం మహేశ్వరం** ఈశ్వరులైన వారందరికీ పరముడై మహేశ్వరుడైన వాడిని. **సకారణం కరణాధిపాధిపః నచాస్యకశ్చిత్ జనితానచాధిపః** అని ఈశ్వరుడై కారణత్వము అని వినిపిస్తున్నది. మనుస్మృతి కూడా। **తతః స్వయంభూః భగవాన్** అని మొదలుపెట్టి **సోఽభిధ్యాయశరీరాత్ స్వాత్ సిసృక్షుః వివిధాఃప్రజాః। అపఏవససర్జాదౌ తాసువీర్యమపాసృజత్** అని ముగించుతున్నది. ఇతిహాసపురాణాలు కూడా పురుషోత్తముడినే పరమకారణము అని చెప్తున్నవి. **నారాయణోజగన్మూర్తిః అనన్తాత్మా సనాతనః। ససిసృక్షుఃసహస్రాం శాత్ అసృజ్ పురుషాన్ ద్విధా॥** జగద్రూపములో ఉండెడివాడు. జగత్తును తనదైన మరొక రూపంగా కలిగిన అనన్తాత్మా, సనాతనుడు – ఎప్పటినుండి ఉన్నాడో తెలియరానివాడు నారాయణుడు. ఆయన ప్రజలను పుట్టించదల్చుకొని తనదైన వెయ్యవ అంశాన్నుంచి రెండు రకాల పురుషులను పుట్టించినాడు. **విష్ణోఃసకాశాదుద్భూతం జగత్ తత్రైవ చస్థితమ్.** ఈ జగత్తు విష్ణువు వద్ద నుండే పుట్టింది. అది ఆయన యందే / ఆయనపై ఆధారపడియే ఉన్నది. ఇత్యాదుల్లోనూ వినిపిస్తున్నది.

ఈశ్వరుడు సత్ – (ఉన్నాడు)– మాత్రమే అని చెప్పడానికి వీల్లేదు. సత్తు అనేది ఈశ్వరుని యొక్క అంశము అని మీరే ఒప్పుకున్నారు కదా! పైగా విశేషము కలవాడు. ఆయనకు ఉన్న జ్ఞానానందాది కళ్యాణగుణాలతో కూడిన స్థితి ఎప్పుడో ఒకప్పుడు ఒకానొక దశలో అని కూడా చెప్పవీల్లేదు. అవి ఆయనకు స్వాభావికాలు కావున ఎల్లప్పుడూ ఉండేవే అని **పరాఽస్య శక్తిః వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞానబలక్రియాచ. యః సర్వజ్ఞః సర్వవిత్.** ఇత్యాది వాక్యాలవల్ల తెలుస్తున్నది. జ్ఞానానందాది శక్తి, యోగము మాత్రమే ఇతనికి స్వాభావికము అని చెప్పబోకు. శక్తి స్వాభావికమే. జ్ఞానబలక్రియ కూడా స్వాభావికమనే శ్రుతి విడివిడిగా నిర్దేశించింది. లక్షణాదోషము కూడా వస్తుంది. పాచకుడు మొదలైన శబ్దాల వలె ఆయా పనులు చేయుట యందు శక్తి ఉన్నదని శక్తి యందు మాత్రమే కృత్ ప్రత్యయము వస్తుందని చెప్పవీలుకాదు. కేవల కృత్ప్రత్యయానికి శక్తార్థములో స్మరణము / విధింపు లేదు. **శక్తౌ హస్తికవాటయోః** ఇత్యాది సూత్రాలలో కొన్ని కృత్ ప్రత్యయాలకు మాత్రమే శక్తి విషయంలో చెప్పబడింది. పాచకాదులలో మాత్రము మరొక మార్గము లేదు కాబట్టి వంట చేసే శక్తి గలవాడు అనే అర్థములో లక్షణను ఆశ్రయిస్తున్నాము.

ఇంకా ఈశ్వరుడు, సత్తు – బ్రహ్మలోని అంశముయొక్క విశేషము ఐనందున బ్రహ్మ / సత్ అంశి అంశము కలవాడు అవుతున్నాడు కాబట్టి తరంగము కంటే సముద్రము వలె అంశానికంటే అంశి ఐనవాడు అధికుడౌతున్నాడు. అపుడు **తమీశ్వరాణాం పరమమ్ మహేశ్వరం. న, తత్సమశ్చాభ్యధికశ్చదృశ్యతే** ఇటువంటివైన ఈశ్వరుడిని గురించి చెప్పే వందల కొలది వాక్యాలు బాధింపబడుతవి. మరియు సన్మాత్రుడు సర్వాత్మకుడు అంశి ఐతే ఈశ్వరుడు ఆయన యొక్క అంశవిశేషము ఐనందున అతడికి చెప్పిన సర్వాత్మకత్వము అంశిత్వములను ఉపదేశించే వాక్యాలు దెబ్బతింటాయి/ కొట్టుపడుతవి. ఘటశరావాదులకు మణికాత్మకత్వము దానిలో అంశమై ఉండడంగాని లేవు. తనయొక్క అంశాలన్నింటిలో సన్మాత్రుడు నిండి ఉన్నాడు కనుక ఈశ్వరుడు అనే అంశములోనూ అతడు పూర్ణుడు కాబట్టి సన్మాత్రుడిని ఆత్మగా కలవి, సన్మాత్రాంశాలూ ఐన ఇతరములు వస్తువులే అని అంటే ఒప్పము. ఘటములో కూడా సన్మాత్రుడు పూర్ణుడై ఉన్నందున ఈశ్వరుడికి కూడా ఘటాత్మకత్వం ఘటానికీ అంశమై ఉండవలసి వస్తుంది. ఘటము ఉన్నదని అన్నట్లు వస్తువు యొక్క ధర్మాన్ని కల్గి ఉన్నందువల్ల సన్మాత్రుడికి ద్రవ్యత్వము గానీ, కారణత్వముగానీ పొసగవు.

సత్వము అనగా వ్యవహారము చేయడానికి తగిన యోగ్యతను కలిగి ఉండడము. దానికి విరోధి అని వ్యవహరించడానికి తగిన యోగ్యతయే, అట్లాగా వ్యవహరించడానికి యోగ్యమైనదానికి అసత్త్వము. కాదండీ ద్రవ్యమే సత్తు అని ఒప్పుకుంటే క్రియలు మున్నగువానికి అసత్వము వచ్చే ప్రమాదము ఉన్నది. క్రియాదులలో గడ్డిగాదమును పుట్టకున్నా అన్నిచోట్లా ఒకే రూపమైన సత్తను ఉపపాదించడం దుస్సాధ్యమే. సదాత్మకాలు ఐనందున సమస్త వస్తువులూ భేదము లేనివి అవుతాయి, సర్వజ్ఞుడైనందున సర్వస్వభావాలనూ పొందుతున్నందున అన్ని గుణాలూ దోషాలూ సన్మాత్రుడిని చుట్టుముట్టవచ్చును. ఈ మాటను మేము ఇంతకుముందే చెప్పినాము. కనుక మేము చెప్పిన ప్రకారమే బ్రహ్మకు జగత్తుకూ అనన్యత్వము ఉంటుంది.

ఇక మీరిట్లా అనవచ్చును. ఒక్కనికే అవస్థలు వేరు వేరైనప్పుడు బాలత్వము యువత్వము మొదలైనవాటిలో బుద్ధి, శబ్దాన్తరమలు వంటివి కనిపిస్తున్నవి. మట్టి, కర్ర, బంగారము మొదలైనవాటిలోనూ ద్రవ్యాన్తరమనబడినప్పుడున్నూ ఈ భేదాలు కనిపిస్తూనే ఉన్నవి. అక్కడ మట్టి కుండలు కార్యకారణాలు అవుతున్నపుడు బుద్ధి శబ్దాన్తరాలు అవస్థలకు సమ్బన్ధించినవి మాత్రమే. వేరు ద్రవ్యాలు కావు అని ఏ కారణంతో నిర్ణయించుతున్నారు? అని ప్రశ్నలేవనెత్తబడగా సమాధానాన్ని చెపుతున్నారు.

సూ॥ **భావే చోపలబ్ధేః 2-1-16** కుండలాలు మొదలైన వాటిలోనూ అవి కార్యాలైనా వాటిలో బంగారము కనుపించుతూనే ఉన్నది. ఇది కుండలము బంగారము అని బంగారముగా ప్రత్యభిజ్ఞ కలుగుతున్నది. బంగారంగానే గుర్తిస్తున్నాము. ఇదే తీరున హిరణ్యాదులలో ద్రవ్యాన్తరాలైన వాటిలో మట్టి మొదలైనవి లభించడము లేదు. కనుక బాలుడు యువకుడు మొదలైనవాటివలె కారణమైన ద్రవ్యమే మరొక అవస్థను పొంది కార్యము అని చెప్పబడుతున్నది. కార్యము కారణము రెండూ వేరువేరు ద్రవ్యాలే అని వాదించే ద్రవ్యాన్తర వాది కూడా తాను అంగీకరించిన అవస్థాన్తరయోగముతో బుద్ధి శబ్దాన్తరములు సరిపోలుతున్నా, అక్కడ లభించని వేరే ఏదో ఒక ద్రవ్యాన్ని కల్పించడము పొసగదు. ఆ బంగారమే ఈ కుండలములో ఉన్నది. అనే ప్రత్యభిజ్ఞ – గుర్తు పట్టడము – జాతికి సమ్బన్ధించినదికాదు. జాతికి ఆశ్రయమైన మరొక ద్రవ్యము లభించడము లేదుకదా! ఒకే బంగారము జాతికి చెందిన ద్రవ్యము కార్యము కారణము అనే రెండవస్థలలోనూ కనిపిస్తున్నది. ద్రవ్యభేదము ఉన్నప్పటికీ సమవాయి కారణము – ఉపాదానకారణము – మట్టి వంటి ముడిసరుకు – ఒక ద్రవ్యము నుండి

మరొక ద్రవ్యములోనికి అనువర్తిస్తున్నందువల్ల / సంక్రమిస్తున్నందువల్ల కార్యము నందున్నట్లు గుర్తింపు జరుగుతున్నది కదా! అని చెప్పడానికి కుదురదు. ద్రవ్యాన్తరమై ఉన్నా ఆశ్రయము అనువృత్తి అవుతున్న కారణంగా దానికి ఆశ్రయించిన ద్రవ్యాన్తరము నందు ప్రతిసన్ధానము – ప్రత్యభిజ్ఞ కుదరడం లేదు. ఆవుపేడ నుండి పుట్టిన తేలు మొదలైనవాటిలో ఆవుపేడ యొక్క ప్రతిసన్ధానము – ఆవుపేడ అనే గుర్తింపు – ప్రతి సన్ధానము కనపడడం లేదు కదా! అనేట్లయితే చెప్తున్నాము. అక్కడ కూడా మొదటికారణమైన పృథివీ ద్రవ్యము కనబడుతున్నది.

వాసన గలది పృథివీ. దానినుండి పుట్టినది గడ్డి అది పశువుకు ఆహారమై పేడగా మారుతున్నది. దానిలో నుంచి తేలు వంటివి పుట్టుకొస్తున్నవి. ఇక్కడ ఆద్యకారణము. ఆ పృథివీ లక్షణమైన శరీరము తేలులో కనిపిస్తూనే ఉన్నది. ఐతే నిప్పు నుండి పుట్టే పొగలో అగ్నిప్రత్యభిజ్ఞానం కనిపించడం లేదనవచ్చు. అక్కడ ప్రత్యభిజ్ఞానము లేకపోనీ. ఐనా తప్పు లేదు. అక్కడ నిమిత్తకారణము మాత్రమే అగ్ని. నిప్పుతో జతకలసి తడికట్టెలనుండే పొగ పుడుతున్నది. వాసన ఉన్నది కాబట్టి తడిసిన కట్టె అనే కారణం నుండే. ఉపాదానము నుంచే – కార్యమైన ధూమము పుట్టింది. కనుక కార్యరూపములో ఉన్నా అదే ఇది అని ఉపలబ్ధి – తెలియరావడము – గుర్తింపు ఉన్నది కాబట్టి బుద్ధి, శబ్దాన్తరము మొదలైనవన్నీ అవస్థాభేదానికి చెందినవే అని తెలుస్తున్నది. అందువల్ల కారణము కంటే కార్యము వేరుకాదు. అనన్యమే. ఇందువలన కూడా!

సూ॥ **సత్వాచ్చాపరస్య 2-1-17** అపరస్య – కార్యస్య – కార్యము కారణములో ఉన్నందువల్ల కూడా కారణముతో కార్యము అనన్యమే వేరుకాదు. లోకములోను వేదములోనూ కార్యమే కారణంగా పేర్కొనబడుతున్నది. లోకములో ఎట్లనగా ఈ కుండలు చిప్పలు అన్నీ ఇంతకుముందు నాడు / నిన్న మట్టిగానే ఉండెను. వేదములో **సదేవసోమ్యేదమగ్ర ఆసీత్** ఓ సోమ్యుడా! ఈ ప్రపంచము సృష్టికాలములో సత్తుగానే ఉండెను అని.

సూ॥ **అసద్ వ్యవదేశాత్ నఇతిచేన్న. ధర్మాన్తరేణ. వాక్యశేషాత్ యుక్తేః శబ్దాన్తరాచ్చ 2-1-18** కారణము నందు కార్యము ఉంటున్నదని లోకములోను వేదములోనూ అది కనబడుతున్నది అని అన్నమాట తగినది కాదు. వేదములో అసత్తు ఉన్నదని పేర్కొనబడింది. **అసదేవేదమగ్ర ఆసీత్. అసద్వాఇదమగ్ర ఆసీత్. ఇదంవా అగ్రేనైవకించనఆసీత్.** అని ఇక లోకములోనూ ఈ కుండలు చిప్పలు

నిన్న లేకుండెను. అని కనుక మీరు చెప్పింది పొసగదు. అని అంటే అది సరికాదు. ధర్మాన్తరముతో అట్లాగా పేర్కొనబడింది. ఆ అసత్ అని పేర్కొనడము ఆ కార్యద్రవ్యము ముందరికాలములో ధర్మాన్తరము సంస్థానాన్తరము – మరొక రూపముతో ఉండినది. కానీ నీవు చెప్పినట్లు తుచ్ఛము – బొత్తిగా లేకపోవడము కాదు. సత్త్వము అసత్త్వములు అనేవి ద్రవ్యాలయొక్క ధర్మాలు అని చెప్పినాము. వాటిలో స్తత్వము అనే ధర్మము కంటే వేరయిన ధర్మాన్తరము అసత్త్వము. పై వాక్యములో ఇదం శబ్దంతో చెప్పబడిన జగత్తుకు సత్వ ధర్మము నామరూపాలు కల్గి ఉండడము. అసత్త్వ ధర్మమైతేనో దానికి విరోధిఐనట్టిది సూక్ష్మావస్థ. కావున నామరూపాలతో కూడిన జగత్తుకు దానికి విరోధి ఐన సూక్ష్మదశను పొందడమే అసత్త్వము. ఇదెట్లా తెలుస్తున్నది? అని అంటున్నావా? వాక్యశేషముతో కూడి ఉన్నందున. శబ్దాన్తరమువల్ల. వాక్యశేషము **ఇదంవా అగ్రేనైవకించన ఆసీత్.** ఈ ప్రపంచము మొదట్లో ఏమీ లేకుండెను. అనేచోట **తదసదేవ సన్మనోఽకురుత స్యామితి.** ఆఅ అసత్ అనబడేదే నేను సత్తుగా అవుతాను అని తలచెను అని. ఈ వాక్యశేషములో ఉన్న మనస్కారము – తలచుట అనే లింగము – గుర్తుతో తుచ్ఛము కంటే వ్యతిరేకమైన అసచ్ఛబ్దార్థము నిశ్చయింపబడితే దానితో ఏకార్థముండుటవలన **అసదేవేదమ్** ఇత్యాదులయందు అసత్‌శబ్దానికి ఇదే అర్థము నిశ్చయింపబడుతున్నది. యుక్తి వల్ల కూడా అసత్‌తత్వానికి ధర్మాన్తరము – మరొక ద్రవ్యము అని తెలుస్తున్నది. యుక్తి సత్త్వాసత్త్వాలు పదార్థధర్మాలు అని తెల్పుతున్నది. మట్టి అనే ద్రవ్యమునకు లావుగా గుండ్రంగా ఉండడము అనే ఆకారము ఘటము ఉన్నది అనే వ్యవహారానికి కారణము. ఆమృద్ద్రవ్యానికే విరోధి అవస్థయైన మరొక దానితో కల్సిఉండడము ఘటము లేదు అనే వ్యవహారానికి హేతువు అవుతున్నది. అక్కడ కపాలాది అవస్థలేదు అనే దానికి విరోధి ఐనందున అదే ఘటావస్థకు లేదు అని వ్యవహరించడానికి హేతువు. అంతకంటే దానికి వ్యతిరేకమైన ఘటాభావము అనేది ఒకటి లభించడం లేదు. ఘటాభావము అనేదాన్ని కల్పించడము లేదు. కపాలావస్థతోనే ఘటాభావవ్యవహారము కుదురుతూనే ఉన్నది కదా! అట్లాగే శబ్దాన్తరము వల్ల కూడా ఇప్పుడున్న స్థితికంటే ముందుకాలములో మరొక ధర్మముతో కూడియుండడము అర్థము అవుతున్నది. శబ్దాన్తరము అంటే ఏమిటో ఇంతకుమునుపు ఉదాహరించినాము. సదేవసోమ్యేదమగ్ర ఆసీత్ ఇటువంటివి. ఆ ప్రకరణములో **కుతస్తుఖలు సోమ్యేవంస్యాత్** ఓ సోమ్యుడా దేనివల్ల ఇట్లా అయ్యి ఉండవచ్చును అని తుచ్ఛత్వాన్ని ఊహించి **సదేవసోమ్యే దమగ్రఆసీత్** ఉన్నదే ఇపుడు జగత్తు అయ్యింది.

అపుడు సత్తు మాత్రమే ఉండింది అని స్థాపించబడింది. **తద్దేదం తర్హి అవ్యాకృత మాసీత్. తన్నామరూపాభ్యాం వ్యాక్రియత.** అపుడు కదా ఇది విభజింపబడకుండా ఉండింది. దాన్నే నామరూపాలతో విభజించినాడు. అని చాలా తేటగా చెప్పబడింది.

ఇపుడు కారణం కంటే కార్యము వేరు కాదనడంలో రెండు ఉదాహరణాలను రెండు సూత్రాలతో చెప్పుతున్నాడు.

సూ॥ **పటవచ్చ 2-1-19** దారాలు ఎట్లాగానైతే పడుగు పేకలుగా అల్లుకుని పోయి పటము బట్ట అని నామము రూపము కార్యాన్తరాదికమును పొందుతున్నాయో దానిలాగానే బ్రహ్మకూడా నామాన్తరాన్ని రూపాన్తరాన్ని కార్యాన్తరాన్ని పొందుతున్నాడు. అనగా దారాలు కల్సిపోయి బట్ట అయినట్లే చిదిచిత్తులతో కల్సిపోయి కార్యముగా జగత్తుగా ఐనాడు. ప్రకృతి శరీరము, జీవుడు ఆత్మ, ఈశ్వరుడు పరమాత్మ అన్తరాత్మగా మూడూ కలసి జగత్ ఐనాడు అని అర్థము.

సూ॥ **యథాచప్రాణాదిః 2-1-20** ఎట్లాగా వాయువొకటే ఐనా ఆయా స్థానాలలో ఉంటున్నదై ప్రాణము, అపానము మొదలైన రూపాలను కార్యాన్తరములను/ వేరువేరు పనులను చేస్తున్నదో దానివలెనే బ్రహ్మ ఒక్కడే విచిత్రత్రసస్వరూపుడై జగత్తు అనబడేవాడుగా అవుతున్నాడు. కనుక పరమకారణుడైన పరబ్రహ్మకు జగత్తుకూ అనన్యత్వము వేరుకాకపోవడము సిద్ధించింది.

ముందు సూత్రములో అనేకవస్తువులు కలసి ఒక్కటి అనబడడమునకు ఉదాహరణ చెప్పబడింది. ఇందులో ఒక్కడే అనేక పనులతో అనేక స్థలాలతో ఒక్కొక్క పేరుతో వ్యవహరించబడడము ఉదాహరించబడింది. **ఇంతటితో ఆరంభణాధి కరణము ముగిసినది.**

★ ★ ★

## ఇక ఇతర వ్యపదేశాధికరణము

సూ॥ **ఇతర వ్యపదేశాత్ హితాకరణాదిదోషప్రసంగః 2-1-21** జగత్తుకు బ్రహ్మతో అనన్యత్వాన్ని ప్రతిపాదించేవారు. తత్త్వమసి 2) అయమాత్మా బ్రహ్మ ఇత్యాదులైన వాక్యాలతో జీవునికి కూడా బ్రహ్మతో అనన్యత్వము పేర్కొనబడుతున్నది అని అన్నారు. ఆ విషయంలో ఈ విధంగా ప్రశ్న చేయబడుతున్నది. ఒకవేళ ఇతరుడైన

జీవుడికి బ్రహ్మభావము ఈ వాక్యాలతో పేర్కొనబడినట్లయితే అపుడు సర్వజ్ఞత్వము సత్య సంకల్పత్వము వంటి విలక్షణాలతో కూడి ఉన్న బ్రహ్మకు తనకే హితరూపమైన జగత్తును పుట్టించకపోవడం మేలుచేయని జగత్తును సిద్ధము చేయడము ఇత్యాది దోషాలు అంటుకుంటవి. ఈ సమస్త జగత్తు ఆధ్యాత్మిక ఆధిదైవిక ఆధిభౌతికములైన అనన్తదుఃఖాలకు నెలవైనది. ఇలాంటి తనకు మేలు చేయని దాన్ని స్వతంత్రుడైన బుద్ధిమంతుడగు పురుషుడు సృష్టించడానికి పూనుకోడు.

జీవుడికంటే బ్రహ్మకు భేదాన్ని తెలిపే శ్రుతులు జగత్తుకు బ్రహ్మకు అనన్యత్వాన్ని తెలిపే నీ చేతనే వదలిపెట్టబడినాయి. భేదము ఉన్నట్లయితే అనన్యత్వము సిద్ధించదు. భేదశ్రుతులు ఉపాధికారణంగా వచ్చిన భేదాన్ని చెపుతున్నాయి. స్వాభావికమైన అభేదాన్ని తెలిపేవి అభేదశ్రుతులు కదా అని అన్నట్లయితే – ఆ విషయంలో ఇది చెప్పవలసి ఉన్నది – సహజంగానే తనతో భేదం లేని జీవుడిని ఉపాధి సమ్బన్ధము లేని, జగత్ కారణము ఐన బ్రహ్మ ఎరుగునా? లేదా? ఎరుగడు అని అంటే సర్వజ్ఞత్వాన్ని కోలుపోతాడు. ఎరుగును అన్నట్లైతే తనకంటే వేరు కాని, భేదము లేని జీవుని దుఃఖము తన దుఃఖము కాగలదు గనుక అన్నీ తెలిసినవాడు హితాన్ని చేయకపోవడము, హితము కాని దాన్ని చేయడము మొదలైన దోషాలు రాక తప్పవు. కాదు. అజ్ఞానము అని చెప్పే పక్షము వారికి ముందు చెప్పిన వికల్పము, దాని ఫలమున్నూ అట్లాగే నిల్చి ఉంటుంది. బ్రహ్మకే అని చెప్పే పక్షములో స్వయంప్రకాశస్వరూపుడైన బ్రహ్మకు అజ్ఞాన సాక్షిత్వము, దానివలన చేసినదైన జగత్ సృష్టి కూడా కుదురదు. అజ్ఞానము చేత బ్రహ్మ యొక్క ప్రకాశము కనబడకుండా పోతే / కప్పివేయబడితే – తిరోధానము అనేది ప్రకాశాన్ని తొలగించుతుంది. ప్రకాశమే స్వరూపము – అపుడు ప్రకాశము లేకుండా పోవడమే అవుతుంది. కావున స్వరూపము నశించిపోవడము మొదలైన దోషాలు వేలకొలది వచ్చి నెత్తిన పడుతవని మునుపే చెప్పినాము. కనుక బ్రహ్మకు జగత్కారణత్వము పొసగేది కాదు. అని పూర్వపక్షము ఎదురైతే సమాధానము చెప్పబడుతున్నది.

సూ॥ **అధికంతు భేదనిర్దేశాత్ 2-1-22** తుశబ్దము ఎదుటిపక్షాన్ని తిప్పికొడుతున్నది. ఆధ్యాత్మికాది దుఃఖాలతో కూడిన ప్రత్యగాత్మ (జీవుడు) కంటే అధికుడు అర్థాన్తరమైన వాడు బ్రహ్మ. ఎందువల్లనంటే? భేద నిర్దేశాత్ – ప్రత్యగాత్మకంటే పరంబ్రహ్మ భేదము కలవాడుగా చెప్పబడుతున్నాడు. **య ఆత్మని తిష్ఠన్ ఆత్మనోఽన్తరోయమాత్మానవేద. యస్యాత్మాశరీరమ్ యఆత్మానమన్తరో**

**యమయతి. సతే ఆత్మాఽన్తర్యామ్యమృతః 2) పృథగాత్మానం ప్రేరితారం చమత్వాజుష్టస్తతస్తేనామృతత్వమేతి.** తనను, ప్రేరకుడైన వాడిని వేరువేరు ఐనవాండ్లని తెల్సుకొని తలచి ఆయనకు ప్రీతిపాత్రుడై ఆ పరమపురుషుని వల్లనే మరణము లేకపోవుటను / మోక్షాన్ని పొందుతాడు. **3) సకారణం కరణాధిపాధిపో. 4) తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి. అనశ్నన్నన్యోఅభిచాకశీతి. 5) జ్ఞాజ్ఞౌద్వావజావీశనీశౌ 6) ప్రాజ్ఞేనాత్మనా సమ్పరిష్వక్తః 7) ప్రాజ్ఞేనాత్మనా అన్వారూఢః 8) అస్మాన్మాయీసృజతే విశ్వమేతత్ తస్మింశ్చాన్యోమాయయాసన్నిరుద్ధః9)ప్రధానక్షేత్రజ్ఞపతిర్గుణేశః10)నిత్యోనిత్యానాం చేతనశ్చేతనానాం ఏకోబహూనాంయోవిదధాతికామాన్** 11) నిత్యులైన వారికి నిత్యుడు చేతనులకు చేతనుడు చాలామందికి ఒక్కడు అయ్యివారలకోరికలను ఎవడు పూర్తిచేస్తున్నాడో **11) యోఽవ్యక్తమన్తరేసంచరన్ యస్యావ్యక్తం శరీరమ్. యమవ్యక్తంనవేద 12) యోఽక్షరమన్తరేసంచరన్ యస్యాక్షరం శరీరం యమక్షరం నవేద 13) యోమృత్యుమన్తరే సంచరన్ యస్యమృత్యుః శరీరం యంమృత్యుర్నవేద. ఏషసర్వభూతాన్తరాత్మాఽపహతపాప్మాదివ్యో దేవఏకోనారాయణః** ఇత్యాది వాక్యాల చేత.

సూ॥ **అశ్మాదివచ్చ తదనుపపత్తిః 2-1-23** అత్యన్తహేయములైన కట్టెలు, మట్టి పెల్లలు / పెడ్డలు, గడ్డిపరకలు మొదలైన ఎప్పుడూ వికారాన్ని పొందుతూ ఉండే అచిత్తులోని విశేషాలకు – అవద్యము / దోషము లేని, వికారము లేని, అన్ని రకాల హేయాలకు ప్రత్యనీక కళ్యాణగుణాలకు ఒకే ఒక్క తావు, తనకన్నా వేరయిన అన్ని వస్తువులకంటే విలక్షణమైన అనన్తజ్ఞానానందైక స్వరూపుడు నానావిధాలైన అనన్త మహావిభూతులు కల బ్రహ్మ స్వరూపముతో ఐక్యము – ఏకత – ఒక్కటిగా సమానంగా ఉండడం ఎట్లా కుదురదో, అట్లాగే చేతనుడు అనన్తములైన దుఃఖాలతో కలయికకు తగినవాడైన వాడు మిణుగురు పురుగుతో సమానుడు, అపహత పాప్మా ఇత్యాది వాక్యాల ద్వారా తెలియవచ్చిన సకల హేయప్రత్యనీక అనవధిక అతిశయ అసంఖ్యేయ కళ్యాణగుణాకరుడైన వానితో సమానంగా బ్రహ్మ భావమును పొందడమునకు తగడు.

ఇక సామానాధికరణ్య నిర్దేశము – **యస్యాత్మా శరీరమ్** ఇత్యాది శ్రుతుల వలన జీవుడు బ్రహ్మకు శరీరము అని తెలుస్తున్నందున బ్రహ్మజీవుడిని శరీరంగా కల్గి దానికి ఆత్మగా ఉండుటను బట్టి జీవుడిని ప్రకారముగా కల్గిన బ్రహ్మను ప్రతిపాదించేదిగా ఉన్నది. సామానాధికరణ్యానికి విరోధి కాదు. పైగా ఈ అర్థాన్నే

అనన్యత్వాన్నే బలపర్చేదిగా కూడా ఉన్నదని **అవస్థితేరితి కాశకృత్స్నః.** ఇత్యాది సూత్రాలతో మాటిమాటికీ ఉపపాదింపబడింది. కావున అన్ని అవస్థలలో ఉన్న బ్రహ్మ చిదచిద్వస్తువులను శరీరమునుగా కల్గిఉన్నాడు. సూక్ష్మచిదచిద్వస్తువులను శరీరంగా కల్గిన బ్రహ్మకారణము. అదే బ్రహ్మ స్థూల చిదచిద్వస్తువులను శరీరముగా కల్గి జగత్తు అనే పేరు గల కార్యమూ ఔతున్నాడు. కనుక జగద్ బ్రహ్మలకు సామానాధికరణ్యము పొసగుతున్నది. జగత్తు బ్రహ్మయొక్క కార్యము. కనుకనే బ్రహ్మతో అనన్యత్వము. అచిత్ వస్తువుకు (ప్రకృతికి) జీవునికి, బ్రహ్మకున్నూ పరిణామిత్వము, దుఃఖిత్వము, కళ్యాణగుణాకరత్వము, అనే స్వభావాలు కలగలసి సంకరము కాకపోవడమే గాకుండా అన్నిరకాల శ్రుతులతోనూ విరోధముండదు.

**సదేవసోమ్యేదమగ్ర ఆసీదేకమేవ** అనే వాక్యము ప్రకారము అవి భాగావస్థలో కూడా అచిత్తుతో కల్సి ఉన్న జీవుడు బ్రహ్మకు శరీరమైనందువల్ల సూక్ష్మరూపంగా ఉండడాన్ని తప్పక ఒప్పుకోవాలి. **వైషమ్యనైర్ఘృణ్యే న సాపేక్షత్వాత్. నకర్మ అవిభాగాదితిచేన్న. అనాదిత్వాదు పపద్యతే చ అపిఉపలభ్యతేచ.** అనే రెండు సూత్రాలతో అచిత్తు జీవులూ సూక్ష్మరూపులై పరమాత్మకు శరీరమై ఉండడమును చెప్పినారు. అవిభాగము నామరూపాలు వేరువేరుగా లేకుండా కల్సి ఉన్నందున చెల్లుతుంది. కనుక బ్రహ్మకు కారణత్వము తప్పక ఏర్పడుతుంది.

ఎవరైతే ఇదే జీవుడికి అవిద్యతో కూడి ఉందని అవస్థను మనసులో పెట్టుకొని ఈ విధమైన భేదాన్ని వర్ణించుతున్నారో వారికి ఇదంతా అసంగతమవుతుంది. ఆ అవస్థలో ఉన్నప్పుడు సర్వజ్ఞత్వము సరేశ్వరత్వం సమస్తానికి కారణమై ఉండడము సర్వులకు ఆత్మగా ఉండడము అందర్నీ శాసించడము ఇత్యాది గుణాలు లేవు కదా! ఈ రూపముతోనే ఇంతకు మునుపు చెప్పిన శ్రుతుల ద్వారా ప్రత్యగాత్మకు భేదము ప్రతిపాదింపబడుతున్నది. అదంతా అవిద్య చేత కల్పింపబడింది అని గదా నీ మతము. అవిద్య చేత పరికల్పితుడైన వానికి అవిద్యా అవస్థలో ముత్యపుచిప్ప వెండి మొదలైన భేదాల వలె పరస్పరము భేదాన్ని **అధికంతు భేదనిర్దేశాత్** ఇత్యాదుల యందు సూత్రకారుడు ప్రతిపాదించడము లేదు. బ్రహ్మ జిజ్ఞాస చేయాలి అని చెప్పిన ప్రకారము జిజ్ఞాస్యుడిగా ఎదుటికొచ్చి జగత్కారణమైన బ్రహ్మవేదాన్తవేద్యుడు అని చెప్పుతూ స్మృతులు న్యాయాలతో ఉన్నట్లు కనపడుతున్న విరోధాన్ని తొలగించుతున్నారు.

**అపీతౌతద్వత్ ప్రసంగాత్ అసమంజసమ్. నతుదృష్టాన్తభావాత్** అనే రెండు సూత్రాలున్నూ ఈ అధికరణము ద్వారా తేల్చబడిన విషయాన్ని వివరిస్తున్నవి. వాటి వద్ద విలక్షణమైన కార్యకారణభావము సంభవించుతుంది అని చెప్పడమే ఆ అధికరణము యొక్క అర్థము. **అసదితిచేన్న ప్రతిషేధమాత్రత్వాత్** అని కూడా ముందరి అధికరణములో ఉన్నదాన్ని అనువదిస్తున్నాడు. తిరిగి చెప్పుతున్నాడు. **ఇది ఇతర వ్యపదేశాధికరణము.**

★ ★ ★

## ఇక ఉపసంహారదర్శనాధికరణము.

సూ॥ **ఉపసంహారదర్శనాన్నేతి చేన్నక్షీరవద్ధి 2-1-24** సర్వజ్ఞుడు సత్యసంకల్పుడుఐన పరబ్రహ్మ స్థూలసూక్ష్మ అవస్థలలో ఉన్న అన్నిచేతనాచేతన వస్తువులను తనకు శరీరముగా చేసుకొని ఉన్నందున సర్వప్రకారుడవడం వల్ల సర్మాత్మత్వము సకలేతర విలక్షణత్వమున్నూ అవిరుద్ధమేనని స్థాపింపబడింది. ఇప్పుడు సత్యసంకల్పుడైన పరబ్రహ్మకు తన సంకల్పము మాత్రాననే విచిత్ర జగత్తును సృష్టి చేయడమున్నూ విరుద్ధము కాదని స్థాపించబడుతున్నది.

పరిమిత శక్తులైన వారు ఒక వస్తువును సృష్టించదల్చుకున్నపుడు అందుకు తగిన కారకసామగ్రిని - ఉపాదానము, సాధనములు (సహకారికారణము) సమకూర్చుకోవలసిన అవసరము కనపడుతున్నది. ఏ ఒక్కటీ తక్కువఐనా తలచిన పనిని నెరవేర్చుకోలేకపోతున్నాడు. ఐనప్పుడు సర్వశక్తులు ఉన్న బ్రహ్మ కారక కలాపాలను సమకూర్చుకోకుండా ఉన్నాడు కనుక జగత్ కారణత్వానికి విరోధము ఎట్లా అనుమానిస్తున్నారు? అన్నట్లయితే చెపుతున్నాము. లోకంలో ఆయా కార్యాలను / పనులను పుట్టించే శక్తి ఉన్నా ఆయా ఉపకరణాలేవీ లేని పరబ్రహ్మకు జగత్తును సృష్టించడం కుదురదు అని ఎవడైనా ఒక తెలివితక్కువ వానికి శంక కలుగవచ్చునని దాన్ని నిరాకరిస్తున్నారు.

ఘటము బట్ట గుడ్డలు ఉత్పత్తి చేసే కుమ్మరి పద్మశాలి మొదలైనవారికి వాటిని పుట్టించే సామర్థ్యము ఉన్నప్పటికీ కొన్ని ఉపకరణాలను చేకూర్చుకొన్నపుడే ఉత్పత్తి చేయగల్గడం సాధ్యమవుతున్నది. వాటిని పుట్టించే శక్తి లేనివారు కావలసిన

వస్తువులను పనిముట్లను సమకూర్చుకున్నప్పటికీ పుట్టింపలేకపోతున్నారు. చేతనైన వాళ్ళు కారక కలాపాన్ని సమకూర్చుకుని పుట్టించుతున్నారు. ఇంతమాత్రమే విశేషము. సర్వశక్తులున్న బ్రహ్మ కూడా జగత్‌సృష్టికి అవసరములైన ఉపకరణములు లేకపోయినప్పుడు ఈ ప్రపంచాన్ని సృష్టించజాలడు. సృష్టికి ముందుకాలములో బ్రహ్మ ఏ సహాయము లేనివాడుగానే ఉన్నట్లు **సదేవసోమ్యేదమగ్ర ఆసీత్. ఏ కోహవైనారాయణ ఆసీత్.** ఇత్యాది వాక్యాల ద్వారా తెలుస్తున్నది. కనుక జగత్తును పుట్టించగల్గడము పొసగదు. అందువల్ల ఉపసంహార దర్శనాన్న ఇతి చేత్ అని. శంకను తొలగిస్తున్నాడు. నక్షీరవద్ధి అని. నీవన్నది తప్పు. పాలవలె అని సమాధానము.

కార్యములను పుట్టించగల సమర్థులందరికీ పరికరాలను కూర్చుకోవలసిన అవసరములేదు. ఎట్లాగంటే పాలు నీళ్ళు మొదలైన వాటికి పెరుగు మంచు గడ్డలను పుట్టించగల సమర్థత ఉన్నది. వాటికి ఏ పరికరాల అక్కర లేదు. అదే తీరుగా అన్నింటినీ పుట్టించేశక్తి (బ్రహ్మకు తనంతటతానే కల్గించగల సమర్థత) ఉన్నది. ఆయనకు ఏ పనిముట్టుతో, ఉపాదానముతో అవసరము లేదు. కనుక జగత్తును సృష్టించగలడు. కనుక జగత్‌కర్తృత్వము పొసగుతుంది. సూత్రములో హి అనే పదమును చేర్చుకోవడము శంకను తెలివితక్కువ వాడిదిగా సూచించడం కొరకు. హి అనడముతో లోకప్రసిద్ధి తెలియవస్తున్నది. పాలల్లో తోడు పెట్టడమనేది పెరుగులో రుచి ఏర్పడటానికే గానీ తోడు లేకున్నా పాలు పెరుగుగా మారుతాయి. ఐతే పెరుగుగా తొందరలో ఏర్పడడము రసము / రుచి – కమ్మదనము కొరకు మాత్రమే తోడును చేరుస్తున్నాము.

సూ॥ **దేవాదివదపిలోకే. 2-1-25** ఎట్లాగైతే దేవాదులు తమ తమ లోకాలలో తమ సంకల్పము మాత్రము చేతనే తమకు అక్కర ఉన్న వస్తువులను పుట్టించుతున్నారో అట్లాగే ఈ పురుషోత్తముడు కూడా తన సంకల్పము చేత మాత్రాననే మొత్తము జగత్తును సృష్టించుతున్నాడు. వేదము ద్వారా ఆయా దేవతలకు ఆయా వస్తువులను పుట్టించగల శక్తి ఉన్నదని తెలుస్తున్నది. ఐతే వాళ్ళను ఇక్కడ దృష్టాన్తముగా చూపడము వేదము ద్వారా సర్వశక్తులు గలవాడుగా బ్రహ్మ తెలుపబడుతున్నాడు. కనుక ఆ దేవతల వలెనే ఈయన సమస్త జగత్తునూ సృష్టించగల నేర్పు గలవాడని సులభంగా అర్థంకావడం కొరకు చెప్పినారు అంతమాత్రమే. **ఇది ఉపసంహారదర్శనాధికరణము**

★ ★ ★

## ఇక కృత్స్నప్రసక్తి అధికరణము.

సూ॥ **కృత్స్నప్రసక్తిః నిరవయవత్వ శబ్దకోపోవా 2-1-26 సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్. ఇదంవా అగ్రేనైవకించనఆసీత్. ఆత్మావాఇదమేక ఏవాగ్రే ఆసీత్.** ఇత్యాది వాక్యాలలో కారణావస్థ యందు బ్రహ్మ ఒక్కడే అవయవములు లేనివాడుగా ఉన్నాడు అనడానికి అర్థం ఏమిటంటే కారణావస్థయందు చిదచిద్విభాగాలు లేకపోవడంతో నిరవయవుడైన బ్రహ్మనే ఉండినాడు అని చెప్పబడింది. అట్లా విభాగములు లేని ఒక్కడు – నిరవయవమైన బ్రహ్మనే బహుస్యాం – అనేకములుగా అవుతాను అని తలచుకొని ఆకాశము వాయువు మొదలైన విభాగము, బ్రహ్మను మొదలుకొని క్షేత్రజ్ఞుడు వరకు ఉన్న విభాగమున్నూ ఐనాడని కూడా చెప్పబడింది. ఇట్లా జరిగింది కాబట్టే ఆ బ్రహ్మనే మొత్తము కార్యముగా అయ్యినాడని తెల్సుకోవలెను. ఇక చిత్తు అనబడే అంశము క్షేత్రజ్ఞుడు అనే విభాగంగా విభజింపబడినాడు. అచిదంశమేమో ఆకాశము మొదలుగా గల భూతములుగా విభజింపబడిందని చెప్పినట్లయితే అప్పుడు **సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్. ఏకమేవాద్వితీయమ్, బ్రహ్మఏకమేవ, ఆత్మైకమేవ** ఇటువంటి వాక్యాలు కారణమైన బ్రహ్మ నిరవయవుడు అని చెప్పే శబ్దాలున్నూ కోపపడుతాయి. బాధింపబడుతవి. సూక్ష్మచిదచిద్వస్తువులను శరీరముగా కల్గిన బ్రహ్మకారణము స్థూలచిదచిద్వస్తువులు శరీరంగా కల బ్రహ్మకార్యము అని ఒప్పుకుంటేనూ అప్పుడు కూడా శరీరి అంశాన్ని కూడా కార్యము అని అంగీకరించినందువల్ల ఇంతకుముందు చెప్పిన దోషము – నిరవయవుడైన బ్రహ్మ అవయవాలు కలవాడు కావడం – నుండి తప్పించుకోవడము కుదురదు. నిరవయవుడైన అతడికి బహుభవనము అనేకములుగా కావడము – పొసగదు. కార్యత్వానికి అవసరపడని / పనికిరాని అంశముగా ఉండడమున్నూ పొసగదు. అందువల్ల అసమంజసముగా కనిపిస్తున్నది. కనుక జగత్తుకు బ్రహ్మకారణమనడము కుదురదు అని ఆక్షేపాన్ని చెప్పితే సమాధానము చెప్పబడుతున్నది.

సూ॥ **శ్రుతేస్తు శబ్దమూలత్వాత్ 2-1-27 తు** అనే శబ్దము ఇంతకుముందు చెప్పినదోషాన్ని తిప్పికొడుతున్నది. నీవు చెప్పినట్లు అసామంజస్యము ఏమీలేదు. ఎందువల్లనంటే శ్రుతి కారణంగా అని. శ్రుతి ఐతే నిరవయవుడైన బ్రహ్మనుండే విచిత్ర సృష్టి జరిగిందని చెప్పింది. వేదంలో చెప్పబడిన అర్థాన్ని విన్నది విన్నట్లుగా అర్థము చేసుకోవాలని అర్థము. ఎంత శ్రుతి ఐతే మాత్రము **అగ్నినా సించేత్** నిప్పులతో చల్లాలి

అని అన్నట్లు పరస్పరము – ఒకదానితో ఒకటి పొసగని విషయాన్ని ప్రతిపాదించజాలదు అని అంటే సమాధానము శబ్దమూలత్వాత్ అని చెప్పినారు. పరమాత్మ శబ్దము – వేదము అనే ఒక్క ప్రమాణము ద్వారానే తెలుపబడుతాడు. ఆయన సకల ఇతర విసజాతీయుడు. అనగా తనకంటే వేరుగా అన్నిటికన్నా విసజాతీయుడు. అందువల్ల ఆయనకు విచిత్రమైన శక్తి ఉన్నదనడంలో విరోధము లేదు. బ్రహ్మ మన అందరిలో కనబడే సాధనాలుగాని దూషణలను గాని పొందడానికి తగడు.

సూ॥ **ఆత్మని చైవం విచిత్రాశ్చహి 2-1-28** ఇంతేకాకుండా ఏవమ్ – ఒక వస్తువుకు చెందిన ధర్మాన్ని మరొక వస్తువునందు ఆరోపణము చేయగా, అచేతనాలైన ఘటాదులయందు కనిపించిన ధర్మాలు దాని సజాతీయుముకాని చేతనునియందు, నిత్యమైన ఆత్మయందున్నూ అంటగలవు. నిజమే కానీ భావము యొక్క స్వభావములో వైచిత్రికారణంగా అంటవు అని కారణమును చెప్తున్నారు. విచిత్రాశ్చహి అని. ఎట్లాగైతే అగ్నిజలము మొదలైనవాటికి పరస్పరము విసజాతీయాలైనవాటికి వేడిమి వంటి విసజాతీయాలైన శక్తులు కనిపిస్తున్నాయో అదే విధంగా లోకంలో కనపడేవాటికి విసజాతీయుడైన పరబ్రహ్మయందు అక్కడ అక్కడ – జీవుడిలో ప్రకృతిలో – కనపడని శక్తులు వేలకొలది ఉన్నాయి కాబట్టి ఉపపన్నము కానిది ఏదీలేదు. అనగా పరమాత్మ అవయవములు సాధనాలు లేనివాడైనా జగత్ సృష్టిని చేయగలడు. దీనినే భగవన్తుడగు పరాశరుడిట్లా చెప్పినాడు. **శ్లో॥ నిర్గుణస్యాప్రమేయ స్య శుద్ధస్యాప్యమలాత్మనః। కథమ్ సర్గాదికర్తృత్వం బ్రహ్మణోఽభ్యుపగమ్యతే॥** సత్త్వరజస్తమోగుణాలు లేనివాడు ఏ ప్రమాణము చేతనున్నూ తెల్సుకోబడనివాడు పుణ్యపాపరూపములైన కర్మలు లేనివాడు దోషములు లేనివాడు ఐన పరమాత్మకు సృష్టి స్థితిలయాలు ఎట్లా అంగీకరింపబడుతవి? అని సామాన్యమానవులవలె శంకించి **శ్లో॥ శక్తయఃసర్వభావానాం అచిన్త్యజ్ఞానగోచరాః। యతోఽతో బ్రహ్మణస్తాస్తు సర్గాద్యాభావశక్తయః। భవన్తితపతాంశ్రేష్ఠ పావకస్యయథోష్ణతా॥** అన్ని రకాలైన భావాలకు (వస్తువుల పుట్టుకకు) శక్తులు ఊహించడానికి వీలు కానివి. జ్ఞానము చేత తెల్సుకోబడేవి కావు. ఎందువలన ఇట్లా అవుతున్నవో అందువల్ల ఆ భావశక్తులన్నీ – సృష్టి స్థితిలయాదులన్నీ బ్రహ్మకు సహజమైనట్టివి. ఓ మహర్షీ అగ్నికి వేడిమి ఎంత సహజమో పరమాత్మకు ఇవన్నీ స్వాభావికములే అని వివరించినాడు సహజాలని. ఇక శ్రుతి కూడా! **కింస్విద్వనంక ఉ సవృక్షః ఆసీత్ యతోద్యావాపృథివీ నిష్టతక్షుః। మనీషిణోమనసా**

**పృచ్ఛతేదుతద్ యదధ్యతిష్ఠద్భువనానిధారయన్. బ్రహ్మవనం బ్రహ్మసవృక్షః ఆసీద్యతో ద్యావాపృథివీ నిష్టతక్షుః. మనీషిణో మనసావిబ్రవీమివో బ్రహ్మాధ్యతిష్ఠద్ భువనాని ధారయన్.** దేనినుంచైతే ఊర్ధ్వలోకాలు అధోలోకాలు చెక్కబడినవో ఆ చెట్టు ఏది? దాన్నిసంపాదించిన వనము ఏది? తెల్సుకోవాలన్నకోరికను గల మేము ప్రార్థిస్తున్నాము. వివరించండి. ఇంకా ఈ భువనాలన్నింటినీ ఎట్లా? మోస్తూ ఉన్నాడు. ఓ మనీషులారా! నేను మనస్సుతో చెపుతున్నాను వినండి. బ్రహ్మ వనము. బ్రహ్మనే చెట్టు. ఆయననుండే ఈ ఏడేడు లోకాలు – ద్యావాపృథివులు చెక్కబడినవి. బ్రహ్మనే ఈలోకాలనన్నింటినీ ధరించి ఉన్నాడు అని చెప్పింది. సామాన్యంగా అందరిలో ఉన్నదిగా కనిపించే ప్రశ్న సర్వవస్తువుల కంటే విలక్షణుడైన పరమాత్మ విషయంలో చెల్లదు. ఈ కారణం చేత కూడా!

సూ॥ **స్వపక్షదోషాచ్చ 2-1-29** స్వపక్షే – తమ పక్షము నందు అనగా ప్రధానాదులే జగత్తుకు కారణమనే పక్షములో లోకములో ఉండే వస్తువుల కంటే విలక్షణముగా లేని కారణంగా సజాతీయమే అవుతున్నందువల్ల ప్రధానాదులయందు లోకంలో ఏయే దోషాలు కనిపిస్తున్నాయో అవే దోషాలు ప్రధానము మున్నగువాటిలోనూ కలుగవచ్చును కాబట్టి తనకన్నా వేరుగా ఉన్న వస్తువుల కంటే విలక్షణుడైన బ్రహ్మనే జగత్తుకు కారణమని ఒప్పుకోక తప్పదు. ముఖ్యంగా ప్రధానము కూడా అవయవాలు లేనిదే. నిరవయవమైన అది మహత్తు మొదలైన వాటికి, వాటినుండి పుట్టిన విచిత్రమైన జగత్తు పుట్టడానికి కారణము ఎట్లా అవుతుంది. సత్వము రజస్సు తమస్సులు అనేవి ప్రధానానికి అవయవాల వంటివే. వాటి సమూహమే ప్రధానము. అనేట్లయితే కాస్త విచారించాల్సి ఉన్నది. సత్వరజస్తమస్సుల సమూహమే ప్రధానమా? లేక సత్వరజస్తమో గుణాలనుండి ఆరబ్దమైనదా? (పుట్టుకొచ్చినదా!) ముందుగా రెండవ వికల్పమును గురించి విచారించుదాము. రజస్తమస్సులు సత్త్వము అనే మూడింటినుండి పుట్టినది అనేట్లయితే కార్యము అవుతుంది కానీ కారణము గాదు. నీవేమో కారణమని అంటున్నావు. అది నీ వాదానికి వ్యతిరేకమైనది. నీవంగీకరించిన దానికి విరోధాన్ని తెస్తుంది. అంతేకాక నీవు సంఖ్యకు విరుద్ధము. ఇరువది నాల్గుతత్వాల సమాహారమే ప్రధానము కదా! అవి కూడా నిరవయవాలు ఐనప్పుడు కార్యాన్ని చేయలేవు. కనుక విరోధమే మిగులుతుంది. లేదూ సత్త్వ రజస్తమస్సుల సమూహమే ప్రధానము అని అంటావూ! అవి కూడా నిరవయవాలు కాబట్టి ఏది ఎక్కడ ఎట్లా

కలువాలి అనే ప్రదేశభేదము లేకుండా కలిసే వాటికి స్థూలమైన ద్రవ్యాన్ని పుట్టించే శక్తి ఉండదు. పోనీ పరమాణువులే కారణము. ప్రధానము కాదు అని అన్నప్పటికీ ఇంతకుముందు చెప్పినట్లే అణువులున్నూ అంశములు లేనివి కాబట్టి, ప్రదేశాలు లేనివీ అవుతున్నందువల్ల అట్లాంటి ప్రదేశము లేకుండా కలుస్తాయి అని అంగీకరించినా, అట్లే కలిసినా స్థూలంగా ఉండే కార్యాన్ని పుట్టించలేకపోవచ్చును.

సూ॥ **సర్వోపేతాచ తద్దర్శనాత్ 2-1-30** సకలేతర వస్తువులకూ విసజాతీయమైన పరదేవత సర్వశక్తులతో కూడుకొని ఉన్నటువంటిది. శ్రుతులు కూడా అట్లాంటి దాన్నిగానే చూపిస్తున్నవి. **పరాఽస్యశక్తిః వివిధైవశ్రూయతే స్వాభావికీజ్ఞానబలక్రియాచ.** ఇతని యొక్క శక్తి చాలా గొప్పది. అది వివిధాలు – పలురకాలుగా ఉన్నదని వినిపించుతున్నది. అది సహజమైనది. ఎవని వల్లనో ఇవ్వబడిందికాదు. అతని జ్ఞానము బలము పనులున్నూ ఆయనకు మాత్రమే తగినవి. స్వాభావికాలు సుమా! అదేవిధంగా **అపహతపాప్మావిజరో విమృత్యుః విశోకోఽవిజిఘత్సోఽపిపాసః సత్యకామః సత్యసంకల్పః** అని పరమాత్మకు సకలేతర విసజాతీయతను ప్రతిపాదించింది. సత్యకాముడు సత్యసంకల్పుడు అని సర్వశక్తియోగాన్ని ప్రతిపాదిస్తున్నవి. ఇంకా **మనోమయఃప్రాణశరీరోభారూపః సత్యకామః సత్యసంకల్పః ఆకాశాత్మా సర్వకర్మాసర్వకామః సర్వగన్ధః సర్వరసః సర్వమిదమభ్యాత్తోఽవాకీఅనాదరః.** ఆయన మనోమయుడు జీవుడిని శరీరముగా కలవాడు ఉజ్జ్వలరూపము కలవాడు. సత్యకాముడు సత్యసంకల్పుడు. ఆకాశము వలె అన్నింటిలోనూ నిండి వాటికి ఆత్మగా ఉన్నవాడు. అన్ని పనులను చేయగలవాడు. అన్ని కోరికలకు స్వరూపమైనవాడు – అందరిచేత కోరబడేవాడు. అన్ని సువాసనలు తానే ఐనవాడు అన్నిరసాలూ తానే. తన సంకల్పము చేతనే ఈ జగత్తునంతా పొందినవాడు. ఎవరితోనూ మాట్లాడవలసిన అవసరము లేనివాడు. ఎవ్వరి యందూ ప్రత్యేకమైన గౌరవభావము కలవాడు కాదు. అనిన్నీ చూపుతూ ఉన్నవి శ్రుతులు.

సూ॥ **వికరణత్వాన్నేతిచేత్ తదుక్తమ్ 2-1-31** ఒకవేళ బ్రహ్మ సకలేతర విలక్షణుడూ సకల శక్తులూ ఉన్నవాడే ఐనా **నతస్యకార్యంకరణం చ విద్యతే** ఆయనకు చేయవలసిన పనిలేదు. పనిలో తోడ్పడే పనిముట్లూ లేవు అని చెపుతున్నందువలన పనిముట్లు ఏవీ లేని ఆయన ఏ వస్తువునూ ఉత్పత్తి చేయజాలడు గదా! అని అంటే దానికి సమాధానము **శబ్దమూలత్వాత్, విచిత్రాశ్చహి** అను సూత్రాలతో చెప్పబడింది.

వేదశబ్దము ఒక్కటే తన విషయంలో ప్రమాణముగా కల్గినవాడు సకల ఇతర విలక్షణుడూ ఐన బ్రహ్మ ఆయా పనిముట్లు లేకున్నా కూడా ఆయా పనులు చేయడంలో సమర్థుడు అని అర్థము. అట్లా అని శ్రుతి చెప్పుతున్నది. **పశ్యత్యచక్షుః సశృణోత్యకర్ణః। అపాణిపోదోజవనోగ్రహీతా** ఆయన కండ్లు లేకుండానే అన్నింటినీ చూస్తాడు. చెవులు లేకున్నా వినగలడు చేతులుకాళ్ళూ లేకపోయినా వేగంగా గమ్యానికి చేరగలడు అన్ని వస్తువు బిఱ్ఱుగ్గా పట్టుకోగలడు. ఇటువంటివే ఇంకా ఎన్నో వాక్యాలున్నవి. **దీనితో కృత్స్న ప్రసక్త్యధికరణము ముగిసింది.**

★ ★ ★

## ఇక ప్రయోజనవత్త్వాధికరణము

సూ॥ **న.ప్రయోజనవత్త్వాత్ 2-1-32** సృష్టికి ముందుకాలములో ఈశ్వరుడు ఒక్కడే ఉంటూ సకలేతరవిలక్షణుడైనందువల్ల సర్వార్థములను సృష్టించగల శక్తి యున్నందున తానే విచిత్రమైన జగత్తును సృష్టించగల్గుతాడు. ఐనా ఈశ్వరుడు జగత్తుకు కారణము అని అనడానికి కుదరదు. సృష్టికి ప్రయోజనము ఉంటుంది. అది విచిత్రమైనది కూడా. ఈశ్వరుడికేమో దాన్ని సృష్టించినందువల్ల ప్రయోజనము లేదు. బుద్ధి పూర్వకంగా పనులు చేసినప్పుడు వాటికి రెండు రకాల ప్రయోజనాలు ఉంటవి. ఒకటి తనకొరకు రెండు ఇతరుల కొరకు. పరబ్రహ్మ సహజంగానే అన్ని కోరికలూ నెరవేరినవాడు కాబట్టి జగత్తును పుట్టించినందువల్ల ఆయనకు తీరని కోరికేదో తీరడం లేదు. పోనీ ఎదుటివాళ్ళకోసమా? అని అంటే అదీకాదు. అవాప్తసమస్తకాముడు గొప్ప దయను చూపెడితేనే పరార్థత్వము నెరవేరుతుంది. దయగలవాడు మనకు కనిపిస్తున్న ఇట్లాంటి గర్భదుఃఖ జన్మదుఃఖ, జరాదుఃఖ మరణదుఃఖములు నరక బాధలతో పాటు నానావిధాలుగా ఉన్న అనన్త దుఃఖాలతో దండిగా నిండిగా ఉన్న ఇటువంటి జగత్తును దయగలవాడు నిజంగా సృష్టించనే సృష్టించడు. దయగలవాడు కనుక కేవలం సుఖాలు మాత్రమే ఉన్న జగత్తును సృష్టిస్తాడు. కరుణ కలవాడు కాబట్టి కనుక తనకు ఎదుటివానికీ ప్రయోజనము లేని సృష్టి చేయడు కావున బ్రహ్మ కారణముకాడు. అని అంటే దానికి సమాధానము చెప్తున్నాము.

సూ॥ **లోకవత్తు లీలాకైవల్యమ్ 2-1-33** అవాప్తసమస్త కాముడు పరిపూర్ణుడు ఏ కొరతలేనివాడు తన సంకల్పము చేత మాత్రాననే వికారములను పొందగల

వివిధ విచిత్ర చిదచిత్తులతో మిశ్రితమైన జగత్తును సష్టి చేయడములో కేవలము ఆట మాత్రమే ఆయనకు ప్రయోజనము. లోకవత్ – లోకములో వలె. ఏడు ద్వీపాలతో కూడిన భూమండలాన్నంతా ఏలుకొనేవాడు నిండుగా శౌర్యవీర్య పరాక్రమాలు గల మహారాజుగారు కేవలము ఆట / వినోదము కొరకే బంతులాట వంటివి ఆడుతున్నాడు. మనము చూస్తూనే ఉన్నాము కూడా. అదేవిధంగా పరబ్రహ్మ కూడా తన సంకల్పము చేతనే ఏర్పడుతున్న జగత్తు పుట్టడము, బ్రతుకుతూ ఉండడము, రక్షింపబడుతూ ఉండడము. చివరికి నశించడము, ఇవి అన్నీ చేయడము వల్ల పరమాత్మకు లీల / ఆట మాత్రమే ప్రయోజనము కాని మరొకటి లేదు. కనుక దోషము లేదు.

సూ॥ **వైషమ్యనైర్ఘృణ్యేన సాపేక్షత్వాత్ తథాహిదర్శయతి 2-1-34** ఒకవేళ పరమ పురుషుడు సకలేతర చిదచిద్వస్తు విలక్షణుడు ఐనందువల్ల ఊహించ వీలుకాని శక్తియుక్తుడు కనుక, సృష్టికి మునుపు ఒక్కడుగానే ఉన్నటువంటివాడు అవయవాలు లేనివాడు విచిత్ర చిదచిన్మిశ్రితమైన సృష్టిని చేయగలడు అని ఊహించినా దేవతలు – తిర్యక్కులు – మనుష్యులు – స్థావరాలు అనే రూపాల్లో గొప్పవాడు – మధ్యముడు – హీనుడు ఐనవారిని సృష్టించుటవలన ఆయనకు పక్షపాతము – ఒకరిపైన నిష్కారణంగా ప్రేమ, మరొకరిపైన క్రోధమును చూపుట – చూపినట్లవుతుంది. పైపెచ్చు ఘోరాతిఘోరమైన దుఃఖాలనున్నూ ఏర్పర్చడము వల్ల నైర్ఘృణ్యము – దయలేకపోవుట కూడా ఆయనకు చుట్టుకుంటుంది. అని అంటే సమాధానము ఇది. న. సాపేక్షత్వాత్ అని. వైషమ్యనైర్ఘృణ్యాలు సంభవించవు. ఎందువల్ల నంటే అందుకు కారణము అపేక్షింపబడుతున్నది. కోరబడుతున్నది. పుట్టింపబడే దేవతలు మొదలైన క్షేత్రజ్ఞులయొక్క విషమసృష్టికి వారి కర్మనే అపేక్షింపబడుతున్నది. దేవాదులైన క్షేత్రజ్ఞులకు దేవాది శరీరాలతో జతకూర్చడము వారివారి కర్మల సమ్బన్ధాన్ని బట్టి ఏర్పడుతున్నది అని శ్రుతులు స్మృతులు ప్రమాణాలు చూపిస్తున్నవి. **సాధుకారీ సాధుర్భవతి. పాపకారీ పాపోభవతి. పుణ్యఃపుణ్యేన కర్మణాభవతి పాపః పాపేన.** మంచిపనులు చేసేవాడు సాధువు అవుతున్నాడు పాపపు పనులు చేసేవాడు చెడుగు అవుతున్నాడు. పుణ్యకర్మల చేత పుణ్యుడు అవుతున్నాడు. పాపముతో పాపి అవుతున్నాడు. అట్లాగే భగవన్తుడగు పరాశరుడు దేవాది విచిత్ర సృష్టికి కారణము పుట్టింపబడుతున్న క్షేత్రజ్ఞులు పూర్వ జన్మలలో చేసుకున్న కర్మ శక్తియే కారణము అని కంఠోక్తిగా పల్కినాడు. **శ్లో॥ నిమిత్తమాత్రమేవాసౌ సృజ్యానాంసర్గకర్మణి। ప్రధాన కారణీ**

**భూతాయతో వైసృజ్యశక్తయః.** ఈయన మాత్రము సృష్టికార్యములో సృష్టింపబడేవాళ్ళ పుట్టుకకు నిమిత్తకారణము మాత్రమే. సృజ్యశక్తులు – పుణ్యపాపరూపాలు – ప్రధానకారణము – ఉపాదానము – అవుతున్నాయి. **శ్లో॥ నిమిత్తమాత్రంముక్త్వైవ నాన్యత్ కించిదపేక్షతే। నీయతేతపతాంశ్రేష్ఠస్వశక్త్యా వస్తువస్తుతామ్।** ఓ శ్రేష్ఠతపస్వీ। వస్తువు తను వస్తువుగా మారడానికి నిమిత్తాన్ని మాత్రమే సహాయంగా కోరుతున్నది. తనదైన పుణ్యపాపరూపకర్మ శక్తి చేతనే ఏదో ఒక వస్తువుగా పరిణమించుతున్నది అని స్వశక్త్యా – తమ కర్మ చేతనే దేవతలు మొదలైన వస్తువులుగా వస్తుత్వాన్ని పొందుతున్నది అని అర్థము.

సూ॥ **న. కర్మావిభాగాదితి చేన్న. అనాదిత్వాదు పపద్యతే చాపి ఉపలభ్యతేచ 2-1-35** సృష్టికి ముందటికాలంలో క్షేత్రజ్ఞులు అనే వాళ్ళే లేరు. ఎందువల్ల? విభాగము చేయబడలేదని శ్రుతి వినిపిస్తున్నది. **సదేవసోమ్యేదమగ్ర ఆసీత్** అని. కనుక అప్పుడు ఆ క్షేత్రజ్ఞులు లేరు. విభాగము లేదు. కనుక వాళ్ళకు కర్మ కూడా లేదు. అటువంటప్పుడు సృష్టిలోని వైషమ్యానికి కర్మ కారణము అని ఏ విధంగా చెపుతున్నారు. అని అంటే కాదు. క్షేత్రజ్ఞులు వాళ్ళ కర్మప్రవాహమున్నూ అనాదిగా కొనసాగుతూనే ఉన్నవి. అందువల్ల అనాదియే ఐనా అవిభాగము కూడా పొసగుతూనే ఉన్నది. క్షేత్రజ్ఞుడు అనే వస్తువు తనదైన నామాన్ని రూపాన్ని వదలుకొని బ్రహ్మ యొక్క శరీరముగా వేరుగా పిలువడానికి వీలుకాని మిక్కిలి చిన్నదైన సూక్ష్మమైన స్థితిలో ఉంటున్నది. అట్లా ఒప్పుకోకపోతే చెయ్యని కర్మకు ఫలము దక్కడము చేసిన మంచిపనిని కోలుపోవడము అనే రెండు అనిష్టాలు సంప్రాప్తిస్తవి. అయితే క్షేత్రజ్ఞులు వాళ్ళయొక్క కర్మ అనాదిగా కొనసాగుతూనే ఉన్నదని వేదములో లభిస్తున్నది ప్రమాణము. **నజాయతే మ్రియతేవా విపశ్చిత్.** విద్వాంసుడు – జ్ఞానము కలవాడైన ఆత్మ – పుట్టటం లేదు చావడమూ లేదు. అని సృష్టి అనాది ప్రవాహంగా కొనసాగుతూనే ఉన్నది అనే విషయానికి సమ్బన్ధించి **సూర్యాచంద్రమసౌ ధాతాయథాపూర్వమకల్పయత్.** బ్రహ్మగారు ఇంతకు మునుపు కల్పములో ఉన్నట్లు సూర్యుడిని చంద్రుడినిన్నీ పుట్టించినాడు ఇత్యాది వాక్యాల ద్వారా తెలుస్తున్నది. **తద్ధేదంతర్హ్య వ్యాకృత మాసీత్. తన్నామరూపాభ్యామ్ వ్యాక్రియత.** అప్పుడు సృష్టికి ముందటికాలములో ఇప్పుడున్న ఈ జగత్ విభాగము చేయబడకుండా ఉండినది. (దాన్నే విడదీసి నామరూపాలను ఏర్పరచినారు) అదే నామరూపాలతో విడదీయబడింది అని నామరూప విభాగము మాత్రమే వినిపిస్తున్నది.

కాబట్టి క్షేత్రజ్ఞులయొక్క స్వరూపము అనాదిగా ఉన్నదని సిద్ధించింది. స్మృతిలో కూడా – **ప్రకృతింపురుషంచైవ విద్ధి అనాదీ ఉభావపి** ప్రకృతిని పురుషుడినిన్నీ ఇద్దరినీ అనాదిగా ఉంటూన్న వారినిగా తెల్సుకో అని చెప్పబడింది. కనుక సర్వవిలక్షణుడూ సర్వశక్తులు గలవాడు ఐనందున తన వినోదము / ఆట కొరకు మాత్రమే అదే ప్రయోజనముగా కలవాడైనందున క్షేత్రజ్ఞులయొక్క కర్మలకు తగినట్లుగా విచిత్ర సృష్టిని చేయగల్గుతున్నందున జగత్కారణము బ్రహ్మనే.

సూ॥ **సర్వధర్మోపపత్తేశ్చ 2-1-36** ప్రధానము, పరమాణువులు జగత్ యొక్క పుట్టుకకు కారణాలు అవుతున్నవని అన్నప్పుడు ఏయే ధర్మాలు వాటిలో లేవని చెప్పబడినవో, ఇంకా మునుముందు చెప్పబడనున్నవో అవి అన్నీ కూడా కారణత్వాన్ని ఉపపాదించేవి అయ్యి బ్రహ్మ యందే చక్కగా అమరుతున్నవి కనుక బ్రహ్మ మాత్రమే జగత్ కారణమని నిలిచింది. **ఇది ప్రయోజనవత్వాధికరణము.**

**ఇంతటితో శ్రీభాష్యమునందు ద్వితీయాధ్యాయములోని**
ప్రథమపాదము ముగిసినది.

శ్రీమతే రామానుజాయనమః

## శ్రీభాష్యము – ద్వితీయాధ్యాయము – ద్వితీయపాదము

## రచనానుపపత్తి అధికరణము

సూ॥ **రచనాఽనుపపత్తేశ్చనానుమానం. ప్రవృత్తేశ్చ. 2-2-1** ఇంతవరకు జగత్తు యొక్క పుట్టుక మొదలైనవాటికి కారణమైనవాడు పరంబ్రహ్మనే అని చెప్పబడింది. ఆ విషయంలో ఎదుటి పక్షము వారు లేవనెత్తిన దోషాలన్నీ త్రోసిపార వేయబడినవి. ఇపుడు తమ పక్షాన్ని కాపాడుకోవడానికి ఎదుటివారి వాదాలు తిప్పికొట్టబడుతున్నాయి. లేకపోతే మందబుద్ధులు ఐనవారిలో ఎవడికైనా ఒకనికి అవతలివాళ్ళ వాదాలలో ఉన్న యుక్తులు ఆభాసాలేకాని నిజనమైనవి కావని తెలియనందువల్ల ప్రామాణికములేమోనన్న శంకతో వైదిక పక్షముపైన కొంచెము శ్రద్ధాలోపము కలుగవచ్చును. కనుక పరులయొక్క వాదాలను తిప్పికొట్టడానికిగాను

తరువాతిపాదము ప్రారంభింపబడుతున్నది. దీనిలో ఇతర వాదాల్లో లేని కొన్ని విశేషాలున్నాయి. అవి వైదికమతము అంగీకరించిన సత్తునుండే జగత్తు అనే కార్యము పుట్టింది అని (24) ఇరువది నాలుగు తత్త్వాలు ఉన్నవి అనడం వంటి అర్థాలను వారు అంగీకరించి ఉన్నందున సత్ పక్షము సరియైన పక్షము – సత్తు అనబడే భగవన్తుడు ఉన్నాడు అని అంగీకరించే వారి యొక్క వర్గములో ఉంచవలసి ఉండెను అని ఊహించి సత్పక్షముగా భ్రమపడే అవకాశము అధికంగా ఉన్నదికాబట్టి. **ఈక్షతేర్నాశబ్దం** మొదలైన సూత్రాలతో వైదిక వాక్యాలు ప్రధానాన్ని జగత్ కారణంగా చెప్పడంలేదు. నారాయణుడినే వేదవాక్యాలు తెల్పుతున్నవి అన్నంతవరకూ మాత్రమే అక్కడ స్థాపించినారు. ఇక్కడ మాత్రమే వాళ్ళ యొక్క వాదాన్ని ఎత్తిచూపి తిరుగగొట్టబడుతున్నది. కావున పునరుక్తి దోషమును అపాదించడానికి వీలులేదు. సాంఖ్యుల యొక్క దర్శనము ఇట్లాగా ఉన్నది –

**శ్లో॥ మూలం ప్రకృతిః అవికృతిః మహదాద్యాః ప్రకృతి వికృతయః సప్త। షోడశకశ్చవికారః నప్రకృతిఃనవికృతిః పురుషః** ప్రపంచము యొక్క పుట్టుకకు మూల కారణమైనది ప్రకృతి. అది వికారాలను పొందదు. మహత్తు మొదలైనవి తమ నుండి పుట్టినవాటికి తాము ప్రకృతులు. తమ పుట్టడానికి హేతువులైన వాటికి వికృతులు :– అవి ఏడు. వికారాల సముదాయము 16 పదారు వస్తువులతో ఏర్పడింది. పురుషుడు దేనికీ ప్రకృతి కాదు. వికృతి కూడా కాదు. మొత్తము ప్రకృతి సమ్బన్ధముగా ఏర్పడిన తత్త్వాలు 24 ఇరువది నాలుగు. పురుషుడు ఒక్కడు. మొత్తము అన్నీ కలిపి 25 ఇరువది ఐదు తత్త్వాలు. ఇది తత్త్వాల సంగ్రహము.

మూల ప్రకృతి అంటే సుఖదుఃఖమోహ స్వభావము కలవి లాఘవము ప్రకారము చలనము ధారణము గౌరవము ఆవరణము అనే కార్యాలను చేసేవి సాధారణంగా ఇంద్రియాలచేత గుర్తింపబడనివి ఎప్పుడూ జరిగిన పనిని బట్టి ఊహించవలసినటువంటివి ఒకదాని కంటే ఒకటి ఎక్కువ తక్కువలు లేనటువంటివి. సరి సమానంగా ఉండేవి సత్యము రజస్సు తమస్సు అనే ద్రవ్యాలు. అట్లా సత్త్వరజస్తమస్సులయొక్క సామ్యరూపమైన ప్రకృతి ఒక్కటి. స్వయముగా చైతన్యము / జ్ఞానము లేనిది. ఐతే అనేక చేతనులయొక్క అనుభవము మోక్షములకు ఉపయోగపడేది. ఎల్లప్పుడూ ఉండేదినిత్యా. అంతటా నిండి ఉన్నటువంటిది. ఎప్పుడూ వికారాలను పొందేటువంటిది. కాని దేనికీ ఇది వికృతి కాదు. అనగా దేనినుంచీ

పుట్టింది కాదు. ఐతే పరమ కారణమే. దానియొక్క వికృతులు మహత్తు మొదలైనవి మూల ప్రకృతికి వికృతులు / కార్యాలు. అవి ఏడు. 1) మహత్తు 2) అహంకారము 3) శబ్దతన్మాత్రము 4) స్పర్శతన్మాత్రము 5) రూపతన్మాత్రము 6) రసతన్మాత్రము 7) గన్ధతన్మాత్రము అని. వాటిలో అహంకారము మూడు రకాలుగా ఉన్నది. 1) వైకారికము 2) తైజసము 3) భూతాది. అని క్రమంగా వాటినే సాత్త్వికాహంకారము రాజసాహంకారము తామసాహంకారము అని అంటారు. దాంట్లో వైకారికము సాత్త్వికము అనేది ఇంద్రియాలకు మూలమైనది. భూతాది అనబడే దితామసము పంచమహాభూతాలకు హేతువైన తన్మాత్రలు పుట్టడానికి కారణము. తైజసము రాజసమున్నూ కలసి రెండింటికీ తోడుపడుతుంది. ఆకాశము మొదలైనవి ఐదు మహాభూతాలు చెవులు మొదలైనవి ఐదు జ్ఞానేంద్రియాలు వాక్కు / మాట మొదలైనవి ఐదు కర్మేంద్రియాలు మనస్సు ఒక్కటి. ఇవన్నీ కేవల వికారాలే. ఇవి మొత్తము (16) పదహారు. పురుషుడు మాత్రము మార్పులు లేనివాడు కనుక దేనికీ ప్రకృతి కాదు. దేనికీ వికృతి కాదు. అందువల్లనే ఏ ధర్మమూ లేనివాడు అనగా జ్ఞాతృత్వము లేనివాడు. కేవలము చైతన్యమే శరీరముగా కలవాడు. ఏ పనీ చేయడు. అంతటా కనిపించుతాడు. ప్రతి శరీరాన్ని బట్టి వేరుగా ఉంటాడు. నిర్వికారుడూ నిష్క్రియుడూ కాబట్టి అతడికి కర్తృత్వము లేదు. భోక్తృత్వము – అనుభవించడమున్నూ లేదు.

తత్వము ఇట్లా ఉంటుండగా మూఢులు ఐనవారు ప్రకృతి పురుషులు ఒకరికొకరు దగ్గరగా ఉంటున్నందువల్ల పురుషుడిలో కనపడే చైతన్యాన్ని ప్రకృతి యందు ఆరోపించి ప్రకృతికి గల కర్తృత్వమును తెల్లటి స్వచ్ఛమైన స్ఫటికమణిలో వలె దాచనపువ్వు యొక్క ఎరుపును పురుషుని యందు తెచ్చిపెట్టి నేను కర్తను నేను భోక్తను అని అనుకుంటున్నాడని భావిస్తుంటారు. ఈ విధంగా అజ్ఞానము వల్ల సుఖదుఃఖ అనుభవము ఏర్పడుతున్నది. తత్వములయొక్క జ్ఞానము కలిగితే మోక్షము సిద్ధిస్తున్నది.

ఈ విషయాన్ని వారు ప్రత్యక్ష ప్రమాణము, అనుమాన ప్రమాణము. ఆగమ ప్రమాణాల ద్వారా సాధించుతున్నారు. వాటిలో ప్రత్యక్షము ద్వారా తెలియవచ్చిన పదార్థాల గురించి పెద్దగా వివాదము లేదు. ఆగమము కూడా కపిలుడు మొదలైన సర్వజ్ఞుల, జ్ఞానమూలమైనది అని తెలుస్తున్నది. ఆ విషయము కూడా పూర్వమీమాంసలోని మొదటి కాండలో, ప్రమాణ లక్షణములో దాదాపుగా ప్రక్కకు పెట్టిబడింది. ఏ ప్రధానమనబడేది ఏది ఉందో అది జగత్‌కారణము అని

అనుమానింపబడుతున్నది. ఆ అనుమాన ప్రమాణాన్ని సహేతుకంగా కాదని ఖండించితే ఆ మతము మొత్తమూ కనపడకుండా పోతుంది కనుక దాన్నే నిరసించుతున్నారు.

వాళ్ళు ఈ విధంగా వర్ణించుతున్నారు – సమస్త జగత్తుకూ ఒక్కడే కారణము / లేక ఒక్కదాని నుండే వచ్చిందని అంగీకరించాల్సి ఉంటుంది. అనేకుల వలన కార్యము పుడుతుందని ఒప్పుకుంటే కారణమేదో తెలియక ఒక దగ్గర నిలువకుండా పోయి అనవస్థ అనే దోషము వస్తుంది. దారాలు మొదలైన బట్టలోని అవయవాలు తమకు అంశాలైన ఆరు పార్శ్వాలు – ఆరుపక్కలతో ఒకదాని కొకటి కలిసిపోతున్నవై అవయవి ఐన బట్ట గుడ్డను పుట్టిస్తవి. ఆదారాలు కూడా తమ యొక్క అవయవాలైన ఆరు పార్శ్యాలుగలవాటితో పుడుతున్నవి. అవి కూడా తమకు ఉత్పాదకము లైనవాటివలెనే తమ అవయవాలతో పుడుతవి. ఇట్లాగే పరమాణువులు కూడా తమవైన ఆరు పార్శ్వాలతో సంయోగమును చెంది పుట్టుతున్నవి. వాటి కార్యాన్ని అట్లాగా అంగీకరించాలి. లేకపోతే ప్రథిమా / దొడ్డుతనము / కనబడుట జరుగదు. కాబట్టి పరమాణువులు కూడా అంశములు కలవిఐ అంశి అని అనబడుతున్నవి కనుక తమ అంశాలతో పుడుతవి. అవి స్వాంశలతో జన్మిస్తవి. కాబట్టి ఎక్కడా నిలుకడ లేకుండా పోతుంది. కనుక కారణము నిశ్చయము కాదు. కావున కారణవ్యవస్థ ఏర్పడడం కోసము ఒక ద్రవ్యము వివిధములైన విచిత్రము లైన పరిణామములను చెందగల శక్తితో కూడిన దాన్ని తాను స్వయముగా తనదైన స్వరూపాన్ని కోలుపోనిదై మహత్తు మొదలుకొని అనంతమైన అవస్థలకు తావు అయ్యినదిగా కారణాన్ని ఆశ్రయించాలి.

అటువంటి ఆ ఒక్క కారణము సత్త్వ రజస్తమస్సులనే మూడు గుణాల సమానరూపమైనదిగా ఉండి ప్రధానమని పిలువబడుతుంది. అటువంటి దాన్ని కల్పించడానికి హేతువులను ఇట్లా ఉపన్యసిస్తున్నారు.

శ్లో॥ **భేదానాంపరిణామాత్ సమన్వయాత్ శక్తితః ప్రవృత్తేశ్చ। కారణకార్య విభాగాత్ అవిభాగాద్వైశ్వరూప్యస్య। కారణమస్త్యవ్యక్తమ్.**

దీని అర్థము ఇది – విశ్వము యొక్క రూపమే వైశ్వరూపము. విచిత్రములైన సన్నివేశములు / కూర్పులు గల్గినట్టిది. తనువు / శరీరము మొదలుకొని భువనము మొదలు ఐనదిగా ఉండేది ఈ సమస్త ప్రపంచము. ఆ జగత్తు వింతవింతలైన సన్నివేశాలు కలదిగాబట్టి దానితో సారూప్యము / సమానరూపము / పోలిక గల అవ్యక్తాన్ని కారణంగా కల్గియున్నది.

ఎందువల్లనంటే అది కార్యము అనబడుతున్నది కాబట్టి. కార్యమైనదంతా తనకు సమానమైన రూపము గల కారణవిశేషముతో విభాగము / వేర్పాటు అందులో అవిభాగము వేరుకాదు / ఒక్కటే అనబడడమున్నూ కనపడుతున్నది. ఎట్లా అంటే? కార్యములు ఐన కుండ కిరీటములు తమతో సమానరూపము గల మట్టి బంగారములు కారణాలు ఐనందున విభాగము, అందులోనే అవిభాగమున్నూ ఉన్నది. అందువల్ల విశ్వరూపమైన జగత్తు దానితో సమానరూపము గల ప్రధానము నుండి పుడుతున్నది. దానిలోనే లీనమవుతున్నది. కల్సిపోతున్నది. కనుక ప్రధానమునే కారణముగా కలది ఈ జగత్తు.

సత్వరజస్తమో గుణాలు సమానంగా ఉన్న రూపమే ప్రధానము. అదే జగత్తుతో సమానరూపము కలదై కారణమవుతున్నది. ఎందువల్లనంటే సత్వరజస్తమోమయమై సుఖదుఃఖమోహాత్మకంగా జగత్తు ఉన్నది కాబట్టి. ఉదాహరణకు మట్టితో చేయబడిన ఘటమునకు మృద్ద్రవ్యమే కారణమవుతున్నదని తెలుస్తున్నది కదా! ఆ ప్రధానమే దానియొక్క ఉత్పత్తి అనే పేరుగల ప్రవృత్తి అనే శక్తిని కల్గి ఉన్నది. అట్లాగా కనపడుతున్నది కాబట్టి.

గుణాలు సమానంగా ఉండే అవ్యక్తము దేశాన్ని బట్టి కాలాన్ని బట్టి అపరిమితమైనదయ్యే భేదాలకు కారణమవుతున్నది. ఐతే ఈ విషయము మహత్తు, అహంకారము, తన్మాత్రలు పరిమితాలుగా ఉన్నందువల్ల తెలుస్తున్నది. మహత్తు మొదలైనవి కుండల వలె పరిమితాలుగా ఉన్నవి. కనుక ప్రపంచము మొత్తాన్ని పుట్టించలేవు.

ఇందువల్ల త్రిగుణ స్వరూపమైన జగత్తు గుణత్రయము సమానంగా ఉండే రూపమైన ప్రధానాన్నే కారణంగా కల్గి ఉంటున్నదని నిశ్చయింపబడుతున్నది.

దీనికిసమాధానముఇట్లాచెప్పబడుతున్నది–రచనాఽనుపపత్తేశ్చనానుమానం. ప్రవృత్తేశ్చ. అనుమానింపబడుతున్నది కనుక అనుమానము అనబడుతున్నది. నీవు చెప్పిన ప్రధానము విచిత్రమై జగద్రచన చేయడానికి సమర్థత కలదికాదు. అది అచేతన మవడమే కాకుండా దానియొక్క స్వభావాన్ని ఎరిగిన వాడి చేత అధిష్ఠితము కాలేదు కాబట్టి. ఏది ఇట్లా ఉంటుందో అది అట్లా ఉంటుంది. కారణము ఎట్లా ఉంటే కార్యము ఆ తీరుగా ఉంటుంది. ఎట్లాగానంటే రథాలను పెద్దపెద్ద మేడలను నిర్మించినప్పుడు

కేవలము కఱ్ఱమొదలైనవి రథాలుగానూ, మట్టి రాళ్ళూ మేడలుగానూ తమంతాముగానే ఎట్లా మార్పుచెందలేవో అదేవిధంగా అచేతనమైన దుంగలు మొదలైనవి వాటియొక్క స్వరూపస్వభావాలు తెల్సిన వడ్రంగి మొదలైన తెల్సినవారు చేపట్టకుండా, కారణమైన కఱ్ఱ మొదలైనవి కార్యములైన రథాదులుగా సిద్ధం కాకపోవడం కనిపిస్తున్నది కదా! అదే దాన్ని తెల్సినవాడు చేపడితే కార్యము సిద్ధము కావడమును చూస్తున్నాము కనుక ప్రాజ్ఞుడైన వానిచేత అధిష్ఠింపబడని ప్రధానము కారణము అని అనబడదు. సూత్రములోని చకారము అన్వయమునకు అనైకాన్త్యాన్ని – అతివ్యాప్తిని జతపరుస్తున్నది. అన్వితమైన తెల్లదనము, గోత్వము మొదలైనవి కారణత్వముతో సమ్బన్ధము కలవి కావు. శౌక్ల్యాది ధర్మాలు అన్వయించినప్పటికీ వాటికి కారణత్వము లేకుండునుగాక! కార్యములో కలసి ఉన్న బంగారము మొదలైన ద్రవ్యానికి కారణత్వవ్యాప్తి ఉండనే ఉన్నది సత్త్వాదులు మొదలైన ద్రవ్యాలు కార్యమునందు (జగత్తునందు) అన్వయించి / కలసి కారణాలు అవుతున్నాయి. అని అనబోకు. ఎందుకంటే సత్త్వము మొదలైనవి ద్రవ్యము యొక్క ధర్మాలు మాత్రమే కానీ ద్రవ్యముయొక్క స్వరూపము కాదు. సత్త్వఆదులు పృథివీ మొదలైన ద్రవ్యాలలో ఉండే లఘుత్వము, ప్రకాశము మొదలైనవాటి కారణాలు మాత్రమే గాక దానియొక్క (ద్రవ్యము) స్వభావవిశేషాలు మాత్రమే. మట్టి బంగారము మొదలైనవాటివలె ద్రవ్యము ఐనందువల్ల కార్యములో కలసి మనకు లభించడము లేదు. పైగా లోకంలో సత్త్వరజతమస్సులకు గుణాలు అని ప్రసిద్ధి ఉన్నది. అవి ద్రవ్యాలు కావు. కనుక కార్యంలో కనిపించవు. ప్రధానము జగత్కారణమైనప్పుడు కార్యములో సత్త్వరజస్తమో గుణాలు కనిపించుతున్నాయి కాని కుండలోని మట్టివలె కంటికి కారణము ఐన ప్రధానము కనపడదు అని అర్థము.

కారణవ్యవస్థ సిద్ధించడానికి / ఏర్పడడానికి జగత్తు ఒకే కారణానికి చెందినదై ఏది ఉండాలి అని చెప్పినారో అది కారణమైన ప్రధానములో లేదు అనేక సత్త్వాదులున్నాయి కనుక ఏకత్వము కుదురదు. కావుననే కారణత్వవ్యవస్థ కూడా సిద్ధించదు. ఎందుకంటే నీ అభిప్రాయము ప్రకారము సమానమైన స్థాయిలో ఉన్న సత్త్వాదులే ప్రధానము అని అనబడుతాయి అని కదా! కనుక కారణాలు చాలా ఉన్నవి కాబట్టి అనవస్థ అనవస్థ గానే ఉండి తీరుతుంది. అవి అపరిమితములు కాబట్టి వ్యవస్థనిలుస్తుంది అనిన్నీ అనడానికి వీల్లేదు. అపరిమితాలే ఐనా ఆ మూడు సత్త్వరజస్తమస్సులు ఎల్లెడలా నిండి ఉన్నందున ఎక్కువ తక్కువలు లేనివి కాబట్టి వైషమ్యము ఏర్పడడంలేదు. దానితో జగత్కార్యము

ఆరంభము కాదు. కనుక జగత్తు అనే కార్యము ఏర్పడడం కోసము పరిమితిని తప్పక ఒప్పుకోవలసి ఉంటుంది.

రథాదులందు చేతనుడిచేత అధిష్ఠితత్వము కనపడుతున్నది. దానికి వ్యతిరిక్తమైన దంతా (వేరయినది) చేతనుని ప్రమేయం లేకుండానే వస్తువుగా / కార్యముగా మారుతున్నది కదా అని అంటే –

సూ॥**పయోఽమ్బువచ్చేత్తత్రాపి 2–2–2**ప్రాజ్ఞుడి చేత అధిష్ఠింపబడని ప్రధానము జగత్తును రచించడం కుదరదు అని అన్నారో అది సరియైనది కాదు. ఎందువల్లనంటే నీరు, పాలవలె చక్కగా కుదురుతుంది. పాలు పెరుగుగా మారుతుంటుండగా మరొకరి జోలిని కోరడం లేదు. మొదటి పరిణామక్రమం నుండీ పెరుగుగా మారేంత వరకు ఉండే పరిణామాల వరుసక్రమం తనకు తానే జరుగుతున్నది. మబ్బుల్లో నుండి జారిపడిన మంచి నీరులో రుచి ఒక్కటే ఉన్నా నేల మీదికి వచ్చిన తర్వాత కొబ్బరి, తాటి, మామిడి, వెలగ, వేప, చింత మొదలైన రుచులలో విచిత్రమైన త్ర సరూపంగా పరిణామాన్ని చెందడము స్వతఃగానే జరుగుతున్నది. అట్లాగానే ప్రధానము కూడా సహజంగానే పరిణామాన్ని చెందే స్వభావాన్ని కలది కాబట్టి ఎవనిచేత కూడా అధిష్ఠింపబడకుండానే ప్రతి క్రొత్త క్రొత్త సృష్టి – ప్రతి వస్తు ఉత్పత్తిలో – దశలో తగిన పరిణామంతో కూడి ఉన్నదానికి సర్గావస్థలో సత్వాది గుణాలలో ఎక్కువ తక్కువల కారణంగా ఏర్పడిన వింత పరిణామాన్ని చెందడము యుక్తమే అవుతుంది. కనుకనే ఇట్లా అన్నారు.

**పరిణామతః సలిలవత్ ప్రతిప్రతిగుణాశ్రయవిశేషాత్** ఒక్కొక్క గుణాన్ని ఆశ్రయించి ఉన్న విశేషాన్ని బట్టి పరిణామము కలుగుతుంది. ఎట్లాగంటే నీటిలో వలె అని. కాబట్టి ఇదే తీరుగా అవ్యక్తము అనబడే ప్రధానము ఎవ్వరినీ సహాయము కోరకుండానే సృష్టి కార్యానికి పూనుకొంటుంది అని అంటే దానికి సమాధానము అక్కడ కూడా అనుపపత్తియే ఉన్నది అని చెప్పుతున్నారు. పాలను నీళ్ళను మీరు ఉదాహరణగా చూపినారు కదా! అక్కడ కూడా ప్రాజ్ఞాధిష్ఠితమైనప్పుడు ప్రవృత్తి కుదరనే కుదరదు. అది కూడా ఇంతకుముందు చెప్పినవిధంగా పక్షంలో ఒక భాగమే అవుతుంది అని అభిప్రాయము. **ఉపసంహారదర్శనాన్న ఇతిచేన్న. క్షీరవద్ధి.** అనే సూత్రము దగ్గర కనిపించే ఇతర పరికరాలు లేకున్నా తనదైన అసాధారణ పరిణామము పొసగుతుంది అని మాత్రమే చెప్పినాము. ప్రాజ్ఞాధిష్ఠాతృత్వమును తోసివేయలేదు. **యోఽప్సుతిష్ఠన్** ఎవడు నీటిలో ఉంటాడో అని చెప్పినట్లు నీళ్ళల్లో పాలల్లో కూడా

పరమాత్మ ఉన్నాడు కాబట్టి ఆయన సంకల్పం వల్లే అవి మంచు గడ్డలుగా పెరుగుగా పరిణామాన్ని చెందుతున్నాయి. కాబట్టి ప్రాజ్ఞుడి చేత అధిష్ఠింపబడని ప్రధానము పరిణామాన్ని పొందజాలదు.

సూ॥ **వ్యతిరేక అనవస్థితేశ్చ అనపేక్షత్వాత్ 2–2–3** ఈ కారణము వలన కూడా ప్రధాన రచన జరుగదు. సత్యసంకల్పుడైన ఈశ్వరుడుని అధిష్ఠాతగా కోరకుండానే ప్రధానము జగద్రూపంగా పరిణమించేటట్లయితే సర్గము కాకుండా – ప్రతిసర్గము – వ్యక్తిసృష్టి అవస్థలో ఉండకుండా పోయే అవకాశమున్నందున ప్రాజ్ఞుడి చేత అధిష్ఠింపబడని ప్రధానము జగత్ సృష్టికి కారణము కాబోదు. ప్రాజ్ఞుడిచేత అధిష్ఠింపబడినప్పుడు ఆయన సత్యసంకల్పుడు కాబట్టి సర్గము, ప్రతిసర్గము మొదలుగా ఉన్న విచిత్ర సృష్టి వ్యవస్థ సిద్ధించుతుంది. ఐతే మీరు ఇట్లా వాదించకూడదు. ఏమని? ప్రాజ్ఞుడిచేత అధిష్ఠితమైనప్పటికీ ఆయన అవాప్త సమస్తకాముడు పరిపూర్ణుడు అనవధికమైన అతిశయమైన ఆనందము కలవాడు దోషములేవీ లేనివాడు కర్మ సమ్బన్ధము లేని నిరంజనుడు కనుక సమష్టి సృష్టి వ్యక్తి సృష్టులకు హేతువుకాడు. విషమసృష్టిని చేసినట్లయితే ఎచ్చుతచ్చులతో జీవులను పుట్టించితే దయలేనివాడు అనే చెడ్డపేరు వస్తుంది. కనుక దోషము సమానమే అని. ఆయన ఏ కొరతాలేనట్టి పరిపూర్ణుడై. ఐనా లీల – ఆట – వినోదం – కొరకు సృష్టి చేయడం జరుగవచ్చు. సర్వజ్ఞుడు పరిణామ విశేషాన్ని పొందిన ప్రకృతిని దర్శించడము అనే విధమైన సర్గప్రతిసర్గ విశేషమునకు హేతువు అయ్యే అవకాశము ఉన్నది. వాస్తవానికి క్షేత్రజ్ఞుని యొక్క మంచీ చెడ్డ కర్మలే విషమసృష్టికి కారణాలు అవుతున్నాయి.

అయితే క్షేత్రజ్ఞులయొక్క పుణ్యాపుణ్యరూపాలైన కర్మలచేతనే వ్యవస్థలు నడుస్తూన్నపుడు అధిష్ఠాతఐన ఈశ్వరునితో అవసరమేమున్నది. పుణ్యఅపుణ్య రూపాలుగా జీవుడిచేత ఆచరించబడిన కర్మతో సంస్కరింపబడిన ప్రకృతియే పురుషార్థానికి అనుగుణంగా ఆయా వ్యవస్థగా పరిణామము చెందుతుంది. ఎట్లాగంటే విషము మొదలైన వాటితో కలుషితమైన ఆహారపదార్థాలు నీళ్ళు, ఆరోగ్యాన్నిచ్చే మందులతో కల్సినటువంటివి కొన్ని సుఖానికి, కొన్ని దుఃఖానికి కారణమైన పరిణామ విశేషాన్ని పొందుతూండడము దేశకాలవ్యవస్థను బట్టి మనము చూస్తూనే ఉన్నాము. కనుక సర్గప్రతిసర్గవ్యవస్థ, దేవాది విషమసృష్టి కైవల్యవ్యవస్థాఆత్మానందాన్ని పొందడము ఇదే మోక్షమని సాంఖ్యులసిద్ధాన్తము – వంటివన్నీ అన్నిరకాలుగా

మార్పులను పొందగల శక్తిని కలిగియున్న ప్రధానానికి మాత్రమే సరిపోలుతుంది అని అనవద్దు.

పుణ్యపాప రూపాల్లో ఉన్న కర్మలయొక్క స్వరూపము ఎటువంటిదో నీకు తెలియదు. ఏది పుణ్యమో! ఏది పాపమో! అనేది వేదశాస్త్రము చేతనే మాత్రము తెలుస్తుంది. ఆ శాస్త్రము ఎప్పుడు పుట్టిందో తెలువదు. ఎప్పుడు నశిస్తుందో కూడా తెలువదు. ఎడతెగకుండా బ్రహ్మగారి నుండి పఠించే క్రమంలో ఏ మాత్రము తేడా రాకుండా గురుశిష్య పరమ్పరగా ఒకే విధంగా పఠింపబడుతూ వస్తున్నది. ఏ మాత్రమూ దానిలో దోషాలు ఉండడానికి అవకాశము లేనటువంటిది. అదే వేదము అనే పేరుతో పిలువబడే అక్షరరాశి. ఆ శాస్త్రము పరమ పురుషుడిని ఆరాధించే రూపమైన కర్మ అంతా పుణ్యము దానికి వ్యతిరేకమైనదంతా పాపము అని, ఆ పురుషుని అనుగ్రహా గ్రహాలపైన ఆధారపడి పుణ్యఫలమైన సుఖాన్ని కల్గిస్తుంది అని, దుఃఖాలను అనుభవింపచేస్తుంది అని చెపుతున్నది. దాన్నే ద్రమిడాచార్యుడు ఈ విధంగా చెప్పినాడు. ఫలాలను పొందడానికిగాను యజ్ఞాదికర్మలతో పరమాత్మను సంతోషపెట్టదల్చుకుంటున్నారు. ఆయన సంతోషపడితే చాలు కోరిన ఫలము దక్కుతుంది. అని శాస్త్రమర్యాద అని. వేదము దాన్నే వివరించింది. **ఇష్టాపూర్తంబహుధాజాతం జాయమానం విశ్వంబిభర్తి భువనస్యనాభిః** ఈ భువనాలన్నింటికీ పుట్టుకకారణమైన వాడు యజ్ఞాలు చేయించడం బావులు త్రవ్వించడంవంటి కర్మలను చేయించి తద్వారా ఇప్పటికీ పలురకాలుగా పుట్టిన పుట్టనున్న వారిని పోషించుతున్నాడు అని. అదే మాటను స్వయంగా భగవన్తుడే చెప్పి ఉన్నాడు. **శ్లో॥ యతఃప్రవృత్తిః భూతానాం యేనసర్వమిదం తతమ్। స్వకర్మ ణాతమభ్యర్చ్యసిద్ధిమ్ విన్దతి మానవః।** ఎవడినుండైతే ఈ భూతాలన్ని పుట్టుకొని వస్తున్నవో, ఎవడు ఈ చరాచర ప్రపంచము అంతటిలోనిండి ఉన్నాడో అటువంటివాడిని మానవుడు తనదైన ఆశ్రమ ఆచారకర్మలను చక్కగా పాటించడము ద్వారా పూజించి సత్ ఫలితాలను పొందుతున్నాడు అని. **శ్లో॥ తానహంద్విషతః క్రూరాన్ సంసారేషునరాధమాన్। క్షిపామి అజస్రం ఆసురీష్వేవయోనిషు.** నన్ను ద్వేషించే నిందించే క్రూరులైన హీనులైన మానవులను ఎల్లపుడూ రాక్షసజన్మలలోనే పడవేస్తుంటాను. అనిన్నీ చెప్పినాడు అటువంటి మన జన్మలకు కారణమైన స్వతంత్రుడైన భగవన్తుడు పురుషోత్తముడు అవాప్తసమస్తకాముడు. సర్వజ్ఞుడు సర్వేశ్వరుడు ఇవి మంచిపనులు, ఇవి మంచివికానివి చెడ్డపనులు అని కర్మలను

రెండు రకాలుగా విడదీసి వాటిని అనుభవించడానికి తగిన దేహము ఇంద్రియాలు మొదలైనవాటిని, వాటిని అదుపులో పెట్టుకొని కోరిన ప్రయోజనాన్ని పొందడానికి తగిన శక్తినిన్నీ క్షేత్రజ్ఞులందరికీ సమానంగా ఇచ్చి తన ఆజ్ఞను తెలియచేసే శాస్త్రాన్నీ చూపి వాటిని చేకూర్చడానికిగానూ తాను అన్తరాత్మగా జీవులలో ప్రవేశించి జీవుడు చేసే పనులకు అనుమతిని ఇస్తూ వారిని నియంత్రించుతూ ఉంటున్నాడు. క్షేత్రజ్ఞులు మాత్రము ఆయన వల్ల పొందిన సర్వశక్తులు కలవారై ఆయన ప్రసాదించిన కరణమైన కళేబరాదులను (శరీరము) కల్గినవారై/ శరీరాదుల మీద ఆధారపడి తమకు తామే ఇష్టము వచ్చినట్లు పుణ్యాపుణ్యరూపాలైన కర్మలను చేపడుతున్నారు. దానితో పుణ్యరూపాలైన కర్మలను చేసేవాడిని తన శాసనానికి అనుగుణంగా నడుచుకొనేవాడని తెల్సుకొని ధర్మ అర్థకామ మోక్షాలతో పెంపు చేస్తాడు. తన శాసనాన్ని పెడచెవిని పెట్టి నడచుకొనే వాడ్ని ధర్మార్థాదులకు విపరీతమైన వాటితో – దుఃఖాలతో – జత చేస్తాడు. అందువల్ల జీవుడికి స్వతంత్రము లేకపోవడము, వానిపైన పరమాత్మ దయ చూపకుండడము అందరియందూ సమానుడుగా ఉండక పోవడము, జీవుడు కోరిన ఫలాన్ని పొందలేకపోవడము వంటి శంకలన్నింటికీ అవకాశము లేదు. దయ అంటే స్వార్థాన్ని కోరకుండడము, ఇతరుల యొక్క దుఃఖాన్ని చూచి ఓర్వలేకపోవడమున్నూ. దాన్ని తన ఆజ్ఞను మీరి నడచుకొనే వానియందు కూడా చూపెట్టినట్లయితే అది గుణంగా గౌరవింపబడదు. పైగా చేతకానివాడు అని పౌరుషం లేనివాడనే పేరును తెచ్చిపెడుతుంది. రాజాజ్ఞను ఉల్లంఘించిన వాడిని దండించడమే గుణముగా కీర్తింపబడుతుంది. అట్లా కానివేళ శత్రువులను అణచివేయడమున్నూ గుణములేక పోవడానికే దారితీస్తుంది. తన శాసనాన్నినతిక్రమించి నడచుకొనే వాడిని ఆ దారి నుండి తప్పించడము ద్వారానే అనాదిగా అనన్తకల్పముల నుండి కూడబెట్టిన ఓర్వరాని ఎడతెగని అంతులేని అపరాధాలను – జీవుడు చేసినవాటిని ఒప్పక జీవుని యొక్క నిరతిశయమైన సుఖాన్ని పెంచడము కొరకు తానుగానే భగవన్తుడు ప్రయత్నిస్తున్నాడు. **శ్లో॥ తేషాంసతత యుక్తానాంభజతాంప్రీతిపూర్వకం। దదామి బుద్ధియోగంతం యేనమాముపయాన్తితే॥ తేషా మేవానుకమ్పార్థం అహమజ్ఞానజం తమః। నాశయామ్యాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా॥** నన్ను ప్రేమతో కొలిచేవార్కి ఎప్పుడూ నన్ను విడువనివారికి నన్ను చేరుకోవడానికి తగిన మంచి బుద్ధి కలిగేటట్లు చేస్తాను. అంతేకాక వారిపైన ఉండే దయతోనే వారియొక్క హృదయాలలో నెలకొని

జ్ఞానమనే దీపంతో వారిలోని అజ్ఞానమనే చీకట్లను పారద్రోలుతాను అనిన్నీ భగవానుడు చెప్పి ఉన్నాడు. కనుక ప్రాజ్ఞుడిచేత అధిష్ఠింపబడిన ప్రధానమే జగత్సృష్టికి కారణమవుతుంది. లేనిది కాదు.

అయితే ఇట్లాకావచ్చును. ప్రాజ్ఞుడు అధిష్ఠించని ప్రకృతిలో మొదటిసారి కూడా మార్పు జరుగదు అని చెప్పినారు కదా! అట్లయినా కూడా ప్రాజ్ఞునియొక్క అధిష్ఠాతృత్వము లేకుండానే పరిణామము జరుగడం అనేది జరుగుతుంది. ఆ విధంగా లోకంలో చూస్తున్నాము. ఆవులు మొదలైనవి ఉపయోగించిన గడ్డినీళ్ళు వంటివి తమకు తాముగా పాలు మున్నగు రూపాల్లో పరిణామము చెందడం కనిపిస్తున్నది కదా! కనుక ప్రకృతి కూడా స్వయంగానే జగత్ ఆకారంలోకి పరిణామాన్ని పొందుతుంది. అని అంటే దానకి సమాధానాన్ని ఇస్తున్నారు.

**అన్యత్రాభావాచ్చ. నతృణాదివత్. 2-2-4** నీవు చెప్పింది పొసగదు. ప్రాజ్ఞుడిచేత అధిష్ఠింపబడని తృణాదులు పరిణామాన్ని చెందడంలేదు కనుక నీ దృష్టాన్తము సిద్ధించదు అసిద్ధి ఎట్లాగా అని అంటే మరొకచోట ఆ పరిణామం లేదు కాబట్టి, ఒకవేళ గడ్డిని నీళ్ళను కోడెలు తిన్నా తాగినా లేక వదిలిపెట్టినా ఆ గడ్డి మొదలైనవి పాలుగా మారితే అప్పుడు ప్రాజ్ఞుడు అధిష్ఠించకుండానే ప్రధానమే పరిణమించిందని చెప్పడానికి వీలవుతుంది. కాని అట్లా జరుగడంలేదు. కనుక ఆవులు మొదలైనవి మేసిన మేత మొదలైన వాటిని ప్రాజ్ఞుడు మాత్రమే పాలు మొదలైన వాటినిగా మారుస్తున్నాడు. పయోఽమ్బువచ్చేత్తత్రాపి అనే సూత్రము వద్ద చెప్పిన విషయాన్నే ఇక్కడ విస్తరించి చెప్పినారు. పాల దృష్టాన్తము వద్ద వ్యభిచారాన్ని – చెప్పిన లక్షణము లక్ష్యము లోనే కాకుండా మరొకచోట ఉండడాన్ని అతి వ్యాప్తి లేక వ్యభిచారము అంటారు – ప్రదర్శించడము కొరకు.

**పురుషాశ్మవత్ ఇతిచేత్తథాఽపి 2-2-5** అయితే ఇట్లా అనవచ్చును. చైతన్యము మాత్రమే శరీరముగా కల పురుషుడు నిష్క్రియుడు. ప్రధానము కూడా చూపులేనట్టిది ఐనా పురుషుడి పక్కన ఉన్నది కాబట్టి మార్పులను పొందడానికి పూనుకుంటున్నది. అట్లా కనిపిస్తున్నది కాబట్టి. ఒకడు నడచిపోలేని కుంటివాడు. అతనికి కండ్లు కనిపిస్తున్నవి. కుంటివాని దగ్గర ఉన్న చూపులేని నడిచే శక్తి గలవాడు ఆ కుంటివాని యొక్క చైతన్యముతో సహాయాన్ని పొంది చూపులేని గుడ్డివాడు ముందుకు సాగిపోగల్గుతున్నాడు. అయస్కాంతము దగ్గరలో ఉన్న ఇనుము కదలికలను

పొందుతున్నది. ఇదే తీరుగా ప్రకృతి పురుషుల సంయోగము కారణముగా జగత్‌సృష్టి సాగుతున్నది. కాబట్టే ఇట్లా చెప్పబడింది. **పురుషస్యదర్శనార్థమ్ కైవల్యార్థమ్ తథాప్రధానస్య। పంగ్వన్ధవదుభయోరపిసంయోగః తత్కృతఃసర్గః.** ప్రధానములో మార్పు పరిణామము రావడమనేది పురుషుడు చూడడం కోసము. పురుషుడికి కైవల్యము అనబడే మోక్షము సిద్ధించడము కొరకు మాత్రమే. కుంటి గుడ్డివాండ్లిద్దరూ కలుసుకున్నట్లే ఈ ఇద్దరి కలయిక ఏర్పడుతున్నది. దీనితో జగత్ సృష్టి జరుగుతున్నది అని. దీనికిసమాధానము. తథాపిఅట్లయినాసృష్టిజరుగదు అని. ఇట్లయినా ప్రధానంలో ప్రవృత్తి లేకపోవడమనేది అట్లాగే ఉంటుంది. అంటే ప్రాజ్ఞుడి చేత అధిష్ఠింపబడినప్పుడే ప్రకృతిలో మార్పు కలుగుతుంది అని. నడిచిపోయే శక్తి లేని కుంటివానికి ఇతరులకు మార్గాన్ని చూపించడము / చెప్పడము వంటి అప్పుడప్పుడు కనిపించే విశేషాలు వేలకొద్ది ఉన్నాయి. గుడ్డివాడు కూడా చేతనుడై కుంటివానియొక్క ఉపదేశాలను అర్థం చేసుకొని దాని ప్రకారము నడుచుకుంటాడు. అట్లాగే అయస్కాన్తమణివద్దకు ఇనుము రావడమున్నూ ఉన్నది. కానీ పురుషుడు నిష్క్రియుడు అటువంటి వానిలో తనవద్దకు ఇంకొకర్ని రప్పించుకోవడము కలసిమెలసి ప్రవర్తించడము వంటి వికారాలు పుట్టవు. ప్రకృతి పురుషుని దగ్గరలో ఎప్పుడూ ఉంటూ ఉన్నది. కనుక అంతమాత్రం చేతనే పరణామాలు వచ్చేట్లయితే ఎప్పుడు సృష్టి జరుగతూనే ఉండవలసి ఉంటుంది. లేదూ పురుషుడు నిత్యముక్తుడు కాబట్టి బన్ధమూ ఉండదు. అపవర్గము కూడా ఉండదు.

సూ॥ **అంగిత్వానుపపత్తేశ్చ 2-2-6** సత్వరజస్తమోగుణాలు ఎక్కువ తక్కువల కారణంగా పరస్పరము ఒకటి అంగిఐతే మిగతా రెండు అంగములుగా అవుతుంటవి. దానితో జగత్ ప్రవృత్తి జరుగుతున్నది. ప్రతిప్రతిగుణాశ్రయ విశేషమువల్ల ఇట్లాగా అని మీరు చెపుతున్నారు కదా! ప్రతిసర్గ అవస్థయందు – వ్యష్టిసృష్టి – ఐతేనో సామ్యావస్థలో ఉన్న సత్వరజస్తమస్సులు ఎక్కువగా ఉండడము లేక తక్కువగా ఉండడము అనేది లేకపోయినందున అంగాంగిభావము ఏర్పడదు కనుక జగత్తు పుట్టడమనేది జరుగదు. అటువంటి సామ్యావస్థలో కూడా వైషమ్యము – ఎక్కువ తక్కువలుగా ఉండడము – ను మేము అంగీకరిస్తాము అని అంటే ఎప్పుడూ జగత్ సృష్టి జరుగుతూ ఉండవలసి వస్తుంది. ఇందువల్ల కూడా ప్రాజ్ఞుడి చేత అధిష్ఠింపబడని ప్రధానము కారణం కాదు.

సూ॥ **అన్యథాఽనుమితౌ చజ్ఞశక్తి వియోగాత్. 2-2-7** దోషాలు ఉన్నవని చెప్పిన ప్రకారము కాకుండా మరొక తీరుగా ప్రధానమే కారణము అని అనుమానించితే

ప్రధానానికి జ్ఞాతృత్వము అనే శక్తి లేదు కాబట్టి ఇంతకుముందు చెప్పిన దోషాలే ఏర్పడుతవి. కనుక ఏ తీరుగా కూడా అనుమాన ప్రమాణం చేత జగత్‌సృష్టికి కారణము ప్రధానమే అని అనడం తగదు. అది సిద్ధించదు.

సూ॥ **అభ్యుపగమేఽపి అర్థాభావాత్ 2-2-08** అనుమాన ప్రమాణంతో ప్రధానము జగత్తుకు కారణమవుతున్నది అని ఒప్పుకున్నా ప్రధానము వల్ల ప్రయోజనము ఏమీ లేదు కాబట్టి దాన్ని అనుమానముతో సాధించడానికి ప్రయత్నించకూడదు. **పురుషస్య దర్శనార్థం కైవల్యార్థం తథా ప్రధానస్య** అని చెప్పిన ప్రకారం ప్రధానము పరిణామాలను పొందడమనేది తనకు ప్రయోజనము కొఱకు కాక పురుషుడికి భోగాలు కలుగడానికి, లేదా అపవర్గము / మోక్షము కలుగడానికి అని గదా! మీరు వాదిస్తున్నారు. అవి జరుగవు / కలుగవు. చైతన్యము మాత్రమే శరీరాన్ని కలిగియున్నవాడు, నిష్క్రియుడు వికారము లేవీ లేనివాడు పుణ్యపాప రూపకర్మలు ఏవీ లేని నిర్మలుడు ఐనందువల్ల, అవే కారణాలుగా అవడం వల్ల నిత్య ముక్త స్వరూపుడౌతున్నాడు కాబట్టి ప్రకృతిని దర్శించడమనే భోగము కాని దాన్నించి ఎడబాయడమనే అపవర్గము కాని కలుగదు. ఇటువంటి వాడికి ప్రకృతి చేరువలో ఉంటున్నది కాబట్టి దానిలో వచ్చే మార్పుల ద్వారా – పరిణామ విశేషాల (రూపమైన) సుఖదుఃఖదర్శన రూపమైన భోగాలు కలుగుతున్నాయి అని ఊహించేట్లయితే – ప్రకృతి సన్నిధానము ఒకప్పుడు ఉండడము ఒకప్పుడు లేకపోవడము కాకుండా ఎల్లవేళలా ఉండేదే, నిత్యమే, కనుక ఎప్పుడూ పురుషుడికి అపవర్గము కలుగనే కలుగదు.

సూ॥ **విప్రతిషేధాచ్చ అసమంజసమ్. 2-2-9** ఈ సాంఖ్య దర్శనము పరస్పర వైరుధ్యాన్ని కలిగి ఉన్నది. అవకతవకలుగా ఉన్నది. అది ఎట్లా అంటే! ప్రకృతి తన కొరకు కాక పరుడికొరకు ఉన్నది. మరొకడికి చూడముచ్చటగా ఉంటుంది. భోగ్యమై – అనుభవింపదగినది గానూ – ఉన్నది – పురుషుడిని, ప్రకృతిని అనుభవించేవాడుగా, **అధిష్ఠాతగా (స్వతంత్రుడిగా)**, ద్రష్టనుగానూ అతడిని చెప్తున్నారు. ఆయన కేవలము **స్వరూపంతో తలచుకుంటాడు. ఇంద్రియాదుల ద్వారా ద్రష్ట అవుతున్నాడు.** సాక్షి మాత్రమే పురుషుడు నిష్క్రియుడు కాగా అతడు తనకు సాధనమైన ప్రకృతితోనే కైవల్యాన్ని పొందుతున్నాడనిన్నీ చెపుతూనే ఆ పురుషుడు నిత్యుడు నిర్వికారుడు చైతన్యమును మాత్రమే స్వరూపముగా కలవాడు. కర్తృత్వము లేనివాడు. అతనికి కలిగే కైవల్యము కూడా ఆయన సహజ స్వరూపమే అని అంటున్నారు. కనుకనే

బంధము నుండి విడివడడం, మోక్షసాధనానుష్ఠానము మోక్షము కూడా ప్రకృతికే అని చెప్తున్నారు. ఇటువంటి వికారము లేనివాడు దేన్నీ పట్టించుకోని ఉదాసీనుడైన పురుషుని యొక్క సాన్నిధ్యములో ప్రకృతిలో కలిగే వేరువేరు అధ్యాసాలు – వేరువేరు పరిణామాలనుపొందడం తద్వారా సృష్టి మొదలైన కార్యాలకు పూనుకోవడము పురుషుని యొక్క భోగానికి అపవర్గము కొరకు మాత్రమే అనిన్నీ పలుకుతున్నారు. **శ్లో॥ సంఘాతపరార్థత్వాత్ త్రిగుణాది విపర్యయాత్ అధిష్ఠానాత్। పురుషోఽస్తిభోక్తృభావాత్ కైవల్యార్థప్రవృత్తేశ్చ। తస్మాచ్చవిపర్యాసాత్ సిద్ధం సాక్షిత్వమస్య పురుషస్య। కైవల్యం మాధ్యస్థ్యం ద్రష్టృత్వం అకర్తృభావంచ।** ప్రకృతి మూడు గుణాల యొక్క సముదాయస్వరూపము కలది. అది పరుడి కొరకే ఉన్నది. త్రిగుణాదులయొక్క ఎక్కువ తక్కువలు కారణముగా ఏర్పడుతున్నది. ఇతరుడికి అధిష్ఠానము అవుతున్నది. భోక్తృభావముతో అనుభవించేవాడుగా పురుషుడు ఉన్నాడు. కైవల్యము కొరకు ప్రయత్నిస్తున్నాడు. అది తప్ప మరొక ప్రయోజనము లేనివాడు ఐనందువల్ల ఈ పురుషుడు కేవలం సాక్షియే అవుతున్నాడు. ఇతడికి కైవల్యము. మధ్యస్థుడుగా – తటస్థుడుగా ఉండడము ఉన్నది. ద్రష్ట మాత్రమే. కర్తృభావమున్నూ లేదు అని.

**పురుషవి మోక్షనిమిత్తం తథాప్రవృత్తిః ప్రధానస్య** ప్రకృతిలో కలిగే మార్పులన్నీ పురుషుడు సంసార బంధాల నుండి పూర్తిగా ముక్తి పొందడం కొరకే. అని చెప్పి ఇంకా ఇట్లా పలుకుతున్నారు. **తస్మాత్ న బధ్యతే అద్ధానముచ్యతేనాపి సంసరతికశ్చిత్। సంసరతి బధ్యతే ముచ్యతే చనానాశ్రయాప్రకృతిః** నిర్మలుడైన పురుషుడు సంసార బన్ధములో కట్టుబడడు. కనుక విడిపింపబడడు. ఎప్పుడూ సంసారము కాపురమును చేయడు. సంసారమును చేసేది కట్టుబడేది విడుదల పొందేదీ పలురకాల పరిణామాలకు ఆశ్రయమైన ప్రకృతి మాత్రమే. ఇంకా **తస్మాత్ తత్సంయోగాదచేతనం చేతనావదివలింగమ్। గుణ కర్తృత్వే చ తథా కర్తేవభవత్యుదాసీనః। పురుషస్యదర్శనార్థం కైవల్యార్థమ్ తథాప్రధానస్య। పంగుఅన్ధవదుభయోరపి సంయోగః తత్కృతః సర్గః।** అందువల్ల ఆ పురుషుని యొక్క సంయోగము వలన అచేతనమైన ప్రధానము చైతన్యము కలదానివలె కొన్ని గుర్తులను చూపెడుతుంది. గుణములు చేసే పనిపై తాను కర్తృత్వము కలవాడుగా ఉదాసీనుడైన పురుషుడు అవుతున్నాడు. ప్రధానము పురుషుడు చూడడానికి, అతడికి కైవల్యము సిద్ధించడానికి గాను వివిధము లైన మార్పులను పొందుతుంటుంది. కుంటి గుడ్డివాళ్ళు కలసినట్లు ప్రధానము పురుషులూ

పరస్పరం కలుస్తూ ఉన్నారు. దానితో ప్రపంచము యొక్క సృష్టి జరుగుతున్నది అనిన్నీ చెపుతున్నారు.

సాక్షిత్వము, ద్రష్టృత్వము, భోక్తృత్వము మొదలైనవన్నీ నిత్యనిర్వికారుడు – ఎప్పుడూ వికారాలను పొందనివాడు – కర్త కాని వాడు, ఉదాసీనుడు కైవల్యము మాత్రమే స్వరూపముగా గలవాడైన పురుషునికి సంభవించవు. ఇటువంటి వానికి అధ్యాసము కారణముగా ఏర్పడిన భ్రమ కూడా కలుగదు. అధ్యాసము – త్రాడుపై పామున్నది అని అనుకోవడము – భ్రమములు రెండున్నూ వికారములే. ప్రకృతి ఇవి రెండూ కలది. ఇవి చేతనునికి చెందిన ధర్మాలు. అధ్యాసము అనగా చేతనుడికి ఒక వస్తువు యందు మరొక వస్తువు యొక్క ధర్మాన్ని అనుసంధానము చేసుకోవడము. అది చేతనుని యొక్క ధర్మము. మరియు వికారము కూడా. ఇక పురుషుడికి అతడు నిర్వికారుడు కాబట్టి ప్రకృతి చేరువలో ఉన్నంతమాత్రాన అధ్యాసాధులు కలుగవు. ఒకవేళ అధ్యాసము, భ్రమ, వికారములు కలిగేట్లయితే ఎప్పుడూ కలుగుతూనే ఉంటాయి. అటువంటప్పుడు ప్రకృతియొక్క సాన్నిధ్యము ఎలాంటి ప్రయోజనాన్ని చేకూర్చదు. ప్రకృతి ఉన్నా ఉండకున్నా అతడిలో వికారాలు కలుగుతూనే ఉంటవి. కాబట్టే మేము ఇదే ముచ్చటను నవిలక్షణత్వాత్ అనే సూత్రము వద్ద వివరించినాము ఇక ప్రకృతే సంసారము చేస్తుంది బన్ధింపబడుతుంది. ముక్తిని పొందుతుంది అని అనేట్లయితే ఆ ప్రకృతి నిత్యముక్తుడైన పురుషునికి ఉపకారాన్ని ఏవిధంగా చేయగల్గుతుంది? వాళ్ళే ఇట్లా ప్రవచిస్తున్నారు.

**నానావిధైః ఉపాయైః ఉపకారిణీ అనుపకారిణః పుంసః। గుణవతీ అగుణస్యసతః తస్యార్థమపార్థకం చరతి॥** ప్రకృతి పలురకాలైన ఉపాయాలతో తిరిగి ఉపకారము చేయని పురుషుడికి ఉపకారాన్ని చేస్తున్నది. ఆమె గుణవన్తురాలు – సత్వరజస్తమస్సులు కలది – నిర్గుణుడైన పురుషునికిగాను అతనికి ప్రయోజనాన్ని కల్గించడము కొరకు తనకు ఏ ప్రయోజనంలేకున్నా ప్రవర్తిస్తున్నది అని.

అట్లాగే ప్రకృతి ఏ పురుషుడి చేత ఎటువంటి స్వభావము కలదిగా చూడబడుతుందో ఆ పురుషుడి దృష్టి నుండి అపుడే వెనుదిరిగిపోతుంది. అనిన్నీ చెపుతున్నారు. **రంగస్యదర్శయిత్వానివర్తతే నర్తకీ యథా నృత్యాత్। పురుషస్యతథాఽత్మానం ప్రకాశ్యవినివర్తతే ప్రకృతిః। ప్రకృతేః సుకుమారతరం నకించి దస్తీతిమేమతిర్భవతి। యాదృష్టాఽస్మీతి పునః న దర్శనముపైతి పురుషస్య॥**

నాట్యకత్తే రంగస్థలముపైకి వచ్చిముందున్న ప్రేక్షకులకు తనను, తన నృత్యాన్ని చూపించి తిరిగి తెరవెనుకకు పోయినట్లుగానే పురుషుడికి తనను చూపించి ప్రకృతి మరలిపోతుంది. ప్రకృతి కంటే మిక్కిలి సుకుమారమైనది మరొకటి లేదని నాకు తోస్తున్నది. ఆయన నన్ను చూచినాడని మళ్ళీ తిరిగి కనబడకుండా పోతుంది అని. ఆ మాట కూడా పొసగేది కాదు. పురుషుడు నిత్యముక్తుడు. నిర్వికారుడు కాబట్టి ఆ ప్రకృతిని ఒకానొకప్పుడు కూడా కన్నెత్తి చూడడు. అధ్యాసాలకు – భ్రమలకులోను కాడు. ప్రధానమున్నూ తనను తాను చూచుకొనేది కానేకాదు. అచేతనము కదా అది. పురుషుడు తన ఆత్మను దర్శనము చేసుకుంటాడు. దాన్ని చూచిన ప్రధానము తనను చూస్తున్నాడని కూడా భ్రమను చెందదు – తాను అచేతనము కదా! ఇక పురుషుడికి దర్శన రూపమైన వికారం కలుగదు. ఐతే దగ్గరదగ్గరగా ప్రకృతి పురుషులు ఉండడమే పరస్పరాలోకనము దర్శనము అని చెప్తావా? వారి ఇద్దరికీ సన్నిధి ఎప్పుడూ ఉండేదే కాబట్టి నిత్యమూ దర్శనము అనేవికారము కల్గుతూనే ఉంటుదనవలసి ఉంటుంది. స్వరూపాని కంటే వేరుగా కాదాచిత్కమైన – ఎప్పుడో ఒకప్పుడు అనుకోకుండా సాన్నిధ్యము ఏర్పడడమనేది కూడా నిత్యనిర్వికారుడికి పొసగదు. ఇంకా తనకు దగ్గరగా ఉండడమనే దర్శనమే మోక్షానికి కారణం అని అనేట్లయితే బన్ధానికి కారణము కూడా ఆ దర్శనమే కాబట్టి బన్ధము మోక్షమూ రెండున్నూ నిత్యాలే – ఎల్లపుడూ ఉండేవే – అవుతాయి. కాదండీ ఆయధాదర్శనము – ఉన్నదాన్ని ఉన్నట్లుగా చూడకుండా మరొకటిగా చూడడమే – బంధానికి కారణము, యధావత్‌గా – ఉన్నది ఉన్నట్లుగా చూడడమే – దర్శనమే మోక్షహేతువని అన్నట్లయితే ఏ ఒక్కటో గాకుండా రెండు రకాలుగా ఉన్న దర్శనము – సన్నిధానము కంటే వేరుకాదు కనుక ఎల్లప్పుడూ బన్ధమూ మోక్షము రెండూ కల్గుతూనే ఉంటవి. కాదండీ! సన్నిధి అనేది నిత్యము కాదు అని అనేట్లయితే దానికి కారణమేదో వెతుకవలసి ఉంటుంది. దానికి కారణము, దానికి కారణము ఇట్లా కారణాన్ని అన్వేషించుతూ పోతూ ఉంటే అనవస్థాదోషము వస్తుంది. ఇక ఈ దోషాన్ని తొలగించుకోవడం కోసము స్వరూపము కల్గి ఉండడమే సన్నిధి అని చెప్తే అపుడు స్వరూపము నిత్యం కాబట్టి బన్ధ మోక్షాలు రెండు నిత్యాలే అవుతాయి. కావున ఇటువంటి పరస్పర విరుద్ధాంశాలు ఉన్నాయి. కనుక సాంఖ్యులయొక్క దర్శనము సమంజసం కాదు.

ఎవరైతే కూటస్థుడు – బంగారము మొదలైన వాటిని సాగదీయడానికి ఒక ఇనుప దిమ్మెను పెట్టి దానిమీద బంగారాన్ని ఉంచి సుత్తెతో కొడుతారు. బంగారము సాగుతుంది. ఇంకా పలురకాల రూపాలను పొందుతుంది. ఆ దిమ్మె ఎంత మాత్రమూ మార్పు చెందదు. అదే తీరుగా ఏ మార్పులు చేర్పులు లేనివాడు కూటస్థుడు – నిత్య నిర్విశేష స్వయంప్రకాశమైన చిత్ మాత్రమే బ్రహ్మ. ఆయన అవిద్యకు సాక్షి – దర్శనము కలవాడు/చూచేవాడు – అవుతున్నందున బన్ధాలను పొందుతున్నాడు. అట్లే మోక్షాన్నీ పొందుతున్నాడు. అని చెప్పుతున్నారో వారికి కూడా – నిర్వికారుడైన బ్రహ్మకు అవిద్యానుభవము, దానితో అధ్యాసములు కలుగడము కుదరదు అని అన్నట్లే అవిద్యాసాక్షిత్వము అధ్యాసము మొదలైన వికారాలు కలుగవు. కాబట్టి అవిద్య వలననే బ్రహ్మకు ప్రపంచము ఉన్నదనే భ్రమ కలుగుతున్నది అని చెప్పడము అసమంజసమైన మాటనే. ఐతే సాంఖ్యుల కంటే వీరిలో ఒక విశేషము ఉన్నది. సాంఖ్యులు జననము మరణము దానికి సమ్బన్ధించిన నియమాదుల వ్యవస్థ ఏర్పడడం కొరకు పురుషులు చాలమంది ఉన్నారని ఒప్పుకుంటున్నారు. వారైతే దీన్ని ఏ మాత్రము అంగీకరించరు. పురుషుడు ఒక్కడే అంటున్నారు. అతడికే బన్ధము. అతడికే మోక్షము. ఏకమేవాద్వితీయంబ్రహ్మ అని అంటున్నారు. కనుక బొత్తిగా అసమంజసత్వము నిర్విశేషవాదులకు ఏర్పడుతున్నది. ఇంకా ప్రకృతికి పరమార్థము అపరమార్థము అనే రెండు విభాగాలుగా చేసి వైషమ్యాన్ని చెప్పినారో అది కూడా అసత్యమే. తగినది కాదు. పరమార్థమైనా అపరమార్థమైనా కూడా నిత్యనిర్వికార స్వప్రకాశ ఏకరసచిన్మాత్రుడికి తనకంటే వేరుగా ఇంకొక వస్తువు ఉన్నది అనే సాక్షిత్వము మొదలైనవి ఏర్పడడానికి అవకాశమే లేదు. ఆయన నిర్వికారుడు నిర్విశేషుడు కదా! అపరమార్థికమైతే ప్రకృతికి దృశ్యత్వము బాధ్యత్వములను ఒప్పుకున్నారు కాబట్టి బొత్తిగా అసంగతమే అవుతుంది. అసలు లేని వస్తువుకదా అపరమార్థము అని అంటే. అది కనపడేదెట్లా? లేదు అని బాధింపబడేది ఎట్లా? ఇక ఉపాధికారణంగా భేదము ఏర్పడుతున్నది అని చెప్పే వారి విషయంలో ఉపాధితో కూడిన బ్రహ్మకు కూడా ముందు చెప్పిన నిర్విశేషాదిలక్షణాలను కల్గి నిర్వికారుడై ఉంటున్నందువల్ల స్వభావము సమానం కాబట్టి ఉపాధి సమ్బన్ధం కలుగడం మొదలైనవి ఏర్పడడానికే అవకాశము లేదు కాబట్టి అసమంజసమే సుమా! అను విషయాన్ని మునుపే చెప్పి ఉన్నాము. **ఇది రచనాను పపత్తి అధికరణము.**

★ ★ ★

## ఇక మహద్దీర్ఘాధికరణము.

సూ॥ **మహద్ దీర్ఘవద్వాహ్రస్వపరిమండలాభ్యాం 2-1-10** జగత్తు పుట్టడానికి ప్రధానమే కారణము అనే వాదము సరియైన యుక్తులు కాక పైకి యుక్తులుగా కనబడుతూ లక్ష్యాన్ని సాధించలేనికాకి బంగారము వంటి యుక్త్యాభాసాల కారణముగాను తాము మాట్లాడిన మాటలను తామే కాదంటూ ఉండే పరస్పర విరుద్ధభాషణము కారణంగా దాన్ని సమంజసమైనది కాదని త్రోసివేయడం జరిగింది. ఇప్పుడు పరమాణువులే జగత్ సృష్టికి కారణము అని చెప్పే పరమాణు వాదము కూడా సమంజసమైనది కాదని ప్రతిపాదింపబడుతున్నది. మహద్దీర్ఘవద్వాహ్రస్వపరి మండలాభ్యాం అనే సూత్రముతో. అసమంజసమ్ అనే పదము కూడా సూత్రములో ఉన్నది. ఇక వా అనే శబ్దము చకారార్థములో - (కూడా) - ప్రయోగింపబడింది. హ్రస్వపరిమండలాభ్యాం - ద్వ్యణుకపరమాణువులతో మహద్దీర్ఘవత్ - త్ర్యణుకముల ఉత్పత్తి వలె వారు ఒప్పుకున్నదంతా సమంజసము కాదు. పరమాణువుల నుండి ద్వ్యణుకము మొదలైనవాని వలె క్రమముగా జగదుత్పత్తి జరిగింది అని చెప్పే వాదమువలె అంతా అసమంజసమే అని అర్థము. **హ్రస్వమ్ అనగా రెండు అణువుల కలయికకు పేరు. రెండు పరమాణువులు ఒక దగ్గరచేరితే దాన్ని హ్రస్వము అని పిలుస్తున్నారు. పరిమండలమ్ అంటే ఒక పరమాణువు. మహద్దీర్ఘమ్ అంటే త్ర్యణుకము - మూడు అణువులతో కూడిన వస్తువు.** అది అట్లాగా - దారము మొదలైన అవయవాలు తమ యొక్క అంశాలైన ఆరు పార్శ్వాలతో (పక్కలు - వైపులు) కలసిపోయినవై అవయవాలు కలిగిన వస్తువును పుట్టిస్తున్నవి. పరమాణువులు కూడా తమవైన ఆరు పార్శ్వాలతో కలసిపోయినవై ద్వ్యణుకము, త్ర్యణుకము మొదలైన వాటిని పుట్టిస్తున్నవి. అట్లాకాకుంటే అనగా పరమాణువులకు ప్రదేశ భేదాలు లేకపోయినప్పుడు వేయ్యి పరమాణువులు ఒకటికి ఒకటి కల్సినా ఒక్క పరమాణువు కంటే ఎక్కువ పరిమాణాన్ని మించకపోతున్నవి. అప్పుడు అణువు హ్రస్యము మహత్వము దీర్ఘత్వము మొదలైనవి సిద్ధించవు. అణువుకు ప్రదేశాన్ని ఒప్పుకుంటే పరమాణువులు కూడా తమలో అంశాలను కలిగి ఉంటవి కనుక తమవైన అంశాలతో, ఆ అంశాలు కూడా తమవైన అంశాలతో ఇట్లా సాగిసాగి అనవస్థ ఏర్పడుతుంది. ఐతే ఇట్లా మీరు పలుకవద్దు - అవయవాలలో అల్పత్వము మహత్వము - చిన్నగా పెద్దగా ఉండడము వల్ల - లవలన కదా ఆవగింజ పెద్దకొండలు ఏర్పడుతున్నవి. అందువల్లనే వైషమ్యము ఎక్కువతక్కువలు

ఏర్పడుతున్నవి. కనుకనే సమానత్వములేదు. ఈ విధంగా పరమాణువుకు కూడా అనన్తమైన అవయవాలు ఉన్నందువల్ల అవయవ ఆనన్త్యము అనే పోలికవల్ల ఆవగింజ పేద్ద కొండలకు వైషమ్యము సిద్ధించదు కాబట్టి అవయవాల అపకర్షను – తక్కువగా ఉండడాన్ని – కాష్ఠను – దానికి ఒక హద్దును తప్పక అంగీకరించవలెను – అని. పరమాణువులకు ప్రదేశ భేదములు లేకపోయినప్పుడు ఒక్క పరమాణువుతో కూడిన పరిమాణానికి మించిన ప్రథిమా – పెద్దది దొడ్డది ఐన ఆకారము యొక్క గుర్తింపు / ప్రతీతి / ప్రసిద్ధి పుట్టదు. అపుడు ఆవగింజ ఇది, కొండ ఇది అని అనడానికి అవకాశమే ఉండదు. ఏంజేద్దాం మరి అఅంటావా? మా వైదికమతాన్ని అవలంబించు.

కొంతమంది ఈసూత్రాన్ని బ్రహ్మ కారణవాదాన్ని ఖండించే వారికి బదులు చెప్పేదిగా వ్యాఖ్యానించి ఉన్నారు. అది సరియైనది కాదు. చెప్పిన దాన్నే చెప్పినట్లు పునరుక్తి అవుతుంది. బ్రహ్మ జగత్తుకు కారణము అనే వాదము పైన ఇతరులు చెప్పిన దోషాలను దీనికన్నా ముందు పాదములో తొలగించి ఈ పాదములో ఇతరుల యొక్క పక్షాలను తిప్పికొడుతున్నారు. చేతనుడి నుండి బ్రహ్మ జగత్తు పుడుతున్నాయనే వాదాన్ని నవిలక్షణత్వాత్ అనే సూత్రము వద్దనే విస్తరించి చెప్పడమయ్యింది. కావున హ్రస్వము పరిమండలముల నుండి హ్రస్వము మహత్తు దీర్ఘాణువులయొక్క ఉత్పత్తిని వలె, వారు ఆమోదించిన విషయమంతా అసమంజసమే అనేదే ఈ సూత్రము యొక్క అర్థము. ఇక్కడ అన్యత్ అసమంజసము అంటే దాన్ని వివరిస్తున్నారు.

**ఉభయథాఽపి న కర్మ అతస్తదభావః 2-1-11** పరమాణువులే జగము పుట్టడానికి కారణము అనే వాదములో పరమాణువులలో ఉన్న కర్మవలన పుట్టిన వాటి సంయోగము కారణంగా ద్వ్యణుకము మొదలైనవాటి వరుస ప్రకారము జగత్తు పుడుతున్నది అని అంగీకరించుతున్నారు. అక్కడ సమస్త ప్రపంచము పుట్టడానికి కారణమైన పరమాణువులో ఉన్న ఆద్యకర్మను – తొట్టతొలికర్మ – అదృష్ట కారితము అని అంటున్నారు. **అగ్నేః ఊర్ధ్వజ్వలనం వాయోః తిర్యక్ పవనం అణుమనసోశ్చాద్యం కర్మ ఇత్యదృష్టకారితాని** – మంటపైకి మండడము గాలి అడ్డంగా వీచడం, అణువుకు మనస్సుకున్నూ ఆద్యకర్మను అదృష్టకారితములు అని చెపుతున్నారు అని. అందువల్ల ఈ పరమాణువులలో ఉండే కర్మ తనకు చెందినదైన అదృష్టకారితము. లేక ఆత్మలో ఉండే అదృష్టకారితమైనా కావచ్చు. ఈ రెండూ వాస్తవానికి జరుగడానికి అవకాశం లేదు. క్షేత్రజ్ఞుడు చేసిన పుణ్యపాపానుష్ఠానము వలన పుట్టిన అదృష్టము

పరమాణువులో చేరి ఉండడము అనేది కుదురదు. ఒకవేళ కుదిరితే ఎప్పుడూ పుట్టించడము జరుగుతుంది. ఆత్మలో నున్న అదృష్టము పరమాణుగతమైన కర్మ ఉత్పత్తికి కారణమవడం సంభవించదు. అదృష్టము వలెనే ఆత్మతో సంయోగము వలన అణువులయందు కర్మ ఉత్పత్తి అవుతుంది అని అంటే అప్పుడు ఆ అదృష్ట ప్రవాహం నిత్యమైనందువలన నిత్యము సృష్టి జరుగవలసి ఉంటుంది. ఔనండీ! అదృష్టము అనేది విపాకాన్ని – తగినంత మార్పు చేర్పు – కోరుతున్నది. ఆ మోతాదు పూర్తయినప్పుడు ఫలాన్నివ్వగల్గుతుంది. లేకుంటే అంతవరకు ఆగవలసియే ఉంటుంది. కొన్నికొన్ని అదృష్టాలు అప్పుడే పరిపక్వము అవుతవి. ఫలాన్ని ప్రసాదించుతవి. మరికొన్ని మరోజన్మలో ఫలిస్తవి. ఇంకా కొన్ని ఈ కల్పము కాకుండా మళ్ళీ వచ్చే కల్పములో, కాబట్టి విపాకము – విశేషమైన పాకమును – కోరుతున్నవి కనుక సర్వదా – ఎల్లప్పుడూ ఉత్పాదకములు కావు అని అంటావా? అది తప్పు. అనన్తాలైన ఆత్మలు నా పుణ్యము ఇది నా పాపము ఇది ఇప్పుడు ఫలించాలి ఇప్పుడు కాదు అని సంకేతము – గుర్తులేకుండా ఒకేసారి కాకుండా పలుమార్లు అనుష్ఠించిన అనేకవిధములైన కర్మలవలన జన్మించిన అదృష్టాలు ఒకే కాలములో ఒకేరూపంగా / ఒకే తీరుగా విపాకాన్ని పొందడమనేది ప్రామాణికులు అంగీకరించిన విషయము కాదు. అందువల్లనే ఒక్కసారే అంతానశించి ప్రళయము కావడము బ్రహ్మ యొక్క ఆయుష్యమైనద్విపరార్ధకాలము వరకు ఎటువంటి విపాకమూ లేకుండా ఉండడమున్నూ పొసగదు. ఈశ్వరుని యొక్క సంకల్పము ప్రకారము చేరిన విశేషమైన అదృష్టము యొక్క సంయోగము – కలయిక వలన అణువులలో కర్మ ఏర్పడుతుంది అని అనడానికీ వీల్లేదు. మీ సిద్ధాన్తము ప్రకారము అనుమానిక ఈశ్వరుడు సిద్ధించడం లేదు. శాస్త్రయోనిత్వాత్ అనే సూత్రం దగ్గర ఈ విషయాన్నే మేము స్పష్టంగా ప్రతిపాదించి ఉన్నాము. కనుక అణువులలో ఉండే కర్మ కారణంగా జగత్తు ఉత్పత్తి కావడం లేదు.

సూ॥ **సమవాయాభ్యుపగమాచ్చ సామ్యాదనవస్థితేః 2-2-12** సమవాయాన్ని ఒప్పుకున్నందువల్లనున్నూ అసమంజసమే. ఎందువల్లనంటే? సమవాయమునకు కూడా అవయవి, జాతి, గుణాలవలె ఉపపాదించే మరొక దాని యొక్క అపేక్ష – అవసరము – సమానమే కాబట్టి ఉపపాదకమైన మరొకదానికిన్నీ మరొక ఉపపాదకము అవసరము ఏర్పడుతున్నది కాబట్టి అనవస్థ వస్తున్నది. ఇందువల్లనున్నూ అసమంజసమే. ఇదీ దీనిచే చెప్పబడుతున్న విషయము – పృథక్ సిద్ధములు కాని

ఆధారము ఆధేయములు ఐనవాటికి ఇహప్రత్యయము ఇది ఇట్టిది అని గుర్తించడానికి కారణమైన ఏ సమ్బన్ధము ఉన్నదో అది సమవాయము అని సమవాయలక్షణాన్ని అంగీకరించుతున్నాము కదా! విడిగా ఉండకుండా లభించే జాతి గుణము మొదలైనవానికి అట్లాగా విడిగా ఉండలేకపోవడానికి కారణము ఏమిటో వెతుకవలసి ఉన్నది. ఆ కారణానికి దానికి మరొక కారణము ఇట్లా పోతూ ఉంటే అనవస్థితి వస్తుంది. సమవాయానికి తన ధర్మిని వదలిపెట్టి ఉండలేకపోవడము అనేది దాని స్వభావమండీ! అని కల్పనము చేద్దాము అని అంటే అట్లయినప్పుడు జాతి గుణాలకే విడిచి ఉండలేకపోవడము స్వభావము అని కల్పించుకోవడమే మంచిది. **ధర్మి కల్పనాతో వరం ధర్మకల్పనా** – ధర్మము కల్గియుండే ధర్మిని పుట్టించడము / కల్పించడము కంటే ధర్మాన్ని కల్పించడమే శ్రేష్ఠము అనే న్యాయము ప్రకారము ఇదే సరి ఐనది. కనుక ఇంతకుముందు చూచి ఎరుగని సమవాయాన్ని ఒప్పుకొని దానికి ఇది స్వభావము అని కల్పించడము తగినది కాదు. **సమవాయము అనగా ఒక సమ్బన్ధము. 1) అవయవాలు – వాటిని కలిగి ఉంటే అవయవికి, గుణము – గుణము కలవానికి, క్రియ–క్రియ కలవానికి, జాతి – వ్యక్తికి, నిత్యమైన ద్రవ్య విశేషాలకున్నూ ఉండే విడదీయరాని సంబన్ధాన్ని సమవాయసమ్బన్ధము అంటారు. శ్లో॥ ఘటాదీనాంకపాలాదౌ ద్రవ్యేషుగుణకర్మణోః। తేషుజాతేశ్చ సమ్బన్ధః సమవాయః ప్రకీర్తితః.** ఘటాదులకు కపాలాలతో ద్రవ్యాలకు గుణకర్మలతోను, ద్రవ్యాలకే జాతితోనూ ఏ సమ్బన్ధము కనపడుతున్నదో అది సమవాయసమ్బన్ధము అని అనబడుతున్నది. మరొకమాటలో "**విడదీయరాని – నిత్యమైన – సమ్బన్ధము**" సమూహము అని కూడా అర్థము ఉన్నది. సమవాయము నిత్యమైనా అనిత్యమైనా ఈ దోషము సమానమే కాగా నిత్యమైనప్పుడు ఉన్న మరొక దోషాన్ని చెపుతున్నారు.

సూ॥ **నిత్యమేవచ భావాత్ 2–2–13** సమవాయమనేది సమ్బన్ధము కాబట్టి సమ్బన్ధము నిత్యమైనప్పుడు జగత్తు నిత్యమూ అవుతుంది కనుక అసమంజసమే.

సూ॥ **రూపాది మత్త్వాచ్చ విపర్యయోదర్శనాత్ 2–2– 14** భూమి, నీరు, తేజస్సు, వాయువులకు చెందిన నాలుగు రకాల పరమాణువులకు రూపము, రసము, గన్ధము, స్పర్శములు అనే విశేషాలను కల్గియున్నవి అని అంగీకరించినందున నిత్యత్వము – ఎల్లప్పుడూ ఉనికి కలిగి ఉండడము, సూక్ష్మములై ఉండడము, అవయవాలు

లేకుండడము మొదలైనవాటికి భిన్నంగా అనిత్యత్వము, స్థూలత్వము, సావయవత్వము మొదలైన ధర్మాలు వచ్చి చేరుతవి. రూపమును కలిగియున్న కుండ మొదలైన వాటికి అనిత్యత్వము, అట్లాంటివే ఐన కారణాన్తరాలతో సృష్టింపబడడమును మనం చూస్తున్నాము. అందువల్ల కార్యాన్నిబట్టి కారణాన్ని ఊహించినట్లయితే అనిత్యములైన ఘటాలకు కారణమైనమన్ను, దానికి చెందిన అణువులు కూడా అనిత్యాలే కావలసి ఉంటుంది. లోకంలో చూస్తున్నదాన్ని బట్టి కనబడని అర్థాన్ని వస్తువును కల్పించడానికి పూనుకొంటే మనం కోరుకున్న వస్తు విశేషాన్ని స్థాపించడము వీలుకాదు. దర్శనాన్ని ప్రత్యక్షాన్ని పట్టి నీవు పరమాణువులకు రూపాన్ని తదితరములైన వాటిని కల్పిస్తున్నావు కదా! ఇందువల్ల కూడా పరమాణుకారణవాదము అసమంజసమే.

ఇక ఈ దోషాన్ని తొలగించుకోవడానికి పరమాణువులకు రూపాదిమత్త్వాన్ని అంగీకరించవూ! ఐనా దోషమే వివరిస్తున్నాడు.

సూ॥ **ఉభయథాచదోషాత్ 2-2-15** పరమాణువులకు రూపాదులు ఉన్నవని ఒప్పుకుంటేనే దోషము కాదు, రూపాదులు లేకపోయినా ఎప్పుడైనా కారణంలో ఉండే గుణాలే కార్యములోనున్నూ కనిపిస్తున్నాయి గనుక పరమాణువులు రూపాదులు లేనివే ఐతే వాటినుండే పుట్టిన భూమి మొదలైనవి రూపాదులు లేనట్టివే ఔతాయి. దాన్ని తొలగించుకుందామని రూపాదులను ఒప్పుకుంటే మునుపు చెప్పిన దోషాలే ముందుకొస్తాయి. కనుక ఎట్లయినా దోషమే కనుక పరమాణు కారణవాదము అసమంజసమే.

సూ॥ **అపరిగ్రహాచ్చ అత్యన్తమనపేక్షా 2-2-16** కపిలునిసాంఖ్యసిద్ధాన్తము శ్రుతులతో న్యాయాలతో విరుద్ధముగా ఉన్నదని వదిలిపెట్టబడినా సత్కార్యవాదము – ఉన్నదాని నుండే వస్తువు / జగత్తు పుడుతున్నది అనే వాదాన్ని అంగీకరించడము వంటి కొన్ని విశేషాంశాల కారణంగా వైదికులు కొన్నికొన్ని చోట్ల దాన్ని స్వీకరించు తున్నారు. ఈ కాణాదునిపక్షమైతే ఏ అంశములోనైనా అంగీకరింపబడలేదు కాబట్టి అనుపపన్నమూ అవుతున్నందువల్ల మోక్షాన్ని కోరేవారు దీన్ని ఏమాత్రము ఆదరించరాదు. **ఇది మహద్దీర్ఘాధి కరణము.**

★ ★ ★

## ఇక సముదాయాధికరణము

సూ॥ **సముదాయ ఉభయహేతుకేఽపి తదప్రాప్తిః 2-2-17** పరమాణువులే జగత్ పుట్టడానికి కారణమనే వైశేషికులు ప్రక్కకు తోసివేయబడినారు. బుద్ధుని అనుయాయులు కూడా పరమాణువులే కారణమని ఆమోదిస్తున్నారు కాబట్టి వారి మతము ప్రకారము కూడా జగత్తు పుట్టడము, దాని వ్యవహారము మొదలైనవి పొసగవు అని చెప్పబడుతున్నది. బౌద్ధులు నాలుగు రకాలుగా ఉన్నారు. 1) ఒకరు పార్థివ, ఆప్య (నీరు) తైజస, వాయవీయపరమాణువుల యొక్క సంఘాత (సమూహము – ఒక్కదగ్గర చేరడము) రూపము, భూతాలను భౌతికాలు ఐన బాహ్యపదార్థాలను, చిత్తము – జ్ఞానసన్తానము చైత్తము – రాగము ద్వేషము మొదలైనవి – రూపాలుగా మానసికాలైన అర్థాలను / వస్తువులను ప్రత్యక్షము, అనుమాన ప్రమాణాలు చేత తెలియవచ్చిన వాటిని ఉన్నవని అంగీకరిస్తున్నారు. 2) మరొకరు బయట కనిపించే పృథివీ మొదలైన అర్థాలనన్నింటినీ విజ్ఞానము చేత ఊహింపదగినవిగా చెపుతున్నారు. వేరొకరు 3) వస్తువు లేని విజ్ఞానమే పరమార్థంగా ఉన్నది. బయట కనిపించేవన్నీ కలలో చూచిన వస్తువుల వంటివి. అని అంటున్నారు. ఈ ముగ్గురు కూడా తాము ఒప్పుకున్న వస్తువులు క్షణికము – ఒక్క క్షణము కాలము మాత్రమే ఉనికి కల్గి ఉంటున్నవి అని అంటున్నారు. ఇంతవరకు చెప్పుకున్న భూత, భౌతిక, చిత్త, చైత్తముల కంటే వేరుగా ఆత్మ, ఆకాశము మొదలైనవాటిని స్వరూపముతో సహా అంగీకరించనే అంగీకరించరు. 4) చివరివారు సర్వశూన్యమునే ప్రతిపాదించుతారు. ఏమీ లేదని అంటున్నారు.

కొన్ని తెల్సుకోవలసిన అంశాలు – వీళ్ళు ఐదు స్కంధాలు ఉన్నవని అంటున్నారు. 1) రూపస్కంధము 2) విజ్ఞానస్కంధము 3) వేదనాస్కంధము 4) సంజ్ఞాస్కంధము 5) సంస్కారస్కంధము.

1) పంచభూతాలు, ఇంద్రియాలకు చెందిన విషయాలను రూపస్కన్ధము అని 2) ఆయా విషయాలను గ్రహించుతున్నాడు కనుక నేను అనే అభిమానాన్ని కల్గియున్న జ్ఞానమే విజ్ఞానస్కన్ధము 3) ప్రియము అప్రియము రెండూ కాని అనుభవాల వల్ల పుట్టిన సుఖము దుఃఖము ఉపేక్షాత్మకముగా ఉన్న మనస్సు (లోని) యొక్క అవస్థావిశేషాలను వేదనాస్కన్ధము అని 4) అవును, కాదు అన్నట్లు రెండు వికల్పాలుగా ఉన్న ప్రత్యయము (గుర్తించుట) ను సంజ్ఞాస్కన్ధము అని 5) రాగద్వేషములు మోహము మొదలైనవన్నీ సంస్కారగన్ధము అని అనబడుతున్నాయి.

**ఈ నలుగురు బౌద్ధులకు నాలుగు పేర్లున్నవి. 1) వైభాషికుడు 2) సౌత్రాన్తికుడు 3) యోగాచారుడు 4) మాధ్యమికుడు అని.** వారిలో ముందుగా బాహ్యార్థాలు ఉన్నవి అని వాదించేవాడిని నిరసించుతున్నారు. వాళ్ళు ఇట్లాగా తలుస్తున్నారు. రూపరసస్పర్శ గన్ధములను స్వభావముగా కల్గినవి పార్థివ పరమాణువులు. రూప, రస, స్పర్శ స్వభావాలు కలవి ఆప్య(నీరు) పరమాణువులు, రూప స్పర్శ స్వభావాలు గలవి తైజసములు (అగ్నికి చెందినవి) స్పర్శ స్పర్శ గల పరమాణువులు వాయువుకు సమ్బన్ధించినవి అని భావిస్తున్నారు. అవన్నీ ఒక్క దగ్గర చేరి పృథివీ, అప్, తేజో వాయువులు అనబడుతున్నాయి. వాటినే మనము భూతాలు అని అంటున్నాం ఆకాశమనే భూతాన్ని వీళ్ళు అంగీకరించరు. ఆ పృథివీ మొదలైన వాటి నుంచి శరీరములో ఇంద్రియాలు విషయ రూపసంఘాతాలు పుడుతున్నాయి. వాటిలో శరీరములో ఉండేటువంటి, గ్రహిస్తున్నాను అనే అభిమానము కల, విజ్ఞాన సన్తానమే ఆత్మగా ఉంటున్నది. (విజ్ఞానసన్తానమంటే ఏదైనా క్షణకాలమే ఉండేదే కాబట్టి విజ్ఞానము కూడా క్షణములోనే పుట్టి నశించుతున్నది. అది పోతూ పోతూ తనవంటి మరొక జ్ఞానక్షణాన్ని పుట్టించి చచ్చిపోతుంది. ఇట్లా ఎడతెగకుండా సాగే ప్రక్రియను సన్తానము అని అంటారు. ఇది జ్ఞానానికి చెందింది కాబట్టి జ్ఞానసంతానము అని అంటున్నారు.)

ఆ ఆత్మ దానివల్లనే లౌకిక వ్యవహారమంతా నడుస్తున్నది. వారి విషయములో చెప్పబడుతున్నది. సముదాయే ఉభయహేతుకేఽపితదప్రాప్తిః అని. ఏదైతే అణువుల వల్ల పుట్టిన పృథివీ మొదలైన భూతాల రూపములో ఉన్న సముదాయము ఉన్నదో, ఏది పృథివ్యాదులు కారణంగా పుట్టిన శరీరము ఇంద్రియాలు విషయాలరూపములో ఉన్న సముదాయము ఉన్నదో ఆ రెండింటికీ కారణమైన సముదాయము నందు సముదాయము అని అనబడడము కుదురదు. అనగా జగద్రూపమైన సముదాయము ఉత్పత్తి కావడము కుదరదు అని అర్థము. పరమాణువులు పృథివ్యాది భూతాలకున్నూ క్షణము మాత్రమే ఉంటవి అని ఒప్పుకుంటున్నందున అవి అనగా క్షణములో నశించేవి ఐన పరమాణువులు భూతాలు ఎప్పుడు ఒక్కటి కావడానికి పూనుకుంటున్నవి, ఎప్పుడు ఒక్కటి అవుతున్నవి. ఎప్పుడు ఇది ఈ పదార్థము అని గుర్తించడానికి విషయాలు అవుతున్నవి? ఎప్పుడు చేతిలోకి తీసుకోవడానికి, లేక పారవేయడానికి గాను తగిన వ్యవహారస్థితిని పొందుతున్నాయి? విజ్ఞానాత్మఐన ఎవడు ఏ విషయాన్ని

తాకుతున్నాడు? ఏ విజ్ఞానాత్మ ఏ అర్థాన్ని ఎప్పుడు తెల్పుతున్నాడు? తెల్సిన ఏ అర్థాన్ని ఎవడు ఎప్పుడు దగ్గరకు తీసుకుంటున్నాడు? స్పృశించే వాడు అంతలోనే నశిస్తున్నాడు. స్పృశించేబడేదిన్నీ నశించిపోతున్నది. అట్లాగే వేదితా తెలిపేవాడు విదితమైన (తెల్సిన) వస్తువున్నూనశించిపోతూనే ఉన్నది.ఎట్లాగా ఒకడి చేతస్పృశించబడినదాన్ని ఇంకొకడు తెల్పుతాడు. ఏ విధంగా ఒకనిచేత తెల్సుకోబడిన అర్థాన్ని మరొకడు తీసుకుంటాడు? సన్తానాలు క్షణక్షణమూ పుట్టేవి అన్నీ ఒక్కటే విధంగా ఉండేవి అయ్యి ఒక్కటే ఆ మొదటి క్షణములో చూచిందే అని అనిపించినా పుట్టించిన సన్తానములు వాటికి వాస్తవానికి మరొక వస్తువు ఇది. అదే వస్తువుకాదు అని అనడాన్ని ఒప్పుకోనందున అట్లా ఒకే వస్తువనడం ద్వారా జరిగే వ్యవహారాదులు పొసగవు. ఇక అహమ్ అనే శబ్దము చేత చెప్పబడేవాడు నేను అనే అభిమానాన్ని కలిగి ఉన్నవాడు ఆత్మనే కాని జ్ఞాతృత్వము లేని మరొకటి కాదు. వస్తువును తెల్సుకుంటున్నవాడు జ్ఞాతృత్వమనే ధర్మాన్ని కలవాడు ఆత్మనే అని ఇంతకుముందే మేము ప్రతిపాదించినాము.

సూ॥ **ఇతరేతర ప్రత్యయత్వాత్ ఉపపన్నమితిచేత్. సంఘాత భావ అనిమిత్తత్వాత్ 2-2-18** అవిద్యాదులు ఒకదానికొకటి హేతువులు అవుతున్నవి కాబట్టి సంఘాత భావము మొదలైనవి ఉపపన్నములే అని అన్నట్లయితే – పూర్వపక్షము వారు సమర్థించుకున్న తీరు ఇది – భావాలన్నీ క్షణకాలమే ఉండేవి ఐనా అవిద్యచేత ఇదంతా పొసగుతుంది. అవిద్య అంటే విపరీత బుద్ధి. ఉన్నదానికి వ్యతిరేకమైన జ్ఞానం కలుగడం. క్షణికాలైన వాటియందు స్థిరంగా కొంతకాలము దాకా నిల్చి ఉంటవి అని అనుకోవడమే. దానిద్వారా సంస్కారములు అనబడే రాగము ద్వేషము మొదలైనవి పుడుతున్నవి. దాని కారణంగా చిత్తము బాగా ప్రజ్వలించడమనే రూపమైన విజ్ఞానము కలుగుతుంది. దానినుండి నామము అనే పేరు గల చిత్త చైత్తములు, వాటినుండి పృథివీ మొదలైన రూపము గల ద్రవ్యము జన్మించుతుంది. ఆ రూపి ద్రవ్యము నుండి షడాయతనము అనబడే ఆరు ఇంద్రియాలు, వాటినుండి స్పర్శ అను పేరు గల కాయము, దానినుండి వేదన మొదలైనవి, వాటినుండి తిరిగి అవిద్యాదులు మునుపు చెప్పినటువంటివి ఏర్పడుతున్నవి. ఈ విధంగా అనాది ఐన అవిద్యాదులైనవాటికి ఒకటికొకటి కారణమవుతున్నవి. చక్రములాగా తిరుగుతూ ఉన్నది. ఇదంతా కూడా పృథివీ మొదలైన భూత, భౌతిక సంఘాతము లేకుండా కుదరదు. కనుక సంఘాత భావాదికము ఉపపన్నమే అని.

దానికి సమాధానమిది – సంఘాతభావానిమిత్తత్వాత్ అని. నీవు చెప్పినది పొసగదు. నీ మాట ప్రకారమే అవిద్యాదులకు పృథివీ మొదలైన భూత భౌతిక సంఘాత భావానికి నిమిత్తము – కారణము కాదు కాబట్టి. అస్థిరము లైన వాటి యందు స్థిరము ఐనది అనే బుద్ధితో కూడిన అవిద్య కాని, దానికి కారణమైన రాగద్వేషాదులు కాని మరొక పదార్థానికి, అదీక్షణికమైనదానికి ఒక్క దగ్గర చేరడానికి – సంహతికి హేతువులు కావు. ముత్యపు చిప్పలో రజతము ఉన్నదనే బుద్ధి శుక్తి మొదలైన అర్థాలు సంహతి కావడానికి హేతువు కాదు. ఇంకా ఎవనికి క్షణికమైన దానియందు స్థిరము అనే బుద్ధి కలుగుతున్నదో వాడు అప్పుడే నశించిపోయినాడు. కాబట్టి రాగాదులు ఎవడికి కల్గుతున్నాయి? సంస్కారానికి ఆశ్రయము ఐన స్థిరమగు ఒక ద్రవ్యము ఉన్నదని ఒప్పుకోని వారికి సంస్కారము అనేది పైవారి నుండి కింది వారికి అనువృత్తి సంక్రమించడమనేది కూడా కల్పించడం కుదరదు.

సూ॥ **ఉత్తరోత్పాదే చపూర్వ విరోధాత్ 2-2-19** ఈ చెప్పబోయే కారణము వల్ల కూడా క్షణికము అనే వారికి జగదుత్పత్తి కుదురదు. ఎందుకంటే ఉత్తరక్షణము – తర్వాత రాబోయే క్షణము యొక్క పుట్టుక సమయంలో పూర్వక్షణము – ముందరిది నశించిపోతున్నది కాబట్టి అది ఉత్తరక్షణము పుట్టడానికి కారణము కావడం కుదరదు. అప్పుడు అభావమే ఏమీ లేకపోవడమే హేతువు అయ్యేట్లుంటే అంతా అన్నిచోట్లా అన్నివేళల్లో పుట్టవలసియే ఉంటుంది. అట్లాకాకుండా పూర్వక్షణము యొక్క ఉనికే వర్తిత్వమే హేతువు అని నీవు చెప్పితే అప్పుడు ఏదో ఒక క్షణము – ఘటక్షణము దాని తర్వాతి కాలములో పుట్టబోయే వాటికన్నింటికీ అంటే. ఆవు దున్నపోతు గుర్రము గోడ రాయి మొదలైన మూడు లోకాలలో ఉండే వాటికి పుట్టడానికి కారణము కావాల్సి వస్తుంది. ఇక ఒక జాతికి చెందిన పూర్వక్షణములో ఉన్నదానికే హేతుత్వము– కారణము కావడమును అంగీకరించితే అట్లయినా అన్ని దేశాలలో ఉండే, ఉత్తరక్షణములో పుట్టబోయే ఘటాలన్నింటికీ పూర్వక్షణములో ఉండే ఘటము ఒక్కటే హేతువు అవుతుంది. లేదూ ఒక్కదానికి ఒక్కటే హేతువు అవుతుందని అంటే అప్పుడు కూడా ఏ ఒక్కదానికి ఏ ఒక్కటి అవుతుందో తెలియదు. పోనీ ఏ దేశములో ఏ ఘటక్షణము ఉన్నదో ఆ దేశానికి సమ్బన్ధించినదే ఆ దేశానికి సమ్బన్ధించిన దానికి – ఉత్తరఘటక్షణానికి అది హేతువు అవుతుంది అని తలచినా స్థిరంగా ఆదేశము ఉంటుందని తలుస్తున్నావా? ఇంతేకాకుండా కన్ను మొదలైన వాటితో సమ్బన్ధాన్ని

కలిగిన వస్తువులకు సమ్బన్ధించి జ్ఞానము పుట్టేకాలంలో ఆ వస్తువు ఉండడము లేదు కాబట్టి ఏ ఒక్క వస్తువు కూడా జ్ఞానానికి అందుబాటులో ఉండదు. దాని జ్ఞానము కలుగదు.

సూ॥ **అసతిప్రతిజ్ఞోపరోధో యౌగపద్యమన్యథా 2-2-20** కారణములేకున్నా కార్యము పుడుతుంది అనేట్లయితే అన్ని వస్తువులు అన్నిచోట్లలో అన్నివేళల్లోనూ పుట్టవలసి ఉంటుంది అని చెప్పినాము కదా! కారణము లేనప్పుడు ఉత్పత్తికి విరోధము ఏర్పడడమే కాకుండా మీరు చేసిన ప్రతిజ్ఞ కూడా నిల్చిపోతుంది. నెరవేరదు. అధిపతి సహకారి ఆలంబన సమనన్తర ప్రత్యయాలు నాలుగున్నూ విజ్ఞానం పుట్టడానికి హేతువులు అని కదా మీ ప్రతిజ్ఞ. అధిపతి = ఇంద్రియము. సహకారి = చూపు మొదలైనవి, ఆలంబనమ్=విషయము చూడబడే వస్తువు; సమనన్తర ప్రత్యయః అనన్తర పూర్వక్షణప్రత్యయము అనగా హేతువు. ఇక మీ ప్రతిజ్ఞ నెరవేరడానికి ఘటక్షణము ఉంటుండగానే మరొక ఘటక్షణము పుడుతుందని మీరు అంగీకరించితే అప్పుడు కార్యము కారణము ఐన రెండు ఘటక్షణాలు ఒకేసారి ఉండవలసి ఉంటుంది. కాని అట్లా జరుగడం లేదు ఒకటి నశించినాకనే మరొకటి పుడుతున్నది. అదే నిజమైనప్పుడు మీ ప్రతిజ్ఞ దిగజార్తుంది. ఐనా మాక్షణికత్వానికి లోటేమీరాదు. తర్వాత రాబోయేదే ముందు వస్తుంది కనుక మాకు నష్టము లేదు అని అంటారా? అప్పుడు ఇంద్రియజ్ఞానము సంప్రయోగజ్ఞానములు రెండూ – కార్యకారణాలు – ఏకకాలములో ఉండాల్సి ఉంటుంది. కార్యకారణాలు ఎప్పుడూ ఏ క్షణములో ఉండవు. కారణమున్నప్పుడు కార్యము ఉండదు. కార్యము ఉన్నపుడు కారణము ఉండదు. మీ క్షణికత్వం నిలువదు.

సూ॥ **ప్రతిసంఖ్యాఅప్రతి సంఖ్యానిరోధా ప్రాప్తిః అవిచ్ఛేదాత్ 2-2-21** ఈ విధంగా అసత్తు నుండి – శూన్యము నుంచి – జగత్తు పుట్టడము అనేది జరుగదని తోసి పుచ్చబడింది. ఇక సత్తుకు నిరన్వయ వినాశము కూడా – బొత్తిగా ఏమీ లేకుండా ఉన్న వస్తువు నశించుతుంది – అనే వాదము కూడా చెల్లదు అని చెప్పబడుతున్నది. క్షణికత్వవాదులు గుదియతో కుండను పగులకొట్టిన తరువాత జరుగనున్నది ఉపలబ్ధి యోగ్యము – మిగిలింది లభించేది – ముందుండి ఇప్పుడు లేదనిపించుకుంటున్నదానితో సమానమైన సన్తానము యొక్క అవసానరూపము – లేకుండా పోవడముగానున్న రూపమై స్థూలముగా ఉండేది ఏదో, ముందున్నదానితో సమానమైన రూపముగల సన్తానము నందు ప్రతిక్షణము జరుగనున్నదై ఉన్నది అని అనడానికి వీలు కాని

సూక్ష్మమైన ఏనిరన్వయవినాశము ఉన్నదో ఆ రెండున్నూ ప్రతిసంఖ్యా నిరోధము, అప్రతి సంఖ్యావిరోధనము అనే శబ్దాలతో చెప్పబడుతున్నవి. అవి సంభవించవు అని అర్థము. ఎందువల్ల నంటే విచ్ఛేదము – తెగిపోవడము జరుగడము లేదు కాబట్టి. సత్తు అనబడే వస్తువు నిరన్వయ విచ్ఛేదాన్ని పొందడము లేదు. అంటే బొత్తిగా లేకుండా పోవడములేదు. మరొక రూపములో ఉంటున్నది కదా! అసంభవము ఎట్లాగా? అంటే సత్తు అనబడే వస్తువుకు ఉత్పత్తి వినాశములు రెండూ రెండవస్థలు. ఒక అవస్థలో లేనిది మరొక అవస్థలో ఉంటూన్నది కాబట్టి. ఆయా అవస్థలను పొందే ద్రవ్యము ఒక్కటే స్థిరమైనది. అని కారణానికంటే కార్యము వేరు కాదని ఉపపాదించిన మేము "**తదనన్యత్వం ఆరంభణ శబ్దాదిభ్యః**" అనే సూత్రము దగ్గర వివరంగా చెప్పినాము. దీపము ఆరిపోయినప్పుడు నిరన్వయ వినాశము కనిపిస్తున్నది. దానివలెనే ఇతరత్రా కూడా నిరన్వయమైన వినాశము ఊహింపబడుతున్నది కదా! అని అంటే అది సరికాదు. ఘటము శరావము – చిప్ప – మొదలైన వాటియందు మట్టి మొదలైన ద్రవ్యాల అనువృత్తి లభించుతున్నది కాబట్టి ఉన్నదైన ద్రవ్యము మరొక అవస్థను పొందడమే వినాశము అని నిశ్చయము చేస్తే, దీపము మొదలైన వాటి సూక్ష్మమైన దశను పొందింది కాబట్టి కనుపించడము లేదు అని అనుపలబ్ధికి కారణాన్ని కల్పించుకుంటే సరిపోతుంది. దాన్ని కూడా అవస్థాన్తరాన్ని పొందింది అని కల్పించుకోవడమే మంచిది.

సూ॥ **ఉభయథా చ దోషాత్ 2-2-22** క్షణికత్వవాదులు బొత్తిగా ఏమీ లేనిదానినుంచి – తుచ్ఛము నుండి – వస్తువులయొక్క ఉత్పత్తి జరుగుతుంది అని అంగీకరించినారు. అట్లా పుట్టింది మాత్రము తుచ్ఛము కాదు అని కూడా అన్నారు. ఆ రెండింటినీ ఒప్పుకుంటే దోషము వస్తుంది. సాధారణంగా తుచ్ఛము నుండి పుట్టిన కార్యము / వస్తువు తుచ్ఛమే కావలసి ఉంటుంది. ఏ వస్తువు కారణమైన ఏ ద్రవ్యము నుండి పుడుతుందో అది దాని వంటిదే – కారణాన్ని తనలో కల్గినదయ్యే తదాత్మకమే అవుతున్నది. లోకములో అతీరుగానే కనిపించుతున్నది కూడా ఎట్లాగంటే మట్టి నుండి పుట్టిన కుండ చిప్పలు మృణ్మయము లే అవుతున్నవి. బంగారముతో చేయబడిన కిరీటము వంటి నగలు స్వర్ణమయములుగానే కనబడుతున్నవి. మీరు ప్రపంచమును తుచ్ఛమని శూన్యమని బొత్తిగా ఒప్పుకోరు. అట్లాగా కనుపించడము లేదు కూడా! ఉన్న వస్తువు ఏమీ మిగులకుండా ఆనవాలు లేకుండా నశించిపోయినట్లయితే ఇప్పుడున్న క్షణానికి తర్వాత జగత్తు మొత్తము తుచ్ఛమే – బొత్తిగా ఏమీ లేనిదే అవుతుంది.

తరువాత తుచ్ఛము నుండి జగత్తుపుడితే ఆ జగత్తు తుచ్ఛాత్మకమే కాగలదు. కావున రెండు విధాలుగానూ దోషమే వస్తున్నది కాబట్టి నీవు చెప్పిన ప్రకారము అసత్తు నుండి జగదుత్పత్తి కావడమూ లేదు. ఏమీ మిగులకుండా ప్రపంచము నాశనము కావడం లేదు.

సూ॥ **ఆకాశే చ అవిశేషాత్ 2-2-23** బాహ్యములైన (బయటకనిపించే) ఆభ్యన్తరములు (మనస్సులోని) ఐన వస్తువులు స్థిరములే – ప్రతిక్షణమూ పుడుతూ చస్తూ ఉండేవి కావు – అని ప్రతిపాదించడం కొరకు ప్రతిసంఖ్యా, అప్రతిసంఖ్యా నిరోధములు అనే రెండింటికీ తుచ్ఛరూపతను నిరాకరించినారు. ఆప్రసంగము / సందర్భములో వాటితో సహా బౌద్ధులు తుచ్ఛముగా – లేనిదిగా లెక్కించిన ఆకాశమును గురించిన తుచ్ఛతను తిప్పికొడుతున్నారు. ఆకాశము లేనిది నిరుపాఖ్యము అని అనడము తగదు. భావరూపములుగా – ఆకారాలను కల్గి ఉన్నవి – గా ఒప్పుకున్న పృథివీ మొదలైనవాటివలెనే ఆకాశం కూడా అబాధిత ప్రతీతి వలన సిద్ధమైనట్టిదే – ఉన్నది అనబడే ప్రతీతిని కాదు అనే అంశము ఉన్నట్లయితే అది బాధిత ప్రతీతి కలది. అట్లా కానిది అబాధిత ప్రతీతి. అనగా ఉన్నది అనే అనబడుతున్నది కాని లేదని కొట్టివేయబడడం లేదు. ఇక్కడ గద్ద ఎగురుతున్నది. ఇక్కడే డేగ ఎగురుతున్నది. అని డేగ గద్ధ మొదలైన పక్షులు విహరిస్తున్న దాన్నిబట్టి ఆకాశము కనిపిస్తూనే ఉన్నది. పృథివీ మొదలైన వాటి యొక్క అభావ మాత్రమే ఆకాశము అని చెప్పడానికి వీలు లేదు. వికల్పము చేస్తే నిలువదు కాబట్టి. అభావము అన్నపుడు ఏ అభావము అది. 1) పృథివ్యాదుల యొక్క ప్రాగభావమా? అంటే అవి పుట్టుకకుముందు లేకపోవడమా? అని. లేక వాటి ప్రధ్వంసం తరువాత లేకపోవడమా? 3) ఒకదాని కొకటి లేకపోవడమా? ఇతరేతర అభావమా? 4) అత్యన్తాభావమా? అంటే బొత్తిగానే లేకపోవడమా? అని. నాలుగు విధాలుగా లేకపోవడము ఆకాశమా? అని. ఈ అన్నిరకాలుగానూ ఆకాశము లేదనడం కుదరదు. ప్రాగభావము, ప్రధ్వంసాభావములే ఆకాశము అని అనేట్లయితే పృథివీ మొదలైనవి ఉంటుండగా ఆకాశ ప్రతీతి కుదరదు కాబట్టి ఈ జగత్తు ఆకాశము లేనిది అవుతుంది. ఇతరేతర అభావమే ఆకాశము అనేట్లయితే ఇతరేతర భావము అనేది ఆయా వస్తువులపై ఆధారపడి ఉండేది కాబట్టి వాటికి నడుమ ఆకాశప్రతీతి కలుగదు. అత్యంతాభావము పృథివీ మొదలైనవాటికి కలుగదు. అభావమనగా ఉన్నటువంటి వస్తువుయొక్క మరొక అవస్థా విశేషము అని ఉపపాదించినాము గనుక ఆకాశము

అభావ రూపమే ఐనా నిరుపాఖ్యము అని అనడం కుదురదు. అండములకు నడుమ ఉండే ఆకాశము త్రివృత్ కరణమును గురించి ఉపదేశించిన దానినిబట్టి చూపబడిన పంచీకరణము ప్రకారము రూపము కలదే అవుతున్నది కాబట్టి కంటికి కనపడుతున్నది అని అన్నప్పటికీ విరోధము ఏమీ లేదు.

సూ॥ **అనుస్మృతేశ్చ 2-2-24** ఇంతకుమునుపు ప్రస్తావించబడిన వస్తువు స్థిరమే క్షణభంగురము కాదు అనే ఇప్పుడూ ఉపపాదింపబడుతున్నది. అనుస్మరణమ్ అంటే మునుపు అనుభవించిన వస్తువుకు సమ్బన్ధించిన విషయమైన జ్ఞానము. ప్రత్యభిజ్ఞానము అని అర్థము. అదే ఇది అని గడిచిపోయిన కాలములో వస్తుసముదాయము అంతా మరలా గుర్తుకు తెచ్చుకోబడుతుంది. దీన్నే ప్రత్యభిజ్ఞ అని అంటున్నాము. దీపజ్వాల మొదలైన వాటిలో వలే సాదృశ్యముపోలిక – కలిగి ఉన్నందువలన ఒక్కటే అనివ్యామోహము కలుగుతున్నదని మీరు అనడానికి వీలుకాదు. వ్యామోహము కలజ్ఞాత ఒక్కడే అని మీరు అంగీకరించడం లేదు. ఒకడు అనుభవించిన ఏకత్వాన్ని గానీ సాదృశ్యాన్ని గానీ తాను అనుభవించిన దాన్ని మరొకడుగానీ అనుసన్ధానమును– తలచుకోవడాన్ని చేయడం లేదు. కావున భిన్నములైన కాల వస్తువులపైన ఆధారపడిన సాదృశ్యానుభవానికి కట్టుబడిన ఒక్కడే అనే దాన్ని వ్యామోహం అని చెప్పే మీరు జ్ఞాత ఒక్కడే అనే విషయాన్ని తప్పక ఒప్పుకొని తీరాలి. తెల్సుకోదగినవైన ఘటము మొదలైనవాటిలోనూ జ్వాలాదులలో వలె భేదాన్ని తెలిపే ప్రమాణాన్నిదేన్నీ తెల్సుకోలేకున్నాము. లభించినప్పుడు మాత్రమే ఆ ప్రమాణము ప్రకారము సాదృశ్యానికి కట్టుబడిన ప్రత్యభిజ్ఞను కల్పించగలుగుతాము.

ప్రత్యక్ష అనుమాన ప్రమాణాల ప్రకారము ఘటాదులు క్షణికములని తెల్సుకోగలుగుతున్నాము. ప్రత్యక్షమైతే వర్తమాన కాలానికి చెందిన వస్తువుకు సమ్బన్ధించిన విషయాన్ని వర్తమానము కాని – ఇప్పుడు ఉండని వస్తువు కన్న వేరయినటువంటిదై తనకు సమ్బన్ధించిన జ్ఞానాన్ని తెలుపుతుంది. ప్రస్తుతము ఉన్న నీల వర్ణపు వస్తువు అపుడు లేని పచ్చని వస్తువును వలె. అనగా తనను గురించి ఎరుక పరుస్తుంది గాని లేనట్టి పచ్చ వస్తువును గురించి కాదు. ఇట్లాగే భూతభవిష్యత్తులకంటే వర్తమానము తనను వాటి కంటే వేరయిన వస్తువునుగా తెలుపుతుంది. అట్లాగే ఈ వర్తమానము ఆ రెండింటి కంటే ఇతరమయిన వస్తువుగా గుర్తిస్తాము. ఇక అనుమానము కూడ అర్థవన్తమైన క్రియను చేస్తుంది. ప్రస్తుతము ఉనికిలో

ఉన్నటువంటిదిన్నీ అవుతున్నది కనుక ఘటాదులు క్షణికములు. ఏది క్షణికము కాదో కుందేటి కొమ్ము వంటిది ఉన్నదో అది అర్థక్రియాకారి కాదు. పైగా అసత్తు కూడాను. అట్లే చివరి ఘటక్షణము ఉన్నది కాబట్టి దీనికంటే ముందున్న ఘటక్షణాలు / ఘటక్షణ సత్త్వాలు నశించే స్వభావము కలవి. ఘటక్షణము ఉన్నందువల్ల అన్త్యఘట క్షణసత్త్వము వలె అని దేన్నైతే మీరు చెపుతున్నారో అది కార్యకారణభావము పొసగడం లేదు కాబట్టి మరిన్నీ తర్కాను గృహీతమైన ప్రత్యభిజ్ఞ అనే ప్రత్యక్ష ప్రమాణము చేత తర్కవిరుద్ధమైన అనుమానము బాధింపబడింది కనుకనూ పూర్వమే ఆ మాట తోసిపుచ్చబడింది. ప్రత్యక్షము చేత ఉన్నదని తెలియబడుతున్నదై వర్తమానము అవర్తమానము నుండి – ప్రస్తుతము లేనిదాన్నుండి – వేరుచేయబడడము అనేది వర్తమానాన్ని వస్త్వన్తరము – మరొక వస్తువు అనే విషయాన్ని తెలుపదు. కానీ వర్తమానకాలములో ఉండడాన్ని మాత్రమే తెలుపుతుంది. అంతమాత్రం చేత మరొకవస్తువు అని అనబడడము సిద్ధించదు. వర్తమానములో ఉన్నదానికే కాలాన్తరముతో కలయిక కలుగుతున్నది కాబట్టి.

క్షణికములు వస్తువులు అని సాధించడానికి 1) సత్త్వాత్ 2) అర్థక్రియాకారిత్వాత్ (ఉండుటవల్ల, అర్థవంతమైన క్రియను చేసేది) అని రెండు హేతువులను చెప్పినారు. మంచిదే కాని ఆ రెండూ మీరనుకున్న దాన్ని సాధించలేకపోతున్నాయి కాబట్టి విరుద్ధహేతువులు అవుతున్నాయి. ఉనికిని గలిగియున్నందువల్ల అర్థవంతమైన క్రియను చేస్తున్నది కాబట్టిన్నీ ఘటము మొదలైన వస్తువులన్నీ క్షణికాలు కావు. స్థాస్ను = నిల్చి ఉండేవి. ఏది స్థాస్నువు (నిలిచేది) కాదో అది అసత్తు. అనర్థక్రియాకారి కూడా. ఎట్లాగంటే కుందేటికొమ్ము వలె అని కూడా అనుమానాన్ని తర్కాన్ని చెప్పవచ్చును. ఇంతేకాదు అర్థక్రియాకారి కావడము అక్షణికత్వాన్నే సాధిస్తున్నది. క్షణములో నశించిపోయేది ఏ పనినీ చేయజాలదు వ్యాపారము లేదు కాబట్టి అర్థక్రియాకారికాదు అని చెప్పినాము. అదేతీరుగా చివరి ఘటక్షణానికి ఏదో ఒక కారణాన్ని బట్టి వినాశము కనిపిస్తున్నది కనుక దాని కన్న వేరయిన ఘటక్షణాలు కూడా హేతువు లేకుండానే నశించిపోయ్యేవే అవుతాయి. కనుక ముద్గరము – గదవంటి కర్రతో చేసిన సాధనము – వంటి వినాశకహేతువులు వచ్చి మీద పడేంతవరకూ అవి లేక చివరి ఘటక్షణము స్థాస్నువే / స్థిరమే అవుతుంది.

ముద్గరము మొదలైనవి ఘటాదులకు నశించిపోవడానికి కారణాలు కావు. కానీ కపాలము వంటి కుండ కంటే విసదృశములైన / వేరయిన సన్తానాన్ని పుట్టించడానికి హేతువులు అని అనకూడదు. కపాలము అనే అవస్థను పొందడమే ఘటాదులకు వినాశము అని ఉపపాదించినాము కాదా! వినాశము కపాల ఉత్పత్తి కంటే వేరయినది అని ఒప్పుకున్నా, తరువాత జరుగబోయే దాన్ని బట్టి ముద్గరాదులు వినాశ హేతువులు అని అంగీకరించడమే మంచిది.

కనుక ప్రత్యభిజ్ఞ వల్ల తెలియవస్తున్న స్థిరత్వమును ఏదో ఒక కారణముతో కప్పి పుచ్చడము సాధ్యము కాదు. ముందు వెనుక కాలాలకు సమ్బన్ధించి ఉన్న వస్తువు ఒక్కటే అన్న విషయానికి చెందిన ప్రత్యభిజ్ఞను అన్యవిషయము / సాదృశ్యానికి సమ్బన్ధించింది అని చెప్తూ ఉన్న నువ్వు నీలము పీతము మొదలైన జ్ఞానాలను కూడా నీలాదులకు సమ్బన్ధించినవి కావు మరొక్కదానివి అని కూడా చెప్పగలుగుతావు. ఇంకా ప్రమాతా – ఒక ప్రమాణాన్ని ఆధారంగా చేసుకొని ఒక వస్తువునకు చెందిన యధార్థ జ్ఞానాన్ని పొందడానికి ప్రయత్నించేవాడు – ప్రమేయము – ప్రమాణము ద్వారా తెలియబడే వస్తువు – ఈ రెండున్నూ క్షణికములే అని చెప్పే మీకు వ్యాప్తి అవధారణములను స్మరించుకోవడం అనుమాన ప్రమాణాన్ని సాధించడము కూడా సాధ్యము కాదు. అట్లాగే ఈ కనిపించేదంతా క్షణికమే అని ప్రతిజ్ఞ చేసి హేతువును వివరించడమంతా మీకు ఎంతమాత్రమూ కుదరదు. ప్రతిజ్ఞను చేయడానికి పూనుకున్నప్పుడే ఆ క్షణము లోనే ప్రతిజ్ఞను చెప్పే వక్త కూడా నశించిపోతున్నాడు. ఒకడు మొదలుపెట్టిన దాన్ని తెలియకుండా మరొకడు దాన్ని పూర్తి చేయడం కూడా సాధ్యము కాదు. ఒక్కడు కాకుండా వందమంది వచ్చినా దాన్ని పూర్తి చేయలేరు.

సూ॥ **నాసతోఽదృష్టత్వాత్ 2-2-25** ఈ విధంగా బాహ్యార్థాలు ఉన్నవి అని చెప్పే వైభాషికుడు, సౌత్రాన్తికుడు అనబడే బౌద్ధవర్గముల వారికి ఇద్దరికీ వర్తించే సాధారణములైన దోషాలను గురించి ఇంతవరకూ చెప్పినారు. సంప్రయుక్తమైన అర్థము జ్ఞానోత్పత్తికాలములో ఉండడము లేదు కాబట్టి ఏ వస్తువు కూడా జ్ఞానము చేత తెల్సుకోబడేది – జ్ఞానవిషయము – కాదు అని ఏ మాట అనబడిందో! దాని గురించి సౌత్రాన్తికుడు ఎదురుదాడి చేస్తున్నాడు. జ్ఞానము పుట్టేకాలములో వస్తువు ఉండకపోవడము జ్ఞానావిషయం కావడానికి హేతువు కాదు. జ్ఞానము పుట్టడానికి

కారణము కావడమే జ్ఞానవిషయత్వము. ఇంతమాత్రము చేత చక్షువు మొదలైనవి జ్ఞానవిషయాలు కావు. తనయొక్క ఆకారాన్ని సమర్పించడము ద్వారానే జ్ఞానము కలుగడానికి కారణమైనదే జ్ఞానవిషయత్వమవుతున్నదని అంగీకరించినారు కాబట్టి. జ్ఞానము నందు తన ఆకారాన్ని సమర్పించిన తర్వాత అర్థము / వస్తువు నశించినా జ్ఞానము నందున్న నీలము మొదలైన రంగుతో / ఆకారముతో ఆ వస్తువు అనుమానింపబడుతుంది. ఐతే పూర్వపూర్వజ్ఞానాలతో ఉత్తరోత్తర – తర్వాతివైన – జ్ఞానాకారాలు సిద్ధించవు. నీల జ్ఞానము యొక్క సన్తతియందు పీతజ్ఞానము కలుగకుండా పోయే ప్రమాదము ఉన్నది. కనుక అర్థాలను/ వస్తువులను బట్టే జ్ఞానాలలో వైచిత్రి అని. దీనికి సమాధానము చెప్పబడుతున్నది. నా సతో అదృష్టత్వాత్ అని. జ్ఞానము నందు ఏ నీలాది ఆకారము లభిస్తున్నదో, అది నశించిన, లేనిదైన అర్థానికి చెందిన ఆకారము కావడానికి అర్హతను కలది కాదు. ఎందువల్ల అంటే. అదృష్టము – చూడబడనిది కాబట్టి. ధర్మమును కల్గిన వస్తువు నశించిపోతే దాని ధర్మము మరొకవస్తువులోకి సంక్రమించడము ఎక్కడా కనపడటం లేదు. ప్రతిబింబము మొదలైనవి కూడా స్థిరంగా ఉండేదానికే ఏర్పడుతుంది. అక్కడ కూడా కేవల ధర్మమే కాదు. ధర్మి కూడా ప్రతిబింబిస్తుంది. కావున అర్థములలో ఉండే వైచిత్రి కారణంగానే జ్ఞానవైచిత్రి ఏర్పడుతుంది. కాబట్టి జ్ఞానవైచిత్ర్యము అర్థము జ్ఞానము పుట్టేకాలంలో ఉన్నపుడే పుడుతుంది. తిరిగి సాధారణదూషణాన్ని చెప్పినాడు.

సూ॥ **ఉదాసీనానామపి చ ఏవంసిద్ధిః 2-2-26** ఈ విధంగా క్షణికత్వము – అసత్తు నుండి సత్తు పుట్టడము, కారణం లేకుండానే వినాశము జరుగుతుంది అనే విషయాలను ఒప్పుకున్నపుడు ఉదాసీనులు – ఏ ప్రయత్నం చేయడానికి పూనుకోని వారికి కూడా అన్ని ప్రయోజనాలు – ఫలాలు దక్కవలసి ఉంటుంది. సాధారణంగా మనకు నచ్చిన దాన్ని పొందడము నచ్చనిదాన్ని తొలగించుకోవడము మనము చేసిన ప్రయత్నాల వల్లనే సాధ్యమవుతుంది. క్షణకాలములోనే అన్ని వస్తువులు నశించిపోతున్నాయి అని అన్నప్పుడు అన్ని భావాలకు – పుట్టుకలకు – ముందుముందు ఉన్న వస్తువు కాని దానిలో ఉండేదీ సంస్కారాదికమైన విశేషము కాని, విద్యాదులు కానీ తరువాతి దానిలో ఏ ఒక్కటి కూడా అనువర్తమానము కాదు. కనుక ప్రయత్నాదుల వల్ల సాధ్యమయ్యేది ఏదీ లేదు. ఇట్లా ఐనందువల్ల హేతువు లేకుండానే

సిద్ధించుతున్నందువల్ల అన్ని రకాల కోర్కెలు ఉదాసీనులకు – చేతులు ముడుచుకొని కూర్చున్నవాళ్ళకు కూడా – ఐహిక, ఆముష్మిక ఫలాలూ చివరకు మోక్షము కూడా చేజిక్కుతుంది. **ఇది సముదాయాధికరణము.**

★ ★ ★

## ఇక ఉపలబ్ధ్యధికరణము

సూ॥ **నాభావః ఉపలబ్ధేః 2–2–27** ఇపుడు విజ్ఞానము మాత్రమే ఉంటున్నది అని వాదించే యోగాచారులు ఎదురునిలుస్తున్నారు. జ్ఞానములో ఉండే వైచిత్ర్యము అర్థములయొక్క వైచిత్రివల్ల ఏర్పడుతున్నది అని ఏ మాట అన్నారో అది పొసగదు. అర్థముల వలెనే జ్ఞానాలు కూడా సాకారాలు ఐనందువల్ల స్వయంగానే అవి విచిత్రమైనట్టివి. అందులో స్వరూపవైచిత్రి వాసనవల్లనే ఉపపన్నము అవుతుంది. వాసన అంటే విలక్షణ ప్రత్యయాల యొక్క ప్రవాహమే. ప్రత్యయము అంటే హేతువు. ఏ ఘటాకారము యొక్క జ్ఞానము కపాలాకార జ్ఞానానికి ఉత్పాదకము పుట్టించేది అవుతున్నదో – ఆ విధమైన దానికి పుట్టుకనిచ్చేది. దానికి ముందున్న ఘటజ్ఞానము, మళ్ళీ అలాంటి దాన్ని పుట్టించేది దానికంటే ముందున్న ఘటము యొక్క జ్ఞానము. ఇటువంటి ప్రవాహాన్నే వాసన అని అంటున్నాము. ఐతే జ్ఞానాని కంటే బైట ఉన్న ఆవగింజ, పెద్దకొండ మొదలైనవాటి ఆకారములు మానవుని లోపల ఉన్న జ్ఞానానికి సమ్బన్ధించిందే అని ఎట్లా చెపుతున్నావు అని అంటే చెప్తున్నాను. అది ఇట్లా. వస్తువునకు వ్యవహారయోగ్యత్వము జ్ఞానము యొక్క ప్రకాశానికి వశమై ఉన్నది. అట్లా కానప్పుడు తనచేత, మరొకదానిచేత – జ్ఞానము, దానికంటే వేరైనది – తెలుసుకోబడేవాటిలో అతిశయము – ఆధిక్యము – లేకుండా పోవలసివస్తుంది. వెల్లడి అవుతున్న జ్ఞానానికి ఆకారము కల్గి ఉండడాన్ని తప్పక ఒప్పుకుని తీరాలి. ఆకారము లేని దానికి ప్రకాశము కుదురదు. ఉపలభ్యమవుతున్న ఈ ఒకే ఒక్క ఆకారము జ్ఞానానిదే. అది బయటి వస్తువు వలె ప్రకాశించడము – అవభాసము – కూడ భ్రమ వల్ల ఏర్పడుతున్నదే. జ్ఞానము – వస్తువులు రెండున్నూ సహోపలమ్భనియము – కలసియే రెండూ జంటగా కనిపించడము – వల్ల కూడా జ్ఞానము కంటే అర్థము వేరైనది కాదు. ఇంకా బయటి వస్తువులు మాత్రమే ఉంటున్నవి అని ఒప్పుకునే వారు కూడా ఘటము పటము మొదలైన విజ్ఞానాల యందు జ్ఞానము ఆయా వస్తువులకు ఉన్న అసాధారణమైన

స్థితి, ఆయా వస్తువులతో సారూప్యము లేకుండా ఉపపన్నము కాదు. కనుక జ్ఞానము నందు అర్థముతో సమానమైన రూపము ఉన్నది అని అంగీకరించాలి. అంతటితో వ్యవహారాలన్నీ చెల్లుబాటు అవుతాయి. అందువల్ల జ్ఞానానికి వేరుగా అర్థాన్ని / వస్తువును కల్పించడము ప్రమాణము లేనిదే. కనుక విజ్ఞాన మొక్కటెతత్త్వము. బాహ్యార్థము లేదు. ఇట్లా పూర్వపక్షము ఎదురవుతే సమాధానమును చెపుతున్నారు. నాభావః ఉపలబ్దేఃఇతి – జ్ఞానానికంటే వేరుగా అర్థము/ వస్తువు లేదు అని చెప్పడం కుదరదు. ఎందువల్ల నంటే లభించుతున్నది కాబట్టి. జ్ఞాత ఐన ఆత్మకు విశేషమైన అర్థమునుగా వ్యవహరించడానికి తగిన యోగ్యతను కల్గించడము ద్వారా జ్ఞానము లభించుతున్నది. ఈ తీరుగానే గదా! లోకులందరూ గుర్తించుతున్నారు. నేను కుండను ఎరుగుదును / తెల్సుకుంటున్నాను అని. ఈ విధమైన కర్మతో కూడిన కర్తతో కూడిన జ్ఞాధాతువు యొక్క అర్థముతో లోకులందరూ సాక్షులు ఐ నిలుస్తుండగా ప్రత్యక్షంగా కనిపించుతున్నదానితోనే జ్ఞానము మాత్రమే పరమార్థము అని సాధించుతున్నవారు ప్రజలందరికీ నవ్వులపాలు అవుతున్నారు అని ఇదే విషయాన్ని వేదవాదులమే మేము అని చెప్పుకొనే ముసుగులు కప్పుకున్న బౌద్ధులను దూరముగా తరిమినప్పుడు చాలా నేర్పుగా సప్రమాణముగా వివరించినాము.

రెండూ కల్సి ఉంటాయని చెప్పే విషయాన్ని చెప్తూ సహోపలమ్భ నియమము ప్రకారము నీలమునకు – (దాన్ని కల్గినదిన్నీ) దాన్ని తెలిపే బుద్ధికిన్నీ భేదము లేదు అని ఏ మాట చెప్పినారో అది సరికాదు. ముందుగా ఆ మాట స్వవచన వైరుధ్యాన్ని కలిగి ఉన్నది. కల్సి ఉన్నది అని అన్నప్పుడు ఉన్న సాహిత్యము అర్థభేదాన్ని తెలిపే కారణము అవుతున్నది కాబట్టి. సహితము కూడి ఉన్నది. సాహిత్యము రెండు వస్తువులు కూడి ఉండుట అని కదా అర్థము. ఐనప్పుడు నీల వర్ణము – దాన్ని కల్గిన వస్తువు వేరు వేరు కావా? ఆ రెండూ కలసి ఒకచోట ఉంటేనే కదా సాహిత్యమనబడుతుంది. దాని అర్థముతో కూడి ఉన్నందువల్లనే దానికి ఆ పేరుతో వ్యవహరించడానికి యోగ్యత వస్తున్నది. అటువంటి యోగ్యతనే తనకు స్వరూపముగాగల జ్ఞానము దానితోపాటే కలసి లభించడమనే నియమము దానికంటే వైలక్షణ్యము లేని దానిని / భేదము / తేడా లేని దాన్ని సాధించుతూ ఉన్నదని చెప్పడము నవ్వును తెప్పిస్తున్నది. నిరన్వయముగా నశించే జ్ఞానాలకు ముందున్న దానినుండి తరువాతి దానికి అనువర్తమానము – సంక్రమించెడిది – ఐన స్థిరమైన ఆకారము లేనందువల్ల నీవు చెప్పే వాసన కూడా

ఉపపాదించుటకు వీలయ్యేది కాదు. కష్టపడినా ఉపపాదించలేవు. పూర్వజ్ఞానము బొత్తిగా నశించిపోతే దాన్నించి పుట్టేది ఏమీ లేదు. కనుక దాని తరువాత పుట్టే జ్ఞానము వాసన అని ఎట్లా అనబడుతుంది? అందువల్ల జ్ఞానములో ఉండే వైచిత్రి అంతా వస్తువులో ఉండే వైచిత్రి వల్ల వచ్చినట్టిదే. ఆయా వస్తువులకు వ్యవహారయోగ్యతను ఆపాదించుట – చేకూర్చుట – రూపంగా కండ్లకు కట్టినట్లు ఎట్టఎదుట కనిపించుతున్న జ్ఞానము ఆయా అర్థాలతో – వస్తువులతో – ఉన్న సమ్బన్ధముపైన ఆధారపడి ఉన్నది. అదే వాటికి ఉండే అసాధారణాంశము సమ్బన్ధము అంటే సంయోగమే గుర్తుగా కలది. జ్ఞానము కూడా ఒక ద్రవ్యమే కదా! దీపానికి గల గుణమైన ప్రభాద్రవ్యము వలెనే ఆత్మకు గుణమైన జ్ఞానానికి కూడా ద్రవ్యత్వముండుట విరుద్ధము కాదు. కనుక ఒక ద్రవ్యము మరొక ద్రవ్యానికి ధర్మమై దాన్ని వదలకుండా ఉండడము సరిఐనదే. కావున బాహ్యార్థములు లేవు అని అనకూడదు.

ఎదుటి పక్షాలవాళ్ళు స్వప్నములో చూచిన వస్తువులు బయట కనిపించడము లేదు. వాటికి సమ్బన్ధించిన జ్ఞానము మాత్రము ఉంటున్నది అని చెప్తూ బయటి ప్రపంచములోని జ్ఞానాలు కూడా నిరాలంబనములే అని అన్నారు. ఆ విషయములో సూత్రకారుడి మాట ఇది –

సూ॥ **వైధర్మ్యాచ్చ నస్వప్నాదివత్ 2-2-28** స్వప్నములోని జ్ఞానాలతో సమానధర్మాలు లేవు కాబట్టి బయటి ప్రపంచములోని జ్ఞానాలు అర్థము లేనివే అని చెప్పడం కుదురదు. స్వప్నములోని జ్ఞానాలు నిద్రమొదలైన దుష్టములైన కరణముల ద్వారా పుట్టినట్టివి. బాధింపబడినటువంటివి. మెలకువలో ఉన్నపుడు కలిగిన జ్ఞానాలు కలలో చూచినవాటికి విపరీతములైనవి. కనుక వీటికి వాటితో పోలిక/ సమానత్వములేదు. నీవు చెప్పినట్లు జ్ఞానాలు అన్నీ అర్థశూన్యములే ఐతే మీరు సాధించదల్చుకున్న అర్థము కూడా (జ్ఞానము) సిద్ధించదు. ఆలమ్బనము – ఆధారము – లేని అనుమాన జ్ఞానము అర్థశూన్యమే కదా! అటువంటి దానికి ఒక అర్థమున్నది అని అనేట్లయితే జ్ఞానానికి అనైకాన్త్యము వస్తుంది. అందువల్ల మీ అభీష్టమైన అర్థశూన్యత్వము నెరవేరదు.

సూ॥ **నభావోఽనుపలబ్ధేః 2-2-29** కేవలము అర్థశూన్యమైన జ్ఞానానికి పుట్టుక – భావము లేదు. కుదరదు. ఎందువల్లనంటే అటువంటిది ఎక్కడా లభించదు.

కర్తలేని కర్మలేని జ్ఞానము ఒకప్పుడున్నూ లభించదు. కలలో కనిపించిన జ్ఞానాలకు కూడా అర్థ శూన్యత్వము లేదని ఖ్యాతినిరూపణ చేసినప్పుడు ప్రతిపాదించినాము. **ఇది ఉపలబ్ధిఅధికరణము**

★ ★ ★

## ఇక సర్వథా అనుపపత్తి అధికరణము

సూ॥**సర్వథాఽనుపపత్తేశ్చ 2-2-30** ఇక్కడ సర్వశూన్యవాది ఐన మాధ్యమికుడు ఎదురొడ్డుతూ ఉన్నాడు. శూన్యవాదమే బౌద్ధమతములో చిట్టచివరి శిఖరము. శిష్యుడి బుద్ధి యోగ్యతకు అనుగుణంగా వస్తువులను ఉన్నవి అని అంగీకరించుతూ క్షణికత్వము మొదలైన వాటిని వివరించినారు. విజ్ఞానము, బయట కనిపించే వస్తువులు ఏవీ లేవు. ఏమీలేకపోవడమే – శూన్యమే తత్త్వము. అభావాపత్తి – లేకుండా పోవడమే మోక్షము. అనియే బుద్ధుని యొక్క అభిప్రాయము. అదే తగిన మాట. శూన్యము ఏ హేతువుతోనూ సాధింపబడదు. కనుక స్వతఃసిద్ధము. ఉన్న వస్తువుకే హేతువు వెతుకవలసి ఉంటుంది. అటువంటిదైన సత్తు భావము నుండి కానీ అభావము నుండి కానీ పుట్టదు. భావము నుండి ఏ పదార్థము పుడుతుండడము ఎక్కడా కనపడలేదు. ఘటము మొదలైనవి ముద్దగా చేయబడని పిండము – మన్ను నుండి పుడుతులేదు. ఇక అభావము నుండి కూడా పుట్టదు. పిండము నశించిపోతే, లేని అభావము నుండి పుడుతున్న ఘటము మొదలైనవి అభావాత్మకములే – లేనివే కావలసి ఉంటుంది. అట్లే తమంతట తాముగా గానీ మరో దాని నుండిగానీ ఉత్పత్తి జరుగదు. తననుండి తానే పుట్టేటట్లయితే ఆత్మాశ్రయదోషము వస్తుంది. అందువల్ల కలిగే ప్రయోజనమూ ఉండదు. పరుడి నుండి పరుడు / పరము పుడితే పరమే అవుతున్నందువల్ల విశేషమేదీ లేదు కాబట్టి అన్నీ అన్నింటినుండి పుట్టవలసి ఉంటుంది. ఇక పుట్టుకలేదు కాబట్టి చావు కూడా లేదు. కనుక శూన్యమే తత్త్వము. అందువల్ల పుట్టుక చావు సత్తు అసత్తు మొదలైనవన్నీ భ్రమలు మాత్రమే. అధిష్ఠానమైన కొద్దిపాటిదైన పరమార్థమైన ఏదో ఒక వస్తువును / తత్త్వాన్ని ఆశ్రయించాలి అని అనకూడదు. దోషము దోషాశ్రయము జ్ఞాత మొదలైనవన్నీ అపరమార్థములే – యథార్థములు కాకున్నా – ఐనా భ్రమ పొసగుతున్నది. కనుక దానివలెనే అధిష్ఠానము అపరమార్థములు ఐనా భ్రమపొసగుతూనే ఉన్నది. కనుక శూన్యమే తత్త్వము.

అని పూర్వ పక్షము ఎదురైతే దానికి సమాధానము చెప్పబడుతున్నది. సర్వథా అనుపపత్తేశ్చ. అన్ని రకాలుగా అనుపపత్తే గనుక నీవు ఉద్దేశించిన ఏమీ లేదనడం కుదిరేది కాదు. సర్వశూన్యత్వము అంటే ఏదీ లేదు అనడం నువ్వు ఈ సమస్త ప్రపంచాన్ని సత్తు – ఉన్నది, అని భావిస్తున్నావా? లేక అసత్తు – లేనిది అని అనుకుంటున్నావా? లేక ఈ రెండింటి కంటే వేరయినదిగా మరొక్కటని తలుస్తున్నావా? ఎట్లా అనుకున్నా నీవనుకున్నట్లు తుచ్ఛత్వము ఏర్పడదు. లోకములో భావము – అభావము అనే శబ్దాలు వాటి చేత కలిగే ప్రతీతులున్నూ ఉనికిలో ఉన్న వస్తువుకే అవస్థా విశేషాలుఐ కనపడుతున్నట్లు ప్రతిపాదించబడింది. అందువల్ల అంతా వట్టిదే – సర్వమ్ శూన్యమే అని ప్రతిజ్ఞ చేసే నీవు, అంతా సత్తే అని ప్రతిజ్ఞ చేసే వాని వలె ఉంటూ ఉన్నదైన ఈ ప్రపంచానికి అవస్థా విశేషముతో కూడినట్టిదిగా ప్రతిజ్ఞ చేసినట్లవుతుంది. నీకు ఇష్టమైన తుచ్ఛత్వము ఏవిధంగానున్నూ సిద్ధించదు. ఇంకా ఏదో ఒక ప్రమాణాన్ని బట్టి శూన్యత్వాన్ని సాధించి, శూన్యత్వాన్ని సాధించే ఆ ప్రమాణానికి సత్యత్వాన్ని – ఉన్నదనడాన్ని అంగీకరించాల్సి ఉంటుంది. అట్లాగా ప్రమాణము ఉన్నప్పుడు అది నిజముగా ఉనికి గల్గినదైనప్పుడు ఆ ప్రమాణముతో పాటు ప్రపంచమంతా సత్యమే – ఉన్నదే – అవుతుంది. కనుక అన్నిరకాలుగా సర్వశూన్యత్వము – ఏదీ లేదు పొమ్మనుట సరియైనది కాదు పొసగదు. **ఇది సర్వథా అనుపపత్తి అధికరణము**

★ ★ ★

## ఇక ఏకస్మిన్ అసమ్భవాధికరణము

సూ॥**నైకస్మిన్నసమ్భవాత్ 2-2-31** సౌగతులు దూరముగా త్రోసివేయబడినారు. జైనులు కూడా పరమాణువులే జగత్తు పుట్టడానికి కారణము వంటి వాదాలను చేస్తున్నారు. కనుక వారి వాదాన్ని తిప్పికొడుతున్నారు.

వారు ఇట్లాగా తలుస్తున్నారు. జీవఅజీవులతో కూడిన ఈ జగత్తు ఈశ్వరుడు లేనట్టిది. ఆ ప్రపంచము ఆరు ద్రవ్యాలతో ఏర్పడినట్టిది. అవి 1) జీవుడు 2) ధర్మము 3) అధర్మము 4) పుద్గలము 5) కాలము 6) ఆకాశము అనబడేవి. ధర్మమనగా నడచిపోగలవాటికి గతికి కారణము ఐన ద్రవ్య విశేషము. ఇది జగత్తు అంతటా వ్యాపించి ఉన్నది. అధర్మము నిలుకడకు కారణమైనది ఇది కూడా వ్యాపించి ఉండేదే. ఇక పుద్గలము అనగా వర్ణము – రంగు – గన్ధము, రసము, స్పర్శ అను నాల్గింటిని

కలిగిన ద్రవ్యము. అది రెండు విధాలుగా ఉన్నది 1) పరమాణువుల రూపంలో ఉండేది. మరొకటి పరమాణువుల యొక్క సముదాయ రూపంగా ఉండేది. అదే గాలి అగ్ని నీళ్ళు నేల శరీరము భువనములు మొదలైనదిగా ఉన్నది. కాలమైతే ఉండెను ఉన్నది పుట్టగలదు - రాగలదు అని వ్యవహారము చేయడానికి హేతువు అయ్యి అణువు రూపంలో ఉండే ద్రవ్యవిశేషము. ఆకాశము కూడా అంతములేనిది. ఒక్కటే. అనన్తప్రదేశములలో ఉండేటువంటిది. వాటిలో అణువులకంటే వేరుగా ద్రవ్యములలో ఉండేటువంటిది. వాటిలో అణువులకంటే వేరుగా ద్రవ్యాలు ఐదు అస్తికాయములు అని సంగ్రహింపబడుతున్నవి. 1) జీవాస్తికాయము 2) ధర్మాస్తికాయము 3) అధర్మాస్తికాయము 4) పుద్గలాస్తికాయము 5) ఆకాశాస్తికాయము. అనేక దేశాలలో ఉండబడే (వస్తువు యందు) ద్రవ్యము నందు అస్తికాయము అనే శబ్దము ప్రయోగింపబడుతుంది.

జీవులకు మోక్షము కలుగడం కొరకు ఇంకొక సంగ్రహాన్ని కూడా చేస్తున్నారు. జీవ అజీవ ఆస్రవ బంధ నిర్జర సంవర మోక్షములు అని మొత్తము ఏడు. మోక్ష సంగ్రహముతో మోక్షోపాయము కూడా గ్రహింపబడింది. అది సమ్యక్జ్ఞానము, సమ్యక్దర్శనము, సమ్యక్ చారిత్రము అనే మూడు రూపాలుగా ఉంటున్నది. వాటిలో జీవుడు జ్ఞాన దర్శసుఖవీర్యము అనే గుణాలను కలిగి ఉంటున్నాడు. అజీవము జీవుడు చేత అనుభవింపబడే వస్తువుల సముదాయము. ఆస్రవము అనగా జీవుడు వస్తు సముదాయాన్ని అనుభవించడానికి ఉపయోగపడే ఉపకరణాలు అవే ఇంద్రియాదులు బంధము ఎనిమిది రకాలుగా ఉన్నది - ఘాతి కర్మచతుష్టయము, అఘాతి కర్మచతుష్టయము. 4+4=08. వాటిలో మొదటిది. జీవుడికి సహజమైన గుణాలుగా ఉన్న జ్ఞానము దర్శనము వీర్యము సుఖం మొదలైన వాటికి ప్రతిఘాతము - ఎదురు, అపకారము చేసేది. ఇక రెండవది శరీరమును నిలుపుకోవడము - శరీరసంస్థానము, దాన్ని అభిమానించడము, దానియొక్క నిలుకడ అందువల్ల సుఖదుఃఖ ఉపేక్ష - పట్టించుకోకపోవడం, లకు కారణమైనది. నిర్జరం అనేది మోక్షానికి సాధనము. అర్హతుడు - జినుడు మొదలైన వారి వాక్కుల ద్వారా అవగతమయ్యేది. తపస్సు. సంవరమంటే ఇంద్రియాలను అణచివేయడము. అదే సమాధిరూపంగా ఉంటుంది. మోక్షమైతే రాగము ద్వేషము వంటి క్లేశాలు తొలగిపోయిన వాడికి సహజమైన ఆత్మస్వరూపము పుట్టుకొనిరావడము.

పృథివీ మొదలైనవాటికి కారణాలైన అణువులు వైశేషికులు మొదలైన వారికి వలె నాలుగు విధాలుకావు. కానీ ఒకే స్వభావాన్ని కల్గి ఉంటవి. పృథివీ మొదలైన భేదాలు మాత్రము వాటియొక్క పరిణామాలపైన ఆధారపడి ఉంటవి. వస్తు సముదాయము అంతా సత్త్వ అసత్త్వ నిత్యత్వ అనిత్యత్వ భిన్నత్వ అభిన్నత్వములు మొదలైనవాటితో ఒక్కతీరుగా ఉండవు (ఏకాన్తికము – ఏ వస్తువైనా ఏదో ఒక ధర్మాన్ని కలిగి ఉండడము) 1) స్యాదస్తి – ఉండవచ్చు 2) స్యాన్నాస్తి – లేకపోవచ్చు 3) స్యాదస్తి చనాస్తిచ – ఉండవచ్చును ఉండకపోవచ్చు 4) స్యాదవక్తవ్యమ్ – చెప్పడానికి తగనట్టిది. 5) స్యాదస్తిచావక్తవ్యంచ – ఉండనూవచ్చు చెప్పడానికి తగనిదీ కావచ్చును 6) స్యాన్నాస్తి చావక్తవ్యంచ – లేకనూపోవచ్చును అవక్తవ్యమున్నూ కావచ్చును. 7) స్యాదస్తిచనాస్తిచ అవక్తవ్యంచ – ఉండవచ్చును లేకపోవచ్చును చెప్పరానిది కూడా కావచ్చును. అని అన్ని విషయాల్లోనూ ఈ ఏడువిధాలైన అవతారాలు ఉంటాయి. వస్తు సముదాయమంతా ద్రవ్యపర్యాయాత్మకము కనుక ద్రవ్యము రూపంలో – ద్రవ్యాత్మనా – సత్త్వ, ఏకత్వ, నిత్యత్వాదులను ఉపపాదిస్తున్నారు. దానికి విపరీతంగా ద్రవ్యములు కానివాటిని పర్యాయాత్మకాలుగా వర్ణిస్తున్నారు. పర్యాయములు అంటే ద్రవ్యము యొక్క అవస్థలలోని భేదాలు. అవి కూడా భావము అభావము అనే రూపాలు కలవి కాబట్టి సత్త్వ అసత్త్వము మొదలైనవి అన్నీ పొసగుతవి అని చెపుతున్నారు

ఈ విషయములో చెప్పబడుతున్నది. న. ఏకస్మిన్ అసమ్భవాత్ అని. నీవు చెప్పినదంతా పొసగదు. ఎందువల్లనంటే ఒకే వస్తువులో రెండు రకాలైన ధర్మాలు ఉండడము జరుగదు కనుక. ఒక వస్తువు నందు విరుద్ధమైన ఉన్నది లేదు అనబడే రెండు ధర్మాలు నీడ – ఎండలు ఉన్నట్లు ఒకేసారి ఉండడానికి అవకాశము లేదు. ఇదీ ఇక్కడ చెప్పబడుతున్న విషయము. ద్రవ్యము, ఆయా విశేషణములు ఐన పర్యాయ శబ్దముచేత చెప్పదగిన అవస్థా విశేషమున్నూ వేరువేరు విడివిడి పదార్థాలు అవుతున్నాయి. కాబట్టి ఒక వస్తువు నందు విరుద్ధధర్మాల యొక్క సమావేశము జరుగదు అని. అట్లాగే ఒకానొక అస్తిత్వము మొదలైన అవస్థా విశేషముతో కలసి ఉన్న ద్రవ్యము అదే సమయంలో దానికి విపరీతమైన నాస్తిత్వాదులతో కూడి ఉండడము జరుగదు. ఉత్పత్తి వినాశము అనే పేర్లున్న పరిణామ విశేషాలకు ఆస్పదము – నెలవు అయ్యి ఉండడము ద్రవ్యానికి అనిత్యత్వాన్ని తెలుపుతుంది. దానికి బొత్తిగా విపరీతముగా పుట్టుక చావులు లేనిది నిత్యము ఈ రెండూ ఒకే ద్రవ్యములో ఎట్లా కూడి ఉండగలవు?

విరుద్ధాలైన ధర్మాలతో కూడి ఉండడమే వాటికి భేదాన్ని తెల్పుతుంది. దానికి పూర్తిగా తలక్రిందులుగా ఉండడము అభిన్నత్వము. ఇది తనకు విరోధి ఐన ధర్మాన్ని కలిగి ఉన్న ద్రవ్యముతో కలిసి ఉండేది ఎట్లా? అశ్వత్వము (గుర్రపు లక్షణము) మహిషత్వం (దున్నపోతు లక్షణము) లు రెండు ఒకేసారి ఒకే వస్తువు నందు ఉండడం అసమ్భవమే కదా! ఈ విషయము ఇంతకుముందే భేదాభేదవాదిని నిరసన చేసిన సమయంలో తత్తు సమన్వయాత్ అనే సూత్రము దగ్గర ప్రపంచింపబడింది. కాలము పదార్థానికి విశేషణమైనందువల్లనే ప్రతీతి కల్గుతున్నందువల్ల – తెలుస్తున్నందువల్ల దానికి విడిగా అస్తిత్వనాస్తిత్వాదులను చెప్పవలసిన పనిలేదు. అట్లాగని పరిహరించరాదు. కాలము ఉన్నది. లేదు అనే వ్యవహారము వ్యవహర్తల యొక్క జాత్యాదులను గురించి అస్తిత్వనాస్తిత్వముల వ్యవహారముతో సమానమైనది. జాత్యాదులు ద్రవ్యానికి విశేషణాలు అవుతున్నందువల్లనే ప్రతీతములవుతున్నాయని ముందే చెప్పినాము.

అయితే శ్రోత్రియులు – వేదమును ప్రమాణముగా అంగీకరించినవారు – బ్రహ్మ సర్వాత్మకుడు (అన్నింటిలో ఉన్నాడు) అని ఏ విధముగా చెపుతున్నారు? అనేట్లయితే చెపుతున్నాము. ఆయనకు చేతన అచేతనాలన్నీ శరీరము అవుతున్నాయి. ఆయన సర్వజ్ఞుడు సర్వశక్తులు ఉన్నవాడు. సత్యసంకల్పుడు. పురుషోత్తముడు. ఇంతేకాదు శరీరానికి శరీరాన్ని కలవాడికిన్నీ, వారికి ఉన్న ధర్మాలకున్నూ పూర్తి వైలక్ష్యణ్యాన్ని చెప్పినాము. ఇంకా జీవాదులైన ఆరు ద్రవ్యాలు ఒకే ద్రవ్య పర్యాయాలు కావు కనుక వాటిలో ద్రవ్యైకత్వము, పర్యాయత్వముల ద్వారా ఏకత్వము (ఒకటిగా ఉండడము లేక అనబడడం) అనేకత్వము మొదలైనవి ఉపపాదించడానికి వీలయ్యేవికావు. ఐతే మీరు ఇట్లా చెపుతారేమో! ఈ ఆరు ద్రవ్యాలు తమవైన పర్యాయాలతో తాము తాముగా ఉంటుండడం వల్ల అట్లా అవుతున్నాయి అని. ఇట్లా ఐనప్పటికీ అంతా అనైకాన్తికము అని మీరు ఒప్పుకున్న దానితో విరోధము వస్తుంది. ద్రవ్యము, దాని పర్యాయము ఒకదానికొకటి తాదాత్మ్యాన్ని పొందడం లేదు కాబట్టి.

కావున జైనుల మతము యుక్తము – తగినది – కాదు. అంతేకాదు ఈశ్వరుడి చేత అధిష్ఠింపబడని పరమాణువులు జగదుత్పత్తికి కారణాలు అవుతున్నాయి అని చెప్పే వాదంలో మేము ఇంతకుముందే చెప్పిన దోషాలు అట్లే నిల్చి ఉన్నవి కూడా.

సూ॥ **ఏవం చఆత్మాఽకార్త్స్న్యమ్ 2-2-32** మీ వాదము ఇట్లాగే ఉంటే ఆత్మకు అకార్త్స్న్యము – అసమగ్రత – పూర్ణత్వము లేకుండుట వస్తుంది. జీవుడు అసంఖ్యాత

ప్రదేశుడు – (ఒక్క ప్రదేశములో ఉండనివాడు) దేహము ఎంత ఉంటే దాని నిండా వ్యాపించి ఉంటాడు అని మీ పట్టుదల. అప్పుడు ఏనుగు మొదలైన వాటి శరీరములలో ఉన్న ఆత్మ తక్కువ పరిణామములో ఉన్న చీమ శరీరములో ప్రవేశించినప్పుడు కొద్ది ప్రదేశములో ప్రవేశించినందువల్ల ఆకార్త్స్న్యము – అసమగ్రత వస్తుంది. అపరిపూర్ణత వస్తుంది అని అర్థము.

అయితే సంకోచ వికాసధర్మాలు ఉన్నందున ఆత్మ పర్యాయశబ్దం చేత చెప్పబడే మరొక అవస్థను పొందుతున్నందువల్ల విరోధాన్ని తొలగిస్తాము అని అంటే? చెపుతున్నారు.

సూ॥ **న చ పర్యాయాదప్యవిరోధః వికారాదిభ్యః 2–2–33** సంకోచ వికాస రూపములైన అవస్థాన్తరాలను పొందినప్పటికీ ఏర్పడిన విరోధాన్ని తొలగించడానికి వీలుకాదు. వికారము దాని కారణంగా వచ్చిన అనిత్యము మొదలగు దోషాలు వచ్చిపడే అవకాశము ఉన్నది కాబట్టి ఘటము మొదలైన వాటితో ఆత్మ సమానుడు కావాల్సి వస్తుంది.

సూ॥ **అంత్యావస్థితేశ్చ ఉభయనిత్యత్వాదవిశేషః 2–2–34** జీవుడికి మోక్షావస్థలో ఉండే చిట్టచివరి పరిమాణము ఏదో దానికి తర్వాత మరొక్క దేహాన్ని స్వీకరించడం లేదు గనుక అట్లాగే ఉండిపోతున్నందువల్ల ఆత్మ, మోక్షావస్థలో ఉన్న ఆ పరిమాణము రెండూ నిత్యములు గనుక అదే ఆత్మకు స్వాభావికమైన పరిమాణము గనుక దానికి ముందున్నది కూడ ఇప్పుడున్నదానికంటే విశేషము లేనిది కావలసి ఉంటుంది. అందువల్ల ఆత్మ దేహముతో సమానమైన పరిమాణము కాదు. కావున ఈ అర్హతుల మతము అసంగతమే. **ఇది ఏకస్మిన్న సమ్భవాధికరణము.**

★ ★ ★

## పశుపత్యధికరణము

సూ॥ **పత్యురసామంజస్యాత్ 2–2–35** కపిలుడు కణాదుడు సుగతుడు అర్హతుడు వీళ్ళ మతాలు అసమంజసములు మరియు వేదబాహ్యములు కనుక మోక్షమును కోరేవారు వీటిని ఆదరించరాదని చెప్పబడింది. ఇప్పుడు పశుపతి మతము కూడా వేదానికి విరుద్ధం ఐనందున సమజంసము కాకపోవడం చేతనున్నూ ఆదరించరానిదేనని చెపుతున్నారు. ఆ మతాన్ని పాటించేవారు నాలుగు విధాలుగా

ఉన్నారు. 1) కపాలురు కాపాలికులు 2) కాలాముఖులు 3) పాశుపతులు 4) శైవులు అని. వీరందరూ కూడా వేదానికి విరుద్ధమైన తత్వప్రక్రియను, ఐహిక ఆముష్మిక మంగళములను సాధించుకోవడానికి సాధనములు కొత్తకొత్త కల్పనలను కల్పించుతున్నారు.ప్రధానంగానిమిత్తకారణముఉపాదానకారణాలకుభేదాన్ని,నిమిత్త కారణంగా పశుపతినిన్నీ చెపుతున్నారు. అట్లాగే మోక్షమును సాధించుకోవడానికి ముద్రికాషట్కమును 6) ధరించాలని చెప్తున్నారు. కాపాలురు ఇట్లా ప్రవచిస్తున్నారు. శ్లో॥ **ముద్రికాషట్కతత్వజ్ఞః పరముద్రావిశారదః। భగాసనస్థమాత్మానంధ్యాత్వా నిర్వాణమృచ్ఛతి॥ కంఠికారుచ కంచైవ కుండలంచశిఖామణిః। భస్మయజ్ఞోపవీతం చ ముద్రాషట్కం ప్రచక్షతే॥ ఆభిః ముద్రితదేహస్తు నభూయఇహజాయతే.** ముద్రికాషట్కము యొక్క తత్వాన్ని తెల్సిన వాడై పరుడైన వాని యొక్క ముద్రలయందు మంచి నేర్పుగలవాడు. భగము నందు ఆసనము నందు ఉన్న / భగాసనము నందున్న ఆత్మను ధ్యానించి మహదానందాన్ని పొందుతాడు. కంఠికా, రుచకం, కుండలము, శిఖామణి, భస్మము, యజ్ఞోపవీతము ఆరు ఇవి ముద్రికలు అనబడుతవి. వీటితో ముద్రింపబడిన దేహము కలవాడు తిరిగి ఈ లోకములో పుట్టడు. ఇత్యాదులు. అదేవిధంగా కాలముఖులు కూడా మనిషి పుఱ్ఱె – కపాలము – అనే పాత్రలో భుజించడము, శవము యొక్క బూడిదతో స్నానము చేయడము, దాన్ని బుక్కడము, లగుడము – దుడ్డు కఱ్ఱను చేతిలో పట్టుకోవడము, కల్లు కుండను స్థాపించడము – దాన్ని ఆధారంగా చేసుకొని దేవుడిని పూజించడము మున్నగునవి ఐహిక ఆముష్మిక ఫలాలను సాధించి పెడుతవి అని చెప్పుతున్నారు. **రుద్రాక్ష కంకణం హస్తే జటా చైకా చమస్తకే। కపాలం భస్మనా స్నానమ్** చేతిలో రుద్రాక్ష కంకణము, నెత్తిపైన ఒక్క జట, కపాలము బూడిదతో స్నానము ఇత్యాదులు శైవా గమాల్లో ప్రసిద్ధాలు. అదే విధంగా ఏదో ఒక క్రియా విశేషము చేత విజాతీయులకు కూడా బ్రాహ్మణ్యము వచ్చుట, సన్యాసాశ్రమప్రాప్తినిన్నీ చెప్పుతున్నారు. **దీక్షా ప్రవేశమాత్రేణ బ్రాహ్మణోభవతి క్షణాత్। కాపాలం వ్రతమాస్థాయ యతిర్భవతిమానవః॥** శివదీక్షను తీసుకున్నంత మాత్రముతోనే మానవుడు బ్రాహ్మణుడు అవుతాడు. కాపాల వ్రతమును పాటిస్తూ సన్యాసి అవుతాడు. అనిన్నీ చెపుతున్నారు. ఆ విషయములో పత్యురసామంజస్యాత్ అని చెపుతున్నారు. నైకస్మిన్ అసమ్భవాత్ అనే సూత్రము నుండి న అనే పదము వర్తిస్తుంది. పశుపతి యొక్క ఈ మతము ఆదరించదగినది కాదు. ఎందువల్ల నంటే సమంజసముగా లేదు కదా! ఈ అమంజసము రెండు విధాలుగా ఉన్నది. 1) వారు

చెప్పిన మాటలకు విరుద్ధంగా వారే మాట్లాడుతున్నందున 2) వేదానికి విరుద్ధంగా ఉన్నందున. 1) ముద్రికాషట్కమును ధరించడము 2) భగాసన మందున్న ఆత్మను ధ్యానము చేయడము 3) సురాకుమ్భస్థాపన చేయడం 4) కల్లుకుండలో దేవుడిని ఆవాహన చేసి పూజించడము 5) ఎవ్వరికీ కనిపించకుండా గూఢంగా తిరుగుట 6) శ్మశానములోని బూడిదతో స్నానము చేయడము 7) ప్రణవముతో కలిపి ధ్యానము చేయడము. ఇవి అన్నీ ఒకదాని కొకటి విరుద్ధములైనట్టివి.

ఇక వీరితత్వకల్పనము, ఉపాసనము, ఆచారములు కూడా వేదానికి పూర్తి విరుద్ధము లైనవి. వేదాలు పరబ్రహ్మ నారాయణుడు అని, జగత్‌కు అయనే నిమిత్తకారణము, ఉపాదాన కారణము అనిన్నీ చెపుతున్నవి.

**1) నారాయణః పరంబ్రహ్మ తత్వమ్ నారాయణఃపరః। నారాయణ పరోజ్యోతిః ఆత్మానారాయణఃపరః.** పరబ్రహ్మ నారాయణుడే. పరతత్వమూ నారాయణుడే. వెలుగులకు వెలుగైన పరంజ్యోతి నారాయణుడే. పరమాత్మ నారాయణుడే. **2) తదైక్షత బహుస్యామ్ ప్రజాయేయేతి. 3) సోఽకామయత బహుస్యామ్ ప్రజాయేయేతి. 4) తదాత్మానం స్వయమకురుత.** అట్లాగా సంకల్పించిన సత్ పదార్థము స్వయంగా తనను తాను ప్రపంచముగా। చరాచరములనుగా చేసుకొనెను. ఇత్యాదివాక్యాలు ఉదాహరణలు, పరబ్రహ్మ ఐన పరమపురుషుడిని తెల్సుకోవడమే మోక్షాన్ని సాధించే ఉపాసనమని చెపుతున్నవి. **1) వేదాహమేతం పురుషంమహాన్తమ్। ఆదిత్యవర్ణమ్ తమసస్తుపారే.** నేను ఈ గొప్ప పురుషుడిని తెల్సుకొన్నాను. ఆయన తమస్సుకు – సూక్ష్మరూపమైన ప్రకృతికి ఆవల సూర్యుడి వలే గొప్ప కాన్తితో ప్రకాశించుతున్నాడు. **2) తమేవం విద్వానమృత ఇహభవతి. నాన్యః పన్థా అయనాయవిద్యతే.** ఇట్లాగా ఆ మహాపురుషుడిని తెల్సికొని ఉపాసించినవాడు ఇహలోకంలోనే పరమానంద స్వరూపుడు అవుతున్నాడు. ఆయనను చేరుకోవడానికి ఆయనను ఉపాసించడము తప్ప మరొక దారి లేదు. ఇట్లాంటివాక్యాలతో ఏకీభావాన్ని పొందిన వేదాన్తవాక్యాలు అన్నీ కూడా వేరే మాటను చెప్పడంలేదు. ఆయనను ఉపాసించే విధానమైనది ఇతికర్తవ్యత. అది వేరే మరేదో కాదు వేదము చేత ఇట్లాగా చెయ్యండి అని విధించబడిన వర్ణాశ్రమాలకు సమ్బన్ధించిన యజ్ఞాది కర్మలే అనిన్నీ తేటగా చెప్తున్నవి. **తమేతం వేదానువచనేన బ్రాహ్మణాః వివిదిషన్తి. యజ్ఞేనదానేన తపసా అనాశకేన... ఏతమేవ ప్రవ్రాజినో లోకమిచ్ఛన్తః ప్రవ్రజన్తి.** ఇటువంటి మహా పురుషుడిని బ్రాహ్మణులు

వేదాధ్యయనము చేయుట యజ్ఞాలు చేయుట తమకు కల్గిన సిరిని కోరిన వారికి ప్రేమతో పంచిపెట్టుట. తపస్సును ఆచరించుట, ఉపవాసము ఉండుటల ద్వారా తెల్సుకోవడానికి ప్రయత్నించుతున్నారు. మరికొందరు సన్యాసులై ఆయన దర్శనాన్ని కోరుకుని దేశసంచారమును చేస్తున్నారు. ఇత్యాదులు. కేవలము పరతత్వాన్ని మాత్రమే ప్రతిపాదించడానికి పూనుకున్న నారాయణానువాకమునందు తేటతెల్లము చేయబడిన తత్వాన్ని చెప్పేవి, ఉపాసనను విధించే కొన్ని వాక్యాలలోనూ వినిపించబడుతున్న ప్రజాపతి, శివ, ఇంద్ర, ఆకాశ, ప్రాణము మొదలైన శబ్దాలు కూడా నారాయణునికి సమ్బన్ధించినవేనని శాస్త్ర దృష్ట్యాతూప దేశోవామదేవవత్. అనే సూత్రము వద్ద ప్రతిపాదించబడింది. అదేవిధంగా **ఏకోహవైనారాయణ ఆసీత్. న బ్రహ్మేనేశానః** సృష్టికి ముందుకాలములో నారాయణుడొక్కడే ఉన్నాడు. బ్రహ్మ శివుడు లేకుండిరి అని ఆరంభించి **స ఏకాకీనరమేత** అతడు ఒంటరివాడు. ఆనందించలేడు అని సృష్టివాక్యాలలో చెప్పబడిన సృష్టికర్త ఐన నారాయణుడిని మాత్రమే సృష్టి ఎట్లా జరిగిందో వివరించే సమానప్రకరణాలలోనివి. **సదేవసోమ్యేదమగ్ర ఆసీత్** ఇత్యాదులయందున్నూ సాధారణమైన సత్, బ్రహ్మ, ఆత్మశబ్దాలు ప్రతిపాదించుతున్నాయని **జన్మాద్యస్యయతః** అనే సూత్రము వద్ద ప్రతిపాదింపబడింది. కావున వేదానికి విరుద్ధమైన తత్వాన్ని ఉపాసించుట, వేదవిరుద్ధమైన అనుష్ఠానాన్ని ప్రబోధించుతున్నందువల్ల పశుపతి మతము ఆదరించదగినది కాదు.

సూ॥ **అధిష్ఠాన అనుపపత్తేశ్చ 2-2-36** వేదబాహ్యులు కేవలము అనుమానము కారణంగానే నిమిత్త కారణమైన ఈశ్వరుడిని కల్పించినారు. అట్లా ఐనప్పుడు లోకములో ప్రత్యక్షంగా చూస్తున్న దాన్నిబట్టి కుమ్మరివాడిని వలె అధిష్ఠానాన్ని కూడా ఎంచవలసియున్నది. కులాలాదులు మన్ను మొదలైనవాటికి అధిష్ఠానమైనట్లు నిమిత్తకారణమైన పశుపతి ప్రధానానికి అధిష్ఠాతగా చెప్పడం కుదరదు. కుమ్మరి మొదలైన వాళ్ళు సశరీరులుగా కనిపించుతున్నారు. పశుపతికి శరీరము లేదు కదా! సశరీరులైన కులాలాదులకే అధిష్ఠాన శక్తి కనపడుతున్నది. ఈశ్వరుడికి శరీరము ఉన్నది అని మీరు అంగీకరించకూడదు. ఆయన శరీరము అవయవాలతో కూడియున్నది కాబట్టి అనిత్యమవుతుంది. లేదూ నిత్యమే అని అన్నా కూడా శాస్త్రయోనిత్వాత్ అనే సూత్రము వద్ద దోషాలను చెప్పినాము కదా!

సూ॥ **కరణవత్ చేత్ నభోగాదిభ్యః 2-2-37** భోక్త ఐన జీవుడికి కరణ కళేబరాన్ని అధిష్ఠించి ఉండడమనేది అశరీరుడికే ఎట్లా కనిపిస్తున్నదో అట్లాగే మహేశ్వరుడికి - అశరీరుడైన వాడికి కూడా ప్రధానాన్ని అధిష్ఠించడమనేది ఒప్పుతుంది అని అనేట్లయితే కాదు. జీవుడు భోగాలననుభవించడానికి గాను శరీరాన్ని అధిష్ఠించుతున్నాడు. పుణ్య పాపరూపములైన కర్మలయొక్క ఫలాలను అనుభవించడం కొరకు పుణ్యపాపములు అనే అదృష్టము చేత అధిష్ఠానముగా చేయబడింది జీవుని శరీరము. అదే తీరుగా పశుపతికి కూడా పుణ్య పాపరూపమైన అదృష్టము ఉన్నది కాబట్టి వాటి ఫలభోగాదులు అన్నీ అనుభవించవలసి వస్తుంది. అందువల్ల అధిష్ఠానసంభవము లేదు.

సూ॥ **అన్తవత్త్వమ్ అసర్వజ్ఞతావా 2-2-38** వా శబ్దము చ అనే అర్థములో వాడినారు. పశుపతికి పుణ్యపాప రూపమైన అదృష్టము ఉన్నట్లయితే జీవుని వలెనే అన్తవత్త్వమ్ - ఒక దగ్గర జీవితాన్ని చాలించడము, భగవన్తుని యొక్క సృష్టి సంహారాలకు తలవంచవలసి రావడము, అసర్వజ్ఞత్వమున్నూ కలుగగలవు. కనుక ఈ పాశుపతమతము ఆదరింపదగినది కాదు. **విరోధేత్వనపేక్షం స్యాత్** విరోధముండినట్లయితే దాన్ని (స్మృతిని) ఆదరించవద్దు అని ఉన్నందున వేదవిరుద్ధమైనందున ఈ పాశుపతమతము అనాదరణీయమే ఐనా పశుపతి మతము వేదవిరుద్ధము అని లోకానికి చాటడానికి గాను పత్యురసామంజస్యాత్ అనే సూత్రము ద్వారా చర్చను తిరిగి లేవనెత్తినారు. పాశుపతము, శైవము ఇవి రెండున్నూ వేదవిరోధులు కానట్లు కొన్ని ధర్మాలు వాటిలో కనిపించుతున్నవి. అట్లయినా వేదము చెప్పిన దానికి భిన్నంగా నిమిత్తాన్ని, ఉపాదానాన్ని వేరువేరు అని కల్పించడం పరావరతత్త్వమును తలకిందులుగా కల్పన చేయడమున్నూ జరిగినవి కనుక వారు చెప్పినదంతా ఆసంజసమే గనుక సూత్రములో అసామంజస్యాత్ అని హేతువును చెప్పినారు. **ఇది పశుపత్యధికరణము.**

★ ★ ★

## ఇక ఉత్పత్తి అసంభవ అధికరణము.

సూ॥ **ఉత్పత్త్యసంభవాత్ 2-2-39** కపిలుడు మొదలైనవారు చెప్పిన తన్త్రములతో సమానమై ఉన్నందువలన భగవన్నారాయణుడిచేత చెప్పబడిన పరమనిఃశ్రేయసాన్ని (మోక్షాన్ని) సాధించు కోవడానికే వీలయిన సాధనాన్ని తెలియచేసే పాంచరాత్ర

తన్త్రమునందు కూడా అప్రామాణ్య శంకను ఊహించి దాన్ని నిరాకరించుతున్నారు. ఆ శంక ఇట్లా ఉన్నది పరమ కారణుడు పరబ్రహ్మ ఐన వాసుదేవుడి నుండి సంకర్షణుడు అనే జీవుడు పుడుతున్నాడు. సంకర్షణుడి నుండి ప్రద్యుమ్నుడు అనే పేరు గల మనస్సు పుడుతున్నది. దానినుండి అనిరుద్ధుడు అనే పేరుతో అహంకారము పుడుతున్నది అని భగవన్తుడు చెప్పిన పంచరాత్ర ప్రక్రియ ఉన్నది. ఇందులో శ్రుతికి విరుద్ధముగా జీవుని పుట్టుక చెప్పబడ్తున్నది. **నజాయతే మ్రియతేవా విపశ్చిత్** విపశ్చిత్తు ఐన జీవుడు పుట్టడమూ లేదు మరణించడమూ లేదు. ఇత్యాదివాక్యాలతో వేదాలు జీవుడు అనాదిగా ఉన్నాడని చెప్పుతున్నవి.

సూ॥ **న చకర్తుః కరణమ్ 2-2-40** సంకర్షణాత్ ప్రద్యుమ్న సంజ్ఞమ్ మనోజాయతే అని కర్త ఐన జీవుడి నుండి కరణమైన మనస్సుకు పుట్టుక కలుగడానికి అవకాశము లేదు. "**ఏతస్మాజ్జాయతే ప్రాణోమనః సర్వేంద్రియాణిచ.**" ఈ పరమాత్మ నుండే ప్రాణము మనస్సు సర్వేంద్రియాలూ పుడుతున్నవని తెలుస్తున్నవి. కాబట్టి పరబ్రహ్మనుండే మనస్సుకు ఉత్పత్తి జరుగుతున్నది అని వేదము చెపుతున్నది. కనుక శ్రుతికి విరుద్ధమైన అర్థాన్ని / విషయాన్ని ప్రతిపాదిస్తున్నది కాబట్టి ఈ పాంచరాత్ర తంత్రానికిన్నీ ప్రామాణ్యము నిషేధింపబడుతున్నది అని. ఇట్లా పూర్వపక్షము బైల్దేరితే చెప్తున్నారు.

సూ॥ **విజ్ఞానాదిభావే వా తదప్రతిషేధః 2-2-41** సూత్రములోని వా శబ్దము ద్వారా పూర్వపక్షము తిప్పికొట్టబడుతున్నది. విజ్ఞానం చాదిచ అని పరంబ్రహ్మనే విజ్ఞానాది అని అనబడుతున్నాడు. సంకర్షణ ప్రద్యుమ్న అనిరుద్ధులకు కూడా పరబ్రహ్మ భావము ఉంటుండగా – పరబ్రహ్మలే అని అంగీకరిస్తున్నపుడు – అదే విషయాన్ని ప్రతిపాదించే శాస్త్రానికి ప్రామాణ్యము నిషేధింపబడడం లేదు. ఇక్కడ చెప్పబడ్తున్న విషయము ఇది. భాగవత ప్రక్రియను ఎరుగని వారి ప్రశ్న / సందేహము ఇది. విరుద్ధమైన జీవోత్పత్తి చెప్పబడింది అని. వాసుదేవుడు అనే పేరు గల పరబ్రహ్మ ఆశ్రితవత్సలుడు. తనను ఆశ్రయించిన వారు సులభంగా ఆశ్రయించడానికి తన ఇష్టము ప్రకారమే నాలుగు రూపాలుగా ఉంటున్నాడని భాగవత ప్రక్రియ వివరిస్తున్నది. పౌష్కర సంహితలో ఇట్లా చెప్పబడింది.

**శ్లో॥ కర్తవ్యత్వేనవైయత్ర చాతురాత్మ్యముపాస్యతే। క్రమాగతైః స్వసంజ్ఞాభిః బ్రాహ్మణైరాగమంతు తత్॥** ఏ పరమాత్మ విషయంలో నాలుగు విధాలుగా ఉపాసన

చేయవలసినదిగా చెప్పబడుతున్నదో అది పూర్వులనుండి శిష్యా చార్య క్రమంగా ఆయా సంజ్ఞలతో / పేర్లతో కూడిన బ్రాహ్మణములతో కలసి ఉన్నందున అది వేదసమంగా పరిగణింపబడుతున్నది.

ఆ చాతురాత్మ్య ఉపాసనము వాసుదేవుడు అను పేరును కల్గి ఉన్న పరబ్రహ్మ యొక్క ఉపాసనమే అని సాత్వత సంహితలో చెప్పబడింది.

**శ్లో॥ బ్రాహ్మణానాంహిసద్బ్రహ్మ వాసుదేవాఖ్యయాజినామ్। వివేకదం పరం శాస్త్రమ్ బ్రహ్మోపనిషదం మహత్॥**

సత్ బ్రహ్మ వాసుదేవుడు అను రూపాలలో ఉపాసన చేసే బ్రహ్మవేత్తలకు ఈ బ్రహ్మోపనిషత్ అనబడే శాస్త్రము బ్రహ్మయొక్క స్వరూపాన్ని చక్కగా తెల్సుకునేటట్లు చేస్తుంది. ఇది అన్నిటికన్నా మిన్నఐనట్టిది. గొప్పది అని. ఆ వాసుదేవుడనబడే పరబ్రహ్మ జ్ఞానశక్తి బలఐశ్వర్య వీర్యతేజస్సులు అనే ఆరు గుణాలతో నిండుగా ఉన్న స్వరూపము కలవాడు. అతడు పరుడు సూక్ష్మము అనిన్నీ పిలువబడుతున్నాడు. ఐతే ఆయన వ్యూహం విభవము అనే భేదాలతో వేరుగా అయ్యి భక్తులకు అధికారము / యోగ్యతను బట్టి అందుబాటులో ఉంటుండగా వారు జ్ఞానముతో పాటు ఉన్న కర్మతో చక్కగా అర్చించి సమ్యక్ అనబడే పరవాసుదేవుడిని చేరి మంచి ఫలాలను పొందుతున్నారు. **శ్లో॥ విభవార్చనాత్ వ్యూహం ప్రాప్య, వ్యూహార్చనాత్ పరంబ్రహ్మవాసుదేవాఖ్యం సూక్ష్మంప్రాప్యతే.** భక్తుడు విభవరూపాలైన రామకృష్ణ నరసింహాదులను ఆరాధించి వ్యూహస్వామిని చేరుకొని, వ్యూహ స్వామిని పూజించి పరంబ్రహ్మ ఐన వాసుదేవుడనబడే సూక్ష్మరూపాన్ని చేరుకుంటున్నాడు అని చెప్పుతున్నారు. విభవము అనగా రాముడు, కృష్ణుడు మొదలైన అవతారమూర్తులు. వ్యూహము అంటే వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్న అనిరుద్ధ రూపాలు. సూక్ష్మము ఐతే కేవలము ఆరు గుణాలతో కూడిన రూపమున్న వాసుదేవుడు అనే పేరుగల పరబ్రహ్మ. పుష్కర సంహితలో ఇట్లాగా చెప్పినారు. **యస్మాత్ సమ్యక్ పరంబ్రహ్మ వాసుదేవాఖ్యమవ్యయమ్॥ అస్మాదవాప్యతే శాస్త్రాత్ జ్ఞానపూర్వేణ కర్మణా॥** సమ్యక్, పరంబ్రహ్మ వాసుదేవుడు అనే పేర్లు గల అవ్యయుడైన పరమాత్మ దేనిచేత చెప్పబడుతున్నాడో ఆ శాస్త్రము నుండే కలిగిన జ్ఞానముతో కూడిన కర్మతో ఆ పరమాత్మ పొందబడుతున్నాడు. ఇత్యాదులు ఇంకా ఉన్నవి. కనుక సంకర్షణాదులు కూడా పరబ్రహ్మ యొక్క స్వేచ్ఛావిగ్రహాలు కాబట్టి **అజాయమానో బహుధావిజాయతే** కర్మల కారణంగా పుట్టుకలనొందని వాడైనా

తన సంకల్పము ప్రకారము పలుమార్లు పలురూపాలలో జన్మించుతున్నాడు. అని శ్రుతి ప్రమాణము చేత తెలియవస్తున్న ఆశ్రిత వత్సలుడవడం కారణంగా స్వేచ్ఛతో స్వీకరించిన విగ్రహాల యొక్క కుదింపురూపమైన జన్మను చెపుతున్నందున ఆ విషయాన్నే తేటతెల్లము చేస్తున్న శాస్త్రాన్ని – పాంచరాత్రాగమాన్ని – నిషేధించడము అనేది లేదు. అది ప్రామాణికమైనదే. కనుక ప్రతిషేధము లేదు. ఆ శాస్త్రము నందు జీవుడు మనస్సు అహంకారము అనే తత్త్వాలకు అధిష్ఠాతలైన వారు సంకర్షణ ప్రద్యుమ్న అనిరుద్ధులు కనుక వారినే జీవుడు మొదలైన శబ్దాలతో పేర్కొనడము విరుద్ధము ఏమీ కాదు. ఆకాశము, ప్రాణము మొదలైన శబ్దాలతో బ్రహ్మను వ్యవహరించినప్పుడు విరుద్ధము కానట్లుగానే అని అర్థము చేసుకోవాలి.

సూ॥ **విప్రతిషేధాచ్చ 2–2–42** ఆ పాంచరాత్రాగమములో కూడా జీవునియొక్క పుట్టుక నిషేధింపబడియే ఉన్నది. పరమసంహితలో ఇట్లాగా కనపడుతున్నది.

**శ్లో॥ అచేతనాపరార్థాచ నిత్యాసతతవిక్రియా। త్రిగుణాకర్మిణాంక్షేత్రం ప్రకృతేః రూపముచ్యతే॥ వ్యాప్తిరూపేణ సమ్బన్ధః తస్యాశ్చపురుషస్యచ। సహ్యానాదిః అనన్తశ్చ పరమార్థేన నిశ్చితః॥ ఇతి.**

ప్రకృతి యొక్క రూపము ఇట్లాగా ఉన్నది. అది చైతన్యము లేని జడ పదార్థము. పరుడైన జీవుడి యొక్క భోగము కొరకు ఉన్నది. నాశనము లేనట్టిది. కానీ ఎల్లప్పుడు పలు వికారాలను పొందుతున్నది. సత్త్వం రజస్సు తమస్సు అనే మూడు గుణాలను కలిగి ఉన్నది. అది పుణ్యపాపాలు అనే కర్మలను కల్గి ఉన్నవారికి కర్మఫలాలను అనుభవించే స్థానము / క్షేత్రము అయ్యి ఉన్నది. ఇక ఈ ప్రకృతికి పురుషుడికిన్నీ వ్యాప్తి రూపంగా – విడదీయరానిదిగా – సమ్బన్ధము ఉంటున్నది. ఆ పురుషుడు ప్రకృతికి కల సమ్బన్ధమున్నూ అనాదియైనట్టిది. అన్తము లేనిది కూడా! అని పరమార్థము అనిన్నీ నిశ్చయము చేయబడింది అని. ఈ విధంగానే సంహితలన్నింటిలోనూ జీవుడు నిత్యుడని చెప్పినందువలన జీవస్వరూపము యొక్క ఉత్పత్తి పాంచరాత్రశాస్త్రము నందు నిషేధింపబడియే ఉన్నది. ఐతే జీవుడు పుట్టుట మరణించుట వంటి వ్యవహారాలన్నీ ఇటు లోకములోకానీ, అటు వేదములో కానీ ఎట్లా పొసగుతాయో ఆ విషయాలనన్నింటినీ నాత్మాశ్రుతేః అనే సూత్రం వద్ద వివరించుతాము. కావున జీవునియొక్క పుట్టుక అక్కడ కూడా నిషేధించబడిందన్న కారణముతో జీవుడికి పుట్టుక ఉన్నదనే వాదము కారణంగా ఏర్పడిన అప్రామాణ్య శంక దూరముగా త్రోసివేయబడింది.

ఐతే కొందరు మాత్రము ఈ విధముగా గొంతు చించుకుంటున్నారు. అంగాలైన శాస్త్రాలతో కూడిన వేదాలయందు శ్రద్ధను పెట్టలేకపోయిన శాండిల్యుడు పంచరాత్ర శాస్త్రాన్ని చదివినాడని. అంగములతో సహితములైన వేదాలయందు పురుషార్థముపై నిష్ఠ / గురి కుదురలేదని చెప్పినందువల్ల వేదమునకు విరుద్ధమైన తంత్రమని, ఈ మాటలన్నీ వేదవాక్కులయొక్క అర్థము తెలియని, వేదాధ్యయనము చేయని, వేదార్థాన్ని విశదీకరించే స్మృతులు ఇతిహాసాలు పురాణాలు న్యాయాలు, శాస్త్రాలు మొదలైన వాటియొక్క ప్రయత్నాన్ని అర్థం చేసుకోలేనివారు చూపే కొద్దిపాటి శ్రద్ధవలన చేసిన చేస్తున్న హడావిడి తప్ప మరేమీలేదు. ఎట్లాగంటే **ప్రాతః ప్రాతరనృతంతేవదన్తి పురోదయాజ్జుహ్వతియేఽగ్నిహోత్రమ్.** ఎవరైతే సూర్యోదయానికంటే ముందే అగ్నిహోత్రాన్ని చేస్తున్నారో వారు ప్రొద్దు ప్రొద్దున్నే అబద్ధాలాడుతున్నారు. అనే ఈ వాక్యము సూర్యుడు ఉదయించకముందే హోమాన్ని చేయడమును నిందించుతున్నది. ఐతే ఇది హోమాన్ని చులకన చేయడం కాదు. కానీ సూర్యోదయమైన తరువాతనే చేసే హోమాన్ని ప్రశంసించుతున్నది అని తెల్సుకోవాలి. అందుకోసమే ఆ వాక్యము చెప్పబడింది. భూమవిద్యాప్రారంభములో నారదుడు **ఓ పూజ్యుడా! ఋగ్వేదము యజుర్వేదము సామవేదము అధర్వణవేదము అనే నాలుగువేదాలు ఐదవదైన పురాణమునున్నూ చదివినాను** అని మొదలుపెట్టి విద్యాస్థానాలనన్నింటినీ చెప్పి **ఓ భగవానుడా! నేను మన్త్రవేత్తనే ఐనాను కానీ ఆత్మను గురించి తెల్సినవాడను కాను** అని భూమవిద్య కంటే వేరయిన అన్ని విద్యలయందున్నూ ఆత్మజ్ఞానాన్ని పొందలేక పోవడాన్ని గురించి చెప్పడం ముందు చెప్పబోయే భూమ విద్యయొక్క ప్రశంస కొరకు అని ఉగ్గడించినారు. అట్లాగే పాంచరాత్రము యొక్క ప్రశంస కొరకు చేయబడింది తప్ప మరొక విధము కాదు. లేదా ఈ నారదుడికి సాంగాలైన వేదాలలో ఏపరతత్త్వము ప్రతిపాదింపబడిందో దాని అంతు చిక్కకపోవడం వల్లనైనా ఈ విధంగా చెప్పియుండవచ్చు. ఇట్లాగే శాండిల్యుడికి కూడా అని తరువాత వేదాన్తవేద్యుడైన వాసుదేవుడనే పేరు గల పరతత్త్వాన్ని పేర్కొనడం వల్ల అర్థము అవుతున్నది.

అదే విధంగా వేదార్థము మిక్కిలి కష్టపడినా తెలిసిరాదు కనుక సుఖంగా తెలుసుకొనేందుకు గాను ఈ పాంచరాత్రాగమాన్ని ప్రారంభించినారని పరమ సంహితయందు చెప్పబడుతున్నది.

**శ్లో॥ అధీతాఃభగవన్। వేదాః సాంగోపాంగాః సవిస్తరాః। శ్రుతాని చమయా అంగాని వాకోవాక్యయుతానిచ। నచైతేషు సమస్తేషు సంశయేన వినాక్వచిత్ శ్రేయోమార్గంప్రపశ్యామి యేనసిద్ధిఃభవిష్యతి**

ఓ పూజ్యుడా! నేను వేదాలను అంగములు ఉపాంగములతో సహా విస్తారముగా చదివినాను. వాకోవాక్యములతో (సంభాషణాత్మకములైన వాటిని) సహా అధ్యయనము చేసినాను. ఈ అన్నింటిల్లోనూ నా కోరిక నెరవేరక సంశయము మాత్రమే మిగిలింది. శ్రేయోమార్గము – మోక్షమార్గము లభించ లేదు. దానివల్లనే కదా ముక్తి చేజిక్కుతుంది? అని మరియు **శ్లో॥ వేదాన్తేషుయథాసారం సంగృహ్యాభగవాన్‌హరిః। భక్తానుకమ్పయా విద్వాన్ సంచిక్షేపయథాసుఖమ్॥** వేదాన్తాలలో ఉన్న సారాన్నంతటినీ భగవన్తుడైన శ్రీహరియే భక్తులపైన దయ కొద్దీ సంగ్రహించీ తెలియచేసినాడు అనిన్నీ.

కనుక ఆ భగవన్తుడు వేదములచేత మాత్రమే తెలియచేయబడేవాడు పరబ్రహ్మ అనే పేరుగలవాడు వాసుదేవుడు హేయములన్నింటికీ ప్రత్యర్థి ఐనవాడు కళ్యాణాలకు మాత్రమే ఏకైక నిలయమైనవాడు అనన్తమైన జ్ఞానానందాదులు మొదలైన అపరిమితో దారగుణసాగరుడు సత్యసంకల్పుడు నాలుగువర్ణాలు నాలుగు ఆశ్రమాలు అనే వ్యవస్థలతో కూడి ఉన్నటువంటి ధర్మము అర్థము కామము మోక్షము అనే పురుషార్థాలను పొందడానికి ఎదురుచూస్తూ ఉన్న భక్తులను కండ్లారా చూచి అపారముఐన కారుణ్యము సౌశీల్యము వాత్సల్యము ఔదార్యము వంటి గుణాలకు పెనుసముద్రము వంటివాడు కనుక తన యొక్క స్వరూపము, తన విభూతి (ఐశ్వర్యము) తనను ఆరాధించడము, అందువల్ల కలిగే ఫలములయొక్క యధార్థస్థితిని వివరంగా తెలిపే వేదాలను ఋక్ యజస్సు సామములు, అధర్వము అనే పేర్లతో వేరువేరుగా ఉన్నటువంటి వాటిని లెక్కలేనన్ని శాఖలను కల్గి ఉన్నటువంటివాటిని, విధివాక్యాలు, అర్థవాదవాక్యాలు, మన్త్రవాక్యాలు అనే రూపాల్లో ఉన్నవాటిని తనను విడిచి ఇతరులైన దేవతలు, నరులు అందరికిన్నీ ఏ మాత్రము అర్థము చేసుకోలేని వాటినిగా తెల్సుకొని, ఆ వేదాలయొక్క సత్యమైన అర్థాలను తేటతెల్లము చేసేటువంటి పాంచరాత్ర శాస్త్రాన్ని తానే రచించినాడు. కనుక ఆ శాస్త్రము ఎటువంటి దోషము లేనటువంటిది.

కొందరు ఈ నాలుగు సూత్రాలను ఒకానొక విరుద్ధాంశానికి ప్రామాణ్యాన్ని నిషేధించే వాటినిగా వ్యాఖ్యానించినారు. అది సూత్రాల్లోని పదాలకు విరుద్ధము. మరియు సూత్రకారుడైన వేదవ్యాసుని యొక్క అభిప్రాయానికి విరుద్ధమైనటువంటిది.

అది ఎట్లాగంటే – సూత్రకారుడు వేదాన్త న్యాయాలను వివరించే సూత్రాలను వ్రాసి వేదము యొక్క అర్థము తేటగా తెలియడం కొరకు లక్ష శ్లోకాలతో కూడిన మహాభారతాన్ని రచించినాడు. అందులోని మోక్షధర్మాలలో జ్ఞానకాండలో ఈవిధంగా చెప్పినాడు **శ్లో॥ గృహస్థోబ్రహ్మచారీ చవానప్రస్థోఽథభిక్షుక। యఇచ్ఛేత్ సిద్ధిమాస్థా తుందేవతాంకాం యజేతసః॥** గృహస్థుడు బ్రహ్మచారి వానప్రస్థుడు సన్యాసి ఎవరైనా సరే మోక్షమనే పురుషార్థాన్ని పొందదల్చుకుంటే అతడు ఏ దేవతను ఆరాధించాలి అని ఆరంభించి పెద్దగా ప్రబన్ధాన్ని విస్తరించుతూ పాంచరాత్ర శాస్త్ర ప్రక్రియను ప్రతిపాదించినాడు.

**శ్లో॥ ఇదంశతసహస్రాద్ధి భారతాఖ్యానవిస్తరాత్। ఆవిధ్యమతి మన్థానం దధ్నోఘృతమివోద్ధృతమ్॥ నవనీతం యథాదధ్నో ద్విపదాంబ్రాహ్మణోయథా। ఆరణ్యకం చవేదేభ్యః ఓషధీభ్యోయథాఽమృతమ్। ఇదమ్ మహోపనిషదం చతుర్వేదసమన్వితమ్। సాంఖ్యయోగకృతాంతేన పంచరాత్రానుశబ్దితం । ఇదం శ్రేయః ఇదంబ్రహ్మ ఇదం హిత మనుత్తమమ్। ఋగ్యజుస్సామభిః జుష్టమథర్వాంగిరసైస్తథా॥ భవిష్యతిప్రమాణంవై ఏతదేవానుశాసనమ్॥**

ఈ పాంచరాత్రశాస్త్రము విస్తారమైన లక్ష శ్లోకాలు గల భారతమనే ఆఖ్యానము నుండి బుద్ధి అనే కవ్వాన్ని పెట్టి చిలికి పెరుగులో నుండి నెయ్యిని వలె పైకి తీయబడినటువంటిది. పెరుగులో వెన్నలాగా, మానవులలో బ్రాహ్మణునివలె వేదంలో ఆరణ్యకము వలె, ఓషధులు – మందు మొక్కలలో నుండి అమృతమును వలెనూ శ్రేష్ఠమైనటువంటిది. ఇది మహోపనిషత్తు. చతుర్వేదాలలోని సారార్థముతో కూడి ఉన్నటువంటిది. జ్ఞానయోగము కర్మయోగముల సిద్ధాన్తాలతోనూ కలసి పంచరాత్రమని అనబడుతున్నది. ఇది మాత్రమే అన్ని విధాలైన మేళ్ళను కల్గించుతుంది. ఇది మాత్రమే పరమాత్మను తెల్పుతుంది. ఇదొక్కటే పురుషార్థాలలో సర్వోత్తమమైన మోక్షాన్ని సాధించిపెడుతుంది. ఋక్ యజుస్సు సామము అధర్వము అనే చతుర్వేదాల చేతను ప్రశంసలను పొందినట్టిది. వాటికి ప్రీతిపాత్రమైనట్టిది. ఈ శాస్త్రమే పరమ ప్రమాణమవుతున్నది. ఇదే మేము చేస్తున్న అను శాసనము. 1) న్యాయము అనగా తాను చదివిన వేదశాఖలోని అర్థముపైన ఏర్పడిన సంశయము (సందేహము) విపర్యయము = చెప్పబడిన / ఉద్దేశించిన అర్థానికి పూర్తి విరుద్ధంగా (తలక్రిందులుగా ఊహ కలుగడములను) తొలగించేది. 2) తాను చదువని శాఖ యొక్క అర్థముతో

ఏకాభిప్రాయము తోచడము వలన తాను చదివిన శాఖలోని అర్థము స్ఫురించడము / తోచడము ఉపబృంహణము అని అంటున్నారు.

సాంఖ్య యోగశబ్దాలతో జ్ఞానయోగము కర్మయోగాలు చెప్పబడినవి. **జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినాం** అని భగవద్ గీతలో చెప్పినారు కదా! ఇదే మహాభారతములో భీష్మ పర్వమునందు కూడా **బ్రాహ్మణైః క్షత్రియైః వైశ్యైః శూద్రైశ్చకృతలక్షణైః। అర్చనీయశ్చసేవ్యశ్చ పూజనీయశ్చమాధవః। సాత్వతం విధిమాస్థాయగీతః సంకర్షణేన యః.** పంచసంస్కారాలు పొంది చక్కని భాగవత లక్షణాలను కల్గి ఉన్న బ్రాహ్మణులు క్షత్రియులు వైశ్యులు శూద్రులు ఎవ్వరైనా సరే మాధవుడు లక్ష్మీదేవికి మగడైన శ్రీమన్నారాయణుడుని అర్చించవచ్చును. దర్శించుకోవచ్చును. పుష్పకైంకర్యము వంటి సేవలు చేయవచ్చును. పూజలు కూడా చేయవచ్చును అని చెప్పినారు. ఇట్లా కంఠోక్తిగా చెప్పే బాదరాయణుడు అనబడే వేదవ్యాసుడు వేదార్థాలు తెల్సినవారిలో మొనగాడు వేదాన్తవేద్యుడు, పరబ్రహ్మఐన వాసుదేవుడుని ఉపాసన చేయడం అర్చించడము మొదలైన విషయాలను ప్రతిపాదించే సాత్త్వత శాస్త్రాన్ని అప్రామాణికమైనదని చెప్పగలడా? దేన్నిబట్టి అప్రమాణమని అంటాడు?

**శ్లో॥ సాంఖ్యంయోగః పాంచరాత్రం వేదాః పాశుపతంతథా। కిమేతాన్యేకనిష్ఠాని పృథఙ్నిష్ఠాని వామునే॥** ఓ మహర్షీ! సాంఖ్యశాస్త్రము యోగశాస్త్రము పాంచరాత్రము నాలుగువేదాలు పాశుపతమతము ఇవన్నీ కూడా ఏకాభిప్రాయాన్ని కలిగి ఒక్క తత్త్వాన్ని ప్రతిపాదిస్తున్నాయా? లేక వేరువేరు అభిప్రాయాలతో ఎడమొగం పెడమొగంగా ఉంటున్నాయా? అని ఆరంభించిన ప్రశ్నద్వారా వీటన్నిటికిన్నీ ఆదరణీయత ఉన్నట్లు తెలుస్తున్నది. శారీరక మీమాంసా శాస్త్రములో మాత్రము సాంఖ్యాదులు ఖండింపబడుతున్నవి. కనుక ఈ పాంచరాత్రము కూడా వాటితో సమానమైనదే కదా! అని సందేహించితే వాటితో సమానము కాదు అని అంటున్నాము. ఎందుకంటే అక్కడ కూడా శారీరకములో చెప్పిన న్యాయమునే అవతరింపచేస్తున్నాడు. **కిమేతానిఏకనిష్ఠాని పృథక్ నిష్ఠానివా?** అని. ఈ ప్రశ్నకు అసలు ఉద్దేశ్యము ఇది – సాంఖ్య యోగ పాశుపత వేద పాంచరాత్రములు ఒకే తత్త్వాన్ని ప్రతిపాదించుతున్నయా? లేక వేరు వేరు తత్త్వాలను ప్రతిపాదించుతున్నవా? అని. ఒకవేళ ఒకే తత్త్వాన్ని ప్రతిపాదించేవి ఐనట్లయితే ఆ ఒక్క తత్త్వము ఏది? కాదు వేరువేరు తత్త్వాలను ప్రతిపాదించేవి అయితే

అప్పుడు ఇవి అన్నీ పరస్పరము విరుద్ధమైన అర్థాలను (తత్త్వాలను) ప్రతిపాదించేవి కాబట్టి తత్త్వము ఒక్కటే అయ్యి దానిలో వికల్పాలు (భేదాలు) లేవు కనుక ఏదో ఒక ప్రమాణాన్ని ఒప్పుకోవలసి ఉంటుంది. ఆ ఒక్కటి ఏది? అని దీనికి సమాధానాన్ని చెప్పుతూ। **శ్లో॥ జ్ఞానాన్యేతాని రాజర్షే విద్ధి నానామతానివై। సాంఖ్యస్యవక్తాకపిలః** ఓ రాజర్షీ! ఇవి అన్నీ కూడా పలువిధాలైన జ్ఞానాలు వేరువేరు అభిప్రాయాలను ప్రకటించుతూ ఉన్నవి. సాంఖ్య మతాన్ని ప్రవచించినవాడు కపిలుడు అని మొదలుపెట్టి సాంఖ్య యోగ పాశుపతాలను కపిలుడు చతుర్ముఖ బ్రహ్మ పశుపతి ఐన శివుడున్నూ రచించిన / ప్రవచించినారు కాబట్టి అవి అన్నీ పౌరుషేయాలు అనబడుతున్నవి అని చెప్పి **అపాన్తరతపానామవేదాచార్యః సఉచ్యతే.** అపాన్తరతపుడు అనునతడు వేదాచార్యుడుగా చెప్పబడుతున్నాడు. అని వేదాలకు అపౌరుషేయత్వాన్ని చెప్పి **పాంచరాత్రస్య కృత్స్నస్య వక్తానారాయణః స్వయమ్** పాంచరాత్రశాస్త్రాన్ని మొత్తాన్ని నారాయణుడే స్వయంగా చెప్పినాడు. అని పాంచరాత్ర తన్త్రానికి వక్త స్వయముగా నారాయణుడే అని చెప్పినాడు. ఇట్లా సమాధానమును చెప్పిన అతనియొక్క ఉద్దేశ్యము ఇది – పురుషులు రచించిన తంత్రాలు అన్నీ కూడా ఒకదానికొకటి విరుద్ధంగా ఉన్నవి. అవి వేరు వేరు విరుద్ధములైన వస్తువులను తత్త్వాలనుగా ప్రతిపాదిస్తున్నవి కాబట్టి వేదము అపౌరుషేయము ఐనందువల్ల భ్రమప్రమాదాది దోషాల గంధము / వాసన కూడా లేనిది అయ్యి ఉగ్గడించబడుతున్న వస్తువు కేవలము వేదమనే ఒకే ఒక్క ప్రమాణముతో చెప్పబడే వేదవేద్యుడైన తత్త్వానికి తక్కినవన్నీ విరుద్ధంగా చెప్పుతున్నందువల్ల నిజంగా ఉన్న తత్త్వమేదో నిర్ణయము చెయ్యడము – ప్రమాణము లభించడమున్నూ కష్టమై ఉన్నది. ఇక వేదము చేత మాత్రమే తెల్సుకోబడే పరబ్రహ్మ నారాయణుడే. కనుక ఆయా తన్త్రాలలో చెప్పబడిన ప్రధానము పురుషుడు పశుపతి మొదలైన తత్త్వాలు కూడా వేదాన్తవేద్యుడైన పరబ్రహ్మ ఐన నారాయణుడిని ఆత్మగా కలవాళ్ళు ఐనప్పుడే వారికి వస్తుత్వం (ఉనికి) ను అంగీకరించవలసి ఉన్నది అని. అందుకే ఈ మాటను పలికినాడు. **సర్వేషు చనృపశ్రేష్ఠ జ్ఞానేష్వేతేషు దృశ్యతే। యథాఽగమం యథాన్యాయం నిష్ఠానారాయణః ప్రభుః.** ఓ రాజా! ఈ జ్ఞానాలన్నింటిలోనూ ఆగమము (వేదము) న్యాయములను అనుసరించి ప్రభువైన నారాయణుడొక్కడే తత్త్వముగా కనబడుతున్నాడు అని. యథాఽగమం యథాన్యాయమ్ అనగా న్యాయాలతో సహకరింపబడిన ఆయా ఆగమాలలో చెప్పబడిన వస్తువును విచారించినప్పుడు నారాయణుడొక్కడే సమస్త వస్తువులకు నిష్ఠ (ఉనికి పట్టు) అని కనిపించుతున్నది. ఆయా తన్త్రాలలో చెప్పబడిన

తత్త్వాలన్నీ అబ్రహ్మాత్మకములు కాబట్టి **సర్వం ఖల్విదం బ్రహ్మ విశ్వమ్ నారాయణః** ఇత్యాది వాక్యాల కారణంగా సమస్త ప్రపంచాన్ని బ్రహ్మాత్మకముగా అనుసన్ధానము చేసేవాడికి నారాయణుడే పరతత్త్వము అని తెలియవస్తుంది అని అర్థము.

కనుక వేదాన్తవేద్యుడు పరబ్రహ్మ ఐన నారాయణుడు స్వయంగా పాంచరాత్రాన్ని మొత్తాన్నీ చెప్పినాడు కనుక ఆయన యొక్క స్వరూపాన్ని ఆయనను ఉపాసించే విధానాన్ని తెలిపిడి చేసేది పాంచరాత్ర శాస్త్రము కనుక అందులో ఇతర శాస్త్రాల్లో కనపడే భ్రమ ప్రమాదాల వంటి దోషాలను ఏదో ఒక అంశాన్ని బట్టి ఊహించడానికి అవకాశము లేదు. అందుకే ఆ విషయంలో ఇట్లాగా చెప్పబడుతున్నది. **ఏవమేకం సాంఖ్యయోగం వేదారణ్యకమే వచ। పరస్పరాంగాన్యేతాని పంచరాత్రం కథ్యతే.** ఈ విధంగా సాంఖ్యము యోగము వేదములు ఆరణ్యకము ఇవన్నీ పరస్పరము అంగములు అవుతున్నాయి. పంచరాత్రము ఒక్కటే అంగి అని చెప్పబడుతున్నది అని. సాంఖ్యము యోగము రెండున్నూ కలిసి సాంఖ్యయోగము అని చెప్పబడింది. వేదాలు ఆరణ్యకాలున్నూ కలిసి వేదారణ్యకమ్ అని అనబడుతున్నవి. ఏకతత్వాన్ని ప్రతిపాదిస్తూ ఉన్నవి కాబట్టి ఒకటి అవుతున్నవి. పంచరాత్రము ఒక్కటి అని చెప్పబడ్తున్నది. అనగా చెప్పినమాట ఇది – సాంఖ్యశాస్త్రంలో చెప్పిన ఇరువది నాలుగు (24) తత్వాలు యోగశాస్త్రంలో చెప్పబడిన యమనియమ ఆదులతో కూడిన యోగము, వేదంలో చెప్పబడిన కర్మల స్వరూపాలను ఒప్పుకుని తత్వాలన్నీ బ్రహ్మాత్మకాలు, యోగము బ్రహ్మను ఉపాసన చేసే పద్ధతిని తెలిపేదిగానూ, కర్మలు, ఆ పరమాత్మను ఆరాధించే రూపాలు అని ఆరణ్యకాలు బ్రహ్మ యొక్క స్వరూపాన్ని ప్రతిపాదించుతున్నవి. దీన్నే పరబ్రహ్మ ఐన నారాయణుడు పంచరాత్ర శాస్త్రంలో స్వయముగా విశదీకరించినాడు అని. శారీరక మీమాంసలోనూ సాంఖ్యులు చెప్పిన తత్వాలు అన్నీ అబ్రహ్మాత్మకాలు ఐనందున ఆ మాటను నిరాకరించినారు. కానీ స్వరూపాన్ని కాదనలేదు. యోగం పాశుపతాలు రెండింటిలోనూ ఈశ్వరుడు కేవలము నిమిత్తకారణం అనుటవలన పర అవరతత్వ కల్పన విపరీత ధోరణిలో చెయ్యబడినందునదాన్ని వేదానికి విరుద్ధమైన, బహిష్కరించిన శవభస్మధారణాది ఆచారాలు ఉన్నందున తిరస్కరించబడినాయి. కానీ యోగస్వరూపము, పాశుపతస్వరూపము తిరస్కరింపబడలేదు. కనుక **సాంఖ్యం యోగః పాంచరాత్రమ్ వేదాః పాశుపతంతథా। ఆత్మ ప్రమాణాన్యేతాని నహన్తవ్యానిహేతుభిః।** సాంఖ్యము యోగము పాంచరాత్రము వేదాలు అట్లే

పాశుపతము ఇవన్నీ స్వయంగా ప్రమాణాలు వాటికి వేరే ప్రమాణాల తోడ్పాటు అవసరము లేదు. హేతువాదంతో వాటిని కొట్టిపారివేయకూడదు సుమా! కనుక ఆయా శాస్త్రాలలో చెప్పబడిన వాటివాటి స్వరూపాలను మాత్రము ఒప్పుకుని తీరాలి. జినుడు సుగతుడు (బుద్ధుడు) చెప్పిన తత్వములవలె మొత్తానికి మొత్తము బొత్తిగా కొట్టివేయడానికి వీల్లేదని చెప్పబడుతున్నది. యథాఽగమంయథాన్యాయం నిష్ఠానారాయణః ప్రభుః అనే వాక్యముతో ఏకాభిప్రాయము ఉన్నది కాబట్టి. **ఉత్పత్త్య సమ్భవాధికరణము ముగిసింది.**

**ఇంతటితో శ్రీభాష్యమునందు ద్వితీయాధ్యాయములోని**
ద్వితీయపాదము ముగిసినది.

శ్రీమతే రామానుజాయనమః

## శ్రీభాష్యము – ద్వితీయాధ్యాయము – తృతీయపాదము

### వియదధికరణము

సూ॥ **న వియద శ్రుతేః 2-3-01** ఆకాశము పుట్టడము లేదు. అట్లాగని చెప్పడము లేదు. ఇది పూర్వ పక్షి సూత్రము. సాంఖ్యము మొదలైన వేదప్రామాణ్యాన్ని అంగీకరించని తన్త్రాలు న్యాయములవలె కనిపించే ఆభాసాలపై ఆధారపడి ఉన్నవి. అంతే కాకుండా తాము ముందు చెప్పిన మాటను తామే ఖండించుకుంటూ పరస్పర విరుద్ధంగా వాదించుతున్నందున కూడా అవి అసమంజసములు అని ఈ పాదానికి ముందరి పాదములో వివరించినారు. ఇప్పుడు తమ పక్షములో విప్రతిషేధము వంటి దోషాలు కానీ వాటి వాసన కానీ లేవని తెలుపడం కొరకు బ్రహ్మకార్యము / బ్రహ్మచేత పుట్టింపబడినందున – అని అంగీకరించిన చిదచిదాత్మకమైన ప్రపంచము కార్యము ఎట్లా అగుతున్నది? అనే అంశాన్ని విచారించుతున్నారు. ఆ సందర్భంగా ఆకాశము పుట్టుక కలదేనా? కాదా? అని అనుమానిస్తున్నారు. ఏది తగును అని అన్నట్లయితే ఆకాశము పుట్టింపబడుట లేదు. అనియే. ఎందువల్లనంటే ఆ విధముగా శ్రుతి పేర్కొనడం లేదు. జరుగడానికి అవకాశము ఉన్నది మాత్రమే వినిపించడానికి వీలవుతున్నది.

ఊహించడానికి అవకాశము లేని గగనకసుమము ఆకాశము పుట్టుట వంటి వాటిని మాటలలో చెప్పడముకుదరదు. అవయవములులేని అంతటా వ్యాపించి ఉన్న ఆకాశానికి ఆత్మకు వలే ఉత్పత్తిని నిరూపించడము అయ్యే పని కాదు. కావుననే ఉత్పత్తి లేదు కాబట్టి ఛాందోగ్యోపనిషత్తులో సృష్టిప్రకరణములో తేజస్సు మొదలైన వాటియొక్క ఉత్పత్తి మాత్రమే ఉపదేశింపబడుతున్నది. **తదైక్షత బహుస్యామ్ ప్రజాయేయేతి. తత్తేజో అసృజత.** ఆ సత్తు అనబడే పదార్థము నేను అనేకములుగా అవుతాను అని సంకల్పించింది. అందుకుగాను పుడుతాను అని. పిమ్మట అది తేజస్సును పుట్టించెను అని. తైత్తిరీయ ఉపనిషత్తులో అధర్వణోపనిషత్తులోనూ **తస్మాద్వాఏతస్మాదాత్మన ఆకాశస్సమ్భూతః. 2) ఏతస్మాత్ జాయతే ప్రాణో మనః సర్వేన్ద్రియాణిచ. ఖంవాయుః జ్యోతిరాపః.** అట్లాగా సంకల్పించిన ఆత్మ నుండి ఆకాశము పుట్టింది. ఈ సత్ పదార్థము నుండే ప్రాణము (జీవుడు) మనస్సు అన్ని ఇంద్రియాలున్నూ పుడుతున్నవి. ఆకాశము వాయువు జ్యోతి (వెలుగు–అగ్ని) నీళ్ళు కూడా పుడుతూ ఉన్నవి. ఇటువంటి వాక్యాలలో ఆకాశము యొక్క ఉత్పత్తి వినిపిస్తున్నది. కానీ అర్థవిరోధము వల్ల బాధింపబడుతుంది. కనుక ఆకాశానికి పుట్టుకలేదు. అని పూర్వపక్షము రాగా సమాధానాన్ని చెప్పుతూ ఉన్నారు దిగువ సూత్రముతో –

సూ॥ **అస్తితు 2–3–2** ఉన్నది కదా! ఆకాశానికి ఉత్పత్తి ఉన్నది. ఇంద్రియాలచేత తెలియబడని విషయాన్ని తెలియజేసే వేదము తన కన్న వేరయిన ప్రమాణాల ద్వారా తెలియరానిదైన ఆకాశము యొక్క ఉత్పత్తిని తెలుపడంలో తగిన సామర్థ్యాన్ని కలిగి ఉన్నది. శ్రుతిచేత గుర్తింపబడుతున్న అర్థము నందు దానికి విరోధి ఐన నిరవయము కాబట్టి ఆకాశము పుట్టడానికి వీల్లేదు అని సాధించే అనుత్పత్తికి సమ్బన్ధించిన అనుమానము కలుగడానికే అవకాశం లేదు. ఆత్మ యొక్క అనుత్పత్తి అనగా ఆత్మ పుట్టుకలేక పోవడము అవయవములు లేనిది కాబట్టి అనే కారణము చేత సాధించినది కాదు అని ముందు చెప్పబోతున్నాము. దీని మీద పూర్వ పక్షి తిరిగి సందేహాన్ని లేవనెత్తుతున్నాడు దిగువ సూత్రము ద్వారా!

సూ॥ **గౌణ్యసమ్భవాత్ శబ్దాచ్చ 2–3–3** గౌణము – ముఖ్యముకానిది అని అనడానికి అవకాశముంది కాబట్టి శబ్దము వేదము పుట్టుకలేనిది అని చెప్పుతున్నది కాబట్టి ఆకాశానికి పుట్టుక లేదు. **తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సమ్భూతః** ఇత్యాది వాక్యాలద్వారా తెలియవచ్చే వియదుత్పత్తిని గౌణీ / అముఖ్యము అని

ఊహించుకోవడము మంచిది. **తత్తేజోఽసృజత** అని బ్రహ్మ నుండి మొదటగా తేజస్సు పుట్టింపబడుతున్నది కాబట్టి తేజస్సు యొక్క ఉత్పత్తికే ప్రథమ స్థానము ఉన్నందున దానికంటే ముందు ఆకాశము పుట్టింది అనే ప్రతిపాదన చేయడం కుదరదు. **వాయుశ్చఅన్తరిక్షం చఏతదమృతమ్** వాయువు ఆకాశమున్నూ అమృతములు – మరణములు లేనివి అని ఆకాశము అమృతము అని చెప్పినందువల్ల వియత్తుకు ఉత్పత్తి లేదు.

సమ్భూతః అనే ఒకే శబ్దము ఆకాశమును గురించి చెప్పినపుడు గౌణము కావడము, అగ్ని మొదలైనవాటిని గురించి చెప్పినప్పుడు ముఖ్యము కావడం అనేది ఎట్లా కుదురుతుంది? అని అంటే చెపుతున్నాడు.

సూ॥ **స్యాచ్చైకస్య బ్రహ్మశబ్దవత్ 2–3–4** బ్రహ్మశబ్దము వలె ఒక్క పదానికి ముఖ్యర్థము, గౌణార్థము రెండు కూడా చెప్పబడవచ్చును. ఒక్క పదానికే **తస్మాద్వాఏత్‌స్మాదాత్మన ఆకాశస్సమ్భూతః** అని ఆకాశవిషయము నందు ముఖ్యార్థము కావడం లేదు గనుక గౌణార్థంలో ప్రయోగించబడిన సమ్భూతశబ్దము **వాయోరగ్నిః** – వాయువు నుండి అగ్ని – ఇత్యాదులలో సమ్బన్ధము కలది కావున ముఖ్యత్వము తప్పక సంభవించుతుంది. ఎట్లాగంటే బ్రహ్మ శబ్దము **తస్మాదేతత్‌బ్రహ్మ నామరూపమన్నంచ జాయతే** ఆయన నుండి ఈ ప్రకృతి – బ్రహ్మ – నామము రూపములు గలది అన్నముగా పరిణమించుతున్నది – అనే వాక్యం నందు గౌణముగా ప్రయోగింపబడింది అదే ప్రకరణములో **తపసా చీయతే బ్రహ్మ తతోఽన్నమభిజాయతే** తపస్సు – ఆలోచన, జ్ఞానము చేత బ్రహ్మ వృద్ధి పొందుచున్నాడు. అటుపిమ్మట అన్నము పుడుతున్నది అను వాక్యములో పరమాత్మ విషయములో ముఖ్యార్థాన్ని కలదిగా ప్రయోగింపబడుతున్నది కదా. దానివలెనే ఇది కూడా! అనుషంగము నందు కూడా శ్రవణము మళ్ళీ మళ్ళీ జరిగినప్పుడు వలె – ఆవృత్తి – అభిధానము యొక్క ఆవృత్తి ఉంటూనే ఉన్నది. అంటే ఒక పదాన్ని రెండు మూడు సార్లు పలికితే విన్న ప్రతిసారి కూడా దానియొక్క అర్థము తెలుస్తూనే ఉంటుంది. ఒకసారి విన్నాము కదా! అని రెండవసారి పలికినప్పుడు దాని అర్థం తోచకుండా ఉండదు. కనుక అభిధానము అర్థాన్ని తెలుపడము. ఇక అనుషంగము అన్వయము కొరకు ఆకర్షించుకోవడము – తెచ్చుకోవడం. ఒక వాక్యములో విన్న బ్రహ్మ శబ్దాన్ని మరొకవాక్యములోకి అన్వయం కొరకు తెచ్చుకున్నాము కదా! – ఈ వాదాన్ని సిద్ధాన్తి ఖండించుతున్నాడు.

సూ॥ **ప్రతిజ్ఞాహానిః అవ్యతిరేకాత్ 2-3-5** ఆకాశానికి పుట్టుక ఉన్నది అని అంగీకరించినప్పుడే ప్రతిజ్ఞ నిలుస్తుంది. ప్రతిజ్ఞకు వ్యతిరేకము కానపుడే కార్యము అవుతుంది. ఛాందోగ్య శ్రుతిననుసరించే మిగతా ఆకాశానికి ఉత్తత్తిని చెప్పేటువంటి వాక్యాలకు గౌణత్వాన్ని - అప్రాధాన్యాన్ని - అముఖ్యత్వాన్ని కల్పించడము తగదు. ఎందుకంటే ఛాన్దోగ్యశ్రుతి ఆకాశము యొక్క ఉత్పత్తిని అంగీకరించుతున్నది కనుక. యేనాశ్రుతమ్ శ్రుతమ్ ఇత్యాది ఐన బ్రహ్మ విజ్ఞానముతో సర్వవిజ్ఞానము కల్గుతుందని ప్రతిజ్ఞ చేయబడింది కదా! ఆ ప్రతిజ్ఞకు భంగము / హానికలుగకుండుట అనేది బ్రహ్మకార్యము అవడంవల్ల దానికి వ్యతిరేకము కాకపోయినప్పుడే అవుతుంది.

సూ॥ **శబ్దేభ్యః 2-3-06** శబ్దాల వలన దీనివల్ల ఛాన్దోగ్యము నందు వియదుత్పత్తి తెలియవస్తున్నది. **సదేవసోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయం** అని సృష్టి జరుగడానికి ముందు కాలములో ఒక్కడు మాత్రమే ఉన్నాడని నిర్ధారణ చేస్తున్న శబ్దము వల్ల ఆకాశము పుట్టిందని తెలుస్తున్నది. **ఐతదాత్మ్యమిదం సర్వమ్** ఈ ప్రపంచమంతా ఇతడినే ఆత్మగా కల్గి ఉన్నది. ఇట్లాంటి శబ్దాలవల్ల కూడా ఆకాశము కార్యము అవుతున్నందువల్ల బ్రహ్మకు వ్యతిరేకముగా ఎదురుగా / వేరుగా ఏదీ లేదని తెలుస్తున్నది. తత్తేజోఽసృజత అనే వాక్యాన్నిబట్టి తేజస్సు యొక్క ఉత్పత్తిని చెప్పే శ్రుతి ఆకాశము యొక్క ఉత్పత్తిని అడ్డుకుంటున్నది అని అనవద్దు. వియదుత్పత్తిని గురించి చెప్పనంత మాత్రాన తేజస్సుకు ఉన్నట్లుగా తెలుస్తున్న ప్రాథమ్యం (మొదటగా పుట్టుట) ఇతర శ్రుతుల ద్వారా తెలుస్తున్న ఆకాశము యొక్క పుట్టుకను అడ్డుకోజాలదు.

సూ॥ **యావద్వికారం తువిభాగో లోకవత్ 2-3-7** ఎంతవరకు ఆకాశము వికారముగా గుర్తింపబడ్తుందో ఆ ప్రకారము బ్రహ్మకు కార్యము కాక తప్పదు. లోకములో వలె. తు అనే శబ్దము సూత్రములో ఉన్నట్టిది. చకారము యొక్క అర్థములో ప్రయోగింపబడింది. **ఐతదాత్మ్యమిదం సర్వమ్** ఇత్యాది వాక్యాలు ఆకాశమును వికారముగా చెప్పుతున్నవి కనుక ఆకాశము బ్రహ్మకు విభాగమవుతుంది. అనగా దానికి ఉత్పత్తి చెప్పబడినట్లే అవుతుంది. లోకంలో వలె. **ఏతేసర్వేదేవదత్తపుత్రాః** వీరంతా దేవదత్తుని కొడుకులు అని చెప్పి వారిలో కొందరిని వాడివల్ల పుట్టినారు అని చెప్పితే అపుడు వారందరికీ అతడి నుండి పుట్టుక కలిగినట్లు చెప్పడమవుతుంది. దానిలాగానే. ఇది ఇట్లా అవడం చేత **వాయుశ్చాన్తరిక్షం చైతదమృతం** అనే వాక్యానికి

అర్థమేమవుతుందంటే దేవతల వలె ఎక్కువ కాలము నిల్చి (బ్రతికి) ఉంటారని అభిప్రాయము మాత్రమే.

సూ॥ **ఏతేన మాతరి శ్వావ్యాఖ్యాతః 2-3-08** ఆకాశానికి పుట్టుక ఉన్నదని నిశ్చయించినందువల్ల వాయువుకు కూడా ఉత్పత్తి చెప్పినట్లయ్యింది. ఈ హేతువుచేతనే మాతరిశ్వకు – వాయువుకు కూడా ఉత్పత్తికలదని వ్యాఖ్యానించబడింది. ఆకాశము వాయువులకు ప్రత్యేకంగా సూత్రాలు చెప్పడము **తేజోఽతస్తథాహ్యాహ** అని సూత్రము వద్ద వాయువును పరామర్శించుట కొఱకు.

సూ॥ **అసమ్భవస్తు సతోఽనుపపత్తేః 2-3-9** పుట్టుకలేకపోవడము పరమాత్మకే ఉన్నది. ఆయన కంటే వేరయిన వాళ్ళకు ఎవరికైనా ఉత్పత్తి లేకుండటము కుదరదు. పొసగదు కాబట్టి. తు శబ్దము అవధారణను తెల్పుతుంది. అసమ్భవః – పుట్టుక లేకుండుట సతః బ్రహ్మకు మాత్రమే. ఆయన కంటే వేరయిన వాటికి దేనికి కూడా అనుత్పత్తి కుదరదు. పొసగదు కనుక. ఇది చెప్పబడుతున్న విషయము – ఆకాశము గాలి ఈ రెండింటికిన్నీ పుట్టుక ఉన్నదని చెప్పడము ఉదాహరణ కోసం మాత్రమే. ఉత్పత్తి లేకపోవడము సత్‌శబ్దము చేత చెప్పబడేవాడు పరమకారణుడు ఐన పరబ్రహ్మకు మాత్రమే. ఆయనకంటే వేరయిన అవ్యక్తము మహత్తు అహంకారము తన్మాత్రలు ఇంద్రియాలు ఆకాశము గాలి మొదలైన మొత్తము ప్రపంచానికి ఉత్పత్తి ఉన్నది. ఏక విజ్ఞానము వలన సర్వమును గురించి తెలుస్తుంది అనే ప్రతిజ్ఞ మొదలైనవాటివల్ల కార్యభావము తెలుస్తున్నది. కనుక అనుత్పత్తి పొసగదు అని. **అని వియదధికరణము**

★ ★ ★

## ఇక తేజోఽధికరణము

సూ॥ **తోజోఽతస్తథా హ్యాహ 2-3-10** తేజస్సు (అగ్ని) ఈ వాయువునుండే పుడుతున్నది. అట్లాగని శ్రుతి చెప్పుతున్నది కదా! బ్రహ్మకంటే వేరుగా ఉన్నదంతా బ్రహ్మ కార్యమే. బ్రహ్మచే పుట్టింపబడిందే. ఇపుడు పరమకారణముతో మధ్యన ఎడమ కల్గి ఉన్న కార్యమైన వస్తువులకు పుట్టుక నేరుగా పరబ్రహ్మనుండే ఏర్పడుతున్నదా? లేక మధ్యలో ఉండిన సన్నిహిత కారణాల వల్లనా? లేక ఆయా రూపాల్లో ఉన్న బ్రహ్మ నుంచా? అని విచారింపబడుతున్నది. వీటిలో ఏది తగును అని అనేట్లయితే కేవలము

ఆయా వస్తువుల నుండియే అని అంటాము ఎందువల్ల నంటే తేజస్సు ఐతే దీనివల్లనే అంటే గాలి నుండే పుడుతున్నది. **వాయోరగ్నిః** అని గదా చెప్పింది వేదము.

సూ॥ **ఆపః 2-3-11** నీళ్ళు అగ్ని నుండి పుట్టినవి. నీళ్ళు కూడా ఈ తేజస్సు నుండే పుడుతున్నవి **అగ్నేరాపః తదపోఽసృజత** అని చెప్పింది కదా శ్రుతి.

**పృథివీ 2-3-12** నీటి నుండి భూమి పుడ్తున్నది 'అద్భ్యఃపృథివీ' 'తా అన్నమసృజంత' అవి అన్నాన్ని సృజించాయి. అని అన్నారు. అన్న శబ్దంతో పృథివి ఎట్లా చెప్పబడుతున్నది. అందువల్ల చెప్పారు.

సూ॥ **అధికార రూప శబ్దాన్తరేభ్యః 2-3-13** అధికారము, రూపము, శబ్దాన్తరములవల్ల చెప్పబడ్తున్నది. మహాభూతాలయొక్క సృష్టి అధికారము వలన పృథివియే అన్న శబ్దం చేత చెప్పబడిందని తోస్తున్నది. తినడానికి పనికివచ్చేదంతా పృథివియొక్క వికారమే – మార్పు చెందిన రూపమే – కనుక కారణమైన భూమి యందు కార్యమైన అన్నము అనే శబ్దము ప్రయోగింపబడింది. అట్లాగే వాక్యశేషము నందు భూతాలకు రూపాన్ని ఎత్తి చెపుతున్నపుడు **యదగ్నే రోహితం రూపమ్ తేజసస్తద్రూపమ్. యచ్ఛుక్లమ్ తదపామ్. యత్ కృష్ణమ్ తదన్నస్య** అగ్నియందున్న ఏ రక్తవర్ణము ఉన్నదో అది తేజస్సుకు రూపము, తెలుపు నీటికి రూపము. ఏ నలుపు కనిపిస్తున్నదో అది అన్నానికి (భూమికి) చెందినది అని నీటికి తేజస్సుకు సజాతీయమైనదే అన్న శబ్దము చేత చెప్పబడుతున్నది అని తెలుస్తున్నది. దీనికి సమానమైన ప్రకరణములో మరొకశబ్దము – శబ్దాన్తరము కనిపిస్తున్నది. **అగ్నేరాపః అద్భ్యఃపృథివీ** అని. కనుక పృథివియే అన్న శబ్దముచేత చెప్పబడుతున్నది. కాబట్టి నీటి నుండి భూమి పుడుతున్నది. ఉదాహరింపబడిన తేజస్సు మొదలైనవి ప్రదర్శనార్థమే. మహత్తు మొదలైనవి కూడా తమ తరువాతి వస్తువులను పుట్టించుతున్నవి. శ్రుతిలో / వేదములో చెప్పిన ప్రకారము అంగీకరించినట్లయితే వైరుధ్యము లేదు కాబట్టి. **ఏతస్మాత్ జాయతే ప్రాణోమనఃసర్వేంద్రియాణిచ ఖం వాయుఃజ్యోతిరాపః పృథివీవిశ్వస్యధారిణీ. 2) తస్మాదేతద్ బ్రహ్మనామరూపమన్నంచజాయతే 3) తస్మాద్వా ఏతస్మాదాత్మనః ఆకాశఃసమ్భూతః.** ఇత్యాదులు పరమాత్మ నేరుగా కాకుండా పరమ్పరగా – ఒక్క దానికి ఒక్కటి చొప్పున – కారణము అవుతున్నాడు అనుటలో చక్కగా పొసగుతున్నవి అని. ఇట్లాగా పూర్వపక్షము వస్తే చెప్పుతున్నాము.

సూ॥ **తదభిధ్యానాదేవతు తల్లింగాత్ సః 2-3-14** ఆయన సంకల్పము వల్లనే ఆయా వస్తువులకు పరమాత్మ కారణమవుతున్నాడు. అందుకు సమ్బన్ధించిన లింగము – గురుతు కనిపిస్తున్నది. తుశబ్దముతో ఎదుటి పక్షము కొట్టి వేయబడుతున్నది. మహత్తు మొదలైన కార్యాలకు కూడా ఆయా అనన్తర – తరువాతి – వస్తువులనంటే వాటిని పుట్టించాలని సంకల్పము చేయుటవలన మరియు ఆ విధము ఐన లింగము – గుర్తు కనిపిస్తున్నందువల్ల. అభిధ్యానము అనగా బహుస్యామ్ – నేను చాలా రూపములు కలవాడనుగా అవుతాను అని సంకల్పము చేయుట. తత్తేజ ఐక్షత బహుస్యామ్ ప్రజాయేయేతి 2) తా ఆపఐక్షన్త బహ్వ్యఃస్యామః ప్రజాయేమహి అని పరమాత్మ యొక్క – తనయొక్క – బహుభవన సంకల్పరూపమైన ఈక్షణము వినిపించుతున్నది కాబట్టి మహత్తు అహంకారము ఆకాశము మొదలైన కారణాలు కూడా ఆ పరమాత్మవలె ఈక్షా పూర్వికమైన – సంకల్పపూర్వకమైన – తమ నుంచి ఏర్పడే కార్యమగు వస్తువులను సృష్టించడం జరుగుతున్నది అని తెలుస్తున్నది. ఆ రకమైన ఈక్షణము – సంకల్పము – ద్వారా ఆయా వస్తువులను / పదార్థాలను శరీరాలుగా కలిగిన పరబ్రహ్మకు మాత్రమే సృష్టి చేయడము సాధ్యం అవుతుంది. అన్తర్యామి బ్రాహ్మణము నందు అన్నింటినీ శరీరాలుగా చేసుకొని ఉన్నవాడు కాబట్టి సర్వాత్మకత్వము – అందరికీ ఆత్మగాఐ ఉండడము – పరబ్రహ్మకు ఉన్నదని వినిపిస్తున్నది. **యఃపృథివ్యాం తిష్ఠన్యోఽప్సుతిష్ఠన్. యస్తేజసి తిష్ఠన్. యోవాయౌతిష్ఠన్. యఃఆకాశే తిష్ఠన్ ఇత్యాదుల ద్వారా, సుబాలోపనిషత్తులోనూ యస్య పృథివీ శరీరమ్** అని మొదలుపెట్టి **యస్యాహంకారః శరీరమ్, యస్య బుద్ధిః శరీరమ్. యస్యఅవ్యక్తమ్ శరీరమ్** మున్నగు వాక్యాలు కూడా వినిపిస్తున్నవి.

ఏతస్మాత్ జాయతే ప్రాణో మనఃసర్వేంద్రియాణిచ ఇత్యాది వాక్యాలలో వినిపించుతున్న పరబ్రహ్మ చేస్తున్న ప్రాణాది సృష్టి పరంపరగా కూడా పొసగుతుంది అని ఏ మాట అన్నారో దాని విషయములో సమాధానము చెప్పబడుతున్నది.

సూ॥ **విపర్య యేణ తుక్రమోఽత ఉపపద్యతే చ 2-3-15** సూత్రములోని తుశబ్దము అవధారణ కొరకు ప్రయోగింపబడింది. అవ్యక్తం మహత్తు అహంకారము ఆకాశము మొదలుగా ఉన్న క్రమానికి ఎదురుగా విపర్యయముగా / వెనుకకు ఎవడు కార్యాలన్నింటికీ బ్రహ్మ దాకా ఉన్న ఆన్తర్యరూపమైన క్రమమున్నదో ఏతస్మాజ్జాయతే ప్రాణః ఇత్యాది వాక్యాలయందు ఏది తెలియవస్తున్నదో ఆక్రమము, ఆ రూపంగా

ఉన్న బ్రహ్మ నుండి ఆయా కార్యాలు పుడుతున్నందువల్లనే అది పొసగుతున్నది. పరమ్పరగా కారణము ఐనట్లయితే కనుక ఆనన్తర్య శ్రవణము నిలిచిపోతుంది. కనుక ఏతస్మాజ్జాయతే ఇత్యాదులు కూడా ఈ సమస్త విశ్వము బ్రహ్మ నుండి నేరుగా పుడుతున్నది అని అనడానికి సూచకము / జ్ఞాపకము తెలియజేసేది అవుతున్నది.

సూ॥ **అన్తరావిజ్ఞానమనసీక్రమేణ తల్లింగాదితిచేన్నఅవిశేషాత్ 2-3-16**

భూతాలు ప్రాణములకు నడుమ విజ్ఞానమనస్సులు క్రమంగా పుడుతున్నాయి అని అనడానికి లింగము ఉన్నది అని అన్నట్లయితే కాదు. విశేషము లేదు. విజ్ఞానము కలుగడానికి ఇంద్రియాలు సాధనాలు అవుతున్నవి కనుక – వాటిని విజ్ఞానము అని అంటున్నాము. ఏతస్మాజ్జాయతే ఇద్యాదివాక్యముతో సమస్త విశ్వము బ్రహ్మకు అనన్తరకార్యము అని వినిపిస్తున్నది. కనుక ఈ వాక్యము చేత సర్వమూ సాక్షాత్తూ బ్రహ్మయొక్క ఉత్పత్తి అభిధ్యాన లింగము చేత – సంకల్పము – అవగతము అవుతూ దాన్ని జ్ఞాపకము చేస్తున్నది అని ఏ మాట అన్నారో అది పొసగేది కాదు. ఈ వాక్యము క్రమవిశేషాన్ని తెల్పుతున్నది కాబట్టి ఇక్కడ కూడా – ఈ ఉపనిషత్తులో కూడా – ఒక వరుస ప్రతీతి అవుతున్నది. ఆకాశము మొదలైన వాటి యందు మాత్రము ఇతర ఉపనిషత్తులో నిర్ణయింపబడిన క్రమము ఇక్కడ కూడా తోచుతూనే ఉన్నది. వాటితో సహా పాఠము యొక్క లింగము ప్రకారము భూతప్రాణాలకు నడుమ విజ్ఞానమనస్సులు కూడా క్రమంగా పుడుతున్నవి అని తోస్తున్నది. కనుక ఈ సర్వమూ సాక్షాత్తుగా బ్రహ్మనుండే పుడుతున్నది అని అనడానికి ఈ వాక్యము ఉత్తమ్భకము కాదు అని అంటే చెపుతున్నారు కాదు అని. ఎందుకంటే విశేషము లేదు కాబట్టి. ఏతస్మాజ్జాయతే ప్రాణః అనే వాక్యాన్ని బట్టి విజ్ఞానము మనస్సులకు ఆకాశము మొదలైన వాటికిన్నీ విశేషము – భేదము లేదు కాబట్టి. ఏతస్మాజ్జాయతే అనే వాక్యము ద్వారా చెప్పదగినదైన నేరుగా బ్రహ్మ నుండి పుట్టడము అనే సమ్బన్ధము ప్రాణము మొదలుకొని పృథివీ వరకు ఉన్న వాటికి విశేషము లేనిదై ఉన్నది కాబట్టి అది విధేయము కాని క్రమము కాదు. ఇతర శ్రుతులద్వారా తెలియవస్తున్న క్రమంతో విరోధము వస్తున్నందువల్ల ఇది క్రమానికి సమ్బన్ధించినది కాదు. పృథివీ అప్సుప్రలీయతే – నేల నీటిలో కలిసిపోతున్నది అని మొదలుపెట్టి **తమః పరేదేవే ఏకీభవతి** తమస్సు – సూక్ష్మమైన చిదచిత్ స్వరూపము – పరదైవమునందు ఒక్కటిగా అవుతున్నది అనే అన్తము వరకు ఉన్న మరొక క్రమము కనిపిస్తున్నది కాబట్టి. కనుక అవ్యక్తము మొదలైనవాటిని శరీరముగా కలిగిన

పరబ్రహ్మనుండే సర్వకార్యాలు పుడుతూ ఉన్నవి. తేజస్సు మొదలైన శబ్దాలు వాటికి ఆత్మఐన బ్రహ్మనే చెపుతున్నవి.

ఐతే ఇట్లాగా శబ్దాలన్నీ బ్రహ్మను గురించే చెప్పేవి ఐనట్లైతే ఆయా శబ్దాలతో ఆయా వస్తువులను గురించి వ్యుత్పత్తి సిద్ధమైన నామవాచకత్వము / పేర్కొనుట అనేది నిలిచి పోతుంది కదా! అని అంటే చెపుతున్నారు.

సూ॥ **చరాచర వ్యపాశ్రయస్తుస్యాత్ తద్వ్యపదేశః భాక్తః తద్భావ భావిత్వాత్ 2–3–17** చరాచరాలను గురించి చెప్పే శబ్దము బ్రహ్మ విషయములో అభాక్తము కాదు ముఖ్యమే. సర్వశబ్దాలు బ్రహ్మ యొక్క అనుప్రవేశము చేత కూడిన వాటినే చెపుతున్నవి కనుక. తు అనే శబ్దము చోదన చేయబడిన శంకను తొలగించడానికి ప్రయోగించినారు. నిఖిలములైన జంగమాలు – కదిలేవి, స్థావరాలు – కదులనివిఐన వస్తువులను తెలియజేసే ఆయాశబ్దముల వ్యపదేశము భాక్తము అనగా వాచ్యముఐన అర్థములోని ఒక భాగాన్ని విడదీసి చెప్పుతూ ఉన్నది అని అర్థము. సమస్త వస్తువులకూ ప్రకారి – విశేష్యము – ఐన బ్రహ్మను ప్రకారము – విశేషణము – ఐన వస్తువులను తెలియపరిచే ప్రత్యక్షాది ప్రమాణాలకు అందదు, తెలియబడదు కనుక వేదాన్త శాస్త్రాన్ని పెద్దలద్వారా వినకముందు ప్రకారి ఎవడో తెలువదు కాబట్టి దాని పర్యవసానము ప్రకారి ప్రతీతి భావము వలన భావిత్వమవుతున్నందున – లోకములో వాచ్యము నందు ఏకదేశము – ఒక భాగము ఐన ఆయా వస్తువునందు మాత్రమే ఆయా శబ్దాలు విడదీయబడి విడదీయబడి పేర్కొనబడుతున్నవి (అనగా ఒక వ్యక్తిలో ఉన్న పరమాత్మ మనకు ప్రత్యక్షాదులైన ప్రమాణాల ద్వారా కనబడడము లేదుకాబట్టి ఆయన గురించి వ్యవహరించక ఆ శరీరములోనే ఒక భాగముగా ఉన్న జీవుడినే వ్యవహరించుతూ ఉన్నాము కానీ పరమాత్మ గురించి వ్యవహరించడము లేదు. పరమాత్మ తొలుత శరీరాన్ని ఏర్పరచి, దానిలోకి తాను జీవుడిలోకి ప్రవేశించి అతడిని ఆ శరీరములో ప్రవేశపెడుతున్నాడు. దీన్ని అనుప్రవేశము అని అంటున్నాము. దీని ప్రకారము శరీరము + జీవుడు + భగవన్తుడు ముగ్గురు ఒకచోట / ఒకదానిలో ఉన్నారు. పైకి శరీరము మాత్రము కనిపిస్తున్నది. దానిలో కదలికలు మొదలైనవి ఉంటున్నవి. అది అట్లుండగా మనమందరమూ ఆ శరీరాన్నే వ్యక్తిగా భావిస్తున్నాము. కొంత జ్ఞానం కల్గిన తర్వాత శరీరము వేరు రామయ్య అనే పేరుతో పిలువబడుతున్నవాడు వేరు అని గుర్తించుతున్నాము. ఇపుడు రామయ్యా అని పిల్చినపుడు స్పందించుతున్నవాడు

శరీరము కాక దానిలో ఉన్న అదృశ్యమైన వ్యక్తి ఎవరో ఒకడు పల్కుతున్నాడు. అతడే జీవుడు. అతడికి ఆయా పనులు చేసే శక్తిని ప్రసాదించుతూ నడిపిస్తున్నవాడు మరొకడు ఆ శరీరములోని వానిలో ఉంటున్నాడు. జీవుడు లేకుంటే శరీరము కదలిక మెదలికలు లేనట్లే పరమాత్మ లేకుంటే ఆ జీవుడు శరీరములాగే జడముగానే ఉండిపోతాడు. కనుక శరీరము జీవులకు నిర్వాహకుడు, ప్రధానుడు పరమాత్మ. అతడే ముఖ్యుడవుతున్నాడు. జీవుడు శరీరములు రెండూ భాక్తములు అముఖ్యములు అవుతున్నవి. కనుక సర్వశబ్దాలు పరమాత్మనే ప్రధానుడినే ముఖ్యుడినే చెపుతున్నవి. అన్తరాన్తరాల్లో ఉండే పరమాత్మ కనరావడం లేదు కనుక ఆ పేరు – ఆ వాచక శబ్దము జీవుడినే ఒక్కొక్కసారి శరీరాన్నే చెపుతున్నదని భావించుతూ ఆయా శబ్దాలు దేహానికో జీవుడికో వాచకాలు అని అనుకుంటున్నాము. కాని వాచకాలు పరమాత్మనే చెప్పినపుడు పరమాత్మ + జీవుడు + శరీరము మూడూ కల్సి ఉన్న స్థితిలో జీవుడినో, శరీరాన్నో గనుక ఉద్దేశించితే అపుడు భాక్తము అవుతుంది. అముఖ్యము అవుతుంది ఆ ఆ శబ్దాలతో పరమాత్మనే ఉద్దేశించి పల్కినపుడు అది ముఖ్యము అవుతుంది).

లేదా తేజస్సు మొదలైన శబ్దాల చేత ఆయా వస్తువులను మాత్రమే చెప్పేవిగా వ్యుత్పన్నములైన వాటితో బ్రహ్మను గురించి పేర్కొనడం జరిగితే అది భాక్తము – అముఖ్యము, విడదీయబడినది అవుతుంది. అముఖ్యము అవుతుందని సందేహించుకొని **చరాచరవ్యపదేశస్తు** అని చెప్పబడుతున్నది. చరాచరవ్యపాశ్రయమైన వాటి శబ్దము – వాటిని తనకు అర్థముగా చెప్పే శబ్దము చరాచర వాచిశబ్దము బ్రహ్మయందు అభాక్తమే. ముఖ్యమే. ఎందువల్లనంటే? సర్వశబ్దాలకు ఉండే వాచక భావము (ధర్మము) బ్రహ్మ భావ భావి ఐనందువల్ల నామరూప వ్యాకరణమును గురించి చెప్పే శ్రుతి వల్ల ఆ విషయము తెలుస్తున్నది. **అనేనజీవేన ఆత్మనా అనుప్రవిశ్యనా మరూపేవ్యాకరవాణి** అనేదే ఆ వాక్యము. **ఇది తేజోఽధికరణము.**

★ ★ ★

## ఇక ఆత్మాధికరణము

సూ॥ **నఆత్మాశ్రుతేః నిత్యత్వాచ్చతాభ్యః 2–3–18** ఆత్మకు పుట్టుకలేదు. ఆత్మ నిత్యమే అని వేదాలవలన వినిపిస్తున్నది. ఆకాశము మొదలుకొని తక్కిన ప్రపంచమంతా పరబ్రహ్మ నుండే పుడుతున్నది అని ఇప్పటివరకూ స్పష్టము చేయబడింది. ఇపుడు

జీవుడికి కూడా ఉత్పత్తి ఉన్నదా? లేదా? అని అనుమానము వ్యక్తం చేయబడుతూ ఉన్నది. ఏది తగును అని అంటే పుట్టుక ఉన్నదని అనడమే సరియైనది అని ఎందువల్ల నంటే జీవుడికి పుట్టుక ఉన్నదని అంగీకరించినప్పుడే ఏకవిజ్ఞానము ద్వారా సర్వవిజ్ఞానము కలుగడము అనే ప్రతిజ్ఞ సత్యము అవుతుంది. అంతే ఈ ప్రపంచము సృష్టింపబడడానికి ముందు ఒక్కటే ఉన్నది అని నిర్ధారణ అవుతున్నందువల్లనున్నూ. ఆకాశాదులకు వలెనే జీవుడికి కూడా పుట్టుక ఉన్నది అని తెలిపే శ్రుతులు ఉన్నాయి. **యతః ప్రసూతా జగతః ప్రసూతీ తోయేనజీవాన్ వ్యససర్జభూమ్యాం.** ఎవడివల్లనైతే ఈ జగత్తుకు జనన మరణాలు సంభవిస్తూన్నాయో. ముందుగా ఈ నేలమీదికి భగవానుడు నీటిద్వారా జీవులను వదిలిపెట్టినాడు. **2) ప్రజాపతిః ప్రజాఅసృజత** ప్రజాపతి ఐన పరబ్రహ్మ ప్రజలను సృష్టించినాడు. **3) సన్మూలాః సోమ్యేమాఃసర్వాః ప్రజాః సదాయతనాః సత్ప్రతిష్ఠాః** ఓ సోమ్యుడా! ఈ ప్రజలందరూ సత్తునే మూలకారణముగా కలవారు. ఆయనపైననే ఆధారపడి బ్రతుకుతున్నారు. **4) యతోవాఇమాని భూతాని జాయన్తే** ఎవని నుండి ఐతే ఈ ప్రాణులు అన్నీ పుడుతూ ఉన్నవో అని. ఈ తీరుగా చేతనుడితో కూడిన జగత్తు పుడుతూ ఉన్నదని చెప్పబడుతున్నందువలన జీవుడికి కూడా పుట్టుక ఉన్నదనియే తోస్తున్నది. ఐతే ఇట్లా మీరు అనబోవద్దు. ఏమని? బ్రహ్మ నిత్యమైనవాడు కాబట్టి తత్త్వమసి ఇత్యాది వాక్యాలవల్ల జీవుడికి బ్రహ్మత్వము ఉన్నది అని తెలుస్తున్నందువలన జీవుడు నిత్యుడు అని. అదే నిజమైతే ఒక్క జీవుడికేం ఖర్మ? **ఐతదాత్మమిదంసర్వమ్, సర్వం ఖల్విదం బ్రహ్మ** ఇటువంటి వాక్యాల ద్వారా వియదాదులు కూడా బ్రహ్మ స్వరూపాలే అని తెలుస్తున్నాయి కాబట్టి అచేతనాలైన ఆకాశాదులు కూడా నిత్యాలే కావలసి వస్తుంది. కనుక జీవుడు కూడా వియదాదుల వలె పుడుతూ ఉన్నాడు అని పూర్వపక్షము ఎదురుపడితే చెపుతూ ఉన్నారు. నాత్మాశ్రుతేః – ఆత్మ పుట్టదు అట్లాగని శ్రుతి చెపుతున్నది. **నజాయతే మ్రియతేవా విపశ్చిత్** జ్ఞాని ఐన జీవుడు పుట్టడం లేదు. చావడమూ లేదు. **జ్ఞాజ్ఞౌద్వావజౌ.** ప్రాజ్ఞుడైన పరమాత్మ అజ్ఞుడైన జీవాత్మ ఇద్దరున్నూ పుట్టుకలేనివారే ఇత్యాది వాక్యాలద్వారా జీవుడి పుట్టుక నిషేధింపబడుతూ ఉన్నది. ఆత్మకు నిత్యత్వము ఆ శ్రుతులవల్లనే తెలుస్తున్నది. **నిత్యోనిత్యానాం చేతనశ్చేతనానాం ఏకోబహూనాంయోవిదధాతి కామాన్.** నిత్యులకు నిత్యుడు ఐనవాడు. చేతనులకు చేతనము ఐనవాడు. చాలామందికి తానొక్కడే కోరిన కోరికలనన్నింటినీ తీరుస్తున్నవాడు. **2) అజోనిత్యః శాశ్వతోఽయంపురాణోన హన్యతే హన్యమానే శరీరే** పుట్టుకలేనివాడు. ఎల్లపుడూ ఉండేవాడు. మార్పులు

చేర్పులు లేకుండా స్థిరంగా ఒక్క తీరుగా ఉంటూన్నవాడు. అతిప్రాచీనమైనవాడే ఐనా నిత్యనూతనుడే. ఈ శరీరము నశింపచేయబడుతూ ఉన్నా అందులో ఉన్న ఇతడు మాత్రము చంపబడడు. ఇత్యాది వాక్యాల ద్వారా కావున ఆత్మ పుట్టింపబడదు. ఐతే ఏకవిజ్ఞానము ద్వారా అన్నింటిని గురించీ తెలుస్తుంది అనే ప్రతిజ్ఞ ఎట్లాగా యధార్థము అవుతుంది? అని అంటున్నావా? ఇదిగో ఇట్లాగా పొసగుతుంది. జీవుడు కూడా బ్రహ్మ కార్యమే కదా! ఐనప్పుడు కార్యకారణాలు వేరు కావు కనుక సర్వవిజ్ఞానప్రతిజ్ఞ చక్కగా అతుకుతుంది. ఐనప్పుడు ఆకాశాదుల వలె పుట్టుక కలవాడు. జీవుడు అనే మాటను ఒప్పుకున్నట్లే అవుతుంది కదా! అని అనవచ్చును. కానీ అట్లా సంభవించదు. కార్యము అంటే ఒక ద్రవ్యము మరొక అవస్థ / దశను పొందడమే కదా! ఆవిధంగా మరొక అవస్థను పొందడము జీవుడికి కూడా ఉండనే ఉన్నది. ఐతే గమనించవలసిన విశేషము ఇది – ఆకాశము వంటి అచేతన పదార్థాలకు ఏవిధమైన అన్యధాభావము – మరొక వస్తువు అనబడేవిధమైన మార్పు కలుగుతున్నదో అటువంటిది మాత్రము కాదు జీవుడిది. జీవుడిలో ఉండే జ్ఞానము సంకోచము – తగ్గడము – పెరుగడము – వికాసములు ద్వారానే అన్యధాభావం ఏర్పడుతున్నది. ఆకాశాదులు మాత్రము స్వరూపములో అన్యధాభావాన్ని పొందుతున్నాయి. ఆ విధమైన స్వరూప అన్యధాబావం కలుగడం అనే ఉత్పత్తి జీవుడికి లేదు అని ఇక్కడ నిషేధింపబడుతూ ఉన్నది. స్వభావ అన్యధాభావము మాత్రము ఉంటున్నది.

కాగా చెప్పబడుతున్న సంగతి ఇది – భోగ్యము (ప్రకృతి) భోక్త (జీవుడు) నియన్త (ఈశ్వరుడు) లను వేరువేరు స్వభావాలు కలవారిని ప్రతిపాదించి భోగ్యమైన ప్రకృతిలో ఉండే ఉత్పత్తి మొదలైనవాటిని భోక్తలో లేవని నిషేధించినారు. దానితోపాటు నిత్యత్వాన్ని కూడా ప్రతిపాదించినారు. భోగ్యము ఐన పదార్థములో ఉండే ఉత్పత్తి వినాశాలను, భోక్తలో ఉండే అపురుషార్థాశ్రయత్వాన్ని – దోషాలు కల్గి ఉండడాన్ని – నియన్తఐన ఈశ్వరుడిలో లేదని నిషేధించినారు. ఆ నియన్త నిత్యుడు, నిరవద్యుడు, ఎల్లపుడూ సర్వజ్ఞత కలవాడు, సత్య సంకల్పుడు కరణ + అధిప + అధిపుడూ అని (ఇంద్రియాలు ప్రకృతి + వాటిపై పెత్తనము కలిగి అనుభవించేవాడు. జీవుడు + ఈ ఇద్దరినీ శాసించే అధిపుడు పరమాత్మ) విశ్వమంతటికీ పరమాత్మనే అధిపతి అనిన్నీ ప్రతిపాదించి, సూక్ష్మ స్థూలావస్థలలోనూ ఉంటున్న చిదచిత్తులు రెండూ ఆయన శరీరములు అని, ఆయనేమో ఈ రెండింటికీ ఆత్మ అని ప్రతిపాదించినారు.

కనుక ఎల్లవేళల్లోనూ చిదచిద్ వస్తువులను శరీరముగా కల్గి ఉంటున్న పరబ్రహ్మ వాటిని తనకు విశేషణాలుగా కల్గి ఉంటున్నవాడౌతున్నాడు. ఆయన ఒకప్పుడు తన నుండి విడదీయబడినవై ఇది ఫలానా వీడు ఫలానా అని పేర్లతో రూపాలతో వ్యవహరించడానికి వీలుకానంత చిన్నగా ఉన్న చిదచిత్తులను శరీరంగా కల్గి ఉంటాడు. ఇది ప్రళయములోని స్థితి. అప్పుడుపరమాత్మ కారణావస్థలో ఉంటాడు. ఒకానొకప్పుడు వేరు చేయబడి అప్పుడు నామము రూపాలను కల్గి స్థూలంగా – పెద్దగా – దొడ్డుగా – లావుగా ఉన్న చిదచిత్తులను శరీరముగా కల్గి ఉంటాడు. అది కార్యావస్థ. అప్పుడు కారణావస్థలో ఉన్నవాడు కార్యావస్థను పొందినప్పుడు కారణావస్థలో ఉండగా శబ్దస్పర్శాదులు లేని అచిదంశము జీవునికి భోగ్యముగా – అనుభవించదగినదిగా ఉండడము కొరకు శబ్ద స్పర్శరూపరసగంధాదులతో కూడి ఉంటున్నందువల్ల దానికి స్వరూప అన్యధాభావరూపమైన వికారము – మార్పు జరుగుతుంది. ఇక చిదంశము – జీవుడు – తాను వెనుకటి జన్మలో చేసుకున్న కర్మ ఫలాల విశేషాలను అనుభవించడము కోసము దానికి తగినట్లు జ్ఞానవికాస రూపమైన వికారాన్ని పొందుతాడు. ఈ రెండు ప్రకారాలు – విశేషణాలు – తో కూడి ఉన్న నియన్తఐన ఈశ్వరుడు ఆయా అవస్థలలో ఉన్న రెండింటితో కూడి ఉండడము అనే వికారాన్ని కల్గి ఉంటాడు. కారణావస్థలో ఉన్నది కార్యావస్థగా మరొక అవస్థను పొందడము అనే వికారము, ప్రకారాలు ఐన చిదచిత్తులలోనూ ప్రకారి ఐన ఈశ్వరుడిలోనూ సమానంగానే జరుగుతుంది. కనుకనే కారణముఐన ఒకనియొక్క – ఒకదానియొక్క – మరొక అవస్థను పొందడమనే రూపములో ఉన్న వికారము దృష్ట్యా **యేనా శ్రుతం శ్రుతం భవతి** అని చెప్పినట్లు ఏక విజ్ఞానము చేత సర్వవిజ్ఞానము కలుగుతుంది అని ప్రతిజ్ఞ చేసి మట్టి బంగారము వంటివాటిని దృష్టాన్తాలుగా **యథాసోమ్యైకేన** ఇత్యాది వాక్యముతో చూపించినారు. ఈ విధమైన జ్ఞానసంకోచవికాసాలను కల్గించే ఆయా దేహాలతో సమ్బన్ధము, దాన్నుండి వేరుపడడములను తెల్పిడిచేసేటువంటివి జీవుడికి మరణము పుట్టుకలు ఉన్నట్లు తెల్పుతున్నవి **ప్రజాపతిః ప్రజా అసృజత** ఇత్యాది వాక్యాలు. అచిత్ (ప్రకృతి) అంశము వలె స్వరూపములో మార్పు కలుగడం లేదు అని తెల్పునటువంటివి ఉత్పత్తి లేదని చెప్పేవి, నిత్యత్వాన్ని తెలిపిడి చేసేవి అని గుర్తించాలి. అవి **నజాయతేమ్రియతే, నిత్యోనిత్యానాం** మొదలైన శ్రుతులు. స్వరూపము మరొక తీరుగా మారడము, జ్ఞానము యొక్క సంకోచము వికాస రూపము ఐన రెండు రకాల అనిష్ట వికారాలు లేవని తెలిపేవి **సవాఏష మహానజఆత్మాఽజరోఽమరోఽమృతోబ్రహ్మ, నిత్యోనిత్యానాం** ఇత్యాదులు

పరమాత్మకు సమ్బన్ధించినటువంటివి. ఈ ప్రకారంగా ఎల్లప్పుడూ చిదచిద్విశిష్టుడైన బ్రహ్మ సృష్టికి ముందుకాలములో ఒక్కడే ఉన్నాడని నిశ్చయము చేయడమున్నూ నామరూప విభాగములు లేకపోవడం చేతనే కుదురుతున్నది. **తద్ధేదం తర్హి అవ్యాకృత మాసీత్ తన్నామరూపాభ్యాం వ్యాక్రియత** ఆ ప్రళయ కాలములో ఈ ప్రపంచము విడదీయబడనిదిగా ఉండింది. దాన్నే పరమాత్మ నామరూపాలతో వేరుపరచినాడు అని వేదము చెప్పిన వాక్యము ప్రకారమే నామరూప విభాగము చేయబడడము, నామరూప విభాగము చేయబడకపోవడముల వలన నానాత్వము, ఏకత్వములు ఏర్పడుతున్నవి అని చెప్పబడుతున్నది.

ఎవరైతే అవిద్య అనే ఉపాధి వలన బ్రహ్మనే జీవభావాన్ని పొందుతున్నాడు అని అంటున్నారో, ఎవరైతే ఆ ఉపాధి కూడా పరమార్థమే దానివల్లనే బ్రహ్మ జీవుడనబడుతున్నాడని చెపుతున్నారో ఎవరైతే బ్రహ్మ సత్ అని మాత్రమే చెప్పబడుతూ భోక్త భోగ్యనియన్త అనే రూపాలను పొందుతూ మూడు విధాలుగానూ ఉంటున్నాడని పలుకుతూ ఉన్నారో వీరందరూ కూడా అవిద్యా శక్తి, ఉపాధి శక్తి, భోక్తృ భోగ్య నియన్త్ర శక్తులు అన్నీ ప్రళయకాలంలో ఉంటున్నప్పటికీ అపుడు ఒకటే వస్తువు – బ్రహ్మ – మాత్రమే ఉన్నది అని నామరూప విభాగాలు లేకపోవడాన్ని బట్టే నిర్ధారణ చేస్తున్నారు. **వైషమ్య నైర్ఘృణ్యే న సాపేక్షత్వాత్ 2) న కర్మ అవిభాగాదితిచేన్న అనాదిత్వా దుపపద్యతే చాప్యుపలభ్యతేచ** అనే సూత్రాలను ఆధారంగా చేసుకొని జీవులలో భేదాన్ని, వారి కర్మ ప్రవాహము అనాది విశేషము ఉన్నది అని అంగీకరించుతున్నారు. ఇక్కడొక విశేషము ఉన్నది – ఒకని పక్షములో అనాది ఐన అవిద్య కారణంగా బ్రహ్మ గారు తామే స్వయంగా మోహపరవశుడు అవుతున్నారు. (మోహము – అజ్ఞానము – తెలియకపోవడము) ఇంకొకాయన పక్షములో పారమార్థికము (కల్పితముకానిది, నిజమైనది) అనాదిఐన ఉపాధిచేత బ్రహ్మ స్వయంగా కట్టుబడుతున్నాడు. కారణము ఏమిటంటే ఉపాధితో కూడిన బ్రహ్మ కంటే వేరుగా మరొక వస్తువు లేదు కాబట్టి. ఇంకా ఒకాయన పక్షములో బ్రహ్మనే విచిత్రాకారాలుగా పరిణామాలను మార్పులను పొందుతున్నాడు. తనకు నచ్చని కర్మ ఫలాలను అనుభవించుతున్నాడు. బ్రహ్మనియన్త ఐనప్పటికీ, భోక్తృత్వమూ లేకపోయినా సర్వజ్ఞుడు ఐన తనకంటే వేరుకానటువంటి భోక్తనుగా తననే భావించుతున్నాడు కాబట్టి స్వయంగానే కర్మఫలాలను భుజిస్తున్నాడు. ఇక మా పక్షములోనయితే సూక్ష్మ, స్థూల అవస్థలలో ఉన్న చిదచిద్వస్తువులను తనకు

శరీరముగా కల్గి ఉన్న బ్రహ్మ తాను కార్యకారణాలు అనే రెండు అవస్థలలో ఉన్నప్పటికీ సర్వదా ఎట్లాంటి దోషాల వాసన లేని వాడు గాను, సత్యసంకల్పత్వము మొదలుగా గల అపరిమితమైన గుణాలకు సముద్రము వంటివాడు గానూ అయ్యే ఉంటున్నాడు. తనకు ప్రకారాలు – విశేషణాలు ఐన చిదచిద్వస్తువులలో ఉండే అపురుషార్థాలు, స్వరూపము మరొక విధంగా మార్పును పొందడమనేవి వాటికే జీవుడికే, శరీరానికే (ప్రకృతికే) చెందుతాయి కనుక పరమాత్మ పరిశుద్ధుడుగానే ఉంటున్నాడు. **ఇది ఆత్మాధికరణము.**

★ ★ ★

## ఇక జ్ఞాధికరణము.

సూ॥ **జ్ఞోఽత ఏవ. 2–3–19** ఈ జీవుడు జ్ఞాతనే అవుతున్నాడు. వట్టి జ్ఞానము కాదు. అట్లాగని శ్రుతివేదము చెప్పుతున్నది కాబట్టి. ఇంతకుముందు ఆకాశాదుల వలే జీవుడు పుడుతూ లేడు అని చెప్పబడింది. ఆ సందర్భంగా జీవుని స్వరూపము నిరూపింపబడుతున్నది. బుద్ధుడు కపిలుడు అంగీకరించినట్లు కేవలం జ్ఞానమే ఆత్మ యొక్క స్వరూపమా? లేక కాణాదుడు ఒప్పుకున్నట్లు చట్టుబాయి వలె ఉండి జడపదార్థము వంటి స్వభావాన్ని కలిగి ఉండి ఏదో ఒక కారణాన వచ్చిపడిన ఆగన్తుక చైతన్యగుణము కలవాడా! ఇదేదీ కాకపోతే జ్ఞాతృత్వము – జ్ఞానాన్ని కల్గి ఉండడము, మరొక మాటలో చెప్పాలంటే జ్ఞానానికి ఆశ్రయమై ఉండడమే స్వరూపమా? అని సంశయము కలుగుతున్నది. ఇందులో ఏది సరిఐనది? అని అంటే! కేవల జ్ఞానమే – చిన్మాత్రమే అని అంటాము. ఎందువల్లనంటే అట్లాగని శ్రుతి చెప్పుతున్నది కాబట్టి. అన్తర్యామి బ్రాహ్మణములో **య ఆత్మని తిష్ఠన్** అనే మాధ్యన్దిన పర్యాయానికి స్థానములో **యోవిజ్ఞానేతిష్ఠన్** అని కాణ్వశాఖకు చెందినవారు పఠించుతున్నారు. అదే విధంగా **విజ్ఞానం యజ్ఞమ్ తనుతే కర్మాణి తనుతేఽపిచ** అనిన్నీ కర్త ఐన ఆత్మయొక్క స్వరూపము విజ్ఞానమే అని వినిపిస్తున్నది? ఇంకా స్మృతులలో కూడా **జ్ఞానస్వరూపమత్యన్తనిర్మలం పరమార్థతః** ఇత్యాదుల యందు ఆత్మకు జ్ఞానమే స్వరూపము అని తెలియవస్తున్నది.

కాణాదమతానుసారి ఇట్లా పలుకుతున్నాడు – జీవాత్మకు జ్ఞానం లేక జ్ఞాతృత్వము స్వరూపము అని, అది స్వాభావికమే అని ఒప్పుకున్నట్లైతే అతడు అంతటా ఉండేవాడు గనుక ఎల్లవేళల్లో ఎల్లచోట్లలోనూ ఉపలబ్ధి – ఉండుట, లభించుట – జరుగవలసి ఉంటుంది. అటువంటప్పుడు ఇంద్రియాలతో అవసరమే ఉండక అవి

వ్యర్థము కావలసి వస్తుంది. ఇంకా గాఢనిద్ర పోయినప్పుడు, మూర్ఛ పొందినప్పుడున్నూ ఆత్మ (జ్ఞానస్వరూపము) ఉంటూ ఉన్నప్పటికీ చైతన్యము – స్పృహ/ తెలివి – ఉండడము లేదు. మరియు మెలకువతో ఉన్నవానికి ఐనా సాధనాలు ఐన ఇంద్రియాలు చక్కగా పనిచేస్తుంటేనే జ్ఞానము పుడుతున్నది కాబట్టిన్నీ జీవుడికి జ్ఞానము స్వరూపము కాదు. జ్ఞాతృత్వమూ కాదు. చైతన్యము మధ్యలో వచ్చిపడేదే. ఐతే ఆత్మ అన్నిచోట్లలో ఉంటున్నది అని తప్పక అంగీకరించవలసి ఉన్నది. ఎక్కడ ఉన్నా జ్ఞానకార్యమైన బుద్ధి సుఖదుఃఖాదులు కలుగడం మనం చూస్తూనే ఉన్నాము. దీన్నిబట్టి అంతటా ఆత్మ ఉన్నదని అంగీకరించుతున్నాము. ఆత్మ విభువు ఐనపుడు ఇవన్నీ సాధ్యమవుతవి. అట్లాకాక పోయినప్పుడు శరీరమే ఆయా ప్రదేశాలకు పోవడంతో కావలసినది పూర్తి అవుతుండగా గతి – గమనము అనే దాన్ని కల్పించుకుంటే అందుకు ప్రమాణము ఏదీ ఉండబోదు. వేదము కూడా సుషుప్తి – గాఢ నిద్ర – కాలములో జ్ఞానము ఉండదు అని చెపుతున్నది. **నాహఖల్వయమేవం సంప్రతి ఆత్మానంజానాతి అయమహమస్మీతి. నోఏవేమానిభూతాని.** ఆ వేళలో నేను ఇటువంటివాడిని అని ఇతడు ఎరుగడు. ఈ ప్రక్కన ఉన్నవి ఈ రకమైన భూతాలు అనినీ్న ఎరుగడు అని. అదేవిధంగా మోక్షము వచ్చిన దశ యందున్నూ జ్ఞానము ఉండదు అనియే చూపుతూ ఉన్నది. **నప్రేత్య సంజ్ఞాఽస్తి.** ఈ శరీరాన్ని విడిచిపోయిన తరువాత జ్ఞానము లేదు అని. జ్ఞానస్వరూపము ఆత్మ ఇత్యాది ప్రయోగాలు ఏవైతే ఉన్నాయో అవి జ్ఞానానికి ఉండే అసాధారణగుణము కావడం వల్ల లాక్షణికమే అని వైశేషికుడు చెప్పినాడు.

ఈ విధంగా పూర్వపక్షము ఏర్పడితే దానికి సమాధానము చెప్పుతున్నాము జ్ఞోఽత ఏవ అని. జ్ఞఏవ – ఈ ఆత్మ జ్ఞాతృత్వ స్వరూపము కలవాడే. వట్టి జ్ఞానము కాదు. పోనీ జడ స్వరూపుడూ కాదు. ఎందువల్లనంటే అత ఏవ. ఈ శ్రుతి చెప్పుతున్నది కనుక. **నాత్మాశ్రుతేః** అని ప్రకృతమైన శ్రుతి అతశ్శబ్దముతో పరామర్శ చేయబడుతున్నది. అట్లాగే ఛాందోగ్య శ్రుతిలో ప్రజాపతి వాక్యము నందు ముక్త – అముక్త ఆత్మ స్వరూపాన్ని గురించి చెపుతున్నప్పుడు **అథయోవేద ఇదంజిఘ్రాణి ఇతి స ఆత్మా.** ఇక ఎవడైతే ఈ వాసనను పీల్చుతున్నాను. తెల్పుకుంటున్నాను. అనే జ్ఞానాన్ని కలిగి ఉంటున్నాడో వాడు ఆత్మ. **మనసైవేతాన్ కామాన్ పశ్యన్ రమతేయ ఏతేబ్రహ్మలోకే.** బ్రహ్మ లోకము నందు ఎవరైతే ఉంటున్నారో వారు తమ మనస్సులతోనే – ఇంద్రియాలతో అక్కరలేకుండా – కామములను – కోరిన వాటిని చూస్తూ ఆనందపడుతున్నారు. **సత్యకామః సత్య**

**సంకల్పః. నోపజనంస్మరన్నిదం శరీరమ్** ఈ శరీరాన్ని దీని చుట్టూ మూగి ఉన్న జనాన్ని కూడా తలువకుండా. మరొక ఉపనిషత్తులోనూ **న పశ్యోమృత్యుం పశ్యతి** జ్ఞానము కల్గి భగవదుపాసన చేసి ఆయనను సందర్శించుకున్నవాడు మృత్యుదేవతను – సంసారాన్ని తిరిగి చూడడు. ఇదే విధంగా వాజససనేయకములోనూ – **కతమ ఆత్మా** ఆత్మ ఎవరు? అని అడిగి **యోஉయం విజ్ఞానమయః ప్రాణేషు హృదిఅన్తర్ జ్యోతిః పురుషః** ఇంద్రియాల యందు విజ్ఞానమయుడుఐ హృదయము నందు జ్యోతి స్వరూపాన్ని కలిగి ఉన్న పురుషుడు ఉన్నాడో అతడు అని. **తథావిజ్ఞాతారమరేకేనవిజానీయాత్** అట్లాగే విజ్ఞానము కలవాడిని దానితో తప్ప మరి దేనితో తెల్సుకోగల్గుతాము. **జానాత్యేవాయం పురుషః** ఈ పురుషుడు తెలుసుకుంటూనే ఉన్నాడు. ఇంకా **ఏషహిద్రష్టా శ్రోతా ఘ్రాతారసయితా మన్తాబోద్ధాకర్తావిజ్ఞానాత్మాపురుషః** ఇతడు కదా చూచేవాడు. వినేవాడు వాసన చూచేవాడు. రసాన్ని చప్పరించి గ్రహించేవాడు. తలచుకొనేవాడు. తెల్సుకొనేవాడు. చేసేవాడు. విజ్ఞానమేస్వభావముగా గలట్టి పురుషుడు. **ఏవమేవాస్య పరిద్రష్టు రిమాః షోడశకలాః** లోతుగా పరిశీలించి చూచే ఇతనికి ఇటువంటివే పదహారు కళలున్నూ అని.

జ్ఞాతృత్వము స్వాభావికము ఐతే అంతటా నిండి ఉన్న ఆ జీవుడు అన్నిచోట్లా అందుబాటులో ఉండవలసివస్తుంది అని ఏ మాట అన్నారో దాని గురించి చెపుతున్నారు.

సూ॥ **ఉత్క్రాన్తి గత్యాగతీనామ్. 2-3-20** శరీరములో నుంచి లేచిపోవడము, ఉన్నత లోకాలకు పోవడము తిరిగి వెనుకకు మరో శరీరంలోకి రావడము మొదలైనవాటివలన ఆత్మ విభువు / అంతటా వ్యాపించి ఉండేదికాదు. ఈ ఆత్మ స్వరూపము కాదు. కాని అణువంతటిదే. ఎందువల్లనంటే ఉత్క్రాన్తి గత్యాగతులు వినిపిస్తున్నాయి కాబట్టి. ఉత్క్రాన్తి ఇట్లా వినిపిస్తున్నది. **తేనప్రద్యోతేనైషఆత్మానిష్క్రామతి చక్షుషో వా మూర్ధ్నోవా అన్యేభ్యోవా శరీరదేశేభ్యః** ఆ హార్దపురుషుడు చూపిన వెలుతురు ద్వారా ఈ ఆత్మ కండ్లలో నుండి గానీ బ్రహ్మ రన్ధ్రము నుండి గానీ లేక శరీరములోని ఇతర ప్రదేశాలనుండిగానీ లేచిపోతున్నాడు. అని ఇక గతి కూడా! **యేవైకే చాస్మాత్ లోకాత్ ప్రయన్తి చన్ద్రమసమేవతేసర్వేగచ్ఛన్తి.** ఎవరైతే ఈ లోకాన్ని విడిచి పోతారో వారు అందరున్నూ చంద్రుని వద్దకే పోతారు అని ఇంక ఆగతి – రావడము కూడా – **తస్మాల్లోకాత్ పునిరేత్యస్మై లోకాయకర్మణే** ఆ లోకాన్నుండి తిరిగి

ఈ కర్మలోకానికి వస్తాడు అని. అదే ఆత్మవిభువు గనుక అయ్యేట్లుంటే ఈ ఉత్క్రాన్తిగతి ఆగతులు ఉండవు. పొసగవు కూడాను.

సూ॥ **స్వాత్మనా చోత్తరయోః 2-3-21** గమనాగమనములు – రాకపోకలు తన ఆత్మచేతనే సమ్పాదించుకోవలసి ఉంటుంది. సూత్రములోని చశబ్దము అవధారణార్థములో ప్రయోగింపబడింది. శరీరాన్ని విడిచిపెట్టడమనే రూపంలో ఉత్క్రాన్తి స్థిరంగా ఒక దగ్గర / ఒక ప్రదేశంలో ఉండే ఆత్మకు ఎట్లాగైనా కుదురవచ్చును కానీ రాకపోకలు – గత్యాగతులు మాత్రము ఎట్టి పరిస్థితుల్లోనూ పొసగవు. కనుక అవి స్వాత్మనా – తనదైన ఆత్మతో మాత్రమే సంపాదించుకోవలసి ఉంటవి.

సూ॥ **నాణుః అతత్ శ్రుతేరితిచేన్న ఇతరాధికారాత్ 2-3-22** జీవుడు అణువంతటివాడు కాడు. ఆ విధంగా శ్రుతి చెప్పడంలేదు అని అంటేకాదు మహత్త్వము ఇతరునికి – పరమాత్మకు చెందినది కదా! **యోఽయంవిజ్ఞానమయఃప్రాణేషు** అని జీవుడిని గురించి ప్రస్తావమును చేసి **సవా ఏషమహానజ ఆత్మా** అతడే కదా ఈ మహత్త్వము కలవాడు పుట్టుకలేని వాడు ఐన ఆత్మ అని మహత్త్వము వినిపిస్తున్నందున జీవుడు అణువంతటి వాడు కాడు అని అనేటట్లయితే కాదని చెపుతున్నాము. ఇతరాధికారాత్ – జీవుడి కంటే వేరయిన ప్రాజ్ఞుడగు పరమాత్మకు మాత్రమే మహత్త్వమునందు ప్రస్తావము ఉన్నది కాబట్టి. ఒకవేళ ఆరంభములో జీవుడిని గురించి ప్రస్తావనము చేసినా **యస్యానువిత్తః ప్రతిబుద్ధఆత్మా** ఏ జీవుడికి ఉపాస్యుడైనవాడు ప్రాజ్ఞుడైన ఆత్మయే. అని నడుమ పరమాత్మ ప్రతిపాదింప బడుతున్నాడు కనుక ఈ మహత్త్వము ఆయనకు సమ్బన్ధించినదే కాని జీవుడిది కాదు.

సూ॥ **స్వశబ్ద ఉన్మానాభ్యాంచ 2-3-23** జీవుడి విషయంలో సూటిగా అణుశబ్దము వినిపిస్తున్నది. మరియు అతని పరిమాణాన్ని పోల్చిచెప్పడం జరిగింది కూడాను. జీవుడి విషయంలో సాక్షాత్తుగా అణు శబ్దమే వినిపిస్తున్నది. **ఏషోఽణురాత్మా చేతసావేదితవ్యోయస్మిన్ ప్రాణః పంచథా సంవివేశ.** ఈ ఆత్మ యందు ప్రాణము ఐదు విధాలుగా ప్రవేశించి ఉన్నదో అని. ఉద్ధృత్యమానమ్ ఉన్మానమ్ పైకి ఎత్తి పోల్చి చెప్పడము. నిర్ధారించడము. అణువుతో సమానమైన వస్తువును పైకి ఎత్తి చూపి అంతటివాడు అని జీవుడిని గురించి చెప్పడము కనిపించుతున్నది. **వాలాగ్రశతభాగస్య శతధాకల్పితస్యచ। భాగోజీవః సవిజ్ఞేయః** వెంట్రుక కొసను / వడ్లగింజ యొక్క చివరలో ఉండే ముల్లును వంద భాగాలుగా చేసి దానిలో ఒక భాగాన్ని తిరిగి నూరు

భాగాలుగా చేస్తే అందులో ఒక్క భాగము అంతగా జీవుడు ఉంటున్నాడు అని, **ఆరాగ్రమాత్రోహ్యవరోఽపిదృష్టః** ఆరము యొక్క కొసవలె చిన్నగా ఉండెడు వాడొక చిన్నవాడు కూడా చూడబడినాడు. అనికూడా. కనుక ఈ ఆత్మ అణువంతటివాడే. ఐతే ఇట్లా అనవచ్చును. ఆత్మ అణువంతటి వాడైనప్పుడు శరీరమంతటా వ్యాపించే నొప్పి కుదరదు అని. దానికి మరొకరీతిగా పరిహారమును చెప్పుతున్నాడు.

సూ॥ **అవిరోధః చన్దన వత్ 2–3–24** చందనము వలె విరోధము ఉండదు. హరిచన్దనము యొక్క బిందువు దేహములో ఏదో ఒక భాగము నందు ఉన్నప్పటికీ శరీరమంతటా ఉండే ఆహ్లాదాన్ని ఎట్లా కలిగిస్తున్నదో ఆ విధంగానే దేహంలోని ఒక ప్రదేశములో ఉంటున్నా సకల దేహము నందూ ఉండే వేదనను అనుభవిస్తున్నాడు జీవుడు.

సూ॥ **అవస్థితివైశేష్యాదితిచేన్న అభ్యుపగమాద్హృదిహి 2–3–25** అవస్థితి విశేషము వలన అట్లా జరుగుతున్నది అని అంటేకాదు. ఆత్మ కూడా దేహములోని ఒకానొక ప్రదేశములో ఉంటున్నది అని ఒప్పుకున్నారు కాబట్టి. హరిచందనబిందువు మొదలైనవి దేహములోని ఒకానొక దేశము నందు ఉండడమువల్ల ఆ విధమైన ఆహ్లాదము కలుగుతున్నది. ఆత్మకు ఒకచోట ఉండడము సర్వత్రా వ్యాపించడము లేదు అని అనకూడదు. ఆత్మకు కూడా దేహములోని ఒకానొక ప్రదేశములో స్థితిని /ఉండుటను ఒప్పుకున్నారు కదా! హృదయప్రదేశము నందు ఆత్మ ఉంటున్నది అని వేదములో వినిపిస్తున్నది. **హృదిహ్యయమాత్మాత్ర ఏకశతంనాడీనామ్.** ఈ ఆత్మ హృదయములో ఉన్నాడు. అక్కడ ఒక వందనాడులు కలుస్తున్నవి అని. అట్లాగే **కతమ ఆత్మా** ఎటువంటివాడు ఆత్మ అని ప్రారంభించి **యోఽయం విజ్ఞానమయః ప్రాణేహృద్యన్తర్జ్యోతిః.** విజ్ఞానమయుడు ఐన ఈ పురుషుడు ప్రాణాలతో కలసి హృదయములోపల దీపము వలె వెలుగుతూ ఉన్నాడు అని. ఆత్మ దేహము యొక్క విశేషప్రదేశములో ఉంటున్నాడనే విషయాన్ని తెలుపడానికి చన్దనము యొక్క దృష్టాన్తము చూపబడింది. కానీ చన్దనానికి ఫలానా ప్రదేశములోనే ఉండాలనే నియమం ఏమీ లేదు.

దేహములో ఒక ప్రదేశములో ఉంటున్నవాడు దేహమంతటా వ్యాపించే పనులను చేయగలిగే ప్రకారాన్ని తన మతము ప్రకారము చెప్పుతున్నాడు.

సూ॥ **గుణవద్వా ఆలోకవత్ 2-3-26** ఆత్మ తనదైన గుణము జ్ఞానముతో శరీరమంతటా నిండి ఉన్నాడు. వెలుతురు వలెనే. సూత్రములోని వాశబ్దము ఇతరుల మతాన్ని తిప్పికొట్టడానికి ప్రయోగించినారు. ఆత్మ తన గుణమైన జ్ఞానముతో దేహమంతటా వ్యాపించి ఉన్నాడు. వెలుతురు వలెనే. మణి సూర్యుడు మొదలైన వస్తువులు ఎక్కడో ఒక ప్రదేశములో ఉన్నా తమ వెలుతురు ద్వారా అనేక ప్రదేశాలలో వ్యాపించి ఉన్నట్లు కనిపిస్తున్నది ఆ విధంగానే హృదయంలో ఉన్న ఆత్మయొక్క జ్ఞానమనే గుణము శరీరమంతటా నిండి ఉంటున్నది. జ్ఞాతఐన ఆత్మ కాన్తికి నెలవు ఐనవాడు. అతని జ్ఞానము తాను ఉండే చోటికి మాత్రమే పరిమితము కాకుండా తనకు ఆశ్రయమైన స్థానాన్నించి మిగతా చోట్లలో ఉండడము మణి దానియొక్క కాన్తివలె చక్కగా కుదురుతుంది అని మొదటి సూత్రములో నిరూపించినాము.

ఔనండీ! జ్ఞానము మాత్రమే ఆత్మ అని చెప్పినాము కదా! అటువంటప్పుడు జ్ఞానాన్ని స్వరూపము కంటే వ్యతిరేకంగా గుణము అని చెప్పడము ఎట్లా పొసగుతుంది? అని అంటే చెప్తున్నాడు.

సూ॥ **వ్యతిరేకో గన్ధవత్. తథా చ దర్శయతి 2-3-27** భూమికి వ్యతిరేకంగా వేరుగా గన్ధము ఎట్లా ఉంటున్నదో అట్లాగే ఆత్మకు వ్యతిరేకంగా విడిగా జ్ఞానము అనే గుణము ఉన్నది. ఆ విషయాన్నే వేదము చూపుతున్నది. భూమి కంటే వేరుగా దాని గుణముగా కనిపించే వాసన ఎట్లా ఉంటున్నదో ఆ విధంగానే జానామి తెలుసుకుంటున్నాను అని జ్ఞాత ఐన వానియొక్క గుణముగా కనిపించే జ్ఞానము అతడికంటే వేరుగా కనిపిస్తున్నది. వేదము కూడా దానినే వినిపిస్తున్నది. **జానాత్యేవాయం పురుషః.** ఈ పురుషుడు తెలుసుకుంటూనే ఉన్నాడు అని.

సూ॥ **పృథక్ ఉపదేశాత్ 2-3-28** విడిగా చెప్పినందువలన. విజ్ఞానము అనే గుణము తనకు వాచకమైన శబ్దముతో విడిగా ఉపదేశింప బడుతున్నది. **నహి విజ్ఞాతుః విజ్ఞాతేః విపరిలోపో విద్యతే** విజ్ఞానము కలవాడైన ఆత్మ యొక్క విజ్ఞానము బొత్తిగా లేకుండా పోవడం కనిపించడం లేదు అని.

**యోవిజ్ఞానేతిష్ఠన్, విజ్ఞానం యజ్ఞంతనుతే, జ్ఞానస్వరూపమత్యన్తనిర్మలమ్** ఇత్యాది వాక్యాలలో జ్ఞానమే ఆత్మ అని చెప్పబడుతున్నది కదా! ఐనప్పుడు మీరు వేరువేరు అని చెప్పడం ఎట్లా కుదురుతుంది? అని అంటే చెపుతున్నాడు.

సూ॥ **తద్ గుణసారత్వాత్తు తద్వ్యపదేశః ప్రాజ్ఞవత్ 2-3-29** విజ్ఞానగుణమే సారముగా కల్గి ఉన్నందువల్ల ఆత్మను విజ్ఞానమని అంటున్నాము. ప్రాజ్ఞుడిని వలెనే. తుశబ్దము చోద్యమును తిప్పికొడుతున్నది. తద్ గుణసారత్వాత్ విజ్ఞానగుణమే సారము ఐనందువల్ల ఆత్మను విజ్ఞానము అని పిలుస్తూ ఉన్నాము. ఆత్మకు విజ్ఞానమే సారము వంటి దైన గుణము. ఎట్లాగంటే? ప్రాజ్ఞునికి (పరమాత్మకు) ఆనందము సారమైన గుణము. దాన్ని బట్టి ఆ పరమపురుషుడిని ఆనందము శబ్దముతో వ్యవహరించుతూ ఉన్నాము. **యదేషఆకాశ ఆనందో నస్యాత్** ఈ ఆకాశము అనే, బాగావెలిగేవాడైన ఆనందుడు లేకపోయినట్లయితే. **ఆనందో బ్రహ్మేతివ్యజానాత్** ఆనందమే బ్రహ్మ అని తెల్సుకున్నాడు అని. ప్రాజ్ఞుడికి ఆనందము సారభూతమైన గుణము. **సఏకో బ్రహ్మణ ఆనందః.** అది బ్రహ్మ యొక్క ఒక ఆనంద గుణము. **ఆనందో బ్రహ్మణోవిద్వాన్ నబిభేతి కుతశ్చన.** బ్రహ్మయొక్క ఆనందాన్ని తెల్సినవాడు దేనివల్లనూ భయపడడు అని. **సత్యంజ్ఞానమనన్తంబ్రహ్మ** అని విపశ్చిత్ ఐన ప్రాజ్ఞుడికి ఏ జ్ఞాన శబ్దముతో పేరు ఉన్నదో అట్లాగే జీవుడికి కూడా! **సహబ్రహ్మణా విపశ్చితా** విపశ్చిత్ ఐన బ్రహ్మతో కలసి **యః సర్వజ్ఞః** ఎవడు అన్నీ తెల్సినవాడో ఇటువంటి వాక్యాలలో ప్రాజ్ఞుడికి జ్ఞానము సారమువంటిదైన గుణమని తెలుస్తున్నది.

సూ॥ **యావదాత్మ భావిత్వాచ్చ నదోషః తద్దర్శనాత్ 2-3-30** విజ్ఞానము ఈ శరీరములో ఆత్మ ఉన్నంతవరకూ ఉండే గుణము ఐనందువల్ల అట్లా పిలువబడటంలో తప్పేమీ లేదు. అట్లాగా కనిపించుతున్నది కాబట్టి. విజ్ఞానము యావదాత్మభావిధర్మము కాబట్టి దాన్ని పురస్కరించుకొని ఆవిధంగా పిలువడంలో తప్పు లేదు. కొమ్ములు విరిగిన గోవు మొదలైనవి వాటిలోఉండే గోత్వాది ధర్మాలను బట్టి వాటికి ఆ స్వరూపమునిల్చి ఉన్నంతకాలము గోవు అనే శబ్దాదులతో వ్యవహరింపబడ్తూ కనిపిస్తున్నవి అది వాటి యొక్క స్వరూపాన్ని నిరూపించే ధర్మము అవుతున్నది కాబట్టి. సూత్రములోని చకారాన్ని బట్టి జ్ఞానము వలెనే ఆత్మ కూడా స్వప్రకాశము ఐనందువల్ల జ్ఞానమని పిలిస్తే దోషము లేదని కలిపి చెప్పుతున్నాడు.

సుషుప్తి మూర్ఛ మొదలైన అవస్థలలో జ్ఞానము కనిపించడము లేదు. కాబట్టి జ్ఞానము స్వరూపానికి అనుబన్ధము ఐన ధర్మము కాదు అని అన్న విషయములో చెపుతున్నాడు.

సూ॥ **పుంస్త్వాదివత్తు అస్యసతో అభివ్యక్తి యోగాత్ 2-3-31** జ్ఞానము పురుషుడిలోని పుంస్త్వము వలె ఉన్నదే ఐనా కొన్ని సందర్భాలలో మాత్రమే బయటపడ్తుంటుంది. తు శబ్దము లేవనెత్తిన శంకను తొలగించడం కొరకు ప్రయోగింపబడింది. అస్య – సుషుప్తి మొదలైన దశల్లో ఉంటూ ఉండే ఈ జ్ఞానము మెలకువగా ఉన్న దశలలో వెల్లడి అవుతున్నది కాబట్టి అది స్వరూపముతో ముడిపడి ఉన్న ధర్మమే. పుంస్త్వము వలె. ఎట్లా గంటే పుంస్త్వాదులకు అసాధారణమైన ధర్మము బాల్యావస్థలో ఉన్నప్పటికీ బయటపడకపోయినా యవ్వనము వచ్చినాక బయటపడ్తున్నది కాబట్టి ఆ ధాతువు ఒకానొకప్పుడు మాత్రమే ఉండేది కాదని తెలుస్తున్నది కదా! శరీరము ఏడు ధాతువులతో కూడి ఉంటుండడము అనేది స్వరూపాను బన్ధి ఐన ధర్మము. **తత్ సప్తధాతు త్రిమలం ద్వియోని చతుర్విధా హారమయం శరీరమ్.** ఆ శరీరము ఏడు ధాతువులను కల్గి ఉన్నది. మూడురకాలైన మలములను కల్గినట్టిది. రెండింటివల్ల పుడుతున్నది. నాలుగు విధాలైన ఆహారాలను తీసుకొంటున్నది అని శరీరము యొక్క స్వరూపాన్ని ఆయుర్వేద శాస్త్రము చెపుతున్నది. సుషుప్తి ఆది అవస్థలలో నేను అనబడే అహమర్థము ప్రకాశిస్తూనే / తెలుస్తూనే ఉంటుందని మునుపే చెప్పినాము. ఆ విధంగా ఉంటూ ఉన్న జ్ఞానము విషయములను గ్రహించడము ద్వారా మెలకువ కల్గి ఉన్న దశలలో కనిపిస్తూనే ఉన్నది. ఈ విధమైన జ్ఞాతకు ఉండే ధర్మాలు ఇంతకుముందే ఉపపాదింపబడినాయి. కనుక జ్ఞాతృత్వమే జీవాత్మయొక్క స్వరూపము. అటువంటి జ్ఞాతృత్వధర్మముతో కూడి ఉన్న జీవుడు అణువు అంతటి పరిమాణము కలవాడు. **నప్రేత్య సంజ్ఞాఽస్తి** అనే వాక్యము చేత ముక్తునికి జ్ఞానము ఉండదు అని చెప్పబడడము లేదు. కానీ **ఏతే భ్యో భూతేభ్యః సముత్థాయ తాన్యేవాను వినశ్యతి** అనే వాక్యాన్ని బట్టి సంసారదశలో భూతాలను అనుసరించి ఉండడము వలన కలిగే పుట్టుక చావడం మొదలైనవి కనిపిస్తూ ఉన్నవో అవి ముక్తుడికి లేవు. **నపశ్యోమృత్యుం పశ్యతి న రోగం నోతదుఃఖతామ్. సర్వంహ పశ్యః పశ్యతి సర్వమాప్నోతిసర్వశః** పరమాత్మను జ్ఞానోపాసనల ద్వారా దర్శించుకున్నవాడు మృత్యువును – సంసారాన్ని పొందడు రోగాలను వాటివల్ల కలిగే దుఃఖాలనూ అనుభవించడు. సమస్త ప్రపంచాన్నీ పరమాత్మతో నిండి ఉన్నదిగా దర్శించుకుంటాడు. కోరినదాన్నెల్లా పొందుతాడు. **నోపజనం స్మరన్నిదం శరీరమ్, మనసైతాన్ కామాన్ పశ్యన్ రమతే.** ఇత్యాది శ్రుతివాక్యాలతో ఏకార్థతను పొందుతున్నందువలన.

ఇపుడు జ్ఞానమే ఆత్మ అని వాదించేవారి మతము ప్రకారము ఆత్మ అంతటా వ్యాపించి ఉండే విభువు ఐనప్పుడు కనపడే దోషాలను ఎత్తి చూపుతున్నాడు.

సూ॥ **నిత్యోపలబ్ధి అనుపలబ్ధి ప్రసంగః అన్యతరనియమో వా అన్యథా 2-3-32** ఆత్మ విభువు ఐనపుడు ఎల్లపుడూ అందుబాటులో ఉండడము గానీ లేకపోవడము కానీ లేక రెండూ కలసి గానీ ఏర్పడవలసి ఉంటుంది. లేదా ఏదో ఒకటి ఐనా సంభవించవలసి ఉంటుంది. అన్యథా – ఆత్మ అంతటా ఉంటుంది అనే పక్షములో, అది జ్ఞానము మాత్రమే అనే పక్షములోనూ ఎల్లవేళలా ఉపలబ్ధి, అనుపలబ్ధి కలిసియే లభించుతూ ఉండవలసి ఉంటుంది. అన్యతరనియమోవా – ఉపలబ్ధియే – లభించడము నిత్యము కావలసి ఉంటుంది. లేదా అనుపలబ్ధి ఐనాకానీ నిత్యమూ జరుగవలసి ఉంటుంది. ఇదీ ఇక్కడ చెప్పబడుతున్న విషయము – లోకంలో కనిపిస్తున్న ఆత్మయొక్క ఉపలబ్ధి, అనుపలబ్ధులకు ఈ జ్ఞానాత్మ సర్వగతుడైనవాడు హేతువవుతున్నాడు. అది ఉపలబ్ధికి కానీ అనుపలబ్ధికైనాగాని, రెండింటికీ కారణమయ్యేట్లుంటే ప్రతిచోటా రెండూ ఏర్పడవలసి ఉంటుంది. ఒకవేళ ఉపలబ్ధికే కారణమయ్యేట్లు ఉంటే అందరికీ అన్నివేళల్లో అన్నిచోట్లలో అనుపలబ్ధి – దొరుకకపోవడం ఉండకూడదు. ఇక అనుపలబ్ధికే హేతువైనట్లయితే సర్వదా సర్వత్ర ఉపలబ్ధి కాకుండా ఉండాలి అని. మా పక్షములోనయితే జీవుడు – జ్ఞాత శరీరములో మాత్రమే ఉంటున్నాడు కాబట్టి. ఆత్మ అక్కడ మాత్రమే లభించుతుంది. మరొకచోట లభించదు. కనుక ఒక వ్యవస్థ సిద్ధిస్తుంది. ఎక్కడ ఉన్నా ఎట్లున్నా కరణాలకు – ఇంద్రియాలకు – సరిగా పనిచేస్తున్నవాటికి కనిపించుతాడు అనేట్లయితే ఆత్మలన్నీ అంతటా ఉంటున్నాయి కాబట్టి ఇంద్రియాలన్నిటితో ఎల్లపుడూ కలిసి ఉంటున్నాము కనుక కనిపించుతాడు, కనిపించదు అనే నియమము లేదు కావున ఇంతకుముందు చెప్పిన దోషమే ఇక్కడ కూడా వర్తించుతుంది. కనుక ఆత్మ సర్వగతము అన్నిచోట్లలో ఉండే విభువుకాదు. శరీరములో మాత్రమే ఉంటుంది. **ఇది జ్ఞాధికరణము.**

★ ★ ★

## ఇక కర్త్రధికరణము.

సూ॥ **కర్తా శాస్త్రార్థవత్త్వాత్ 2-3-33** ఆత్మకర్త. ఆయా పనులను చేసేవాడుగా ఉన్నాడు. శాస్త్రము అర్థవన్తము కాబట్టి. ఈ ఆత్మజ్ఞానము కలవాడు జ్ఞాత. అతడు

అణువంత పరిమాణము కలవాడు అని చెప్పబడింది. ఇప్పుడు అతడే కర్తనా? లేకతాను కర్తకాకుండానే అచేతనాలైన గుణాలకున్న కర్తృత్వాన్ని తనయందు ఆరోపించుకుంటున్నాడా? అని విచారింపబడుతున్నది. ఈ రెండింటిలో ఏది తగినది? అని అంటే ఆత్మ కర్త కాదు అనేదే తగినది. ఎందువల్లనంటే ఆత్మ కర్తకాదని గుణాలకే కర్తృత్వము ఉన్నదని అధ్యాత్మ(వేదాన్త) శాస్త్రాలయందు వినిపిస్తున్నది. అది ఇట్లాగా – కఠ ఉపనిషత్తులో జీవుడికి **నజాయతే మ్రియతే** ఇత్యాదివాక్యము ద్వారా పుట్టడము ముసలివాడు కావడం చచ్చిపోవడము మొదలైన ప్రకృతి ధర్మాలను నిషేధించి, చంపడము వంటి క్రియల యందు కర్తృత్వము కూడా నిషేధింపబడింది.

**శ్లో॥ హన్తాచేన్మన్యతే హన్తుంహతశ్చేన్మన్యతే హతమ్। ఉభౌతౌనవిజానీతో నాయం హన్తి నహన్యతే॥** నిజంగా చంపేవాడయితే హన్త అని, చచ్చేవాడే అయినట్లయితే చచ్చినవాడుగానూ తలచవచ్చును. అయితే ఈ హన్తగానీ హతుడుగానీ ఒక విషయాన్ని తెలుసుకోవడం లేదు అది ఏమంటే నేను చంపడం లేదు, నేను చావడం లేదు అని. తనను హంతనుగా భావించుకుంటూ ఆత్మ వస్తువును గురించి తెల్సుకోవడం లేదుఅని అర్థము. ఆ విషయాన్నే భగవన్తుడైన శ్రీకృష్ణుడు ఇట్లాగా చెప్పినాడు. **జీవుడికి అకర్తృత్వమే స్వరూపము. నేను చేస్తున్నాను అని కర్తృత్వాభిమానము మాత్రము వ్యామోహమే** అని **ప్రకృతేఃక్రియమాణానిగుణైః కర్మాణిసర్వశః। అహంకారవిమూఢా త్మాకర్తాऽహమితిమన్యతే॥** ప్రకృతికి చెందిన సత్వము రజస్సు తమస్సు అనే గుణాల చేత చేయబడే కర్మలను అన్నింటినీ కూడా జీవుడు నేను అనే అహంకారముచేత కళ్ళు మూసుకునిపోయి అజ్ఞానముతో నేనే కర్తను అని తలుస్తున్నాడు. **నాన్యం గుణేభ్యః కర్తారం యదాద్రష్టా అనుపశ్యతి** గుణాలకంటే వేరుగా మరొక కర్తను ఎప్పుడైతే చూడడో. **శ్లో॥ కార్యకారణకర్తృత్వేహేతుః ప్రకృతిరుచ్యతే। పురుషః సుఖదుఃఖానాం భోక్తృత్వేహేతురుచ్యతే॥** కార్యము, కారణము, కర్తృత్వాలకు హేతువు ప్రకృతి అని చెప్పబడుతున్నది. పురుషుడు సుఖదుఃఖాలను అనుభవించడములో – భోక్తృత్వము నందు హేతువుగా చెప్పబడుతున్నాడు అనిన్నీ. కనుక పురుషుడికి భోక్తృత్వమే ఉన్నది. కర్తృత్వము మాత్రము ప్రకృతిదే అని పూర్వపక్షము.

ఇట్లా ఎదురైన వాదానికి సమాధానమును చెపుతున్నాము – కర్తా శాస్త్రార్థవత్త్వాత్ అని. ఆత్మనే కర్త గుణాలు కావు. ఎందువల్ల అంటే శాస్త్రము అర్థవంతము కాబట్టి. శాస్త్రాలు **యజేత స్వర్గకామః** స్వర్గాన్ని కోరుకునేవాడు యజ్ఞాన్ని చెయ్యాలి. **ముముక్షుః**

**బ్రహ్మ ఉపాసీత** మోక్షమును కావాలని కోరేవాడు బ్రహ్మను ఉపాసించాలి. ఇటువంటి వాక్యాలు స్వర్గము మోక్షము వంటి ఫలాలను అనుభవించేవాడిని కర్తృత్వము నందు నియోగించుతున్నాయి. కర్మలను చెయ్యమని బోధించుతున్నాయి. అచేతనానికే కర్తృత్వము ఉండేట్లయితే దాన్ని వేరే ఒకడు ఈ పనిచెయ్యి అని శాసించాల్సిన అవసరము లేదు. శాసనము చేస్తుంది కనుక దాన్ని శాస్త్రము అని అంటున్నారు. శాసనము అంటే ప్రవర్తింపచేయడము లేక నడిపించడములేక ఆయా పనులను చేసేటట్లు పురికొల్పడము. శాస్త్రానికి ప్రవర్తకత్వము అనేది బోధ – జ్ఞానాన్ని పుట్టించడం ద్వారా సిద్ధిస్తున్నది. అచేతనమైన ప్రధానానికి బోధించడము వీలుకాదు. కనుక శాస్త్రాలకు అర్ధవత్త్వము చేతనుడైన భోక్తకు కర్తృత్వము ఉన్నప్పుడే దక్కుతుంది. అందుకే **శాస్త్రఫలం భోక్తరి** భోక్తయందే శాస్త్ర ఫలము అన్వయించుతుంది. అని పెద్దలు చెప్పినారు. హన్తా చేత్ మన్యతే ఇత్యాది వాక్యముతో హనన క్రియ యందు ఆత్మకు కర్తృత్వము లేదని వినిపిస్తున్నది అని ఏమాట చెప్పినారో అది ఆత్మ నిత్యమైనందున హన్తవ్యము – చంపబడేది – కానందున చెప్పబడింది కానీ మీ ఉద్దేశ్యము ప్రకారము కాదు. ప్రకృతేః క్రియమాణాని ఇత్యాది వాక్యము ద్వారా గుణాలకు మాత్రమే కర్తృత్వము ఉన్నది అని స్మృతి చెపుతున్నది అని కదా మీరు అంటున్నారు. అది కూడా సాంసారికమైన పోకడలలో ఈ జీవునికి కర్తృత్వము సత్త్వ రజస్తమో గుణాలతో సంసర్గము – కలయిక – వల్ల ఏర్పడినదే. కానీ స్వరూపము కారణంగా కలిగింది కాదు. కనుక ప్రాప్తాప్రాప్తములను సరిగా అన్వయ వ్యతిరేకాలతో నిరూపించి చూచినప్పుడు గుణాలకే కర్తృత్వము ఉన్నది అని చెప్పబడుతున్నది. అట్లాగని భగవద్గీతలోనే చెప్పబడింది. **శ్లో॥ కారణం గుణసంగోఽస్య సదసద్యోనిజన్మసు** మంచీ చెడు జన్మలు కలుగడానికి కారణము గుణాలతో పొత్తు ఉండడమే అని. అట్లాగే ఆ విషయములోనే ఆత్మకు కర్తృత్వాన్ని ఒప్పుకొని ఈ విధంగా చెప్పబడింది. **శ్లో॥ తత్రైవంసతి కర్తారం ఆత్మానం కేవలం తు యః। పశ్యత్యకృతబుద్ధిత్వాత్ న స పశ్యతి దుర్మతిః॥** ఆ విధంగా తాను కర్త అవుతూ ఉంటుండగా తన్ను ఎటువంటి సమ్బన్ధమూ లేని కేవలుడినిగా ఎవడు తలుస్తున్నాడో అతడు స్థిర నిశ్చయాన్ని కల్గి లేనందున దుర్మతి ఐనవాడు వాస్తవాన్ని కనుగొనడం లేదు అని. **శ్లో॥ అదిష్ఠానంతథాకర్తాకరణంచ పృథగ్విదమ్। వివిధాచపృథక్ చేష్టాదైవంచైవా త్రపంచమమ్॥** శరీరము, కర్త ఐన జీవుడు/ పలురకాలైన పనిముట్లు, వాటితో చేసే అనేక విధాలైన పనులు / క్రియలు, దేవుడు

మొత్తము కలిపి ఈ ఐదు ఏపనికైనా జరుగడానికి కారణాలు అవుతున్నారు. ఇవన్నీ కూడినప్పుడే ఏదైనా ఒక పని జరిగి తీరుతుంది. అని అధిష్ఠానము మొదలుకొని దైవము వరకు ఉన్న వాటితో అవసరము తప్పని సరి అయ్యి ఉంటుండగా ఆత్మకు ఉన్న కర్తృత్వం నందు తనను మాత్రమే ఎవడు కర్తగా తలుస్తున్నాడో అటువంటివాడు వాస్తవాన్ని చక్కగా గమనించడం లేదని అర్థము.

సూ॥ **ఉపాదానాత్ విహారోపదేశాచ్చ 2–3–34** ప్రాణాలను స్వీకరించడము, వాటితో కలిపి విహరించడములోనూ కర్తృత్వము చెప్పబడుతున్నందు వలన కూడా! **సయథామహారాజః** అతడు మహారాజుగారివలే అని ఆరంభించి **ఏవమేవైష ఏతాన్ ప్రాణాన్ గృహీత్వాస్వేశరీరేయథాకామం పరివర్తతే** ఇదే తీరుగా ఈ ప్రాణాలను/ ఇంద్రియాలను చేపట్టి తన వశములో ఉంచుకొని తన శరీరములో తనకు నచ్చిన తీరుగా స్వేచ్ఛగా సంచరించుతూ ఉంటున్నాడు అని. చెప్పినట్లుగా ప్రాణాలను స్వీకరించుటలో మరియు వాటితో కూడి సంచరించడము లోనూ జీవుడికి కర్తృత్వము ఉపదేశింపబడుతున్నది.

సూ॥ **వ్యపదేశాచ్చక్రియాయాం నచేత్ నిర్దేశవిపర్యయః 2–3–35** జీవునికి కర్తృత్వము పేర్కొనబడడము వలన కర్త అవుతున్నాడు. బుద్ధియే కర్త అని అనేటట్లయితే నిర్దేశము మారవలసి ఉంటుంది. **విజ్ఞానంయజ్ఞం తనుతే. కర్మాణి తనుతేఽపిచ** విజ్ఞానమయుడైన జీవాత్మ యజ్ఞాలను చేస్తున్నాడు. లౌకికమైన పనులనున్నూ చేస్తున్నాడు అని లౌకిక వైదిక క్రియలలో కర్తృత్వాన్ని పేర్కొన్నందువల్ల కూడా జీవుడు కర్తనే. ఐతే విజ్ఞానశబ్దము చేత ఆత్మను పేర్కొనడం లేదు. కానీ అన్తః కరణము ఐన బుద్ధినే పేర్కొన్నారు అని అనేటట్లయితే అప్పుడు నిర్దేశం మారిపోవలసి ఉంటుంది. ఎందుకంటే బుద్ధి అనేది జీవుడికి ఒక సాధనం పనిముట్టు అవుతున్నది కనుక విజ్ఞానేన అనే తృతీయావిభక్తికి బదులు కరణవిభక్తి – ద్వితీయావిభక్తి – తో నిర్దేశము చెయ్యవలసి ఉంటుంది. ఇక ఆత్మకు కర్తృత్వము లేకుంటే దోషాన్ని చెప్పుతున్నారు.

సూ॥ **ఉపలబ్ధివత్ అనియమః 2–3–36** ఉపలబ్ధి వలె ఏదో ఒక నియమము లేకుండా పోవలసి వస్తుంది. ఎట్లాగైతే ఆత్మకు విభుత్వము ఉన్నపుడు **నిత్యోపలబ్ధి అనుపలబ్ధి ప్రసంగః** ఇత్యాది సూత్రము ద్వారా ఉపలబ్ధికి నియమము లేకపోవడము చెప్పబడిందో దానివలెనే ఆత్మ కర్తకాకపోయినట్లయితే, ప్రకృతికే కర్తృత్వము

ఉండేటట్లయితే అది పురుషులు – జీవులు – అందరికీ సాధారణమైనట్టిది కాబట్టి అది చేసే పనులు అన్నీ అందరికీ అనుభవానికి అక్కరకొస్తాయి. లేదా ఏ ఒక్కడికీ పనికిరావు. ఆత్మలకు విభుత్వాన్నే ఒప్పుకున్నందువలన సన్నిధానము – అందుబాటులో ఉండడము – అందరికిన్నీ తేడా లేకుండా / వైశిష్ట్యము లేనిదిగా ఉండాల్సి వస్తుంది. ఇందువల్లే అన్తఃకరణాదులకు కూడా నియమము లేకుండా పోతుంది. వాటితో సమ్బన్ధము ఉన్నప్పుడే ఇది ఇతడి శరీరము, ఇతని బుద్ధి, ఇతని ఇంద్రియాలు అని వ్యవస్థ ఉన్నపుడే ఆయా వ్యక్తులు వాటితో అన్ని పనులు నిర్వహించుకోగల్గుతారు. వ్యవస్థ నిలుస్తుంది.

సూ॥ **శక్తి విపర్యయాత్ 2-3-37** భోక్తృత్వ శక్తి విపర్యయము – తలక్రిందులు – మార్పు అవుతుంది. బుద్ధికే గనుక కర్తృత్వము ఉన్నదని ఒప్పుకుంటే కర్త కంటే వేరయినవానికి భోక్తృత్వము కుదురదు కాబట్టి భోక్తృత్వ శక్తి కూడా బుద్ధికే కలుగవలసి వస్తుంది. అప్పుడు ఆత్మకు భోక్తృత్వ శక్తి తరిగిపోతుంది / కొరవడుతుంది. భోక్తృత్వము బుద్ధికే దక్కుతుంది కనుక ఆత్మ ఉన్నది అనే విషయంలో ప్రమాణము లేకుండా పోతుంది. **పురుషోఽస్తి భోక్తృభావాత్** భోక్త అవుతున్నందువలన పురుషుడు ఉన్నాడు అని వారు అంగీకరించినారు.

సూ॥ **సమాధ్య భావాచ్చ 2-3-38** సమాధి లేకపోవడమువలన కూడా. బుద్ధికే కర్తృత్వము ఉన్నప్పుడు మోక్షానికి సాధనమైన సమాధి విషయంలో ఆ బుద్ధియే కర్త అవుతుంది. ఆ సమాధి నేను ప్రకృతి కంటే వేరైన వాడిని అనే స్వరూపము. ప్రకృతి తనకు తాను నేను ప్రకృతి కంటే వేరయిన దాన్ని అని అనుకోలేదు. కనుక ఆత్మనే కర్త.

అయ్యా! ఆత్మకు కర్తృత్వమును అంగీకరించితే సర్వదా ఎల్లపుడు కర్తృత్వము నిలిచిపోకుండా / ఆగకుండా ఉండాల్సి వస్తుంది కదా! అని అంటే చెపుతున్నారు.

సూ॥ **యథాచ తక్షా ఉభయథా 2-3-39** వడ్రంగి వాడివలె ఇష్టము వచ్చినపుడు పనిచేయడము లేనపుడు మానుకోవడము అనే రెండు రకాలుగానూ ఉండవచ్చును. వాక్కు మొదలైన ఇంద్రియాలతో కూడిన ఆత్మ ఎపుడు కావాలని చేయాలని కోరుకుంటాడో అపుడు ఆయా సాధనాలతో ఆయా పనులను చేస్తాడు. కోరనప్పుడు పనిచేయడు మానుకుంటాడు. ఎట్లాగంటే వడ్రంగి ఉలి బాడిశ వంటి సాధనాలు / పనిముట్లు ఎదురుగా ఉన్నప్పటికీ తన ఇష్టము ప్రకారము వాటితో కోరిన పనిచేసుకుంటాడు. చేసుకోడు కూడాను. అచేతనమైన బుద్ధికే కర్తృత్వము దక్కితే దానికి

భోగాలను అనుభవించాలనే నియమాలకు సమ్బన్ధించిన కారణము లేదు కనుక ఎల్లపుడూ / సర్వదా దానికి కర్తృత్వమే ఉండాల్సి వస్తుంది. కనుక కర్త ఆత్మనే, బుద్ధి కాదు. **ఇది కర్తృ అధికరణము.**

★ ★ ★

## ఇక పరాయత్తాధికరణము.

సూ॥ **పరాత్తుతత్ శ్రుతేః 2–3–40** జీవునికి కర్తృత్వము పరుడైన పరమాత్మ వలన సిద్ధిస్తున్నది. ఆ విషయము శ్రుతివలన తెలుస్తున్నది. ఈ కర్తృత్వమనేది జీవునికి స్వతంత్రంగా ఉంటున్నదా? లేక పరమాత్మకు లొంగి ఉంటున్నదా? ఏది తగినది? అని అంటే స్వతంత్రంగానే సిద్ధించుతున్నది అని అంటున్నాము. ఎందుకంటే పరమాత్మకు లొంగి ఉండేదయితే చెయ్యమని చెప్పడము, వద్దు అని మానుకోమని చెప్పే శాస్త్రము అనర్థకము / వ్యర్థము కావలసి వస్తుంది. ఎవడు తన బుద్ధి ప్రకారము ప్రవృత్తి నివృత్తి పనిచేయడం మానుకోవడము – లను చేయగలుగుతాడో వాడు మాత్రమే నియోగింపదగిన వాడవుతున్నాడు. కనుక జీవుడికి స్వాతన్త్ర్యము ప్రకారమే కర్తృత్వము ఉంటున్నది అని పూర్వ పక్షము ఎదురవుతే చెపుతున్నాము.

పరాత్తు తత్ శ్రుతేః అని. తు శబ్దము పూర్వపక్షాన్ని తిప్పికొడుతున్నది. తత్ – ఆకర్తృత్వము ఈ జీవుడికి పరాత్ – పరమాత్మ వలననే, ఆయనే కారణమైనందువలన భవతి అగుచున్నది. ఎందువల్లనంటే శ్రుతివల్ల వినిపించుతున్నది కనుక అది ఏదంటే ఇది. **అన్తః ప్రవిష్టః శాస్తాజనానాం సర్వాత్మా. 2) యః ఆత్మనితిష్ఠన్ ఆత్మనః అన్తరోయమాత్మా న వేద యస్య ఆత్మాశరీరమ్ యః ఆత్మానమన్తరోయమయతి. స తే ఆత్మా అన్తర్యామీ అమృతః** అని. స్మృతి కూడా దాన్నే చెపుతున్నది. **సర్వస్య చాహంహృదిసన్నివిష్టః. మత్తఃస్మృతిః జ్ఞానమపోహనంచ.** నేను అందరి హృదయాలలో ఉంటూ మిక్కిలి దగ్గరగా ఉంటున్నాను. నావల్లనే జీవులకు గడచిన/ పోయిన వృత్తాన్తాన్ని తలచుకోవడము, కొత్త విషయాన్ని తెలుసుకోవడము, పొరపాటుగా ఒకదానికి బదులు మరొక దాన్ని తలుచుకొనడమున్నూ నావలననే జరుగుతున్నవి. **2) ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున। తిష్ఠతి। భ్రామయన్ సర్వభూతానియన్త్రారూఢానిమాయయా॥** ఓ అర్జునా! అన్ని ప్రాణులయొక్క

హృదయప్రదేశమునందు ఉంటున్నాడు ఈశ్వరుడు. యన్త్రాలపైకి ఎక్కించినవాటిని తనదైన మాయ – విజ్ఞానముతో తిప్పుతున్నట్లు తిప్పుచున్నాడు అని.

అదే నిజము అయితే విధి నిషేధాలను తెలిపే శాస్త్రము వ్యర్థము కావలసివస్తుంది కదా! అంటే చెపుతున్నాడు.

సూ॥ **కృతప్రయత్నాపేక్షస్తు. విహితప్రతిషిద్ధ అవైయర్థ్యాదిభ్యః 2-3-41** భగవన్తుడు జీవునియొక్క ప్రయత్నాన్ని కోరుతున్నాడు. లేనిచో విధించిన నిషేధించిన పనులు వ్యర్థము కావలసి వస్తుంది కనుక. చేసే పనులు అన్నింటిలోనూ పురుషుడు చేసే ప్రయత్నాన్ని – పూనికను అన్తర్యామి ఐన పరమాత్మ కోరుతున్నాడు. ఆ పిదప జీవుడికి అనుమతిని ఇవ్వడము ద్వారా ఆయా క్రియలలో ప్రవర్తింప చేస్తున్నాడు. పరమాత్మ యొక్క అనుమతి లేకుండా వీడు పనులు చెయ్యడానికి పూనుకోడు అని అర్థము. ఎందువల్ల ఇట్లా జరుగుతున్నది అని అంటే విహితములు, ప్రతిషేధించినవి – వద్దని నివారించినట్టివి వ్యర్థము కాకుండా ఉండడము మొదలైన వాటివలన, ఆది శబ్దము చేత పరమాత్మ యొక్క అనుగ్రహము నిగ్రహము – దయ, కోపములు – గ్రహింపబడుతున్నవి. ఎట్లాగైతే ఇద్దరికీ చెందిన ధనమును మరొకనికి చెందాలి అని అందుకు తగిన అనుమతి మొదలైనవి మరొకని ద్వారా ఇవ్వబడకుండా స్వంతము కావడము ఎట్లా కుదురదో? ఆవిధంగా భగవన్తుని యొక్క అనుమతి అవసరమై ఉంటుంది. అట్లయినా ఇతరుని యొక్క అనుమతి తన వల్లనే ఇవ్వబడుతున్నది కనుక దాని ఫలము కూడా అతడికే చెందుతుంది. పాపకర్మలలో ప్రవర్తించకుండా ఆపగల శక్తి ఉన్నవాడే ఐనా వాటిలో పాలు పంచుకోవడానికి అనుమతిని ఇవ్వడము పరమాత్మకు దయలేకపోవడాన్ని కలిగిస్తుంది కదా అనే సందేహానికి సమాధానాన్ని సాంఖ్యులమతాన్ని ఖండించిన సమయంలో ప్రతిపాదించినాము.

అయితే **ఏషహ్యేవసాధుకర్మకారయతి తంయమేభ్యోలోకేభ్య ఉన్నినీషతి। ఏషహ్యేవ అసాధుకర్మకారయతి తమ్ యమధోనినీషతి.** ఎవడిని ఉన్నత లోకాలకు తీసుకొనిపోవాలని తలంచుతాడో అటువంటి వానితో మంచిపనులను చేయించుతున్నాడు. ఎవడిని మరింతగా దిగజార్చదల్చుకుంటే వాడితో పాపపు పనులను చేయించుతున్నాడు అని చెప్పినట్లు ఉన్ని నీష–పైకి తీసుకోవాలని తలచుకోవడము – అథోనినీష – దిగజార్చదలచడముల ద్వారా భగవన్తుడు

స్వయంగానే మంచిచెడ్డపనులను జీవుడితో చేయించుతూ ఉన్నాడనడము పొసగదు కదండీ! అని అనగూడదు. అయితే ఇది జీవులందరికీ సమానంగా వర్తించేది కాదు. ఎవడైతే మిక్కిలిగా పరమ పురుషుడికి అనుకూలంగా నడుచుకుంటున్నాడో వాడిపైన దయ చూపుతున్న పరమాత్మ తానుగానే తనను చేరుకునే ఉపాయాలలో చాలామంచివైన పనులలో అభిలాషను పుట్టించుతాడు. ఎవడైతే పరమాత్మ విషయంలో మితిమీరిన వ్యతిరేకతను కలిగి అటువంటి పనులలో ప్రవర్తించుతూ ఉంటాడో వాడిని అణచివేస్తూ తనను చేరుకోవడానికి వ్యతిరేకమైన అధోగతికి సాధనాలైన కర్మలలో రుచిని పుట్టించుతాడు. ఇదే విషయాన్ని స్వయంగా భగవంతుడే ఇట్లాగా చెప్పినాడు. **శ్లో॥ అహంసర్వస్య ప్రభవః మత్తఃసర్వం ప్రవర్తతే। ఇతి మత్వాభజన్తే మాం బుధాః భావ సమన్వితాః.** నేను ఈ సమస్త ప్రపంచము పుట్టడానికి కారణమైన వాడిని. నా వల్లనే ఈ జగత్తు నడచుకుంటున్నది అని తలచి బుద్ధి మన్తులైన జనులు నన్ను మంచి మనస్సుతో కొలుస్తూ ఉన్నారు అని మొదలుపెట్టి **శ్లో॥ తేషాంసతతయుక్తానాంభజతాం ప్రీతిపూర్వకమ్। దదామి బుద్ధియోగం తంయేన మాముపయాన్తితే॥ తేషామేవానుకమ్పార్థం అహమజ్ఞానజం తమః। నాశయామ్యాత్మ భావస్థో జ్ఞానదీపేన భాస్వతా॥** మానసికంగా ఎల్లపుడూ నాతో కూడి ఉన్నవారై నన్నే కొలుస్తూ ఉన్న ప్రేమ గలిగిన సత్ పురుషులకు, వారి యందు కలిగిన అనుగ్రహముతో నన్ను చేరుకొనే మార్గాలలో అన్వయించే విధంగా బుద్ధిని పుట్టించుతాను. వారియందు ఉన్న దయవల్లనే వాళ్ళకు అజ్ఞానము వలన కలిగే చీకటిని వారియొక్క హృదయాలలో నిల్చి ఉన్నవాడినై జ్ఞానమనే దీపంతో దూరము చేస్తుంటాను అని. అదేవిధంగా **శ్లో॥ అసత్యం అప్రతిష్ఠం తేజగదాహురనీశ్వరమ్।** మూర్ఖులు ఈ జగత్తు సత్యమైనది కాదు. నిలుకడలేనిది. అట్లాగే ఈశ్వరుడు అనేవాడు దీనికి ఎవడూ లేడని అంటున్నారు. ఇటువంటివి, **మామాత్మ పరదేహేషు ప్రద్విషన్తోఽభ్యసూయకాః** తనలోనూ ఇతరుల శరీరాల్లోనూ ఉన్నటువంటి నన్ను ద్వేషించుతూ ఓర్వలేనివారై అనేంతవరకు చెప్పి **తానహం ద్విషతః క్రూరాన్‌సంసారేషునరాధమాన్।క్షిపామ్యజస్రమశుభానాసురీష్వేవ యోనిషు।** ఆవిధంగా నన్ను ద్వేషించుతూ ఉన్న క్రూరులైన నీచమానవులను ఎప్పుడు కూడా మంచి పనులను చేయనివారిని అసురజాతికి చెందిన జన్మలలోనే పుట్టిస్తూ ఉంటాను అని చెప్పబడింది. **ఇది పరాయత్తాధికరణము.**

★ ★ ★

## ఇక అంశాధికరణము.

సూ॥ **అంశోనానా వ్యపదేశాత్ అన్యథా చాపి దాశకితవాదిత్వం అధీయతే ఏకే 2-3-42** జీవుడు బ్రహ్మ యొక్క అంశము అనేకములుగా ఉన్నాడని – జీవ బ్రహ్మలు వేరువేరు అని చెప్పినందువల్ల. ఇద్దరూ ఒక్కరే అని అభేదాన్ని చెప్పినందువల్లనున్నూ కొంతమంది దాశులు కితవులు మొదలైన వారిని కూడా బ్రహ్మ గానే పఠించుతున్నారు. జీవునికి ఉన్న కర్తృత్వము పరమపురుషుని ఇచ్ఛకు తగినదై ఉంటున్నదని చెప్పబడింది. ఇప్పుడు ఈ జీవుడు పరమ పురుషుని కంటే పూర్తిగా వేరైనవాడా! లేక పరమాత్మనే భ్రమకలిగి జీవుడిగా వ్యవహరించుతున్నాడా? లేక బ్రహ్మనే కాని ఉపాధితో కూడి ఉన్నాడా? ఏదీ కాకుంటే బ్రహ్మయొక్క అంశమా? అని అనుమానింపబడుతున్నది. ఇందుకు కారణము ఏమిటంటే వేదమే వేరువేరు విధాలుగా చెప్పుతూ ఉన్నది కాబట్టి. **తదన్యత్వం ఆరమ్భణ శబ్దాదిభ్యః, అధికంతు భేదనిర్దేశాత్,** అనే సూత్రాల దగ్గరనే ఈ అంశము నిర్ణయించబడింది కదా! తిరిగి ఇప్పుడు చర్చ చేయడం దేనికి? అని అంటే సత్యమే. ఆ ముచ్చటనే వేదము ఒక దగ్గర నానా – జీవబ్రహ్మలు వేరువేరు అని, మరొక్క చోట ఒక్కటే అని వేరువేరు విధాలుగా చెపుతున్నది కాబట్టి దాన్నే ఆక్షేపించుకొని జీవుడు బ్రహ్మ యొక్క అంశము అని ప్రతిపాదించడం ద్వారా విశేషంగా నిర్ణయాన్ని చేస్తున్నారు. ఎంత దాకానైతే జీవుడు బ్రహ్మాంశమే అని నిర్ణయం చేయబడదో అంతవరకు జీవుడు బ్రహ్మ కంటే వేరుకాడు – **అనన్యుడు** – బ్రహ్మ జీవుని కంటే అధికుడు అనే వాస్తమునకు కల్గిన ప్రశ్నలకు సమాధానము ఏది? అని అంటే పూర్తిగా వేరయిన వాడు జీవుడు అని అనేదే సరియైన జవాబు. ఎందువల్లనంటే? **జ్ఞాజ్ఞౌ ద్వావజావీశనీశౌ** ఇత్యాది వాక్యాల చేత భేదము పేర్కొనబడింది కదా! జ్ఞ అజ్ఞులకు సమ్బన్ధించిన అభేదశ్రుతులు (భేదము లేదు అని చెప్పే వేదవాక్యాలు) అగ్నినాసిం చేత్ **నిప్పుతో చల్లాలి** అని చెప్పినట్లు విరుద్ధమైన అర్థాన్ని ప్రతిపాదించుతున్నందువల్ల ఔపచారికమే. మర్యాద కొరకే. బ్రహ్మ యొక్క అంశమే జీవుడు అనేది కూడా సరి ఐనదికాదు. అంశము అంటే ఒక వస్తువులోని ఒక భాగాన్ని తెలిపిడి చేసేదే కదా! జీవుడు బ్రహ్మలో ఒక అంశము ఐతే అతనిలోని దోషాలన్నీ బ్రహ్మకు అంటుతవి కదా! ఐతే బ్రహ్మయొక్క ఒక ముక్క జీవుడు అని కూడా భావించకూడదు. అపుడు అంశము కావచ్చునేమో కానీ బ్రహ్మ ముక్కలుగా చేయబడడు. అందుకు తగిన వాడున్నూకాదు పైగా ఇంతకుమునుపు చెప్పిన దోషము రానే వస్తుంది. అందువల్ల పూర్తి వేరయిన జీవుడిని బ్రహ్మ యొక్క అంశము అని అనడము ఎంత మాత్రము ప్రతిపాదించరాని ముచ్చట సుమా!

లేదా? ఈ ప్రపంచమంతా ఉన్నదనే భ్రమతో కూడిన బ్రహ్మనే జీవుడు ఎందువల్లనంటే **తత్త్వమసి, అయమాత్మాబ్రహ్మ** ఇత్యాదులైన వాక్యాల ద్వారా బ్రహ్మాత్మభావము ఉపదేశింపబడింది కాబట్టి. బ్రహ్మ వేరే. జీవుడు వేరే అని చెప్పే నానాత్వవాదివాక్యాలైతేనో ప్రత్యక్షము చేత సిద్ధమైన అర్థాన్ని / విషయాన్ని అనువదించుతున్నాయి – ఒకచోట చెప్పబడిన విషయాన్ని తిరిగి చెప్పేవి – కనుక అనన్యథా సిద్ధమైన అద్వైతాన్ని ఉపదేశించే శ్రుతులచేత ప్రత్యక్షాది ప్రమాణాలు వలె అవిద్యలో అన్తర్గతాలు – భాగాలు – అని వివరించుతాము.

లేదా! బ్రహ్మనే అనాది ఐన ఉపాధితో కూడినవాడైనందున జీవుడు అని అనబడుతున్నాడు. ఏ కారణంగా నంటే ఇంతకుముందు చెప్పిన బ్రహ్మాత్మభావ ఉపదేశము వల్లనే. ఐతే ఉపాధి భ్రాన్తి చేత కల్పించబడింది అని అనడానికి వీలులేదు. అట్లాగా ఐనప్పుడు బన్ధము మోక్షము మొదలైన వ్యవస్థలు పొసగుకుండా పోతవి అని.

ఈ విధంగా పూర్వపక్షము ఎదురైతే చెప్పబడుతున్నది. జీవుడు బ్రహ్మ యొక్క అంశము అని. ఎందువల్ల నంటే వేరు వేరు – నానా – అని చెప్పినందువల్ల మరియు ఒక్కడే అని కూడా చెప్పినారు కాబట్టి. ఏకము అని పేర్కొన్నందువల్ల. అంతేకాదు రెండు విధాలుగా – ఉభయథా – వ్యపదేశము / ఉపదేశించుట కనపడుతున్నది. నానాత్వ వ్యపదేశము అయితే స్రష్టృత్వము – సృజ్యత్వము, 2) నియన్తృత్వము – నియామ్యత్వము, 3) సర్వజ్ఞత్వము – అజ్ఞత్వము 4) స్వాధీనత్వము – పరాధీనత్వము 5) శుద్ధత్వము – అశుద్ధత్వము 6) కళ్యాణగుణాకరత్వము – దానికి తలక్రిందులుఐ ఉండడము 7) పతిత్వము – శేషిత్వములు మొదలైన వాటివల్ల నానాత్వము కనపడుతున్నది. అన్యథా చ – భేదము లేనట్లుగా పేర్కొనడమున్నూ **తత్త్వమసి, అయమాత్మా బ్రహ్మ** ఇత్యాది వాక్యాలచేత కనపడుతున్నది. దాశులు కితవులు మొదలైన వారుగా అయ్యి ఉండడాన్ని కొందరు పఠించుతున్నారు. **బ్రహ్మదాశాః బ్రహ్మదాసాః బ్రహ్మేమేకితవాః** ఈ బెస్తవాండ్లు బ్రహ్మనే. బ్రహ్మ స్వరూపులే. ఈ దాసులు – సేవకులూ బ్రహ్మనే. ఈ జూదరులు కూడా బ్రహ్మనే. అని, ఆథర్వణికులు బ్రహ్మను దాశకితవాదులనుగా కూడా పఠించుతున్నారు. అందువల్ల కూడా జీవులందరిలోనూ – ఎక్కువతక్కువలు, అధికులు నీచులు మొదలైన భేదాలు లేకుండా – వ్యాపించి ఉన్నందువల్ల అభేదము చెప్పబడుతూ ఉన్నదని అర్థము. ఈ విధంగా రెండు విధాలుగా చెప్పడమున్నూ ముఖ్యమే అని సిద్ధించడానికి

ఈ జీవుడు బ్రహ్మ యొక్క అంశము అని ఒప్పుకోవాలి. భేదాన్ని చెప్పే వాక్యాలు ప్రత్యక్షాది ప్రమాణాలచేత సిద్ధించుతున్నందువల్ల అన్యథా సిద్ధములు అని అనకూడదు. ఎందుకంటే బ్రహ్మ చేత సృష్టింపబడడము, అతని చేత నియమింపబడడము, ఆయనకు శరీరముఐ ఉండడము, ఆయనకు శేషుడు (దాసుడు) ఐ ఉండడము, ఆయనపైన ఆధారపడి ఉండడము, ఆయనచేత రక్షింపబడుట, ఆయనచేత సంహరింపబడుట, ఆయనను ఉపాసించుట, ఆయన అనుగ్రహము వలన లభించే ధర్మార్థ కామ మోక్షాలు అనే పురుషార్థాలను పొందుతుండడము మొదలైన(వి), వాటివల్ల ఏర్పడిన జీవబ్రహ్మల భేదము ప్రత్యక్షము మొదలైనవాటివల్ల తెలియరావడం లేదు కనుక అనన్యథా సిద్ధమే. కనుక జగత్సృష్టి మొదలైన వాటిని తెలిపే వాక్యాలు ఇతర ప్రమాణాల చేత తెలియవచ్చే భేదాన్ని అనువదించుతున్నందువల్ల మిథ్య ఐన అర్థాన్ని ఉపదేశించేవి కావు. అంతేకాదు అఖండమైన ఏకరసమైన చిన్మాత్రమే స్వరూపముగా గల బ్రహ్మ తనను బ్రహ్మను కానని తల్చుకోవడము – అతద్ భావానుసన్ధానము – చాలా స్వరూపాలుగా అవుతాను అని సంకల్పించుకొని దాని కారణంగా ఆకాశము మొదలైన వాటిని పుట్టించడము, జీవుడుగా పంచభూతాత్మకమైన శరీరములో ప్రవేశించడము, వింతవింతలైన నామరూపాలను ఏర్పాటు చెయ్యడము వాటి కారణంగా అనన్తాలు ఐన శబ్ద స్పర్శాది విషయాలను అనుభవించినందువల్ల కలిగే సుఖదుఃఖాలను పొందుతుండడము, భోక్త కానందున ఆ శరీరంలో ఉండి / జీవుడిలోనూ ఉండి ప్రకృతి జీవులను వారిని తన ఆజ్ఞ ప్రకారంగా నడిపించుతూ అన్తర్యామిగా ఉండటము, జీవుడుగా ఐన తనను కారణబ్రహ్మగా, ఆత్మ భావమును అనుసంధానించుకోవడము సంసారము మోక్షము వాటిని ఉపదేశించే శాస్త్రాన్నీ చేస్తుండే బ్రహ్మను భ్రమను పొందినవాడు అవుతున్నాడు అని ఉపదేశింపబడుతున్నది. అట్లా ఐనప్పుడు ఆ మాట పిచ్చివాని వాగుడుగా పరిగణింపవలసి వస్తుంది.

ఉపాధితో కూడి ఉన్న బ్రహ్మనే జీవుడు అని అనడమున్నూ సరిఐనది కాదు. ఇంతకుముందు పేర్కొనబడిన నియామ్యత్వాదులైన వ్యపదేశాలు బాధింపబడుతాయి. కాబట్టి. దేవదత్తాదులు ఒక్కరు మాత్రమే – గృహము మొదలైన ఉపాధుల భేదము కారణంగా నియంత – నియమింపబడేవాడు అనే భావాలు (ధర్మాలు) మొదలైనవి సిద్ధింపవు. కనుక రెండు విధాలైన (అంశత్వ – నానాత్వ) వ్యపదేశాలు పొసగడం కొరకు జీవుడు బ్రహ్మ యొక్క అంశము అని ఒప్పుకొని తీరాలి.

సూ॥ **మన్త్ర వర్ణాత్ 2-3-43 పాదోఽస్యవిశ్వాభూతాని త్రిపాదస్యామృతం దివి.** అనే మన్త్ర వర్ణాన్ని బట్టి కూడా జీవుడు బ్రహ్మయొక్క అంశమే. అంశము అనే అర్థాన్ని తెలిపే పదమే పాదశబ్దము. విశ్వాభూతాని అని మన్త్రములో బహువచనాన్ని చెప్పడము జీవులు చాలా మంది ఉన్నారు కాబట్టి. దీనికి ముందరి సూత్రములో అంశము అని ఏకవచనాన్ని ప్రయోగించడము జాతి అనే అభిప్రాయముతోనే. నాత్మా శ్రుతేః అనే సూత్రములోనూ ఏకవచనమును ప్రయోగించడము కూడా జాతి అనియే ఉద్దేశించినారు. **నిత్యో నిత్యానాం చేతనశ్చేత నానాం ఏకోబహూనాం యోవిదధాతి కామాన్.** నిత్యులైనవారికి నిత్యుడు చేతనులకు చేతనుడు అవుతూ చాలా మందికి తానొక్కడే వారివారి కోరికలను నెరవేరుస్తున్నాడు. మొదలైన శ్రుతులను బట్టి ఈశ్వరుడి నుండి ఆత్మలకు ఉన్న భేదములైన బహుత్వము నిత్యత్వములున్నూ చెప్పబడుతున్నాయి. ఈ విధంగా నిత్యులైన ఆత్మలు చాలామంది అని ప్రమాణము లభిస్తుండగా అందరిదీ జ్ఞానస్వరూపము ఐనందున ఒకే రూపము ఉన్నా వీరు నిత్యులు వీరు ముక్తులు వీరు బద్ధులు అని వేరుచేసే ఆకారాన్ని ఆత్మ యొక్క యధార్థస్థితిని అర్థము చేసుకోగల సమర్థులైన వారికి తెలుస్తూనే ఉంటుంది. **అసన్తతే శ్చావ్యతికరః** అనే సూత్రము ద్వారా ఆత్మలయొక్క బహుత్వాన్ని సూత్రకారుడు దీనికి తర్వాత చెప్పబోతున్నాడు కూడా.

సూ॥ **అపిస్మర్యతే 2-3-44** స్మృతి కూడా దీన్నే చెప్పుతున్నది. **మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః** ఓ అర్జునా! ఈ లోకములో కనిపిస్తున్న జీవులు నాయొక్క అంశాలు ఐనవారే. ఈ జీవుడు అతి ప్రాచీన కాలమునుండీ ఉంటున్న సనాతనుడు సుమా! అని జీవుడు పురుషోత్తముని యొక్క అంశముగా చెప్పబడుతున్నాడు. కావున జీవుడు బ్రహ్మ యొక్క అంశమే.

సరే! బ్రహ్మ అంశమే ఐనా జీవుడు బ్రహ్మలో ఏకదేశము (ఒక భాగమే) అవుతున్నందున జీవునిలో ఉన్న దోషాలు బ్రహ్మకు చెందుతవి కదా అని శంకించుకొని సమాధానాన్ని చెపుతున్నారు.

సూ॥ **ప్రకాశాది వత్తు. నైవం పరః 2-3-45** దీపము యొక్క ప్రకాశము వలె జీవుడు పరమాత్మ యొక్క అంశము అవుతున్నాడు. పరుడు, బ్రహ్మ జీవుడు వంటివాడు కాదు. సూత్రములోని తు శబ్దము శంకను తొలగిస్తున్నది. ప్రకాశాదుల వలె జీవుడు పరమాత్మ యొక్క అంశమే – అగ్ని సూర్యులు బాగా వెలుగుతూ ఉన్నప్పుడు వారియొక్క కాన్తి రూపమైన ప్రకాశము ఏవిధంగా అంశము అవుతున్నదో! ఆవు గుఱ్ఱములు

గోత్వాదులతో కూడిన వస్తువులకు తెలుపు నలుపు వంటి విగోత్వాదులున్నూ విశేషణాంశాలు అవుతున్నాయో, దేవుడు మనుష్యుడు మొదలైన వారియొక్క దేహము అంశము ఎట్లా అవుతున్నదో అట్లాగే జీవుడు పరమాత్మ యొక్క అంశము అవుతున్నాడు. ఒక వస్తువు యొక్క ఒక ప్రాన్తము/ ఒక భాగమే అంశము. మరొక విశేషణమైన అంశముతో కూడిన ఒక వస్తువుకు విశేషణము అంశమే అవుతున్నది. అట్లాగని వివేచకులు ఐనవారు విశిష్టమైన వస్తువు నందు ఇది విశేషణాంశము, ఇది విశేష్యాంశము అని పేర్కొంటున్నారు. విశేషణ విశేష్యాలు అంశము అంశిలు అవుతున్నా ఆ రెండింటికీ స్వభావాల్లో భేదము స్పష్టంగా కనిపిస్తూనే ఉంటుంది. ఇదే విధంగా జీవుడు పరమాత్మలకున్నూ విశేషణ విశేష్యధర్మాలు ఉంటున్నందున అంశ అంశిత్వము, స్వభావములలో భేదమున్నూ చక్కగా అమరుతుంది. కావుననే సూత్రములో నైవంపరః అని చెప్పినారు. అనగా జీవుడు ఎటువంటివాడో పరమాత్మ అటువంటివాడు కాడు అని. ఎట్లాగయితే ప్రభ కంటే ప్రభావన్తుడు వేరు అవుతున్నాడో అట్లాగే ప్రభయొక్క స్థానములో ఉండేవాడైన తన అంశమైన జీవుడి కంటే పరమాత్మ వేరయినట్టివాడే అని అర్థము. ఈ తీరుగా జీవపరులకు విశేష విశేష్యత్వ సమ్బన్ధము వల్ల ఏర్పడిన స్వభావ వైలక్షణ్యాన్ని ఆశ్రయించి భేదాలు చెప్పబడుతున్నాయి. చెల్లుతున్నాయి. ఇక అభేద నిర్దేశాలైతే వేరుగా ఉండటానికి వీలుకాని విశేషణాలు విశేష్య పర్యన్తము చెల్లుతాయి కనుక ముఖ్యార్థాలే అవుతాయి. తత్త్వమసి. అయమాత్మా బ్రహ్మ మొదలైన వాక్యాలతో తచ్ఛబ్దము బ్రహ్మ శబ్దముల వలె త్వం అయం ఆత్మ శబ్దాలు కూడా ముఖ్యాలే అవుతున్నాయి. ఎందువల్లనంటే జీవుడిని శరీరముగా కల్గి ఉన్న బ్రహ్మను చెపుతున్నవి. వాచకాలు అవుతున్నందువల్ల ఒకే అర్థాన్ని చెప్తున్నాయి. అనే ఈ అర్థము ఇంతకుముందే చాలా బాగా వివరించి ఉన్నాము.

సూ॥ **స్మరన్తి చ 2-3-46** స్మృతులు కూడా ఇదే అర్థాన్ని చెపుతున్నాయి. ఈ విధంగా ప్రభా ప్రభావత్తులయొక్క రూపములో, శక్తి శక్తి మన్తుడు రూపంలో, శరీర ఆత్మ భావములో అంశము అంశిభావముతోనూ జగత్తుకు బ్రహ్మకు సమ్బన్ధాన్ని పరాశరుడు మొదలైన స్మృతికర్తలు వివరించుచున్నారు. **ఏకదేశ స్థితస్యాగ్నేః జ్యోత్స్నా విస్తారిణీయథా। పరస్య బ్రహ్మణః శక్తిః తథేదమఖిలంజగత్॥ యత్ కించిత్ సృజ్యతే యేనసత్త్వజాతేన వైద్విజ। తస్యసృజ్యస్యసమ్భూతా తత్ సర్వంవై హరేస్తనుః॥** ఒక్కచోట ఉన్న అగ్నియొక్క వెలుగు ఎట్లాగా అంతటా వ్యాపించుచున్నదో అదే

విధముగా పరబ్రహ్మ యొక్క శక్తి కూడా జగత్తు రూపములో వ్యాపించి ఉన్నది. ఏ ప్రాణి రూపములో ఏ ఒక్కటి సృష్టింపబడినా అటువంటి దానియొక్క పుట్టుకలో ఉన్నదంతా ఆ శ్రీహరి యొక్క స్వరూపమే సుమా! ఇత్యాది వాక్యాలతో, సూత్రములోని చకారముతో శ్రుతులు కూడా అని అర్థము చేసుకోవాలి. **యస్యాత్మా శరీరమ్** ఇత్యాదివాక్యాలతో ఆత్మ శరీరభావముతో అంశాంశిత్వమును చెప్పుతున్నవి అని చెప్పబడుతున్నది.

ఈ విధంగా బ్రహ్మకు అంశము కావడము, బ్రహ్మ చేత ప్రవర్తింపబడటము జ్ఞానము కలవాడై ఉండడములతో ఆత్మలు అన్నీ సమానములై ఉంటే కొందరికి వేదాలను అధ్యయనము చెయ్యడము వాటి అర్థాన్ని పాటించడములకు అనుమతి ఇవ్వటము మరికొందరికి లేదనడము, కొందరికి దర్శించుకోవడానికి తాకడానికి అనుమతిని ఇవ్వడం కొందరిని దూరంగా ఉంచడములు శాస్త్రాల్లో చెప్పబడినాయి. ఇవి ఎట్లా పొసగుతవి అని శంకించుకొని చెప్పుతున్నారు.

సూ॥ **అనుజ్ఞాపరిహారౌ దేహసమ్బన్ధాత్ జ్యోతిరాదివత్ 1–3–47** జీవులందరూ సమానమే ఐనా దేహసమ్బన్ధాన్ని బట్టి అనుజ్ఞా పరిహారాలు ఉంటున్నవి. అగ్ని మొదలైనవాటివలె. ఆత్మలు అందరూ బ్రహ్మ యొక్క అంశలు జ్ఞానస్వరూపులు కావడంతో ఒక్క తీరే ఐనా బ్రాహ్మణులు క్షత్రియులు వైశ్యులు శూద్రులు మొదలైన విభాగాలను కలిగి శుచి అశుచి దేహాలతో సమ్బన్ధాల కారణంగా అనుజ్ఞ పరిహారాలు చెల్లుతవి. జ్యోతిరాదుల వలె. ఎట్లాగంటే నిప్పు నిప్పుగా ఎక్కడ ఉన్నదైనా ఒక్కటే ఐనా శ్రోత్రియుని ఇంటినుండి నిప్పును తీసుకొచ్చుకుంటారు. శ్మశానాన్నుంచి ఐతే దూరంగానే ఉంచుతారు. అదే తీరుగా శ్రోత్రియుల ఇంటి నుండి అన్నమును స్వీకరించవచ్చును అందరిచేత ఏవగించు కొనబడే వాడి నుండి మానివేస్తారు కదా!

సూ॥ **అసన్తతేశ్చ అవ్యతికరః 2–3–48** ఆత్మ యొక్క స్వరూపము అణువంత కాబట్టి ప్రతి జీవికీ భోగాలను అనుభవించడంలో సంకరము కావడానికి అవకాశము లేదు. బ్రహ్మాంశము అవడం వంటి కారణాలచేత జీవులందరి రూపము ఒకే విధంగా ఉండేదే ఐనా ప్రతిజీవికీ పరస్పరము భేదము ఉండటంవలన అణువంత పరిమాణము కలిగి ఉండడము చేత ప్రతి శరీరానికీ భేదము ఉండడంతో సుఖదుఃఖాలను అనుభవించడంలో సంకరము – కలగాపులగం కావడం జరుగదు. భ్రాన్తుడైన బ్రహ్మనే జీవుడు ఐనాడు అనే పక్షములో, ఉపాధితో కూడిన బ్రహ్మయే జీవుడు అనబడుతున్నాడు అనే వాదంలోను జీవుడికి పరమాత్మకు, జీవులకున్నూ పరస్పరము భోగవ్యతికరము

– సంకరము – మొదలైన దోషాలు కలుగుతున్నాయి అనే అభిప్రాయంతో తమ పక్షములో, భోగవ్యతిరేకము లేదు ఆని చెపుతున్నారు వ్యాసులవారు.

భ్రాన్త బ్రహ్మయే జీవుడు అనే వాదంలోనూ అవిద్య వలన ఏర్పడిన ఉపాదులభేదము వల్ల భోగముల వ్యవస్థ మొదలైనని ఏర్పడుతవి కదా! అని అంటే చెపుతున్నారు.

సూ॥ **ఆభా(సా)స ఏవ చ 2-3-49** అవన్నీ ఆభాసాలే. కాకి బంగారమువలె నిజమైనవాటిగా కనిపించుతాయి. అంతమాత్రమే. తనతో విభాగములు లేక ఏకరసమైన ప్రకాశము మాత్రమే స్వరూపముగా గలవానికి తనదైన స్వరూపము కప్పివేయబడడము ద్వారా ఉపాధిలో భేదము ఏర్పడుతున్నది అని ఉపపాదించడానికి కారణమైనట్టిది. ఆభాసము మాత్రమే. యధార్థమైనదికాదు. ప్రకాశము ఒక్కటి మాత్రమే తన స్వరూపముగా కలవానికి ఆ ప్రకాశము కప్పివేయబడితే అది ప్రకాశము యొక్క నాశమే అవుతుంది అని మునుపే ఉపపాదించినాము. సూత్రములో ఆ భాస / ఆ భాసా అనిన్నీ పాఠ భేదము ఉన్నది. అప్పుడు హేతువులు ఆభాసాలు అవుతవి. సూత్రములో ఉన్న చకారము వలన **పృథక్ ఆత్మానం ప్రేరితారం చమత్వా** తన్ను, ఆయా పనులను చేయడంలో తనలో ఉండి ప్రేరేపించేవాడినిన్నీ వేరువేరుగా తలచి. **జ్ఞాజ్ఞౌద్వౌ, తయోరన్యఃపిప్పలంస్వాద్వత్తి** ఇత్యాదులైన శ్రుతులతో విరోధము కూడా వస్తుంది. అవిద్య చేత కల్పింపబడిన ఉపాధులలో భేదము ఉన్నా అన్ని ఉపాధులతో కూడినవాడు ఒక్కడే అని ఒప్పుకున్నందువల్ల భోగవ్యతికరము అట్లాగే ఉండి పోతుంది.

పారమార్థికమైన ఉపాధితో కూడిన బ్రహ్మనే జీవుడు అనబడుతున్నాడని అనే వాదములోనూ ఉపాధిలో భేదాలు ఏర్పడడానికి కారణమైన అనాదిఐన అదృష్టమునకు వశముఐ ఉంటున్నందువల్ల ఒక వ్యవస్థ కాగలదు కదా! అని శంకించుకొని ఉత్తరమును చెప్తున్నారు.

సూ॥ **అదృష్టానియమాత్ 2-3-50** అదృష్టమునకు నియమము (కట్టుబడి) లేనందువల్ల అవ్యవస్థనే. ఉపాధుల పరంపరకు కారణము ఐన అదృష్టము బ్రహ్మ స్వరూపాన్ని ఆశ్రయించి ఉంటున్నందువల్ల నియమమునకు కారణమైన హేతువు లేదు కాబట్టి అవ్యవస్థనే కాని వ్యవస్థ ఉండదు. ఉపాధులతో అదృష్టాలతోనూ తనకు సమ్బన్ధం ఉండడము వల్ల బ్రహ్మ స్వరూపాన్ని భేదము చేయడం – ముక్కలుగా చేయడం – ఈ

ముక్కలో ఈ ఉపాధికి ఈ అదృష్టానికి సమ్బన్ధము ఉన్నది అని అనడానికి అవకాశము లేదు కనుక అవ్యవస్థనే.

సూ॥ **అభి సన్ధ్యాదిష్వపి చ ఏవమ్ 2-3-51** సంకల్పము మొదలైన వాటి యందున్నూ ఇదే అవ్యవస్థ. అదృష్టానికి కారణము ఐన అభిసంధ్యాదులు - సంకల్పము, పూనుకోవడము, ప్రయత్నము చేయడము - మొదలైన వాటియందున్నూ ఇంతకుముందు చెప్పిన కారణము - బ్రహ్మ స్వరూపము అచ్ఛేద్యం కావడము ప్రదేశాలన్నీ బ్రహ్మ స్వరూపాలే కావడం - వలన నియమం లేకపోవడమే జరుగుతుంది.

సూ॥ **ప్రదేశభేదాదితి చేన్న అన్తర్భావాత్ 2-3-52** బ్రహ్మ స్వరూపములో భేదాలు ఉంటున్నవి కాబట్టి భోగవ్యవస్థ కుదురుతుంది అనేట్లయితే కాదు. సర్వప్రదేశాలు ఉపాధులన్నింటిల్లో అన్తర్భవించుతున్నాయి కాబట్టి భోగసంకరము అట్లాగే ఉంటుంది.

బ్రహ్మ స్వరూపము ఒక్కటే ఐనా అది ఛేదించటానికి వీలుకాకున్నా పలురకాలైన ఉపాధులతో సమ్బన్ధాన్ని కలిగి ఉంటుంది. అట్లయినా ఉపాధులతో సమ్బన్ధము కల బ్రహ్మ ప్రదేశాలలో భేదము ఉంటున్నందున భోగవ్యవస్థ పొసగుతుంది అని అంటే కాదు. ఉపాధులు ఆయా చోట్లలోకి చేరినందువల్ల ప్రదేశాలన్నీ సర్వోపాధుల్లో అన్తర్భవించుటవలన - కలిసిపోవుట వలన - సంకరము అట్లే నిలుస్తుంది. ప్రదేశాలలోని భేదముతో సమ్బన్ధము ఉన్నప్పటికీ అంతా బ్రహ్మ - ప్రదేశమే అవుతుంది కాబట్టి ఆయా ప్రదేశాలతో సమ్బన్ధము ఉన్న దుఃఖము బ్రహ్మకే చెందుతుంది. మునుపు **నిత్యోపలబ్ధి అనుపలబ్ధి ప్రసంగః। అన్యతరనియమోవా అన్యథా,ఉపలబ్ధి వదనియమః** అనే సూత్రాలతో వేదాన్ని అంగీకరించని వేదబాహ్యులు అంతటా జీవుడు నిండి ఉన్నాడు (విభువు) అని వాదించేవారి వాదములోని దోషము(లు) చెప్పబడింది. ఇక్కడ మాత్రము **ఆభాసఏవచ** ఇత్యాదులైన సూత్రాలతో వేదాలను అంగీకరించుతూనే ఆత్మ ఒక్కటే అని వాదించే వాదము యందు దోషము చెప్పబడుతున్నది. **ఇది అంశాధికరణము.**

**ఇంతటితో శ్రీభాష్యమునందు ద్వితీయాధ్యాయములోని**

తృతీయపాదము ముగిసినది.

శ్రీమతే రామానుజాయనమః

## శ్రీభాష్యము – ద్వితీయాధ్యాయము – చతుర్థపాదము

### ప్రాణోత్పత్తి అధికరణము.

సూ॥ **తథా ప్రాణాః 2-4-01**వియదాదులవలె ప్రాణాలు (ఇంద్రియాలు) పుడుతున్నవి. బ్రహ్మకంటే వేరుగా ఉన్న వియదాదులు అన్నీ కార్యములు అవుతున్నాయి. కనుక ఉత్పత్తి చెప్పబడగా జీవుడు కార్యమే ఐనా స్వరూపము మరొక తీరుగా మారుట (స్వరూపాన్యథాభావము) అనేదే లక్షణముగా గల ఉత్పత్తి లేదని ఖండింపబడింది. ఆ సందర్భములో జీవుని యొక్క స్వరూపము ఎటువంటిదై ఉన్నది? అని పరిశోధించినారు. ఇప్పుడు జీవునికి ఉపకరణాలు ఐన ఇంద్రియాలు, ప్రాణమునకున్నూ ఉత్పత్త్యాది ప్రకారము శోధింపబడుతున్నది. ఆ సందర్భములో ఇంద్రియాలకు కార్యత్వము అనేది జీవుని వంటిదా? లేక ఆకాశము వంటివాటివలెనా? అని చిన్తించబడుతున్నది. ఏది తగినదని అనగా పూర్వపక్షి జీవుడి వలేనే – తథా ప్రాణాః అని చెప్పుతున్నాడు. ఎందుకనగా? ప్రాణాః ఇంద్రియాలు ఎట్లాగైతే జీవుడు పుట్టుక కలవాడు కాడో అట్లాగే ఇంద్రియాలు కూడా పుట్టడము లేదు. శ్రుతి ఆ విధంగా ప్రబోధిస్తున్నది. శ్రుతి ద్వారా జీవుడి అనుత్పత్తి ఎట్లా తెలియవస్తున్నదో అట్లే ఇంద్రియాలకు అనుత్పత్తి కూడా శ్రుతి ద్వారానే తెలుస్తూ ఉన్నది. తథాప్రాణాః అని శ్రుతి అతి దేశము చేస్తున్నది. ఐతే శ్రుతి ఏది? అని అంటే చెపుతున్నాము. **"అసద్వా ఇదమగ్ర ఆసీత్. తదా హుః కింతదాసీదితి. ఋషయో వావతే అగ్రేసదాసీత్. తదాహుః కేతేఋషయః ఇతి. ప్రాణావావఋషయః."** ఈ ప్రపంచము ఆ సృష్టికి ముందు కాలములో అసత్తు వలె ఉండినది. దాన్నే చెప్పినారు. అపుడేమి ఉండింది? అని. వారు ఋషులు. ఋషులంటే ఎవరు? ప్రాణాలు – ఇంద్రియాలే – ఋషులు అని జగదుత్పత్తికి ముందు కాలములో ఇంద్రియాలు ఉండినవి అని వాటి ఉనికి తెలియవస్తున్నది. ప్రాణశబ్దము నందు బహువచనము ఉన్నది. దాన్ని బట్టి ఇంద్రియాలే అని నిశ్చయింపబడ్తున్నది. ఐతే ఈ శ్రుతిని **వాయుశ్చాన్తరిక్షం చైతదమృతమ్. 2) సైషాఽనస్తమితా దేవతా యద్ వాయుః.** వాయువు అన్తరిక్షమున్నూ మరణము లేనట్టివి. ఈ దేవత అస్తమయము లేని దేవత. అదే వాయుదేవత అనే వాక్యాల వలె చాలాకాలము దాకా నిలిచి ఉండేవి అనే అర్థములోకి మార్చుకోవడము తగదు. అసద్వా ఇదమగ్ర ఆసీత్ అని ప్రపంచము

మొత్తం ప్రలయము చెందిన కాలములోనూ నిలిచి ఉంటున్నది అని వినిపించుతున్నది కాబట్టి. ఉత్పత్తి వాదినులు ఐన వాక్యాలను జీవోత్పత్తిని తెల్పే వాక్యాలను వలెనే మల్చుకోవాలి.

అని పూర్వపక్షము రాగా సిద్ధాన్తము చెప్పబడుతున్నది. వియదాదులవలెనే ఇంద్రియాలు కూడా పుట్టింపబడుతున్నవి. ఎందువల్ల నంటే? **1) సదేవసోమ్యేదమగ్ర ఆసీత్ 2) ఆత్మావా ఇదమేకఏవాగ్ర ఆసీత్.** ఓ సోమ్యుడా! ఇప్పుడున్న ఈ ప్రపంచము సృష్టి జరుగక ముందు కాలములో సత్ అనబడు పదార్థముగా ఉండింది. 2) ఆత్మ ఒక్కటే తొట్టతొలుతటి కాలములో ఒంటరిగా ఉండెను. ఇత్యాదివాక్యాలద్వారా సృష్టికి ముందు ఒక్కటే ఉన్నదని నిశ్చయము చేయబడింది కనుకను, **ఏతస్మాత్ జాయతే ప్రాణోమనః సర్వేన్ద్రియాణిచ.** ఇతడి నుండే ప్రాణము మనస్సు ఇంద్రియాలు అన్నీ పుడుతున్నవి. అని ఇంద్రియాల యొక్క ఉత్పత్తి వినిపించుతున్నందువల్లా ముందు ఉండడానికి వీలులేదు. ఐతే ఆత్మయొక్క ఉత్పత్తి వాదము వలె ఇంద్రియాల యొక్క ఉత్పత్తి వాదాలు మార్చుచేసుకోబడవు. అదే ఆత్మ వలె ఉత్పత్తి లేదని తెలిపే శ్రుతులు, దాన్ని ఖండించుతూ నిత్యత్వాన్ని చెప్పే శ్రుతులు అని రెండు రకాల వేదవాక్యాలు కనిపించడము లేదు. అసద్వా ఇదమగ్ర ఆసీత్ అనే వాక్యములో ఉన్న ప్రాణశబ్దము చేత పరమాత్మనే పేర్కొనబడుతున్నాడు. **సర్వాణి హవా ఇమాని భూతాని ప్రాణమే వాభిసంవిశన్తి ప్రాణమభ్యుజ్జి హతే.** ఈ భూతాలు అన్నీ ప్రాణములోనికే ప్రవేశించుతున్నది. ప్రాణమునే వదిలిపెడుతున్నవి. అని ప్రాణశబ్దము పరమాత్మ అనే అర్థము చెప్పడం లోనూ ప్రసిద్ధిని కలిగి ఉన్నది. ప్రాణావావ ఋషయః అని ఋషి శబ్దము కూడా సర్వజ్ఞుడైన ఆ పరమాత్మ యందే తగినదై ఉన్నది. కానీ అచేతనమైన ఇంద్రియాలు అని అర్థము చెప్పడంలో కాదు.

ఋషయః ప్రాణాః అని ఉన్న వాక్యములోని బహువచనము ఒక్కడే ఐన పరమాత్మ యందు ఏ విధంగా చెల్లుతుందంటే చెపుతున్నాడు.

సూ॥ **గౌణ్యసమ్భవాత్ తత్ ప్రాక్ శ్రుతేశ్చ 2-4-2** బహవచనము చెప్పే శ్రుతి గౌణీ. అప్రధానము ఐనది. ముఖ్యము కాదు బహువచనము యొక్క చాలా అనే అర్థము సమ్భవించదు. ఆ పరమాత్మ ఒక్కడే సృష్టికి పూర్వకాలములో ఉన్నాడని శ్రుతియే చెప్పుతున్నది కాబట్టి.

సూ॥ **తత్ పూర్వకత్వాద్వాచః 2-4-3** ఈ చెప్పబోయే హేతువు వలన కూడా ప్రాణశబ్దము పరమాత్మను గురించే చెపుతున్నది. వాచః – పరమాత్మ కంటే వేరుగా ఉన్న విషయము యొక్క – నామధేయము వాక్కులకు విషయము ఐన వియదాది సృష్టిని ముందుగా చెప్పుతున్నది కాబట్టి. **తద్ధ ఇదమ్ తర్హి అవ్యాకృత మాసీత్ తన్నామ రూపాభ్యాం వ్యాక్రియత.** అందువలన ఇప్పటి ఈ ప్రపంచము అప్పుడు సృష్టికి మునుపటి కాలములో విభాగము చేయబడకుండా ఉండినది. దాన్ని నామము రూపములతో వేరువేరు చేసినారు. అని నామ రూపాలు కలవి లేవు కాబట్టి అపుడు వాక్కు మొదలైన ఇంద్రియాల కార్యాలు లేవు కాబట్టినీ ఆ ఇంద్రియాలు లేవు అని అర్థము. కావున ఇంద్రియాలు పుట్టుకను కలిగినట్టివే. **ఇది ప్రాణోత్పత్తి అధికరణము.**

★ ★ ★

## ఇక సప్తగతి అధికరణము.

సూ॥ **సప్తగతేః విశేషిత త్వాచ్చ 2-4-4** ఇంద్రియాలు ఏడు మాత్రమే. జీవుని వెంట జనన మరణాల్లో వస్తూ పోతూ ఉన్నందువల్ల. ఏడు అనే విశేషణముతో విశేషింపబడినవి కనుకనూ. ఆ ఇంద్రియాలు ఏడే ఉన్నాయా? లేక పదకొండా? అని విచారింపబడుతున్నది. సంశయము ఎందువల్ల అంటే వేదమే రెండు రకాలుగానూ చెప్పుతున్నందువల్ల. ఐతే తేల్చబడిన విషయము ఏమిటంటే ఏడే అని. ఎందుకంటావా? గతివల్ల, విశేషణము వల్ల. గతి ఐతే పుడుతూ చస్తూ ఉండే జీవునితోపాటు లోకాల్లో సంచరించుతున్నవి ఏడే అని చెప్పబడుతున్నవి. **సప్త ఇమేలోకాః యేషు చరన్తి ప్రాణాః గుహాశయా నిహితాః సప్తసప్త** ఈ ఇంద్రియాలు ఏడు. ఇవి హృదయగుహాలో ఉండేవానితో పాటు లోకాలనన్నింటిలో సంచరిస్తున్నవి. అని. సప్త సప్త అని రెండు సార్లు చెప్పడం – వీప్స – పురుషులలో ఉండే భేదాన్ని బట్టి. జీవులు అనేకులు కాబట్టి ఏడే అని తెలుపడం కొఱకు. వాటియొక్క స్వరూపముతో పాటు విశేషణములు కలవై రాకపోకలతో విశేషింపబడుతున్నవి.

**శ్లో॥ యదాపంచావతిష్ఠన్తే జ్ఞానాని మనసాసహ। బుద్ధిశ్చనవిచేష్టేత తామాహుః పరమాంగతిమ్॥** ఎప్పుడు ఐతే మనస్సుతోపాటు ఐదు జ్ఞానేంద్రియాలు బుద్ధి నిలిచిపోతాయో, బుద్ధి ఎంతమాత్రమూ పనిచేయదో ఆ స్థితిని పరమాగతి – యోగము – అని అంటారు అని. శరీరంలో సంచరించడమును మానుకొని మోక్షము కొరకు బయలుదేరిపోవడము పరమాగతి అని అనబడుతుంది. ఈ విధంగా జీవునితో

కలసి జనన మరణాలలో ఏడు మాత్రమే వస్తూ పోతూ ఉన్నవని గతి వినిపిస్తున్నది. యోగదశలో **"జ్ఞానాని"** అని విశేషణము వేయబడినందువల్ల జీవునికి కరణాలు (ఇంద్రియాలు) చెవులు, చర్మము, కండ్లు, నాలుక, ముక్కు, బుద్ధి, మనస్సు మొత్తము ఏడే అని తెలుస్తున్నది. ఇతరములైనవి ఇప్పుడు చెప్పబడినవి కాక తక్కినవి ఏవిఉన్నవో అవి విషయాలను గ్రహించేవి కాబట్టి **అష్టౌగ్రహాః సప్తవై శీర్షణ్యాః ప్రాణాః ద్వావవాంచౌ** ఇత్యాదుల యందు దాదాపు పదునాలుగు వరకు ప్రాణ (ఇంద్రియాలు) ములను ప్రతిపాదించే వాక్యాలయందు వాక్, పాణి, పాద, పాయు, ఉపస్థ, అహంకార, చిత్తము అనే పేర్లు గలవి కనపడ్తున్నాయి వాటికి జీవుడితో పాటు గతి (రాకపోకలు) వినిపించడము లేదు గనుక, జీవునికి వాటివలన చాలాచాలా కొంచెమే ఉపకారము కలుగుతున్నందు వలన వాటిని ప్రాణములు అని అనడము మర్యాద కొఱకు మాత్రమే. ఈ విధంగా పూర్వపక్షము సిద్ధముఐతే చెప్పుతున్నాము.

సూ॥ **హస్తాదయస్తు స్థితే అతోనైవమ్. 2-4-5** చేతులు మొదలుగా మరికొన్ని ఇంద్రియాలు ఉన్నవి. జీవుడు (అవి) కార్యభేదముతో విడిగా కనిపిస్తున్నవి. కనుక నీవు అన్నట్లు ఏడు మాత్రమే కాదు. ఇంద్రియాలు ఏడు మాత్రమే కావు. పదకొండు ఉన్నవి. జీవుడు దేహములో ఉంటూండగా అతడికి చేతులు మొదలైనవి భోగోపకరణాలు అవుతున్నాయి. కార్యములో అవి చేసే పనుల్లో భేదాలూ ఉన్నవి. శ్రోతము మొదలైన జ్ఞానేంద్రియాల వలెనే హస్తాదులైన కరణేన్ద్రియాలకు తీసుకురావడం, తీసుకొనిపోవడము మొదలైన కార్య భేదాలు ఉండనే ఉన్నవి. కనుక అవి కూడా ఉన్నవి. కాబట్టి చేతులు మొదలైనవి లేవని తలచవద్దు అని అర్థము. 1) అధ్యవసాయము 2) అభిమానము 3) చిన్తా అనే వృత్తి భేదాలవల్ల / పోకడల వల్ల మనస్సే 1) బుద్ధి 2) అహంకారము 3) చిత్తము అనే పేర్లతో పేర్కొనబడుతున్నది. కనుక ఇంద్రియాలు పదకొండు మాత్రమే. (ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు, ఒక్కటి మనస్స, మొత్తమ్మీద పదకొండే. మహత్తు / బుద్ధితో సహకరించబడిన మనస్సు అధ్యవసాయము అని, అహంకారముతో కూడినప్పుడు అభిమానము అని, ముందటి సంస్కారముల వల్ల కలిగిన విశేషాలతో సహకరింపబడినప్పుడు మనస్సు చిన్తను చేస్తుంది కనుక అప్పుడు చిన్తా అని అంటాము). కనుక **దశేమే పురుషే ప్రాణాః ఆత్మా ఏకాదశ** పురుషుడికి పది ఇంద్రియాలు ఉన్నవి. పదకొండవది మనస్సు అని ఆత్మ శబ్దముతో మనస్సు చెప్పబడుతున్నది. **శ్లో॥ ఇన్ద్రియాణి దశైకంచ పంచచేన్ద్రియగోచరాః। 2) తైజసానీంద్రియాణ్యాహుః దేవావైకారికాదశ। ఏకాదశం మనశ్చాత్ర.** ఇంద్రియాలు పదిన్నీ

ఒక్కటిఉ(11) పదకొండు. ఇక ఇంద్రియాలచేత తెల్సుకోబడేవి ఐదు అని. శబ్ద స్పర్శరూపరసగంధాలు 2) తేజస్సమ్బన్ధమైన వాటిని ఇంద్రియాలు అని అంటారు. అవి వైకారికములు. మొత్తము అవి పదకొండు ఉన్నవి. వీటిలో మనస్సు పదకొండవది. అని శ్రుతి స్మృతులు చెప్పుతున్న ప్రకారము ఇంద్రియ సంఖ్యావ్యవస్థ ఏర్పడి ఉన్నది. అంతకంటే ఎక్కువ ఉన్నాయనడము మనస్సు యొక్క వృత్తి / వ్యాపారభేదాలను బట్టి. తక్కువ అనడమేమో అక్కడక్కడ చూపబడిన వివక్ష ప్రకారము, గమనాది కార్యాల విశేషాలను బట్టి ఏర్పర్చబడినవి. కనుక ఇంద్రియాలు పదకొండు మాత్రమే. **ఇది సప్తగతి అధికరణము.**

★ ★ ★

### ఇక ప్రాణాణుత్వాధికరణము.

సూ॥ **అణవశ్చ 2-4-6** ఈ ఇంద్రియాలు అణువంత పరిమాణము కలవి కూడా! **తఏతే సర్వఏవసమాః సర్వేఽనన్తాః** ఈ ఇంద్రియాలన్నీ సరిసమానమైనట్టివి. అన్నీ అనన్తాలే అని ఆనన్త్యము వినిపిస్తున్నందువల్ల ఇవి విభువులు – అన్నిచోట్లలోనూ ఉండేవి. అని పూర్వపక్షము రాగా చెప్పబడుతున్నది. **ప్రాణమనూ త్క్రామన్తం సర్వేప్రాణాః అనూత్క్రామన్తి** శరీరాన్ని వదిలి లేచిపోతున్న జీవుడిని అనుసరించి ఇంద్రియాలు కూడా అతని వెంట దేహాన్ని వదిలిపెట్టి పోతున్నవి అని ఉత్క్రాన్తి వినిపించుతున్నదికాబట్టి వాటికి పరిమితత్వము ఏర్పడుతున్నది. కాగా ఉత్క్రాన్తి వేళలో మరణించే జీవుని చుట్టూ ఉన్న బంధువులు పక్కన ఉన్నవారికీ మొదలైన వారికి కనిపించడంలేదు కాబట్టి ఇంద్రియాలు అణువంతటివి. అనన్తము లైనవి అని చెప్పే శ్రుతి మాత్రము **అథయోహైతాన్ అనన్తానుపాస్తే** ఇక ఎవడైతే అనన్తాలైన వీటిని ఉపాసిస్తున్నాడో అని ఉపాసన వినిపించుతున్నందువలన ఉపాస్యుడైన ప్రాణునికి విశేషమైన కార్యముల యొక్క బాహుళ్యము వలన అని అభిప్రాయము.

సూ॥ **శ్రేష్ఠశ్చ 2-4-7** శ్రేష్ఠమైనది కూడా. ప్రాణసంవాదము నందు శరీరము నిలువడానికి కారణమవుతున్నందున ముఖ్యప్రాణము శ్రేష్ఠమని నిర్ణయింపబడింది. **ఆనీద వాతం స్వధయా తదేకమ్.** ఆ ఒక్కటిగా నున్నది స్వధతో కూడినది అని మహా ప్రలయము జరిగినప్పటి కాలములో తన కార్యమైన ప్రాణనము ఉన్నట్లు వినిపించుతున్నందువల్ల ఏత స్మాజ్జాయతే – దీనినుండి / వీడినుండి పుట్టుచున్నది. అని జీవుని జన్మము వినిపించుతున్నట్లే పొసగుతున్నది కనుక ప్రాణము పుట్టడము

లేదు అని శంకించి సృష్టికి మునుపటి కాలములో సత్పదార్థము ఒక్కటే ఉన్నది అని నిశ్చయింపబడినందువల్ల ముఖ్య ప్రాణము కూడా ఉన్నది అనేట్లయితే వైరుధ్యం వస్తుంది కనుక **ఏతస్మాత్ జాయతే ప్రాణః** అని పృథివీ మొదలైన వాటితో సమానంగా ఉత్పత్తి వినిపించుతున్నందువల్ల, పుట్టుక లేదని నిషేధము లేకపోవడం వల్ల కూడా శ్రేష్ఠ ప్రాణము పుడుతున్నది అని చెప్పబడుతున్నది. ఆనీదవాతం అనే వాక్యము మాత్రము జీవుడికి సమ్బన్ధించిన ప్రాణాన్ని ఉద్దేశించి చెప్పబడలేదు. కానీ పరబ్రహ్మ ఒక్కడే ఉన్నాడు అని ఆయన ఉనికిని గురించే చెప్పుతున్నది. ఆ వాక్యము లోనే అవాతమ్ – గాలి లేకుండా ఉన్నది – అని వినిపించుతున్నది కదా! ముందు చెప్పిన అధికరణము లోని సూత్రముతో సమానమే / మిగతా ఇంద్రియాలతో ముఖ్య ప్రాణము సమానమే ఐనా విడిగా జతచేసి చెప్పడము తరువాత చేయబోయే విచారము కొరకు మాత్రమే అని గ్రహించాలి. **ఇది ప్రాణాణుత్వాధికరణము.**

★ ★ ★

## ఇక వాయుక్రియాఅధికరణము.

సూ॥ **నవాయుక్రియే పృథగుపదేశాత్ 2-4-8** ఈ శ్రేష్ఠప్రాణము మహాభూతాల్లో రెండవదైన గాలి మాత్రమేనా? దాని యొక్క స్పన్దన రూపమైన క్రియనా? లేక వాయువే ఒకానొక విశేషాన్ని పొందినటువంటిదా? అని సందేహము కలిగినప్పుడు వాయువే అని నిర్ణయమయ్యింది. **యః ప్రాణః సవాయుః** ఏది ప్రాణమో అదే వాయువు అని పేర్కొన్నారు కనుక. లేదా కేవల వాయువు నందు ప్రాణము అనే ప్రసిద్ధి లేదు కాబట్టి ఉచ్ఛ్వాస నిశ్వాస మొదలైన వాయువు యొక్క క్రియయందు ప్రాణము అనే శబ్దము యొక్క ప్రసిద్ధి ఉన్నది. కావున వాయువు యొక్క క్రియనే అని పూర్వపక్షము రాగా గాలి మాత్రమే కాదు. మరియు దాని క్రియ కూడా కాదు అని చెప్పబడుతున్నది. ఎందువల్లనంటే విడిగా చెప్పినారు కాబట్టి. **ఏతస్మాత్ జాయతే ప్రాణో మనః సర్వేంద్రియాణిచ। ఖమ్ వాయుః.** ఇతడి నుండే ప్రాణము మనస్సు సర్వేంద్రియాలు ఆకాశము వాయువున్నూ పుడుతున్నవి అని. అందువల్లనే (వాయుక్రియఐ నందువల్ల) విడిగా వాయుః అని చెప్పినందువల్ల వాయుక్రియ కూడా ప్రాణము కాదు. తేజస్సు మొదలైన వాటియొక్క క్రియలు వాటితో సహా వేరు ద్రవ్యాలుగా చెప్పబడడము లేదు. **యః ప్రాణః సవాయుః** అనే వాక్యము మాత్రము వాయువే మరొక్క అవస్థను పొందినదై ప్రాణము అని పిలువబడుతున్నది తేజస్సు మొదలైన వాటి వలె మరొకతత్వము కాదని గుర్తుచేయడానికే చెప్పబడింది. ఉచ్ఛ్వాస నిశ్వాసాదుల యందు కూడా ప్రాణము

ఆడుతున్నది (ఊపిరి ఆడుతున్నది) అని క్రియతో కూడిన వాయు ద్రవ్యమునందే ప్రాణశబ్ద ప్రసిద్ధి ఉన్నది. కేవలము క్రియ యందు కాదు.

ఐతే ఈ ప్రాణము వాయువు యొక్క వికారము అవుతూ అగ్ని వలె మరొక భూతమా? అంటే కాదంటున్నారు.

సూ॥ **చక్షురాది వత్తు తత్సహ శిష్ట్యాదిభ్యః 2-4-9** కన్ను మొదలైన వాటివలె జీవునికి ఉపకరణ విశేషమే ఇది. దానికి సమానమైన వాటితో కలిపి శాసనము మొదలైనవాటియందు శాసింపబడుతున్నందువలన. ఈ ముఖ్య ప్రాణము భూత విశేషము కాదు. కానీ కన్ను మొదలైన వాటివలె జీవుని యొక్క ఉపకరణములలో ఒకటి మాత్రమే. ఆ విధంగా దీనికి ఉపకరణత్వము ఉపకరణములలో ప్రత్యేకములైన ఇంద్రియాదులతో కూడి కలిసి శానము చేయుట వాటివల్లతెలియబడుతున్నది. చక్షురాదులతో సహా ఈ ప్రాణము ప్రాణసంవాదము మొదలైనవాటిల్లో శాసింప బడుతున్నది. వాటితో సమానమైనది అయినప్పుడే వాటితో పాటు శాసింపబడడము కుదురుతుంది. ప్రాణశబ్దముచే చెప్పబడే కరణములయందు దీన్ని ప్రత్యేకించి చెప్పడము సూత్రము లోని ఆది శబ్దం చేత గ్రహింపబడుతున్నది. **అథహ య ఏవాయం ముఖ్యః ప్రాణః. యోఽయం మధ్యమః ప్రాణః** ఇత్యాదివాక్యాల యందు ముఖ్య ప్రాణము, మధ్యమ ప్రాణము ఇత్యాదుల యందు ముఖ్య, మధ్యమ పదాల చేత విశేషణము కూర్చబడి చెప్పినందువల్ల.

కండ్లు మొదలైన వాటివలె ఇది కూడా ఒక కరణము – ఇంద్రియము / సాధనము ఐనట్లయితే వాటి వలెనే జీవుడి గురించి ప్రత్యుపకార విశేషరూప క్రియగా కావలసి ఉంటుంది. కానీ అది కనిపించడము లేదు. కనుక ఈ ముఖ్య ప్రాణము చక్షురాదులవలె కావడానికి వీలులేదు అని అంటే దానికి సమాధానమును చెపుతున్నారు.

సూ॥ **అకరణత్వాచ్చ నదోషః తథాహి దర్శయతి 2-4-10** క్రియ కాదు కాబట్టి ఏ దోషము వస్తుందని ఊహించుతున్నారో అది లేదు. అట్లాగని వేదము చూపించుతున్నది. కరణము కానందువల్ల. కరణము అనగా క్రియ. కనుక అకరణత్వాత్ అని అంటే క్రియ కానందువల్ల అని అర్థము. ఈ ప్రాణము జీవుడి గురించి ప్రత్యుపకార రూపమైన విశేషక్రియ లేనందువల్ల ఏ దోషము కలుగుతుందని ఊహింపబడుతున్నదో అది లేదు. ఎందువల్లనైతే ఉపకారవిశేషరూపమైన శరీరాన్ని ఇంద్రియాలనూ ధరించుట / నిల్పుట మొదలైన ఆకారము గల క్రియను శ్రుతి చూపించుతున్నది. **యస్మిన్ ఉత్క్రాన్తే**

**ఇదం శరీరం పాపిష్ఠతరమివదృశ్యతే. స వః శ్రేష్ఠః.** ఏది గనుక ఈ శరీరములో నుండి లేచిపోతే శరీరము పాపిష్ఠతరము ఐన దానివలె కనిపిస్తుందో అది మీకంటే శ్రేష్ఠమైనట్టిది అని చెప్పి వాక్ మొదలైనవి లేచిపోయినా కూడా ప్రాణము లేచిపోయినప్పుడు మాత్రం శరీరము ఇంద్రియాలు చేతకానివి అవడాన్ని చెప్పినారు కాబట్టి. కనుక ప్రాణ అపాన వ్యాన ఉదాన సమానములు అనే ఆకారాలతో ఐదు రకాలుగా ఉన్నదైన ఈ ప్రాణము శరీరాన్ని ఇంద్రియాలను ధరించి/ నిలిపి ఉంచుట ద్వారా జీవుడికి ఉపకారాన్ని చేస్తున్నది. కనుక కండ్లు మొదలైనవాటి వలె ఉపకరణము అవుతున్నది.

ఐతే ఈ విధంగా పేరులో, కార్యములో / పనిలో భేదము ఉన్నందువలన ప్రాణాపానాదులు వేరువేరు తత్త్వాలు కావచ్చును కదండీ! అని అంటే చెప్పుతున్నారు.

సూ॥ **పంచవృత్తిః మనోవత్ వ్యపది శ్యతే 2-4-11** ఐదు విధాలుగా ఉన్న ఈ ప్రాణము మనస్సు వలె చెప్పబడుతున్నది. ఎట్లాగైతే కామాదులుగా ఉండడము, వాటి పనుల్లోనూ భేదము ఉండడములు కనిపించుతున్నా కూడా కామము మొదలైనవి మనస్సు కంటే వేరయిన మరొక తత్త్వాలు కావో అట్లాగే ఈ ప్రాణము కూడా. **కామస్సంకల్పో విచికిత్సా శ్రద్ధాఽశ్రద్ధా ధృతి రధృతిః హ్రీ ధీః భీః ఇత్యేతత్ సర్వమ్ మన ఏవ.** కామము(కోరిక) సంకల్పము, విచికిత్సా(సందేహము) శ్రద్ధా – తొందర, అశ్రద్ధ, ధృతి / ధైర్యము, అధైర్యము, సిగ్గు, తెలివి(చిన్త), భయము. ఇవన్నీ మనస్సుయొక్క రూపాలే. అని వచనము ఉన్నది కాబట్టి. ఇట్లాగే ప్రాణము అపానము వ్యానము ఉదానము మొదలైనవి అన్నీ కూడా ప్రాణము యొక్క ఉనికిని బట్టి ఏర్పడిన విశేషాలే. వేరే తత్త్వములు కావని తెలుస్తున్నది. హృదయము నందు ఉండే వాయువు ప్రాణము అనబడుతుంది. మలవిసర్జన స్థానము నందుండేది అపానము బొడ్డు దగ్గర ఉండేది సమానము, కంఠము / గొంతు వద్ద ఉండేది ఉదానము ఇక వ్యానము శరీరమంతటా వ్యాపించి ఉంటుంది. **ఇది వాయుక్రియాధికరణము.**

★ ★ ★

## ఇక శ్రేష్ఠాణుత్వాధికరణము.

సూత్రము। **అణుశ్చ 2-4-12** ఈ వాయువు అణువు కూడా అవుతున్నది. ఉత్క్రాన్తి మొదలైనవి వినిపిస్తున్నవి కనుక ఈ ప్రాణము అణువు కూడా **తముత్క్రామన్తం ప్రాణోఽనూత్క్రామతి** ఇత్యాది వాక్యాలు ఇందుకు ప్రమాణాలు. అధికశంక ఏమిటంటే **సమఏభిః త్రిభిర్లోకైః సమోఽ నేన సర్వేణ.** ఈ మూడు లోకాలతో సమానంగా. దీనికి

సమానమైన ఈ మొత్తముతో. **ప్రాణేసర్వమ్ ప్రతిష్ఠితమ్.** ప్రాణము నందు అంతా నిలదొక్కుకుని ఉన్నది. **సర్వం హీదం ప్రాణే నావృతమ్.** ఈ కనిపించే దంతా ప్రాణము చేత ఆవరించబడి యున్నది. ఇత్యాది వాక్యాలు వినిపించుతున్నందువలన ఇది మహా (పెద్ద) పరిమాణము కలది అని. పరిహారము ఏమిటంటే – ఉత్క్రాన్తి మొదలైనవి వినిపించుతున్నందువల్ల పరిచ్ఛేదము – విడదీత / వేరు చేయబడుట నిశ్చయము చేయబడగా ప్రాణి సముదాయమంతా కూడా ప్రాణము పైననే ఆధారపడి ఉండడము వల్ల ప్రాణము గొప్ప ప్రభావము కలది అని చెప్పే వైభవవాదము చెల్లుతుంది – అని. **ఇది శ్రేష్ఠాణుత్వాధికరణము.**

★ ★ ★

## ఇక జ్యోతిరాద్యధిష్ఠానాధికరణము.

సూ॥ **జ్యోతి రాద్యధిష్ఠానం తు తదామననాత్ ప్రాణవతా శబ్దాత్ 2-4-13** అగ్న్యాదులపై అధికారము కల్గి ఉంటున్నాడు జీవుడు కానీ అది ఆ పరమాత్మ యొక్క సంకల్పముపైన ఆధారపడి ఉన్నది. అట్లాగని వేద శబ్దము చెప్పుతున్నది.

శ్రేష్ఠ ప్రాణము మొదలైన ఇంద్రియాలు బ్రహ్మ నుండి పుట్టినవి. అవి ఇన్ని అని వాటికి ఒక్కొక్క దానికి ఇంత ఇంత అనే పరిమితి కూడా చెప్పబడింది. వాటికి పైన అగ్నిదేవుడు మొదలైనవారు అధిష్ఠాతలుగా ఉన్నారు. అనే విషయమున్నూ ఇంతకు మునుపే **అభిమానివ్యపదేశస్తు విశేషానుగతిభ్యాం** అనే సూత్రముతో ప్రాసంగికముగా వివరించడం, అయ్యింది. జీవుడు తన భోగాలకు సాధనమైన ఈ ఇంద్రియాలపైన అధిష్ఠాతగా ఉన్నాడనే విషయము లోకములో అందరికీ తెల్సినదే. **ఏవమే వైషఏతాన్ ప్రాణాన్ గృహీత్వాస్వేశరీరేయథా కామం పరివర్తతే.** ఈవిధంగా ఈ ఇంద్రియాలను చేతపట్టుకొని తన శరీరములో జీవుడు తన ఇష్టము ప్రకారము తిరుగుతున్నాడు ఇత్యాది శ్రుతివాక్యాల చేతనున్నూ అదే విషయము తెలుస్తున్నది. అయితే జీవుడికి అగ్న్యాది దేవతలకున్నూ ప్రాణాలపైన ఉండే అధికారము స్వతంత్రమైనదా? లేక పరమాత్మకు లొంగి ఉండేదా? అని సందేహము కలిగితే ఇంకొకని అవసరము లేకుండా స్వంతముగానే ఉపయోగించడము కనిపించుతున్నది. కావున స్వాయత్తము అని నిర్ణయము చేయబడగా దానిపై సమాధానాన్ని చెప్పుతున్నారు. జ్యోతిరాద్యదిష్ఠానమ్ అని. ప్రాణవతా – జీవునితో కలసి, జ్యోతి రాదీనాం అగ్ని మొదలైన దేవతలకు ఇంద్రియాలపై అధిష్ఠాతృత్వము, తదామననాత్ ఉఆ పరమాత్మ

యొక్క ఆమననము వలన జరుగుతుంది. ఆమననం = అంటే అనుకూలంగా తలచడము. పరమాత్మ యొక్క సంకల్పము వలననే జరుగుతుంది. ఎందువల్ల ఇట్లా? అని అంటే శబ్దాత్ఽఇంద్రియాలపైన వాటిని అభిమానించే దేవతలు జీవాత్మకున్నూ తమ పనులపైన (ఇంద్రియాలు చేసే పనుల మీద) పరమపురుషుని యొక్క సంకల్పము పైన ఆధారపడి ఉంటున్నది అని వేదశాస్త్రము వినిపించుతున్నందువల్ల. ఎట్లాగా అని అంటే అన్తర్యామి బ్రాహ్మణము మొదలైన వాటియందు. **యోఽగ్నౌతిష్ఠన్ అగ్నే రన్తరః యమగ్ని ర్నవేద యస్యాగ్నిః శరీరమ్ యోఽగ్నిమన్తరోయమయతే. సతే ఆత్మా అన్తర్యామీ అమృతః, యో వాయౌతిష్ఠన్, యో ఆదిత్యేతిష్ఠన్, యః ఆత్మనితిష్ఠన్. యః చక్షుషి తిష్ఠన్ అని వినిపిస్తున్నది. ఇంకా భీషాఽస్మాద్వాతః పవతే భీషో దేతి సూర్యః। భీషాఽస్మాదగ్నిశ్చేంద్రశ్చ మృత్యుః ధావతి పంచమ ఇతి.** ఇతడి నుండి కలిగే భయము వల్ల గాలి వీస్తున్నది. భయము చేతనే సూర్యుడు సకాలంలో ఉదయిస్తున్నాడు. అదే విధంగా అగ్ని దేవుడు ఇంద్రుడున్నూ తమ తమ విధులను నిర్వహించుతున్నారు. చివరికి యమధర్మరాజు కూడా నన్ను ఏ విధంగా దండించుతాడోనని భయముతో తన విధులను నిర్వహిస్తున్నాడు అని. ఇంకా **ఏతస్య వాఅక్షరస్య ప్రశాసనే గార్గి సూర్యాచంద్రమసౌ విధృతౌ తిష్ఠతః.** ఇత్యాదులున్నూ చెపుతున్నవి.

సూ॥ **తస్య చ నిత్యత్వాత్. 2-4-14** పరమాత్మ సర్వాధిష్ఠాత అయ్యి ఉండడానికి హేతువు అతడు నిత్యం అయ్యి ఉండడము వల్లనే. అందరిపైన పరమాత్మ యొక్క అధికారము / అధిష్ఠాతృత్వము నిత్యము అయినందువల్ల. స్వరూపాన్ననుసరించి ఉండడము నియతముగా / తప్పనిసరిగా ఉండడం వలననున్నూ ఆయన సంకల్పాన్ని అనుసరించే వీరికి అధిష్ఠాతృత్వము విడువరానిదిగా ఉంటుంది. **తత్ సృష్ట్వాతదేవానుప్రావిశత్. తదనుప్రవిశ్యసత్ చ త్యత్ చ అభవత్.** ఆ శరీరాన్ని పుట్టించి దానిలో జీవుని వెంట అనుప్రవేశము చేసినాడు. ఆ విధంగా ప్రవేశించి తానే సత్తు (జీవుడు) త్యత్తు (ప్రకృతి – శరీరము) అయ్యినాడు. ఇత్యాది వాక్యము ప్రకారము పరమ పురుషుడు వాటికి నియామకుడుగా అన్ని రకాలైన చిదచిత్ వస్తువులలో ప్రవేశించి ఉండడము ఆయన యొక్క స్వరూపానికి తగినది – అనుబంధమైనది అని వినిపించుతున్నది. దాన్నే స్మృతి కూడా చెప్పుతున్నది. **విష్టభ్యాహమిదం కృత్స్నం ఏకాంశేన స్థితో జగత్ ఇతి।** ఈ జగత్తునంతటినీ నాలోని ఒక్క అంశముతోనే వ్యాపించి ఉన్నాను అని. **జ్యోతి రాద్యధిష్ఠానాధికరణము ముగిసినది.**

★ ★ ★

## ఇక ఇన్ద్రియాధికరణము.

సూ॥ **త ఇంద్రియాణి తద్వ్యపదేశాత్ అన్యత్రశ్రేష్ఠాత్ 2–4–15** శ్రేష్ఠప్రాణానికంటే వేరయినవే ఇంద్రియాలు. వాటియందే ఆ పేరు వర్తిస్తున్నదని పేర్కొంటున్నారు కనుక. ప్రాణశబ్దము చేత నిర్దేశింపబడినవన్నీ ఇంద్రియాలేనా?లేక శ్రేష్ఠ ప్రాణము కంటే వేరయినవా? అని సందేహము వస్తే ప్రాణశబ్దము చేత చెప్పబడుతున్నందువలన, కరణములు అవుతున్నందువల్ల ఇంద్రియాలన్నీ అని పూర్వపక్షము రాగా చెపుతున్నారు. శ్రేష్ఠప్రాణాని కంటే వేరైన ఇంద్రియాలు. ఎందువల్లనంటే ఆ పేరు వాటియందు మాత్రమే వర్తించుచున్నది కాబట్టి. **ఇంద్రియాణి దశైకంచ పంచచేంద్రియగోచరాః.** ఇంద్రియాలు పదిన్నీ ఒక్కటి – ఐదు ఇంద్రియాలు తెలియజేసేవి. ఇత్యాది వాక్యాలచేత కన్ను మొదలైన వాటియందు మనస్సుతో కలిసిన వాటియందు ఇంద్రియాలు అని పేర్కొనబడుతున్నది.

సూ॥ **భేద శ్రుతేః వైలక్షణ్యాచ్చ 2–4–16** శ్రేష్ఠప్రాణము భేదము కలదిగా శ్రుతి చెప్తున్నది. మరియు దానికీ ఇతర ఇంద్రియాలకున్నూ వైలక్షణ్యము ఉన్నది కాబట్టిన్నీ. **ఏతస్మాజ్జాయతే ప్రాణోమనస్సర్వేన్ద్రియాణిచ.** ఇతడి నుండే ప్రాణము మనస్సు ఇంద్రియాలు అన్నీ పుడుతున్నవి ఇత్యాది వాక్యాల యందు ప్రాణము వేరుగా / విడిగా వినిపించుతున్నది కాబట్టి. ప్రాణాని కంటే వేరయినవాటికి మాత్రమే ఇంద్రియత్వము ఉన్నట్లు తెలుస్తున్నది. మనస్సు మాత్రము విడిగా వినిపించినా దాని గురించి మరొక చోట ఇంద్రియాలలో కలసిపోయి ఉండుట వినిపించుతూ ఉన్నది. ఇంద్రియాలలో కల్సిపోవుటను చెప్పినారు. **మనః షష్ఠాని ఇంద్రియాణి** మనస్సుతో కలిపి ఆరు ఇంద్రియాలు ఇత్యాది వాక్యాలలో ఇక వాటికి శ్రేష్ఠ ప్రాణానికి ఉన్న వైలక్షణ్యము ఇట్లాగా ఉన్నది. సుషుప్తి యందు ప్రాణము పనిచేయుట కనిపించుతున్నది. కన్ను మొదలైనవి తమ పని చేస్తూండడము కనిపించడము లేదు. వాటి పని ఏమిటంటే కన్ను (చూపు) మాట – మనస్సుతో పాటు కలసి – జ్ఞానాన్ని కలిగించుట అనే కర్మకు సాధనమై, ఉండడము. ప్రాణము మాత్రము శరీరాన్ని ఇంద్రియాలను నిలుపుతుంది. ప్రాణము పైన ఆధారపడి ఇన్ద్రియాలు నిలుస్తున్నాయి కాబట్టి ఇంద్రియాలను ప్రాణ శబ్దముతో పేర్కొనుట జరుగుతున్నది. అట్లాగని శ్రుతి వినిపిస్తున్నది. **త ఏతస్యైవ సర్వేరూప మభవన్. తస్మాదేతే ఏతేనా ఖ్యాయన్తే.** అవన్నీ దీనియొక్క రూపాలే ఐ ఉన్నవి. కావున

ఇవి దాని పేరుతో పిలువబడుతున్నవి. అని. రూపమ భవన్ అనగా శరీరము ఐనవి. దానికి లొంగి నడచుకొనేవి అయినవి అని అర్థము. **ఇది ఇంద్రియాధికరణము.**

★ ★ ★

## ఇక సంజ్ఞామూర్తిక్లప్తి అధికరణము.

సూ॥ **సంజ్ఞా మూర్తిక్లప్తిస్తు త్రివృత్ కుర్వత ఉపదేశాత్ 2-4-17** సంజ్ఞాఽపేరు, మూర్తిక్లప్తిస్తుఽరూపాన్ని ఏర్పర్చడము పరబ్రహ్మ కార్యమే / పనియే. త్రివృత్ కరణము చేసినవానిదిగా వినిపించుతున్నందువలన. భూతాలు ఇంద్రియాలు మొదలైనవాటియొక్క సమష్టి సృష్టి, జీవులను పుట్టించడమున్నూ పరబ్రహ్మ వల్లనే జరిగిందని దీనికి ముందు చెప్పబడింది. జీవులు తమ ఇంద్రియాలపైన అధికారిగా ఉండడము (అధిష్ఠానము) కూడా ఆ పరమాత్మపైననే ఆధారపడి ఉన్నదని దాన్ని గట్టి చేయడానికి దాన్ని తిరిగి జ్ఞాపకము చేసినారు. ఏదైతే ఈ నామరూప వ్యాకరణాత్మకమైన ప్రపంచములో వ్యష్టి సృష్టి ఉన్నదో అది సమష్టి జీవుడైన హిరణ్య గర్భుని యొక్క కర్మదా? లేక తేజస్సు మొదలైన వాటిని తనకు శరీరముగా చేసుకొన్న పరమాత్మ యొక్క తొలి సృష్టి వలె హిరణ్యగర్భుడిని శరీరముగా కలిగిన పరబ్రహ్మనా? అని ఇప్పుడు విచారించబడుతున్నది. ఏది తగునని అంటే సమష్టి జీవుడిదే అని అంటున్నాము. ఎందువల్లనంటే **అనేన జీవేనాత్మనా అనుప్రవిశ్యనామరూపే వ్యాకరవాణి** ఈ జీవుని ద్వారా నేను ప్రవేశించి ఈ శరీరాలకు నామరూపాలను చేస్తాను. అనే వాక్యము ద్వారా జీవుడిచే చేయబడినదిగా వినిపించుతున్నది కాబట్టి. పరదేవత తనదైన రూపముతో నామరూపే వ్యాకరవాణి అని సంకల్పం చేయలేదు. కానీ తన అంశమైన జీవుని ద్వారా చేస్తాను అని తలచినాడు. అందుకే గదా **అనేన జీవేనాత్మనా** అని చెప్పటము జరిగింది. ఐతే చారుని ద్వారా ప్రవేశించి శతృవుల బలాన్ని లెక్కించుతాను అని అన్నట్లు వ్యాకరవాణి అని ఉత్తమ పురుష మరియు కర్త వాచకమైన పదము నందు ఉన్న క్రియ ఐన ప్రవిశతి – ప్రవేశము లాక్షణికము – లక్షణాశక్తి ద్వారా చెప్పబడడము – అప్రధానము, ముఖ్యవృత్తి కాకుండా పోతుంది కదా! అని అనవచ్చును కానీ అట్లాకాదు. మీరు చూపిన వాక్య ప్రయోగములో రాజు గారు, గూఢచారి ఇద్దరికిన్నీ రూపములో భేదము ఉన్నది. కనుక లక్షణను ఆశ్రయించి అర్థమును చెప్పుకోవలసి ఉంటుంది. ఈ పరమాత్మ విషయంలోనైతే జీవుడు కూడా తన యొక్క అంశమే ఐనందు వల్ల తన స్వరూపమే అవుతున్నది కాబట్టి ఆ రూపముతో ప్రవేశించడము,

వ్యాకరణము / విభజన చేయడమున్నూ తనదే అవుతున్నది కాబట్టి లాక్షణికత్వము ఏర్పడే అవకాశమే లేదు. ఇది సహయోగలక్షణ కల తృతీయా విభక్తి అని అనకూడదు. ఎంతగా కర్తకరణయో స్తృతీయా అని చెప్పినా కర్త్రర్థమేకాకుండా కరణార్థమున్నూ కలిపి చెప్పవలసిన అవసరము లేదు. కారక విభక్తి తేటగా విషయాన్ని తెల్పుతుండగా ఉపపద విభక్తిని ఆశ్రయించడము న్యాయము కాదు. కరణార్థములో తృతీయావిభక్తి చెప్పబడింది అనికూడా అనకూడదు. బ్రహ్మ కర్తగా గల ప్రవేశము, వ్యాకరణము / విభజించడములు రెండున్నూ జీవుడికి చెందినంత వరకు సాధకతమాలు కావు. కర్మలు కావు. ఐతే జీవుడి కర్తృత్వము ప్రవేశముతోనే ముగుస్తుంది. నామరూప వ్యాకరణము మాత్రము బ్రహ్మదే అని చెప్ప వీలులేదు. క్త్వాప్రత్యయము ద్వారా సమానకర్తృకత్వం తోస్తున్నది. జీవుడు తన అంశమే ఐనందువల్ల తన స్వరూపములో అన్తర్భావము ఐనా పరుని యొక్క స్వరూపమును త్రోసిపుచ్చడానికి అనేన జీవేన అని పరాక్త్వముతో పరామర్శ చేయబడింది. కనుక ఈ నామరూపవ్యాకరణము హిరణ్యగర్భుడనబడే చతుర్ముఖబ్రహ్మ చేతనే చేయబడింది. కావుననే స్మృతులలో చతుర్ముఖుని చేత చేయబడే సృష్టిని గురించి చెప్పే సృష్టి ప్రకరణము నందునామ రూపవ్యాకరణము కీర్తింపబడుతున్నది. **నామ రూపంచ భూతానాం కృత్యానాంచ ప్రపంచనమ్। వేదశబ్దేభ్య ఏవాదౌ దేవాదీనాం చకారసః.** భూతాలయొక్క నామము రూపము వాటి పనులు మొదలైన వాటిని వివరించడము, మరియు దేవాదులైన నాలుగు జాతుల యొక్క సృష్టినిన్నీ ఆ బ్రహ్మ వేదశబ్దాలనుండే కావించినాడు. ఇత్యాదులు

ఈ విధంగా పూర్వపక్షము ఏర్పడితే సమాధానము చెప్పబడుతూ ఉన్నది. సంజ్ఞా మూర్తిక్లృప్తిస్తు అని. తు అనే శబ్దము పూర్వపక్షాన్ని తిప్పి కొడ్తున్నది. సంజ్ఞామూర్తిక్లృప్తిః – నామరూపాలను ఏర్పర్చడము – అనేది తేజో అప్ అన్నములను ప్రతిదానిలోనూ తక్కిన రెండు పదార్థాలను కలిపి వేయడము / కొంత కొంత భాగాలుగా కలుపడము పరబ్రహ్మ యొక్క పనే. నామ రూప వ్యాకరణము ఆయనదే అని ఉపదేశించుతున్నందువల్ల. త్రివృత్ కరణమును చేసినవాడే నామరూప వ్యాకరణాన్ని చేసినాడని ఉపదేశింపబడుతున్నది. **సేయందేవతైక్షత. హన్త. అహమిమాస్తి స్రోదేవతాః అనేన జీవేనాత్మనాఽనుప్రవిశ్యనామరూపే వ్యాకరవాణి. తాసాం త్రివృతం త్రివృతమేకైకాంకరవాణి.** ఆ దేవత సంకల్పించింది. ఆహో! నేను ఈ ముగ్గురు దేవతలలో ఈ జీవుడికి ఆత్మనైన నేను ప్రవేశించి నామరూపాలను ఏర్పరుస్తాను. వాటిలో ఒక్కొక్క దాన్ని మూడు మూడు పదార్థాలు కల్సి ఉన్నదాన్ని

ప్రతిదాన్ని చేస్తాను అని సమాన కర్తృకత్వము – జీవపరమాత్మల కిద్దరికీ కర్తృత్వము సమానంగా ఉన్నట్లు వినిపించుతున్నది. త్రివృత్ కరణము అనేది అండములో ఒక భాగముఐ ఉన్న చతుర్ముఖుడికి కలుగదు. త్రివృత్ కరణము చేయబడిన తేజో అప్ అన్నములతో అండము పుడుతున్నది కదా! చతుర్ముఖుడు అండములో పుట్టినాడు అని స్మృతి చెప్పుతున్నది. **తస్మిన్నండేఽభవత్ బ్రహ్మాసర్వలోకపితామహః.** సర్వలోకాలకు తాతగారైన బ్రహ్మ ఆ అండము నందే పుట్టినాడు. అని కనుక త్రివృత్ కరణము పరమాత్మ పనే. కనుక సమాన కర్తృత్వము ఐన నామరూప వ్యాకరణమున్నూ ఆయనదేనని తెలుస్తున్నది. ఐనప్పుడు అనేన జీవేన అని ప్రయోగించుట ఎట్లా పొసగుతుంది? అని అంటే విను. ఆత్మనా జీవేన అని సామానాధికరణ్యము (చేత) వల్ల జీవుడిని శరీరముగా కల పరబ్రహ్మనే జీవశబ్దము చేత చెప్పబడుతున్నాడు. ఎట్లా అంటే తత్తేజ ఐక్షత, తదపోఽసృజత. తా ఆప ఐక్షన్త. తా అన్నమసృజన్త అని తేజస్సు మొదలైనవాటిని శరీరముగా గల పరబ్రహ్మనే చెప్పబడుతున్నాడు. కనుక జీవసమష్టి పురుషుడైన హిరణ్య గర్భుడిని శరీరముగా చేసుకొని ఉన్న పరబ్రహ్మ యొక్క కర్మనే నామరూప వ్యాకరణము. కాగా ప్రవిశ్యానామరూపే వ్యాకరవాణి. అనే వాక్యము లోని ప్రవేశము, ఉత్తమ పురుష కూడా ఏ చిక్కులేని ముఖ్యార్థ వాచకాలే అవుతవి. ప్రవేశవ్యాకరణాలు రెండూ సమానకర్తృకాలే అవుతవి. చతుర్ముఖుడిని శరీరముగా చేసుకొన్న పరబ్రహ్మ యొక్క కర్మ దేవాది విచిత్ర సృష్టి అని చతుర్ముఖుడిని కర్తగా గల సృష్టి ప్రకరణము నందు నామరూప వ్యాకరణ ఉపదేశమున్నూ పొసగుతుంది. కనుక సేయం దేవతా ఇత్యాది వాక్యానికి ఇదీ అర్థము – ఈ తేజోఽబన్న రూపాలైన ముగ్గురు దేవతలు అనేన జీవేన – జీవసమిష్టి పురుషుడితో విశిష్టుడు / కూడి ఉన్నవాడు ఐన నేను ఆత్మతో అనుప్రవేశము చేసి నామరూపాలను చేస్తాను. దేవాది విచిత్ర సృష్టిని వాటికి పేర్లనున్నూ చేస్తాను. అందుకొరకు ఒకదానితో ఒకటి కలయికను పొందని ఈ తేజోఽబన్నాలను, విశేషమైన వస్తువులను సృష్టి జేయలేని వాటిని ఆ సామర్థ్యము కలుగడం కొఱకు ఒక్కొక్క దాన్ని త్రివృతం త్రివృతముగా చేస్తాను అని. కనుక పరబ్రహ్మ యొక్క కర్మనే ఈ నామరూప వ్యాకరణము.

ఐతే ఇట్లా కావచ్చును. నామరూప వ్యాకరణము త్రివృత్ కరణమున్నూ ఒకే కర్త చేత చేయబడినవి కాబట్టి ఆ రెండున్నూ పరమాత్మ చేతనే చేయబడినట్టివి అని చెప్పడానికి వీల్లేదు. త్రివృత్ కరణాన్ని కూడా జీవుడు చేయగలడు. అండమును సృష్టించిన తరువాత కాలములో గదా చతుర్ముఖుని చేత సృష్టింపబడిన జీవులలో

త్రివృత్ కరణ ప్రకారము ఈ విధంగా ఉపదేశింపబడుతున్నది. **యథాతుఖలు సోమ్యేమాః త్రిస్రోదేవతాః పురుషం ప్రాప్య త్రివృత్ త్రివృదేకైకా భవతి తన్మే విజానీహీతి.** ఓ సోమ్యుడా! ఈ ముగ్గురు దేవతలు పురుషుడిని చేరి ఒక్కొక్కటి త్రివృత్‌గా త్రివృత్‌గా తక్కిన రెండు భూతాలయొక్క భాగాలతో కలసినట్టిది అవుతున్నది. దాన్ని నానుండి విను. తెల్సుకో అని. **అన్నమశితం త్రేధా విధీయతే. తస్యయః స్థవిష్ఠోభాగః తత్ పురీషం భవతి. యో మధ్యమః తన్మాంసమ్. యోఽణిష్ఠః తన్మనః** తిన్న అన్నము మూడు విధములుగా చేయబడుతుంది. దానిలో ఏ స్థూలరూపమైనది ఉన్నదో అది పురీషము (మలము) అవుతుంది. మధ్యమభాగము ఏది ఉన్నదో అది మాంసము అవుతున్నది. ఏది చిన్నదిగా ఉన్నదో/అణువంతగా ఉన్నదో అది మనస్సు అవుతున్నది. ఇత్యాదిగా చతుర్ముఖుని చేత సృష్టింపబడిన అగ్ని ఆదిత్యుడు విద్యుత్తులయందు త్రివృత్ కరణము ప్రదర్శింపబడుతున్నది. నామరూపాలను ఏర్పరచిన తరువాత కూడా త్రివృత్ కరణము వినపడుతున్నది. **సేయం దేవతా ఇమాస్త్రిస్రోదేవతాః అనేన జీవేన ఆత్మనా అనుప్రవిశ్యనామరూపే వ్యాకరోత్. తాసాం త్రివృతం త్రివృతం ఏకైకా మకరోత్.** అటువంటి సంకల్పము చేసిన ఈ దేవత ఈ ముగ్గురు – తేజస్సు అప్ అన్నములను – జీవుడితో పాటు అను ప్రవేశము చేసి నామరూపాలను చేసినాడు. వాటిలో మూడు మూడు భాగాలు కలదాన్నిగా ప్రతిఒక్కటినీ చేసినాడు. అని ఆ విషయములో చెప్పినాడు.

సూ॥ **మాంసాది భౌమం యథాశబ్దం ఇతరయోశ్చ 2-4-18** మాంసము మొదలైనవి భూమికి సమ్బన్ధించినవి. దానికంటే వేరయినవి కూడా వేదశబ్దాన్ని బట్టి ఆయా భూతాల యొక్క వికారాలు అనబడుతున్నవి. అండాన్ని సృష్టించిన తరువాత కాలములో చతుర్ముఖుడిచేత సృష్టించబడిన దేవతలు మొదలైన వాటికి సమ్బన్ధించింది ఈ విషయము అని, **తాసాం త్రివృతంత్రివృతం ఏకైకామకరోత్** అనే వాక్యము ప్రకారము త్రివృత్ కరణానికి సమ్బన్ధించిన ఉపదేశము అని ఏమాట మీరు చెప్పినారో అది పొసగదు. **అన్నమశితం త్రేధా విధీయతే** అనే వాక్యములో మాంసము మనస్సులు రెండింటిలోనూ పురీషము కంటే అణువు అయ్యి ఉండడం, అణువు కంటే చిన్నది అయ్యి ఉండడాలనుగా చెప్పినవాటికి కారణాన్ని అనుసరించి విధింపబడుతున్నందు వల్ల ఆప్యము, తైజసము కావలసియుండాల్సి వస్తుంది. ఐతే ఇది మాకు అంగీకారము కాదు. మాంసము మొదలైనవి భూమికి చెందినవని అంటే మేము ఒప్పుకుంటాము. పురీషం వలెనే మాంసమనస్సులు కూడా భౌమాలు – పార్థివాలు అనేట్లయితే మాకు నచ్చుతుంది. అన్నమశితం త్రేధా అని ఆరంభించినారు కాబట్టి. యథా శబ్దమ్

ఇతరయోశ్చ. ఇతరములైన వాటికిన్నీ ఆపః పీతాః తేజోఽశితమ్ అని పర్యాయాలకు – వరుసలో ఉన్నవాటికి వేదశబ్దము ప్రకారం వికారాలు అని అంటే అంగీకరిస్తున్నాము. **ఆపః పీతాః త్రేథా విధీయన్తే.** త్రాగబడిన నీళ్ళు మూడు విభాగాలుగా చేయబడుతున్నవి. అనే వాక్యము ప్రకారము నీరే మూడుగా పరిణామాన్ని పొందుతున్నది అని పరిణామ శబ్దాన్ని బట్టి తెలుస్తున్నది. అదేవిధంగా **తేజోఽశితం త్రేధా విధీయతే** అని కూడా తేజస్సుకు కూడా మూడు విధాలుగా మార్పుచెందడము శబ్దాన్ని బట్టి తెలుస్తున్నది. కావున పురీషము మాంసము మనస్సులు పృథివి యొక్క వికారాలు. మూత్రము నెత్తురు ప్రాణాలు(ఇంద్రియాలు) నీటి వికారాలు, బొక్కలు, కొవ్వు, వాక్కులు / మాటలు తేజస్సుయొక్క వికారాలు అని గుర్తించాలి. **అన్నమయం హి సోమ్యమనః ఆపోమయః ప్రాణః, తేజోమయీవాక్.** ఓ సోమ్యుడా! మనస్సు అన్నమయము, ప్రాణము నీటి మయము, వాక్కు తేజోమయము (మయము ప్రధానమైనది అని అర్థము) అని వాక్యశేషానితో విరోధము లేకుండా పోతుంది. కనుక తాసాంత్రివృతం అన్నమశితం ఏకైకాం అకరోత్ అని చెప్పబడిన త్రివృత్ కరణ ప్రకారము అన్నమశితం ఇత్యాది వాక్యము చేత ప్రదర్శింపబడడం లేదు. అట్లా ప్రదర్శింపబడినట్లయితే మనస్సు ప్రాణము వాక్కులనే మూడింటికిన్నీ అణువుకన్నా చిన్నగా అయ్యి ఉండడమనే కారణముచేత తైజసము అవడం వలన **అన్నమయం హి సోమ్య మనః** ఇత్యాదివాక్యాలు విరుద్ధాలు అవుతవి. తొలుతనే త్రివృత్కరణము చేయబడి పురుషుడిని చేరుకున్న పృథివ్యాదులు అన్నమశితమ్ ఇత్యాది వాక్యము ద్వారా ఒక్కొక్కదానికి మూడు విధాలైన పరిణామము చెప్పబడుతున్నది. అండాన్ని సృష్టించడానికి ముందుగానే తేజోఽబన్నాలు త్రివృత్కరణము చేయబడి ఉండాలి. అత్రివృత్ కరణము చేయబడని వాటికి కార్యారమ్భము – పని మొదలుపెట్టుటకు – నకు తగిన సామర్థ్యము లేనేలేదు కదా! తేజోఽబన్నాలు పరస్పరము ఒక్కటికి ఒక్కటి కల్సిన తరువాతనే సృష్టి చేయగల సామర్థ్యము – వస్తువులను పుట్టించగల శక్తి ఏర్పడుతుంది. అదే త్రివృత్కరణము అని అనబడుతున్నది. అట్లాగని స్మృతి చెప్పుతున్నది. **శ్లో॥ నానావీర్యాః పృథక్ భూతాః తతస్తే సంహతింవినా నాశక్నువన్ ప్రజాః స్రష్టుమ్ అసమాగమ్య కృత్స్నశః॥ సమేత్యాన్యోన్య సంయోగం పరస్పరసమాశ్రయాః। మహదాద్యాః విశేషాన్తాః హ్యండముత్పాదయన్తితే.** పలుశక్తులు కలిగి విడివిడిగా ఉన్న తేజోఽబన్నాలు సమూహము (సంహతి) కాకుండా ప్రజలను పుట్టించడానికి బొత్తిగా చేతకానివి అయినాయి. ఒకదానితో ఒకటి సంయోగాన్ని – కలయికను – పొంది, ఒకదానిపై ఒకటి ఆధారపడి మహత్తు

మొదలుకొని విశేషము వరకు ఉన్నవై అండాన్ని పుట్టించుతున్నవి అని. అందువల్లనే. **అనేన జీవేన ఆత్మనా అనుప్రవిశ్యనామ రూపేవ్యాకరోత్. తాసాం త్రివృతం త్రివృతం ఏకైకామకరోత్** అని అర్థక్రమముతో పాఠక్రమము బాధింపబడుతుంది. అండములో ఉండే అగ్ని ఆదిత్యుడు మొదలైనవాటి యందు త్రివృత్ కరణాన్ని ప్రదర్శించడము శుశ్రూషువు ఐన శ్వేతకేతువు అండాన్తర్వర్తి ఐనందున అతనికి బహిష్ఠములు – బయట ఉండే – వస్తువుల యందు త్రివృత్ కరణప్రదర్శనము చేయడం తగదు. కనుక త్రివృత్ కృతములైన కార్యాలయందు అనగా అగ్ని ఆదిత్యాదుల యందు ప్రదర్శనము చేయబడుతున్నది.

ఐతే ఇట్లానే కావచ్చును. అన్నమశితమ్. ఆపః పీతాః తేజో అశితమ్ అని త్రివృత్కృతాలైన అన్నాదులకు ఒక్కొక్కదానికి తేజో అప్ అన్నాలుగా మూడు రూపాలు కలిగిన వాటికి అన్నము నీళ్ళు తేజస్సు అని ఒకే రూపము కలవాటినిగా పేర్కొనడము ఏవిధంగా పొసగుతుంది? అని ప్రశ్న వేయవచ్చును. దానికి ప్రత్యుత్తరము ఏమిటంటే ఇది.

సూ॥ **<u>వైశేష్యాత్తు</u> తద్వాదస్తద్వాదః 2-4-19** ఒక్కొక్క దానిలో ఏది అధికంగా ఉంటుందో దానిని ఆ పేరుతో పిలుస్తారు. వైశేష్యం – విశేషభావము. అధికముగా / విశేషముగా ఉండడము. త్రివృత్ కరణము చేయబడినందువలన ప్రతిపదార్థము నందు – తేజోఽబన్నాలయందు – మూడింటి రూపములు ఉన్నా ఒక్కొక్క దాని యందు అన్నాదులు అధికంగా ఉండడాన్ని బట్టి వాటివాటిని అన్నము నీరు తేజస్సు అని పిలువడం జరుగుతున్నది. తద్వాదః తద్వాదః అని రెండుసార్లు పలుకడము అధ్యాయము ముగిసింది అని తెలుపడం కొరకు. **అని ఇక సంజ్ఞామూర్తిక్లప్తి అధికరణము.**

**భగవద్ రామానుజ విరచితమైన శ్రీభాష్యమునందు ద్వితీయాధ్యాయములోని**
చతుర్థపాదము, ద్వితీయ అధ్యాయము ముగిసినది.

**విజయతాం రామనుజ దివాకరః.**

శ్రీమతే రామానుజాయనమః

# శ్రీభాష్యము – తృతీయాధ్యాయము – ప్రథమపాదము

## తదన్తర ప్రతిపత్తి అధికరణము

### సూ॥ తదన్తర ప్రతిపత్తౌ రంహతి సమ్పరిష్వక్తః ప్రశ్న నిరూపణాభ్యాం 3-1-1

ఒక దేహాన్నుండి మరొక దేహానికి పోయేటప్పుడు జీవుడు భూతసూక్ష్మాలతో కౌగిలింపబడినవాడయ్యే వెళ్ళుతున్నాడు. ఇది ప్రశ్న ప్రతి సమాధానాల వల్ల తెలుస్తున్నది. గడిచిన రెండధ్యాయాల ద్వారా సమస్త ప్రపంచానికి ఏకైక కారణం ఐనవాడు ఎటువంటి దోషగుణాల యొక్క వాసనఐనా సోకనివాడు అపరిమితమైన ఉదారగుణాలకు సముద్రము వంటివాడు తనకంటే వేరుగా ఉన్న వాటికన్నింటికన్నా విలక్షణమైనవాడు పరబ్రహ్మ ఐన శ్రీమన్నారాయణుడు మోక్షాన్ని కోరుకునే వారందరిచేత ఉపాసింపదగిన వాడు అని వేదాన్తాలు ప్రతిపాదించుతున్నాయి అనే అంశము స్మృతులు న్యాయాలకున్నూ విరోధాన్ని తొలగించుతూ ఎదుటివాళ్ళ యొక్క వాదాలను తిప్పికొడుతూ వేదాన్తవాక్యాలకు ఉన్నట్లు కనిపిస్తున్న విరోధాన్ని తొలగిస్తూ కార్యరూపమైనదాన్ని శోధించుతూ తిరుగులేని హేతువులతో సహా గట్టిగా పాదు కొలుపబడింది. కనుక రెండధ్యాయాలు మూలంగా బ్రహ్మ యొక్క స్వరూపము ప్రతిపాదింపబడింది. తరువాతి రెండధ్యాయాలతో ఇప్పుడు ఆ పరమాత్మను చేరుకొనే ఉపాయాలతో కూడా పొందే / చేరుకొనే ప్రకారాన్ని విచారించడానికి పూనుకుంటున్నారు.

ముందుగా మూడవ అధ్యాయంలో ఉపాయమైన ఉపాసనకు సమ్బన్ధించిన చిన్త చేయబడుతున్నది. ఉపాసనను ఆరంభించడానికి ప్రధానోద్దేశ్యమైన ఉపాయము, పొందదగిన మోక్షానికి వ్యతిరేకమైన వాటి యందు వైరాగ్యము ప్రాప్యము నందు మిక్కిలి ఆశ, అనురాగమున్నూ అవసరము అని చెప్తూ వాటిని సమ్పాదించుకోవడానికిగాను లోకాల నడుమ మాటి మాటికీ తిరిగే జీవుడికి మెలకువలో, గాఢ నిద్రపోతున్నపుడు, మూర్ఛపోయినప్పుడున్నూ కలుగుతున్న / ఉన్న దోషాలను, పరమాత్మకు అవిలేకపోవడము కళ్యాణగుణాలకు ఒకే ఒక నెలవు కావడము మొదటి రెండు పాదాలలో ప్రతిపాదింపబడుతున్నవి. దాంట్లో ఒక దేహాన్నించి మరొక్క దేహానికి వెళ్ళిపోతున్నపుడు ఈ జీవుడు మరొక దేహము కలుగడానికి కారణమైన భూతాల

యొక్క సూక్ష్మాలతో గట్టిగా కావలించుకోబడినవాడయ్యే పోతున్నాడా లేక తానొక్కడే వెళ్ళుతున్నాడా? అని (విచారము) అనుమానము కలుగగా జీవుడు ఎక్కడెక్కడికి పోయినా అక్కడక్కడ భూతసూక్ష్మాలు అందుబాటులో ఉంటవి కనుక. వెంటబెట్టుకోకుండానే పోతున్నాడు అని నిశ్చయము చెయ్యబడింది. తరువాత కూడా పూర్వపక్షము ఏర్పడడానికి కారణాలను వివరించివాటిని ఏరిపారేస్తాడు. తొలుత సిద్ధాన్తాన్ని చెప్పినారు. తదన్తర ప్రతిపత్తౌరంహతి సమ్పరిష్వక్తః అని. సంజ్ఞామూర్తిక్లప్తిః అని మూర్తి శబ్దముతో శరీరము ప్రస్తావించబడింది. కనుక తత్ శబ్దముతో ఒడలు తడుమబడుతున్నది. తదన్తర ప్రతిపత్తౌ – మరొక్క దేహములోకి పోయే ముందు భూత సూక్ష్మాలతో చక్కగా కౌగిలించుకొనబడినవాడయ్యే జీవుడు పోతున్నాడు అని అర్థము. ఎందువల్లనంటే? ప్రశ్న నిరూపణాలతో తెలుస్తున్నది కాబట్టి. **పంచాగ్ని విద్యయందు** ఈ విధంగా ప్రశ్న ప్రతి సమాధానాలు పఠింపబడుతున్నవి. అరుణి అనే మహర్షి యొక్క కొడుకు ఐన శ్వేతకేతువును పాంచాల దేశపురాజైన ప్రవాహణుడు కర్మలు చేసేవారు పోదగిన ప్రదేశము తిరిగి అక్కడి నుండి వచ్చే పద్ధతి దేవయాన పితృ యాన మార్గాల ద్వారా వెనుకకు రావడాలు, ఈ లోకానికి తిరిగిరాని వాడిని గురించి తెల్సునా? అని అడిగి ఈ విషయాన్ని గురించి కూడా ప్రశ్నించినాడు. **వేత్థ యథా పంచమ్యామాహూతౌ ఆపః పురుషవచ సోభవన్తి.** జలము ఐదవ ఆహుతి యందు పురుషుడు అనబడేవాడుగా ఎట్లా అవుతున్నాడో ఎరుగుదువా అని. తరువాత ఈ చివరి ప్రశ్నకు సమాధానాన్ని చెపుతూ ద్యులోకాన్ని అగ్నిగా నిరూపించి / ఆరోపించి (రూపకాలంకారము) **తస్మిన్నే తస్మిన్నగ్నౌదేవాః శ్రద్ధాంజుహ్వతి. తస్యాః ఆహుతేః సోమోరాజా సమ్భవతి.** అటువంటి ఈ అగ్ని యందు దేవతలు శ్రద్ధా అనబడే నీటిని హోమము చేస్తారు. (ఆహుతులుగా ఇస్తారు) ఆ ఆహుతి నుండి రాజైన సోముడు పుడుతున్నాడు. ఇత్యాదివాక్యముతో **దేవాఖ్యాః జీవస్య ప్రాణాః.** దేవులు అనే పేరు గల జీవుని యొక్క ప్రాణాలను – ముఖ్యప్రాణాలు ఇంద్రియాలున్నూ – అగ్నిగా నిరూపింపబడిన ద్యులోకము నందు శ్రద్ధా అనే పేరు గల వస్తువును పడవేస్తారు. ఆ శ్రద్ధ అనబడేది సోమరాజు అనబడే అమృతమయమైన దేహముగా పరిణమించుతుంది. ఆ అమృతమయమైన దేహాన్ని ఆ ప్రాణాలే అగ్నిగా నిరూపింపబడే పర్జన్యుని యందు – మబ్బులలో – పడవేస్తాయి. ఆ దేహము మేఘంలో పడవేయబడినట్టిది వర్షముగా మారుతుంది. ఆ వర్షము ఆ ప్రాణాలనే అగ్నిగా ఆరోపింపబడిన నేలపైన పడవేస్తాయి. అది ఆహారము అవుతుంది. ఆ అన్నమును అగ్నిగా భావింపబడే పురుషునిలో ప్రాణాలే పడవేస్తవి. అది రేతస్సుగా వానిలో పరిణమించుతుంది. దాన్ని కూడా అగ్నిగా ఎంచబడే స్త్రీయందు ప్రాణాలు

పడవేస్తాయి. అది అక్కడ పడవేయబడి గర్భము అవుతున్నదని చెప్పి ఇట్లా అన్నాడు. **ఇతితు పంచమ్యామాహుతౌ ఆపః పురుషవచసోభవన్తి.** ఈ విధంగా ఐదవ ఆహుతి యందు నీరు పురుషుడు అనే పేరు గలవిగా అవుతున్నవి అని. ఈ విధంగా ఐదవ ఆహుతియందు హోమము చేయబడిన నీరు పురుషుడు అనే శబ్దము చేత పిలువబడదగినవిగా అవుతున్నవి అని అర్థము. ఇట్లా చెప్పబడగా పూర్వపూర్వములైన పేర్లతో కొనసాగుతున్న నీళ్ళు – సూక్ష్మ రూపంగా ఉన్నట్టివి – ఇప్పుడు పురుషుడు అనే ఆకారాన్ని పొందుతున్నవి. కనుక ఈ విధంగా ప్రశ్న ప్రతివచనాలను బట్టి శరీరము ఏర్పడటానికి హేతువులైన భూతసూక్ష్మాలతో పాటు కలసి ఆయా దేహాలలోకి జీవుడు పోతున్నాడని అర్థము అవుతున్నది.

ఔనండీ! ఆపః పురుషవచసః అని అన్నప్పుడు నీరు మాత్రమే పురుషాకారముగా పరిణమించుతున్నది అని ప్రతీతి కలుగుతున్నది కాబట్టి శరీరాన్ని విడిచిపోతూ ఉన్న జీవుడితో ఆ నీటికి మాత్రమే పరిష్వంగము ఉన్నట్లు విశదమౌతున్నది. కావున నీరు తప్ప తక్కినభూతాల సూక్ష్మాలతో పరిష్వంగము ఎట్లా పొసగుతుంది అని అంటే దానికి సమాధానము చెప్పినారు.

సూ॥ **త్ర్యాత్మకత్వాత్ తు భూయస్త్వాత్ 3–1–2** తేజో అప్పులు అన్నము మూడు కల్సి ఉండడము వలన మరియు ఏది అధికంగా ఉంటుందో దాన్ని బట్టి ఆ భూతముగా వ్యవహరించడాన్ని బట్టి ఆ భూతముగా చెప్తున్నాము. కానీ ప్రతిదానిలోనూ తక్కినవి రెండు కల్సియే ఉంటున్నాయి. కనుక అన్ని కల్సియే జీవుడి వెంట వెళ్ళుతున్నాయి. తు శబ్దము సందేహాన్ని తిప్పికొడుతున్నది. శరీరాన్ని పుట్టించగలవాటిలో వట్టి (కేవలము) నీళ్ళు మాత్రమే దేహాన్ని ఆరంభించలేవు. దేహాదులను ఆరంభించటం కొరకు **తాసాంత్రివృతం త్రివృతమేకైకామకరోత్** అని చెప్పినట్లు త్రివృత్ కృతములైనవి మాత్రమే సమర్థులు కాగల్గుతవి. కేవలము నీళ్ళను గురించే వినిపించడము మాత్రము అవి అధికంగా (ఎక్కువగా) ఉండడము వల్లనే. శరీరములో నెత్తురు మొదలైనవి ఎక్కువగా ఉండడాన్ని బట్టి దేహానికి కారణమైనవాటిలో నీటికి ఆధిక్యత ఉన్నట్లు తెలుస్తున్నది.

సూ॥ **ప్రాణగతేశ్చ 3–1–3** ప్రాణము పోవడాన్నిబట్టి కూడా భూతసూక్ష్మాలతోనే పోతున్నాడు. ఈ చెప్పబోయే కారణాన్ని బట్టి కూడా భూతసూక్ష్మాలతో కూడిన జీవుడు శరీరాన్నుంచి పోతున్నాడని తెలుస్తున్నది. జీవుడు శరీరము నుండి లేచిపోతు ఉండగా ప్రాణాలు (ఇంద్రియాలు) అతడిని వెంటనంటే పోతున్నట్లు శ్రుతిలో వినిపిస్తున్నది.

**తముత్ క్రామన్తం ప్రాణోఽనూత్క్రామతి. ప్రాణమనూత్క్రామన్తం సర్వేప్రాణాః అనూత్క్రామన్తి.** అట్లా శరీరాన్ని వదిలిపెట్టిపోతూ ఉన్న జీవుడి వెంట ప్రాణము పోతున్నది. ప్రాణము వెంట ఇంద్రియాలు కూడా బయలుదేరి పోతున్నవి అని. స్మృతి కూడా ఇదే మాటను వినిపిస్తున్నది.

**శ్లో॥ మనఃషష్ఠానీన్ద్రియాణి ప్రకృతిస్థానికర్షతి। శరీరం యదవాప్నోతి యదప్యుత్ క్రామతీశ్వరః। గృహీత్వైతాని సంయాతి వాయుః గన్ధానివాశయాత్।.** జీవుడు ఏ నూతన శరీరాన్ని పొందినా లేక విడిచినా వాటిపై అధికారము కల ప్రభువు కనుక ప్రకృతిలో ఉన్న ఇంద్రియాలను తీసుకొనేపోతాడు. వాయువు తనతోపాటు పువ్వులో ఉన్న పరిమళాలను తీసుకొనిపోయినట్లు అని. ఆశ్రయము లేనివాటికి గమనము (పోకడ) పొసగదు కనుక జీవుడిని ఆశ్రయించి ఉన్న భూతసూక్ష్మాలు కూడా అతని వెంటనే పోతున్నాయి అని గతిని / గమనాన్ని అంగీకరించవలసి ఉంటుంది.

సూ॥ **అగ్న్యాది గతిశ్రుతేః ఇతిచేన్న. భాక్త్వత్వాత్ 3-1-4** అగ్ని మొదలైనవాటిలో చేరుతున్నవి అని వినిపించుతున్నందువల్ల వెంటపోవు అని అనేటట్లయితే కాదు. అది భాక్తము (ముఖ్యము కానిది) ఐనందువలన మీరన్నది సరి కాదు. **యత్రాస్య పురుషస్య మృతస్యాగ్నింవాగప్యేతి. వాతం ప్రాణః చక్షురాదిత్యమ్** మరణించిన పురుషుని యొక్క వాక్కు/(మాట) అగ్నిలో చేరుతున్నది. ప్రాణము వాయువులో సూర్యుడిలో చూపు ఇత్యాదివాక్యము ద్వారా ఇంద్రియాలు జీవుడు మరణించే కాలంలో అగ్ని మొదలైన వారిలో కలిసి పోతున్నవి / (అప్యయము) అని వినిపించుతున్నందువల్ల ఇంద్రియాలు జీవుని వెంటపోవడము లేదు. కనుక గతిని తెలిపే శ్రుతికి మరొక విధంగా అర్థాన్ని చెప్పుకోవాలి అని అనేట్లయితే అది సరికాదు. అగ్ని ఆదులలో కల్సి పోవడాన్ని చెప్పే వాక్యము ముఖ్యముకాదు. అది భాక్తము. భాక్తము ఎట్లా అవుతుందంటావా? **ఔషధీర్లోమాని వనస్పతీన్ కేశాః** ఒంటిపై నుండే వెంట్రుకలు చెట్ల యందు తలవెంట్రుకలు తీగలలో అని చెప్పినట్లు వాటిలో యధార్థంగా లీనము గాని వాటితోపాటు చెప్పబడుతున్నందువల్ల భాక్తమే. కనుక చక్షురాదులు ఆయా దేవతలలో కలుస్తున్నవి అని చెప్పినా ఆశ్రుతి వాక్యము జీవుడి శరీరములో నుండి తొలగిపోతున్న అభిమాని దేవతలకు సమ్బన్ధించినది మాత్రమే.

సూ॥ **ప్రథమే అశ్రవణాదితిచేన్న. తాఏవ హ్యుపపత్తేః 3-1-05** మొదటి ఆహుతి యందు జలాలు ఆహుతి ఇవ్వబడినట్లు వినిపించలేదు. కావున జలాలు

హవిస్సుగా అర్పింపబడలేదు. పైగా శ్రద్ధా అంటే జీవునియొక్క మనోవృత్తి వ్యాపారము అని అన్నట్లయితే కాదు. జలములు అని అర్థము చెప్పుకొన్నపుడు మాత్రమే ప్రశ్నప్రతివచనాలు కొనసాగుతూ అర్థవన్తములు అవుతున్నాయి కాబట్టి శ్రద్ధా అనగా నీళ్ళు మాత్రమే.

ఇతర భూతసూక్ష్మాలతో కలసి ఉన్న నీటితో పరిష్వంగాన్ని పొందిన వాడయ్యే జీవుడు మరొక శరీరంలోకి ప్రవేశించుతున్నాడు అని ప్రశ్న ప్రతివచనాలవల్ల తెలియవస్తున్నది అని ఏమాట చెప్పినారో అది తగదు. ఎందుకంటే మొదటిదైన ద్యులోకాగ్ని విషయము నందు చేయబడిన హోమములో నీళ్ళు హోమ్యములు – హవిస్సుగా ఇవ్వబడినట్లు వినిపించడము లేదు కాబట్టి. **తస్మిన్ ఏతస్మిన్నగ్నౌదేవాః శ్రద్ధామ్ జుహ్వతి** ఈ అగ్ని యందు దేవతలు శ్రద్ధను హోమము చేస్తున్నారు అని శ్రద్ధయే హోమ్యముగా వినిపించబడింది. శ్రద్ధ అని అంటే అది జీవుని యొక్క మనస్సు యొక్క వృత్తి విశేషము. వృత్తిఉపోకడ. మానసికమైన వ్యాపారము. కనుక ప్రథమాహుతిలో హోమం చేయబడినటువంటివి నీరు కాదు. అని అంటే చెపుతున్నారు.

మీరన్నది సరికాదు. ఎందువల్లనంటే అక్కడ ఆ నీళ్ళే శ్రద్ధా అనే శబ్దము చేత చెప్పబడుతున్నది. **వేత్థ యథా పంచమ్యామాహు తావా పః పురుషవచసోభవన్తి.** ఐదవ ఆహుతి యందు నీరు పురుషుడు అనే పేరుతో పిలువబడుతున్నవో ఆ వివరాన్ని ఎరుగుదువా? అనే ప్రశ్నకు ప్రతివచనమును చెప్పడానికి పూనుకొన్నపుడు శ్రద్ధయే (నీళ్ళు) ద్యులోకమనే అగ్ని యందు హోమ్యముగా వినిపించబడింది. అక్కడ శ్రద్ధా శబ్దము చేత నీళ్ళు అని అర్థము చెప్పబడక పోయినట్లయితే అప్పుడు ప్రశ్న ఒక తీరు ప్రతివచనము మరొక తీరు అయ్యి మొత్తము వ్యవహారము అవకతవకలుగా అయ్యేది. **ఇతితు పంచమ్యామాహుతావాపః పురుషవచసః** అని ప్రతివచనము యొక్క ముగింపు కూడా శ్రద్ధా అంటే నీళ్ళే అని అర్థమని సూచిస్తున్నది. **వేత్థయథా** అని ప్రశ్న, **ఇతితు పంచమ్యాం** అని ఇతి శబ్దముతో సమాధానమున్నూ (పరిహారము) పూర్తి చేయబడుతున్నది. శ్రద్ధా సోమరాజ– దివ్యదేహము, వర్షము, అన్నము, రేతస్సు, గర్భముల రూపంగా నీటి యొక్క పరిణామక్రమాన్ని చెప్పినాకగదా! **ఏవమాపః పురషవచసః** అని ఉపసంహరింపబడుతున్నది. శ్రద్ధాశబ్దము నీళ్ళు అనే అర్థములో వైదిక ప్రయోగము కనిపించుతున్నది కూడా! **అపః ప్రణయతి. శ్రద్ధావా ఆపః.** నీటిని చేరుస్తున్నాడు. శ్రద్ధా అని అనగా నీరు అని కదా అర్థము అని. **శ్రద్ధాంజుహ్వతి తస్యాః ఆహుతేః సోమోరాజా సమ్భవతి.** శ్రద్ధను హోమము చేయుచున్నాడు. దాని నుండి

అందమైన సోమరాజు అవుతున్నాడు అని సోమాకారంతో మార్పును పొందడమున్నూ నీటికే పొసగుతుంది. కనుక ఇతరమైన భూతాలతో కలసి ఉన్న నీటితో సంపరిష్వక్తుడైన – భేదము లేనంతగా ఏకమై ఉన్నవాడు – జీవుడు మరొక్క శరీరములోకి వెళ్ళుతున్నాడు అనడము చక్కగా పొసగుతున్నది.

సూ॥ **అశ్రుతత్వాదితి చేన్న ఇష్టాదికారిణాం ప్రతీతేః 3-1-06** ఈ వాక్యములో జీవుడి గురించి వినిపించడం లేదు అని అంటే కాదు ఇష్టాదులను చేసినవారిని గురించి తెలియవస్తున్నది కదా! నీటితో సమ్పరిష్వక్తుడైన జీవుడు పోతున్నాడు అనే ఈ అర్థము ఇప్పుడు చెప్పిన / చూపిన వాక్యము ద్వారా తెలియవస్తున్నది అని ఏ మాట చెప్పినారో అది కుదరదు. ఈ వాక్యములో జీవుని గురించే వినిపించడం లేదు కదా! పైగా ఇక్కడ శ్రద్ధా మొదలైనవే నీటి యొక్క అవస్థా విశేషాలు హోమ్యములుగా వినిపించబడినవి. కానీ వాటితో పరిష్వక్తుడైన జీవుడు కాడు అని అంటే చెపుతున్నారు కాదని ఎందుకనగా ఇష్టాదికారులను గురించిన ప్రతీతి కల్గుతున్నది. ఈ మహావాక్యములోని తరువాతి భాగములో. బ్రహ్మ జ్ఞానము లేక ఇష్టాపూర్తదత్తకాదులు – హోమాలు దానాలు ధర్మాలు బావులు త్రవ్వించడం అన్నదాన సత్రాలు ఏర్పర్చడము వంటివి చేసిన వాళ్ళు – ద్యులోకానికి పోయి దివ్యదేహులు – సోమరాజులు – అవుతున్నారు. వారు చేసుకున్న పుణ్యకర్మలు ముగిసి పోగానే తిరిగి గర్భములో ప్రవేశిస్తున్నారు అని చెప్పబడుతున్నది. **అథయ ఇమే గ్రామే ఇష్టా పూర్తందత్తమిత్యుపాసతే తేధూమమభిసమ్భవన్తి** ఇక ఎవరైతే గ్రామంలోనే ఉండుకుంటూ ఇష్టాపూర్తం దత్తమ్ అని ధానధర్మాదులు చేస్తూ ఉపాసన చేస్తున్నారో వాళ్ళు ధూమముగా అవుతున్నారు అని మొదలుపెట్టి **పితృలోకాదాకా శమాకాశాచ్చన్ద్రమసం. ఏషసోమోరాజాతత్ దేవానామన్నమ్. తందేవాభక్షయన్తి. తస్మిన్ యావత్సమ్పాత ముషిత్వా అథైతమే వాధ్వానం పునర్నివర్తన్తే.** పితృలోకాన్నించి ఆకాశానికి అక్కడి నుండి చన్ద్రుడి వద్దకు చేరుకుంటాడు. అపుడు ఈ జీవుడు అందమైన రూపము కలవాడవుతాడు. అతడే దేవతలకు ఆహారము. దాన్ని వారు చూచి తిన్న వారివలె తృప్తిని చెందుతారు. ఆద్యులోకములో తాను చేసిన కర్మము వడిసిపోయేంతవరకు ఉండి తిరిగి ఇదే బాటలో వెనుకకు వస్తారు అని. **యోయోహ్యన్నమత్తి యోరేతస్సించతి తద్ భూయఏవభవతి.** ఏయే అన్నాన్ని తింటున్నాడో ఏవిధంగా రేతస్సును విడుస్తున్నాడో దానిని బట్టి తిరిగి ఆయా కర్మల కారణంగా వృద్ధి చెందుతున్నాడు అని. ఈ మహావాక్యంలో కూడా **ద్యులోకాగ్నౌశ్రద్ధాంజుహ్వతి. తస్యాః ఆహుతేః సోమోరాజాసమ్భవతి.** ద్యులోకమనే

అగ్ని యందు శ్రద్ధను హోమము చేస్తున్నాడు. ఆ ఆహుతి నుండి సోమరాజు అవుతున్నాడు అని చెప్పబడింది. దానితో ఏకార్థత – ఒకే ముచ్చట చెప్పబడడము – ఉన్నందువల్ల శ్రద్ధావస్థ అనే దేహముతో విశిష్టుడైనవాడు సోమరూప దేహవిశిష్టుడు అవుతున్నాడని చెప్పబడింది అని తెలుస్తున్నది. శరీరము జీవుడికి విశేషణము అయ్యి ఉండడము అనే స్వరూపము కలది కాబట్టి దానికి వాచకమైన శబ్దమున్నూ విశేష్యమైన జీవుని యందే పర్యవసిస్తుంది/ చెల్లుతుంది. కనుక జీవుడు సమ్పరిష్వక్తుడయ్యే వెళ్ళుతున్నాడనడము ఒప్పుతుంది.

ఏమండీ! **తందేవాభక్షయన్తి** అని దేవతలచేత తినబడుతున్న వాడినిగా వినిపించుతున్నందువలన సోమరాజు జీవుడు కాదు. అతడు తినబడే పదార్థము కాదు కదా! అని ఆక్షేపించితే చెప్తున్నాడు.

సూ॥ **భాక్తం వా అనాత్మవిత్త్వాత్ తథాహి దర్శయతి. 3-1-07** భుజించడము ముఖ్యార్థము కాదు. ఆత్మజ్ఞానము కలవారు కానందున అట్లాగని శ్రుతి చూపుతున్నది. సూత్రములోని వా శబ్దము సందేహాన్ని తొలగించుతున్నది. ఇష్టాపూర్తములు – పుణ్యకార్యాలు – చేసినవారు ఆత్మవేత్తలు కారు. కనుక వారు దేవతలకు భోగోపకరణాలు అవుతున్నారు. ఇక్కడా అక్కడా వారు ఆ తీరుగానే దేవతలకు ఉపయోగపడుతున్నారు. ఈ లోకంలో ఇష్టాదికార్యాలు చేసి వాళ్ళను ఆరాధించడము ద్వారా ఉపకరించుతున్నారు. దాంతో ప్రసన్నులైన దేవతల వల్ల పుణ్యలోకాలను పొంది అక్కడ వారితో సమానమైన భోగాలననుభవించుతూ వారికి ఉపకరణములు అవుతున్నారు. **యథాపశుః ఏవంసదేవానామ్.** ఈ లోకములో పశువు ఏ విధంగా యజమానికి సేవచేయడం ద్వారా ప్రీతిపాత్రము అవుతున్నదో అట్లే ఈ పుణ్యకార్యాలను చేసినవాడు దేవతలకు, ప్రీతిపాత్రుడవుతున్నాడు అని ఆత్మ జ్ఞానము లేని వాడు దేవతలకు భోగసాధనము అవుతున్నాడని శ్రుతి చూపించుతున్నది.

ఇంకా స్మృతి కూడా ఆత్మవేత్తలైనవారికి బ్రహ్మను చేరుకోవడాన్ని, కానివారికి దేవతలకు భోగ్యులై ఉండడాన్ని చూపించుతున్నది. **శ్లో॥ దేవాన్ దేవయజోయాన్తి మద్భక్తాయాన్తి మామపి.** దేవతలను పూజించేవారు వారివారి ఇష్టదేవతల వద్దకు పోతున్నారు. నన్ను ఆరాధించే భక్తులు నా వద్దకు చేరుకుంటున్నారు. అని కనుక జీవుడు దేవతలకు భోగోపకరణమని అభిప్రాయం పడడం అన్నమవడం ద్వారా భక్ష్యత్వాన్ని చెప్పడము యొక్క ఉద్దేశ్యము. అందుచేత అది భాక్తము అవుతున్నది.

దాన్నిబట్టి తృప్తి చెందడమే దేవతలకు భక్షణము అని వినిపించుతున్నది. **నవైదేవాః అశ్నన్తి. నపిబన్తి ఏతదేవామృతం దృష్ట్వాతృప్యన్తి.** దేవతలు తినరు. త్రాగరు. కానీ ఈ అమృతాన్ని చూచి సంతృప్తిని పొందుతున్నారు అని. అందువలన భూత సూక్ష్మాలతో కౌగిలించుకొనబడిన వాడయ్యే జీవుడు పోతున్నాడని తేలింది. **ఇది తదన్తర ప్రతిపత్తి అధికరణము**

★ ★ ★

## ఇక కృతాత్యయాధికరణము

సూ॥ **కృతాత్యయే అనుశయవాన్ దృష్టస్మృతిభ్యాం యథేతమనేవంచ. 3-1-8** చేసిన పుణ్యము వడిసిన తరువాత తిరిగి ఈలోకానికి జీవుడు చేరుకుంటున్నాడు. శ్రుతి స్మృతులు అట్లాని చెపుతున్నవి. ఆరోహణప్రకారము పైలోకాలకు వెళ్తున్నాడు. వచ్చేటప్పుడు మరొక మార్గములో వస్తూ ఉన్నాడు. బ్రహ్మ జ్ఞానము లేకుండా ఇష్టాపూర్తాదులు చేసినవారికి ధూమ మార్గము, పితృయానము అనే పద్ధతిలో పోవడము జరుగుతుంది. తాను చేసిన కర్మఫలానుభవము ముగిసిన తరువాత తిరిగిరావడమున్నూ ఈ విధంగా వేదములో పఠింపబడియున్నది. **యావత్సమ్పాతముషిత్వా అథైత మేవాధ్వానం పునర్నివర్తన్తే** సమ్పాతము – చేసుకున్న పుణ్యము అయిపోయిన తరువాత ఇదే మార్గంలో తిరిగి వస్తున్నారు. అని ఆ సందర్భములో దిగి వస్తూన్న జీవుడు ఏమైనా కొంచెమంత పుణ్యాన్ని మిగుల్చుకొని వస్తున్నాడా? లేక ఏమీ లేకుండానేనా? అని సందేహము కలుగుతున్నది. ఏది తగును అన్నట్లయితే కర్మను మొత్తాన్నీ అనుభవించినాడు కనుక అనుశయము – శేషము – మిగులు లేకుండానే అని నిశ్చితమయ్యింది. అనుశయము అనగా అనుభవించగా మిగిలిన కొద్దిపాటి భాగము ఐనకర్మ. అది మొత్తాన్ని అనుభవించినట్లయితే ఎంతమాత్రమూ మిగులదు. యావత్ సమ్పాతముషిత్వా అని చెప్పినందువల్ల మొత్తము కర్మఫలము అనువింపబడడము తెలుస్తున్నది. ఈ కారణము చేత స్వర్గము నుండి జారిపడి పోతున్నారు కనుక "**సంపాతము – కర్మ**" అని అర్థము చెప్పబడుతున్నది. మరొక శ్రుతి ఇదే విషయాన్ని తెల్పుతున్నది. **ప్రాప్యాన్తం కర్మణస్తస్యయత్ కించేహకరోత్యయమ్। తస్మాల్లోకాత్ పునరేత్యస్మై లోకాయకర్మణే।** ఈ భూలోకము నందు చేసిన కర్మయొక్క చివరను పొందినవాడై తిరిగి ఆ లోకాన్నుండి తిరిగి కర్మలు చేయడానికి వస్తున్నాడు అని.

ఈ విధంగా పూర్వపక్షము ఎదురవ్వగా సమాధానము చెప్పబడ్తున్నది. అనుశయమును కలవాడై దిగి వస్తున్నాడు అని. ఎందువల్లనంటే శ్రుతి స్మృతులచేత చెప్పబడ్తున్నది కనుక. శ్రుతి ఇట్లాగ చెపుతున్నది. **తద్యఇహరమణీయ చరణాః అభ్యాశోహయత్తే రమణీయం యోనిమాపద్యేరన్। బ్రాహ్మణయోనిం క్షత్రియయోనింవైశ్యయోనింవా. అథ య ఇహ కపూయచరణాః అభ్యాశోహ యత్తే కపూయాంయోని మాపద్యేరన్. శ్వయోనిం వా సూకరయోనింవా చండాలయోనింవా.** ఎవరైతే ఈలోకములో మంచిపనులను చేసినారో వారు తిరిగి వచ్చేసమయంలో మంచిదైన పుట్టుకను పుడుతారు. అది బ్రాహ్మణ జన్మ లేక క్షత్రియ జన్మ లేదా వైశ్య జన్మ ఐనా కావచ్చును. ఇక ఎవరైతే తప్పుడు పనులు చేసినారో వారు తిరిగి భూలోకానికి వచ్చినపుడు అందరూ అసహ్యించుకొనే పుట్టుకను పుడుతారు. అది కుక్క జన్మ, లేక పంది జన్మ, లేక చండాల జన్మ ఐనా కావచ్చు. అని తిరిగి వచ్చేవారిని గురించి వినిపించుతున్నది. పైలోకాలనుండి దిగివచ్చే వారిలో రమణీయకర్మలు చేసినవారు రమణీయమైన బ్రాహ్మణాది యోనిని పొందుతున్నారు. కపూయచరణాః అనగా కుత్సితమైన పనులను చేసినవారు కుత్సితమైన కుక్క పంది వంటి జన్మలను పొందుతున్నారని దిగి వచ్చేవారికి పుణ్యపాపాలతో సమ్బన్ధాన్ని వేదము తెలుపుతున్నది. ఇక స్మృతి కూడా **వర్ణాః ఆశ్రమాశ్చ స్వకర్మ నిష్ఠాః ప్రేత్య కర్మఫలమను భూయ తతః "శేషేణ" విశిష్ట దేశ జాతి కుల రూప ఆయుః శ్రుత విత్త వృత్త సుఖమేధసో జన్మప్రతిపద్యన్తే. విష్వంచో విపరీతాః నశ్యన్తి.** వర్ణములు ఆశ్రమాలు వాటివాటికి చెందిన కర్మలనూ చక్కగా ఆచరించి పరలోకాలకు వెళ్ళిపోయి తాము చేసిన సుకృతకర్మఫలాలను అనుభవించిన పిదప కొద్దిపాటిది ఐన శేషముతో మంచిదైన దేశము జాతి కులము రూపము ఆయుష్షు విద్యధనము మంచి నడవడిక సుఖము మంచిబుద్ధి వంటి వాటిని కలిగిన జన్మలను పొందుతున్నారు. ఇతరులు ఇప్పుడు చెప్పినవాటి కన్నింటికీ విపరీతము – తలక్రిందులు ఐన జన్మలను ఎత్తి నశించుతున్నారు. ఇది గౌతముని మాట. **అట్లాగే – తతః పరివృత్తౌ "కర్మఫలశేషేణ" జాతిం రూపం వర్ణం బలమ్ మేథామ్ ప్రజ్ఞాం ద్రవ్యాణి ధర్మానుష్ఠానమితి ప్రతిపద్యతే. తత్ చక్రవదుభయో ర్లోకయోః సుఖఏవవర్తతే.** అటుపిమ్మట చక్రము వలె తిరిగి వెనుకకు వచ్చినపుడు తాను అనుభవించగా మిగిలిన కర్మఫలముతో జాతిని రూపాన్ని వర్ణాన్ని – రంగును, కులాన్ని, బలాన్ని తెలివితేటలను, ప్రతిభను, సిరిసంపదలను,

మంచిధర్మాలను ఆచరించడముల వంటివాటిని పొందుతున్నాడు. ఇది చక్రమువలె ఇహపరములనే లోకాలలో సుఖాన్నే సుఖాన్నే అనుభవించుతున్నాడు. అని ఆపస్తం బమహర్షి ప్రవచించినాడు. యావత్సమ్పాతమ్ అని అనగా ఫలాన్ని ఇవ్వడానికి పూనుకున్న కర్మవిశేషాన్ని గురించి చెప్పినమాట. **యత్ కించే హకరోత్య యమ్** అని చెప్పినది కూడా ఇటువంటి దాన్ని గురించే, ఫలాలను అనుభవించని ప్రాయశ్చిత్తాలను చేసుకోని కర్మలు ఏవైతే ఉన్నవో ఇతర కర్మలను అనుభవించినంత మాత్రాన ఇవి నశించిపోతవి అని అనుకోవడం సరియైనది కాదు.

కనుక పై లోకాలకు వెళ్ళినవారు సానుశయులు అయ్యే పోయిన మార్గము ద్వారా కాకుండా తిరిగి వెనుకకు వస్తున్నారు. ఆరోహ ప్రకారము గానూ, మరొకవిధంగానూ తిరిగి వస్తున్నారని అర్థము. ఎక్కిపోవడము అనగా ధూమము, రాత్రి, కృష్ణపక్షము, దక్షిణాయనము యొక్క ఆరు నెలలు, పితృలోకమైతేనో చంద్రుని లోకాన్నుంచి ఆకాశము వాయువు, ధూమము, నీరు లోని మబ్బు, కురిసే నీరు గల మొయిలు అనే క్రమంలో దిగి వస్తారు. ఆకాశము వరకు వచ్చినంతవరకూ యథేతమ్ (యథా + ఇతమ్ఒపోయిన విధముగా) వాయువు మొదలైన స్థానాలను పొందడము పితృలోకాదులను పొందకపోవడాన్ని అనేవమ్ అని తెల్సుకోవాలి. అనగా పోయిన ప్రకారము కాదు. మధ్యలో మార్పు ఉన్నది అని అర్థము (ఏవమ్ఒఈ విధంగా నభవతి కాదు గనుక అనేవమ్)

సూ॥ **చరణాదితిచేన్న తదుపలక్షణార్థా ఇతి కార్ష్ణాజినిః 3-1-9** శీలాన్ని బట్టి మంచిచెడ్డ జన్మలు లభిస్తాయి కానీ అనుశయము వల్ల కాదు. అది ఉపలక్షణము కొరకు మాత్రమే చెప్పబడింది అనికార్ష్ణాజినిః అనే మహర్షి అన్నాడు. రమణీయ చరణాః, కపూయ చరణాః అని చరణ శబ్దముతో పుణ్యపాపరూపమైన కర్మ చెప్పబడడం లేదు. చరణ శబ్దానికి లోకంలోగానీ వేదంలో కానీ ఆచారము (నడవడిక) నందు ప్రసిద్ధి ఉన్నది. చరణమ్ఒఆచారము శీలమ్ వృత్తమ్ అని లౌకికులు పర్యాయపదాలను పలుకుతున్నారు. వేదములోనున్నూ **యాన్యనవద్యానికర్మాణి తానిసేవితవ్యాని... యాన్యస్మాకగ్ం సుచరితాని తాని త్వయోపాస్యాని** ఏవి దోషము లేని కర్మలు ఉన్నవో వాటిని పాటించాలి. ఏవి మనకు మేలు చేస్తాయో వాటినే తప్పక అనుసరించాలి అని. చరణ కర్మ శబ్దాలు భేదముతో పేర్కొనబడుతున్నవి కనుక చరణము - శీలము వలన మంచి చెడు జన్మలు కలుగతవి. అంతేకానీ కర్మ మిగులు వలన కాదు అని

అంటే చరణము అని వినపడడము కర్మకు ఉపలక్షణము కొరకే అనికార్ష్ణాజినిః అనే పేరుగల ఆచార్యుడు తలుస్తున్నాడు. కారణము ఏమిటంటే కేవలము ఆచారము వలన సుఖదుఃఖాలను పొందడము అసంభవము కనుక. సుఖదుఃఖాలు పుణ్యపాపరూప కర్మలకు ఫలాలు కదా!

సూ॥ **ఆనర్థక్యమితి చేన్న. తదపేక్షత్వాత్ 3-1-10** అట్లా ఐనప్పుడు ఆచారము వ్యర్థమే కదా! అని అంటే కాదు. పుణ్య కర్మకు ఆచారము అవసరమేఐ ఉన్నది. ఉపలక్షణము కొరకు మాత్రమే ఐనప్పుడు స్మృతుల ద్వారా చెప్పబడిన ఆచారము దండుగ అవుతుంది కదా అని అనేటట్లయితే అట్లా ఎంచకూడదు. పుణ్యకర్మకు ఆచారము తప్పక అవసరమైనదే సుమా! ఆచారము కలవారికి మాత్రమే పుణ్యకర్మలు చేయడంలో అధికారము ఉంటున్నది. **సన్ధ్యాహీనోఽశుచిర్నిత్యం అనర్హఃసర్వకర్మసు.** సంధ్యావందనాన్ని ఆచరించనివాడు ఎప్పుడూ అశుచియే. ఏ కర్మలు చేయడంలోనూ యోగ్యత కలవాడు కాడు. **ఆచారహీనం నపునన్తివేదాః.** ఆచారం లేనివాడిని వేదాలు పవిత్రుణ్ని చేయజాలవు. ఇత్యాది వచనాలు వినలేదా? కనుక చరణ శ్రుతి కర్మో పలక్షణము కొరకు అని **కార్ష్ణాజిని** గారి యొక్క అభిప్రాయము.

సూ॥ **సుకృతదుష్కృతే ఏవేతితుబాదరిః 3-1-11** సుకృతదుష్కృతాలే మంచీ చెడుజన్మలను ఇస్తాయి అని బాదరి అనే ఆచార్యుడు చెప్పుతున్నాడు. **పుణ్యంకర్మా చరతి, పాపం కర్మ ఆచరతి** పుణ్యకర్మను చేస్తున్నాడు, పాపపు పనిని చేస్తున్నాడు అని కర్మానుష్ఠానము నందు ప్రయోగము కనిపించుతున్నది కాబట్టి విడిగా పేర్కొనడమున్నూ ప్రత్యక్షము చేత శ్రుతిచేత సిద్ధము ఐన ఆచారము ద్వారా అనుమతించబడిన శ్రుతి సిద్ధ విషయమైనందువల్ల గోబలీ వర్ద న్యాయము ప్రకారము పొసగుతున్నది. గోవు అన్నపుడే అర్థము తెల్సినా ఆడజన్తువు కాదు మగ జన్తువు అని తెలువడానికి గాను బలీ వర్దము ఆంబోతు అని ప్రయోగించడము జరుగుతున్నది. అనగా వివరించడమవుతున్నది. ముఖ్యార్థమే అభిధ ద్వారా తేటగా తెలుస్తున్నపుడు దాన్ని కాదని లక్షణను ఆశ్రయించడము న్యాయము కాదు. కనుక సుకృత దుష్కృతాలే చరణ శబ్దము చేత చెప్పబడుతున్నవి అని బాదరి ఆచార్యుడు తలుస్తున్నాడు. ఈ వివాదములో బాదరి గారి యొక్క అభిప్రాయమే వేదవ్యాసుల వారికిన్నీ నచ్చిన మాట. ఆచారము ఒప్పుకున్న వేదము చేత విధింపబడిన సంధ్యావందనము మొదలైనవాటికి ఇతర కర్మలను ఆచరించడానికి అధికారాన్ని చేకూర్చడమే ఫలమని మాత్రము

అంగీకరించినారు. కనుక అనుశయముతో కూడిన వారయ్యే క్రిందికి దిగి వస్తున్నారు. **ఇది కృతాత్యయాధికరణము.**

★ ★ ★

## అనిష్టాదికార్యధికరణము.

సూ॥ **అనిష్టాది కారిణామపి చ శ్రుతమ్ 3-1-12** ఇష్టా పూర్తాది సత్‌కర్మలు చేయనివారు కూడా చంద్రుని వద్దకు పోతున్నారని వినిపిస్తున్నది. బ్రహ్మజ్ఞానము లేకుండా ఇష్టాపూర్తములు ధానములు చేసినవారు చన్ద్రుని దగ్గరకుపోయి కర్మశేషము కొంత ఉంటుండగనే వెనుకకు తిరిగి వస్తున్నారని చెప్పబడింది. ఇప్పుడు ఇష్టాదికారులు కానివారు కూడా చంద్రుని వద్దకు వెళ్ళుతున్నారా? లేదా? అని విచారము చేయబడుతున్నది. ఎవరైతే తనకు శాస్త్రము చెప్పిన కర్మలను చేయరో, ఎవరు శాస్త్రము నిషేధించిన పనులనే చేస్తున్నారో వారు ఇద్దరు కూడా అనిష్టాదికారులు పాపకర్ములు. సందేహము కలిగినదాని ప్రకారము ఏది తగినది అని అంటే చంద్రుని దగ్గరకు పోతున్నారు అనేదే న్యాయమైనది ఎందువల్లనంటే తేషామపి - వాళ్ళకు కూడా ఆ పోవుట ఉన్నదని వేదము చెప్పుతున్నది. **యేవైకే చాస్మాల్లోకాత్ ప్రయన్తి చంద్రమసమేవతేసర్వేగచ్ఛన్తి.** ఎవ్వరైతే ఈ లోకాన్నుంచి బయలుదేరి పోతున్నారో వారందరు కూడా చంద్రుని దగ్గరకే పోతున్నారు అని భేదము లేకుండా అందరికిన్నీ పోకడ వినిపించుతున్నది కాబట్టి.

ఇట్లా ఐనప్పుడు మంచీచెడ్డలను చేసినవారు ఇద్దరికిన్నీ తేడా లేకుండా ఒకే విధమైన పోకడ ఏర్పడుతుంది కదా! అంటే కాదంటున్నారు.

సూ॥ **సంయమనేత్వనుభూయ ఇతరేషామారోహావరోహౌ తద్గతిదర్శనాత్ 3-1-13** అనిష్టాదికారులు యముని వద్ద యాతనలు అనుభవించిన తరువాతనే చంద్రుని వద్దకు పోవడం రావడం జరుగుతవి. ఆ విధంగా వారి గమనము కనపడుతున్నది. తు శబ్దము లేవనెత్తిన శంకను దూరము చేస్తున్నది. ఇతరేషాం - అనిష్టాదికారులకు ఆరోహావరోహౌ–చంద్రుని వద్దకు పోవడము తిరిగి రావడాలు సంయమనే - యమునియొక్క శాసనము, అందువల్ల తాము అనుభవించాల్సిన యాతనలను అనుభవించినాకనే కానీ మరొక విధంగా కాదు. ఎందువల్ల? అని అంటే అట్లాగా వారి గతి కనిపిస్తున్నందువల్ల. కనిపిస్తున్నది కదా పాప కర్మలు చేసినవారు

యమునికి లొంగినవారవుతున్నారు కనుక ఆయన వద్దకు పోవడము. **అయంలోకోనాస్తి నపరః ఇతిమానీ పునఃపునః వశమాపద్యతేమే.** ఈ లోకమూలేదు పరలోకము కూడా లేదు అని తలచేవాడు మాటిమాటికీ నాకు చిక్కుతున్నాడు. **వైవస్వతం సంగమనం జనానాం యమంరాజానం.** సూర్యుని కుమారుడైన జనులందరికీ రాజైన యముడిని దర్శించుకోవడం / కల్సుకోవడము. ఇత్యాది వాక్యాల్లో తేటగా కనిపిస్తున్నది.

సూ॥ **స్మరన్తిచ 3-1-14** స్మృతులు చెపుతున్నాయి కూడా! పరాశరుడు మొదలైన స్మృతి కర్తలందరూ సాధారణ జనులంతా యమునికి వశులు అవుతున్నారని చెప్పుతున్నారు. **సర్వేచైతే వశంయాన్తి యమస్యభగవన్ కిల.** ఓ పూజ్యుడా ఈ ప్రాణులందరూ యమునికి వశము అవుతున్నారట కదా! అని.

సూ॥ **అపి సప్త 3-1-15** పాపములు చేసినవారు పోదగినవిగా ఏడు నరకాలనున్నూ చెప్పుతున్నవి స్మృతులు. ఐతే ఏడు లోకాలకు పోతున్నవారు యమసదనానికి ఏ విధంగా పోతున్నారు? అని అంటే చెపుతున్నారు.

సూ॥ **తత్రాపి తత్ వ్యపారాద విరోధః 3-1-16** ఆ ఏడు లోకాలకున్నూ యముని ఆజ్ఞ వల్లనే పోతున్నారు. కాబట్టి అడ్డంకులు/వైరుధ్యము ఏమీ ఉండదు. కనుక అనిష్టాదికారులు కూడా యమలోకానికి పోయి తాము చేసిన కర్మలకు తగినట్లు యాతనలను అనుభవించి అటుపిమ్మట చంద్రుని వద్దకు పోతారు. తిరిగి వస్తారు. అని పూర్వపక్షము ఏర్పడితే దానికి ఈ విధంగా సమాధానము ఇస్తున్నారు.

సూ॥ **విద్యాకర్మణోరితితు ప్రకృతత్వాత్ 3-1-17** విద్యాకర్మలకు ఫలములను అనుభవించడానికి దారితీసేవి దేవయాన పితృయానాలు. వాటితోనే సమ్బన్ధము ఉన్నది. ప్రకృతాలు కాబట్టి. తు శబ్దము పక్షాన్ని తోసివేయడం కొఱకు. అనిష్టాదికారులకు కూడా చంద్రుని వద్దకు పోవడము ఉన్నదని అనడం సరికాదు. ఎందువల్లనంటే విద్యాకర్మణోః - బ్రహ్మ విద్యా, యజ్ఞాదికర్మల యొక్క ఫలాన్ని అనుభవించడానికి ఏర్పడినట్టివి దేవయాన పితృయానాలు చెప్పబడుతున్న విషయము ఇది. అనిష్టాదికారులకు ఏవిధంగానైతే బ్రహ్మవిద్య లేనందువలన దేవయానమార్గము ద్వారా పైలోకానికి పోవడమనేది లేదో అట్లాగే ఇష్టాపూర్తములు దత్తములు లేవు కాబట్టి పితృయాణమార్గమున వారికి చంద్రుని వద్దకు పోవడమనేదిన్నీ సమ్భవించదు. దేవయాన పితృయానాలు విద్యాఫలము, కర్మ ఫలములకు చెందినవి అని మీకు ఏ

విధంగా తెలుస్తున్నది అని అంటే ఆ రెండూ ప్రస్తుత ప్రకరణానికి సమ్బన్ధించినట్టివి ప్రకృతములు. దేవయానము నందు విద్య ప్రకృతమైనది. పితృయాణము నందు కర్మ.

**తద్య ఇత్థమ్ విదుర్యేచేమే అరణ్యేశ్రద్ధాతప ఇత్యుపాసతే.** ఎవరైతే అరణ్యములో శ్రద్ధ తపస్సు అని ఉపాసన చేస్తున్నారో వారు ఈ చెప్పిన ప్రకారము పరమాత్మను తెల్సుకుంటున్నారు అని చెప్పి **తేఽర్చిషమభి సమ్భవన్తి అర్చిషోఽహః.** వారు అర్చిః పురుషుని వద్దకు పోతున్నారు. అక్కడి నుండి అహఃఽపగటిపూటకు అభిమాని ఐన దేవత వద్దకు పోతున్నారు. ఇత్యాది వాక్యములతో దేవయానాన్ని గురించి చెప్పినారు కాబట్టి. **అథయ ఇమేగ్రామే ఇష్టా పూర్తే దత్తమిత్యుపాసతే** ఇక ఎవరైతే గ్రామములోనే కాపురము ఉంటూ ఇష్టము, పూర్తము, దత్తము అనే పుణ్యకర్మలను ఆచరించుతుంటారో అనే వాక్యముతో పితృయాణాన్ని గురించి చెప్పినారు కాబట్టిన్నీ. **యేవైకే చాస్మాల్లో కాత్ ప్రయన్తి చంద్రమసమేవతే సర్వేగ చ్ఛన్తి** అనే ఈ వాక్యమును "**యఇష్టాదికారిణః తే సర్వే**" ఎవరు ఇష్టాదికారులో వారంతా అని నిర్వహించుకోవాలి.

ఏమండీ! పాపకర్ములు చంద్రుని వద్దకు పోకపోయినట్లయితే పంచమాహుతి ఏర్పడనందున శరీరము కలుగడమే కుదురదు. **పంచమ్యామాహుతౌ ఆపఃపురుష వచసః భవన్తి అని** కదా శరీరారంభము వినిపించుతున్నది. ఆ ఆహుతి చంద్రుని దగ్గరకు చేరడాన్నించే మొదలవుతున్నదని అని కదా చూపించింది. కనుక శరీరము ఆరంభము కావాలంటే వాళ్ళు కూడా చంద్రుని దగ్గరకు పోతారు. తిరిగి ఆయన నుండే బయలుదేరి వస్తారు అని ఒప్పుకోవాల్సి ఉంటుంది అని అంటే చెపుతున్నారు.

సూ॥ **న తృతీయోపలబ్ధేః 3-1-18** అవసరము లేదు. తృతీయ స్థాన శబ్దముతో పాపకర్ములు చెప్పబడుతున్నారు. వాళ్ళకు దేహారంభము కావాలంటే పంచమాహుతి అవసరము లేదని శ్రుతి చెప్పుతున్నది. తృతీయ స్థానము నందలి వారికి శరీరాంభము కావాలంటే పంచమాహుతి యొక్క అవసరము లేదు. ఎందువల్లనంటే? అట్లాగా ఉపలబ్ధి ఉన్నది కాబట్టి. తృతీయ స్థాన శబ్దముతో కేవలము పాపకర్ములు మాత్రమే చెప్పబడుతున్నారు. వారికి దేహము ఏర్పడడానికి పంచమాహుతితో అక్కరలేదని తెలుస్తున్నది. **వేత్థయథా అసౌ లోకోనసంపూర్యతే** ఈ లోకము ఎందుకు నిండడము లేదో తెల్సునా? అనే ప్రశ్నకు ప్రతివచనము (సమాధానము) **అథైతయోః పథోర్నకతరేణచన. తానీమానిక్షుద్రాణ్యసకృదావర్తీని భూతానిభవన్తి. జాయస్వమ్రియస్వేతి. ఏతత్ తృతీయంస్థానమ్. తేనాసౌ లోకోనసమ్పూర్యతే.** ఇక ఈ రెండు దేవయాన పితృయాణములలో ఏ ఒక్కటి

ద్వారానూ కాదు. ఈక్షుద్రులైన ప్రాణులు మాటిమాటికీ వస్తూ పోతూ ఉంటారు. పుట్టు, చావు అని ఆదేశింపబడుతుంటారు. దీన్ని మూడవ స్థానము / లోకము అని అంటారు. అందువల్ల ఈ లోకము నిండబడడం లేదు. పొందబడడం లేదు అని. తృతీయస్థానానికి ద్యులోకము లోకి ఎగబాకడము, దిగజారడము (ఆరోహావరోహాలు) లేవు గనుక ద్యులోకము అసమ్పూర్తి గానే ఉంటున్నదని చెప్తున్నందువల్ల ఈ తృతీయస్థానానికి – పాపకర్ములకు – శరీరారంభము కావాలంటే పంచమాహుతి యొక్క అవసరము లేదు. పంచమ్యామాహుతౌ అని నీటికి పంచమాగ్ని సమ్బన్ధముతో పురుషుడు అని అనబడుటకు హేతువు అవడాన్ని మాత్రమే ప్రతిపాదించుతున్నది. మరొకదాన్ని ఆపడం లేదు. కారణం ఏమిటంటే అవధారణము – నిశ్చయము వినిపించడము లేదు కనుక.

సూ॥ **స్మర్యతేఽపిచ లోకే 3-1-19** లోకములో ఈ విషయాన్నే తల్చుకుంటున్నారు కూడా. పుణ్యాత్ములైన కొందరికి పంచమాహుతి – మాతృగర్భము – తో అవసరము లేకుండానే పుట్టుక కలుగుతున్నది. ద్రౌపది, సోదరుడు ధృష్ట ద్యుమ్నుడు మొదలైనవారు ఇందుకు ఉదాహరణ.

సూ॥ **దర్శనాచ్చ 3-1-20** వేదములో కనిపిస్తున్నది కూడాను. వేదములో కూడా కనిపిస్తున్నది. కొందరికి పంచమాహుతి అవసరము లేకుండానే దేహము ఏర్పడుతున్నది. **తేషాం ఖల్వేషాం భూతానాం త్రీణ్యేవబీజాని. ఆండజం జీవజం ఉద్భిజ్జమ్.** ఈ ప్రాణులన్నింటికీ మూడే కారణాలైన విత్తనాలు. ఒకటి గుడ్డులో నుండి పుట్టుట రెండు ప్రాణుల గర్భములో నుండి పుట్టుట. మూడు నేల నుండి చీల్చుకొని వచ్చుట అని. వీటిలో ఉద్భిజ్జము స్వేదజము లైన భూతాలకు పంచమాహుతి లేకుండానే పుట్టుక కనపడుతున్నది.

ఇక్కడ స్వేదజలములను గురించిన ప్రస్తావన లేదు. త్రీణ్యేవ మూడే అని చెప్పినారు కదా అని అంటే చెప్పుతున్నారు –

సూ॥ **తృతీయ శబ్దావరోధః సంశోకజస్య 3-1-21** మూడు అనే శబ్దము వల్లనే సంశోకజము కూడా చెప్పబడుతున్నది. సంశోకజస్య – స్వేద జమునకు (చెమటవల్ల పుట్టేది) ఆండజం, జీవజం, ఉద్భిజమ్ అన్నచోట మూడవదైన ఉద్భిజ్జ శబ్దముతోనే అవరోధము – సంగ్రహము (కలుపుకొనుట) ఉన్నది అని అర్థం. కనుక కేవల పాపాత్ములకు చంద్రలోకానికి పోవడము అనేది సమ్భవించదు. **ఇది అనిష్టాదికార్యధికరణము**

★ ★ ★

## ఇక తత్ స్వాభావ్యాపత్తి అధికరణము.

సూ॥ **తత్స్వాభావ్యాపత్తిః ఉపపత్తేః 3-1-22** ఇష్టాదికారులు తిరిగి వచ్చేటప్పటి క్రమంలో ఆకాశానికి వచ్చినపుడు ఆకాశము యొక్క స్వభావాన్ని మాత్రమే పొందుతారు కానీ సాదృశ్యాన్ని కాదు. అదియే తగినదౌతున్నందువల్ల పొసగుతున్నందువల్ల. ఇష్టాదికారులు భూతసూక్ష్మాలతో కూడినవారై కొంతకర్మ శేషాన్ని వెంటపెట్టుకొని చంద్రుడి వద్దనుండి భూలోకానికి తిరిగి వస్తున్నారని చెప్పబడింది. దిగివచ్చే ప్రకారము – **అథైతమేవాధ్వానం పునర్నివర్తన్తే యథేతం ఆకాశమాకాశాద్వాయుమ్. వాయుర్భూత్వాధూమోభవతి. ధూమోభూత్వాఽభ్రమ్ భవతి. అభ్రమ్భూత్వామేఘోభవతి. మేఘో భూత్వాప్రవర్షతి.** ఇక ఈ పోయిన మార్గము ప్రకారమే తిరిగి వెనుకకు వస్తున్నారు. ఎట్లాగంటే ముందుగా ఈ ఆకాశములోకి దానినుండి వాయువువద్దకు ఆ తరువాత అభ్రము – నీరు ఉన్న మబ్బు – అవుతున్నాడు. పిదప వర్షించబోయేపుడు క్రిందికి వచ్చిన మేఘము అయ్యి చివరకు వర్షముగా కురుస్తున్నాడు అని చెప్పినందువల్ల యథేతం – అనే వంచ అనిన్నీ చెప్పబడింది. ఆ క్రమంలో ఆకాశాది రూపాలను పొందినప్పుడు దేవుడు మనుష్యుడు మొదలైనవాటివలె ఆకాశాది భావాన్ని పొందుతాడా? లేక వాటితో సాదృశ్యమా? అని సందేహము కలిగితే శ్రద్ధా అవస్థలో ఉన్నవాడికి సోమభావము వలెనే ఇద్దరికీ నడుమ తేడా ఏమీలేనందువల్ల ఆకాశముతో సాదృశ్యము కాకుండ ఆకాశము వలె కావడమే అని పూర్వపక్షము ఎదురయ్యింది. దానికి సమాధానము ఏమిటంటే దాని యొక్క స్వభావముతో సమానమైన స్వభావాన్ని పొందడమే కానీ సాదృశ్యము కాదు అని. ఎందుకంటావా? స్వాభావ్యాపత్తి అంటే సాదృశ్యాపత్తియే. ఏ కారణంగా అని అన్నట్లైతే ఉపపత్తి వల్ల అని అంటున్నాము. సోమభావ మనుష్య భావాదుల యందు సుఖదుఃఖాలను అనుభవించడానికే ఆయా భావాలను పొందడమవుతున్నది. ఇక్కడి ఈ ఆకాశాది భావాలయందు సుఖదుఃఖానుభవము లేదు కాబట్టి ఆకాశాదిభావము పొందడము పొసగడము లేదు కనుక తదాపత్తిని చెప్పడము ఆకాశాదులతో సంసర్గము కలయిక వలన కలిగిన సాదృశ్యాపత్తి అని అర్థము. **ఇది తత్స్వాభావ్యాపత్తి అధికరణము.**

★ ★ ★

## ఇక నాతి చిరాధికరణము.

సూ॥ **నాతిచిరేణ విశేషాత్ 3-1-23** చంద్రుడి నుండి దిగివస్తున్నప్పుడు ఆయా అవస్థలలో ఎంతకాలముంటాడు అనే ప్రశ్న వస్తే ఎక్కువ కాలము కాదు. కాని కొన్ని అవస్థలలో మాత్రం ఉండవలసి వస్తుంది. ఆకాశాన్ని చేరుకోవడం మొదలుబెట్టి ధాన్యము గింజలను చేరుకొనేంత వరకూ ఆయా ప్రదేశాలలో కొద్దికాలమే ఉంటాడా? లేక నియమము ఏమీ లేదా అని సందేహము కలిగితే నియమము లేదు కాబట్టి అనియమమే అని సమాధానము రాగా చెపుతున్నారు. కాదు. నాతి చిరేణ. ఎక్కువ కాలముకాదు అని ఎందువల్లనంటే విశేషము ఉన్నది కాబట్టి. ఆకాశము తరువాత క్రమంగా వ్రీహ్యాది దశను పొందినప్పుడు **అతోవైఖలు దుర్నిప్రపతరమ్.** ఇక్కడ నుండి కష్టంగా బయట పడవలసి ఉంటుంది అని విశేషించి కష్టపూర్వకంగా నిష్క్రమణ జరుగుతుందని చెప్పినందువలన. మొదట్లో ఆకాశాదులను చేరుకున్నప్పుడు తొందరగా అక్కడ నుండి నిష్క్రమించడం కనుపించుతున్నది. ఐతే దుర్నిష్ప్రపతరమ్ అనే పదము తప్పుగా ఉన్నప్పటికిన్నీ అది వైదిక ప్రయోగము కాబట్టి తప్పు కాదు. దుర్నిష్ప్రపతతరమ్ అని ఉండవలసి ఉండగా తకారము లోపించడము ఛాందస ప్రక్రియ. **దుర్నిష్ప్రపతరమ్** అనగా దుఃఖపూర్వకముగా నిష్క్రమించడము అని అర్థము. **ఇది నాతి చిరాధికరణము.**

★ ★ ★

## ఇక అన్యాధిష్ఠితాధికరణము.

సూ॥ **అన్యాధిష్ఠితే పూర్వవదభిలాపాత్ 3-1-24** దిగి వస్తున్న వీళ్ళు ఇతర జీవుడి చేత అధిష్ఠించబడిన వ్రీహ్యాది శరీరాలతో సంశ్లేషను – కలయికను మాత్రమే పొందుతారు. ఆకాశము మొదలుకొని మేఘము వరకు కేవలము తద్భావాన్ని పొందుతున్నారని చెప్పినారు కాబట్టి. పై లోకాల నుండి దిగి వస్తున్న జీవులు వడ్లు మొదలైన ధాన్యాలుగా పుడుతున్నారని తెలుస్తున్నది. **మేఘో భూత్వాప్రవర్షతి. త ఇహవ్రీహియవాః ఓషధి వనస్పతయః తిలమాషాః ఇతిజాయన్తే.** మేఘముగా అయ్యి కురుస్తున్నాడు. ఆ వర్షజలము ఈ నేలపైన వడ్లు యవలు మొక్కలు తీగలు చెట్లుగా నువ్వులు మినుములుగాను పుడుతున్నవి. వారు ఇతరులైన భోక్తల చేత వ్రీహి / వడ్లు మొదలైన శరీరాలతో అధిష్ఠించిన వ్రీహ్యాదులను కలసి అతుక్కొని పోతారా?

లేక ఆ భోక్తలు వ్రీహ్యాది శరీరాలుగా పుదుతున్నారా అని సంశయము కలిగినపుడు, వాక్యములో జాయన్తే అని చెప్పినారు కాబట్టి దేవుడుగా పుదుతున్నాడు, మనుష్యుడై పుదుతున్నాడు అని అన్నట్లు వ్రీహ్యాది శరీరాలుగానే అని సమాధానము వచ్చినపుడు సిద్ధాన్తము చెప్పబడుతున్నది. ఇతరుల చేత అధిష్ఠింపబడిన వ్రీహ్యాది శరీరాలతో సంశ్లేషము – కలయిక మాత్రమే. ఎందుకనగా! పూర్వ వదభిలాపాత్. ఆకాశము మొదలుకొని మేఘము ద్వారా కేవలము తద్ భావము చెప్పబడింది కనుక. ఎక్కడైతే భోక్తృత్వము ఉద్దేశించబడిందో అక్కడ అందుకు సాధనమైన కర్మ చెప్పబడుతుంది. రమణీయ చరణాః లేక కపూయచరణాః అని. ఇక్కడ ఆకాశాదుల వలె కర్మ చెప్పబడడం లేదు. ఫలాన్ని ఇవ్వడానికి పూనుకున్న స్వర్గానుభవమే ఫలముగా కల ఇష్టాది కర్మ స్వర్గాన్ని అనుభవించడం తోనే ముగిసిపోయింది కనుక ఇంకా ఆరంభించబడని దాన్ని గురించి **రమణీయ చరణాః కపూయచరణాః** అని ముందు చెప్పనున్నందువల్ల. ఈ నడుమన మరొక్క కర్మలేదుకాబట్టిన్నీ. కనుక ఆకాశాది భావవచనము వలెనే వ్రీహ్యాది భావముతో జన్మ పొందుచున్నారని మర్యాద – ఔపచారికము – కొరకు మాత్రమే.

సూ॥ **అశుద్ధమ్ ఇతి చేత్ న. శబ్దాత్ 3-1-25** వ్రీహ్యాది జన్మ పాపముతో కూడినందువల్ల అశుద్ధము అని అంటే కాదు అట్లాగని వేదము చెప్పుతున్నది. మీరు చెప్పినట్లు కాదు. ఏదైతే ఇతర జీవునితో అధిష్ఠింపబడిన వ్రీహ్యాది శరీరము నందు సంశ్లేష – కలయిక మాత్రమే. భోక్తృత్వానికి కారణమైనది (కర్మ) లేదు కాబట్టి వ్రీహ్యాది జన్మ లేదు అని. భోక్తృత్వాది హేతువు ఉన్నది. స్వర్గాన్ని అనుభవించడము అనే ఫలము కల ఇష్టాది కర్మనే అశుద్ధమైనట్టిది అనగా పాపముతో కలిసినట్టిది. అగ్నీషోమీయము వంటి యజ్ఞాలు హింసతో కూడుకున్నవే. హింస అనేది **నహింస్యాత్ సర్వాభూతాని** ఏ ప్రాణినీ ఏ విధంగానూ కూడా బాధ పెట్టవద్దు అని నిషేధించి నందువల్ల పాపమే అవుతున్నది.

ఐతే ఇక్కడ చెప్పబడిన పదాన్ని బట్టి ఆహవనీయాదులవలె ఉత్సర్గాపవాద న్యాయము చెల్లదు. రెండు వేరు వేరు విషయాలు ఐనవి కాబట్టి. అగ్నీషోమీయము అనే యాగములో ఆదేశించబడిన హింస క్రతువుకు తోడ్పడేది అని తెలుస్తున్నది. నహింస్యాత్ అనేది మాత్రము ప్రత్యవాయాన్ని ఫలముగా కల హింసను నిషేధించుతున్నది. ఐతే ఇట్లా అనవచ్చును. అగ్నీషోమీయాదులలో యాగము చెయ్యవయ్యా అని శాస్త్రము/ వేదము విధించుతున్నందువల్ల వాటిలో పాల్గొన్నవానికి హింసకు విషయమైన

నిషేధవిధి / శాస్త్రము వర్తించదు. ఎందుకంటే కోరి చేస్తున్నది కాబట్టి అని. మీరు చెప్పింది సరికాదు. ఇక్కడ కూడా హింస రాగముతోనే – స్వర్గాన్ని పొందాలి / మాంస భోజనము చేయాలి – అనే కోరికతోనే హింస చేస్తున్నాడు కాబట్టి రెండింటిలోనూ భేదము లేదు. **స్వర్గకామోయజేత** ఇటువంటి వాటిలో కోరిక ఉన్నవాడికి (కామికి) చేయదగినదిగా యాగాదులను ఉపదేశించినారు కాబట్టి యాగాదులు స్వర్గాదులకు సాధనము అవడాన్ని గమనించి ఫలము మీద ఉండే అనురాగము కొద్దీ ప్రవర్తిస్తున్నాడు. అగ్నిషోమీయాదుల యందు కూడా హింసాదులు ఫలానికి సాధనమైన యాగాదులకు ఉపకరించుతవి అని శాస్త్రము ద్వారా తెల్సుకొని రాగము తోనే వాటియందు ప్రవర్తించుతున్నాడు. లౌకికమైన హింస యందు కూడా ఏదో ఒక ప్రమాణంతో హింస తాను కోరిన కోరికకు సాధనమనే విషయాన్ని తెల్సుకొని రాగముతోనే ప్రవర్తించుతున్నాడు. కనుక రెండింటిలోనూ విశేషము ఏమీ లేదు. అదే విధంగా నిత్యకర్మలలోనూ **సర్వవర్ణానామ్ స్వధర్మానుష్ఠానే పరమ్ అపరిమితం సుఖమ్.** అన్ని వర్ణాల వారికిన్నీ తమ తమ ధర్మాలను / కర్మలను అనుష్ఠించినప్పుడు అపరిమితమైన గొప్ప సుఖము లభించుతుంది. ఇత్యాది వచనాల వల్ల తాము కోరిన ఫలాలను పొందడానికి ఇవి సాధనాలు అని తెల్సుకొని రాగముతోనే ప్రవర్తించుతున్నారు కనుక ఆ నిత్యకర్మలు కూడా పాపమిశ్రములే. కావున ఇష్టాదులు పాపమిశ్రములు కనుక అశుద్ధి యుక్తములైన కర్మలకు ఫలము ఐన స్వర్గములో అనుభవించవలసినదాన్ని స్వర్గములోనే అనుభవించి హింసాభాగానికి చెందిన ఫలాన్ని వ్రీహి మొదలైన స్థావర భావముతో అనుభవించుతున్నాడు. ఇక స్థావర భావము కూడా పాపానికి ఫలమే అని స్మృతులు చెప్తున్నవి. **శ్లో॥ శరీరజైః కర్మదోషైః యాతిస్థావరతాం నరః.** శరీరము ద్వారా చేయబడిన కర్మదోషాల ఫలాన్ని స్థావరత్వాన్ని – చెట్టు చేమ, రాయి రప్ప మొదలైనవాటి రూపాల ద్వారా నరుడు పొందుతున్నాడు. అని కనుక వ్రీహ్యాది భావముతో పాప ఫలానుభవము కొరకు అనుశయము కలవారు ఐ పుడుతున్నారు అని అంటే అది నిజము కాదు. ఎందువల్ల అని అంటావా? శబ్దము, వేదము చెప్పుతున్నది కనుక. అగ్నిషోమీయాదులను తెలుపడము స్వర్గలోక ప్రాప్తి కొరకు కనుక వాటిల్లో చేసే హింస హింసకాదని శబ్దము ఉన్నది. పశువుకు సంజ్ఞపన కారణంగా కలిగే స్వర్గలోక ప్రాప్తిని తెలిపే శబ్దాన్ని ఉపదేశిస్తున్నారు. **హిరణ్య శరీరః ఊర్ధ్వః స్వర్గమ్ లోకమ్ ఏతి.** బంగారం వంటి అందమైన మనోహరమైన శరీరము కలదై ఊర్ధ్వదిశగా పయనించి స్వర్గాన్ని పొందుతుంది. ఇటువంటివి ఇంకా గొప్పదైన అభ్యుదయానికి

సాధనమైన పని కొద్దిపాటి హింసతో కూడుకొని ఉన్నదయినట్లయితే అది హింసగా ఎంచబడదు. పైపెచ్చు రక్షణమే అవుతుంది. ఆ విధమైన మన్త్ర వర్ణము ఇట్లా ఉన్నది. **నవా ఉ ఏతన్మ్రియసే నరిష్యసి దేవాన్ ఇదేషి పథిభిః సుగేభిః. యత్రయన్తిసుకృతో నాపిదుష్కృతః. తత్రత్వాదేవః సవితా దధాతు.** ఓ పశువా? నువ్వు మరణించడంలేదు. లేక తరిగి పోవడం లేదు. తోవలో నిన్ను అందరూ ప్రశంసించుతుండగా మంచి సుఖవన్తమైన మార్గములో దేవతల వద్దకు పోతున్నావు. మంచిపనులు చేసినవారు మాత్రమే తప్ప పాడుపనులు చేసిన వారు ఏ చోటికి పోజాలరో అక్కడికీ నీవు పోతున్నావు ఆ పవిత్ర దేశానికి నిన్ను కోరికలను తీర్చేదేవుడు చేర్చునుగాక! అని. ఇక లోకములోను అప్పటికప్పుడు మాత్రమే దుఃఖాన్ని కలిగించే చికిత్సకుడైన వైద్యుడిని ప్రజలు రక్షకుడని కీర్తించుతున్నారు. దానివల్ల కలిగే సుఖాన్ని తెలిసిన పెద్దలు ఆయనను సన్మానించుతున్నారు గౌరవించుతున్నారు కూడా.

సూ॥ **రేతస్సిగ్యోగోऽథ 3-1-26** తరువాత చెప్పబడే రేతస్సుతో యోగము ప్రతిపాదింపబడుతున్నది. వ్రీహ్యాది భావవచనాన్ని చెప్పిన పిమ్మట **యోయోహ్యన్నమత్తి యోరేత స్సించతి తద్భూయ ఏవభవతి.** ఏఏ ఆహారాన్ని తింటున్నాడో రేతస్సును చల్లుతున్నాడో తరువాత రేతస్సును సేచనము చేసేవానితో కల్సినవాడౌతున్నాడు. రేతస్సిగ్యోగీ భవతి అని అర్థము అని ఈ వాక్యము ప్రకారము రేతస్సిక్ భావము అనుశయము కలవారికి కలుగుతున్నదని చెప్పేవాక్యము ద్వారా వానితో యోగాన్ని మాత్రమే ప్రతిపాదించుతున్నది అట్లాగే వ్రీహ్యాదిభావము కూడా ఆయా ధాన్యపుగింజలతో కలయికను మాత్రమే సూచిస్తున్నది.

సూ॥ **యోనేః శరీరమ్ 3-1-27** స్త్రీ యొక్క గర్భము నుండి శరీరమును పొందుతున్నారు. స్త్రీ యొక్క గర్భానికి చేరిన తర్వాతనే కర్మశేషముతో దిగివచ్చినవారికి శరీరము లభించుతుంది. దానితోనే సుఖదుఃఖానుభవము కలుగుతుంది. అంతకుముందు ఆకాశాది ప్రాప్తి మొదలుగా ఉన్న వాటితో యోగము మాత్రమే అని అర్థము. **ఇది అన్యాధిష్ఠితాధికరణము.**

**ఇంతటితో శ్రీభాష్యమునందు తృతీయాధ్యాయములోని**

ప్రథమపాదము ముగిసినది.

శ్రీమతే రామానుజాయనమః

## శ్రీభాష్యము – తృతీయాధ్యాయము – ద్వితీయపాదము

### సన్ధ్యాధికరణము

సూ॥ **సన్ధ్యేసృష్టిరాహహి 3-2-01** స్వప్నము నందు సృష్టిని గురించి చెప్పినాడు కదా! ఈ విధంగా కర్మకు తగినట్లు గమనము ఆగమనము పుట్టుట మొదలైనవాటితో కలిసి ఉంటున్నందువల్ల మెలకువతో ఉన్న జీవుడు దుఃఖాల పాలు అవుతున్నాడని వెల్లడించినారు. ఇప్పుడు ఈ జీవుని యొక్క స్వప్నావస్థ ఎటువంటిదని పరీక్ష చేస్తున్నారు. స్వప్నాన్ని గురించి వేదములో ఈ విధంగా వినిపిస్తున్నది. **నతత్ర రథాః నరథయోగాః న పంథానో భవన్తి. అథరథ్యా రథయోగాన్ పథః సృజతే. నతత్ర ఆనన్దాః ముదః ప్రముదో భవన్తి. అథ ఆనన్దాన్ ముదః ప్రముదః సృజతే. నతత్రవేశాన్తాః పుష్కరిణ్యః స్వవన్త్యో భవన్తి. అథవేశాన్తాః పుష్కరిణ్యః స్రవన్త్యః సృజతే. సహికర్తా.** కలలో రథాలు రథాలకు కట్టే గుఱ్ఱాలు అవి పరుగుపెట్టే బాటలు ఉండవు. తరువాత రథాలు గుఱ్ఱాలు బాటలున్నూ ఉండవు. అనన్తరము ఆనన్దాలు ముదములు ప్రముదములను పుట్టిస్తున్నాడు. అక్కడ భవనాలు కొలనులు సెలయేళ్ళు ఉండవు. తరువాత మేడలను కొలకులను సెలయేళ్ళను పుట్టించుతున్నాడు. ఆయననే కదా నిజమైన కర్త అని. దీనివద్ద సంశయము కలుగుతున్నది. రథాది సృష్టిని జీవుడు చేస్తున్నాడా? లేకపోతే ఈశ్వరుడు చేస్తున్నాడా? అని. ఏది తగును అని అంటే స్వప్నములోని సృష్టిని జీవుడే చేస్తున్నాడని. ఎందువల్లనంటే సాంధ్యము అనగా స్వప్నస్థానము అని చెప్పబడుతున్నది. **సాన్ధ్యమ్ తృతీయమ్ స్వప్నస్థానమ్.** సాంధ్య మనగా మూడవదైన స్వప్నస్థానము అని చెప్పినారు కాబట్టి. ఆ సృష్టిని జీవుడే చేస్తున్నాడు. సృజతే సహికర్తా అని గదా చెప్పినారు. కలను చూచే / కనే జీవుడే అక్కడ గుర్తింపబడుతున్నాడు.

సూ॥ **నిర్మాతారం చైకే పుత్రాదయశ్చ 3-2-2** ఒకానొక శాఖకు చెందినవారు కామాలకు నిర్మాతనుగా పఠించుతున్నారు, పుత్రాదులను కూడా. ఇంతేకాకుండా ఈ జీవుడినే కలలో కామాలకు నిర్మాతగా ఒక శాఖవారు పఠిస్తున్నారు. **యఏష సుప్తేషుజాగర్తి. కామంకామం పురుషోనిర్మిమాణః.** వీరంతా నిద్రిస్తున్నవేళలో ఎవడు మెలకువతో ఉంటున్నాడో. ప్రతికోరికనున్నూ నిర్మిస్తున్నవాడై ఉన్నాడు అని. పుత్రాదులు

పుట్టాలి అని కోరబడుతున్నారు. కాబట్టి కామ శబ్దముతో పేర్కొనబడుతున్నారు. కోరిక అని మాత్రమే అర్థము కాదు. దీనికి ముందఱ **సర్వాన్ కామాన్ ఛన్దతః ప్రార్థయస్వ** కోరికలను అన్నింటినీ స్వేచ్ఛగా కోరుకో. **శతాయుషః పుత్రపౌత్రాన్ వృణీష్వ.** నిండు నూరేళ్ళు బ్రతికే పుత్రులను మనుమలను కోరుకో అని పుత్రాదులే కామాలుగా చెప్పబడినారు. కనుక జీవుడు రథాలు మొదలైన వాటిని సృష్టించుతున్నాడు. జీవుడికి సత్యసంకల్పత్వము ఉన్నదని ప్రజాపతి వాక్యంలో వినబడింది. కావున ఉపకరణాలు లేకుండానే జీవుడికి సృష్టి చేయగల్గడము చెల్లుతుంది. అని పూర్వ పక్షము రాగా చెప్పుతున్నారు.

(**ఆనందము** – ఇది నాకు తగినది అనే భావనతో ఆయా విషయాలపైన ఏర్పడిన ప్రీతియే. **ముత్** – నాకు చెందినది. ఇతరులకు దీనిపై అధికారం లేదు అనే బుద్ధి వల్ల పుట్టిన ప్రీతి. **ప్రముత్** – దాన్ని వాడుకోవడము వల్ల కలిగిన ప్రీతి).

సూ॥ **మాయామాత్రంతు కార్త్స్న్యేన అనభివ్యక్త స్వరూపత్వాత్ 3-2-3** స్వప్నములోని పదార్థాల సృష్టి పరమాత్మదే. జీవుడికి అతని యొక్క సహజమైన రూపము మొత్తము మొత్తంగా మరుగుపడి పోయింది కాబట్టి. సూత్రము లోని తు శబ్దము పూర్వపక్షాన్ని తిప్పికొడుతున్నది. స్వప్నములో కనిపించిన రథాలు పుష్కరిణులు మొదలైనవస్తు సముదాయమంతా మాయా మాత్రమే పరమ పురుషుడు సృష్టించినదే. మాయా శబ్దము "**ఆశ్చర్యము**" అనే అర్థాన్ని చెప్తున్నది. **జనకస్యకులే జాతా దేవమాయేవనిర్మితా** జనకుని యొక్క ఇంటిలో పుట్టింది. దేవునియొక్క మాయ వలె నిర్మింపబడింది. ఇత్యాదుల యందు ఆశ్చర్యార్థము నందు కనిపించినందువల్ల. ప్రస్తుతము ఇక్కడ కూడా **నతత్రరథాః నరథ యోగాః న పన్థానః** అనే వాక్యములో కలను కనేవాడికి తప్ప ఆయన వంటి ఇతర వ్యక్తులకు అనుభవింపదగినవి కావు అని అర్థము. **అథరథాన్ రథయోగాన్ పథః సృజతే** అన్నచోట కూడా స్వప్నాన్ని చూచేవాడికి మాత్రమే అనుభవింపదగినవి తలచిన కాలానికి మించి ఉండని వాటిని పుట్టించుతున్నాడు కనుక ఆశ్చర్యమైనట్టివే. ఇట్లాంటి వింతయైన సృష్టిని చేయడము సత్యసంకల్పుడైన పరమపురుషుడికి మాత్రమే తగినది అవుతుంది. జీవుడికి కాదు. ఆ జీవుడికి సత్యసంకల్పత్వాదులు ఉన్నప్పటికీ సంసారదశలో మొత్తంగా వ్యక్తమైన – తెలిసేట్లుండే తన స్వరూపము కలవాడు కాదు కాబట్టి. ఆ విధమైన ఆశ్చర్యకరమైన సృష్టి చేయడం పొసగదు. **కామం కామం పురుషోనిర్మిమాణః** అనే వాక్యమున్నూ

పరమపురుషుడినే నిర్మాతగా తెలిపింది. **యఏషుసుప్తేషుజాగర్తి. తదేవశుక్రం తద్బ్రహ్మ తదేవామృతముచ్యతే। తస్మిన్ లోకాః శ్రితాస్సర్వే తదు నాత్యేతి కశ్చన.** అదే పుణ్యపాపరూపకర్మలు లేనిది. అదే బ్రహ్మ. అదే అమృతము అని చెప్పబడుతున్నది. ఆయన యందే / దానిపైననే లోకాలు అన్నీ ఆధారపడి ఉన్నవి. దాన్ని ఎవ్వరూ కాదని ముందుకుపోలేరు. అని మొదట్లో, చివరలలోనూ పరమపురుషుడికి మాత్రమే చెందిన అసాధారణ స్వభావము కనిపించుతున్నది కాబట్టి. **అథవేశాన్తాన్ పుష్కరిణ్యః స్రవన్త్యః సృజతే। సహికర్తా** అనే వాక్యము కూడా ముందు చెప్పిన శ్రుతివాక్యంతో ఏకార్థతను కలిగి ఉన్నది కాబట్టి పరమపురుషుడినే కర్తనుగా చెప్పింది.

జీవుడికి అపహత పాప్మత్వాదికము స్వభావసిద్ధమైనదే కదా! అది ఎందుకు వెల్లడికావడం లేదు? అన్న ప్రశ్నకు సమాధానమిస్తున్నాడు.

సూ॥ **పరాభిధ్యానాత్తుతిరోహితమ్. తతోహ్యస్యబన్ధ విపర్యయౌ 3–2–4** పరుడైన పరమాత్మ యొక్క సంకల్పము చేత కనబడకుండా పోయింది. కప్పివెయ్యబడింది. అందువల్ల జీవుడికి బన్ధము మోక్షములు రెండూ కల్గుతున్నవి. తు శబ్దము శంకను తొలగించడానికి ప్రయోగించినారు. పరాభిధ్యానాత్ = పరమపురుషుని యొక్క సంకల్పము వలన ఈ జీవుడికి సహజమైన రూపము కప్పివేయబడింది. ఏనాటి నుండి ఉంటున్నదో తెలియరాని కర్మపరమ్పర కారణంగా తప్పులను చేసిన ఇతని స్వాభావికమైన మంగళకరమైన రూపాన్ని పరమ పురుషుడు కనపడకుండా చేయించుతాడు. అందువల్ల జీవునికి బంధము మోక్షములు రెండూ కలుగుతున్నట్లు తెలుస్తున్నది. **యదాహ్యేవైష ఏతస్మిన్ అదృశ్యేఅనాత్మ్యే అనిరుక్తే అనిలయనే ఆభయం ప్రతిష్ఠాంవిన్దతే అథసోఽభయం గతో భవతి. యదాహ్యేవైష ఏతస్మిన్ ఉదరమన్తరం కురుతే అథతస్యభయం భవతి.** ఎప్పుడైతే ఈ జీవుడు తనకు కూడా ఒక ఆత్మలేనివాడు ఎవ్వరికీ కనపడనివాడు ఎటువంటి పేరూ లేనివాడు ఒకచోటు అంటూ లేక అంతటా ఉండేవాడు ఐన పరమాత్మ యందు అభయాన్ని ప్రతిష్ఠను (నిలుకడను) పొందుతున్నాడో ఇక అతడు భయము లేనివాడవుతున్నాడు. ఏ వేళనైతే ఈ నిష్ఠలో కొద్దిపాటిగా నైనా వ్యత్యాసాన్ని కనబరుస్తాడో అప్పుడు తిరిగి భయాన్ని పొందుతున్నాడు. **ఏషహ్యేవానందయాతి.** ఈయన మాత్రమే ఆనందాన్ని కలిగించుతాడు. **భీషాఽస్మాద్వాతః పవతే.** ఇతని నుంచి కలిగే భయము వల్లనే వాయువు వీచుతున్నాడు. ఇత్యాదివాక్యాల వల్ల తేటతెల్లమవుతున్నది.

సూ॥ **దేహయోగాద్వాసోఽపి 3-2-5** ఆ తిరోధానము - కనబడకుండా పోవడము దేహముతో కూడినప్పుడు కలుగుతుంది. లేదా సూక్ష్మమైన అచిత్‌శక్తితో కలువడము ద్వారానైనా జరుగుతుంది. సోఽపిఽఆ తిరోధానము కూడా దేహముతో జత చేరినందువల్లనే, సూక్ష్మ అచిత్ శక్తి యోగముతోగానీ జరుగుతుంది. సృష్టి జరుగుతున్న కాలములో దేహముగా ఉన్న అచిత్ వస్తువుతో కలయిక వల్ల కల్గుతుంది. ప్రలయకాలమునందు నామరూప విభాగములకు తగని మిక్కిలి చిన్నదైన అచిద్వస్తువుతో కలయిక వల్ల జీవుని సహజమైన స్వరూపము కప్పి వేయబడుతుంది. కనుక అతని స్వరూపము ఏమిటో తేటపడడం లేదు కనుక జీవుడు కలలో సంకల్పము మాత్రాననే రథాదులను సృష్టించజాలకున్నాడు. **తస్మిన్ లోకాః శ్రితాః సర్వే తదునాత్యేతి కశ్చన** సమస్త లోకాలు ఆయనపైననే ఆధారపడి ఉన్నవి. ఏ ఒక్కడు కూడా ఆయనను కాదని పోలేడు. అని అందరూ నిదురించుతున్నపుడు మెలకువతో ఉండడము సర్వలోకాలకు ఆశ్రయించదగిన (ఆధారపడదగిన) వాడు కావడము ఇత్యాదులు పరమ పురుషునికి మాత్రమే సమ్భవించుతున్నవి. కనుక జీవులు మిక్కిలి కొద్దిపాటి కర్మలకు తగినట్లు ఫలాలను అనుభవించడానికి అంతమాత్రపు కాలములోనే నశించిపొయ్యే ఆ జీవుడొక్కడు మాత్రమే అనుభవించదిగన వస్తువులను పుట్టించుతున్నాడు.

సూ॥ **సూచకశ్చహి శ్రుతేరాచక్షతే చ తద్విదః 3-2-06** స్వప్నము రాబోయే కాలములో అనుభవించనున్న మంచీచెడ్డ కర్మఫలాలను తెల్పుతుంది అని వేదము చెప్తున్నది. స్వప్నశాస్త్రాన్ని తెలిసిన పెద్దలు కూడా చెప్పుతున్నారు. ఈ చెప్పబోయే కారణం వల్ల కూడా కలలో కనిపించే వస్తువులు జీవుని సంకల్పము వల్ల పుట్టేవి కావు. ఎందువల్ల నంటే వేదము తనకు రానున్న కాలములో కలుగబోయే వృద్ధి - పెరుగుదల నష్టము, దుఃఖములను సూచించేది కల అని చెపుతున్నది. **యథా కర్మసుకామ్యేషు స్త్రియం స్వప్నేషుపశ్యతి। సమృద్ధింతత్రజానీ యాత్. తస్మిన్ స్వప్నదర్శనే** - ఎప్పుడైతే కలలో కామ్యకర్మలను చేస్తున్నపుడు స్త్రీని చూస్తున్నాడో అపుడు సమృద్ధి కలుగబోతున్నదని తెల్సుకోవాలి అని. **అథస్వప్నాః - పురుషం కృష్ణం కృష్ణదన్తం పశ్యతి। సఏనంహన్తి.** ఇక కలలు - నల్లగా ఉండి నలుపు పండ్లు కలిగి ఉన్న పురుషుడిని కలలో చూచినట్లయితే అతడే వీడిని చంపనున్నాడు. ఇత్యాదివాక్యాలవల్లనూ తెలుస్తున్నది. స్వప్నాధ్యాయాన్ని తెల్సినవారు కూడా కలను శుభాశుభాలను సూచించేదిగా చెపుతున్నారు. తన

సంకల్పానికి తగినట్లు పుట్టించబడిందైతే అది రానున్న మంచిచెడ్డలకు సూచకము అని అనడం కుదురదు. అదే నిజమైతే జీవుడు తన ఇష్టము ప్రకారము అశుభము నచ్చనిది శుభము ఇష్టమైనది కావడము వల్ల మంచికలను మాత్రమే సృష్టించుకొని దాన్నే చూస్తాడు. కనుక స్వప్నములో సృష్టి జీవుడి చేత కాకుండా ఈశ్వరుని చేత చేయబడుతున్నది. **ఇది సంధ్యాధికరణము**

★ ★ ★

## ఇక తదభావాధికరణము.

సూ॥ **తదభావోనాడీషు తచ్ఛృతే రాత్మని చ 3-2-7** సుషుప్తి స్థానములో కలలు ఉండవు. అపుడు నాడులు, పురీతతి, ఆత్మయందు ఉంటున్నాడు. అట్లాగ అని వేదము చెపుతున్నది. ఇప్పుడు సుషుప్తి స్థానాన్ని పరీక్షించుతున్నారు. వేదములో ఇట్లా పఠించుతున్నారు. **యత్రైతత్ సుప్తః సమస్తః సమ్ప్రసన్నః స్వప్నం నవిజానాతి. ఆసు తదా నాడీషుసుప్తోభవతి.** ఎక్కడైతే ఈ జీవుడు పడుకొని ఉంటాడో అప్పుడు ఇంద్రియసమదాయము అంతా ప్రశాన్తమై తేటగా ఏపని చేయకుండా ఉంటుంది. అప్పుడు ఇతడు నాడులలో నిద్రపోతూ ఉంటాడు కలలు కూడా ఉండవు అని. అట్లాగే **అథయదాసుషుప్తో భవతి యదా నకస్యచన వేద హితానామనాద్యః ద్వాసప్తతి సహస్రాణి హృదయాత్ పురీతతమభిప్రతిష్ఠన్తే. తాభిః ప్రత్యవసృప్య పురీతతిశేతే.** ఇక ఎప్పుడైతే గాఢ నిద్రను పొందుతున్నాడో ఎప్పుడైతే ఏ విషయాన్నీ తెలియకుండా ఉంటాడో హితాః అనే నాడులు డెబ్బదిరెండు (72) వేలు శరీరమంతటికీ హృదయాన్నించి పురీత తికి బయలుదేరి పోతుంటాయి. వాటి నుండి పక్కకు తప్పుకొని పురీతతి యందు పండుకుంటాడు అని. అట్లే **యత్రైతత్పురుషః స్వపితినామ సతా సోమ్యతదాసమ్పన్నోభవతి.** ఎపుడైతే ఈ పురుషుడు పండుకున్నాడని అనబడుతున్నాడో ఓ సోమ్యుడా! అప్పుడు భగవన్తుడితో సమ్పన్నుడు అవుతున్నాడు అని. ఈ విధంగా నాడులు పురీతత్ బ్రహ్మ అను ఈ మూడు సుషుప్తి స్థానాలు అవుతున్నాయి అని వినిపిస్తున్నది. ఈ మూడింటికీ వికల్పమా?(ఏదో ఒకటి సుషుప్తి స్థానమా?) లేక అన్నీ కలసి సముచ్చయమా? అని సందేహము ఏర్పడితే ఇదియే కావాలనే ఉద్దేశ్యము లేదు కనుక అదే ప్రసిద్ధము కాబట్టిన్నీ, ఒకేసారి అనేక స్థానాలలో ఉండడము కుదిరే పని కానందువల్లనున్నూ వికల్పమే అని పూర్వపక్షము తీర్పుచెప్పింది. దానికి సమాధానమే తదభావము అని. తదభావము అనగా స్వప్నము లేకపోవడము అనగా సుషుప్తి. ఇది

నాడులలో, పురీతతి యందు, ఆత్మయందున్నూ జరుగుతుంది. ఈ మూడింటికీ సముచ్చయము అని అర్థము. ఎందువల్ల నంటే తచ్ఛ్రుతేః. మూడింటికీ స్థానత్వము (స్థానము అయ్యి ఉండడము) వినిపిస్తున్నది కనుక. మూడింటికిన్నీ కార్యభేదము ఉన్నందువల్ల సముచ్చయము ఏర్పడుతుంటే పాక్షికమైన బాధతో కూడిన వికల్పాన్ని చెప్పుకోవడము న్యాయము కాదు. ప్రాసాదము (మేడ) ఖట్వ (మంచము) పర్యంకము (పరుపు) వలే నాడులు పురీతతి బ్రహ్మల కార్యభేదము తప్పక ఏర్పడుతున్నది. ఆ సముచ్చయములో నాడులు పురీతతి రెండున్నూ మేడ దానిపైన మంచముల వలె అవుతవి. బ్రహ్మనేమో మంచముపైనున్న పరుపు వంటివాడు. మూడింటినీ కలిపి ఒకదానిపైన ఒకటిని చేర్చి పండుకోవడము సాధ్యమే కదా! కనుక బ్రహ్మనే ఇక్కడ నేరుగా సుషుప్తి స్థానము అవుతున్నాడు.

సూ॥ **అతః ప్రబోధోఽస్మాత్ 3-2-8** ఏ కారణంగా బ్రహ్మనే సుషుప్తి స్థానమవుతున్నాడో ఆ కారణం చేతనే ఈ బ్రహ్మనుండే ఈ జీవులందరికీ వినబడుతున్న ప్రబోధము – మెలకువ పొసగుతున్నది. **సత ఆగమ్య నవిదుః సత ఆగచ్ఛామహే.** సత్ శబ్దము చేత చెప్పబడే పరమాత్మ నుండి వచ్చినా ఆయననుండే (మెలకువను పొందినాము) తిరిగి వచ్చినామని ఎరుగరు. ఇత్యాది వాక్యాల ద్వారా తెలుస్తున్నది. కనుక సుషుప్తి స్థానము పరమాత్మ. **తద భావాధికరణము ముగిసింది.**

★ ★ ★

## కర్మానుస్మృతి శబ్దవిధ్యధికరణము

సూ॥ **సఏవతు కర్మానుస్మృతి శబ్దవిధిభ్యః 3-2-9** నిద్రపోయినవాడే లేస్తున్నాడు. కర్మ, అనుస్మృతి, శబ్ద, విధులను బట్టి. సుషుప్తి స్థానమైన పరమాత్మ వద్దకు చేరి నిదురించిన వాడే మెలకువవచ్చి తెల్లవారు జామున లేస్తున్నాడా? లేక మరొకడు వాని స్థానములో లేస్తున్నాడా? అని సంశయము కలిగితే పూర్వపక్షి ఇట్లా పలుకుతున్నాడు. అన్ని రకములైన ఉపాధులు (పుణ్యపాపరూపకర్మలు) నుండి విముక్తుడు అయ్యి పరమాత్మ వద్దకు చేరుకున్నాడు కనుక ఇతడు ముక్తుడి కంటే ఏ మాత్రము తక్కువకాడు గనుక పాత శరీరము ఇంద్రియాదులతో సమ్బన్ధము లేనందువల్ల నిదురపోయినవాడు కాక మరొకడు మెలకువ వేళలో ప్రత్యక్షము అవుతున్నాడు కనుక అతడు, ఇతడు వేరువేరే అని. దానికి సమాధానము, కాదు.

అతడే లేచినవాడు. అని తుశబ్దము పక్షాన్ని తిప్పికొడుతున్నది. అతడే లేస్తున్నాడు. ఎందువల్లనంటే కర్మానుస్మృతి శబ్ద విధిభ్యః అని. కర్మ ఏమిటంటే సుషుప్తుడు – నిద్రపోయినవాడు అంతకుమందు తాను చేసిన పుణ్యపాపరూపమైన దాన్ని తత్త్వ జ్ఞానం కలుగడానికి ముందున్న దాన్ని తానే అనుభవించాల్సి ఉంటుంది. అనుస్మృతి – తలచుకోవడము. ఎవడిని నిద్రపోయినానో వాడినే నేను లేస్తున్నాను అని తలచడము. ఇక శబ్దము కూడా వేదము నిద్రపోయినవాడు మెలకువ పొందినవాడున్నూ ఇద్దరూ ఒక్కరేనని చెప్పుతున్నది. **తఇహ వ్యాఘ్రోవాసింహోవా వృకోవావరాహోవాకీటోవా పతంగోవా దంశోవా మశకోవా యద్యద్భవన్తి తదా భవన్తి.** ఆ నిదురించిన జీవులు అంతకుమునుపు పులి, సింహము, తోడేలు అడవి పంది పురుగు, మిడత, కొండదోమ, దోమ ఏది ఏదిగా ఉండినారో వారే మెలకువ వచ్చినప్పుడవుతున్నారు. అని. విధులు కూడా – గాఢ నిద్రపోయినవాడు నిద్రలోనే ముక్తి చెందినట్లయితే ముక్తి కొరకు ప్రత్యేకం కొన్ని కొన్ని కర్మలు చేయడం ద్వారా ప్రయత్నించడము వ్యర్థమే అవుతాయి. సాధారణంగా ముక్తుడు అన్ని రకాల ఉపాధులనుండి విడివడినవాడవుతాడు. ఈ శరీరంలో ప్రవేశించకముందు ఉన్న తనదైన స్వరూపాన్ని పొందినవాడై ఉంటాడు. అదే ఆవిర్భూత స్వరూపము. కాని నిద్రపోయినవాడికి పరమాత్మతో సాన్నిధ్యము ఏర్పడినా పై లక్షణాలు కలుగవు. కర్మలు వెన్నంటే ఉంటవి. తనదైన స్వరూపము పుట్టుక రాదు. కనుకనే వేదము **తద్యత్రైతత్సుషుప్తః** అందువలన ఎక్కడైతే ఇతడు పండుకున్నాడో అని సుషుప్తుడైన వాడిని గురించి మొదలుపెట్టి **నాహఖల్వయమేవం సమ్ప్రత్యాత్మానం జానాతి అయమహమస్మీతి. నో ఏవేమాని భూతాని। వినాశమే వాపీతో భవతి నాహమత్ర భోగ్యం పశ్యామి.** అతడు ఇప్పుడు నేను ఇటువంటి వంటివాడిని అని తనను గురించి ఎరుగడు. నేను ఈ రూపమును గలవాడినై ఉన్నానని. ఇది ఈ పేరు గల భూతాలు అనిన్నీ ఎరుగడు. పూర్తిగా వినాశాన్నే పొందుతాడు ఇక్కడ భోగ్యమైనదాన్ని దేన్నీ కానకున్నాను అని చెప్పినందువల్ల.

ముక్తుడైన వానికి **పరంజ్యోతిరుపసమ్పద్యస్వేన రూపేణ అభినిష్పద్యతే.... సతత్రపర్యేతి జక్షత్ క్రీడన్ రమమాణః** ఈ భౌతిక శరీరాన్నుండి లేచిపోయిన బ్రహ్మ జ్ఞాని పరంజ్యోతి ఐన పరమాత్మ వద్దకు చేరుకుని తనదైన పూర్వపురూపాన్ని పొందుతున్నాడు. అతడు అక్కడకు తినుకుంటూ ఆడుకుంటూ సంతోషపడ్తూ పోతున్నాడు. **సస్వరాడ్ భవతి. తస్యసర్వేషులోకేషు కామచారో భవతి.** ఆ ముక్తుడు

స్వరాట్ (తనకు తానే రాజు) అవుతున్నాడు. అతనికి అన్ని లోకాల్లోనూ స్వేచ్ఛగా రాకపోకలు చేసే అధికారము ఉన్నది. **సర్వం హ పశ్యః పశ్యతి. సర్వమాప్నోతి సర్వశః** అంతటా పరమాత్మ ఉన్నాడని ఆయననే దర్శించుకొనేవాడు ఈ విశ్వాన్నంతా కండ్లారా చూస్తాడు. ఏ మాత్రమూ కొఱత లేకుండా అన్నింటినీ పొందుతున్నాడు. అని సర్వజ్ఞత్వము మొదలగునవి కలుగుతవి అని వినిపించుతున్నది. కనుక సుషుప్తుడు సంసారము చేస్తూనే అలసి పోయిన సర్వేంద్రియాలు కలవాడై జ్ఞానము భోగము అనుష్ఠానాల యందు అశక్తుడై విశ్రాన్తి స్థానమైన పరమాత్మను చేరుకొని ఊరట పొందినవాడై తిరిగి భోగాలను అనుభవించడానికి మెలకువను పొంది లేస్తున్నాడు. **ఇది కర్మానుస్మృతి శబ్దవిధ్యధికరణము**

★ ★ ★

## ఇక ముగ్ధాధికరణము

సూ॥ **ముగ్ధేఽర్ధసమ్పత్తిః పరిశేషాత్ 3-2-10** మూర్ఛపోయినప్పుడు ఆ దశ మరణావస్థలో సగభాగమై ఉంటుంది. మిగిలింది అదే కాబట్టి. ఇపుడు మూర్ఛపోయినవాడిని గూర్చి చిన్త చేయబడుతున్నది. ఈ మూర్ఛ జాగ్రత్ స్వప్న సుషుప్తి మొదలైనవాటిల్లో ఏదో ఒకటియా? లేక వీటికంటే వేరయిన అవస్థనా? అని సంశయము కలిగినప్పుడు సుషుప్తి ఆదులలో ఇది ఒకటి అని మూర్ఛను గురించి ప్రసిద్ధి ఉన్నది కాబట్టి, మరొక అవస్థ అని కల్పించడానికి తగిన ప్రమాణమున్నూ లేనందువల్లనూ అన్యతమ అవస్థా అని పూర్వపక్షము ఎదురైతే చెప్పబడుతున్నది. ముగ్ధే అర్ధ సమ్పత్తిః అని. మూర్ఛపోయినపుడు పురుషుడికి ఏ అవస్థా ఉంటున్నదో అది మరణానికి సగము దూరము పోయినట్లుంటుంది. అంటే బ్రతికినట్లూ కాదు. మరణించినట్లున్నూ కాదు. చెరిసగము పరిస్థితి ఉంటుంది. దీన్నే మరణాయ అర్ధసమ్పత్తి అని అంటున్నారు. ఎందువల్ల అని అంటే పరిశేషము అవడంవల్ల. పరిశేషము అనగా తక్కినవి ఏవీ కానప్పుడు ఏది చివరకు మిగులుతుందో అది. స్వప్నము మెలకువ రెండు ఐతే కావు. వాటిలో జ్ఞానము ఉంటుంది. ఇందులో అది ఉండదు. కారణము వేరుగా – విరూపము – ఉండడము, ఆకారవైరూప్యముల కారణంగా ( కారణము ఆకారములు వేరుగా, సహజానికి భిన్నంగా ఉండడము) సుషుప్తి మరణములు రెండూ కావు. నిమిత్తము అంటే మూర్ఛపోవడానికి ముందు తలపైన గట్టి దెబ్బ ఏదో తగలడము వగైరా. పారిశేషము అవడం వల్ల మరణాయ అర్ధసమ్పత్తి – చావడానికి సగము స్థితిని

పోవడము / సగం చావడము – మూర్ఛ. మరణమంటే సర్వప్రాణాలు దేహముతో సమ్బన్ధాన్ని చాలించుకోవడము. కనుక మూర్ఛ అంటే సూక్ష్మంగా ప్రాణాలకు దేహంతో సమ్బన్ధము నిలిచి ఉండడము. **ఇది ముగ్ధాధికరణము.**

★ ★ ★

## ఇక ఉభయ లింగాధికరణము.

సూ॥ **నస్థానతోఽపి పరస్య ఉభయ లింగం సర్వత్రహి 3–2–11** పరమాత్మ దోషాలు లేనివాడు ఆయన ఆత్మలో ఉన్నా ప్రకృతిలో ఉన్నా వాటి దోషాలు అంటవు. వేదములో అంతటా పరమాత్మ దోషగన్ధము, లేనివాడు గనుక కళ్యాణగుణాలకు ఒకే ఒక్క నెలవైనవాడు అని చెప్పబడింది కనుక. దోషాలు కనపడితే జీవుడిలో వైరాగ్యము కలుగుతుంది. కనుక జీవుని యొక్క అవస్థా విశేషాలు ఇంతవరకూ వివరింపబడినాయి. ఇప్పుడు బ్రహ్మను చేరుకోవాలి అనే ఆశ పుట్టడం కోసం ప్రాప్యుడైన బ్రహ్మ యొక్క దోషాలు లేకపోవడం, కళ్యాణగుణాలను స్వాభావికంగా కలిగి ఉండడము అనే అంశాలను ప్రతిపాదించడానికి పూనుకొంటున్నాడు. ఆ సందర్భములో మెలకువగా ఉండడము, కలలు కనడము, సుషుప్తి – గాఢ నిద్రపోవడము, మూర్ఛ పొందడము, ఈ శరీరాన్ని విడిచి వెళ్ళిపోవడము అనే దశలలో జీవుడికి ఆయా అవస్థల్లో ఉన్నప్పుడు కలుగుతున్న ఏ దోషాలు ఉన్నవో అవి, పరబ్రహ్మకు అన్తర్యామియై జీవుడిలో ఉంటున్నాడు. కనుక ఆయా దోషాలు ఉంటున్నాయా (అంటుతున్నాయా?) లేవా? అని విచారము చేస్తున్నారు. ఏది తగును? అని అంటే ఉన్నాయి దోషాలు అని అనడమే సరి. ఎందువల్లనంటే ఆయా అవస్థలు గల శరీరంలో ఉంటున్నాడు కనుక. ఐతే **సమ్భోగప్రాప్తిరితిచేన్న. వైశేష్యాత్. స్థిత్యదనాభ్యాంచ.** ఇత్యాది సూత్రాల వద్ద పరమాత్మ కర్మవశ్యుడు కాడు కనుక ఆయన దోషరహితుడని ఇంతకు ముందే చెప్పినాము కదా! అని అంటారా? నిజమే. కాని ఆయనకు లేకపోవచ్చును. కానీ ఆయా స్థానాలతో సమ్బన్ధము ఉంటున్నది కదా! అందువల్ల దోషము ఉన్నదని అంటున్నాము. అది ఎట్లాగంటే కర్మలు కూడా దేహసమ్బన్ధాన్ని తెచ్చిపెడుతాయి. ఆ పైన అపురుషార్థాలను కూడా కలిగించుతాయి. ఈ విషయము **దేహయోగాద్వా** అనే సూత్రము వద్ద చెప్పబడింది. ఆ దేహ సమ్బన్ధము అపురుషార్థముగానే పరిగణింపబడుతుంది. కాకపోయినప్పుడు కర్మలే దుఃఖాన్ని పుట్టించుతవి. అప్పుడు దేహంతో సమ్బన్ధము

ఉండాల్సిన అవసరమేముంది. కనుక కర్మవశ్యుడు కాకపోయినా పలురకాలైన అశుచి దేహాలతో సమ్బన్ధము ఉండడము పురుషార్థము కాదు. అందువల్ల కర్మవశ్యుడైన జీవుడిని నియమించడానికి గాను శరీరంలో ప్రవేశించినా అదీ తన ఇష్టము ప్రకారమే జరిగినా అపురుషార్థముతో సమ్బన్ధము వర్జనీయము (వదులుకో దగినది) కానే కాదు. చీమునెత్తురు మొదలైనవాటిలో మునకలు వెయ్యడము తన ఇష్టము ప్రకారమే చేసినా అపురుషార్థమే అవుతుంది. కనుక బ్రహ్మ జగదేకకారణుడు సర్వజ్ఞత్వాది కళ్యాణగుణాకరుడూ ఐనా **యః పృథివ్యాం తిష్ఠన్, యః ఆత్మని తిష్ఠన్, యశ్చక్షుషి తిష్ఠన్, యో రేతసి తిష్ఠన్** ఇత్యాది వాక్యాల ప్రకారము ఆయాచోట్లలో ఉంటున్న వాడికి వాటితో సమ్బన్ధమును కల్గి ఉండడమనే అపురుషార్థాలు తప్పక అంటి తీరుతవి. ఉంటాయి కదా! అని పూర్వపక్షము ఎదురైతే చెప్పుతున్నారు.

నస్థానతోఽపి పరస్య అని. పృథివి ఆత్మ మొదలైన స్థానాల కారణాలవల్ల కూడా పరబ్రహ్మకు అపురుషార్థాల యొక్క గన్ధము కూడా అంటదు లేదు. ఎందువల్లనంటే ఉభయలింగం సర్వత్ర హి అని అంటున్నారు. శ్రుతులలో కాని స్మృతులలో కాని అన్నిచోట్లా పరంబ్రహ్మ ఉభయ (రెండు) లక్షణాలను కలిగి ఉన్నవాడని చెప్పబడ్తున్నాడు. నిరస్తనిఖిల దోషత్వము 2) కళ్యాణగుణాకరత్వము అనే రెండు లక్షణాలతో కూడిన వాడు అని అర్థము. **అపహతపాప్మా విజరో వి మృత్యుర్విశోకోఽవిజఘత్సోఽపిపాసః సత్యకామః సత్యసంకల్పః శ్లో॥ సమస్త కళ్యాణగుణాత్మకోఽసౌ స్వశక్తిలేశాద్ ధృత భూతసర్గః. తేజో బలఐశ్వర్య మహావబోధ సువీర్య శక్త్యాదిగుణైకరాశిః శ్లో॥ పరః పరాణాం సకలానయత్ర క్లేశాదయః సన్తి పరావరేశే । సమస్త హేయరహితం విష్ణ్వాఖ్యం పరమం పదమ్.** ఈ పరమాత్మ పుణ్య పాపరూపకర్మలు లేనివాడు. ముసలితనము, మరణము, దిగులు, ఆకలి, దప్పికలు లేనివాడు. సత్యకాముడు, సత్యసంకల్పుడు. ఈయన సమస్తమైన కళ్యాణగుణాలు కలవాడు. తన శక్తిలోని చాలా చాలా చిన్నభాగముతో ఈ బ్రహ్మాండాలనన్నింటినీ పుట్టించి రక్షించి నిలబెడుతున్నాడు. తేజస్సు బలము ఐశ్వర్యము గొప్పవిజ్ఞానము చక్కనిదైన వీర్యము శక్తి మొదలైన గుణాలకన్నింటికీ ఏకరాశి. ఇంకా పరులు అని అహంకరించే వాళ్ళందరి కన్నా అధికుడు. క్లేశము మొదలైన దుఃఖాలు ఏవీ లేనివాడు. ఆయన పరులను (ఎక్కువవారిని) వారికి క్రిందనున్నవారినిన్నీ శాసించగలడు. ఎటువంటి హేయగుణాలు లేనివాడు ఆయనకు పేరు విష్ణువు. ఆయన ఉండే

శ్రీవైకుంఠమే స్థానాలకన్నింటికంటే సర్వోన్నతమైనట్టిది. మొదలైన శ్రుతులు స్మృతుల వల్ల పరబ్రహ్మ ఉభయ లక్షణాలు కలవాడని అర్థమవుతున్నది.

సూ॥ **భేదాదితి చేన్న. ప్రత్యేక మతద్వచనాత్ 3-2-12** ఆయా అవస్థలలో ఉన్న భేదాన్ని బట్టి దోషముండడాన్ని తోసిపుచ్చడానికి వీలులేదంటే అది సరికాదు. పరమాత్మ విషయంలో ఎలాంటి దోషము లేనివాడు అని ప్రతిపర్యాయము పనిగట్టుకొని చెప్పినాడు కదా! జీవుడు ప్రజాపతి వాక్యాన్నిబట్టి అపహతపాప్మత్వాది ఉభయలింగాలు కలవాడని తెలుస్తున్నప్పటికీ దేవమనుష్యాది దేహాలతో కూడడం అనే అవస్థా భేదాన్ని బట్టి అపురుషార్థము కలవాడు ఎట్లా అవుతున్నాడో అదేవిధంగా పరమాత్మ అన్తర్యామియే ఐనా, సహజంగానే అపహత పాప్మత్వాది ఉభయలింగాలను కల్గి ఉన్నా ఆయాదేవాది శరీరాలతో సమ్బన్ధము – కూడిక – కలయికల కారణంగా అవస్థాభేదాలు ఏర్పడుతున్నవి కనుక అపురుషార్థాలతో యోగము తప్పించుకోరానిదే అవుతుంది సుమా అని అంటే అది సరికాదు. ప్రత్యేకంగా ఆ దోషము లేదని చెప్పినారు కనుక. **యః పృథివ్యాం తిష్ఠన్, యఆత్మని తిష్ఠన్** ఇత్యాది చోట్లలో ప్రతిసారి **సతే ఆత్మా అన్తర్యామీ అమృతః** ఆయన నీకు ఆత్మ. నీలో ఉండే వదిలిపెట్టని అన్తరాత్మ. ఆనందస్వరూపుడు అని అన్తర్యామిని అమృతస్వరూపుడు అని చెప్పినందువలన, వాటివాటిల్లో తన యిష్టము ప్రకారమే నియమనాన్ని చేస్తుండేవాడికి ఆయా అవస్థలలో, దేహాలలో ఉన్న వారితో సమ్బన్ధము కారణంగా ఏర్పడుతున్నదిగా భావించే అపురుషార్థాన్ని లేదు అని ప్రతిషేధించినారు కనుక. జీవుడికైతేనో అతని సహజమైన స్వరూపము కర్మల మూలంగా భగవన్తుని సంకల్పము మేరకు కప్పి వేయబడింది. అని **పరాభిధ్యానాత్తు తిరోహితమ్** అనే సూత్రము వద్ద చెప్పబడింది. ఔనండీ! తన యిష్టము ప్రకారమే చేసినా ఆయా వస్తువుల స్వభావాన్ని బట్టి ఏర్పడిన అపురుషార్థ సమ్బన్ధము వదలించుకోరానిది అని మేము చెప్పినాము కాదా? అని అంటే ఆ మాట మాట్లాడడం తగదు. యధార్థానికి అచిత్తు అనబడే వస్తువు కూడా సహజంగా అపురుషార్థ స్వరూపము కలది కాదు. కర్మవశ్యులకైతే వాళ్ళవాళ్ళ కర్మ స్వభావానికి తగినట్లు పరమ పురుషుని యొక్క సంకల్పాన్ని బట్టి ఒకే స్వభావము కల ఒకానొక వస్తువు కాలభేదాన్ని బట్టి, అనుభవించే పురుషునిలో ఉన్న భేదాన్ని బట్టి అది సుఖానికో దుఃఖానికో కారణము అవుతుంది. వస్తుస్వరూపంగా ఏర్పడిన దానియొక్క స్వభావము అంతా ఎల్లప్పుడూ ఎల్లరికీ అన్నివేళల్లో దుఃఖానికైనా సుఖానికైనా మూలమవుతుంది. ఐతే ఇట్లాగా కనుపించడం

లేదు. అదే విషయాన్ని ఇట్లా చెప్పినారు. **శ్లో॥ నరకస్వర్గసంజ్ఞేవై పుణ్యపాపేద్విజోత్తమ। వస్త్వేకమేవదుఃఖాయ సుఖాయేర్ష్యాగమాయచ। కోపాయచయతస్త స్మాద్వస్తు వస్త్వాత్మకం కుతః। తదేవ ప్రీతయే భూత్వా పునః దుఃఖాయజాయతే ॥ తదేవ కోపాయ యతః ప్రసాదాయ చజాయతే। తస్మాద్దుః ఖాత్మకం నాస్తి నచకించిత్ సుఖాత్మకమ్.** ఓ ద్విజోత్తమా! పాపపుణ్యాలే నరకము స్వర్గము అనే సంజ్ఞలను (పేర్లను) కల్గి ఉన్నవి. ఒకే వస్తువు సుఖాన్ని దుఃఖాన్ని, ఈర్ష్యకోపములు కలుగడానికిన్నీ కారణమౌతున్నది. కనుక వస్తువు తనదైన లక్షణముతో వస్తువుగా ఉండడం లేదు. అదే వస్తువు ప్రీతిని కలిగించి తిరిగి కొంతకాలానికి దుఃఖకారణమున్నూ అవుతున్నది. అదే కోపాన్ని తెప్పించుతున్నది. మానసిక ప్రశాన్తతతనూ ప్రసాదిస్తున్నది. కనుక ఈ జగత్తులో ఏవస్తువూ దుఃఖాత్మకము సుఖాత్మకము కాదు. అని విష్ణుపురాణములో చెప్పబడింది. పరబ్రహ్మకైతేనో ఎవరి దేని వశములో లేని స్వతన్త్రుడైన ఆయనకు ఆ సమ్బన్ధమే ఆయా వస్తువులను / వ్యక్తులను వింతలు వింతలుగా నియమించడము అనే రూపములో లీలా రసానికే కారణము అవుతున్నది.

సూ॥ **అపి చైవమేకే 3-2-13** ఇంకా ఒక శాఖవారు ఒకే దేహముతో సమ్బన్ధము ఉన్నప్పుడు జీవుడికి అపురుషార్థాన్ని పరమాత్మకు అది లేకపోవడాన్ని చెపుతున్నారు. ఇంకనూ ఒకానొక శాఖకు చెందినవారు ఒకే దేహముతో సంయోగము ఉన్నపుడు జీవునికి అపురుషార్థమును పరమాత్మకు అపురుషార్థము లేకపోవడాన్నీ, మరియు నియమన రూపమైన ఐశ్వర్యము వల్ల కలిగిన దీప్తితో కూడి ఉండడాన్ని కూడా పరమాత్మకు చెందిన శబ్దముతో పఠించుతున్నారు. **ద్వాసుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే। తయోరన్యః పిప్పలంస్వాద్వత్తి అనశ్నన్నన్యోఽభి చాకశీతి. ఇతి.** చక్కని జ్ఞానము అనే రెక్కలను కల్గిన అందమైన అప్రాకృత రూపాన్ని కలిగిన కలసిమెలసి తిరిగే కల్సి భుజించే స్నేహితులు ఐన రెండు పక్షులు, ఒకే చెట్టుపైన నిల్చి ఉన్నాయి. వాటిలో ఒక్కటి రుచికరమైన పిప్పల మనబడే చెట్టుపండు (కర్మ) ను ఆరగించుతున్నది. మరియొకటి దాన్ని తినకుండానే ఆనందముతో ప్రకాశిస్తున్నది అని.

ఐతే ఇట్లా కావచ్చును. **అనేనజీవేనఆత్మనా అనుప్రవిశ్యనామరూపే వ్యాకరవాణి** అని బ్రహ్మాత్మక జీవాను ప్రవేశపూర్వకంగా నామరూప వ్యాకరణము జరిగింది కనుక ఆ జీవుడికి ఆత్మయైన పరమాత్మకు కూడా దేవమనుష్యాది రూపత్వము, ఆ నామాన్నే కలిగి యుండడమనేది ఉన్నది. అందువలన **బ్రాహ్మణోయజేత** బ్రాహ్మణుడు

యజ్ఞము చేయాలి ఇత్యాది విధి శాస్త్రము నిషేధశాస్త్రములకు లక్ష్యము అవుతున్నందున కర్మవశ్యత్వము పరమాత్మకు తప్పదు అని అనవచ్చును. దానికి ఉత్తరమిస్తున్నారు ఇట్లాగా.

సూ॥ **అరూపవదేవ హి తత్ప్రధానత్వాత్ 3-2-14** మీరన్నట్లు శరీరాన్ని కలవాడన్నట్లు కనిపించినా పరమాత్మకు ప్రధానము నామరూపాలను నిర్వహించడమే. కనుక రూపరహితుడైన వాడితో సమానుడే. దేవాది శరీరాల్లో అనుప్రవేశము చేసి ఆ రూపముతో కూడి ఉండినప్పటికీ బ్రహ్మ అరూపవత్తు వంటివాడే. రూపము లేనివానితో సమానుడే. ఆ బ్రహ్మ రూప రహితుడైన వానితో తుల్యుడే. జీవుని వలె శరీరాన్ని కలిగి ఉండడమనే కర్మవశ్యత్వము ఈయనకు లేదు అని అర్థము. ఎందువల్లనంటే నిర్వాహకత్వమే ఆయనకు ప్రధానము. కర్మ అనుభవము కాదు. **ఆకాశోహవైనామరూపయోర్నిర్వహితా. తే యదన్తరా. తద్బ్రహ్మ** అని చెప్పినట్లు సర్వాను ప్రవేశము ఉన్నప్పటికీ నామరూపముల వలన జరిగే కార్యాలతో సమ్బన్ధము లేకుండా నామరూపాలను నిర్వహించడమే బ్రహ్మకు ఉన్నదని వేదము/ వాక్యము ప్రతిపాదిస్తున్నది. అయ్యా! ఒక సన్దేహము. ఆ శరీరాన్ని కల్గి దానికి నిర్వాహకుడై ఉంటున్నాడు కదా! అటువంటివాడిని అరూపవత్ అని రూపముతో సమ్బన్ధము లేనివాడితో తుల్యుడు / సమానుడు అని ఎట్లాగా చెప్పుతున్నారు. అందుకు హేతువు ఏమిటి? అంటే ఇదిగో ఇట్లాగా? చెపుతున్నాము వినండి. ఏ విధంగానైతే జీవుడికి ఆయా శరీరాలవల్ల కలిగే సుఖదుఃఖాలను పొందుతున్నాడు కాబట్టి ఆయా రూపాలతో సమ్బన్ధము ఉంటున్నదో, అట్లాగా పరమాత్మకు ఆయా రూపాలవల్ల పుట్టే సుఖదుఃఖానుభవము లేదు కాబట్టి అరూపవత్త్వమే. విధిని చెప్పే, నిషేధాన్ని చెప్పే శాస్త్రాలు కూడా కర్మవశ్యుని పైనే అధికారాన్ని కల్గి ఉండి పెత్తనాన్ని చలాయించుతవి. కావున పరంబ్రహ్మ నిరస్త నిఖిల దోషత్వ, కళ్యాణగుణాకరత్వ రూపమైన ఉభయ లక్షణాలు కలవాడే.

ఏమండీ సత్యంజ్ఞానమనన్తం బ్రహ్మ ఇత్యాది వాక్యాలచేత నిర్విశేష ప్రకాశస్వరూపమే బ్రహ్మ అని తెలుస్తున్నది. మరొకటేమో సర్వజ్ఞత్వ సత్యసంకల్పత్వజగత్ కారణత్వ సర్వాన్తరాత్మత్వ, సత్యకామత్వాదులు కలదిగాను నేతినేతి ఇత్యాది వాక్యాలచేత నిషేధింపబడుతున్నది కావున మిథ్యా అని అర్థము చేసుకోవాలి. అట్లా అయినప్పుడు కళ్యాణ గుణాకరత్వము నిరస్త నిఖిల దోషరూప

ఉభయలింగత్వము బ్రహ్మకు ఏ విధంగా చెల్లుతుంది? అన్నదానికి సమాధానమును చెప్పుతున్నాడు.

సూ॥ **ప్రకాశవచ్చ అవైయర్థ్యాత్ 3-2-15** దీపము ప్రకాశవన్తమై ఉన్నట్లే బ్రహ్మ ఉభయలింగము కలవాడై ఉంటున్నాడు. వ్యర్థము ఏమీ కావడం లేదు. ఏ విధంగా సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ ఇత్యాదివాక్యము వ్యర్థం కావడానికి వీల్లేదు కాబట్టి బ్రహ్మకు ప్రకాశమే స్వరూపము కలవాడు అని ఒప్పుకుంటున్నామో అదే విధంగా సత్యసంకల్పత్వము సర్వజ్ఞత్వము సర్వజగత్ కారణత్వము సర్వాత్మకత్వము నిరస్త నిఖిల అవిద్యాది దోషత్వము మొదలైన గుణాలను తెలియజేసే వాక్యాలు కూడా వ్యర్థం కావడానికి వీల్లేదు కనుక ఉభయలింగములు కలవాడే బ్రహ్మ.

సూ॥ **ఆహ చతన్మాత్రమ్ 3-2-16** ఇంతేకాకుండా సత్యం జ్ఞానమనన్తం అనే వాక్యము బ్రహ్మ ప్రకాశ స్వరూపుడు అని చెపుతున్నదే కాని ఇతర వాక్యాలచేత తెలియవచ్చే సత్య సంకల్పత్వాది గుణాలను నిషేధించడం లేదు. నేతినేతి అని చెప్పే నిషేధవాక్యం కూడా నిషేధానికి విషయమైన అంశము ఏదో దాన్ని వెంటనే చెపుతున్నది.

సూ॥ **దర్శయతిచ అథో అపిస్మర్యతే 3-2-17** ఉభయలింగాలను వేదము చూపుతున్నది. స్మృతి కూడా అదే విషయాన్ని బలపరుస్తున్నది. వేదాన్తవాక్య గణము కళ్యాణ గుణాకరత్వాన్ని చూపుతున్నది. నిరస్త నిఖిల దోషత్వాన్నీ చెపుతున్నది. **తమీశ్వరాణాం పరమమ్ మహేశ్వరమ్ తం దేవతానాం పరమం చదైవతమ్. సకారణం కరణాధిపాధిపో నచాస్యకశ్చిత్ జనితా న చాధిపః. నతస్య కార్యంకరణం చ విద్యతే న తత్సమశ్చాభ్యధికశ్చదృశ్యతే. పరాఽస్యశక్తిః వివిధైవశ్రూయతే స్వాభావికీ జ్ఞానబలక్రియాచ.** ఆయన ఈశ్వరులము అని తలచే వాళ్ళందరికంటే పరముదైన మహేశ్వరుడు. దేవతలకందరికిన్నీ పరదైవము. ఆయన సర్వజగత్తుకూ కారణమైన వాడు. కరణములకు అధిపతి ఐన జీవుడికిన్నీ అధిపుడు. ఇతడిని పుట్టించిన వాడెవ్వడు లేడు. ఆయనకు చేయవలసిన పనీ లేదు. పనిముట్టు కూడా లేదు. ఆయనతో సాటి ఐనవాడు ఎక్కువవాడు కానీ లేడు. ఇతని యొక్క శక్తి చాలా గొప్పది. అది పలురకాలుగా ఉన్నదని వినిపిస్తున్నది. ఆయనకున్న జ్ఞానము బలము క్రియలు సహజమైనవే కానీ ఎవరో ఇచ్చితే వచ్చినవి కానే కావు. **యః సర్వజ్ఞః సర్వవిత్. యస్యజ్ఞానమయంతపః** ఎవడు సర్వమును గురించీ తెల్సినవాడో ఎవడు బాహ్యాభ్యన్తరాలనూ ఎరుగునో ఎవని ఆలోచన జ్ఞానముచేత పూర్ణమైనదో. **భీషాఽస్మాద్వాతఃపవతే భీషోదేతిసూర్యః**

ఈయనకు భయపడి సూర్యుడు సకాలానికి ఉదయించుతున్నాడు. గాలి వీస్తున్నది. **"సఏకో(బ్రహ్మణః ఆనందః"** అది ఒక్కటి బ్రహ్మ యొక్క ఆనందము. **యతోవాచో నివర్తన్తే అప్రాప్యమనసాసహ. ఆనన్దమ్ బ్రహ్మణోవిద్వాన్నబిభేతి. కుతశ్చనేతి.** మనస్సుతో కలసి వాక్కులు పరమాత్మ యొక్క ఆనంద గుణాన్ని చెప్పలేక వెనుకకు మళ్ళు తున్నవి. అతని యొక్క ఆనంద గుణాన్ని తెలిసి ఉపాసించినవాడు దేని గురించీ భయపడడు. **నిష్కలం నిష్క్రియం శాన్తమ్ నిరవద్యమ్ నిరంజనమ్.** అవయవాలు లేనివాడు. చేయవలసిన పని లేనివాడు. ఆరాటము లేక నింపాదిగా ఉన్నట్టివాడు. దోషాలు లేనివాడు. ఎవ్వరితోనూ ప్రత్యేకముగా సంబన్ధము లేనివాడు. మొదలైనవి వేదవాక్యాలు. ఇక స్మృతిలోనివి – **యోమామజ మనాదించవేత్తి లోకమహేశ్వరమ్** ఎవడైతే నన్ను మొదలు (పుట్టుక) లేనివాడనై లోకాలన్నింటికీ మహేశ్వరుడైన వాడినిగా తెల్సుకొనుచున్నాడో. **విష్టభ్యాహమిదమ్ కృత్స్నమేకాంశేనస్థితోజగత్.** ఈ సమస్త జగత్తునంతటినీ నాలోని ఒక్క చిన్న అంశతో ధరించి ఉన్నాను. **మయాఽధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్। హేతునాఽనేనకౌన్తేయ జగత్ విపరివర్తతే.** నేను అధ్యక్షుడినై గమనించుతూ ఉంటే ప్రకృతి చరాచరములనన్నింటినీ కంటున్నది. ఈ కారణము చేత ఓ అర్జునా! జగత్తు పలుమార్పులను పొందుతున్నది. **ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః। యోలోకత్రయమావిశ్యబిభర్త్యవ్యయ ఈశ్వరః.** ఇంతకు మునుపు చెప్పినవారిద్దరికన్నా వేరైన మరొకడు ఉత్తమ పురుషుడు. అతడినే పరమాత్మ అని అంటున్నారు. ఆయన ఈ మూడు లోకాలన్నింటిలోనూ నిండి ఉండి తాను ఏ మాత్రమున్నూ మార్పు చెందకుండా ఈశ్వరుడై శాసించుతున్నాడు. **సర్వజ్ఞః సర్వకృత్ సర్వశక్తిజ్ఞాన బలర్ధిమాన్। అన్యూన శ్చా ప్యవృద్ధిశ్చ స్వాధీనోఽనాదిమాన్వశీ క్లమ తన్ద్రీ భయక్రోధ కామాది భిరసంయుతః। నిరవద్యః పరఃప్రాప్తేః నిరధిష్ఠోఽక్షరః క్రమః॥** ఆయన అన్నీ తెల్సినవాడు. అన్నింటినీ పుట్టించినవాడు. అన్నిరకములైన శక్తులు జ్ఞానము బలము అభివృద్ధులను కలవాడు. ఎవ్వని కన్నా తక్కువ ఎక్కువలు లేనివాడు. ఎవరికీ లొంగనివాడు. ఎప్పటినుంచి ఉంటున్నాడో తెలియరానివాడు. అన్నింటినీ తన వశములోనుంచుకున్నవాడు. అలసట, సోమరితనము, భయము, కోపము, కామము మొదలైనవి లేనివాడు. అవద్యము – చెప్పవీలుకానిదైన, దోషము లేనివాడు దేన్నైనా పొందడానికి ఆయనే చిట్టచివరివాడు. తనకంటూ అధిష్ఠానము ప్రత్యేక నివాసస్థానము లేనివాడు. తరుగుదల లేని అక్షరుడు. ఇంకా ఉత్సాహము మున్నగు గుణాలు పుష్కలముగా ఉన్నటువంటి వాడు. ఇత్యాదులు. కావున

అన్నిచోట్లలో ఉన్నప్పటికిన్నీ బ్రహ్మ ఉభయ లింగములుకలవాడైనందున ఆయా స్థానాలలో ఉన్న దోషాలు పరబ్రహ్మను తాకనేరవు.

సూ॥ **అతఏవ చోపమా సూర్యకాదివత్ 3-2-18** ఆయనను దోషాలు తాకవు గనుకను సూర్యుడు వలె అన్నిటితో సమ్బన్ధమున్ననూ పరిశుద్ధుడైనట్లే పరమాత్మ విషయంలో దోషాలు అంటకుండుటను ఉపమ/పోలికగా చెప్పడం జరిగింది. ఏ కారణంగానైతే పలురకాలైన స్థానాలలో ఉన్నప్పటికీ పరబ్రహ్మ వాటివల్ల కలిగే దోషాలతో సమ్బన్ధము లేనివాడవుతున్నాడో ఆ కారణంగానే నీటిలో అద్దములో ప్రతిబింబించిన సూర్యుడు మొదలైనవాటివలె పరమాత్మ అక్కడక్కడ ఉంటున్నవాడైనా కూడా దోషములు లేనివాడేనని శాస్త్రాలయందు పోలిక చెప్పబడుతున్నది. **శ్లో॥ ఆకాశమేకం హియథా ఘటాదిషు పృథక్ భవేత్। తథాత్మైకో హ్యనేకస్థో జలాధారే ష్వివాంశుమాన్॥** ఆకాశము ఒక్కటే. కుండ మొదలైనవాటిల్లో ఉండడము వలన వేరువేరుగా/ విడివిడిగా అవుతుంది. అట్లే ఆత్మ ఒక్కటే. నీటి మడుగులు, చెరువుల్లో బావుల్లో కనిపిస్తున్న సూర్యుడు వేరు వేరు అని అనిపించినట్లు అనేకస్థుడు ఐన ఆత్మ అనేక రూపాలతో ఉన్నట్లు కనిపించుచున్నాడు. **ఏకఏవహిభూతాత్మాభూతేభూతే వ్యవస్థితః। ఏకధా బహుధాచైవ దృశ్యతే జలచన్ద్రవత్.** భూతాలకు అన్నింటికీ ఆత్మయైనవాడు ఒక్కడే. కానీ ఆయన ప్రతిభూతములోనూ ఉన్నాడు. నీటిలోని చంద్రునివలె ఒక్కడుగాను చాలామందిగానూ కనబడుతున్నాడు. ఇత్యాదివాక్యాలలో. ఈ విషయంపై సందేహాన్ని వెల్లడించుతున్నాడు.

సూ॥ **అమ్బువత్ అగ్రహణాత్తున తథాత్వమ్ 3-2-19** నీటిలో వలె పరమాత్మ గ్రహింపబడడం లేదు. సూర్యాదులు నీటిలో అద్దంలో నిజంగా ఉండడం లేదు. కనుక మీరు చెప్పినట్లు కాదు. సూత్రములోని తు శబ్దము చోద్యాన్ని వెల్లడించుతున్నది. అమ్బువత్ అనే పదము సప్తమీ విభక్త్యన్తము ఐన అమ్బుని అనే దానిమీద వతి అనే ప్రత్యయము చేరడంతో ఏర్పడింది. నీరు అద్దము మొదలైన వాటియందు ఏ విధంగా సూర్యుడు ముఖము వంటివి గ్రహింపబడుతున్నవో ఆ తీరుగా పృథివీ మొదలైన వాటిలో సూర్యాదులు మనయొక్క భ్రాన్తి కారణంగా ఆయాచోట్లలో ఉన్నవారివలె గ్రహింపబడ్తున్నారు. కానీ పరమార్థము ప్రకారము కాదు. ప్రస్తుతము ఇక్కడైతేనేమో **యః పృథివ్యాం తిష్ఠన్, యోఽప్సుతిష్ఠన్.... యఆత్మని తిష్ఠన్** అని మొదలైనవాటిలో పరమార్థంగానే / నిజంగానే పరమాత్మ పృథివీ మొదలైనవాటిలో ఉన్నవాడే

గ్రహింపబడ్తున్నాడు. ఇందువల్ల సూర్యాదులకు నీరు అద్దము మొదలైనవాటితో కలదోషాలతో సమ్బన్ధము లేకపోవడము ఆయా స్థలాల్లో లేనందువల్లనే. కనుక వారి వలె కాదు. అనగా దార్ష్టాన్తికానికి దృష్టాన్తముతో తుల్యత్వము – సామ్యము లేదని అర్థము. దీన్ని తొలగిస్తున్నాడు.

సూ॥ **వృద్ధిహ్రాస భాక్త్వం అన్తర్భావాత్ ఉభయసామం జస్యాదేవం దర్శనాచ్చ 3-2-20** పృథివ్యాదిస్థానాలను బట్టి పెరుగడం తరగడం అనే దోషాలను పొందడమనేది సూర్యాది దృష్టాన్తముతో తొలగిపోతుంది. రెండు దృష్టాన్తాలున్నూ సరిపోతున్నాయి కాబట్టి ఇది సరియేనని నిశ్చయింపబడ్తున్నది. ఇట్లాగే మనకు కనపడ్తున్నందువల్ల కూడా. పృథివీ మొదలైన స్థానాలలో అన్తర్భావము చెందినందువల్ల స్థానిఐన పరబ్రహ్మకు స్వరూపాన్ని గుణాన్ని బట్టి పృథివ్యాదిస్థానాలలో ఉన్న వృద్ధి (పెరుగడము) హ్రాసము (తరుగడము) మొదలైన దోషాలను పొందినవాడు కావడమనేది మాత్రము సూర్యాది దృష్టాన్తముతో తొలగిపోతుంది. ఇది ఎట్లా తెలుస్తున్నది అని అంటే? ఉభయసామంజస్యము వల్ల ఇట్లాగని ఎంచుతున్నాము. రెండు దృష్టాన్తాలు సరిపడుతున్నందువల్ల ఇట్లాగని నిశ్చయింపబడుతున్నది. **ఆకాశమేకం హి యథాఘటాదిషు పృథక్ భవేత్. 2) జలాధారేష్వివాంశుమాన్** అని దోషాలు కల అనేక వస్తువుల్లో వాస్తవంగా ఉన్న ఆకాశానికి, వాస్తవంగా లేని సూర్యుడికిన్నీ పృథివ్యాదుల్లో ఉన్న దోషాలను కల్గి ఉన్నాడనే అంశాన్ని తొలగించడము అనే అంశాన్ని ప్రతిపాదించుట యందే సమంజసము అవుతుంది. కుండ, గురిగి మొదలైనవాటిలో పెద్దది చిన్నది ఐన వాటి యందు విడివిడిగా సంయోగమును కలిగినది ఐనా ఆకాశము వృద్ధి హ్రాసము అనే దోషాలతో తాకబడదు. ఎట్లాగైతే పెద్దగా చిన్నగా ఉన్న చెఱువులో కొలనులో కనబడే సూర్యుడు వాటియందు ఉండే వృద్ధి హ్రాసాదులతో అంటబడడు. అదేవిధంగా పరమాత్మ పృథివీ మొదలైన నానా ఆకారాలు గల చేతనాచేతనాల్లోను ఉంటున్నవాడైనా వాటిలో ఉండే వృద్ధి హ్రాసాది దోషాలతో సంస్పర్శ లేనివాడై, అన్ని ప్రదేశాల్లో / అందరిలో ఉంటున్నవాడే ఐనా ఒక్కడే అవుతూ దోషముల గన్ధముతోనైనా స్పర్శ(తాకిడి) లేనివాడయ్యి కళ్యాణగుణాకరుడుగా ఉంటున్నాడు.

అనగా చెప్పబడిన మాట ఇది – ఎట్లాగైతే నీళ్ళు మున్నగు వాటిలో నిజంగానే లేని సూర్యునికి కారణము లేదు కనుక జలాదులలో ఉన్న దోషాలతో అంటులేదో అదేవిధంగా భూమి మొదలైనవాటిల్లో ఉంటున్న పరమాత్మకు కూడా సహజంగా

ఆయన దోషాలన్నింటికిన్నీ ప్రత్యనీకాకారుడు – ఎదురు / శత్రువు ఐన ఆకారము కలవాడు కనుక దోషములు కలుగడానికి కారణము లేదు గనుక దోష సమ్బన్ధము లేదు అని. ఇక దర్శనాచ్చ ఇదే విషయము కనపడుతున్నది కాబట్టి. పరమాత్మతో అన్ని విధాలుగా సమానధర్మము లేకపోయినా, చెప్పదల్చుకున్న అంశంలో మాత్రము సాధర్మ్యము ఉన్నది కాబట్టి దృష్టాన్తాన్ని చెప్పడము ఉన్నది. ఎట్లా అంటే సింహము వంటి వాడు మాణవకుడు, బ్రహ్మచారి నిప్పు మొదలైనవాటిలో. ఇందువల్ల సహజంగానే నిరస్తమైన అన్నిరకాల అజ్ఞానము మొదలగు దోషగన్ధాలు లేనివాడు సమస్త కళ్యాణ గుణాకరుడు ఐనటువంటి వానికి భూమి మొదలగు స్థానాల్లో ఉండటం వల్ల కూడా దోషాలు కలుగడానికి అవకాశము లేదు.

ఇట్లా కావచ్చును. **ద్వేవావ బ్రహ్మణో రూపేమూర్తం చామూర్తమేవచ.** పరబ్రహ్మకు రెండు రూపాలు ఉన్నవి. ఒకటి ఆకారము కల్గియుండుటము. రెండవది ఆకారము లేకుండుటము. అని ఆరంభించి స్థూలంగానూ సూక్ష్మంగానూ ఉన్న ఈ ప్రపంచమంతా పరబ్రహ్మయొక్క ఆకారముగా పరామర్శ చేసి **తస్యహ ఏతస్య పురుషస్యరూపం యథా మహారజనం వాసః.** అటువంటి ఈ మహా పురుషుడి యొక్క రూపము ఎంతటి గొప్పదో దానికి తగినట్లు కట్టుకున్న బట్ట కుసుమ పువ్వు యొక్క రంగు వలె మనోహరముగా ఉన్నది. అనే వాక్యముతో ఆకారవిశేషాన్ని చెప్పి **అథాత ఆదేశో నేతినేతి నహ్యేతస్మాదితి నేత్యన్యత్పరమస్తి** ఇక మీదట ఉపదేశము చేయబడుతున్నది. కాదుకాదు అని. ఇంతమాత్రమే కాదని. దీనికంటే పరమైనది / అధికమైనది మరొకటి లేదు అని. ఈ విధంగా ప్రస్తావించబడినదంతా పరబ్రహ్మకు ప్రకారము, విశేషణమైనట్టిది అని ఇతి శబ్దముతో పరామర్శించి దాన్నంతటినీ నిషేధించి సర్వవిశేషాలకూ అధిష్ఠానము / ఆధారము ఐనది సన్మాత్రమైన బ్రహ్మనే. విశేషాలు మాత్రము తన స్వరూపము ఇట్లాంటిది అని ఎరుకలేని బ్రహ్మ చేత కల్పింపబడినవి అని చూపించుతున్నది. ఈ కారణాన్ని / వాక్యాన్ని బట్టి బ్రహ్మ ఉభయలింగములు కలవాడు ఎట్లా అవుతాడు. అని – దానికి సమాధానము చెపుతున్నాడు –

సూ॥ **ప్రకృతైతావత్త్వం హి ప్రతిషేధతి. తతోబ్రవీతిచ భూయః 3-2-21** బ్రహ్మకు ఇంతకుముందు చెప్పినంత మాత్రమే స్వరూపము కాదు. ఇంకా తెలియనిది చాలా ఉన్నదని ఒక పరిమాణాన్ని నిషేధిస్తున్నది తప్ప వేరు కాదు. దాని తరువాత కూడా అధికంగా ఉండడాన్ని – భూయిష్ఠత్వాన్ని చెపుతున్నాడు. నీవు చెప్పినది

కుదురదు. ఏదైతే బ్రహ్మకు ఇంతపాటి విశేషాలను కల్గియుండడాన్ని నేతినేతి అని నిషేధిస్తున్నది అని అన్నావో అది. నీవన్నట్లుగానే విశేషాలు ఏవీ లేనివాడే బ్రహ్మ అయినట్లయితే, భ్రమ కలవాడైనట్లయితే ఆ మాటను చెప్పిన వేదము భ్రమతో అవకతవకలుగా మాట్లాడినట్లవుతుంది. బ్రహ్మకు విశేషణముగా ఇతర ప్రమాణాలచేత తెలియరానిదంతా విశేషణము అని చెప్పి తిరిగి దాన్ని నిషేధించుతున్నదని అంటే ఆ మాటను పిచ్చిపట్టిన వాడు తప్ప మరెవ్వడూ నిషేధించడు. ఒకవేళ నిర్దేశింపబడుతున్నవాటిలో కొన్ని పదార్థాలు ప్రమాణాన్తరములచేత ప్రసిద్ధాలు కావచ్చు. ఐనా వాటి ప్రకారత్వము అప్రసిద్ధమే. అవికాక ఇతరములైన వాటియొక్క స్వరూపము బ్రహ్మకు ప్రకారములు అని అజ్ఞాతమే / తెలియనిదే. అందుచేత వాటిని గురించి తిరిగి చెప్పడం (అనువాదము) అసమ్భవమైనందువల్ల ఇప్పుడు ఇక్కడ ఉపదేశము చేయబడుతున్నవి. కనుక వాటిని నిషేధించడము కుదరదు. ఎందువల్ల ఇట్లా జరుగుతున్నదో ఆ కారణముచేతనే ప్రస్తుతం చెప్పబడుతున్న ఇయత్తా (ఇంతపాటి) పరిమాణము బ్రహ్మకులేదని ఈ వాక్యం నిషేధిస్తున్నది. బ్రహ్మకు ఏ విశేషాలు ఉన్నవని చెప్పబడినవో వాటితో కూడి ఉన్నందువల్ల "**బ్రహ్మకు కనిపించే ఇయత్తా "నేతినేతి" అనే శబ్దాలతో నిషేధింపబడుతున్నది."** నేతినేతి అనగా నైవమ్ నైవమ్. చెప్పబడిన రీతిగా ఉన్న విశేషణాలతో కూడినది మాత్రమే బ్రహ్మకాదు. చెప్పిన ప్రకారములతో విశిష్టమైన బ్రహ్మ యొక్క ఏ ఇయత్తా (మోతాదు పరిమితి) తెలియబడుతున్నదో అది ఇక్కడ ఇతి శబ్దముతో పరామర్శింపబడుతున్నది. తడుమబడుతున్నది అని అర్థము. ఎందువల్లనంటే అట్లా నిషేధించిన పిదప తిరిగి బ్రహ్మ యొక్క భూయిష్టమైన గుణసముదాయాన్ని గొంతెత్తి చెపుతున్నది వేదము. ఇందువల్ల కూడా ఇప్పుడు చెప్పిన, ఇంతపాటి ఐన విశేషణాలతో కూడి ఉండడాన్ని మాత్రమే బ్రహ్మకు లేదని నిషేధించుతున్నది. గొప్పవైన / అధికమైన గుణసముదాయాన్ని కలిగి ఉండడాన్ని **నహ్యేతస్మాదితిన. ఇత్యన్యత్ పరమస్తి. అథనామధేయం సత్యస్యసత్యం ఇతి. ప్రాణాఃవైసత్యమ్. తేషామేషసత్యమ్.** అనే వాక్యంతో చెప్పుతున్నది.

ఇదీ అసలు అర్థము – ఇతిన – ఇంతమాత్రమే కాదు అని ఏ బ్రహ్మ ప్రతిపాదింపబడిందో అటువంటి ఈయన కంటే అధికమైన మరొక వస్తువు లేదుకదా! అనగా బ్రహ్మకంటే వేరయినది స్వరూపాన్ని బట్టి కాని గుణాన్ని బట్టి కాని ఉత్ కృష్టమైనది – గొప్పది లేదు అని అర్థము. అటువంటి బ్రహ్మకు సత్యస్య సత్యమ్

అని పేరు. ఆ మాటకున్నూ నిర్వచనాన్ని వేదము చెపుతున్నది. **ప్రాణావైసత్యమ్. తేషామేషసత్యమ్.** ప్రాణములు (జీవుడు) సత్యములు అనబడుతున్నవి. వాటికంటే ఈయన సత్యమైనవాడు అని. ఇక్కడ ప్రాణశబ్దము చేత ఎల్లప్పుడూ ప్రాణముతో కలసి తిరుగుతూ ఉంటాడు కనుక జీవులు పరామర్శింపబడుతున్నారు. తడుమబడుతున్నాయి. వారు సత్యములు. అనగా ఆకాశము మొదలైనవాటివలె స్వరూపము మరొక తీరుగా మారిపోవడమనే పరిణామము లేనివారు కావడం వల్ల. తేషామేష సత్యమ్ఽవారికంటే కూడా ఈయన పరమపురుషుడు – సత్యమైనవాడు. జీవులకు వారివారి కర్మలకు అనుగుణంగా జ్ఞానంలో తరుగుదల పెరుగుదలలు ఉంటున్నాయి. అపహత పాప్మ ఐన పరమ పురుషునికి మాత్రము అవి లేవు. అందువల్ల ఆ జీవులకంటే సత్యమైన వాడు ఈ పరమాత్మ. ఇందువల్ల ఈ విధమైన వాక్యశేషములో చెప్పబడిన గుణాల సముదాయముతో కూడి ఉన్నందువల్ల నేతినేతి అనే శబ్దాలతో బ్రహ్మకు ఉన్న సవిశేషత్వము నిషేధింపబడడం లేదు. కానీ పూర్వం ప్రస్తావింపబడిన ఇయత్తా – ఇంతమాత్రమే అనబడడము మాత్రమే నిషేధింపబడుతున్నది. కాబట్టి పరబ్రహ్మ ఉభయలింగుడే.

బ్రహ్మ ,వేదము / శబ్దము అనబడే ప్రమాణము చేత తప్ప మరొక ప్రమాణము చేత తెలియబడేవాడు కాడు. కనుక దానితో సమ్బన్ధము కల్గి ఉన్నందువల్ల మూర్త అమూర్త ఆది రూపాన్ని అనువదించడం వల్ల దాన్ని నిషేధించడము కుదరదు కనుక ప్రస్తుతమైన ఇయత్తా యొక్క ప్రతిషేధము చెప్పబడింది. కనుక ఆ ప్రమాణాన్తర అగోచరత్వము (ఇతర ప్రమాణాల చేత తెలియబడకుండడము) ను గట్టి చేస్తున్నాడు.

సూ॥ **తదవ్యక్తమాహహి 3-2-22** ఆ బ్రహ్మ ఇతర ప్రమాణాలచేత తెలియబడడని శాస్త్రము చెప్తున్నది కదా! తత్ – బ్రహ్మ. ఇతర ప్రమాణాలచేత వ్యక్తము అయ్యేవాడు కాడు. ఆహహి శాస్త్రమ్. శాస్త్రము చెప్పిందికదా! **నసందృశేతిష్ఠతి రూపమస్య నచక్షుషాపశ్యతి కశ్చనైనమ్.** ఈ పరమాత్మయొక్కరూపము జ్ఞానానికి అందదు. ఈయన రూపాన్ని నేత్రేంద్రియము ద్వారా ఎవ్వడూ చూడలేడు. **నచక్షుషా గృహ్యతేనాపివాచా** కంటితో గానీ వాక్కుతో గానీ గ్రహింపబడడు. ఇత్యాది వాక్యముల ద్వారా. మరొక హేతువును కూడా చెప్పినాడు.

సూ॥ **అపిసంరాధనే ప్రత్యక్షానుమానాభ్యామ్ 3-2-23** ఆయనను సంతోషపరిచే భక్తి చేత మాత్రమే కనిపిస్తాడు. వేదము, స్మృతులు అట్లాగని

చెపుతున్నాయి. అపిచసంరాధనే – చక్కగా సంతోషాన్నికలిగించే భక్తిగా మారిన నిదిధ్యాసనము నందు ఈయన సాక్షాత్కారము కలుగుతుంది కానీ మరొక్క తీరుగా కాదు. అని శ్రుతిస్మృతులవల్ల తెలియవస్తున్నది. **నాయమాత్మాప్రవచనేన లభ్యఃనమేధయా నబహునాశ్రుతేన। యమేవైషవృణుతే తేన లభ్యః తస్యైషఆత్మా వివృణుతేతనూంస్వామ్.** ఈ ఆత్మ వేదపారాయణము చేత జ్ఞానము పెద్దల సేవలు / ధ్యానము చేతగానీ లభింపడు కర్మజ్ఞాన భక్తులు ఆయన్ను సాధించిపెట్టవు. ఎవ్వడినైతే ఈ పరమాత్మ తన కృపకు పాత్రుడినిగా ఎంచుకుంటాడో అతనికి మాత్రమే దర్శనాన్ని ఇస్తాడు. తనకుతానై మాత్రమే కనుగొనబడగలడు. ఇతర సాధనాలు చెల్లవు. ఆయన దర్శనానికి ఆయనే సాధనము వేరొకటి లేదు. **జ్ఞానప్రసాదేన విశుద్ధ సత్త్వః తతస్తు, తం పశ్యతేనిష్కలంధ్యాయమానః** పరమాత్ముని యొక్క జ్ఞానభిక్షవలన దోషాలు లేని మనస్సు కలవాడైన పిదప ఆయనవల్లనే ఆయనను నిండు మనస్సుతో సంపూర్ణ స్వరూపుడిని ధ్యానించుతున్నవాడై దర్శించుకోగలడు. అని వేదం అంటున్నది. ఇక స్మృతి – **నాహంవేదైః న తపసానదానేన నచేజ్యయా। భక్త్యాత్వనన్యయా శక్యః। అహమేవంవిధోఽర్జున । జ్ఞాతుంద్రష్టుమ్ చతత్త్వేన ప్రవేష్టుం చపరన్తప. ఇతి.** నేను వేదాల చేత, తపస్సు చేత, దానము చేత యజ్ఞము చేత కనుగొనబడను. ఇతరుల పైకి పోకని భక్తి చేత మాత్రమే కనుపింపగలను. ఓ అర్జునా! భక్తి చేత మాత్రమే నన్ను గురించి తెల్సుకోవడానికి, దర్శించుకోవడానికి వాస్తవంగా / తాత్త్వికంగా పరమపదంలో ప్రవేశించడానికే శక్యము అవుతుంది అని. భక్తి రూపంగా మారిన ఉపాసనమే "**సంరాధనం**" అనబడుతుంది. అదే ఆయనను సంప్రీణనమని / సంతోషపర్చడమని మునుపే చెప్పినాము.

కాబట్టి నిదిధ్యాసనము కొఱకు పరమాత్మ స్వరూపము ఉపదేశింపబడింది. **ద్వేవావబ్రహ్మణః** అని మొదలుగా నున్న శ్రుతివాక్యము బ్రహ్మయొక్క రూపము మూర్తామూర్తములు రెండింటితో కూడినటువంటిదిగాను ఇంతకుముందు తెలియని దానిని అనువాదము చేయడానికి (చెప్పినదాన్ని మరొక్కసారి మరొకసారి చెప్పడమే అనువాదము) చాలినది కాదు.

సూ॥ **ప్రకాశాది వచ్చ అవైశేష్యం ప్రకాశశ్చకర్మణ్యభ్యాసాత్ 3-2-24**

జ్ఞానానందాదిస్వరూపాలవలెమూర్తామూర్తాదిప్రపంచముతోవిశిష్టమైఉండడమున్నూ భేదము లేకుండా కనిపిస్తున్నది. బ్రహ్మ స్వరూపమైన ప్రకాశము ఆనందాదులు కూడా

భక్తి రూపమైన కర్మయందు మరింత ఎక్కువై కనిపిస్తున్నవి. ఈ సూత్రము చేత కూడా ప్రస్తావనలో ఉన్న ఏతావత్త్వమునే ఇంతపాటి అనడాన్నే – నిషేధించుతున్నాడు. కానీ మూర్తామూర్తములతో విశిష్టతను కాదు. పరబ్రహ్మ స్వరూపాన్ని సాక్షాత్కారము చేసుకున్న వామదేవాదులకు దర్శనము కలిగినప్పుడు ప్రకాశము మొదలైన గుణాలవలె – జ్ఞాన ఆనందాది గుణవిశిష్టమైన స్వరూపము వలె మూర్తామూర్తాది ప్రపంచంతో విశిష్టమైన దానికి కూడా బ్రహ్మ యొక్క గుణములుఐ ఉండడంలో తేడా లేకపోవడము కనిపిస్తున్నది. తోస్తున్నది. **తద్ధైతత్ పశ్యన్ ఋషిః వామదేవః ప్రతిపేదే అహంమనురభవం సూర్యశ్చ.** అపుడు ఈ విశ్వరూపాన్ని చూస్తూ ఋషియైన వామదేవుడు నేను మనువును ఐనాను నేను సూర్యుడినైనాను అనే భావనను పొందినాడు. ఇత్యాది శ్రుతి ఇందుకు ప్రమాణము. బ్రహ్మయొక్క స్వరూపమైన ప్రకాశము ఆనందము మొదలైనవి కూడా ఆ వామదేవుడు మొదలైన వారియొక్క సంరాధన ఉపాసనారూపమైన కర్మయందు అభ్యాసము వల్ల ప్రత్యక్షమవుతున్నది. దానివలెనే హెచ్చు ఐన సంరాధన కల్గిఉన్న వామదేవాదులకు మూర్త అమూర్త ఆదులతో కూడిన రూపము కూడ ఎటువంటి భేదము లేకుండా ప్రతీయ మానమవుతున్నదని అర్థము. ఈ విధంగా బ్రహ్మకు చెప్పబడిన ఉభయలింగత్వాన్ని ముగిస్తున్నాడు.

సూ॥ **అతోఽనన్తేన తథాహి లింగమ్ 3–2–25** ఇందువలన ఇప్పటి దాకా చెప్పిన హేతువులను బట్టి బ్రహ్మ అనన్తమైన కళ్యాణగుణాలు కలవాడని తేలింది. అట్లా ఐనప్పుడే నిర్దోషత్వము మంగళ గుణవిశిష్టత్వము ఉన్నప్పుడే పరమాత్మ అనబడడము పొసగుతుంది. **ఇది ఉభయ లింగాధికరణము**

★ ★ ★

## ఇక అహికుండలాధికరణము

సూ॥ **ఉభయ వ్యపదేశాత్తు అహికుండలవత్ 3–2–26** జీవునితో తాదాత్మ్యము, భేధములను ఉపదేశించినందువల్ల పాము చక్కగా ఉండడము, గుండ్రంగా చుట్టచుట్టుకొని ఉండడములవలె బ్రహ్మ యొక్క సంస్థానవిశేషాలే అచిద్వస్తువులు. మూర్తామూర్తాత్మకమైన ప్రపంచము అంతా బ్రహ్మ యొక్క స్వరూపమే అని **ద్వేవా వ బ్రహ్మణో రూపే** అనే శ్రుతి వాక్యము ఉపదేశించుతున్నది. **అథాత ఆదేశోనేతినేతి** ఇక ఈ చెప్పిన కారణాన్ని బట్టి కాదుకాదు అని ఉపదేశము చేయబడుతున్నది అనే వాక్యము

మూర్తా మూర్త అచిద్ వస్తురూపమైనందువల్ల బ్రహ్మకు ఏర్పడుతున్న ఇంత అనే పరిమాణాన్ని కల్గి ఉండుటను – ఇయత్తను – నిషేధిస్తున్నది. **నహ్యేతస్మాదితి నేత్యన్యత్ పరమస్తి.** అనే వాక్యము బ్రహ్మ కంటే ఉత్కృష్టము ఐన మరొక వస్తువు లేదు అని ప్రతిపాదించుతున్నది. దాన్ని గట్టిగా బలపర్చడానికి గాను **అథనామధేయం సత్యస్య సత్యమితి ప్రాణావైసత్యమ్ తేషామేష సత్యమ్** అనే వాక్యము ద్వారా ప్రాణశబ్దము చేత పేర్కొనబడిన చేతనుల కంటే ఈయన సత్యమని చెప్పబడింది. ఎందుకంటే జీవులకు కొన్ని కొన్ని సందర్భాలలో జ్ఞానాదులు కుదించుకుపోతుంటాయి. ఆ సంకోచము ఒకప్పుడు కూడా ఈ పరమాత్మకు లేదు కదా! అందువల్ల సత్యస్యసత్యమ్ అనబడుతున్నాడు. అదే తీరుగా **ప్రధాన క్షేత్రజ్ఞ పతిర్గుణేశః** ప్రధానము, క్షేత్రజ్ఞుడనబడే జీవుడు, సత్వరజస్తమస్సులనే గుణాలకున్నూ ఈయన శాసకుడు. **పతిం విశ్వస్య ఆత్మే శ్వరమ్** విశ్వానికంతటికీ ఏకైక ప్రభువు. తనకు తానే ఈశ్వరుడు. **నిత్యోనిత్యానాం చేతనశ్చేతనానాం** సంసారగన్ధము ఎరుగని నిత్యజీవులకు నిత్యుడు. చైతన్యము గలవారికి చేతనుడు. ఇత్యాది శ్రుతులను బట్టి కూడా ఈ విషయము తెలుస్తున్నది.

ఆ అచిద్ వస్తువు బ్రహ్మకు స్వరూపమవుతున్న విధము ఇపుడు విచారింప బడుతున్నది. దానివల్ల బ్రహ్మదోషము లేనివాడు అనే విషయము తేల్చబడుతుంది. ఈ అచిద్ వస్తువు అహికుండల న్యాయము ప్రకారము బ్రహ్మ స్వరూపమవుతున్నదా? ప్రభాప్రభావత్‌లవలె విశేషణవిశేష్యములవడం వల్ల అంశము, అంశి భావమువల్లనా? అని. ఇక్కడ స్థాపించబడే విశేషణ విశేష్యభావాన్ని అంగీకరించి **ప్రకృతిశ్చ ప్రతిజ్ఞా దృష్టాన్త అనుపరోధాత్ తదనన్యత్వం ఆరమ్భణాది శబ్దేభ్యః** అనే సూత్రాల దగ్గర సూక్ష్మమైన చిత్ అచిత్ వస్తువులతో కూడి ఉన్న బ్రహ్మ నుండి స్థూల చిదచిద్విశిష్టమైన వస్తువు పుట్టడమువల్ల పరమాత్మకు చిదచిత్తులకు అనన్యత్వమున్నూ చెప్పబడింది.

పై అంశాలలో ఏది తగును అని అంటే అహికుండలము వలెనే అనేది తగును. ఎందువల్లనంటే రెండింటినీ పేర్కొనడం జరిగింది. కనుక, **బ్రహ్మైవేదం సర్వమ్. ఆత్మైవేదం సర్వమ్.** ఇదంతా బ్రహ్మనే. ఈ సమస్తమూ ఆత్మనే అని తాదాత్మ్యాన్ని పేర్కొన్నారు గనుక. **హన్తాఽహమిమాస్తిస్రోదేవతాః అనేన జీవేన ఆత్మనా అనుప్రవిశ్య** ఆహా! ఎంతబాగున్నది. ఈ ముగ్గురు దేవతలలోకి నా స్వరూపమే ఐన ఈ జీవునితో పాటు ప్రవేశించి అని చెప్పినట్లు భేదాన్నీ పేర్కొన్నందువల్ల పాము చుట్టచుట్టుకున్నట్లు,

చక్కగా ఉన్నట్లు ఆ బ్రహ్మనే ఈ అచిద్ వస్తువులు సంస్థానవిశేషాలు, సంస్థానము – రూపము అవుతున్నాడు.

సూ॥ **ప్రకాశాశ్రయవద్వా తేజస్త్వాత్ 3-2-27** ప్రకాశము దానికి ఆశ్రయమైన దాని వలే కావచ్చును. జీవపరమాత్మలు ఇద్దరు ఒకే జాతికి చెందినవారవుతున్నారు కనుక. సూత్రములోని తు శబ్దము పక్షాన్ని తిప్పికొట్టడం కొరకు చేర్చబడింది. బ్రహ్మ స్వరూపమే అచిత్ రూపంగా ఉన్నప్పుడు భేదశ్రుతులు, మరియు బ్రహ్మ మార్పులేనివాడు అని చెప్పే శ్రుతులున్నూ బాధింపబడుతవి. కనుక ప్రభాప్రభా శ్రయములు రెండూ తేజో ద్రవ్యాలౌతున్నందువల్ల తాదాత్మ్యము ఎట్లా చెల్లుతున్నదో అదే విధంగా బ్రహ్మకు ప్రపంచము రూపమవుతున్నది.

సూ॥ **పూర్వవద్వా 3-2-28** ముందటివలెనే. వాశబ్దము రెండు పక్షాలనూ పక్కనబెట్టడము కొరకే. ఒకే ద్రవ్యానికి అవస్థా విశేషముతో కలయిక ఏర్పడినప్పుడు బ్రహ్మ స్వరూపానికే అచిత్ ద్రవ్య స్వరూపము ఏర్పడుతున్నందున మునుపు చెప్పినదోషాన్నించి ముక్తి లేకుండా పోతుంది. ఇక ప్రభా, దానికి ఆశ్రయమిచ్చినట్టి దానివలె అచిత్తు బ్రహ్మలకు బ్రహ్మత్వజాతితో యోగము / కలయిక మాత్రమే ఏర్పడుతుంది. ఇట్లాగే ఐనప్పుడు అశ్వత్వము, గోత్వములవలె బ్రహ్మ ఐనా ఈశ్వరుని యందు చిదచిత్తువస్తువులతో కొనసాగుతూ వస్తున్నట్టిది సామాన్యధర్మమే కనుక సకల శ్రుతి స్మృతి వ్యవహారాలతో విరోధము కలుగుతుంది. ఇది పూర్వము వలెనే అవుతుంది **అంశోనానా వ్యపదేశాత్, ప్రకాశాది వత్తునైవం పరః** అనే సూత్రాల వద్ద చెప్పిన దాని ప్రకారము జీవుడివలె విడిగా ఉండడము / లభించడమునకు అనర్హమైన విశేషణ ధర్మము కలది అవుతున్నది కాబట్టి అచిద్వస్తువు బ్రహ్మయొక్క అంశమవుతున్నది. విశిష్టమైన వస్తువులో ఒక భాగము అవుతున్నందువలన అభేదవ్యవహారము ముఖ్యమే. విశేషణ విశేష్యాలకు స్వరూపములో స్వభావములోనూ భేదముంటున్నందు వలన భేదవ్యవహారము కూడా ముఖ్యమే. ఇందువల్ల బ్రహ్మయొక్క నిర్దోషత్వము కాపాడబడింది. అందువల్ల ఈ చూపిన ప్రకారము ప్రకాశము జాతి గుణము శరీరాలకు మణి వ్యక్తి గుణి ఆత్మలను గురించి అపృథక్ సిద్ధి లక్షణం కల విశేషణాలు అవుతున్నందున ఏ విధంగా అంశత్వము కుదురుతున్నదో అదేప్రకారము జీవుడు అచిద్వస్తువున్నూ బ్రహ్మకు అంశములు అవుతున్నారు.

సూ॥ **ప్రతిషేధాచ్చ 3-2-29** బ్రహ్మకు అచిద్ధర్మము లేదని ప్రతిపాదించినందు వల్లనున్నూ **సవాఏష మహానజ ఆత్మాఽజరోఽమరః.** అటువంటి ఈ గొప్ప పురుషుడు మహాన్ – గొప్పవాడు. పెద్దవాడు పుట్టుకలేనివాడు అందరికీ ఆత్మయైన వాడు. వృద్ధాప్యము లేనివాడు. మరణము లేనివాడు. **నాస్యజరయైతత్ జీర్యతి** ఇతని యొక్క శరీరము ముసలితనముతో దిగజారదు. ఇత్యాదులైన వాక్యాలతో బ్రహ్మకు అచిద్ ధర్మాన్ని నిషేధించినందువల్ల కూడా విశేషణము విశేష్యత్వముల వల్లే అంశాంశి భావము అచిత్తు బ్రహ్మలకు ఏర్పడుతున్నది. కనుక సూక్ష్మ చిదచిద్ వస్తువులతో కూడి ఉన్నట్టిది కారణమైన బ్రహ్మ. స్థూలచిదచిద్విశిష్టము కార్యమైన బ్రహ్మ. కనుక కారణముతో కార్యానికి అనన్యత్వము (వేరుకాకపోవడము) సిద్ధించుతున్నది. కావున కారణమైన బ్రహ్మను గురించి తెల్సుకోవడం వలన కార్యమును గురించి తెల్సుకోవడం సాధ్యమౌతుంది. దానితో అంతా పొసగుతుంది. బ్రహ్మయొక్క నిర్దోషత్వమూ రక్షింపబడింది. బ్రహ్మనిర్ధోషుడు ఐనందువలన కళ్యాణగుణాలకు ఆకరమైనందువలన కూడా ఉభయ లింగత్వమున్నూ సిద్ధించుతున్నది. **ఇది అహికుండలాధికరణము**

★ ★ ★

## ఇక మీదట పరాధికరణము.

సూ॥ **పరమతః సేతూన్మాన సమ్బన్ధ భేదవ్యపదేశేభ్యః 3-2-30** ఇది పూర్వ పక్షికి చెందిన సూత్రము – పరమాత్మ కంటే పైన మరొకడు ఉన్నాడని కొన్నిహేత్వాభాసాలతో (కారణాలవలె కనిపించే వాటిని బట్టి) అనుమానించి ఖండించబోతున్నాడు. సేతు ఉన్మాన సమ్బన్ధ భేదములను బట్టి పరబ్రహ్మకుపైన మరొకడు ఉన్నాడు అని. ఇప్పుడు ఈ పరమకారణుడైన పరబ్రహ్మకంటే కూడా అధికమైన తత్త్వము ఏదో ఒకటి ఉన్నది అని కొన్ని హేత్వాభాసాల చేత అనుమానించగా నిరాకరించుతున్నారు. ఈ ఉపాసింపదగిన, దోషాలు లేని, అవధిలేని అతిశయమైన అసంఖ్యేయమైన కళ్యాణగుణాలకు ఆకరమైన వానియొక్క స్థిరత్వాన్ని నిలబెట్టడానికి ప్రయత్నించుతున్నారు. ఈ సందర్భములో చేయబడుతున్న ఆశంక ఇది. ఈ పరబ్రహ్మ ఉభయలింగాలు కలవాడు. ఈ నిఖిల జగాలకూ కారణమైన వాడు. ఇతనికంటే కూడా అధికుడైన తత్వము ఒకటి ఉన్నది. ఎట్లా అంటే? **అథయఆత్మాససేతుః విధృతిః** ఇక ఎవడైతే ఆత్మఐ ఉన్నాడో అతడే సేతువు వంతెన వంటివాడు అని ఈ పరుడిని సేతువుగా పేర్కొన్నారు కాబట్టి సేతు శబ్దము లోకములో ఒకగట్టు నుండి మరొక గట్టుకు చేరుకోవడానికి సాధనమైన

దానియందు ప్రసిద్ధి ఉన్నది. కావున ఈయనకంటే వేరొకడు ఈ సేతువు ద్వారా చేరుకోదగిన వాడు మరొకడు ఉన్నాడని తెలుస్తున్నది. అట్లాగే **ఏతమ్ సేతుమ్ తీర్త్వా అన్ధస్సన్ అనన్ధో భవతి.** ఈ వంతెనను దాటుకున్నాక గుడ్డివాడైన ఇతడు గుడ్డితనము లేనివాడవుతున్నాడు అని తరితవ్యతా – దాటుకొని పోదగినవాడుగా ఉండడము – చెప్పబడుతూ ఉన్నది. పైరెండు వాక్యాలు / కారణాలను బట్టి ప్రాప్యమైనది మరొక్కటి ఉన్నది. ఉన్మానవ్యపదేశము వలన కూడా! ఉన్మితమ్ – పరిమితమైనది ఈ పరబ్రహ్మ. **చతుష్పాద్ బ్రహ్మ షోడశకలంబ్రహ్మ.** బ్రహ్మ నాలుగు పాదాలు కలవాడు పదారు కళలు కలవాడు బ్రహ్మ అని ఉన్మానము పేర్కొనబడుతున్నది. అటువంటి ఈ వ్యపదేశము ఆ సేతువు ద్వారా చేరుకోదగిన పరిమితి లేనివాడిని మరొకడిని ఉన్నాడని తోచేటట్లు చేస్తున్నది. ఇక సమ్బన్ధ వ్యపదేశమున్నూ – సేతువు సేతువును కలిగిన దానికి రెండింటికిన్నీ ప్రాపకత్వము ప్ప్రాప్యత్వము – చేర్చేది, చేరునది అనే లక్షణము గల సమ్బన్ధము కనిపిస్తున్నది. **అమృతస్యపరమ్ సేతుమ్ దగ్ధేన్ధన మివానలమ్.** మోక్షాన్ని పొందడానికి గొప్పదైన వంతెనవంటివాడిని కట్టెలు పూర్తిగా కాలిపోయిన తరువాత కణకణలాడే నిప్పు వంటివాడిని **అమృతస్య ఏషసేతుః.** మోక్షాన్ని పొందడానికి ఈయన వంతెన వంటివాడు అని చెప్పినందువల్ల. ఇక భేదము భేదాన్ని కలవాడినిగా పరాత్పరుడిని గురించి చెప్పబడుతున్నది. **పరాత్పరం పురుషముపైతి దివ్యమ్.** పరాత్ పరుడైన పురుషుడిని గొప్పతేజస్సు కలవాడిని పొందుతున్నాడు. **పరాత్పరం యన్మహతో మహాన్తమ్.** పరుడనబడే వాడికంటే పరుడైన వాడిని మహత్తుకంటే మహత్ గొప్ప ఐనవాడిని అని కూడా చెప్పబడింది. అదేవిధంగా **తేనేదం పూర్ణం పురుషేణసర్వం** అటువంటి ఆ మహాపురుషుని చేత ఈ సమస్త ప్రపంచము నిండి ఉన్నది. **తతోయదుత్తరతరం తదరూపమ్ అనామయమ్.** దానికంటే ఏది శ్రేష్ఠమై ఉన్నదో అది ఒక రూపము లేనిది. ఎటువంటి ఆధివ్యాధులు – రోగాలు నొప్పులూ లేనట్టిది అని. ఇందువల్ల ఈ కారణాలను బట్టి ఉభయలింగుడైన పరంబ్రహ్మ కంటే ఇంకా అధికమైన ఒకతత్వము ఉన్నదని తోస్తున్నది అని. ఈ విధంగా పూర్వపక్షము సిద్ధముకాగా చెప్పబడ్తున్నది.

సూ॥ **సామాన్యాత్తు 3-2-31** పోలిక మాత్రమే సేతుత్వము. తు శబ్దము పక్షాన్ని తొలగించుతున్నది. సేతువు అని చెప్పడాన్ని బట్టి పరాత్పరమైన వస్తువు ఉన్నదని ఏ మాట అన్నావో అది పొసగేది కాదు. ఇక్కడ చేరదగిన – ప్రాప్యమైన – దాన్ని ఉద్దేశించి

సేతువును చెప్పడం లేదు. **ఏషాం లోకానాం అసమ్భేదాయ** ఈ లోకాలు అన్నీ కలగలసి పోకుండా ఉండడము కొరకు అని సేతువుతో పోల్చడము వలన సర్వలోకా సంకరత్వము వినిపించుతున్నది. సేతువు అనగా సినోతి తనతో బధ్నాతి కట్టుతున్నది ఈ చిదచిద్వస్తువుల సముదాయాన్నంతటినీ కలుగలుపు గాకుండగా ఉంచుతున్నది గనుక సేతువు అనబడుతున్నది. **ఏతమ్ సేతుమ్ తీర్త్వా** ఈ వంతెనను చేరుకొని / దాటుకొని అని అన్నపుడు తరతి అనే పదము ప్రాప్తిని చెప్పుతున్నది. ఎట్లాగానంటే వేదాన్తం తరతి – వేదాన్తాన్ని పొందుతున్నాడు అని అన్నట్లు.

సూ॥ **బుద్ధ్యర్థః పాదవత్ 3–2–32** తేటగా తెలియడం కొరకు మాత్రమే ఉన్మానము. పాదము అని చెప్పినట్లు. **చతుష్పాద్ బ్రహ్మ. షోడశకలమ్. పాదోఽస్యవిశ్వాభూతాని** అని పరిమితిని చెప్పడము ఏదైతే ఉన్నదో అది అర్థము కావడం కొరకే. **సత్యం జ్ఞానం అనన్తం బ్రహ్మ** ఇత్యాది వాక్యాలచేత జగత్కారణుడైన పరబ్రహ్మ పరిచ్ఛేదము లేనివాడు అని తెలుస్తున్నది కాబట్టి ఆయన సహజంగానే పరిమితి కలవాడు కాడు. తనతో తాను కొలువ బడడము కుదురదు కాబట్టిన్నీ పరిమితి ఎంతనో తెలియబడదు. కనుక ఉన్మితుడు కాడు. జగత్ కారణత్వము కూడా ఆ పరిచ్ఛేదము ఉన్మానము లేనివాడికే ఉన్నట్లు వినిపిస్తున్నది. **తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశ స్సమ్భూతః 2) సోఽకామయతబహూస్యాంప్రజా యేయేతి** అని. కావుననే **వాక్ పాదః ప్రాణః పాదః చక్షుః పాదః శ్రోత్రం పాదః** ఇత్యాది వాక్యము ద్వారా బ్రహ్మకు వాగాది పాదవ్యపదేశము ఉపాసన కొరకు అని చెప్పబడ్తున్నది కాబట్టి ఇక్కడ చతుష్పాద్ బ్రహ్మ అని చెప్పడమున్నూ ఉపాసన కొరకే అని గుర్తించాలి. స్వయంగా ఉన్మానము లేనివాడికి ఉపాసన కొరకే ఉన్మానము ఏ విధంగా కుదురుతుంది? అని అంటే చెపుతున్నాడు.

సూ॥ **స్థాన విశేషాత్ ప్రకాశాది వత్ 3–2–33** తెలియవస్తున్న వాక్కు మొదలైన స్థానవిశేషాలనే ఉపాధులయొక్క భేదాన్ని బట్టి వాటితో సమ్బన్ధము ఉంటున్నది కాబట్టి ఉన్మితుడని తలచడం జరుగుతున్నది. ఎట్లాగంటే ఇల్లంతా నిండి ఉన్న ప్రకాశము (వెలుతురు) మొదలైనవాటిని కిటికీ కుండ మొదలైన స్థానాల భేదాన్ని బట్టి విడదీసి వ్యవహరించినట్లు కుదురుతుంది అని అర్థము.

సూ॥ **ఉపపత్తేశ్చ 3–2–34** తనకు తానే ప్రాప్యమూ ప్రాపకము అవడం కుదురుతున్నది. **అమృతస్య ఏషసేతుః** అనే వాక్యాన్నిబట్టి ప్రాప్యము ప్రాపకములకు

ఉండే సమ్బన్ధాన్ని బట్టి ప్రాపకము – పొందించేది – కంటే వేరుగా ప్రాప్యము (పొందదగినది) ఐనది మరొక్కటి ఉన్నది అని ఏ మాట అన్నారో అది సరిఐన మాటకాదు. ప్రాప్యమైన పరమ పురుషుడు భక్తుడు తనను చేరుకోవడములో తానే ఉపాయము అవడం కుదురుతున్నది. కనుక తనకంటే ప్రాప్యుడు మరొకడు లేడు. **నాయమాత్మాప్రవచనేన లభ్యః నమేధయా నబహునా శ్రుతేన. యమేవైష వృణుతే తేనలభ్యః. తస్యైష ఆత్మా వివృణుతే తనూం స్వామ్.** ఈయన ఎవడిని ఇష్టపడుతున్నాడో వాడికి తానుగానే – ఉపాసకుని ప్రయత్నము వలన కాకుండా – లభించుతున్నాడు. అతనికి మాత్రమే తనదైన స్వరూపాన్ని చూపించుతున్నాడు. అని మరొక ఉపాయము లేదని వినిపిస్తున్నది కాబట్టి.

సూ॥ **తథాఽన్యప్రతిషేధాత్ 3-2-35** అదే విధంగా మరొకడు లేడని నిషేధించినందువలన. **తతోయదుత్తరతరం, పరాత్పరం పురుషం, అక్షరాత్ పరతః పరః** ఇత్యాదివాక్యాలచేత భేదాన్ని ఉపదేశించినారు కాబట్టి పరుడైన వాని కంటే మరొకపరుడు ఉన్నాడు అని ఏమాట అన్నారో అది పొసగేది కాదు. ఆ వాక్యము వద్దనే శ్వేతాశ్వతర ఉపనిషత్తులో పరబ్రహ్మ కంటే మరొకడు లేడు అని నిషేధించినారు కదా! **యస్మాత్ పరం నాపరమస్తి కించిత్ యస్మాన్నాణీయో న జ్యాయోఽస్తికశ్చిత్.** ఎవనికంటే అధికుడైనవాడు మరొక్కడెవ్వడు లేడు అట్లే ఎవ్వనికంటే మరీ చిన్నవాడూ లేడు. మరీ పెద్దవాడున్నూ లేడు. (అణువే చిన్నది. దానికంటే చిన్నది అణీయాన్. అది పరమాత్మ. ఆ అణీయాన్ కంటే చిన్నది మరేదీ లేదు. జ్యాయాన్ చాలా పెద్దది. అదీ పరమాత్మనే ఆయన కంటే పెద్దవాడు లేడు. దాన్నే అణోరణీయాన్ మహతో మహీయాన్ అనే వాక్యము సంగ్రహంగా చెప్తున్నది) అని. ఎవనికంటే పరమైనది ఒకటి కూడా లేదు. అనగా ఏ విధంగా చూచినా పరమైనది లేదని అర్థము.

అట్లాగే వేరేచోట "**నహ్యేతస్మాత్**" అనే మాటను బట్టి పరమైనవాడు వేరొకడు లేడు. పరమైనది మరొకటి లేదు అని. ఇతిన అని నిర్దేశించబడిన ఈ బ్రహ్మ కంటే పరుడైనవాడు మరొకడు లేడు అని అర్థము. అదేవిధంగా **న తస్యేశేకశ్చన. తస్యనామ మహత్ యశః.** ఆయనను శాసించే మరొకడు లేడు. ఆయన పేరు పెద్దది. అదే యశము అని అది జగత్తుకు ఉపాదానకారణమవడం చేత అని తదుపరి చెప్పబడింది. **సర్వే నిమేషాజజ్ఞిరే విద్యుతః పురుషాదధి. సఆపః ప్రదుఘే ఉభేఇమే.** ప్రకాశవంతుడైన

ఆ పురుషుడి నుండి ప్రాణులు అన్నీ పుట్టినవి. ఆయన నీటిని పుట్టించి వాటినుండి ఈ లోకాలు – ద్యావా పృథివులు – పుట్టించినాడు. ఇత్యాది వాక్యముతో **అద్ భ్యః సమ్భూతో హిరణ్యగర్భః ఇత్యష్టౌ.** నీటిలో నుండి హిరణ్యగర్భుడు. ఆయన నుండి మరొక ఎనిమిది మంది పుట్టినారు. అనే వాక్యము చేతనున్నూ జగత్ కారణమైన పురుషుడినిగా ఇతడినే గుర్తు చేస్తున్నది. ప్రత్యభిజ్ఞ – ఇదివరలో ఎక్కడో చూచినవాడిని ఇప్పుడు ఇక్కడ చూచి అతడే అని గుర్తించుట. ఐతే తతోయదుత్తరతరమ్ అనేది ఏమి చెప్పుతున్నదని అంటే ముందుగా **వేదాహమేతం పురుషం మహాన్తం ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్। తమేవంవిదిత్వాఽతిమృత్యుమేతి నాఽన్యఃపన్థా విద్యతేఽయనాయ.** చీకటికి ఆవల సూర్యుని వంటి కాన్తులతో వెలుగుతూ ఉండే మహానుభావుడూ గొప్పవాడైన పురుషుడిని కనుగొన్నాను. అతడిని మాత్రమే తెల్సి ఉపాసించి మృత్యువును, సంసారాన్ని దాటుకొని మోక్షాన్ని పొందుతున్నాడు. ఆయన వద్దకు చేరుకోవడానికి ఇది మాత్రమే తప్ప మరొక మార్గము లేదు అని మహాపురుషుడైన పరబ్రహ్మను తెల్సి ఉపాసించడమే మోక్షాన్ని పొందడానికి సాధనమవుతున్నది. మోక్షమార్గము దీనికన్నా మరొక్కటి లేదు అని ఉపదేశించి దాన్ని ఉపపాదించడం కోసం **యస్మాత్పరం నాపరమస్తి కించిత్ యస్మాన్నాణీయో నజ్యాయోఽస్తి కశ్చిత్. వృక్షఇవస్తబ్ధోదివి తిష్ఠత్యేకః తేనేదం పూర్ణం పురుషేణ సర్వమ్.** ఎవనికంటే అధికమైనది. కొంచెము కూడా లేదు. ఎవనికంటే అణీయము, పెద్దదిన్నీ ఏదీ లేదు. అతడు వృక్షము వలె అన్నివైపులా వ్యాపించి స్థిరంగా  ఆకాశంలో ఉంటున్నాడు. ఆ పురుషుని చేత ఈ విశ్వమంతా వ్యాపించబడి ఉన్నది అని పురుషుని యొక్క పరత్వము ఆయన కంటే వేరుగా అధికమైన వస్తువు అసంభవమగుటనున్నూ ప్రతిపాదించి **తతోయదుత్తరతరం తదరూపం అనామయం। య ఏతద్విదురమృతాస్తే భవన్తి అథేతరే దుఃఖమే వాపియన్తి** ఆయనకంటే ఏది ఉన్నదో అది రూపము లేనిది. ఎటువంటి తాపములు లేనిది. ఎవరైతే దీన్ని తెల్సుకొని ఉపాసించుతున్నారో వారు ఆనందమయమైన మోక్షాన్ని పొందుతున్నారు. ఇక ఎవ్వరైతే ఇందుకు భిన్నంగా ఎవరు ఉంటున్నారో వారు దుఃఖాన్ని మాత్రమే పొందుతున్నారు అని ముందు చెప్పిన అర్థాన్ని హేతువును చూపుతూ ముగింపు చేస్తున్నది. ఏది ఉత్తర తరమైన సర్వోత్తమమైన ఉన్నదో అదే అరూపము అనామయం ఎందువల్ల అవుతున్నదో అందువల్లనే ఎవరు ఈ పురుషతత్త్వాన్ని

ఎరుగుతున్నారో వారు వారు మాత్రమే అమృతులు అవుతున్నారు. ఇక ఇందుకు భిన్నముగా ఆపరముడైన పురుషుడిని తెల్సుకొనక ఉపాసించక ఉంటున్నారో వారు దుఃఖాలను మాత్రమే పొందుతున్నారు అని. అట్లా కాకపోయినప్పుడు ఉపక్రమము – మొదలుపెట్టిన విషయము – తో వైరుధ్యము వస్తుంది. దానితోపాటు తరువాతి వాక్యముతోనున్నూ విరోధము ఏర్పడుతుంది. **పరాత్పరం పురుషముపైతిదివ్యమ్** అని. దీనికి ముందు **అక్షరాత్ పరతః పరః** అక్షరము కంటే అధికుడైన జీవుడికన్నా పరుడు అధికుడు. అనే వాక్యములోని అవ్యాకృతమైన అక్షరాని కంటే పరుడైన ఏ సమష్టి పురుషుడు ఉన్నాడో వానికంటే పరుడు, ఎవడు అదృశ్యత్వాది గుణాలు కల సర్వజ్ఞుడు ఐన పరమపురుషుడు ఎవడు ఉన్నాడో అతడే ఇక్కడ కూడా **పరాత్ పరః** అని సమష్టి పురుషుని కంటే అధికుడైన వాడుగా చెప్పబడుతున్నాడు.

సూ॥ **అనేన సర్వగతత్వమాయామ శబ్దాదిభ్యః 3–2–36** ఈ పరబ్రహ్మకు జగమునందంతటా వ్యాపించి ఉండుట ఆయామ శబ్దాదులవల్ల తెలుస్తూ ఉన్నది. ఇది ఈయననే పరుడని చెప్పుతున్నది. ఈ బ్రహ్మ సర్వగతుడు ఐ ఉండడమనేది – సర్వజగము నందు వ్యాపించి ఉండుట అనేది ఆయా మశబ్దాదిభ్యః – సర్వమునందు వ్యాపించి ఉన్నాడని చెప్పే శబ్దాలవల్ల తెలియవచ్చే అంశము, ఈయన కంటే అధికుడైనవాడు లేడు అని తెల్పుతున్నది. ఆయామశబ్దము అనగా తే**నేదమ్ పూర్ణం పురుషేణసర్వమ్** ఆ మహా పురుషుడి చేత ఈ సమస్తమూ వ్యాపింపబడి ఉన్నది. **యచ్చకించిత్ జగత్యస్మిన్ దృశ్యతే శ్రూయతేఽపివా। అన్తర్బహిశ్చతత్సర్వం వ్యాప్యనారాయణః స్థితః** ఈ ప్రపంచమంతటిలో ఏ చిన్నది ఐనా సరే దానిలో నారాయణుడే నిండుకొని ఉన్నాడు. **నిత్యం విభుం సర్వగతం సుసూక్ష్మం తదవ్యయం యద్ భూతయోనిం పరిపశ్యన్తిధీరాః** మూడు కాలాల్లోనూ ఉండెడివాడు ప్రభువు ఐనవాడు అన్నిచోట్లా అన్నింటిలోనూ ఉండెడివాడు సూక్ష్మమైన దానికన్నా సూక్ష్మమైనవాడు మార్పులు చేర్పులు తరుగుదల వంటివి లేనివాడు ఈ చరాచర ప్రాణికోటి కంతటికీ కారణమైనవాడు ఎవడో అతడిని జ్ఞానులు దర్శించుకుంటున్నారు. సూత్రములోని ఆది శబ్దము వలన **బ్రహ్మైవేదం సర్వమ్.** ఇదంతా బ్రహ్మనే. **ఆత్మైవేదం సర్వమ్** ఇదంతా ఆత్మనే. ఇత్యాదివాక్యాలు గ్రహింపబడుతున్నవి. కనుక ఈ బ్రహ్మనే సమస్త ప్రపంచానికన్నా అధికుడైనవాడు. **ఇది పరాధికరణము.**

★ ★ ★

## ఇక ఫలాధికరణము

సూ॥ **ఫలమ్ అతః ఉపపత్తేః 3-2-37** పురుషార్థ ఫలము ఈయననుండే లభించుతున్నది. ఆయననే ఇవ్వగల సమర్థుడు కాబట్టి. పరమాత్మను ఉపాసించదల్చుకున్న జీవుడు అన్ని అవస్థలలోనూ దోషాలు కల్గి ఉన్నాడని చెప్పినారు. ఇక ఉపాసనకు ఫలంగా చేరదగినవాడైన పరమాత్మ నిర్దోషుడు. కళ్యాణగుణాకరుడు, అందరికన్న అధికుడు అనిన్నీ చెప్పబడింది. ఇక మీదట ఉపాసనను గురించీ చెప్పదల్చుకుని ఉపాసనను చేసెడివారికి ఈ పరమ పురుషుడి నుండే ఆయనను చేరుకోవడమనే రూపమైన అపవర్గము అనే పేరుగల మోక్ష ఫలము లభిస్తుంది అని ఇప్పుడు చెప్పుతున్నారు. అది ఐహికమైనా ఆ ముష్మికమే ఐనా ఫలము ఫలమే కనుక తుల్యన్యాయము ప్రకారము వేదవిహితమైన శాస్త్రీయమైనఫలము ఈ పరమ పురుషుడి నుండే లభిస్తుంది అని సామాన్యంగా **"ఫలమతః"** అనే సూత్రముతో చెప్పబడుతున్నది. ఎందువల్ల? అని అంటే ఉపపత్తేః. పొసుగుతున్నది కనుక. ఆయన మాత్రమే అన్నీ తెలిసినవాడు. అన్ని శక్తులు ఉన్నవాడు. గొప్పదౌ ఔదార్యము కలవాడు. యాగము దానము హోమము మొదలైన రూపాలలో ఉన్న ఉపాసన చేత ఉపాసింపబడినవాడై ఐహికము, ఆమష్మికం ఐన భోగాలను, తానుకోల్పోయిన తనదైన జ్ఞానానందమయమైన స్వరూపాన్ని పొందడమనే అపవర్గమనే మోక్షాన్ని ఇవ్వగల సమర్థుడు ప్రభువు. చైతన్యము లేనిది క్షణకాలములోనే నశించిపొయ్యేది ఐన కర్మ ఎప్పుడో రాబోయే కాలములో కలుగబోయే ఫలాలకు సాధనము కాబోదు.

సూ॥ **శ్రుతత్వాచ్చ 3-2-38** వేదములో వినిపించుతున్నందువల్ల కూడా! **సవాఏష మహానజ ఆత్మాఽన్నాదో వసుదానః** ఆతడు గదా ఈ గొప్పవాడు. పుట్టుకలేనివాడు. అందరికీ ఆత్మఐనవాడు. అన్నమును పెట్టెడివాడు. ధనాన్ని కూడా ఇచ్చెడివాడు. **ఏషహ్యేవఆనందయాతి** ఈయన మాత్రమే ఆనందాన్ని కలిగించెడివాడు అని భోగములు అపవర్గము అనబడే ఫలాలను ఈ పరమాత్మనే ఇస్తున్నాడని వేదవాక్యాల ద్వారా వినిపిస్తున్నది కదా! ఇప్పుడు పూర్వపక్షాన్ని చెప్తున్నాడు.

సూ॥ **ధర్మం జైమినిః అతఏవ 3-2-39** ఈ ఉపపత్తి కారణంగానే చేసిన పుణ్యకార్యాలే ఫలాలను ఇస్తున్నాయి. అని ఆచార్యుడైన జైమిని భావించుతున్నాడు. అతఏవ - ఉపపత్తి కారణంగా, శాస్త్రము చెప్పుతున్నది కాబట్టిన్నీ యాగము

దానము హోమము ఉపాసనముల రూపములో ఉన్న ధర్మమే ఫలాన్ని ఇస్తుంది అని ఆచార్యుడైన జైమిని తలంచుతున్నాడు. లోకంలో వ్యవసాయము (కృషికర్మ) మర్ధనము (తొక్కడము) మొదలైన కర్మలు నేరుగా గానీ పరమ్పరగా గానీ తానే ఫలానికి సాధనమవుతూ కనిపిస్తున్నవి. ఇదే తీరుగా యాగదాన హోమాదులు కూడా సాక్షాత్తుగా ఫలసాధనాలు కాకపోయినప్పటికీ పరమ్పరగా అపూర్వము (పుణ్యము – ఇంతకు ముందులేనిది. ఇప్పుడు ఈ కర్మలు చేసినందువల్ల పుట్టుకొచ్చినటువంటిది) ద్వారా ఫలసాధనము కావడం పొసగుతుంది. అదే విధంగా **యజేత స్వర్గకామః** స్వర్గాన్ని పొందాలని కోరేవాడు యజ్ఞాన్ని చేయాలి ఇత్యాది శాస్త్రము కూడా సంపాదించుకోదల్చుకొన్న స్వర్గము కొరకు చేయవలసినదిగా యాగము మొదలైన వాటిని చెపుతూ మరొక తీరుగా సాధ్యము కానందున యాగాదులనే కోరిన ఫలాన్ని ఇచ్చేవిగా తెలియచేస్తున్నది. యాగాదులు చేయనివాడికి స్వర్గాదులు దక్కకపోవడం అన్యథాఽనుపపత్తి తెలుస్తున్నది.

సూ॥ **పూర్వంతు బాదరాయణో హేతు వ్యపదేశాత్ 3-2-40** మునుపు చెప్పినట్లు పరమ పురుషుడే ఫలాన్నిస్తున్నాడని బాదరాయణుడు అనబడే వేదవ్యాస మహర్షి నమ్ముతున్నాడు. హేతువు చెప్పబడుతున్నది కాబట్టి. సూత్రములోని తు శబ్దము పక్షాన్ని పక్కకు పెడ్తున్నది. ముందు చెప్పినట్లు పరమ పురుషుడికే ఫలప్రదాన శక్తి ఉన్నది అని భగవన్తుడగు బాదరాయణుడు తలుస్తున్నాడు. ఎందువల్లనంటే హేతువును చెప్పుతున్నారు కాబట్టి. యజధాతువునకు దేవపూజ అని అర్థము. కనుక దేవతారాధన రూపమైన యాగాదులచేత ఆరాధింపబడే అగ్నివాయువు మొదలైన దేవతలకు మాత్రమే ఆయా ఫలాలను ఇచ్చే శక్తి ఉన్నందున వారే హేతువులు అని ఆయా వాక్యాలలో పేర్కొనడం జరిగింది. **వాయవ్యం శ్వేతమాలభేతభూతి కామో వాయుర్వైక్షేపిష్ఠాదేవతా వాయుమేవ స్వేనభాగధేయేనో పధావతి. సఏవైనం భూతింగమయతి.** సమ్పదలు కావాలని కోరేవాడు వాయు దేవతకు ప్రీతిని కలిగించే ప్రత్యేకమైన, తెల్లని రంగు గల పశువును బలిగా సమర్పించాలి. వాయువు కుప్పలుగా సమ్పదలను కుమ్మరించే దేవత కదా! ఎవ్వడైనా వాని అదృష్టము కొద్ది వాయుదేవుడి వద్దకు పరుగుపెడుతున్నాడు. ఆ వాయుదేవుడే ఇతడికి సమ్పదలను అందిస్తున్నాడు. ఇత్యాది వాక్యాలయందు కోరుకున్నవాడికి తాను సాధించుకోదల్చుకున్న ఫలానికి సాధనము ఏదో ఎట్లా

సాధించుకోవాలో ఆ ప్రకారాన్ని / పద్ధతిని ఉపదేశించడం కూడా విధిని కోరుతున్నది అని అంటూ ఫలప్రదాన సమర్థము యాగము కాదు. (అతత్పరము) అని శంకించకూడదు. ఈ విధంగా ఫల సాధనత్వ ప్రకారము అపేక్షింపబడుతున్నప్పటికీ అది శబ్దము వల్లనే తెలుస్తుండగా దాన్ని విడిచిపెట్టడము ఇది వరకెప్పుడూ వినిపించని అపూర్వము అనే దాన్ని మరి కొన్నింటిని కల్పించడాన్నీ (ప్రామాణికులు – ప్రమాణానికి కట్టుబడి ఉండేవాళ్ళు) సహించరు. యజేత ఇత్యాది పదాల్లో ఉండే ధాతువు + లిజ్ + ప్రత్యయము మొదలైనవి కూడా ప్రకృత్యర్థమైన దేవతారాధన రూపమగు యాగాదులకు కర్త యొక్క వ్యాపారము – క్రియ – చేతనే సాధ్యమయ్యే, శబ్దవ్యుత్పత్తి చేత సిద్ధమైన, వ్యాకరణ శాస్త్రము అంగీకరించిన దాన్ని చెప్పుతున్నది. అంతేకాని అలౌకికము ఐనది ఏదో ఫల సాధనము కాదని ప్రథమాధి కరణములోనే చెప్పినాము. ఈ విధంగా వాయుర్వైక్షేపిష్ఠాదేవతా ఇత్యాది శబ్దమువల్ల వాయువు మొదలైన దేవతలకు ఫలప్రదత్వము ఉన్నదని తెలుస్తున్నది. కేవలము అచేతనమైన కర్మయాగము ఫలాన్ని ఇవ్వజాలదు. వాయువు మొదలైనవారి రూపములోనూ పరమ పురుషుడు మాత్రమే పూజింపదగిన వాడుగాను, ఫలాన్ని ఇచ్చేవాడుగానూ ఉంటున్నాడు అని చూపబోయే వాక్యాల ద్వారా తెలియవస్తున్నది. **ఇష్టాపూర్తం బహుధాజాతం జాయమానం విశ్వంబిభర్తి భువనస్య నాభిః. తదేవాగ్నిస్తద్వాయుః తత్సూర్యస్తదు చన్ద్రమాః** అని. ఈ లోకాలన్నింటికీ జన్మకారణమైన వాడు ఇష్టములు (యజ్ఞాలు) పూర్తములు (బావులు త్రవ్వించడము) మొదలైనవాటిద్వారా బహుప్రకారములుగా పుట్టినవాటిని పుట్టబోయే ప్రాణులనున్నూ బ్రతికించుతున్నాడు. ఆయనయే అగ్నిదేవుడు. ఆయనయే వాయువు. ఆయనయే సూర్యుడూ చంద్రుడున్నూ. ఇక అన్తర్యామి బ్రాహ్మణములోనూ **యోవాయౌతిష్ఠన్ యస్యవాయుశ్శరీరమ్. యోఽగ్నౌతిష్ఠన్. యఆదిత్యేతిష్ఠన్.** ఇత్యాది వాక్యాలు వినిపిస్తున్నవి. ఇక స్మృతిలో కూడా – **శ్లో॥ యోయోయాం యాం తనుంభక్తః శ్రద్ధయాఽర్చితుమిచ్ఛతి। తస్యతస్యాచలాం శ్రద్ధాంతామేవ విదధామ్యహమ్। సతయాశ్రద్ధయాయుక్తః తస్యారాధనమీహతే। లభతేచ తతః కామాన్ మయైవ విహితాన్ హితాన్.** ఎవడెవడైతే ఏయే స్వరూపాన్ని శ్రద్ధతో అర్చన చేయడానికి ఇష్టపడుతున్నాడో అటువంటి వాళ్ళందరికీ ఆ స్వరూపానికే సమ్బన్ధించిన చెదరని శ్రద్ధను కలిగించుతాను. వాడు ఆ శ్రద్ధతో కూడుకున్నవాడై తనకు నచ్చిన రూపాన్ని

ఆరాధించడానికి పూనుకుంటాడు. తరువాత ఆ స్వరూపారాధన కారణంగా ఆయా స్వరూపాల్లోని దేవతల ద్వారా నేను ఇచ్చిన ఫలాలనే పొందుతున్నారు అని.

**అహంహిసర్వయజ్ఞా నాంభోక్తా చప్రభురేవచ.** అన్ని యజ్ఞాలద్వారా చేయబడే ఆరాధనలను, ఇవ్వబడే హవిస్సులనున్నూ నేనే స్వీకరించుతున్నాను. అంతేకాదు ప్రభువును కూడా నేనే. ప్రభువు అనగా ఫలాలను ఇచ్చేవాడు అని అర్థము. **దేవాన్ దేవయజో యాన్తి మద్భక్తా యాన్తి మామపి। యాన్తి మద్యాజినోఽపిమామ్.** దేవతలను పూజించేవాళ్ళు ఆయా దేవతల వద్దకు పోతున్నారు. నా భక్తులు నా దగ్గరకు వస్తున్నారు. నన్ను గురించి యజ్ఞాలు చేసేవారు కూడా నా దగ్గరకే వస్తున్నారు అనిన్నీ చెప్పినారు.

లోకంలో కూడా వ్యవసాయము, చేతి పనులు మొదలైనవాటి ద్వారా వింత వింత రూపాల్లో ఉండే వస్తువులను సిద్ధము చేసుకొని వాటితో రాజుగార్ని భృత్యుడి ద్వారానో లేక తానే నేరుగానో ఆరాధన చేస్తున్నారు ప్రజలు. వారిచే అర్చింపబడిన రాజుగారు వాళ్ళ వాళ్ళ ఆరాధనకు అనుగుణంగా ఫలాన్ని ప్రసాదించుతూ కనిపిస్తున్నాడు. వేదాన్తాలైతేనో ఇతరములైన ఏ ప్రమాణాల చేత కూడా ఇటువంటి వాడని ఊహించడానికి కూడా అందుబాటులో లేనివాడు అవిద్య మొదలైన దోషాలయొక్క వాసన కూడా లేనివాడు. సహజమైన అనవధికమైన అతిశయమైన అపరిమితమైన ఉదారగుణాలకు సముద్రము ఐన పురుషోత్తముడిని ప్రతిపాదించి ఆయనను ఆరాధించేవిగా ఉన్న యాగదాన హోమాత్మకాలైన వాటిని, స్తోత్రము చేయడం నమస్కరించడం, కీర్తించడము, అర్చనలు చేయడం, అధ్యయనము చేయడము వంటి వైన ఆరాధనలనున్నూ చెపుతున్నవి. ఆరాధింపబడిన పరమ పురుషుడి నుండి భోగాలు, అపవర్గము రూపాలుగా ఉన్న ఫలాలనున్నూ పొందవచ్చునని చెపుతున్నవి. కనుక విధి వాక్యాలు, అర్థవాద వాక్యాలు, మన్త్రవాక్యాలున్నూ చక్కగా పొసగుతున్నవి. కనుక ఫలప్రదాత శ్రీమన్నారాయణుడే కాని కర్మలు కావు. అపూర్వమూ కాదు. **ఇది ఫలాధికరణము.**

**ఇంతటితో శ్రీభాష్యమునందు తృతీయాధ్యాయములోని**

ద్వితీయపాదము ముగిసినది.

శ్రీమతే రామానుజాయనమః

## శ్రీభాష్యము – తృతీయాధ్యాయము – తృతీయపాదము

### సర్వవేదాన్త ప్రత్యయాధికరణము

సూ॥ **సర్వవేదాన్త ప్రత్యయం చోదనాద్యవిశేషాత్ 3-3-01** అన్నివేదాన్తాల యందు కనిపించేది ఒక్కటే. చోదనాదులు ఏమీ తేడా లేకుండా ఉంటున్నాయి కనుక. బ్రహ్మను ఉపాసించాలి అనే కోరిక కలుగడం కొరకు చెప్పవలసిన అంశము బ్రహ్మ ఉపాసనకు తగినట్లు ఫలాలను తప్పక ఇస్తాడు అనేంతవరకు చెప్పడం జరిగింది. ఇప్పుడు బ్రహ్మను ఉపాసన చేసే విద్యలలో గుణోపసంహారమా? లేక వికల్పమా? అని నిర్ణయించడము కొరకు విద్యలలో భేదము ఉన్నదా? లేదా? అనే విచారము ప్రారంభింపబోతున్నారు. (ఒకచోట చెప్పినదాన్ని ఇంకొకచోట ఉపయోగించుకోవడానికి గాను స్వీకరించడాన్ని **ఉపసంహారము** అని అంటారు. ఆయా ప్రదేశాల్లో చెప్పబడిన వాటికి అక్కడ మాత్రమే ఉపయోగము ఉన్నట్లయితే దాన్ని **వికల్పము** అని చెప్తారు. మొత్తమ్మీద విద్యలలో భేదము లేకపోతే ఉపసంహారము భేదము ఉన్నట్లయితే వికల్పము) ముందుగా అనేక శాఖలలో వైశ్వానర విద్య వినిపిస్తున్నది. ఐతే అది ఒక్కటేనా? లేక దానిలో భేదమున్నదా? అని విచారము చేయబడుతున్నది. విశేషమంటూ ఏమీ లేకుండా మాటిమాటికి వినిపిస్తుండడము, వేరువేరు ప్రకరణాలలో ఉండడమనేది భేదాన్ని తెలుపుతున్నది. మరొక శాఖలోనూ రెండూ అవర్జనీయాలే అవుతున్నందున విద్యా భేదమే అని తేలింది. కనుకనే **తేషామేవ ఏతాంబ్రహ్మ విద్యాంవదేత శిరోవ్రతం విధివద్యైస్తుచీర్ణమ్.** వారికి మాత్రమే ఈ బ్రహ్మ విద్యను ఉపదేశించాలి. ఎవ్వరైతే శాస్త్రము ప్రకారము శిరోవ్రతాన్ని పాటించినారో అని శిరోవ్రతాన్ని ఆచరించినవారికే అదీ ఆధర్వణికులకే విద్యా ఉపదేశనియమము చెల్లుతుంది. విద్య ఒక్కటే అయితే విద్యకు అంగమైన శిరోవ్రతము ఇతర శాఖలవారికీ కూడా ఆచరించాల్సి ఉంటుంది కనుక నియమము వర్తించదు. అని పూర్వపక్షము సిద్ధముకాగా సర్వవేదాన్తాలలో కనిపించినా అది ఒక్కటే ఉపాసనము విద్య అని చెప్పబడుతున్నది. ఎందువల్ల? అని అంటే. చోదనాదులలో విశేషము కనిపించడము లేదు కాబట్టి. చోదనా అంటే ఉపాసీత, విద్యాత్ ఇటువంటి అర్థాన్ని ఇచ్చే ధాత్వర్థము యొక్క విశేషమైన విధి. ఆది శబ్దము చేత **ఏకంవా**

**సంయోగరూప చోదనా ఆఖ్యాఽవిశేషాత్** అని పూర్వ మీమాంసలోని కర్మకాండ శాఖాన్తరములోని అధికరణ సూత్రము చేత చెప్పబడిన సంయోగము రూపము ఆఖ్యలు గ్రహింపబడుతున్నవి. ఈ విధమైన చోదనాదులలో విశేషము లేనందువల్ల మరొక శాఖలో కనబడినప్పుడు అదీ ఇదీ ఒక్కటే అని గుర్తింపు చేయబడుతున్నది. అది ఇట్లాగా ఉన్నది - ఛాన్దోగ్యవాజసనేయక శాఖలయందు **వైశ్వానరముపాస్తే** వైశ్వానరుడిని ఉపాసించుతున్నాడు అని చోదన ఒక్కటిగానే ఉన్నది. వేద్యుడు (తెలియదగినవాడు) చేత మాత్రమే నిరూపించదగిన స్వరూపము విది ధాతువునకు పర్యాయమైన ఉపాస్య అనే దానికిన్నీ వేద్యుడైన వైశ్వానరుడు ఒక్కడే ఐనందువల్ల రూపము కూడా భేదము లేకుండానే ఉన్నది. కనుక రూపము కూడా అవిశిష్టమే. ఆఖ్య కూడా వైశ్వానర విద్యా అనేదే కనుక తేడాలేదు. ఫలసంయోగము కూడా రెండింటిలోనూ బ్రహ్మప్రాప్తి రూపమే. అందులోనూ భేదము లేదు. కనుక ఈ గుర్తులను బట్టి మరొక శాఖలో ఉన్నా అది ఒక్కటే.

అవిశేషపునః శ్రవణము, వేరు ప్రకరణము ఐనందువల్ల, విధేయము నందు భేదము కనపడుతున్నందువల్ల విద్య ఒక్కటేనని అనకూడదు అని ఏమాట చెప్పినారో దాన్ని వివరించి తోసిపుచ్చుతున్నారు.

సూ॥ **భేదాత్ న ఇతిచేత్ ఏకస్యామపి 3-3-2** విధేయము నందు భేదమున్నది కనుక విద్య ఒక్కటే అనకూడదు అని అంటేకాదు. ఒక్క విద్యలోనూ ప్రతిపత్తి యొక్క భేదాన్ని బట్టి పునః శ్రుతి ఉంటున్నది కాబట్టి ప్రకరణాన్తరమనుట చెల్లుతుంది. విశేషము ఏ మాత్రము లేకుండా పునఃశ్రుతి ఉన్నందుచేత ప్రకరణాన్తరము కావడము వలన విధేయభేదము వల్లనున్నూ విద్యఒక్కటే అనడము కుదురదు అని అన్నట్లయితే ఒక్క విద్య యందు కూడా ప్రతి పత్తయొక్క భేదాన్ని బట్టి పునఃశ్రుతి ప్రకరణాన్తరమని అనడం చెల్లుతుంది. (ప్రతి పత్త అనగా ఆయా శాఖలను అధ్యయనం చేసే పురుషుడు) ఎక్కడైతే ఒక ప్రతిపత్త విషయంలో పునఃశ్రుతి ప్రకరణాన్తరమున్నూ ఉంటున్నదో అక్కడ మరొక్క తీరుగా పొసగడం లేదు కాబట్టి (అన్యథా అనుపపత్తి) విధేయము నందు భేదము ఉంటున్నది కనుక విద్యాభేదము ఉంటున్నది. ప్రతిపత్తలో భేదము ఉన్నప్పుడు అతనికి ప్రతిపత్తి కొరకు పునఃశ్రుతి మొదలైనవి పొసగుతున్నవి కనుక అక్కడ మరొక విధేయము పుట్టదు.

శిరోవ్రతము కల ఆధర్వణికులకు మాత్రమే విద్యోపదేశము చేయాలి అనే నియయము కనిపించుతున్నది కనుక విద్యాభేదము తోస్తున్నది అని ఏమాట అన్నారో ఆ విషయంలో చెపుతున్నారు.

సూ॥ **స్వాధ్యాయస్యతథాత్వేహి సమాచారేఽధికారాచ్చ సవవచ్చ తన్నియమః 3-3-3** స్వాధ్యాయానికి మాత్రమే సంస్కారాన్ని పొంది ఉండాలి అనేది సిద్ధించడం కోసం శిరోవ్రతోపదేశనియమమున్నది. సమాచారము అనే గ్రన్థములో అధికారము ఉండాలి అని చెప్పినందువల్ల. సవహోమాల వలెనే ఆ నియయము వర్తిస్తుంది. నీవు అన్నట్లుకాదు. శిరోవ్రతనియమం కనపడడము విద్యాభేదాన్ని తోచేట్లు చేస్తున్నది అని. అసలు శిరోవ్రతము విద్యాఅంగము కాదు. స్వాధ్యాయానికి మాత్రమే శిరోవ్రతాన్ని కలిగి ఉండడము ఒక నియమముగా ఉన్నది. స్వాధ్యాయానికి తథాత్వము – శిరోవ్రతము చేయడం వలన పుట్టిన సంస్కారాన్ని కలిగి ఉండడము అనేది సిద్ధించడము కొరకు శిరోవ్రతోపదేశనియమము ఉన్నది. కానీ విద్యకు కాదు. ఎందువల్ల ఈ విషయము తెలుస్తున్నది అని అంటే **నైతదచీర్ణవ్రతోఽధీతే.** దీన్ని వ్రతమును ఆచరించనివాడు చదువడు. అని దానికి అధ్యయనముతో సంయోగమున్నది కనుక. సమాచారము నందు అధికారము వలన – "**సమాచారము**" అనే గ్రన్ధములో **ఇదమపి వేదవ్రతేన వ్యాఖ్యాతమ్** ఇది కూడా వేదవ్రతముతో పాటు వ్యాఖ్యానము చేయబడింది. అని అతిదేశము చేయబడింది. (అతిదేశము అనగా **అన్యత్రైవప్రణీతాయాః కృత్స్నాయాః ధర్మసంహతేః। అన్యత్రకార్యతః ప్రాప్తిః అతిదేశః సఉచ్యతే** ఒక దగ్గర చెప్పబడిన ధర్మాల సముదాయమంతా మరొక్కచోట అవసరాన్ని బట్టి చేరడమే అతిదేశము అనబడుతుంది అని చెప్పబడింది. ఇది ఇవ వత్ వంటి సాదృశ్యవాచకాలైన శబ్దాలతో కనిపిస్తుంది. ప్రకృతి వత్ వికృతిః కర్తవ్యాఇత్యాదులు దీనికి ఉదాహరణ. ఇది ఐదు విధాలు 1) శాస్త్రాతిదేశము 2) కార్యాతిదేశము 3) నిమిత్తాతిదేశము 4) వ్యపదేశాతిదేశము 5) రూపాతిదేశము.) **తేషామేవైతాం బ్రహ్మ విద్యాం వదేత.** వారికి మాత్రమే ఈ బ్రహ్మ విద్యను చెప్పాలి. బ్రహ్మ విద్య అనగా వేదవిద్య అని అర్థము. సవవచ్చతన్నియమః. ఏవిధంగానైతే సవహోమాలు సప్త సూర్యాదులు శతౌదనము వరకు ఉన్నట్టివి, అధర్వణ శాఖీయులకు ఒకే అగ్నితో సమ్బన్ధము కలవి ఆ ఒక్క అగ్నిలో చేయబడుతున్నవో అట్లాగే. త్రేతాగ్నులలో కావు. (దక్షిణాన్ని గార్హపత్యాగ్ని ఆహవ నీయాగ్ని) సవహోమాలు అనేవి సోమరసముతో చేయబడేవి. అవి సప్తసూర్యాదులు.

1) ఆరోగము 2) భ్రాజము 3) పటరము 4) పతంగము 5) స్వర్ణరము 6) జ్యోతిషీమాన్ 7) విభాసము. వీటన్నింటిలో సూర్యుడే దేవత. శతౌదనము అనేది ఒక కర్మ. సప్త సూర్యహోమాలతో మొదలయ్యి శతౌదనముతో పూర్తి అవుతవి. ఇవి అధర్వ వేదానికి చెందినవారు ఒకే అగ్నిలో ఆచరిస్తారు. కాని త్రేతాగ్నులలో కాదు. వాటిలో వలెనే శిరోవ్రతనియమము వర్తించుతుంది.

సూ॥ **దర్శయతి చ 3-3-4** ఉపాసన సర్వవేదాన్తాలలో కనిపిస్తున్నది అని శ్రుతి చూపుతున్నది. ఉపాసనము సర్వవేదాన్తాల్లో ప్రతీతమవుతున్నదని వేదము చూపించుతున్నది. అది ఇట్లాగా - ఛాన్దోగ్య ఉపనిషత్తు నందు **తస్మిన్ యదన్త స్తదన్వేష్టవ్యమ్** దానిలోపల ఏది ఉన్నదో దాన్ని అన్వేషించాలి అని చెప్పి **కింతదత్రవిద్యతే యదన్వేష్టవ్యమ్** అన్వేషించదగినది ఇక్కడ ఏమున్నది. అని ప్రశ్న వేసుకొని అపహత పాప్మత్వాది గుణములతో విశిష్టుడైన పరమాత్మ దానిలో ఉపాసింపదగినవాడు అని చెప్పబడింది. తైత్తిరీయ ఉపనిషత్తులో మాత్రము ఛాన్దోగ్యములో ఉన్న / చెప్పబడిన ప్రతివిషయాన్ని బలపరచి **తత్రాపి దహ్రమ్ గగనం విశోకః తస్మిన్ యదన్తః తదుపాసితవ్యం** అందులోనూ దహ్రము అనే ఆకాశము ఉన్నది. అది ఎటువంటి దిగులు లేనటువంటిది. దానిలోపల ఏది ఉన్నదో దానిని ఉపాసించవలసి ఉన్నది. అని గుణాష్టకముతో విశిష్టుడైన పరమాత్మ ఉపాసనము చెప్పబడుతున్నది. అందువల్ల రెండుచోట్లా ఉన్న విద్య ఒక్కటే ఐనందువలన గుణోప సంహారము చెల్లుతున్నది.

అందువల్ల ఇట్లా శాఖాన్తర అధికరణ సిద్ధమైన విద్యైక్యతను స్థిరపరచి దాని ప్రయోజనాన్ని చెప్పుతున్నాడు.

సూ॥ **ఉపసంహారోఽర్థాభేదాత్ విధిశేషవత్ సమానేచ 3-3-05** గుణోప సంహారము చేసుకోవాలి. అర్థములో ప్రయోజనములో భేదము లేదు కాబట్టి. విధిశేషము లాగా. సమానమైనప్పుడున్నూ. ఈ విధంగా సర్వవేదాన్తాలయందు ఉపాసనము - బ్రహ్మ విద్య - సమానమైనప్పుడు అనగా పేరు, ఫలము, విద్య సమానమైనప్పుడు - వేరు ఉపనిషత్తులలో చెప్పబడిన గుణాలను మరొకవేదాన్తములో స్వీకారము చెయ్యాలి. ఎందువల్ల? అని అంటే విధిశేషము వలె అర్థములో భేదము లేదు కాబట్టి. ఒక వేదాన్తములో వినిపించిన వైశ్వానర, దహరాది విధులకు సమ్బన్ధించిన గుణము ఆ విద్యతో సమ్బన్ధము ఉన్నందువల్ల దానికి తోడ్పడుట (ఉపకారము) రూపమైన ప్రయోజనము సిద్ధించుట కొరకు ఏవిధంగా అనుష్ఠించబడుతున్నదో అట్లాగనే

ఇతర వేదాన్తములో చెప్పబడినప్పటికీ ఆవిద్యతో సమ్బన్ధము కలది ఐనందున దానికి సహకరించేదిగానే ఉంటున్నది కాబట్టి తెచ్చిపెట్టుకోవాలి అని అర్థము. ఈ సూత్రములో చకారము అవధారణను చెప్పుతున్నది. **ఇది సర్వవేదాన్త ప్రత్యయాధికరణము**

★ ★ ★

## ఇక అన్యథాత్వ అధికరణము

సూ॥ **అన్యథాత్వం శబ్దాదితి చేన్న. అవిశేషాత్ 3-3-6** వేరే విద్యఐ ఉండడము శబ్దము వల్ల తేటపడుతున్నది అన్నట్లయితే కాదు. విశేషము లేదు కాబట్టి విద్య ఒక్కటే. ఈ విధంగా చోదనాదుల్లో విశేషము లేదు కాబట్టి విద్యఒక్కటే. ఒక్కటే ఐనప్పుడు గుణాలను ఇక్కడకు తెచ్చిపెట్టుకోవాలి అని చెప్పబడింది. దీని తరువాత కొన్ని విద్యలను గురించి ప్రత్యభిజ్ఞకు కారణమైన చోదనాదులలో అవిశేషము / ఐక్యత ఉన్నదా? లేదా? అని నిరూపించి నిర్ణయాన్ని చేస్తున్నారు.

**ఉద్ గీథము: ఉద్ గాతచేతపాడబడే సామవేదభాగము. ప్రస్తావము 2) ఉద్గీథము 3) ప్రతిహారము 4) ఉపద్రవము 5) నిధనము. ఉద్గాత: హోమకుండము వద్ద సామవేదాన్ని గొంతెత్తి పాటే ఋత్విక్కు.**

వాజసనేయశాఖలో ఛాందోగ్యములోనూ ఉద్గీథవిద్య ఉన్నది వాజసనేయులకు **ద్వయాహ ప్రాజాపత్యాః దేవాశ్చ అసురాశ్చ.** ప్రజాపతి సమ్బన్ధులు। పుత్రులు రెండురకాలుగా ఉన్నారు. వారే దేవతలు అసురులు అని మొదలుపెట్టి **తేహ దేవాఊచుః హన్త అసురాన్ యజ్ఞే ఉద్గీథేన అత్యయామ.** ఆ దేవతలు అన్నారు. ఆహా! ఎంత అదృష్టము. యజ్ఞములో ఉద్గీథము ద్వారా అసురులను మించుదాము. (గెలుద్దాం) అని అసురులను ధ్వంసము చేయడానికి ప్రతిజ్ఞ చేసి ఉద్గీథము నందు వాక్కు మొదలుకొని మనస్సు వరకు దృష్టిని నిలిపి అసురులకు పరాభవాన్ని చెప్పి **అథహ ఇమ మాసన్యం ప్రాణమూచుః** ఇక తరువాత తమకు దగ్గరగా ఉన్న ప్రాణముతో ఈ విధంగా చెప్పినారు. ఇత్యాది వాక్యాల ద్వారా ఉద్గీథము నందు ప్రాణదృష్టితో అసురులయొక్క పరాభవాన్ని చెప్పి **భవత్యాత్మనా. పరాఽస్యద్విషన్ భ్రాతృవ్యోభవతి. యఏవం వేద.** నాకు శతృవైన సోదరుడు పరాభవాన్ని పొందుతాడు. స్వయంగా తాను గెలిచే శక్తిని పొందుతాడు. ఎవడు దీన్ని తెల్సుకుంటాడో! అని శతృవులు ఓడిపోవడమనే ఫలము సిద్ధించడము కొఱకు ఉద్గీథము నందు ప్రాణము అనే దృష్టిని

నిలిపినారు. ఇదే తీరుగా ఛాన్దోగ్యములో కూడా **దేవాసురా హ యత్ర సంయేతిరే.** దేవాసురులు ఎక్కడ యుద్ధాన్ని చేసినారో అని ప్రారంభించి **తద్ధదేవాః ఉద్గీథ మాజహ్రుః అనేన ఏనాన్ అభిహనిష్యామః** అప్పుడు దేవతలు ఉద్గీథాన్ని పిలిచినారు. దీని ద్వారా శతృవులైన వీరిని చంపుదాము అని ఉద్గీథముతో అసురులయొక్క పరాభవాన్ని ప్రతిజ్ఞ చేసి వారివలెనే ఉద్గీథము నందు వాగాది దృష్టి నిలిపితే దోషము కలుగుతుందని చెప్పి **అథహ యఏవాయం ముఖ్యఃప్రాణః తముద్గీథముపాసాం చక్రిరే.** తరువాత ఏదైతే ముఖ్యప్రాణము ఉన్నదో దాన్ని ఉద్గీథముగా ఉపాసన చేసినారు. ఇత్యాది వాక్యముతో ఉద్గీథము నందు ప్రాణదృష్టితో అసురులకు పరాభవాన్ని చెప్పి **యథాఽశ్మానమాఖణంబుత్వావిధ్వంసతే యఏవం విదిపాపం కామయతే.** ఏ విధంగానైతే మట్టిముద్ద గుండ్రాతిని ఢీకొని విధ్వంసాన్ని పొందుతున్నడో అట్లాగా దీన్ని తెల్సుకున్నవాని గురించి ఎవడు పాపము (చెడును) కోరుతాడో వాడు మట్టిముద్దవలె నాశనము అయ్యిపోతాడు. అని శతృవులు పరాభవము పొందుట కొరకు ఉద్గీథము నందు ప్రాణదృష్టిని నిలిపినారు. వేదన విషయానికి సమ్బన్ధించి విధి ప్రత్యయము వినిపించకున్నా ఫలాన్ని సాధించినదని వినిపిస్తున్నది కాబట్టి వేదనకు సమ్బన్ధించిన విధి కల్పింపబడుతున్నది. ఉద్గీథ విద్య క్రతువు కొరకై నందువల్ల క్రతువుతో సాద్గుణ్య ఫలము కలదని చెప్పినా అర్థవాదానికి చెందిన ఫలము దానికి / క్రతువుకు విరుద్ధంగా కాకుండా గ్రహించవలసిందే అని పూర్వ మీమాంసలోని దేవతాధికరణములో ప్రతిపాదింపబడింది.

దీనివద్ద సంశయము ఏర్పడుతున్నది. ఇక్కడ అనగా పైన ఉదాహరించిన చోట్లలో విద్యకు ఐక్యత ఉన్నదా? లేదా? అని ఏది తగును అని అంటే విద్యైక్యమనియే. ఎందువల్ల నంటావా? రెండుచోట్లలో కూడా ఉద్గీథము నందు ప్రాణముగా ఆరోపించి ఉపాసించినారని వినిపిస్తున్నది. చోదనాదులలో విశేషము లేదు కాబట్టి. ఇక ఫలసంయోగము ఐతే శతృవులను ఓడించడమే గనుక తేడా ఏమీ లేదు. రూపము కూడా ప్రాణభావమును ఆరోపించిన ఉద్గీథము ఒక్కటే కాబట్టి. విశేషము ఏమీ లేదు. చోదన కూడా విది ధాతువు యొక్క అర్థము నందు చేరియున్నది కాబట్టి అది కూడా విశేషము లేనిదే. ఆఖ్య ఉన్నూ ఉద్గీథ విద్య అని విశేషము బొత్తిగా లేనిదే.

ఇక్కడ సిద్ధాన్తిచ్ఛాయలో సంశయించి దాన్ని తొలగించుతున్నాడు. అన్యథాత్వం శబ్దాద్ ఇతిచేన్న అవిశేషాత్ అని. విద్య ఐక్యము అని ఏది మీరన్నారో

అది చెల్లదు. రూపభేదము ఉన్నది కాబట్టి. రూపము వేరుగా ఉండడమనేది శబ్దము వల్లనే తోస్తున్నది. వాజసనేయక శాఖలో కదా! **అథహఇమమాసన్యం ప్రాణము వాచత్వమ్నః ఉద్గాయేతి. తథేతి తేభ్య ఏషప్రాణ ఉదగాయత్.** దగ్గరగా ఉన్న ఈ ప్రాణముతో అన్నారు. నీవు మా కోసం గొంతెత్తిపాడు అని. అట్లాగేనని ఒప్పుకుని వాళ్ళ కొరకు ఈ ప్రాణము ఎలుగెత్తి పాడినది. అనే వాక్యాన్ని బట్టి ఉద్గానము చేసిన కర్త యందు ప్రాణదృష్టి ఏవమ్ అనే శబ్దాన్ని బట్టి తెలియవస్తున్నది. ఇక ఛాన్దోగ్యము నందు **అథహయ ఏవాయం ముఖ్యః ప్రాణః తముద్గీథము సాం చక్రిరే.** ఇక ఏదైతే ముఖ్య ప్రాణము ఉన్నదో దాన్ని ఉద్గీథముగా ఉపాసన చేసినారు. అని ఉద్గానాన్ని కర్మార్థములో ప్రాణముగా దృష్టి చూపి అసురులకు పరాభవాన్ని చెప్పి యఏవం విదపాపం కామయతే అని ఏవం శబ్దము వలన కర్మార్థములోనే ఉద్గీథము నందు ప్రాణదృష్టిని చూపినారు. అందువల్ల ఒకచోట "**కర్త్రర్థములో ప్రాణదృష్టి**" శబ్దాన్ని బట్టి మరొకచోట "**కర్మార్థములో ప్రాణదృష్టి**" శబ్దము వలన రూపము వేరేవేరు కావటము తేటగా తెలుస్తున్నది. రూపము మరొక తీరు ఐనప్పుడు విధేయభేదము ఉంటుండగా కేవలం చోదనాదులు భేదము లేకుండా ఉన్నప్పటికీ ప్రయోజనము ఏమీ లేదు కనుక విద్యాభేదమే ఐక్యము కాదు. అని అన్నట్లయితే కాదు. విశేషము లేకుండానే రెండు చోట్లలోనూ ఉద్గీథమును సాధనముగా కలిగి పరుల యొక్క పరిభవము ఉపక్రమము నందు కనపడుతున్నది.

వాజసనేయకము నందు **తేహదేవా ఊచుః హన్త అసురాన్ యజ్ఞే ఉద్ గీథేన అత్యయామ** అని ఆరంభము నందు వినిపించుతున్నది. ఛాన్దోగ్యములో కూడా **తద్హదేవా ఉద్గీథమాజహ్రు రనేన ఏనాన్ అభిహనిష్యామః** అని. కనుక ఉపక్రమముతో విరోధం రాకుండా **తేభ్యఏషప్రాణ ఉదగాయత్** అని ఆరోపింపబడిన ప్రాణభావము కల ఉద్గీథము ఉద్గానానికి కర్మ ఐనటువంటిదే. పాకాదుల యందు ఓదనము – అన్నము వలె – అధికమైన సౌకర్యాన్ని చెప్పదల్చుకుని కర్తృత్వము చెప్పబడుతున్నది. లేకపోతే ఉపక్రమములో ఉన్న ఉద్గీథ శబ్దము కర్త్రర్థములో లాక్షణికము (అముఖ్యము) కావలసి వస్తుంది. కనుక విద్యైక్యమే సాధారణంగా అన్నాన్ని వండుతున్నాడు అని అన్నప్పుడు బియ్యాన్ని అన్నముగా అయ్యేటట్లుగా చేస్తున్నాడని అర్థమే కాని ఐన అన్నాన్ని తిరిగి వండడం చెయ్యడం లేదు. అట్లే అని గమనించాలి. అని పూర్వ పక్షము ఏర్పడితే చెపుతున్నారు.

సూ॥ **నవా ప్రకరణ భేదాత్ పరోవరీయస్త్వాది వత్ 3-3-7** లేదు. విద్యైక్యము అని భావించవద్దు. ప్రకరణ భేదము ఉన్నది. పరోవరీయస్త్వాదుల వలె. నవా అనేది పక్షాన్ని తొలగిస్తున్నది. విద్యైక్యము అనేది లేదు. ఎందువల్ల నంటే ప్రకరణ భేదమున్నది కాబట్టి. **ఓమిత్యేతదక్షరముద్గీథము పాసీత** ఓమ్ అనే ఒక అక్షరము గల ఉద్గీథాన్ని ఉపాసించాలి. అని ప్రస్తుతమైన ఉద్గీథానికి అవయవమైన ప్రణవాన్ని ప్రశంసించి **ఏతస్యైవా క్షరస్యఉపవ్యాఖ్యానంభవతి. దేవాసురా హ వై యత్ర సంయేతిరే.** ఈ అక్షరానికి ఉపవ్యాఖ్యానము – సన్నిహితంగా వివరించడము – చేయబడుతున్నది దేవాసురులు ఎక్కడైతే యుద్ధాన్ని చేసినారో అని మొదలుపెట్టి **అథహ యఏవాయం ముఖ్యః ప్రాణః తముద్గీథము పాసాం చక్రిరే** అని ఉద్గీథానికి అవయవమైన ప్రాణానికి చెందిన ఉపాసనాన్ని ఛాన్దోగ్యులు చదువుతున్నారు. వాజి శాఖీయులైతేనో – వారికి ఉన్నట్లు ప్రాచీనమైన (ముందరి) ప్రకరణము లేదు కాబట్టి **హన్తా సురాన్ యజ్ఞ ఉద్గీథేన అత్యయామ** అని మొత్తము ఉద్గీథమును ప్రస్తుతించి **అథహేమ మాసన్యం ప్రాణమూచుస్త్వంన ఉద్గాయ** అని నిండు ఉద్గీథములోని విషయాన్ని చదువుతున్నారు. కనుక ప్రకరణ భేదము ఏర్పడుతున్నది. దానితో విధేయ భేదము. విధేయ భేదము ఏర్పడితే రూపభేదము తప్పనిసరి. కనుక విద్యైక్యము లేదు. ఇంతేగాకుండా **అథహ ఏవాయం ముఖ్యః ప్రాణః తముద్గీథము పాసాం చక్రిరే.** తొలుత ఎత్తుకోబడిన ఉద్గీథానికి అవయవమైన ప్రణవమే ఆరోపింపబడిన ప్రాణభావము కలది ఛాన్దోగులకు ఉపాస్యమవుతున్నది. వాజసనేయ శాఖ వారికి మాత్రము ఉద్గీథము మొత్తము కర్త. ఉద్గాత. అదే ప్రాణదృష్టితో ఉపాస్యమవుతున్నది అని. **అథ హేమమాసన్యం ప్రాణమూచుః త్వంన ఉద్గాయఇతి. తథేతి తేభ్య ఏషప్రాణ ఉదగాత్** అని ఉద్గాత యందు ప్రాణాధ్యాసాన్ని పేర్కొని **యఏవం వేద** అని ఉద్గాతనే ప్రాణముగా ఆరోపింపబడినవాడై ఉపాస్యుడుగా విధింపబడుతున్నాడు. ఇందువల్ల రూపభేదము కలుగుతున్నది. ఐతే ఉద్గాత ఉపాస్యుడుగా విధింపబడినప్పుడు **ఉద్గీథేనాత్యయామ** అని ఆఖ్యాయికతో (చిన్నకథ) ఉపక్రమ విరోధము వస్తుంది కదా అని సందేహపడవద్దు. ఉద్గాతను ఉపాసించినప్పుడు ఉద్ గీథానికి ఉద్గానానికి (గొంతెత్తి పాడుట) కర్మఐనట్టిది. తప్పక అవసరమై ఉంటుంది కాబట్టి అది కూడా శత్రువులను ఓడించడమనే ఫలానికి హేతువవుతున్నది. కనుక రూప భేదము ఏర్పడ్తున్నందువల్ల విద్యాభేదము ఏర్పడుతున్నది కాబట్టి చోదనాదులతో విశేషము (భేదము) లేకపోయినా విద్యాఐక్యము లేదు. పరోవరీయస్త్వాదివత్ – ఒక్క శాఖ యందైనా ఉద్గీథానికి

అవయవం ఐన ప్రణవము (ఓంకారము) నందు పరమాత్మనుగా తలచడమనే దృష్టి విధానము సమానమే ఐనప్పటికీ ఆ పరమాత్మ హిరణ్మయ పురుషుడు (బంగారము వలె ఆకర్షణీయమైన రూపముగల వ్యక్తి) అనే దృష్టిని పెట్టాలి అని ఆదేశించినందువల్ల పరోవరీయస్త్వ గుణముతో విశిష్టుడుగా దృష్టిని పెట్టండి అని చెప్పడము **మరొకటిగా** (అర్థాన్తరము) అవుతుంది. **పరోవరీయస్త్వము** అనగా వరీయసాంపరః – శ్రేష్ఠమైన వాళ్ళలో అందరికన్నా అధికుడు. అటువంటిభావము, గుణాన్ని కలిగి ఉండడమే పరోవరీయస్త్వము.

సూ॥ **సంజ్ఞాతశ్చేత్తదుక్తమ్. అస్తితుతదపి 3-3-8** ఉద్గీథవిద్య అని సంజ్ఞతో ఐక్యము ఉన్నది కనుక తత్ – ఆ విద్యైక్యము చెప్పబడింది అని అనేట్లయితే తత్ – సంజ్ఞైక్యము విధేయభేదము ఉన్నా ఉండనే ఉన్నది. ఎట్లాగంటే నిత్యాగ్నిహోత్రము నందు అగ్నిహోత్రము అని కుండపాయులు ఐనవారియొక్క అయనాగ్ని హోత్రము నందున్నూ ఉన్నది. ఇంకా ఉద్ గీథ విద్యా అని ఛాన్దోగ్యములోని ప్రథమ ప్రపాఠకమునందు చెప్పబడిన చాలా విద్యలకు పేరు ఉన్నది.

సూ॥ **వ్యాప్తేశ్చసమంజసమ్ 3-3-9** ఛాందోగ్యములోనే ఉత్తర విద్యలలో ప్రణవమే ఉపాస్యముగా వ్యాపించి ఉన్నందువల్ల ఉద్గీథశబ్దము ప్రణవాన్నే సూచిస్తున్నదనడం సమంజసము అవుతున్నది. ఛాన్దోగ్యములోని ప్రథమ ప్రపాఠకము తరువాత చెప్పబడే విద్యలయందు కూడా ఉద్ గీథానికి అవయవమైన, ప్రథమంగా ప్రస్తావించబడిన ప్రణవానికే ఉపాస్యముగా వ్యాప్తి ఉన్నందువల్ల వాటిమధ్యలో ఉన్న **తద్ధ దేవా ఉద్గీథమాజహ్రుః** అని ఉద్గీథ శబ్దము ప్రణవానికే చెందినది కావడము సమంజసము. తగినది. అవయవము నందు సముదాయముగా భావించి ప్రయోగించే శబ్దము పటోదగ్ధః – బట్ట కాలింది ఇత్యాదుల యందు కనిపిస్తున్నది. మొత్తం కాల లేదు. దానిలో ఏదో ఒక మూల కాలినా బట్ట కాలింది అని అనడం మనకు కనిపించుతున్నది కదా! ఇందువల్ల కూడా ఉద్గీథానికి అవయవమైన ప్రణవమే ఉద్గీథ శబ్దముతో నిర్దేశించబడింది. కనుక ఆ ప్రణవాన్నే ప్రాణదృష్టితో ఉపాసించదగింది అని ఛాన్దోగ్యంలో గుర్తించవలసి ఉన్నది. వాజసనేయకము నందైతే మొత్తము ఉద్ గీథానికి చెందినది ఉద్గీథ శబ్దము అని మొత్తము ఉద్గీథమునకు కర్త, ఉద్గాత ప్రాణదృష్టితో ఉపాసించవలసి ఉన్నదని విద్యా ఐక్యత కాకుండా విద్యాన్యథాత్వము సిద్ధించింది. **ఇది అన్యథాత్వ అధికరణము**

★ ★ ★

## ఇక సర్వాభేదాధికరణము

సూ॥ **సర్వాభేదాదన్యత్రేమే 3-3-10** మరొక్క ఉపనిషత్తులో ఇవే గుణాలు ఉన్నవి. కనుక విద్యాభేదము లేదు. అంతా అభేదంగానే ఉన్నందువల్ల. ఛాన్దోగ్యములో వాజసనేయకములోనూ ప్రాణవిద్య పఠింపబడ్తున్నది. **యో హ వైజ్యేష్ఠంచశ్రేష్ఠం చవేద. జ్యేష్ఠశ్చ హ వైశ్రేష్ఠశ్చ భవతి. ప్రాణోవావజ్యేష్ఠశ్చ శ్రేష్ఠశ్చ.** ఎవ్వడైతే జ్యేష్ఠము శ్రేష్ఠము ఐనదాన్ని తెల్సుకొని ఉపాసిస్తాడో వాడు జ్యేష్ఠుడు శ్రేష్ఠుడు కూడా అవుతాడు. ప్రాణమే జ్యేష్ఠము శ్రేష్ఠము. అక్కడ జ్యేష్ఠ గుణము కల ప్రాణాన్ని ఉపాసింపదగినదిగా ప్రతిపాదించి వాక్కు మొదలైనవి. దేహమున్ను ప్రాణముపై ఆధారపడి తమ ఉనికిని కలిగియుంటున్నందున ప్రాణమునకు లొంగి ఆయా ఇంద్రియాలు తమ పనులను చేసుకోగల్గుతున్నందున ప్రాణమే తక్కినవాటికన్నా శ్రేష్ఠమైనది అని ప్రతిపాదించి వాగాదులతో సమ్బన్ధమును కల్గినవిగా వినిపించబడిన వసిష్ఠత్వాదులు ఐన గుణాలను ప్రాణసమ్బన్ధులుగా ప్రతిపాదిస్తున్నది. ఈ తీరుగా ఛాన్దోగ్యవాజసనేయకము లందు జ్యైష్ఠ్య శ్రేష్ఠ్య గుణాలు కల కలవాడు, మరియు వసిష్ఠత్వాదిగుణాలు కలవాడు ఐన ప్రాణము ఉపాస్యుడుగా ప్రతిపాదింపబడినాడు. కానీ వసిష్ఠత్వాది గుణాలు, వాగాది సమ్బన్ధులు ఐనట్టివి ప్రాణసమ్బన్ధములుగా ప్రతిపాదింపబడలేదు. ఇక్కడ సందేహము. ఈ ప్రాణవిద్యలో భేదము ఉన్నదా? లేదా? అని. ఏది యోగ్యము అని అంటే భేదము ఉన్నదనియే. ఎందువల్లనంటే రూపములో భేదము ఉన్నందువలన. రెండింటిలోనూ ప్రాణమే జ్యేష్ఠ శ్రేష్ఠగుణాలు కలదిగా ఉపాస్యము అవుతున్నా ఒకచోట వసిష్ఠత్వాది గుణాలతో కూడి ఉన్న ప్రాణము ఉపాస్యముగా తోస్తున్నది. మరొక చోటనేమో ఆ గుణాలు లేనట్టిది. కనుక ఉపాస్య భేదమువల్ల రూపభేదము దానివలన విద్యాభేదము అని పూర్వపక్షము ఎదురైతే చెప్పబడుతున్నది. వసిష్ఠాదిగుణాలు – వసిష్ఠ = వాక్కు, ప్రతిష్ఠా = చక్షువు, సమ్పత్ = శ్రోత్రము, ఆయతనం = మనస్సు.

సర్వాభేదాదన్యత్రేమే అని. ఇక్కడ విద్యాభేదము లేదు. అన్యత్ర = కౌషీతకీ ఉపనిషత్తులోని ప్రాణవిద్యయందున్నూ ఈ వసిష్ఠత్వాది గుణాలు ఉపాసింపదగినవిగా ఉన్నవి. ఎందువల్లనంటే సర్వాభేదాత్ = ప్రతిజ్ఞ చేయబడిన ప్రాణము యొక్క జ్యైష్ఠ్య ఉపపాదనప్రకారమంతా అక్కడకూడా భేదము ఏమీ లేకుండా ఉన్నది. అది ఇట్లున్నది – ఛాన్దోగ్యవాజసనేయ శాఖీయులయొక్క ప్రాణవిద్యయందు **అహంశ్రేయసే వ్యూదిరే** తానే శ్రేష్ఠమైన దానిని అని వివాదపడినారు వాదించుకున్నారు. **అహంశ్రేయసే**

**వివదమానాః** తానే శ్రేష్ఠమైనదని వాదులాడుతున్నవారై అని మొదలుపెట్టి వాక్కు మొదలైనవి ఒక్కొక్కటి పక్కకు తొలగిపోయినా ప్రాణముతో కూడి ఉన్న వేరువేరు ఇంద్రియాలు శరీరము యొక్క నిలుకడ / స్థితి వాటివాటి పనులలో లోపము లేకపోవుటనున్నూ ప్రతిపాదించి ప్రాణము లేచిపోతే అన్నింటికీ లేకపోవడము పనిచేయలేకపోవడమునున్నూ చెప్పి అందరికీ ప్రాణముపై ఆధారపడి ఉండడము దానికి లొంగి పనులు చేసుకోగల్గడాల ద్వారా ప్రాణము యొక్క జ్యేష్ఠ్య శ్రైష్ఠ్యము ఉపపాదన చేయబడింది. ఈ విధంగా వాగాది కార్యముల యొక్క ప్రాణాధీనత్వము ఉపపాదింపబడగా **అథహ ఏనం వాగువాచ యదహం వసిష్ఠాఽస్మిత్వం తద్వసిష్ఠోఽసి** ఇక ఈ ప్రాణాన్ని గురించి వాక్కు పలికింది. నేను ఎందువలన వసిష్ఠాఽస్మి (నిల్చినదాన్ని) అయినానో నీవు కూడా నావల్ల (నిల్చియున్నావు) వసిష్ఠుడవు ఐనావు. ఇత్యాదివాక్యాల చేత అనువాదము చేయబడింది. కౌషీతకి వాళ్ళ యొక్క ప్రాణవిద్య యందు కూడా ప్రాణము యొక్క జ్యేష్ఠ శ్రేష్ఠములను ప్రతిపాదించడం కొరకు వాగ్ మొదలైన వాటియందు వసిష్ఠత్వాదులు ప్రతిపాదింపబడినవి. **అథ హ ఇమాదేవతాః ప్రజాపతిం పితరమేత్యాబ్రువన్. కోవైనః శ్రేష్ఠః.** తరువాత ఈ దేవతలు ఐన ఇంద్రియాలు తండ్రియైన ప్రజాపతి వద్దకు పోయి మాలో ఎవరు శ్రేష్ఠుడు అని అడిగినారు. ఈ విధమైన వాక్కులతో వాగాదులలో ఉన్న గుణాలు వాగాదులు దేహము కూడా ప్రాణమునకు లొంగి ఉండేవి అని ప్రాణము యొక్క జ్యేష్ఠత ఉపపాదించబడింది. వాక్కు మొదలైన వాటిచేత తమ తమ గుణాలైన వసిష్ఠత్వాదులను గురించి ప్రాణానికి అధీనములై ఉండడాన్ని అనువాదము మాత్రం చేయలేదు. ఇంతమాత్రము చేత రూపభేదము లేదు. వసిష్ఠత్వాదిగుణాలతో కూడిన వాగాదులకు ప్రాణానికి అధీనములై తమ తమ కార్యములను చేసుకోవడాన్ని ఉపపాదించడాన్ని బట్టే ప్రాణము వాగాదుల వసిష్ఠత్వాది గుణాలకు హేతువు అయ్యి ఉండడము సిద్ధించుతున్నది. అదే ప్రాణానికి వసిష్ఠత్వాది గుణయోగిత్వము ఏదైతే వాగాది వసిష్ఠత్వాదులకు హేతువై ఉండడము ఉన్నదో. అందువల్ల ఇక్కడ కూడా వసిష్ఠత్వాది గుణాలతో కలయిక ఉన్నందువల్ల ప్రాణము జ్యేష్ఠము అని తెలియవచ్చింది. కనుక విద్యా భేదము లేదు. **ఇది సర్వాభేదాధికరణము.**

★ ★ ★

## ఇక ఆనందాద్యధికరణము.

ప్రాణవిద్యకు అంగమైన మరొక విషయము కూడా తరువాత నిరూపణ చేయబడగలదు. ప్రస్తుతము ప్రాణము వసిష్ఠత్వాది అనుసన్ధానము లేకుండా జ్యైష్ఠ్య శ్రైష్ఠ్య అనుసన్ధానము కుదరడం లేదు. కనుక వసిష్ఠత్వాదులు చెప్పబడకపోయినప్పటికీ కౌషీతకీ ప్రాణవిద్యయందు ఏవిధంగా లభిస్తున్నదో ఆ విధంగానే బ్రహ్మ స్వరూపాను సన్ధానము ఏ గుణాలు లేకపోతే పొసగదో, ఆ గుణాలు బ్రహ్మ విద్యల యందు అన్నింటియందున్నూ అనుసన్ధించదగినవి అనే అంశము ఇక్కడ ప్రతిపాదింపబడుతున్నది.

సూ॥ **ఆనందాదయః ప్రధానస్య 3–3–11** ప్రధానుడైన పరబ్రహ్మయొక్క ఆనందాది గుణాలు అన్ని విద్యలలోను ఉపసంహారము చేసుకోదగినవే. ఇక్కడ బ్రహ్మ యొక్క స్వరూప గుణాలకు అని పరవిద్యలయందు ఉపసంహారము – తెచ్చిపెట్టుకోవడము – ఉన్నదా? లేదా? అని విచారింపబడుతున్నది. ప్రకరణానికి సమ్బన్ధించని వాటిని ఉపసంహారము చేసుకోవడంలో ప్రమాణము ఏదీ లేదు కనుక ప్రకరణములో వినబడినవాటికే ఉపసంహారము. ఇతరములైన వాటికి ఉపసంహారము లేదు అని పూర్వపక్షము ఎదురైతే చెప్పబడుతున్నది. ఆనందాదయః ప్రధానస్య అని. సూత్రములో అభేదాత్ అనే పదము కూడా ఉన్నది గమనించాలి. ప్రధానుడు గుణవన్తుడు ఐన బ్రహ్మ అన్ని ఉపాసనల్లోనూ భేదము లేక ఒక్కడే అయ్యి ఉన్నందువల్ల, గుణములు కలవానికంటే గుణాలు వేరుగా ఉండనందువల్ల, అన్నిచోట్లలోనూ / అన్ని బ్రహ్మవిద్యల యందున్నూ ఆ గుణాలన్నీ ఉపసంహారము చేసుకోవలసినవే.

ఇట్లా ఐనప్పుడు గుణి కంటే వేరుకాకపోవడం వల్లనే ఆనందాదులవలె ప్రియశిరస్త్వాదులు కూడా **తస్యప్రియమేవశిరః** ఇత్యాదులయందు బ్రహ్మయొక్క గుణాలుగా వినబడినవన్నీ అన్నిటియందున్నూ వచ్చి చేరవలసి ఉంటవి అని అన్నట్లయితే కాదు అని చెప్పినారు.

సూ॥ **ప్రియశిరస్త్వాది అప్రాప్తిః ఉపచయాప చయౌహిభేదే 3–3–12.** ప్రియ శిరస్త్వాది గుణాలు ప్రాప్తించవు. అవి వచ్చిచేరితే బ్రహ్మకు కూడా వృద్ధి క్షయాలు ఏర్పడుతవి. బ్రహ్మయొక్క స్వరూపమైన గుణాలు వచ్చి చేరుతవి అని చెప్పినప్పుడు ప్రియశిరస్త్వాదులకు ప్రాప్తి లేదు. అవి బ్రహ్మ గుణాలు కావు కనుక. ప్రియశిరస్త్వాదులు బ్రహ్మను పురుషాకారముతో పోల్చి చెప్పడంలో మాత్రమే అవి

అన్తర్గతములు – భాగములు – అవుతున్నవి. అట్లా కాకపోయినప్పుడు శిరస్సు పక్షము పుచ్ఛము మొదలైన అవయవములతో భేదము ఏర్పడితే బ్రహ్మకు కూడా పెరుగుదల తరుగుదలలు ఏర్పడుతవి. అట్లా ఐనప్పుడు **సత్యం జ్ఞానము నన్తం బ్రహ్మ** ఇత్యాది వాక్యాలు విరోధులుగా మారుతాయి.

ఇదే విధంగా బ్రహ్మతో సమ్బన్ధము ఉన్న ఐశ్వర్యగామ్భీర్య ఔదార్య కారుణ్యాదులుగా ఉన్న అనన్తమైన గుణాలు గుణి ఐనవాడి నుండి విడిగా ఉండలేనంత మాత్రము చేత ఆ ప్రకరణములో వినిపింపనివి కూడా వచ్చి చేరితే అన్ని గుణాలూ అన్ని బ్రహ్మ విద్యల్లోనూ (చేర వలసి ఉంటుంది) ప్రసక్తములు కావలసి ఉంటవి. పైగా అవి అనన్తాలు కాబట్టి ఉపసంహరింప సమర్థములు కాకపోతవి. అని శంకించితే చెప్తున్నారు.

సూ॥ **ఇతరేత్వర్థ సామాన్యాత్ 3–3–13** ఇతరములైన గుణాలు వస్తువు (బ్రహ్మ) సమానుడు కాబట్టి అన్నింటిలోను అనువర్తించుతవి. తుశబ్దము చోద్యాన్ని తిప్పికొడుతున్నది. ఇతరములైన ఆనందాదులు అర్థము బ్రహ్మ సమానమైనందున అన్నిచోట్లలోనూ అనువర్తిస్తవి. ఏదైతే అర్థసమానములో – అర్థము – వస్తువు – యొక్క స్వరూపాన్ని నిరూపించే ధర్మాలుగా అర్థమును ప్రతీతి చేయడంలో (తెలుపడంలో) అనుబన్ధము కలవిఐ ఉంటున్నవో అవి అర్థము యొక్క స్వరూపము వలె అన్నిచోట్లలోనూ అనువర్తించుతవి. వచ్చిచేరుతుంటవి. అటువంటివైన గుణాలు సత్యము జ్ఞానము ఆనందము అమలత్వము అనన్తత్వాలు. **యతోవా ఇమాని** ఇత్యాది వాక్యము చేత జగత్తుకు కారణమైనవాడుగా ఉపలక్షితుడైన బ్రహ్మ **సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ, ఆనందోబ్రహ్మ** అని ఆనందాదిగుణాలచేత స్వరూపమును బట్టి నిరూపింపబడుతున్నాడు. కనుక ఉపాస్యుడైన బ్రహ్మయొక్క స్వరూపము తెలియడం కొరకు అన్ని విద్యలయందున్నూ ఆనందాదులు అనువర్తించుతవి. ఏవైతే స్వరూపము నిరూపింపబడిన బ్రహ్మలో కారుణ్యము మొదలైన గుణాలు తెలియబడుతున్నవో అవి గుణి యందు విడిగా ఉండలేనివి ఐనప్పటికీ ప్రతీతికి అనుబంధులు కావు కనుక, ఏవి ఎక్కడ వినిపింపబడినవో అవి అక్కడ ఉపసంహరింపబడవలసినవిగా ఉంటాయి. కనుక దోషము ఏమీ లేదు (ఇబ్బంది లేదు)

ఉపచయాపచయాలు వచ్చే ప్రసంగము ఉన్నందున ప్రియ శిరస్త్వాదులు బ్రహ్మ పురుషుడి విధముగా రూపణ కొరకు మాత్రమే చెప్పబడినవి. బ్రహ్మ గుణాలు

కావు. అని అన్నారు కదా! అప్పుడు ఆవిధంగా రూపములేని బ్రహ్మను ఆ విధమైన ప్రియశిరస్త్వాదులు కలవాడు అని నిరూపించడం దేనికి? ఆ విధమైన రూపము లేనివాడిని అట్టివాడినిగా నిరూపించినప్పుడు ఏదో ఒక ప్రయోజనమంటూ ఉండాలికదా! ఎట్లాగైతే **ఆత్మానంరథినంవిద్ధి.** ఇత్యాది పోలిక చేత ఉపాసకుడైన వానికి, వాడికి ఉపకరణాలైన వాటినిన్నీ రథి రథాదులుగా రూపణము (ఆరోపించి చెప్పడము) ఉపాసనకు ఉపకరణాలైన శరీరాన్ని ఇంద్రియాలను వశీకరణము చేసుకోవడం కోసం చెయ్యబడుతున్నది అని చెప్పబడింది. ఇక్కడ అట్లాంటి ఏదైనా ఒక విధమైన ప్రయోజనము కనుపించడము లేదు. కనుక ప్రియ శిరస్త్వాదులను బ్రహ్మ గుణాలని బలవంతంగానైనా అంగీకరించి తీరాలి అని అంటే చెప్తున్నారు.

సూ॥ **ఆధ్యానాయ ప్రయోజనాభావాత్ 3-3-14** వేరే ప్రత్యేకమైన ప్రయోజనము లేదు కాబట్టి ఆధ్యానము – అనుచిన్తనము కొరకు ఉపదేశింపబడుతున్నది. వేరే ప్రత్యేక ప్రయోజనము లేకపోయినా ఆధ్యానము కొరకు ఈ విధమైన రూపణోపదేశము చేయబడుతున్నది. ఆధ్యానమనగా అనుచిన్తనము – అదే ఉపాసనము అని అనబడుతున్నది. **బ్రహ్మ విదాప్నోతి పరమ్.** అనే చోట ఉపదేశింపబడిన ఆధ్యానరూపమైన వేదనము సిద్ధించుటకొరకు ఆనందములను బ్రహ్మను చేరుకోవడం కోసం ఆనందమయుడైన బ్రహ్మను ప్రియ మోదాది రూపంగా విభజించి శిరస్సు పక్షము – రెక్కలు – హస్తాలు మొదలైనవాటినిగా ఆరోపించి చెప్పబడుతున్నది. ఎట్లాగంటే అన్నమయుడైన పురుషుడు దేహము శిరస్సు రెక్కలు మొదలైనవాటితో **తస్యేదమేవ శిరః** ఇత్యాది వాక్యముతో బుద్ధియందు ఆరోపింపబడుతున్నాడు. ఏ విధంగానైతే ప్రాణమయ మనోమయ విజ్ఞానమయులు **తస్యప్రాణఏవ శిరః** ఇత్యాదులతో ప్రాణాది అవయవాలతో బుద్ధి యందు ఆరోపింపబడుతున్నారో అదేవిధంగా వేరొక వస్తువు ఐన ఆ జీవునిలోని అన్తరాత్మ ఐన ఆనందమయుడున్నూ ఒక భాగము ఐన ప్రియమోదాదులతో శిరస్సు మొదలైనవాటినిగా ఆరోపించబడుతున్నాడు. ఈ విధంగా ఆనందమయునికి చెందినవిగా ప్రియశిరస్త్వాదులు ఉపలక్షణాలు అవుతున్నాయి కాబట్టి అవి ఎల్లప్పుడు ఆనందమయుడి ప్రతీతిలో అనువర్తించవు. (ఉపలక్షణము లక్ష్యము ఐన వస్తువులో వెన్నంటి ఉండదు. ఒకప్పుడు సన్నిహితమై ఉంటుంది. మరొకప్పుడు దూరంగా విడిగానూ ఉంటుంది)

సూ॥ **ఆత్మశబ్దా చ్చ 3-3-15** ఆత్మ శబ్దాన్ని ప్రయోగించినందువల్లనున్నూ **అన్యోఽన్తర ఆత్మాఽనన్దమయః** జీవునిలోపల ఉండే మరొకడైన అన్తరాత్మ

ఆనందమయుడు అనే వాక్యమునందు ఆత్మ శబ్దము చేత పరమాత్మ నిర్దేశింపబడు తున్నాడు కనుక ఆత్మకు శిరస్సు రెక్కలు తోక (వెన్ను) మొదలైనవి ఉండవు కావుననూ ప్రియశిరస్త్వాదులు ఆయనను సులభంగా అర్థము చేసుకోవడం కోసము ఆరోపించి చెప్పడం జరుగుతున్నదని తెలియవస్తున్నది.

ఔనండీ! **అన్యోఽన్తరఆత్మా ప్రాణమయః, అన్యోఽన్తర ఆత్మా మనోమయః** అని ఆత్మ శబ్దము (జీవా) ఆత్మల యందున్నూ మునుపు ప్రయోగించబడింది కాబట్టి. **అన్యోన్తర ఆత్మా ఆనన్దమయః** అని ఆత్మ శబ్దము పరమాత్మకు సమ్బన్ధించింది అని ఎట్లా నిశ్చయింపబడుతున్నది? అని అంటే చెపుతున్నాడు.

సూ॥ **ఆత్మ గృహీతిః ఇతరవత్ ఉత్తరాత్ 3–3–16** ఇతర వాక్యాలవలె ఆత్మ శబ్దముతో పరమాత్మనే గ్రహింపబడుతున్నాడు. ఉత్తరవాక్యాన్ని బట్టి **అన్యోఽన్తర ఆత్మా ఆనందమయః** అనేచోట ఆత్మ శబ్దముతో పరమాత్మనే గ్రహింపబడుతున్నాడు. ఇతరవత్ – మిగతా వాక్యాల్లో వలె. **ఆత్మావా ఇదమేక ఏవాగ్రఆసీత్. సఈక్షత లోకన్నుసృజా** ఆత్మ ఒక్కడే సృష్టి జరుగడానికి ముందుకాలములో ఉండినాడు. ఆయన ఈ లోకాలను పుట్టించాలని తలచినాడు. ఇత్యాది వాక్యాలయందు ఆత్మ శబ్దము చేత పరమాత్మనే గ్రహింపబడుతున్నాడు. దానివలెనే అని తెల్సుకోవాలి. ఇట్లా ఎందువల్ల గ్రహించాలి అని అంటే ఉత్తరాత్ – దాని తరువాత వచ్చే వాక్యాన్నిబట్టి, **సోఽకామయత బహుస్యామ్ ప్రజాయేయ** అని ఆనందమయునికి సమ్బన్ధించిన విషయాన్ని తెలిపే ఉత్తరవాక్యము వలన.

సూ॥ **అన్వయాదితిచేత్ – స్యాదవధారణమ్ 3–3–17** మీరు తొలుత చూపించిన వాక్యాల్లో ఆత్మ ఇతరములైన వాటియందు అన్వయించింది కదా! అంటేకాదు. అవధారణము ఉన్నందువల్లనే పరమాత్మ గ్రహింపబడుతాడు. ఈ వాక్యాని కంటే ముందువాక్యాలలో ఆత్మలు కాని వాటియందు ఆత్మ శబ్దము అన్వయించుతూ కనపడుతున్నది కాబట్టి ఉత్తరవాక్యాన్ని బట్టి నిశ్చయము చేయడం కుదరదు అని అనేట్లయితే అవధారణము వలన అవుతుంది. నిశ్చయము తప్పక అవుతుంది. ఎందువల్ల అనగా అవధారణము వలన. పైన చెప్పిన వాక్యానికన్నాముందు **తస్మాద్వాఏతస్మాదాత్మనః ఆకాశస్సమ్భూతః.** ఆ విధంగా సంకల్పము చేసిన ఆత్మ నుండి ఆకాశము పుట్టింది అని పరమాత్మను గురించే బుద్ధిలో నిశ్చయమవుతున్నది. అన్నమయుడికి వేరయిన ప్రాణమయుడియందు మొదట పరమాత్మ బుద్ధి కలిగింది.

దాని తర్వాత ప్రాణమయుడి కంటే వేరయిన మనోమయుడి యందు ఆ తరువాత విజ్ఞానమయుని యందు పరమాత్మ దృష్టి కలిగింది. పిదప ఆనందమయుడిపైన కలిగిన పరమాత్మ భావన ఆయన కంటే పైన మరొకడు లేడు కనుక, దానికి తరువాత వచ్చిన **సోఽకామయత** అనే వాక్యాన్నిబట్టి ఆనందమయుని యందు పరమాత్మ భావన నిలిచిపోయింది. కనుక ఉపక్రమము / మొదట్లో కూడా పరమాత్మ కాని దానియందు పరమాత్మ అనే తలంపుతో ఆత్మ శబ్దము అన్వయాన్ని పొందుతున్నది. కనుక ఏ దోషమూ లేదు అంతా సమంజసమే. **ఇది ఆనందాద్యధికరణము**

★ ★ ★

## ఇక కార్యాఖ్యానాధికరణము

సూ॥ **కార్యాఖ్యానాదపూర్వమ్ 3-3-18** అప్రాప్తమైనదాన్ని చెప్పుతున్నారు కాబట్టి అపూర్వము విధింపబడుతున్నది. ఇంతకుముందు ప్రస్తావించబడిన ప్రాణవిద్యలో మిగిలిన అంశము ఇప్పుడు విచారింపబడుతున్నది. ఛాన్దోగ్య వాజసనేయకములందు జ్యేష్ఠము శ్రేష్ఠము ఐన ప్రాణాన్ని ఉపాసించాలి అని చెప్పి ప్రాణానికి వస్త్రముగా జలాలు చెప్పబడుతున్నవి. ఛాన్దోగ్యములో **సహోవాచకిం మేవాసోభవిష్యతీతి. ఆపఇతిహోచుః తస్మాద్వా ఏతదశిష్యన్తః పురస్తాచ్చోపరిష్టాచ్చ అద్భిఃపరిదధతి. లమ్భుకో హవాసోభవత్యనగ్నో భవతి.** ఇతి ఆ ప్రాణము అన్నది నాకు వస్త్రము ఏది? అని. నీళ్ళు అని వారన్నారు. అందుచేతనే తినడానికి ముందు తిన్న తరువాత నీటితో కప్పుతున్నారు. వస్త్రమును ధరించినవాడు నగ్నుడు కాడు అని. ఇక వాజసనేయకములో **కింమే వాసః ఇతి ప్రాణేనపృష్టా వాగాదయః ఊచుః ఆపోవాసః ఇతి తద్విద్వాంసః శ్రోత్రియాః అశిష్యన్త ఆచామన్తి. అశిత్వా చాచామన్తి. ఏతమేవ తదనమనగ్నం కుర్వన్తో మన్యన్తే. తస్మాదేవం విధమశిష్యన్ ఆచామేత్. అశిత్వాచాచామేత్. ఏతమేవతదనమనగ్నం కురుతే ఇతి.** నాకు బట్ట ఏది అని ప్రాణముచేత ప్రశ్నించబడిన వాగాదులు చెప్పినారు. నీళ్ళే వస్త్రము అని. అందువలన విద్వాంసులు ఐన శ్రోత్రియులు భుజించదల్చుకున్నవారై ముందుగా మంచినీళ్ళను త్రాగుతున్నారు. తరువాత కూడా త్రాగుతున్నారు. ఈవిధంగా ప్రాణాన్ని నగ్నము కాకుండా చేస్తున్నవారై గౌరవిస్తున్నారు. అందువల్ల భుజించకముందు పెద్దలు ఆచమనాన్ని చేస్తున్నారు. కావున తినకముందు తిన్న పిదప ఆచనమం చేయాలి. ఈ నీరే ప్రాణాన్ని నగ్నము కాకుండా చేస్తుంది అని.

ఇక్కడ సంశయము. ఇక్కడ ఆచమనము చెయ్యాలి అని విధించబడుతున్నదా? లేక నీళ్ళు ప్రాణానికి వస్త్రముగా పరిగణన/ అనుసన్ధానం చేయబడుతున్నవా? అని. **అశిష్యన్నాచామేత. అశిత్వాచా చామేత్** అచమన శబ్దముపైన విధిలిజ్ ప్రత్యయము వినిపిస్తున్నది. మరియు **ఏతమేవ తదన మనగ్నం కురుతే** వేదనము తెలియజేయడము నందు విధిలిజ్ ప్రత్యయము లేనందువల్లా, అనగ్నతా సంకీర్తనము ప్రశంసా అర్థముతో అన్వయము కుదురుతున్నందువల్ల, భోజనాంగమైన ఆచమనము స్మృతులలో విధింపబడిన ఆచారము వలన ప్రాప్తమైంది/ వచ్చింది అవడంవలననూ విధి ప్రత్యయము యొక్క బలాన్నిబట్టి ప్రాణవిద్యకు అంగమైన మరొక ఆచమనము విధింపబడుతున్నది అని అంటే చెపుతున్నాము. త్రాగబడే మంచినీళ్ళు ప్రాణానికి వస్త్రాలుగా అనుసంధానము / తలంపు చేయడమే ఇక్కడ "అపూర్వము" అని అనబడుతున్నది. అనగా అప్రాప్తమైనది విధింపబడుతున్నది. కార్యాఖ్యానాత్ఽఅప్రాప్తమైన దాన్ని చెప్పినందువల్ల. అప్రాప్తమైన దాన్ని చెప్పినపుడే శబ్దానికి అర్థము / అర్థవత్త్వము ఉంటుంది. సారాంశమేమిటంటే – కింమేవాసః, ఆపోవాసః అద్భిఃపరిదధతి, ఏతమేవ తదనమనగ్నం కురుతే అని ఉపక్రమ ఉపసంహారాల యందున్న వాక్యాల ద్వారా ప్రాణానికి నీళ్ళు వస్త్రముగా భావించబడడం తెలియవస్తున్నందువల్ల, ఆచమనము స్మృతి, ఆచారాలవల్ల ప్రాప్తమైనందువల్ల ఆచమనాన్ని తిరిగి చెప్పడము వల్ల ఆచమనీయములైన మంచినీళ్ళను ప్రాణానికి వస్త్రమునుగా భావించండి అని ఆదేశించబడుతున్నది అని. కనుకనే ఛాన్దోగ్యమునందు **తస్మాద్వా ఏతదశిష్యన్తః పురస్తాచ్చ ఉపరిష్టాచ్చ అద్భిః పరిదధతి.** అందువల్లనే అన్నాన్ని తినడానికి ముందు తిన్న తరువాతనున్నూ నీటితో కప్పుతున్నారు. అని మంచి నీళ్ళతో కప్పడమే చెప్పబడింది. కాని ఆచమనము కాదు. (అనగా భోజనానికి ముందు, అయిపోయిన తరువాతనున్నూ అడుగున వస్త్రమును ధరించి, పైన ఉత్తరీయాన్ని కప్పినట్లున్నూ మంచినీళ్ళను ఒకానొక మోతాదులో పుచ్చుకోవాలి. మంచినీళ్ళు ప్రాణానికి ఆప్యాయనాన్ని – తృప్తిని, ప్రీతిని – కల్గిస్తవి. మనిషికి వస్త్రాలు అట్లాంటివే. ఇక ఆచమనము శుద్ధి కొరకు చేయబడేది. ఇది మూడుసార్లు కేశవాదినామాలతో లోనికి అరచేతి గుంటెడు / ఉద్ధరిణెడు తీర్థాన్ని పుచ్చుకోవడము. అన్నం తినడానికి ముందూ వెనుక చెప్పబడుతున్నందున ఆచమనము అంటే నీళ్ళు త్రాగడమే అని అర్థము చెప్పుకోవాలి. వైద్యుల మాట కూడా ఇదే. కొందరు తెల్సిన పెద్దలు భోజనానికి నడుమ మంచినీళ్ళు త్రాగరు.) **ఇది కార్యాఖ్యానాధికరణము**

★ ★ ★

## ఇక సమానాధికరణము

సూ॥ **సమాన ఏవం చాభేదాత్ 3-3-19** రెండు విద్యలూ సమానములే. భేదము లేదు కాబట్టి వాజసనేయక శాఖయందు అగ్ని రహస్యములో శాండిల్య విద్య పఠింపబడింది. **సత్యంబ్రహ్మేత్యుపాసీత. అథఖలు క్రతు మయోఽ యం పురుషః.** బ్రహ్మను సత్యము అని ఉపాసించాలి. ఇక ఈ మానవుడు ఎల్లప్పుడు పనులను చేస్తూనే ఉంటున్నాడు అని మొదలుపెట్టి **స ఆత్మానము పాసీత మనోమయం ప్రాణశరీరం భారూపం ఆకాశాత్మానం ..... సత్య సంకల్పమ్ ఇతి** అతడు ఆత్మను ఉపాసించాలి. ఆ ఆత్మ మనస్సుచే మాత్రమే తెలియబడేవాడు. జీవాత్మను (ప్రాణాన్ని) శరీరముగా చేసుకొని ఉన్నట్టివాడు. ప్రకాశవన్తమైన రూపాన్ని కలవాడు. ఆకాశము వలె అన్నిచోట్లా ఉన్నవాడు సత్యసంకల్పుడు. అతడిని ఉపాసన చేయవలెఅని. అదే విధంగా అదే వేదశాఖలో బృహదారణ్యకము నందు తిరిగి శాండిల్య విద్య పఠింపబడుతున్నది. **మనోమయోఽయం పురుషః భాః. సత్యః తస్మిన్నన్తర్ హృదయే యథావ్రీహిర్వాయవోవా. స ఏష సర్వస్యవశీ సర్వస్యేశానః సర్వమిదం ప్రశాస్తి యదిదం కించ. ఇతి** ఈ పురుషుడు మనోమయుడు ప్రకాశము కలవాడు. అన్ని కాలాల్లోనూ ఉండేటివాడు. సత్యుడు. హృదయము లోపల, ఎట్లాగైతే వడ్ల గింజ యవధాన్యపుగింజవలె చిన్నగా ఉన్నాడు. ఐనా ఆయన ఈ సమస్తాన్నీ తన స్వాధీనంలో ఉంచుకున్నవాడు. సర్వానికీ ప్రభువు. ఈ సమస్తాన్ని తన ఇష్టము ప్రకారము నడిపించుతాడు. ఈ కనిపించే విశ్వంలో ఏ కొంచెమైనా సరే ఆయనకు లొంగియే ఉంటున్నది అని.

దీని మీద సంశయము కలుగుతున్నది. ఇక్కడ విద్య భేదాన్ని కల్గి ఉన్నదా? లేదా? అని. సంయోగము చోదన ఆఖ్యలు అనువాటిలో భేదము లేకపోయినా వశిత్వము మొదలైన ఉపాసింపదగిన గుణాల్లో విశేషము ఉన్నది. అందువల్ల రూపభేదము ఏర్పడుతున్నది. దానివల్ల విద్యలో భేదము ఉన్నదిఅని పూర్వపక్షము రాగా సమాధానం చెప్పబడుతున్నది. సమాన ఏవం అని అగ్ని రహస్యములో **మనోమయ ప్రాణశరీర భారూప సత్యసంకల్పత్వము అనే** గుణాలనూ మనోమయత్వాదులు సమానమే అయినప్పటికీ వశిత్వము మొదలైనవి ఎక్కువగా ఉన్నట్టు కనిపించినా సత్యసంకల్పత్వము అనే గుణముతో ఏకమే అవుతున్నందువల్ల రూపభేదము లేదు. కనుక విద్యలు రెండూ ఒక్కటే. **ఇది సమానాధికరణము.**

★ ★ ★

## ఇక సమ్బన్ధాధికరణము

సూ॥ **సమ్బన్ధాదేవమన్యత్రాపి 3-3-20** ఇది పూర్వ పక్షి సూత్రము. పరస్పర సమ్బన్ధము ఉన్నది అందువల్ల విద్యా ఐక్యము అట్లే గుణాలను చేర్చుకోవాలి ఇక్కడే కాకుండా తక్కిన చోట్లలోనూ ఇదే సూత్రాన్ని పాటించాలి అని. బృహదారణ్యకంలో వినిపించుతున్నది. **సత్యం బ్రహ్మ** అని మొదలుపెట్టి **తద్యత్సత్య మసౌస ఆదిత్యః యఏష ఏతస్మిన్ మండలే పురుషః యశ్చాయం దక్షిణేఽక్షన్** సత్యమైనవాడెవ్వడో అతడే ఆదిత్యుడు. ఈ మండలములో కనిపిస్తున్న పురుషుడు. ఇంకా ఎవడైతే మానవుని కుడికంటిలోనూ ఉన్నాడో. అనిన్నీ మొదలుపెట్టి ఆదిత్యుని మండలములో కంటిలోనున్నూ సత్య మనబడే బ్రహ్మను వ్యాహృతులను శరీరముగా కలవాడుగా ఉపాసించవలెను అని చెప్పి **తస్యోపనిషదహరితి అధిదైవమ్. తస్యోపనిషదహమితి అధ్యాత్మమ్.** అని రెండు ఉపనిషత్తులు రహస్యము ఐన నామాలు/ పేర్లు కలవి ఉపాసనకు సమ్బన్ధము కలవి / శేషములుగా ఉపదేశింపబడుతున్నవి. అది వినిపించిన ప్రకారము స్థానవిశేషములకు నియతములు (వాటికి మాత్రమే పరిమితాలు) అవుతున్నాయా? లేక ఈ రెండూ రెండుచోట్లా ఎట్లాంటి నియమం లేకుండా సమ్బన్ధమును కలిగి ఉంటున్నాయా? అని సందేహము కలిగితే వ్యాహృతులను (భూః భువః సువః) అనే వాటిని శరీరముగా కలిగి సత్యశబ్దముతో పిలువబడుతూ ఉపాస్యుడైన బ్రహ్మ రెండు స్థానాలతోనూ సమ్బన్ధము ఉన్నందువల్ల, ఉపాస్యుడు ఒక్కడే కాబట్టి రూపములో భేదము లేనందువల్ల సంయోగాదులలోనూ భేదము లేదు కనుకనూ విద్య ఒక్కటే అవుతున్నందువల్లా రెండు విద్యలూ నియమములేకనే అన్వయించుతాయి అని సిద్ధమయ్యింది. అందువల్ల ఈ విషయము చెప్పబడుతున్నది. సమ్బన్ధము ఉన్నది కాబట్టి ఇదే తీరుగా తక్కిన చోట్లలోనూ అని. ఎట్లాగైతే మనోమయత్వము మొదలైన గుణాలతో విశిష్టుడైన వాడు ఒక్కడే కనుక ఉపాసింపదగినవారిలో ఐక్యము (ఒక్కరే అగుట) ఉండటము వల్ల రూపంలో అభేదమున్న కారణంగా విద్య ఒక్కటే అవుతున్నది కాబట్టి ఒకచోట చెప్పబడిన గుణాలను మరొక చోటకు తెచ్చిపెట్టుకోవాలి. ఈ తీరుగానే అన్యత్ర – మరొకచోట అక్షి సమ్బన్ధము ఆదిత్య సమ్బన్ధమూ ఉన్న సత్యము అనబడే బ్రహ్మ ఒక్కడే అవుతున్నాడు కాబట్టి రెండుచోట్ల చెప్పబడిన గుణాలు రెండుచోట్లలోనూ ఉపసంహరించుకోవలసినదే. అని పూర్వపక్షము ఎదురవుతే చెప్పుతున్నాము.

సూ॥ **నవా విశేషాత్ 3-3-21** నీవు చెప్పినట్లు కాదు. ఉపాస్యుడైన వానిలో రూప విశేషము ఉన్నది. విద్యైక్యము వలన గుణోప సంహారము చేసుకోవాలని ఏ మాట అన్నావో అది తగదు. ఎందువల్లనంటే విశేషాత్ ఉఉపాస్యుడైన రూప విశేషము ఉన్నందువల్ల. బ్రహ్మ ఒక్కడే ఐనా ఒకచోట ఆదిత్య మండలములో ఉన్నవాడైనందువల్ల ఉపాస్యత్వము, మరొకచోట అక్షి (కన్ను) ఆధారముగా కల్గి ఉన్న సమ్బన్ధము నందలి భేదాన్ని బట్టి రూపభేదము కలుగుతున్నది. అందుచేత విద్యాభేదము ఉన్నది. కానీ ఈ విధంగా శాండిల్య విద్యలో ఉపాస్యుడైన వాని యొక్క స్థానము వేరుకావడం లేదు. రెండుచోట్లలోనూ హృదయాన్ని ఆధారము చేసుకొనే ఉపాస్యుడుగా చెప్పబడుతున్నాడు. కనుక వ్యవస్థ కలిగి ఉన్నవి. అని నిర్ణయము.

సూ॥ **దర్శయతిచ 3-3-22** అక్ష్యాధారము ఆదిత్యాధారము గల రెండింటికీ గుణాలను ఒక్కచోట చేర్చుకోవడమును తగదని చూపిస్తున్నాడు. **తస్యైతస్య తదేవరూపం యదముష్యరూపం.** ఇతడిది ఏ రూపమో ఆవలివాడిది కూడా అదే రూపము అని రూపాతిదేశములో. తనంతట తానుగా ప్రాప్తించకపోయినప్పుడు అతి దేశము ద్వారా ప్రాప్తి కావాలనే కోరిక ఉంటుంది కదా! **ఇది సమ్బన్ధాధికరణము**

★ ★ ★

## ఇక సమ్భృతి అధికరణము

సూ॥**సమ్భృతిద్యువ్యాప్త్యపిచాతః 3-3-23**పోషణముఆకాశమునందంతటనూ వ్యాపించియుండుటమున్నూ స్థానభేదాన్ని బట్టే నిర్ణయించుకోవాలి. తైత్తిరీయక శాఖలో మరియు రాణాయనశాఖ వారి ఖిలభాగాలలోను (మిగిలినవి/ సారములు) **బ్రహ్మ జ్యేష్ఠా వీర్యా సంభృతాని బ్రహ్మాగ్రేజ్యేష్ఠందివమాత తాన బ్రహ్మభూతానాం ప్రథమోఽతజజ్ఞే తేనార్హతి బ్రహ్మణాస్పర్ధితుంకః.** పరాక్రమము గల శక్తి వంతములన్నీ బ్రహ్మతోనే ఆరంభమవుతున్నవి. ఆయనతోనే పోషింపబడుతున్నవి. బ్రహ్మ శ్రేష్ఠమైన ద్యులోకాన్ని విస్తరించినాడు. ఈ సమస్త భూతాలకు బ్రహ్మనే మొట్టమొదటివాడు. ఆయనే ముందుగా పుట్టినాడు. ఆ బ్రహ్మతో పోటీపడడానికి సమర్థత కలవాడెవడు? అని బ్రహ్మలో శ్రేష్ఠములు జ్యేష్ఠములు ఐన వీర్యములు (ఘనకార్యాలు) అన్నీ పోషింపబడుతున్నవి. అట్లాగే ఆకాశము నందంతటా వ్యాపించి ఉండుట వంటి గుణాలసముదాయమంతా ఆయనలోనే ఉన్నవి అని పఠింపబడుతున్నవి / ఉపదేశింపబడుతున్నవి. వాటియొక్క ఉపాసనా విశేషాన్ని ప్రస్తావించకుండానే

పఠింపబడిన గుణాలు అన్నీ సర్వవిద్యలలోనూ ఉపసంహారము చేసుకోవాలి అని సిద్ధము ఐతే చెప్పబడుతున్నది. సమ్భృతి ద్యువ్యాప్తి అపి అని. సమ్భృతి ద్యువ్యాప్తి అనే పదము సమాహారద్వంద్వము నందు ఏకవద్ భావము వచ్చింది. సమ్భృతి అధికములైన గుణాలను అధ్యయనము చేయకపోయినప్పటికీ అతఏవ – ఈ స్థానముల యొక్క భేదాన్ని బట్టి వ్యవస్థ చేసుకోవలసి ఉన్నది. అంతేకానీ అన్నిచోట్లా అన్నింటినీ ఉపసంహరించుకోకూడదు. ఐతే అనారభ్య అధీతము లైన గుణాలను స్థానవిశేషాన్ని బట్టి అవి అక్కడ ఇవి ఇక్కడ అని నియతం చేయడం కుదురుతుంది అని అంటే తమ సామర్థ్యాన్ని బట్టి అని చెపుతున్నాము. ఇక ద్యువ్యాప్తి అయితే హృదయము మొదలైన అల్పస్థాన విషయాలైన విద్యలయందు ఉపసంహరించడానికి వీలుకాదు. సమ్భృతి ఆదులు కూడా వాటి సహచారులు వాటితో సమానమైన దేశాలు కలవి ఐన విద్యలయందు ఉపసంహరించదగినవి కావు. శాండిల్య విద్య దహరవిద్య వంటి అల్పస్థానాలకు సంబన్ధించిన వాటియందు **జ్యాయాన్ పృథివ్యాః.** పృథివి కంటే పెద్దవాడు **యావాన్ వా అయమాకాశః తావానేషోన్తర్ హృదయ ఆకాశః** ఈ ఆకాశము ఎంత పెద్దదో హృదయములోనున్న ఆకాశమున్నూ అంతటిదే ఇత్యాదులు మాత్రము ఆయాచోట్లలో ఉపసంహరించుటకు అశక్యములే. ఐనా మనోమయత్వ అపహత పాప్మత్వము మొదలైన గుణవిశిష్టుడైన వాడు ఉపాసింపదగినవాడు ఐన పరమాత్మ యొక్క మహాత్మ్యాన్ని ప్రతిపాదించేవిగా ఉన్నాయి. **ఇది సమ్భృత్యధికరణము.**

★ ★ ★

## ఇక పురుష విద్యాధికరణము

సూ॥ **పురుష విద్యాయామపిచ ఇతరేషాం అనామ్నానాత్ 3-3-24** రెండుచోట్లా పఠింపబడినవి పురుష విద్యలే ఐనా విద్యాభేదము ఉన్నది. ఒకచోట ఉపదేశింపబడినవి. మరొక్కచోట పఠించబడలేదు కనుక. తైత్తిరీయోపనిషత్తులో పురుష విద్య ఉపదేశింపబడుతున్నది. **తస్యైవం విదుషోయజ్ఞస్యాఽఽత్మాయజమానః శ్రద్ధాపత్నీ శరీరమిధ్మం ఉరోవేదిః లోమానిబర్హిః.** ఈ విధంగా సర్వజ్ఞుడైన యజ్ఞస్వరూపునికి యజమానుడు ఆత్మ. అతని భార్య శ్రద్ధ. యజమానుడి శరీరమే సమిధలు (హోమములో సమర్పింపబడే మోదుగుపుల్లలు) యజమానుని యొక్క వక్షఃస్థలము అగ్నిహోత్రాన్ని ప్రతిష్ఠించే వేదిక. ఆయన వక్షః స్థలము నందుండే వెంట్రుకలు వేదిక చుట్టూ పరిచే దర్భలు ఇత్యాదిగా.

ఇక ఛాన్దోగ్యములో కూడా పురుష విద్య ఉపదేశింపబడ్తున్నది. **పురుషోవావ యజ్ఞః తస్యయాని చతుర్వింశతివర్షాణి.** పురుషుడే యజ్ఞము. అతని ఏ ఇరువది నాలుగు సంవత్సరాల వయస్సు ఉన్నదో మొదలుగా. ఇక్కడ సంశయము కలుగుతున్నది. ఇక్కడ చెప్పబడిన విద్యలు వేరువేరేనా? లేక కాదా? అని. పురుష విద్య అని పేరు ఒక్కటే కావడము, పురుషుని యొక్క అవయవాలయందు యజ్ఞావయవాలను కల్పనా సామ్యము వల్ల రూపము ఒక్కటే అవుతున్నందువల్ల, తైత్తిరీయకములో ఫలసంయోగము వినిపించకపోయినందువల్ల **ప్ర హ షోడశం వర్ష శతం జీవతి.** ఆతడు 116 నూట పదహారు సంవత్సరాలు జీవించుతాడు అని ఛాన్దోగ్యములో వినిపించబడిందే పురుష విద్యాఫలము అవుతున్నందువల్ల ఫలసంయోగములో భేదము ఏమీ లేనందువలన విద్య ఒక్కటే అని పూర్వపక్షము ఏర్పడితే చెప్పబడుతున్నది. రెండు చోట్లా పఠింపబడిన విద్యలను రెండింటినీ పురుషవిద్య అనియే పిలిచినా విద్యాభేదము ఉండనే ఉన్నది. ఎందువల్లనంటావా? ఇతరేషామనామ్నానాత్. ఒక శాఖలో పఠింపబడిన గుణాలు మరొకదానిలో పఠింపబడనందువల్ల. అదెట్లా గంటే. **యత్ సాయం ప్రాతర్మధ్యన్దినంచతాని సవనాని.** ఉదయము పగటిపూట సాయంత్రము చేయబడే సవనాలు ఏవి ఉన్నవో ఇత్యాది వాక్యాలు తైత్తిరీయకములో పఠింపబడినట్టివి ఛాన్దోగ్యములో సవనములుగా ఉపదేశింపబడడం లేదు. మూడు భాగాలుగా చేయబడిన పురుషుని యొక్క ఆయుష్యము ఛోన్దోగ్యములో సవనముగా కల్పింపబడుతున్నది ఛాన్దోగ్యములో వినిపింపబడిన అశిశిషా (తినాలనే కోరిక) ఆదులను దీక్షగా కల్పించడము తైత్తిరీయకములో చేయబడలేదు. యజమానుని యొక్క పత్నీ మొదలైన వాటిని కల్పించడమున్నూ వేరుగా ఉన్నది. కనుక రెండు చోట్లలోనూ రూపము భేదిస్తున్నది. అట్లే ఫల సంయోగము కూడా భేదిస్తూనే ఉన్నది. తైత్తిరీయకములోని పూర్వానువాకము నందు **బ్రహ్మణే త్వామహసే ఓమిత్యాత్మానం యుంజీత** బ్రహ్మ యొక్క గొప్పదైన స్వభావాన్ని పొందడం కొరకు ఓమ్ అని ధ్యానము చేస్తూ ఆత్మను పరమాత్మతో కలుపాలి. అని బ్రహ్మ విద్యను పేర్కొని దానికి ఫలముగా బ్రహ్మణో మహిమానమాప్నోతి. బ్రహ్మ యొక్క మహిమను (గొప్పతనాన్ని) పొందుతున్నాడు అని చెప్పి **తస్యైవం విదుషః** ఇత్యాదిగా ఉపదేశింపబడిన పురుషవిద్య ఈ బ్రహ్మ వేత్తకే యజ్ఞత్వకల్పనము చేయబడింది అని తెలుస్తున్నది. కనుక బ్రహ్మ విద్యకు అంగము ఐనందువల్ల బ్రహ్మను చేరుకోవడమే ఫలము. **ఫలవత్ సన్నిధౌ అఫలమ్ తదంగమ్** ఫలము కలిగిన దానికి దగ్గరగా నున్న ఫలము చెప్పబడనిది /

ఫలము లేనిది ఫలము చెప్పబడిన దానికి అంగముగా అవుతుంది. అనే న్యాయము ప్రకారము తైత్తిరీయకములో పఠింపబడిన పురుష విద్య బ్రహ్మవిద్యకు అంగము అని తెలుస్తున్నది. ఛాన్దోగ్యములో మాత్రము ఆయుష్యాన్ని పొందడమే ఫలముగా గలది పురుషవిద్య అని చెప్పబడింది. అందువల్ల రూప సంయోగములు రెండింటిలో భేదము కనబడుతున్నది. కాబట్టి విద్యాభేదము. కనుక ఒకచోట ఉపదేశింపబడిన గుణాలు మరొకవిద్యలో ఉపసంహారము చేయబడవు. **ఇది పురుష విద్యాధికరణము.**

★ ★ ★

## ఇక వేధాద్యధికరణము.

**వేధాది అర్థభేదాత్ 3-3-25** వేధాదులకు అర్థభేదము ఉన్నది కనుక విద్యాంగములు కావు. అధర్వణ వేదానికి చెందినవారు ఉపనిషత్తులను చదువడం ప్రారంభించినప్పుడు **శుక్రంప్రవిధ్య హృదయం ప్రవిధ్య** ఇత్యాది మన్త్రాలను పఠిస్తున్నారు. సామవేదము వారు రహస్య బ్రాహ్మణములను ఆరంభించినప్పుడు **దేవసవితః ప్రసువ యజ్ఞమ్ ప్రసువ** మొదలైనవాటిని చదువుతున్నారు. కాఠకము, తైత్తిరీయమునకు చెందినవారు **శంనోమిత్రశ్శం వరుణః** ఇత్యాదులను, శాట్యాయనులు **శ్వేతాశ్వో హరినీలోఽసి** ఇత్యాదులను, ఐతరేయ శాఖకు చెందినవారు మహావ్రత బ్రాహ్మణాన్నే **ప్రజాపతిర్వై సంవత్సరః తస్యైష ఆత్మా యన్మహావ్రతమ్.** అని ఇక వాజసనేయ శాఖీయులు ప్రవర్గ్య బ్రాహ్మణాన్ని **దేవా హ వైసత్రమ్ నిషేదుః.** ఇత్యాదులను చదువుతున్నారు. ఈ విషయంలో సందేహము కలుగుతున్నది. ఈ ఉపనిషత్తులను చదువడము మొదలుపెట్టినప్పుడు చదువుతున్న శుక్రం ప్రవిధ్య, శంనో మిత్రః ఇత్యాది మన్త్రాలు ప్రవర్గ్యాదులు ఐన కర్మలున్నూ విద్యాంగములా? కావా? అని. ఏది తగును అని అన్నట్లయితే విద్యాంగము అనేదే. సరియైనది. ఎందువల్ల నంటే సన్నిధిలో చదువబడడం వల్ల విద్యాంగమని తోస్తున్నది. శుక్రం ప్రవిధ్య ఇత్యాదులైన మన్త్రాలు ప్రవర్గ్యాదులైన కర్మలున్నూ బలవన్తములైన శ్రుతి లింగవాక్యములు వంటి ప్రమాణాల ప్రకారం యథాయథముగా / ఉన్నది ఉన్నట్లుగా కర్మల్లో వినియోగము చేయబడడం కనిపిస్తున్నా, శంనోమిత్రః, సహనావవతు ఇత్యాది మన్త్రాలు మరొకచోట వినియోగింపబడక పోవడం వలన, విద్య యందే అధికారము ఉన్నది కాబట్టిన్నీ విద్యకు అంగమై ఉండడము తప్పించుకోరానిది / అవర్జనీయము. కనుక ఈ మన్త్రాలు అన్ని విద్యల్లోనూ ఉపసంహరించుకోవాలి.

అని పూర్వపక్షము రాగా చెప్పుతున్నాము. వేధాద్యర్థ భేదమున్నందువలన కాదు అని. శుక్రం ప్రవిధ్య హృదయం ప్రవిధ్య, ఋతం వదిష్యామి సత్యం వదిష్యామి, ఋతమవాదిషం సత్యమవాదిషమ్, తేజస్వినాఽవధీతమస్తు మా విద్విషావహై ఇత్యాది లింగముల ప్రకారము అభిచారము, అధ్యయనము మొదలైన వాటియందు వీటి యొక్క వాడకము కనిపిస్తున్నది కావున విద్యాంగములు అని అనడానికి వీల్లేదు. ఇదీ చెప్పబడుతున్న విషయము – ఎట్లాగైతే హృదయం ప్రవిధ్య ఇత్యాది మన్త్రాలవల్ల అర్థము చేసుకోబడిన వస్తు సామర్థ్యము అనే లింగాన్ని బట్టి శుక్రం ప్రవిధ్య ఇత్యాది మన్త్రాలు అభిచారాదులకు సమ్బన్ధించినవని అర్థమవుతున్నదో అట్లే ఋతం వదిష్యామి, తేజస్వినాఽవధీతమస్తు ఇత్యాది మన్త్రాల యొక్క సామర్థ్యాన్ని బట్టే శంనోమిత్రశ్శం వరుణః ఇత్యాది మన్త్రాలు స్వాధ్యాయానికి చెందినవని తెలుస్తున్నది. కనుక అవి అన్నీ విద్యాంగములు కావు. శుక్రం ప్రవిధ్య ఇత్యాది ప్రవర్గ్యాది బ్రాహ్మణాలు ఇక్కడ పఠింపబడుతున్నాయంటే దివాకీర్త్యత్వారణ్యకమునందు అనువాకములుగా చేర్చుకోబడినందువల్లనే. **ఇది వేధాద్యధికరణము.**

★ ★ ★

## ఇక హాన్యధికరణము.

సూ॥ **హానౌతూపాయన శబ్దశేషత్వాత్ కుశాచ్ఛన్దః స్తుత్యుపగాన వత్ తదుక్తమ్ 3-3-26** ఛాన్దోగులు పఠించుతున్నారు. **అశ్వఇవరోమాణి విధూయ పాపం, చన్ద్ర ఇవరాహోర్ముఖాత్ ప్రముచ్య ధూత్వాశరీరం అకృతం కృతాత్మాబ్రహ్మలోకం అభిసమ్భవామి** గుఱ్ఱము వెంట్రుకలను దులుపుకున్నట్లు పాపాన్ని రాహువు నోట్లో నుండి చంద్రుడి వలె విడిపించుకొని పాపకృతమైన శరీరాన్ని విడిచిపెట్టి భగవన్తుడిని శరణువేడి బ్రహ్మలోకానికి చేరుకుంటాను అని. అథర్వవేదము వారున్నూ **తదా విద్వాన్ పుణ్యపాపే విధూయ నిరంజనః పరమం సామ్యముపైతి** బ్రహ్మను ఉపాసించినవాడు అప్పుడు (మరణకాలంలో) తనవైన పుణ్యపాపాలను వదిలించుకొని దేనితోనూ సమ్బన్ధము లేనివాడై పరమాత్మతో మిక్కిలిది ఐన సమానత్వాన్ని (పోలికను సాటిలేని దాన్ని) పొందుతున్నాడు అని. ఇక శాట్యాయనులు **తస్యపుత్రాఃదాయముపయన్తి. సుహృదఃసాధు కృత్యామ్ ద్విషన్తః పాపకృత్యామ్.** పరమపదానికి పోయినవాని కుమారులు ఆస్తిలో భాగాన్ని పంచుకుంటున్నారు. మంచిమనస్సు గల మిత్రులు పుణ్యాన్ని, ద్వేషించేవాళ్ళు పాపకర్మను పొందుతున్నారు. కౌషీతకి ఉపనిషత్తు వారు

**తత్ సుకృతదుష్కృతే ధూనుతే తస్యప్రియాః జ్ఞాతయః సుకృత మపియన్తి అప్రియా దుష్కృతమ్** ఆయన పుణ్యపాపాలను వదిలించుకుంటున్నాడు. ఆయనకు ప్రీతిపాత్రులు నచ్చినవారు పాలివాండ్లు పుణ్యాన్ని పొందుతున్నారు. నచ్చనివారు పాపాన్ని పొందుతున్నారు అని. ఈ విధంగా కొన్నిచోట్ల పుణ్యపాపాలను వదలివేసుకొనుట, కొన్నిచోట్ల నచ్చినవాండ్లకు, నచ్చనివారికి పంచి ఇచ్చుట మరికొన్ని చోట్లలో రెండూ వినిపిస్తున్నవి. అందువల్ల ప్రతిఒక్క విద్యలోనూ వినిపించినప్పటికీ అన్నివిద్యలకూ అంగముగా గట్టిగా నమ్మాలి. అన్ని బ్రహ్మ విద్యలందున్నూ నిష్ఠ గల వానికి బ్రహ్మను పొందినవాడికి పుణ్యపాపాలను పోగొట్టుకోవడము తప్పని సరిగా జరుగవలసినదై యున్నది. మరో లోకమైన పరమపదంలోకి పోయేటప్పుడు ఇక్కడి వాటిని వదులు కోవాల్సి ఉంటుంది.

దాని గురించి విధింపబడుతున్న చిన్తనము కూడా సర్వవిద్యలకున్నూ అంగము కావడానికి తగియున్నది. ఈ విషయముపైన విచారము చేయబడుతున్నది. హాని చిన్తము, ఉపాయచిన్తము, (వదలుకోవడాన్ని చింతించడము, ప్రవేశించడాన్ని చిన్తించడము) రెండింటినీ గురించి చిన్తించడము వికల్పముగా అన్వయించుతయా? లేక ఉపసంహరింపబడుతవా? అని. ఏది తగును? అని అంటే వికల్పములు అవుతవి అని. వికల్పముఉవేరువేరు కల్పములు. విభాగము విధి. ఎందువల్ల? విడివిడిగా ఉపదేశింపబడినవి కాబట్టి సముచ్చయము (కలిపివేయడం, ఒక్కదగ్గర చేర్చడం) చేసినప్పుడు అన్ని విద్యల్లోనూ రెండింటినీ అనుసన్ధానము చేసుకోవలసి ఉంటుంది. అది కౌషీతకీ ఉపనిషత్తు యొక్క వాక్యము చేతనే సిద్ధించుతున్నది కావున మరొక్కచోట కూడా ఉపదేశించడం దండుగే అవుతుంది. కనుక అనేక స్థలాల్లో ఉపదేశించడానికి ఫలము ఏమిటంటే వికల్పమే ఫలము. ఐతే అధ్యేతలు వేరువేరు ఐనందున అనేక స్థలాల్లో ఉపదేశించడము దోషము కాదని పరిహరించడము కుదురదు. భేదము లేకుండా పునశ్శ్రవణము – తిరిగి వినిపించడం మాత్రము అధ్యేతల యొక్క భేదాన్ని బట్టి పరిహరించవచ్చును. ఈ విషయంలో వదలివేసుకోవడం రెండు శాఖల్లో వినిపిస్తున్నది. ఉపాయనము మరొకచోట ప్రవేశము ఒక శాఖలో వినిపిస్తున్నది. ఐతే దీన్ని విద్యాభేదాన్ని బట్టి ఒక కట్టడి చేయడం వీలుకాదు. ఈ విధమైన అనుసన్ధానము అన్ని విద్యలకు అంగమైనటువంటిది అని చెప్పినారు కాబట్టి అని పూర్వపక్షము. దీనికి సమాధానము చెప్పబడ్తున్నది. హేనౌతు ఉపాయన శబ్ద శేషత్వాత్ అని.

తు శబ్దము పక్షాన్ని తిప్పికొడుతున్నది. హానౌ అనేది ప్రదర్శన కొరకు. ఒకే ఒక్క హాని (వదిలివేసుకోవడము) ఒకేఒక్క ఉపాయనము (వేరే వ్యక్తులకు ఇవ్వడం) వినిపించినప్పుడు వాటికి రెండింటికీ కలిపి వేత (కల్పుకోవడము) తప్పక జరుగుతుంది. ఎందువల్లనంటే? ఉపాయన వాక్యము హాని వాక్యానికి శేషము (సమ్బన్ధము కలది) అవుతున్నది కాబట్టి. అంతేకాదు ఉపాయన వాక్యము హానిని చెప్పే వాక్యానికి శేషము కావడమే తగింది. బ్రహ్మవేత్త చేత విడిచి పెట్టబడిన పుణ్యపాపాలకు ఉపాయనవాక్యము ప్రవేశస్థానాన్ని చెప్పుతున్నది కాబట్టి. ఒకానొక ప్రదేశములో ఉపదేశింపబడిన వాక్యము మరొక ప్రదేశములో చెప్పబడిన వాక్యానికి శేషము కావడములో దృష్టాన్తాలు చూపబడుతున్నవి. కుశాచ్ఛన్దః స్తుత్యుపగానవత్ అనే సూత్రములోని పదము ద్వారా! కలాపశాఖవారు **కుశాః వాన స్పత్యాః** అని చదువుతున్నారు. శాట్యాయనులైతే **ఔదుమ్బర్యః కుశాః** అని సామాన్యంగా వానస్పత్యములు, **పువ్వులు లేకుండానే కాతకాచే చెట్లు మొక్కలు వగైరా** అని తెలుస్తున్నది. ఇటువంటివి దర్భలు. ఇవి ఔదుమ్బర్యః అని విశేషణముతో కూడి చెప్పినపుడు దానికి వాక్య శేషత్వాన్ని పొందుతున్నవి. అదేవిధంగా **దేవాసురాణాం ఛన్దోభిః** ఇత్యాది వాక్యము ద్వారా భేదము లేకుండా దేవాసురులకు ఛందస్సులు వేదమన్త్రాలు – ప్రాప్తమైనప్పుడు **దేవాచ్ఛన్దాంసి పూర్వమ్** అనే వాక్యం ఒక వరుస విశేషాన్ని ప్రతిపాదించుతూ ముందరివాక్యానికి వాక్య శేషము అవుతున్నది. అదే తీరుగా **హిరణ్యేనషోడశినఃస్తోత్రముపాకరోతి** (ఉపాకరణముఽప్రస్తావము, స్తోత్రంఽగానవిశేషముతో కూడిన ఉచ్చారణము) అని భేదము లేకుండా స్తోత్రము ప్రాప్తించినపుడు **సమయావిషితేసూర్యే షోడశినః స్తోత్రము పాకరోతి** అని విశేషాన్ని తెలిపే వాక్యము తొలుత చెప్పిన వాక్యానికి శేషము అవుతున్నది. ఇంకా **ఋత్విజ ఉపగాయన్తి** అని విశేషము లేకుండా ఋత్విక్కులు అందరూ పాటగా మన్త్రాన్ని పాడవలసి వచ్చినపుడు **నాధ్వర్యు రుపగాయేత్** అధ్వర్యుడు పాడకూడదు అనే వాక్యము, అధ్వర్యుడు ఐనవాడు పాడకూడదు అని తెల్పుతూ ఉన్న ఈ వాక్యము పైవాక్యానికి శేషము అవుతున్నది. ఈ విధంగా సామాన్యంగా తెలియవచ్చిన అర్థాన్ని / విషయాన్ని విశేష విషయము నందు కట్టడి చేయగల వాక్యము ముందరి వాక్యానికి శేషము అనే అంశాన్ని ఒప్పుకోనివాండ్లు ఆ రెండు అర్థాలకు వికల్పాన్ని ఒప్పుకోవాల్సి ఉంటుంది. అది జరుగుతున్నపుడు ఏదో ఒకటి అని వికల్పాన్ని ఆశ్రయించడం తగదు. అందుకే పూర్వ మీమాంసలో ఇట్లాగా చెప్పినారు. **అపితు వాక్యశేషత్వాదన్యాయ్య త్వాద్వికల్పస్య విధీనామేకదేశః స్యాత్.** వాక్యశేషత్వము పొసగుతున్నపుడు వికల్పము అన్యాయము /

తగనిది అవుతున్నందున విధులలో ఒక భాగము అవుతుంది. (ఏకదేశము భాగము) అని అందువల్ల కేవలహానము, కేవల ఉపాయన వాక్యాలు ఒకే వాక్యము అవుతున్నవి కాబట్టి కేవల హానము కేవల ఉపాయనమున్నూ అప్రాణికమైనందువల్ల లేవు గాబట్టి వికల్పము చెప్పుకోవడం ఎంతమాత్రము పొసగదు. కౌషితకీ శాఖ వారు రెండింటినీ ఉపదేశించడము / పఠించడము అవిశేష పునః శ్రవణము కాబట్టి ప్రతిపత్తలలో ఉండే భేదాన్ని బట్టి వైరుధ్యము లేదు. **ఇది హాన్యధికరణము.**

★ ★ ★

## ఇక సామ్పరాయాధికరణము

సూ॥ **సామ్పరాయే తర్తవ్యాభావాత్ తథాహ్యన్యే 3-3-27** శరీరాన్ని విడిచి పోయేటప్పుడు పొందవలసినది ఏమీ లేదు కనుక సుకృత దుష్కృతాలు పూర్తిగా వదిలిపెట్టబడుతవి. అట్లాగని ఒకశాఖ వారు పఠించుతున్నారు. సుకృత దుష్కృతాలను వదలుకోవడము ఉపాయనమున్నూ అన్ని విద్యలయందున్నూ చిన్తించవలసినదిగా చెప్పబడింది. ఆ విధంగా వదలిపెట్టడం దేహవియోగ కాలమునందా? దేహాన్ని విడిచినవాడు పోతున్న త్రోవలోనా? లేక దేహాన్ని వదులుతున్న కాలములోనేనా? అని సంశయము ఏర్పడితే రెండు విధాలుగా వినపడుతున్నందున రెండు సమయాల్లోనూ అని నిశ్చయము చేయబడుతున్నది. కౌషీతకీ ఉపనిషత్తుకు చెందిన వాళ్ళు ఇట్లా ఉపదేశిస్తున్నారు. **సఏతం దేవయానం పన్థానం ఆపద్యాగ్ని లోకమాగచ్ఛతి.** శరీరాన్ని విడిచిపెట్టిన వాడు ఈ దేవయానం అనబడే మార్గానికి వచ్చి తద్ద్వారా అగ్నిలోకానికి వస్తున్నాడు అని మొదలుపెట్టి **సఆగచ్ఛతి విరజాంనదీమ్. తాంమనసాఅత్యేతి. తత్సుకృత దుష్కృతే ధూనుతే.** అతడు విరజానది వద్దకు చేరుకుంటాడు. దాన్ని మనస్సుతో దాటుతాడు. అక్కడ సుకృత దుష్కృతాలను దులిపివేసుకుంటాడు అని. ఈ వాక్యములో త్రోవలో పుణ్యపాపాలను విడిచిపెట్టడము కనిపిస్తున్నది. తాండినులు అనగా ఛాన్దోగులు **అశ్వఇవ రోమాణి విధూయపాపం చన్ద్ర ఇవ రాహోర్ముఖాత్ ప్రముచ్య, ధూత్వా శరీరమకృతం కృతాత్మా బ్రహ్మలోక మభిసంభవామి.** అని పఠిస్తున్నారు. ఇందులో శరీరాన్ని విడిచిపెట్టే సమయంలోనే అని తేలుతున్నది. శాట్యాయనులు కూడా **తస్యపుత్రాః దాయముపయన్తి. సుహృదః సాధుకృత్యాం ద్విషన్తఃపాప కృత్యామ్** అని పుత్రులకు ఆస్తి సంక్రమించే సమానకాలములోనే సుకృతదుష్కృత సంక్రమణమూ వినిపిస్తున్నది. ఇవి అన్నీ దేహవియోగకాలములోనే

జరుగుతున్నవి అని అర్థమవుతున్నది. అందువల్ల దేహాన్ని విడిచిపెట్టే కాలంలో సుకృత దుష్కృతాల్లో ఒక భాగము విడిపోతున్నది. తక్కింది పరమపదానికి పోయే బాటలో అని పూర్వపక్షము సమన్వయ ధోరణిలో ఎదురయ్యింది. దీనికి సమాధానము సామ్పరాయే అని చెప్పబడుతున్నది. సామ్పరాయే దేహాన్నించి పక్కకు తప్పుకునే కాలమునందే బ్రహ్మవేత్తకు సుకృత దుష్కృతాలు బొత్తిగా ఏమీ మిగులకుండా విడిచిపెట్టబడుతవి. ఎందువల్లనంటే తర్తవ్యాభావాత్. విద్వాంసుడికి / ఉపాసకుడికి శరీరాన్ని ఎడబాసిన తరువాత సుకృతదుష్కృతాల కారణంగా పొందవలసిన భోగాలు ఏవీ లేవు కనుక. బ్రహ్మ విద్యకు ఫలమైన బ్రహ్మను చేరుకోవడం తప్ప సుకృత దుష్కృతాలవల్ల అనుభవించవలసిన సుఖదుఃఖాలు ఉండవు. తథాహ్యన్యే – దేహాన్ని విడచిన పిదప బ్రహ్మప్రాప్తి కంటే వేరుగా సుఖదుఃఖాలు లేవు అని కొందరు ఉపదేశిస్తున్నారు. **అశరీరం వావసన్తం నప్రియాప్రియే స్పృశతః** శరీరము లేకుండా ఉన్నవానిని ప్రియ అప్రియాలు తాకవు. **ఏషసమ్ప్రసాదోஉస్మాత్ శరీరాత్ సముత్థాయ పరంజ్యోతిరుపసమ్పద్య స్వేన రూపేణాభినిష్పద్యతే.** ఈ భగవదనుగ్రహపాత్రుడు ఈ పాంచ భౌతిక శరీరాన్నించి లేచి పరమాత్మ వద్దకు పోయి తనదైన తొలుతటి స్వరూపాన్ని పొందుతున్నాడు. **తస్యతావదేవ చిరం యావన్న విమోక్ష్యే అథసమ్పత్స్యే.** ఆ పరమాత్మను చేరుకోవడానికి అంతమాత్రమే ఆలస్యము. ఎప్పుడు ఈ శరీరాన్నుంచి వేరుపడుతానో అప్పుడే నాస్వరూపాన్ని పొందుతాను అని.

సూ॥ **ఛన్దతః ఉభయావిరోధాత్ 3–3–28** తమకు నచ్చిన రీతిగా పదాలకు అన్వయాన్ని వర్ణించుకోవాలి. వేదము యొక్క అర్థస్వభావాన్ని బట్టి రెండువిధాలుగా అన్వయం చేసుకున్నా విరోధము ఉండకూడదు. ఈ విధంగా అర్థము యొక్క స్వభావాన్ని బట్టి సుకృత దుష్కృతాలను వదలిపెట్టే కాలము నిశ్చయము చేయబడగా ఉభయావిరోధేన వేదము యొక్క పాఠక్రమము, అర్థస్వభావములు రెండింటికీ విరోధము రాకుండా, ఛన్దతః – యథేష్టముగా పదాలకు అన్వయాన్ని వర్ణించాలి. కౌషీతకీ వాక్యమునందు **తత్ సుకృతదుష్కృతేధూనుతే** అని చివరగా వినిపించిన మహావాక్యము యొక్క ముక్కను **ఏతం దేవయానం పన్థానమ్ ఆపద్య** అని మొదటగా వినిపించిన వాక్యము యొక్క తుంపకంటే ముందు అన్వయము చేసుకోవాలి అని అర్థము.

ఇక్కడ పూర్వపక్షి అడ్డుపడుతున్నాడు.

సూ॥ **గతేః అర్థవత్త్వం ఉభయథాఽన్యథా హివిరోధః 3-3-29** మరణానికి ముందు, బాట నడుమన రెండు విధాలు నైతేనే అర్థవత్త్వము కాకుంటే విరోధము వస్తుంది. సుకృత దుష్కృతాలలో కొంతభాగము శరీరాన్ని విడిచే కాలంలో తక్కిన మరికొంత భాగము తరువాత అని రెండు విధాలుగా కర్మక్షయము జరిగితేనే గతికి అర్థవత్త్వము – అనగా దేవయాన గతిని చెప్పే శ్రుతికి అర్థవత్వము – ఉంటుంది అని అర్థము. అట్లాకాకపోయినప్పుడు దేహవియోగకాలము నందే అనే శ్రుతితో విరోధము వస్తుంది. దేహాన్ని విడిచి పెట్టే కాలములోనే అన్ని కర్మలు నశించిపోతే సూక్ష్మ శరీరము కూడా నశించాల్సి వస్తుంది. అప్పుడు ఒంటరి ఆత్మ ముందుకు సాగి పోలేదు. కనుక ఉత్క్రాన్తి సమయము నందే బ్రహ్మ విద్యా ఉపాసకుడికి నిశ్శేష కర్మక్షయము పొసగేదికాదు. దీనికి సమాధానము

సూ॥ **ఉపపన్నస్త ల్లక్షణార్థోపలబ్ధేః లోకవత్ 3-3-30** కర్మలన్నీ నశించిపోవడం పొసగుతుంది. కర్మలు నశించినవాడు అని గుర్తించడానికి తగినదైన ఆవిర్భూత స్వరూపము పొందుతున్నాడు గనుక. లోకంలో వలెనే. శరీరాన్నుండి లేచిపోయే కాలంలోనే కర్మలన్నీ నశించిపోవడము తప్పక పొసగుతుంది. ఎట్లాగా అని అంటే తల్లక్షణార్థోపలబ్ధేః – కర్మలన్నీ నశించిపోయినప్పటికీ తనదైన స్వరూపము మలుచుకొని వచ్చినవానికి దేహసమ్బన్ధాన్ని తెలిపే / సూచించే అర్థము లభిస్తున్నది కనుక. **పరంజ్యోతి రుపసమ్పద్య స్వేన రూపేణ అభినిష్పద్యతే. 2) సతత్ర పర్యేతి జక్షత్ క్రీడన్ రమమాణః** ఆయన అక్కడకు తినుకుంటూ ఆడుకుంటూ ఆనందపడుకుంటూ వెళ్ళిపోతాడు. **సస్వరాడ్ భవతి. తస్య సర్వేషులోకేషు కామచారో భవతి** ఆయన తనకు తానే రాజు అవుతాడు. ఆయన లోకాలన్నింటిలో స్వేచ్ఛగా రాకపోకలు చేయగల్గుతాడు. **4) సఏకథా భవతి త్రిథాభవతి** అతడు ప్రస్తుతము ఉన్న శరీరానికి తోడు ఇంకొక శరీరాన్ని కలవాడవుతాడు. మూడుగా అవుతాడు. ఇత్యాది వాక్యాలయందు దేహముతో సమ్బన్ధము అనే అర్థము (ప్రయోజనము) చిక్కుతున్నది. అందువలన కర్మలన్నీ నశించినవానికి కూడా సూక్ష్మ శరీరముతో దేవయాన మార్గముగా పోవడము ఒప్పుతుంది. ఐతే కారణమైన కర్మ వినాశమైపోయినాక కూడా సూక్ష్మ శరీరము ఎట్లా ఉంటుంది అని అంటే బ్రహ్మ విద్యయొక్క మహిమ వలన అని అంటున్నాము. విద్య అనేది సూక్ష్మ శరీరం పుట్టడానికి తానుగా కారణంకాకపోయినా ప్రకృతి సమ్బన్ధమైన సుఖదుఃఖాలను అనుభవించడానికి సాధనమైన స్థూలశరీరము, కర్మలు అన్నీను బొత్తిగా ఏమీ మిగులకుండా తరిగిపోయినా తనకు ఫలమైన బ్రహ్మ ప్రాప్తిని

కలిగించడానికి దేవయాన మార్గము ద్వారా ఈ ఉపాసకుడిని పంపడానికి తగినదైన సూక్ష్మశరీరాన్ని ఎదుట నిల్పుతున్నది. లోకవత్ – లోకములో వలె. లోకములో పంటలు బాగా ఎదుగడానికి నిర్మించిన చెఱువు మొదలైన వాటిని ఆయా కోరికలు తీరినాక, ఆ చెఱువు బావి మొదలైన వాటిని కూల్చి వేయకుండా! పూడ్చివేయకుండా కాపాడుకొని వాటి మంచినీరు త్రాగడం స్నానము చేయడమువంటి పనులు చేసుకుంటున్నారు కాదా. ఆ విధంగానే ఇక్కడ కూడా సూక్ష్మ శరీరము ప్రయాణానికి సాధనంగా బ్రహ్మ విద్య కారణంగా ఏర్పడుతుంది. గమనమున్నూ నప్పుతుంది. ఐతే ఇట్లా కావచ్చును –

జ్ఞానులై పరతత్వాన్ని దర్శించుకున్నవారికి దేహము పడిపోయే వేళ కర్మలు బొత్తిగా ఏమీ లేకుండా నశించిపోయినందువల్ల దేహపాతము పిదప సూక్ష్మ శరీరము మాత్రము ఈ లోకాన్నించి పరమ పదానికి పోవడానికి గాను వెంబడి వస్తుంది. సుఖదుఃఖానుభవము మాత్రము ఉండదు అని ఏ మాట అన్నారో అది చెల్లదు. వసిష్ఠుడు అపాన్తర తపుడు మొదలైనవారు శరీరము నశించిన తరువాత తిరిగి మరొక శరీరాన్ని పొందడము, కొడుకులను కనడము, వాళ్ళలో కొందరు చనిపోవడము అందువల్ల ఆయన సుఖదుఃఖాలను అనుభవించడమున్ను కనిపించుతున్నది కదా అని అనవచ్చును. దీనికి సమాధానాన్ని చెపుతున్నారు.

సూ॥ **యావదధికారం అవస్థితిః ఆధికారికాణాం 3–3–31** అధికారులు ఐన వారు వారి అధికారము ముగిసేంతవరకు ఇక్కడే ఉంటున్నారు. మేము అధికారులు ఐనవారికి అందరికీ జ్ఞానులకు శరీరము రాలిపోయేటప్పుడే పుణ్యపాపాలు నశించిపోతాయి అని చెప్పలేదు. ఐతే ఎవరి శరీరము కూలిపోయినాక అర్చిరాది గతి లభించిందో వారికి మాత్రమే పుణ్యపాపాలు పోతాయి అని చెప్పినాము. అధికారులైన వసిష్ఠాదులకు మాత్రము శరీరము రాలిపోయినాక అర్చిరాదిగతి లభించలేదు. వారియొక్క ప్రారబ్ధకర్మ ముగిసిపోలేదు. తమయొక్క కర్మవిశేషము చేత అధికార విశేషాన్ని పొందినవారికి వారి అధికారము ముగిసి పోయేంత దాకా ఆ అధికారానికి అనువైన కర్మ నశించిపోదు. ప్రారబ్ధమైన కర్మ, అనుభవము వలననే లేకుండా పోతుంది. అందువల్ల అధికారులైన వారికి వారి అనభవానికి మూలమైన కర్మ ఎంతకాలము అనుభవించవలసి ఉంటుందో అంతవరకు నిలిచే ఉంటుంది. కనుక వారికి దేహము కూలిపోయినాకనే అర్చిరాది గతి లభించుతుంది. **ఇది సామ్పరాయాధికరణము.**

★ ★ ★

## ఇక అనియమాధికరణము.

సూ॥ **అనియమః సర్వేషామవిరోధః శబ్దాను మానాభ్యాం 3-3-32** కొన్ని బ్రహ్మ విద్యలను ఉపాసించినవారికే అర్చిరాది గతి లభిస్తుంది అని నియమము లేదు. ఆ దారిన అందరూ పోవలసినవారే అట్లాగని వేదము స్మృతుల ద్వారా తెలియవస్తున్నది. ఉపకోసల విద్య మొదలైన విద్యలలో కొన్నింటిలో మాత్రమే అర్చిరాది గతి వినిపిస్తున్నది. ఐతే ఆయా విద్యలను ఉపాసించినవారికి మాత్రమే అర్చిరాది మార్గము ద్వారా బ్రహ్మ ప్రాప్తి కలుగుతుందా? లేక అన్ని బ్రహ్మ విద్యలను ఉపాసించిన వారికా? అని సందేహము కలిగితే ఇతర విద్యలయందు ఉపదేశింపబడలేదు. **యేచేమే అరణ్యేశ్రద్ధా తప ఇత్యుపాసతే 2) శ్రద్ధాం సత్యము పాసతే** ఎవరైతే అరణ్యములో శ్రద్ధ, తపస్సుల ద్వారా ఉపాసిస్తున్నారో 2) శ్రద్ధను సత్యాన్ని ఉపాసించుతున్నారో అని చెప్పినందువల్ల వాటికన్న ఇతరములైన అన్ని బ్రహ్మవిద్యలను వరుసలో నిలబెట్టడంలో ప్రమాణము ఏదీ లేదు. కనుక ఆయా విద్యలయందు నిష్ఠకలవారికే తప్ప ఇతరులకు అర్చిరాదిగతి లేదు అని ఎదురు అయ్యింది. దానికి నియమము లేదు అని సమాధానము చెప్పబడుతున్నది. సర్వేషాం - అన్ని ఉపాసనలలోనూ నిష్ఠగల వారికి కూడా ఆ ఒక్క మార్గమే పోవలసినది ఐనందున ఫలానా విద్యను ఉపాసించినవారికే అని నియమము లేదు. అందరూ ఆ ఒక్క అర్చిరాది మార్గము ద్వారానే పరమాత్మ సన్నిధికి పోయినప్పుడు మాత్రమే శబ్దాను మానాభ్యాం - శ్రుతి స్మృతులతో విరోధము ఉండదు. లేకపోయినట్లయితే ఆ రెండింటితో విరోధము తప్పదు అని అర్థము. శ్రుతి ఏమంటున్నదంటే ఛాన్దోగ్యము వాజసనేయములలో పంచాగ్ని విద్య యందు అర్చిరాది మార్గం ద్వారా అన్నిబ్రహ్మోపాసనలలో నిష్ఠులైన వారికి గమనము చెప్పబడింది. **యఏవ మేతత్ విదుః యేచేమే అరణ్యే శ్రద్ధా తప ఇత్యుపాసతే తేఽర్చిషమభిసమ్భవన్తి.** ఎవరైతే పరమాత్మ ఇటువంటివాడని తెల్సుకుంటున్నారో అడవిలో శ్రద్ధానిష్ఠలతో తపస్సు చేస్తున్నారో వారు అర్చిః పురుషులుగానే అవుతున్నారు. అని వాజసనేయకములో, **తద్యఇత్థమ్ విదుర్యేచేమే అరణ్యేశ్రద్ధా తపఇత్యుపాసతే తేఽర్చిషమభిసమ్భవన్తి** అని ఛాన్దోగ్యములోనూ చెప్పబడింది. **యఇత్థంవిదుః** అని పంచాగ్ని విద్యానిష్ఠులను **యేచేమే** ఇత్యాదిగా శ్రద్ధతో బ్రహ్మను ఉపాసించిన వాళ్ళను ఉద్దేశించి అర్చిరాదిగా ఉపదేశింపబడుతున్నది. **సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ, సత్యం త్వేవ విజిజ్ఞాసితవ్యమ్** అని సత్య శబ్దము బ్రహ్మ యందే ప్రసిద్ధమైనది కాబట్టి తపశ్శబ్దమున్నూ దానితో సమానమైన

అర్థాన్ని కల్గి ఉన్నది కాబట్టి సత్య, తపశ్శబ్దాలతో బ్రహ్మనే చెప్పబడుతున్నాడు. శ్రద్ధా పూర్వకంగా బ్రహ్మోపాసన చేయబడడము వేరొకచోట వినిపిస్తున్నది. **సత్యంత్వేవ విజిజ్ఞాసి తవ్యం** సత్యశబ్దముతో చెప్పబడేవాడిని గురించి తెల్సుకోవలసి ఉన్నది అని ఆరంభించి **శ్రద్ధాత్వేవవిజిజ్ఞాసితవ్యా** అనిన్నీ చెప్పబడింది. స్మృతి కూడా **అగ్నిర్జ్యోతి రహః శుక్లః షణ్మాసా ఉత్తరాయణమ్। తత్రప్రయాతా గచ్ఛన్తి బ్రహ్మ బ్రహ్మ విదోజనాః** అగ్ని, జ్యోతి / చుక్కలు / చంద్రుడు అహః పురుషుడు, శుక్లపక్షము, ఉత్తరాయణపు ఆరునెలలు వీటి యందు ప్రాణము విడిచిన బ్రహ్మవేత్త లైన జనులు పరమాత్మ సన్నిధికి వెళ్ళిపోతారు. అని బ్రహ్మవేత్తలు అందరూ ఈ మార్గముగానే బ్రహ్మను చేరుకుంటున్నారు అని చెప్పినారు. దీనితో సమానమైన శ్రుతులు స్మృతులు చాలా ఉన్నవి. ఈ విధంగా అన్ని విద్యలకూ సమానమైన గతి ఉపకోసల విద్యలో చెప్పబడినటువంటిది మిగతా విద్యల్లో అనువదింపబడుతున్నది. **ఇది అనియమాధికరణము.**

★ ★ ★

**ఇక అక్షరధీ అధికరణము.**

సూ॥ **అక్షరధియాం త్వవిరోధః సామాన్య తద్భావాభ్యాం ఔపసదవద్ తదుక్తమ్ 3-3-33** అక్షర బ్రహ్మకు సమ్బన్ధించిన అస్థూలత్వము మొదలగు గుణాలు అన్ని విద్యలలోనూ చేర్చుకోబడుతవి. అన్నింటిలోనూ ఉపాసింపబడే వాడు ఆ బ్రహ్మనే. అవి ఆయనను తెలియపరుస్తున్నవి కాబట్టి ఔపసదము వలె అని తెల్సుకోవాలి.

బృహదారణ్యకములో వినిపించుతున్నది. **ఏతద్వైతదక్షరం గార్గి! బ్రాహ్మణాః అభివదన్తి అస్థూలమనణు అహ్రస్వమదీర్ఘమలోహితం అస్నేహమచ్ఛాయ మతమోఽవాయు అనాకాశమసంగమరసం అగన్ధమచక్షుష్కం అశ్రోత్రమ్ అవాక్ అమనోఽతేజస్కం అప్రాణమ్ అసుఖమ మాత్రం అనన్తరమబాహ్యం నతదశ్నాతి కించన .... ఏతస్యవా అక్షరస్య ప్రశాసనే గార్గి సూర్యా చంద్ర మసౌవిధృతౌ తిష్ఠతః.**

ఓ గార్గి! అక్షరము అనబడేది ఇది అని బ్రహ్మవేత్తలు చెప్పుతున్నారు. అది స్థూలమైనది కాదు. అణువుకాదు. పొట్టికాదు పొడవు కాదు. ఎరుపు కాదు. అతుక్కొనేది కాదు. స్నేహము కలది కాదు. చిక్కనిది కాదు. నీడ కలది కాదు. నీడవలె ఒకడిని అనుసరించేది కాదు. చీకటి కాదు. వాయువు కాదు. ఆకాశము కాదు. (శూన్యరూపము కలదికాదు) ఎవ్వరితోనూ ఏవిధమైన సమ్బన్ధము కలదికాదు. రసము కాదు (నీరు)

గన్ధము కలదికాదు. కన్నులు, చెవులు, నోరు / మాట, మనస్సు కలది కాదు. తేజస్సు కలది కాదు. ప్రాణము ఉన్నది కాదు. సుఖం కలది కాదు. ఒక మాత్ర అంతగా ఉన్నది కాదు. లోపలా లేదు. వెలుపలా లేదు. అది దేన్నీ తినదు. ఇటువంటి అక్షరునియొక్క శాసనానికి లోబడి సూర్యుడు చంద్రుడు తమ తమ విధులను నిర్వహించుతున్నారు ఆయన చేత నిర్వహింపబడుతున్నారు అని. అదే విధంగా అధర్వణవేదములో **అథపరా యయా తదక్షర మధిగమ్యతే. యత్త దద్రేశ్యమగ్రాహ్యమగోత్రమవర్ణమచక్షుః శ్రోత్రం తదపాణిపాదమ్.** ఇక పరను గురించి చెపుతున్నాను. దేని ద్వారానైతే అక్షరాన్ని తెల్సుకోగల్గుతామో ఆ అక్షరమనబడునది కంటికి కనబడదు. చేతులతో పట్టుకోబడదు. పేరు కలదికాదు రంగులేనిది కండ్లు చెవులూ లేవు. కాళ్ళు చేతులూ కలది కాదు అని. ఈ వాక్యాల వద్ద సందేహము కల్గుతున్నది. అక్షర శబ్దము చేత నిర్దేశింపబడిన బ్రహ్మకు చెందినవిగా వినిపించబడుతున్న అస్థూలత్వాదులు ప్రపంచానికి భిన్నమైన స్వరూపాన్ని కల్గినట్టివి అన్ని బ్రహ్మవిద్యలలో అనుసన్ధించుకోదగినవా? లేక ఏ ఉపనిషత్తులో / విద్యలో వినిపించబడుతున్నవో అక్కడ మాత్రమేనా? అని. ఏది తగును అంటే ఎక్కడ వినిపించుతున్నవో అక్కడనే అని? ఎందువల్ల నంటే ఒక విద్యకు రూపమైన గుణాలు మరొక్క విద్యకు రూపము కావడంలో తగిన ప్రమాణము లేదు. నిషేధించుతున్నట్లు లేవు / లేవు అని చెప్పబడుతున్న ఇవి ఆనందాదులవలె స్వరూపాన్ని తెలుసుకోవడానికి సాయపడవు. ఆనందాది గుణాలచేత తెలియబడిన స్వరూపము కల బ్రహ్మయందు స్థూలత్వాదులు ఐన ప్రపంచములో కనిపించే ధర్మాలు నిషేధింపబడుతున్నవి. ఆలమ్బనము లేనిదాన్ని ప్రతిషేధించడము తగదు కదా!

ఈ ప్రకారము పూర్వపక్షము సిద్ధము కాగా చెపుతున్నారు. అక్షరధియాంతు అవరోధః అని. అక్షర బ్రహ్మకు సమ్బన్ధించిన అస్థూలత్వాది ఊహలు / ఆలోచనలు అన్ని బ్రహ్మ విద్యలలోనూ అవరోధించదగినవి. అనగా సంగ్రహించదగినవి / చేర్చుకోదగినవి. ఎందువల్లనంటే సామాన్యతద్ భావాభ్యాం. అన్ని ఉపాసనల్లోనూ ఉపాస్యుడైన అక్షర పరబ్రహ్మ సమానుడు కాబట్టి అస్థూలత్వాదులు ఆయన యొక్క స్వరూపాన్ని తెలియబర్చడంలో సమర్థములు కాబట్టి. అనగా చెప్పబడుతున్న విషయమిది. ఒక్క వస్తువును మిగతా వస్తువులలో లేని ఒక విశేషము ద్వారా గ్రహించుతాము/ గుర్తించుతాము. కేవలము ఆనందాది గుణాలు మాత్రమే బ్రహ్మయొక్క అసాధారణమైన రూపాన్ని కండ్ల ముందు కనిపింపచేయవు. ఆయనలోనే

కాకుండా ప్రత్యగాత్మలో జీవుడిలోనూ ఆనందాది గుణాలు కనపడుతున్నాయి. హేయాలకు ప్రత్యనీకమైన ఆనందాదులే బ్రహ్మకు అసాధారణ రూపమవుతున్నది. జీవుడికి / ప్రత్యగాత్మకు సహజంగానే హేయములు లేకున్నా హేయమైన వాటితో సమ్బన్ధాన్ని కలిగి ఉండడానికి యోగ్యత ఉన్నది. హేయప్రత్యనీకత్వము అంటే చిదచిత్తులతో కూడిన ప్రపంచానికి ధర్మములైన స్థూలత్వాదులకు విపరీతమైన / విరోధిఐన రూపాన్ని కలిగి ఉండడము. కనుక అసాధారణమైన ఆకారంతో బ్రహ్మను అనుసన్ధించే వాడు / ఉపాసకుడు అస్థూలత్వాదులతో విశేషింపబడిన జ్ఞానానన్దాది ఆకారాన్ని కల్గి ఉన్న బ్రహ్మను అనుసన్ధానం చేసుకోవాలి. కనుక అస్థూలత్వము మొదలైనవి ఆనందాదుల వలె బ్రహ్మయొక్క స్వరూపాన్ని తెలియచేయడంలో భాగస్వాములు అవుతున్నవి. కనుక అన్ని బ్రహ్మ విద్యలలోనూ ఆ గుణాలు కలవాడినే అనుసన్ధానము చేసుకోవాలి అని.

గుణాలు ప్రధానమైన దాన్ని అనువర్తించుతవి, అనడంలో దృష్టాన్తాన్ని చెప్పుతున్నాడు ఔపసదవత్ అని. ఎట్లాగంటే జమదగ్ని చేత తరచూ ఆచరించబడిన చతూరాత్ర పురోడాశాదులలో ఉపసద్ గుణభూతమైన సామవేదములో పఠింపబడిన **అగ్నిర్వై హోత్రం వేతు** అనేది మొదలుగా గల మన్త్రము ప్రధానమైన దాన్ని అనువర్తించుతున్నది కనుక యజుర్వేదానికి సమ్బన్ధించిన నియమము ప్రకారము ఎవ్వరికీ వినిపించకుండా దాదాపు మౌనంగా ఉపాంశువుగా ప్రయోగింపబడుతున్నది.

(చతూరాత్రమనబడేది ఒక చిన్న యజ్ఞరూపమైన కర్మ. దానికి పురోడాశము ద్రవ్యము. దానికి ఉపసత్ అనబడే అంగములో పఠింపబడేది ఒక సామవేదము నందలి మన్త్రము. సామవేదము ఎప్పుడూ, **ఉచ్చైః సామ** – పెద్దగా సామవేదాన్ని గొంతెత్తి చదువాలి అనే నియమాన్ని కలిగి ఉన్నది. అందువల్ల ఆ మన్త్రము పెద్దగా చదువవలసి ఉన్నది. కానీ ఇది యజుర్వేదములో చెప్పబడిన ఉపసత్ అనే కర్మకు సమ్బన్ధించి ఉపయోగింపబడుతున్నది కనుక "ఉపాంశు యజుషా" అని యజుర్వేదాన్ని చిన్నగా చదువవలసినందువల్ల చిన్నగా చదువవలసి వస్తున్నది. ఇపుడు సందేహము చదువవలసినది పెద్దగానా? చిన్నగానా? అని సందేహము. ప్రధానమైన కర్మయజుర్వేదానికి చెందినట్టిది. యజుర్వేదము ప్రధానమవుతున్నది. కనుక సామవేదము వలెకాక యజుర్వేదనియమం ప్రకారము ఉపాంశువుగా చదువాలి)

అందుకే పూర్వమీమాంసలోని ప్రథమకాండలో ఇట్లా చెప్పబడింది. **గుణముఖ్య వ్యతిక్రమే తదర్థత్వాత్ ముఖ్యేన వేదసంయోగః** అని. గుణానికి ముఖ్యమైన దానికిన్నీ విరోధము ఏర్పడినప్పుడు అందు దానికొరకే ప్రాధాన్యము కాబట్టే ముఖ్యమైన దానితోనే వేద సంయోగము / కలయిక కలది అవుతుంది అని. ఐతే ఈ విధంగా అన్ని బ్రహ్మవిద్యలలోనూ బ్రహ్మనే గుణములు కలవాడు గుణి అవుతున్నాడు. కనుక, మరియు గుణాలు ప్రధానాన్ని అనుసరించుతాయి కాబట్టిన్నీ **సర్వకర్మాసర్వగన్ధః సర్వరసః** అన్నింటినీ సృష్టించినవాడు అన్నీ పరిమళాలూ తానే ఐనవాడు, అన్నిరసాలూ తానుగాఐ ఉన్నవాడు అని చెప్పినట్లు గుణసముదాయమంతా ప్రతివిద్యకున్నూ ఒక కట్టడి ఏర్పడి ఉన్నా అన్నీ ఒక దగ్గర చేరి కలసి పోవడంతో అవ్యవస్థ అవుతుంది కదా? అన్నట్లయితే చెప్పుతూ ఉన్నారు.

సూ॥ **ఇయదామననాత్ 3-3-34** ఈ వ్యవస్థ ఇట్లా ఉండాలి అని అనుచిన్తనము చేయబడింది కనుక దోషము లేదు. ఆమననమ్- ఆభిముఖ్యముతో మననము - అనుచిన్తనము - అనుచిన్తనము చేయబడడము. (ఇది మాత్రమే ఇక్కడ అనువర్తించాలి అని చిన్తించుట అనే కారణంగా గుణసముదాయమంతా అన్ని చోట్లలోనూ అనుసన్ధించాల్సిందిగా ప్రాప్తమవుతున్నది. అనగా అస్థూలత్వాది విశేషాలతో కూడి ఆనందాదులు అని. ఏ గుణాలు లేకపోతే ఇతరములకంటే వేరయిన బ్రహ్మ స్వరూపము అనుసన్ధానము చేయబడదో దాన్నే అన్నిచోట్లా అనువర్తింప చేసుకోవాలి.

అది ఇదే అని అర్థము. వేరయిన సర్వకర్మా ఇత్యాదులు ప్రధానాన్ని అనువర్తించేవే ఐనా ఒక్కొక్క విద్యలో ఏవేవి అనుసన్ధానము చేసుకోదగినవో అవి అన్నీ కట్టడిచేయబడి ఉన్నవి. **ఇది అక్షరధీ అధికరణము.**

★ ★ ★

### ఇక అన్తరత్వాధికరణము.

సూ॥ **అన్తరాభూతగ్రామవత్ స్వాత్మనోఽన్యథా భేదానుపపత్తి రితిచేన్న ఉపదేశవత్ 3-3-35** సర్వాన్తరుడు ప్రత్యగాత్మ. భూతముల సముదాయము వలె తనకున్నూ. అట్లాకాకపోయినప్పుడు భేదము పొసగకుండా పోతుంది అన్నట్లయితే కాదు. ఉపదేశమును వలె. కనుక విద్యైక్యమే ఉన్నది. బృహదారణ్యకములోని ఉషస్తిప్రశ్నలో ఈ విధంగా పఠింపబడుతున్నది. **యత్సాక్షాదపరోక్షాత్ బ్రహ్మయ**

**ఆత్మా సర్వాన్తరః తన్మేవ్యాచక్ష్వ.** ఏది సాక్షాత్తుగాను అపరోక్షముగానున్నూ బ్రహ్మ అనబడుతున్నదో, ఎవడు ఆత్మగా ఉన్నాడో, ఎవడు అన్ని ప్రాణులలోనూ తెలియకుండా ఉంటున్నాడో అతడిని గురించి నాకు తెలియచెయ్యి అని. దానికి సమాధానము. **యః ప్రాణేన ప్రాణితి. సత ఆత్మాసర్వాన్తరో యోఽపానేనాపానితి సతఆత్మా.** ఎవడు ప్రాణానికి ప్రాణము అయ్యి బ్రతికించుతున్నాడో వాడు నీకు ఆత్మ. వాడే సర్వాన్తరుడు. ఎవడు అపానమునకు అపానముగా ఉండి ఉంటున్నాడో వాడు నీకు ఆత్మ అని చెప్పబడింది. అంతటితో సంతృప్తి కలుగని పృచ్ఛకుడు తిరిగి ప్రశ్నించగా ఇట్లు చెప్పినాడు. **నదృష్టేః ద్రష్టారం పశ్యేః నశ్రుతేః శ్రోతారం శృణుయాః నమతేః మన్తారం మన్వీథాః నవిజ్ఞాతేః విజ్ఞాతారం విజానీయాః ఏషతఆత్మా సర్వాన్తరోఽతోఽన్యదార్తమ్.** నీ చూపుకు కనిపించే వాడినే ఆత్మగా చూడకు. చెవులకు వినిపించేవాడుగాను, మతికి మన్తగాను, విజ్ఞానానికి విజ్ఞాతగానూ తెల్సుకోకు ఆయననే చూచేవాడు వినేవాడు తలపబడేవాడు తెల్సుకోదగినవాడు. అతడు నీకు ఆత్మ అంతమాత్రమే కాదు. అందరిలోనూ ఉన్నవాడు. ఆయనకంటే వేరుగా దేన్నీ చూడకు. అట్లా చూడబడేది లఘువు చిన్నది. అదేవిధంగా దీనితరువాత వచ్చే కహోల ప్రశ్నలోనూ ఈ విధంగా పఠింపబడుతున్నది. **యదేవ సాక్షాదపరోక్షాత్ బ్రహ్మ యఆత్మా సర్వాన్తరః తన్మేవ్యాచక్ష్వ ఇతి.** ఏదైతే సాక్షాత్తుగా అపరోక్షముగానూ బ్రహ్మఐ ఉన్నదో, ఎవడు ఆత్మగా ఉన్నాడో, సర్వులలోపల ఉంటున్నాడో అతడిని గురించి నాకు తెలియచెయ్యి అని. దీనికి ప్రతి వచనమునూ ఇట్లాగా ఉన్నది. **యో అశనాయాపిపాసే శోకం మోహం జరాంమృత్యుం అత్యేతి, ఏతంవై తమాత్మానంవిది త్వాబ్రాహ్మణః పుత్రైషణాయాశ్చ విత్తైషణాయాశ్చ** ఎవడు ఆకలి దప్పులు దిగులు మోహము – మంచి చెడు తెలియకపోవుట – ముసలితనము, మరణాన్ని దాటుకుంటున్నాడో అటువంటి ఆత్మను తెల్సుకొని ఉపాసించిన బ్రహ్మవేత్త పుత్రులు కావాలనే కోరికను, ధనము కావాలనే కోరికను అని ఆరంభించి **అతోఽన్యదార్తమ్.** దీనికంటే వేరయినది. ఆర్తము అనబడుతుంది. అనేంతవరకూ పఠింపబడింది. ఇక్కడ సందేహము కలుగుతున్నది. ఈ రెండింటిలో విద్యాభేదము ఉన్నదా? లేదా? అని. రెండింటిలో ఏది తగును? అని అన్నట్లయితే భేదము ఉన్నదనడమే సమంజసము. ఎందుకంటే రూపములో భేదము కనపడుతున్నది కాదా? ఎట్లా అని అంటే ప్రతివచనములో ఉన్న భేదాన్ని బట్టి రూపభేదము ఏర్పడుతున్నది. రెండింటిలోనూ ప్రశ్న ఒక్కతీరుగానే ఉన్నా సమాధానము మాత్రము తేడాగా ఉన్నది. మొదటి ఉషస్తి ప్రశ్నలో ప్రాణనము మొదలైనవాటికి

కర్తఐనవాడు సర్వాన్తరాత్మగా చెప్పబడుతున్నాడు. కహోల ప్రశ్నలోనేమో ఆకలిదప్పులు లేనివాడుగా తెలియబడుతున్నాడు. అందువల్ల మొదటిదానిలో ప్రాణము కల్గినవాడుగా / జీవించేవాడుగా జీవుడిని చేసేవాడుగాను దేహము ఇంద్రియాలు బుద్ధి మనస్సు ప్రాణముల కంటే వేరయిన వాడుగా ప్రత్యగాత్మ కంటే వేరయినవాడు ఆకలి దప్పులూ లేనటువంటి పరమాత్మ చెప్పబడుతున్నాడు. భూతగ్రామాన్ని కల్గిన ప్రత్యగాత్మ కూడా అందరికీ అన్తరాత్మ అవుతున్నందువల్ల సర్వాన్తరుడు అని అనడం చెల్లుతుంది. ఒకవేళ ప్రత్యగాత్మ భూతగ్రామాలకు మాత్రమే అన్తరుడు అవుతున్నాడనే కారణంతో అంతమాత్రానికే పరిమితుడన్నాడన్నా దాన్నిబట్టే అన్తరాత్మత్వాన్ని గ్రహించాలి. లేకపోయినట్లయితే ముఖ్యుడైన అన్తరాత్మగా ఎంచుకోబడాలనే ఆశతో పరమాత్మనుగా స్వీకరించితే ప్రతివచన భేదము ఒప్పదు. ప్రతివచనము ఉషస్తి ప్రశ్నలో ప్రత్యగాత్మకు సమ్బన్ధించినది. అప్పుడు పరమాత్మకు ప్రాణితృత్వము, అపానితృత్వము మొదలైనవి అసమ్భవాలు అవుతవి. రెండవది ఐన కహోల ప్రశ్న పరమాత్మకు చెందినట్టిది. ఆయన ఆకలి దప్పులు మొదలైనవాటికి అతీతుడు కదా! అందువల్ల ఇక్కడ ఒక శంక కల్గుతున్నది. లోపల ఉన్నవాడు భూతగ్రామాలకు వలె తనకు కూడా. అట్లాకాకపోయినప్పుడు భేదము కుదరకుండా పోతుంది కదా! అని. అన్నట్లయితే. అన్తరా – సర్వాన్తరాత్మ అవడం వల్ల మొదటి ప్రతివచనము, భూతగ్రామవత్ స్వాత్మనః – భూతగ్రామమును కలవాడు. దానిలోని స్వాత్మా – ప్రత్యగాత్మ సర్వాన్తరుడు అని చెప్పబడుతున్నాడని అర్థము. అన్యథాఽఆ విధంగా కానీ తీరుకు **యః ప్రాణేన ప్రాణితి, యోఽశనాయాపిపాసాద్యతీతః** అనే ప్రతివచనములలో ఉండే భేదము పొసగకుండా పోతుంది అని అన్నట్లయితే – దీనికి సమాధానము కాదు. విద్యాభేదము లేదు అని అర్థము. అది ఎట్లాగంటే **యత్సాక్షాదపరోక్షాత్ బ్రహ్మ య ఆత్మాసర్వాన్తరః** అనే ప్రశ్న పరమాత్మకు సమ్బన్ధించిందే. బ్రహ్మ శబ్దము పరమాత్మకే అసాధారణమైన పేరు ఐనా ప్రత్యగాత్మ విషయంలో ఒకానొకప్పుడు మర్యాద కొరకు ప్రయోగము కనిపిస్తున్నది. దాన్ని తోసిపుచ్చి పరమాత్మ అని తెలవడం కోసము **యత్సాక్షాద్ బ్రహ్మ** అని విశేషణాన్ని జత చేస్తున్నారు. ఇక అపరోక్షత్వము కూడా సర్వదేశాలలో సర్వకాలలలోనూ విడదీయరాని సమ్బన్ధాన్ని కలిగి ఉండడము. **సత్యం జ్ఞానమనన్తంబ్రహ్మ** అని చెప్పినవిధంగా అనన్తుడుగా తెలియవస్తున్న పరమాత్మకే చెల్లుతుంది. సర్వాన్తరత్వము కూడా **యఃపృథివ్యాం తిష్ఠన్ పృథివ్యాఅన్తరః** అని మొదలుపెట్టి **య ఆత్మనితిష్ఠన్ ఆత్మనోఽన్తరః** అని సర్వాన్తర్యామియైన పరమాత్మకే కుదురుతుంది.

ప్రతివచనము (సమాధానము) కూడా పైవాటి వలెనే పరమాత్మ విషయమే. **యః ప్రాణేనప్రాణితి.** అని నిరుపాధికమైన ప్రాణమునకు కర్తృత్వము (జీవుడిని బ్రతికించడము) పరమాత్మదే. సుషుప్తి కాలములో ప్రత్యగాత్మకు ఊపిరి పీల్చివదలే విషయంలో కర్తృత్వము లేదు. ఈ విధంగా తెలియనివాడైన ఉషస్తి ప్రాణనము (ఉచ్ఛ్వాస నిశ్వాసలు పీల్చి వదలడంలో) నందు కర్తృత్వము మాత్రము చెప్పబడిందని తలుస్తుండేవాడు అవుతున్నందువల్ల ప్రత్యగాత్మకు కూడా సాధారణమేనని ప్రతివచనము ద్వారా తెల్సుకొని సంతృప్తి చెందక తిరిగి ప్రశ్నించినందువల్ల ప్రత్యగాత్మ కంటే వేరయినవాడు ఎట్లాంటి కారణము లేకుండానే ప్రాణనాన్ని చేసే కర్తనుగా పరమాత్మను చెప్పినాడు. **నదృష్టేః ద్రష్టారం పశ్యేః** ఇత్యాది వాక్యములద్వారా! ఇంద్రియాలకు అధీనమైన దర్శనము శ్రవణము మననము విజ్ఞానాలకు కర్త ఐన ప్రత్యగాత్మను ప్రాణనానికి కర్తృత్వము కలవాడినిగా చెప్పినాడని తలచకు. అతడు గాఢ నిద్రా సమయంలో మూర్ఛ మొదలైన సమయాలలోనూ ప్రాణనాదులకు కర్త కాదు. కనుకనే **కోహ్యేవాన్యాత్ కఃప్రాణ్యాత్ యదేష ఆకాశఆనందో నస్యాత్** ఈ ఆకాశమనే పేరుతో పిలువబడే ఆనందమయుడైన పరమాత్మ కంటే ఎవడు సర్వప్రాణులను బ్రతికించుతున్నాడు? సుఖజీవనాన్నీ కలిగిస్తున్నాడు. ఒకవేళ ఈ ఆనందమయుడైన పురుషుడు లేకుంటే ఆ పనిని ఏ వ్యక్తి చేస్తున్నాడు. అని సర్వప్రాణులను బ్రతికించడమునకు కారణమైన వాడుగా పరమాత్మను గురించే మరొక శ్రుతిలో చెప్పబడింది. కనుక మొదటి ప్రశ్న ప్రతివచనాలు పరమాత్మకు చెందినటువంటివి. తరువాతి దాంట్లోనూ ఇంతే. ఆకలి దప్పులకు అతీతుడైన తత్త్వము పరమాత్మనే. అది ఆయనకు ఉన్న అసాధారణమైన ధర్మము. రెండువిద్యలలోనూ **అతోఽన్యదార్తమ్** అని ఉపసంహారమున్నూ ఒక్క తీరుగనే ఉన్నది. ప్రశ్న ప్రతివచనాలు ఆ వృత్తి సమస్త ప్రాణి కోటికీ ప్రాణన హేతువు ఐన పరబ్రహ్మ ఆకలి దప్పులు మొదలైనవాటికి అతీతుడని ప్రతిపాదించడము కొరకే.

ఈ విషయములో ఉదాహరణను చెప్పినాడు. ఉపదేశవత్ అనే పదముతో. సద్విద్యయందు **ఉత తమాదేశమప్రాక్ష్యః.** ఆ ఉపదేశాన్ని గురించి అడిగినావా? లేదా? అని సద్వస్తువును గురించి ఉపదేశము ప్రస్తావన చేయబడగా **భగవాన్స్త్వమేవ మే తద్బ్రవీతు ఇతి.** ఓ పూజ్యుడా! నీవేదాన్ని నాకు ఉపదేశించు అని, **భూయ ఏవ మా భగవాన్ విజ్ఞాపయతు** తిరిగి మీరే నాకు తెలియజేయండి. అనే ప్రశ్నకు **ఏషోఽణి మా**

**ఐతదాత్మ్యం ఇదం సర్వం తత్సత్యం.** ఇతడు అణువుకన్నా చిన్నవాడు. ఈ ప్రపంచమంతా ఈయననే ఆత్మగా కలిగి ఉన్నది. ఆయన సత్య శబ్దము చేత పిలువబడుతున్నాడు. అనే ప్రతివచనము మాటిమాటికీ ఆ వృత్తిచేయబడడము, దాని తరువాత బ్రహ్మ యొక్క ఆయా మహాత్మ్య విశేషాన్ని ప్రతిపాదించడం కోసమని కనిపిస్తున్నది. దానివలెనే ఇక్కడ కూడ ప్రశ్న ప్రతివచనాలు చేయబడుతున్నవి. అందువల్ల సర్వాన్తర భూతుడు ఐన ఒకే ఒక్క బ్రహ్మ ప్రాణులందరినీ ఊపిర్లు పీల్చుకొనేవాళ్ళనుగా చేసేవాడని అశనాయ మొదలైనవాటికి అతీతుడని ప్రతిపాదించుతున్నందువల్ల రూపము ఒక్కటే అవుతున్నది. అందువల్ల రెండు విద్యలూ వేరువేరు కావు. ఒక్కటే అవుతున్నవి.

ఐతే ఇట్లా కావచ్చును. రెండుచోట్లా ప్రశ్న ప్రతివచనాలు పరబ్రహ్మకు చెందినవే – ఐనా విద్యాభేదము కాదన వీలులేనిది. ఒకదాన్లో సర్వప్రాణులనూ బ్రతికించు తున్నందువల్ల ఉపాస్యుడవుతున్నాడు. మరొకచోట ఆకలిదప్పులు మొదలైన వాటికి అతీతుడైనందువల్ల ఉపాస్యుడిలో గుణభేదము వస్తున్నది. కనుక రూపభేదము, ప్రష్ట్ర (అడిగేవాడు) భేదము వల్లనున్నూ విద్యాభేదము ఏర్పడుతూనే ఉన్నది. ముందరి విద్యలో ఉషస్తి అడిగినవాడు, తరువాతి విద్యలో కహోలుడు. కనుక విద్యాభేదము ఉన్నది కదా? అని అంటే సమాధానము చెపుతున్నాడు.

సూ॥ **వ్యతిహారో విశింషన్తి హి ఇతరవత్ 3–3–36** రెండింటి లోనూ బుద్ధి వ్యతిహారమును చేసుకోవాలి. ఎందుకంటే యాజ్ఞవల్క్యుని మాటలు విశేషాన్ని తెల్పుతున్నవి. ఇతరమైన సద్విద్యలో వలె. **వ్యతిహారము – Exchange** ఇక్కడ విద్యాభేదము లేదు. ఏకరూపమైన అర్థానికి సమ్బన్ధించిన ప్రశ్న ప్రతివచనాలవల్ల, ఒక్క విధిపదము చేతనూ ఏకవాక్యత్వము తెలియవస్తున్నది కాబట్టి. రెండుప్రశ్నలు సర్వాన్తరాత్మత్వముతో విశిష్టమైన బ్రహ్మకు సమ్బన్ధించినవి. ద్వితీయప్రశ్నలో **యదేవ సాక్షాదపరోక్షాత్ బ్రహ్మ యఆత్మాసర్వాన్తరః అని** ఏవకారము కూడా తొలుత ఉషస్తుని చేత అడుగబడిన గుణాలతో కూడిన బ్రహ్మతో సమ్బన్ధాన్ని కహోల ప్రశ్నకు చెందినదిగా నిర్ధారణ చేస్తున్నది. ప్రతివచనమున్నూ రెండు చోట్లలో **సతే ఆత్మా సర్వాన్తరః** అని సర్వాన్తరాత్మత్వముతో విశిష్టమైన బ్రహ్మకు చెందినది కాబట్టి ఏకరూపమే. ఇక విధి ప్రత్యయమున్నూ రెండవదానిలో వలెనే కనిపించుతున్నది. **తస్మాత్ బ్రాహ్మణః పాండిత్యం నిర్విద్యబాల్యేన తిష్ఠాసేత్.** అందువలన బ్రహ్మవేత్త బ్రహ్మకు చెందిన జ్ఞానాన్ని సమగ్రంగా పొంది బాలునివలె తనలోని భావము ఎవ్వరికీ వెల్లడి కాకుండా

ఉండాలి అని. ఈ విధంగా రెండువిద్యలున్నూ సర్వాన్తరుడైన, ఆత్మత్వముతో కూడిన బ్రహ్మకు ఒక్కడికే చెందినవని నిర్ధారణ చేసుకొంటే ఒక్కదాని యందే సర్వాన్తరాత్మత్వముతో విశిష్టుడైన బ్రహ్మ యందు – ఉపాస్యుడైన వానియందు – ఉషస్త కహోలులకు ఒకరితో ఒకరి బుద్ధిని వ్యతిహారము / (వీరిది వారికి, వారిది వీరికి మార్పు) చేసుకోవాలి. ఉషస్తునికి సర్వాన్తరాత్మమైన బ్రహ్మ యందు సర్వప్రాణులనూ బ్రతికించే హేతువు అయ్యి ఉండడానికి చెందిన ఏ బుద్ధి ఉన్నదో, దానిని ప్రష్ట ఐన కహోలుని చేత కూడా చేయబడాలి. ఆ బ్రహ్మయందు ఆకలి దప్పులు మొదలైనవాటికి అతీతుడైయుండడానికి చెందిన ఏ బుద్ధి ఉన్నదో దాన్ని ఉషస్తుడు చెయ్యాలి. ఈ విధంగా పరస్పరము మార్పుచేసుకుంటే / మార్చుకుంటే ఇద్దరికిన్నీ సర్వాన్తరుడైన బ్రహ్మ జీవుడికంటే వేరైనవాడు అని అర్థమవుతుంది. ఈ సర్వాన్తరాత్మ ఐనవాడిని ప్రత్యగాత్మ కంటే వేరైన వాడని తెలియచెయ్యడానికి, సర్వప్రాణులను ప్రాణనము చేయడానికి హేతువు అయ్యి ఉండడము, అశనాయాద్యతీత త్వములను ప్రతిపాదించడం ద్వారా యాజ్ఞవల్క్యుని ప్రతివచనపు మాటలు విశేషములు కలవానినిగా తెలియపరుస్తున్నవి. కనుక బ్రహ్మకు సర్వాన్తరాత్మత్వమే ఉపాసించదగిన గుణము. ప్రాణనహేతుత్వం మొదలైనవి మాత్రము ఆసర్వాన్తరాత్మత్వాన్ని బలపరిచేవి. ఉపాసింపదగినవి కావు. ఏమండీ? ఒకవేళ సర్వాన్తరాత్మత్వమే ఉపాస్యగుణం ఐతే ప్రాణనహేతుత్వము కలవానికి, అశనాయాద్యతీతత్వము కలవానికిన్నీ, పృచ్ఛకుడైనవాడికిన్నీ పరస్పరము మార్పుచేసుకొని అనుసన్ధానము ఎందుకొరకు చేసుకోవాలి? అంటే ఆ ముచ్చటే చెప్పబడుతున్నది. సర్వప్రాణులనూ బ్రతికించడము అనే కారణము చేత బ్రహ్మ జీవుడు కంటే వేరయిన వాడని ఉషస్తుడికి అర్థముఐ నిర్ధారణ ఐనందున, కహోలుడు జీవుడికి ఎన్ని తీరులుగా ఐనా ఊహ చేయడానికి వీలుకాని స్వభావ విశేషాన్ని బట్టి సర్వాన్తరాత్మ వ్యావృత్తుడుగా / వేరయినవాడుగా అనుసంధించుకోదగినవాడని తలచి మాటిమాటికి ప్రశ్న వేసినాడు. యాజ్ఞవల్క్యుడున్నూ అతని అభిప్రాయాన్ని అర్థము చేసుకొని ప్రత్యగాత్మకు ఊహించడానికి అవకాశం లేని ఆకలి దప్పులకు ప్రత్యనీకుడై ఉండడమనే లక్షణాన్ని చెప్పినాడు ఇందుచేత ఉపాస్యునికి వ్యావృత్తి ప్రతీతి కలుగడం కొరకు ఇద్దరున్నూ పరస్పరమూ బుద్ధి వ్యతిహారమును చేసుకోవాలి. ఇతరవత్ ఎట్లాగైతే మరొక ఉపనిషత్తులో సద్విద్యయందు మళ్ళీ మళ్ళీ ప్రశ్నలు వెయ్యడం ప్రతివచనాలు చెప్పడముల ద్వారా సత్తు అనబడే ఆ బ్రహ్మనే వేరు చేయబడుతున్నాడు. కానీ ముందే

తెలిసిన గుణాని కంటే గుణాన్తరము / మరొక్క గుణమును కలిగి ఉండడముతో ఉపాస్యుడు ప్రతిపాదింపబడడం లేదు. ఆ విధముగానే అని.

ఆ సద్విద్యలోనూ ప్రశ్న ప్రతివచనాలకు భేదము ఉంటూంటే ఐక్యము ఎట్లా తెలుస్తున్నది? అని అంటే చెప్తున్నాడు.

సూ॥ **సైవ హి సత్యాదయః 3-3-37** సత్ శబ్దము చేత ఆ పరమకారణభూత ఐన దేవతనే చెప్పబడింది. ఆ మొదటగా చెప్పబడిన సత్యాదులే. తరువాతి పర్యాయములందున్నూ చెప్పబడినవి.

సైవహి – సత్ శబ్దము చేత చెప్పబడిన పరమకారణము ఐన పరదేవతనే **సేయం దేవతైక్షత** – ఆ దేవతనే సంకల్పించెను. **తేజః పరస్యామ్ దేవతాయాం** తేజస్సు పరదేవత యందు అని ప్రస్తావించబడినటువంటిదే. **యథా సౌమ్యమధు మధుకృతో నిస్తిష్ఠన్తి.** ఓ సోమ్యుడా! ఏ తీరుగానైతే తేనెటీగలు తేనెను తెట్టెలో చేర్చుతున్నవో! ఇత్యాదులైన పర్యాయాలలో అన్నింటిలోనూ ఉపపాదింపబడుతున్నది. **ఐతదాత్మ్యమిదం సర్వమ్ తత్సత్యం సఆత్మా** ఈ కనిపించే ప్రపంచమంతా ఈ పరమపురుషుడిని ఆత్మగా కల్గి ఉన్నట్టిదే. ఆయన సత్యమనబడుతున్నాడు. ఆయనయే ఆత్మ. అని ప్రథమ పర్యాయము నందు చెప్పబడిన సత్యాదులు అన్నిసార్లూ పర్యాయాలయందు ఉపపాదించి ఉపసంహరింపబడుతున్నవి.

కొంతమంది – **వ్యతిహారో విశింషన్తీ హీతరవత్ 2) సైవ హి సత్యాదయః** అనే రెండు సూత్రాలనూ రెండు అధికరణాలనుగా చెపుతున్నారు. వాటిలో మొదటిదానితో **త్వంవా అహమస్మిభగవోదేవతే. అహం వైత్వమసి భగవోదేవతే** ఓ దేవతా! నీవే నేనుగా ఉన్నాను. నేను నీవుగా ఐ ఉన్నావు. **తద్యోఽహం సోఽసౌ యోఽసౌ సోఽహమ్.** ఎవడు నేను అనబడుతున్నాడో, అతడు వీడు అనే వాక్యములో జీవుడికి, పరబ్రహ్మకు వ్యతిహారము (పరస్పరము మార్పు) అనుసన్ధానము చేయబడుతున్నది అని చెప్పబడ్తుందని అంటున్నారు. ఆ విషయము **సర్వం ఖల్విదం బ్రహ్మ, ఐతదాత్మ్యమిదం సర్వమ్, తత్త్వమసి** అనే వాక్యాల ద్వారా తెలియజేయబడిన సర్వాత్మ భావ విషయము ఐనందువల్ల ఈ వాక్యము చేత ప్రతిపాదించదగిన కొత్త విషయము ఏదీలేదు కావున ఆదరించకూడదు. ఆ విషయమే **ఆత్మే తితూ పగచ్ఛన్తి గ్రాహయన్తిచ** అనే సూత్రము ద్వారా చెప్పబడగలదు. సర్వాత్మ త్వానుసన్ధానానికి మించి పరబ్రహ్మ యందు

జీవత్వాను సంధానము కుదురదు. జీవుని యందున్నూ పరబ్రహ్మత్వాను సన్ధానము జరుగదు. తథ్యమిది.

ఇక రెండవసూత్రము చేత **సయోహవైతన్మహత్ యక్షం ప్రథమజం వేద సత్యం బ్రహ్మ** ఎవడైతే ఈయనను పెద్దదైనయక్షుడు తొలుతగా పుట్టినవాడు, సత్యమైన వాడు, బ్రహ్మ అని ఎరుగునో ఇత్యాది వాక్యంచేత ప్రతిపాదింపబడిన సత్యోపాసనమునకు, మరియు **తద్యత్సత్యమ సౌ సఆదిత్యో యఏవ ఏతస్మిన్ మండలే పురుషోయశ్చాయందక్షిణేఽక్షన్.** ఆ సత్యమనబడేవాడె వడున్నాడో అతడే సూర్యుడు. ఎవడైతే ఈ మండలములో ఉన్నాడో ఆ పురుషుడే ఈ కుడికంటిలోనూ ఉన్నాడు. ఇత్యాది వాక్యాల చేత ప్రతిపాదితమైన ఉపాసనానికీ ఐక్యము ప్రతిపాదింపబడుతున్నది అని. అది కూడా తగినది కాదు. దీనికి తరువాతి వాక్యము నందు అక్షి ఆదిత్య స్థానాల భేదాన్ని బట్టి విద్యా భేదము ఉన్నదని ఇంతకు మునుపే **నవా విశేషాత్** అనే సూత్రముతో ప్రతిపాదించినారు. ఐతే ఈ రెండింటికీ వ్యాహృత్యాదులు శరీరమునుగా కల్గి ఉన్నందువల్ల రూపాలను కల్గినవాళ్ళైనందువల్ల **హన్తి పాప్మానం జహాతిచ యఏవం వేద.** పాపాలను నశింపచేసుకుంటాడు. శరీరాన్ని విడిచి పెడతాడు. ఎవడైతే ఇట్లాగని తెల్సుకొని ఉపాసించుతాడో అని పృథక్ (విడిగా) సంయోగము, చోదనలను కలిగిన రెండు ఉపాసనలకున్నూ **స యో హ వైతన్మహత్ యక్షమ్ ప్రథమజం వేద సత్యం బ్రహ్మేతి – జయతీమాన్ లోకాన్** ఎవడైతే ఇతడిని మొదట పుట్టినవాడు గొప్ప యక్షుడు సత్యశబ్దముచేత పిలువబడేవాడు, నిజముగా మూడు కాలాల్లోనూ ఉండేవాడని బ్రహ్మ అని తెల్సుకొని ఉపాసించుతున్నాడో అతడు ఈ లోకాలనన్నింటినీ గెలుస్తున్నాడు. అని సంయోగము, రూపాదులను కల్గి ఉండడాలతో అవసరము లేకుండానే మొదటిదైన ఒక్కొక్క ఉపాసన చేతనే భేదము సిద్ధించుతున్నది. **హన్తి పాప్మానం జహాతి** అని చెప్పినందువల్ల గుణఫలాధికారత్వము అంగఫలము ఉన్నది అని అనగూడదు. అందుకు తగిన హేతువు లేదు మరి. ముందటి దానితోనే ఏకవిద్య అవుతున్నది అని అనడానికి ప్రమాణము లభించుతున్నది అని అంటావా కాదు. ఇతేతర ఆశ్రయదోషము వస్తున్నది. ఇవి రెండూ ఒకే విద్యనే అనే విషయము నిర్ణయింపబడితే మొదటి విద్యకు చెప్పబడిన ఫలాలకు గుణపలత్వము ఏర్పడుతుంది. వాటికి – పాపహననము, శరీరాన్ని విడవడములకు – గుణఫలత్వం నిశ్చయించితే సంయోగ భేదము లేదు కనుక మొదటి విద్యతో ఐక్యము ఏర్పడుతుంది. కనుక అన్యోన్యాశ్రయదోషము

వస్తుంది. కనుక ఈ విధంగా ఇంతవరకూ చెప్పిన కారణాలవల్ల పై రెండూ సూత్రాలే కానీ రెండు అధికరణాలు కావు. **ఇది అన్తరత్వాధికరణము**

★ ★ ★

## ఇక కామాద్యధికరణము

సూ॥ **కామాదీతరత్ర తత్ర చఆయతనాధిభ్యః 3-3-38** ఛాన్దోగ్యములో వాజసనేయకములోను కామాదులే రూపము. కనుక విద్యలభేదము లేదు. హృదయాయ తనత్వ సేతుత్వవిధరణ త్వాదుల వలన. ఛాన్దోగ్యములో ఇట్లా వినిపిస్తున్నది. **అథయదిదమస్మిన్ బ్రహ్మపురే దహరం పుండరీకంవేశ్మ దహరోఽస్మిన్నన్తరాకాశః తస్మిన్ యదన్తః తదన్వేష్టవ్యమ్.** ఇక ఈ బ్రహ్మ పురము నందు దహరము అనబడే తామర మొగ్గ వంటి ఇల్లు ఉన్నదో దానిలోపల ఉన్న ఆకాశము దహరమనబడుతున్నది. దాని లోపల ఏది ఉన్నదో దానిని అన్వేషించవలెను. ఇత్యాదిగా. ఇక వాజసనేయకంలో కూడా **సవాఏషమహానజ ఆత్మాయోఽయం విజ్ఞానమయః ప్రాణేషు య ఏషోఽన్తర్ హృదయ ఆకాశః తస్మిన్ శేతే సర్వస్యవశీ సర్వ స్యేశానః.** అటువంటి వాడైన ఈ గొప్పవాడు పుట్టుకలేనివాడున్నూ ఐన విజ్ఞానమయుడు (జీవాత్మ) ప్రాణములయందు (ఇంద్రియాలు) ఉంటున్నాడు. అతని హృదయము లోపల ఆకాశము ఉన్నది. అక్కడ సమస్త ప్రపంచాన్ని తన అదుపులో నుంచుకున్నవాడు. అందరినీ శాసించేవాడు. శయనించి ఉన్నాడు. ఇత్యాదిగా ఇచ్చట సందేహం ఏర్పడుతున్నది. ఈ రెండింటికీ విద్యాభేదము ఉన్నదా? లేదా? అని. ఏది తగును అని అంటే భేదమేనని ఎందుకు అని అంటారా? రూపంలో భేదము ఉన్నది కనుక. ఛాన్దోగ్యములో అపహతపాప్మత్వము మొదలైన ఎనిమిది గుణాలతో విశిష్టమైన ఆకాశము ఉపాసన చేయతగినదిగా తెలియవస్తున్నది. వాజసనేయకము లోనైతే ఆకాశములో పడుకున్న వశిత్వాదిగుణ విశిష్టుడు ఉపాస్యుడుగా తోస్తున్నాడు. కావున రూపభేదము ఉన్నందువల్ల విద్యా భేదము ఉన్నది అని. ఈ విధంగా పూర్వపక్షము రాగా చెపుతున్నాము. భేదము లేదు అని. ఎందువల్ల నంటే రూపములో భేదము లేదు కాబట్టి. ఛాన్దోగ్యము లోను వాజసనేయకములోనూ కామాదులే రూపము. అనగా సత్యకామాది గుణాలతో విశిష్టమైన బ్రహ్మనే ఉపాస్యమై ఉన్నాడు. ఇది దేని ద్వారా తెలుస్తున్నదని అంటే ఆయతనాదులవల్ల. హృదయములో ఉండుట, సేతువు వలె ఉండుట,

విధరణత్వాదులను బట్టి రెండుచోట్లలోనూ అదే విద్య అని ప్రత్యభిజ్ఞ (గుర్తు పట్టుట) కలుగుతున్నది. వాజసనేయకములో వినిపించిన వశిత్వాదులు ఛాందోగ్యమునందు వినిపించిన గుణాష్టకములో ఒకటి ఐన సత్యసంకల్పత్వానికి చెందిన విశేషాలు అవుతున్నాయి గనుక సత్యసంకల్పానికి సహచారులు ఐన సత్యకామత్వాదులు అపహత పాప్మత్వము దాకా ఉన్న గుణాలయొక్క ఉనికిని తెలియచేస్తున్నవి. కావున రూపములో భేదము లేదు. ఇక సంయోగము కూడా **పరంజ్యోతిరుపసమ్పద్య స్వేనరూపే ణాభినిష్పద్యతే.** పరంజ్యోతి యైన శ్రీమన్నారాయణుని వద్దకు చేరుకొని తనదైన సహజస్వరూపాన్ని పొందుతున్నాడు. **అభయం వైబ్రహ్మభవతి.** భయము లేని బ్రహ్మ అవుతున్నాడు అని చెప్పినట్లు బ్రహ్మప్రాప్తి ఐన రూపము భేదించడం లేదు. ఆకాశ శబ్దము ఛాందోగ్యములో పరమాత్మకే చెందినది అని **దహర ఉత్తరేభ్యః** అనే సూత్రం వద్ద నిర్ణయింపబడింది. వాజసనేయకములోని ఆకాశవాచ్యుని యందు వశిత్వాదులు వినిపించుతున్నందువల్ల ఆ పందు కున్నవాడు పరమాత్మ అవుతున్నందువల్ల ఆయనకు ఆధారమైన దాన్ని చెప్పే ఆకాశ శబ్దానికి **తస్యాన్తేసుషిరం సూక్ష్మమ్** దానికి చివరలో మిక్కిలి వెలుగుతున్న సూక్ష్మము అనే వాక్యము ప్రకారము హృదయములోపల ఉన్న సుషిర శబ్దవాచ్యుడైన ఆకాశమునే చెప్పుతుందని అర్థమవుతున్నది. అందువల్ల విద్యలు రెండూ ఒక్కటే.

వాజసనేయకము నందు వశిత్వాదులతో కూడా సత్యకామాదుల ఉనికి తెలుస్తున్నది అని ఏ మాట చెప్పినారో అది తగిన మాటకాదు. చెల్లదు. వాస్తవానికి అక్కడ వశిత్వాదులకే సద్ భావము లేదు. ఆ గుణాల యొక్క ఉనికి లేకపోవడము **మనసైవానుద్రష్టవ్యమ్ నేహనానాఽస్తి కించన. మృత్యోః సమృత్యుమాప్నోతి య ఇహనానేవపశ్యతి.** మనస్సుతో మాత్రమే దర్శనాన్ని చేసుకోవాలి. ఇక్కడ అనేకమైన పదార్థాలు లేవు. ఎవడైతే ఒక్కటే ఉన్నచోట చాలా చాలా ఉన్నట్లు చూస్తాడో (భావించుతాడో) వాడు ఒక మరణాన్నించి మరొక చావుకు (జన్మపరమ్పరలు) పోతున్నాడు. **ఏకధైవానుద్రష్టవ్యం ఏతదప్రమేయం ధృవమ్.** ఈ అప్రమేయమూ ధృవమూ ఐన దానిని ఒకే ఒక్క దాన్నిగా దర్శించాలి అని ప్రారంభము ఐన వాక్యము ద్వారా **సఏషనేతినేత్యాత్మా.** ఆ ఇతడు కాదు కాదు అనబడుతున్నాడు. ఆయన ఆత్మ అని ఉత్తరవాక్యముతో ఉపాస్యమైన బ్రహ్మ నిర్విశేషుడు గుణాలు లేనివాడు అని ప్రతీతి అవుతున్నందువల్ల దృఢపడుతున్నది.

కనుక వశిత్వాదులు కూడా స్థూలత్వము అణుత్వములవలె నిషేధించదగినవనే తోస్తున్నది. ఈ కారణం చేతనే ఛాన్దోగ్యంలో కూడా సత్యకామత్వాదులు పరమాత్మకు పారమార్థికములైన గుణాలు కావని చెప్పబడ్తున్నవి. ఈ విధంగా సహజాలు సత్యాలు కాకపోవడం చేత ఇటువంటి గుణాలు మోక్షం కొరకై చేసే ఉపాసనల యందులోపము ఏర్పడుతుంది అని శంకించవచ్చును. దానికి ఇది సమాధానము.

సూ॥ **ఆదరాదలోపః 3-3-39** ప్రేమతో గుణాలను ఉపదేశిస్తున్నారు కనుక లోపము కాదు. ఉపసంహారమే చేసుకోవాలి. ఇతర ప్రమాణాలచేత తెలియరాని ఈ సత్యకామత్వాది గుణాలు బ్రహ్మయొక్క గుణాలు ఐనందువల్ల **తస్మిన్ యదన్తః తదన్వేష్టవ్యమ్.** వానిలోపల ఏవి ఉన్నవో వాటిని వెతుకవలెను. **ఏష ఆత్మాఅపహత పాప్మా విజరోవిమృత్యుః విశోకోఽవిజిఘత్సో అపిపాసస్సత్యకామః సత్యసంకల్పః సర్వస్యవశీసర్వస్యేశానః 2) ఏషభూతాధిపతిరేష భూతపాల ఏషసేతుర్విధరణ ఏషాం లోకానామసమ్భేదాయ** ఇత్యాది వాక్యాలవల్ల ఈ రెండు ఉపనిషత్తులలోనేగాక ఇంకా ఇతర శ్రుతుల్లోనూ మోక్షం కొరకు చేయబడే ఉపాసనలయందు ఉపాస్యుడైన బ్రహ్మ గుణాలవుతున్నందువల్ల సాదరముగా ఉపదేశించినందువల్ల లోపము వీటికిలేదు. ఉన్నటువంటివే. పైగా వీటిని అన్నింటిలోనూ తెచ్చిపెట్టుకోవలసిందే. ఛాందోగ్యము లోనైతే **తద్యఇహాత్మా నమనువిద్యవ్రజన్తి ఏ తాంశ్చ సత్యాన్ కామాన్ తేషాం సర్వేషు లోకేషు కామచారోభవతి.** అందువల్ల ఎవడైతే ఈ భూలోకమందు పరమాత్మను తెల్సుకొని, ఈ సత్యములైన (అపరమార్థము కాని) గుణాలను తెల్సుకొని ఉపాసించి పరమాత్మ సన్నిధికి వెళ్ళుతున్నారో వారు లోకాలన్నింటిలోనూ స్వేచ్ఛగా రాకపోకలను కొనసాగించుతారు అని సత్యకామత్వాది గుణవిశిష్టుడైన పరమాత్మను తెల్సుకోవాలని విధించి **అథయ ఇహఆత్మానమనను విద్యవ్రజంత్యేతాంశ్చ సత్యాన్ కామాన్ తేషాం సర్వేషు అకామచారోభవతి** ఇక ఎవరైతే ఆత్మను గురించి, ఆయనలోని కళ్యాణగుణాలను గురించి తెల్సుకోకుండా శరీరం విడిచి వెళ్ళుతారో వారు సర్వలోకాల్లో కామచారులు కారు. అని తెల్సుకోకపోవడాన్ని గురించి నిందచేయబడుతున్నదై గుణవిశిష్టుడైన పరమాత్మను గురించి తెల్సుకోవడముపైన ఆదరాన్ని చూపుతున్నది. అదేవిధంగా వాజసనేయకములో **సర్వస్యవశీసర్వస్యేశానః... ఏష సర్వేశ్వర ఏషభూతాధిపతిరేష భూతపాలః** అని మాటిమాటికీ ఐశ్వర్యాన్ని (సమ్పదను, అధికారాన్ని) ఉపదేశించినందువల్ల గుణాలపైన ఆదరము తేటపడుతున్నది. ఇట్లాగే

మిగతా చోట్లలోనున్నూ. వేయిమంది తల్లితండ్రుల జంటలకంటే ఎక్కువగా ప్రేమను చూపే వేదశాస్త్రము మోసకారివలె అపరమార్థములైన, ప్రమాణాన్తరాల చేత తెలియరాని నిరసించదగిన గుణాలను ప్రేమతో ఉపదేశించి సంసారమనే చక్రములో పడి కింద మీదవుతున్న ముముక్షువులను (జనన మరణాల నుండి విడిపించుకోవాలి అని తలిచేవారిని) ఇంకా భ్రమ పెట్టజాలదు. **నేహనానాఽస్తికించన, ఏకధైవానుద్రష్టవ్యమ్** అనే వాక్యాలైతే ఈ సమస్తమూ బ్రహ్మ చేత పుట్టింపబడినట్టిది ఐనందువల్ల ఆయనతో సమ్బన్ధము – ఆత్మ అయ్యి ఉండడము – వల్ల, బ్రహ్మాత్మకము ఐనందువల్ల నున్నూ ఏ కధా – ఆయనను గానే – తలచాలి అని విధించి / శాసించి బ్రహ్మాత్మకమైనందువల్ల బ్రహ్మ జ్ఞానము కల్గుకముందు ఏర్పడిన అనేక వస్తువులు ఉన్నవి అనే భావనను / జ్ఞానాన్ని నిషేధించుతున్నది అని అర్థము దీన్ని మేము మునుపే విస్తరించి చెప్పినాము. **సఏషనే తినేత్యాత్మా** అనే చోటనున్నూ ఇతి అనే శబ్దముతో ఇతరములైన ప్రమాణాలచేత తెల్సిన ప్రపంచస్వరూపాన్ని పరామర్శించి / తడిమి బ్రహ్మ అటువంటివాడు కాదని అందరికీ ఆత్మ ఐన బ్రహ్మ ఈ ప్రపంచానికంటే విలక్షణుడు అని ప్రతిపాదిస్తున్నది. దాన్నే తదుపరి ఉపపాదిస్తున్నది. **అగ్రాహ్యః న హిగృహ్యతే. అశీర్యః నహిశీర్యతే. అసంగః నహిసజ్యతే। అవ్యథితః నవ్యథతే. నరిష్యతి.** అగ్రాహ్యుడు. గ్రహింపబడడు. (పట్టుకోబడడు) అశీర్యుడు. చీల్చబడడు. అసంగుడు ఎవ్వరితోనూ కలువడు. అవ్యథితుడు బాధపడడు. నశించడు అని ఇతర ప్రమాణాల చేత తెలియదగిన వారికంటే విసజాతీయుడు (సాటికానివాడు) ఐనందువల్ల గ్రహింపబడడు / తెలియబడడు. విశరణీయమైన దాని కంటే విసజాతీయుడైనందువల్ల విశీర్ణముకాడు (చీల్చబడేది వేరు చేయబడేది – ప్రకృతి) ఇదే తీరుగా తరువాతి పదాలకు అర్థాన్ని) ఊహించుకోవాలి. ఇక ఛాన్దోగ్యములో కూడా **నాస్యజరయైతతత్ జీర్యతి. నవధేనాస్య హన్యతే. ఏతత్ సత్యం బ్రహ్మ పురమ్. అస్మిన్ కామాః సమాహితాః** ఈయన శరీరము ముసలితనముతో శిథిలము చేయబడదు. వధించుటతో చంపబడదు. ఇది నిజమైనది (ఎల్లకాలం ఉండేది. బ్రహ్మకు నివాస పట్టణము. ఈయన యందు కామాలు (గుణాలు అన్నీ) ఒక్కచోట చేరి ఉన్నవి. అని బ్రహ్మను సర్వవిసజాతీయునిగా ప్రతిపాదించి ఆయనలో సత్యకామత్వము మొదలైనవన్నీ విధింపబడుతున్నవి.

ఇట్లా ఐనప్పటికీ **తద్య ఇహ ఆత్మానమనువిద్య వ్రజంత్యేతాంశ్చ సత్యాన్ కామాన్, తేషాం సర్వేషులోకేషు కామచారోభవతి సయదిపితృ లోకకామోభవతి** ఎవరైతే ఇక్కడ

ఆత్మను ఉపాసించి ఆయనలోని గుణాలనున్నూ తెల్సుకొని పరమ పదానికి పోతారో వారు అన్నిలోకాల్లోనికిన్నీ రాకపోకలు చేయగలరు. ఒకవేళ పితృలోకాన్ని దర్శించాలని తలచినట్లైతే ఇత్యాది వాక్యాల చేత సత్యకామాది గుణవిశిష్టుడైన బ్రహ్మను ఉపాసించితే సాంసారికమైన ఫలముతో సమ్బన్ధము ఏర్పడుతున్నట్లు తెలుస్తున్నది కాబట్టి బ్రహ్మను చేరుకోవాలనుకున్న ముముక్షువు సగుణుడైన బ్రహ్మను ఉపాసించరాదు. ఇక పరవిద్యా ఫలమేమో **పరంజ్యోతి రుపసమ్పద్య స్వేన రూపేణాభినిష్పద్యతే** అని స్వస్వరూపావిర్భావాన్నే చెపుతున్నది. అందువల్ల సత్యకామత్వాదులు బ్రహ్మను పొందదల్చుకున్న వాడికి చేర్చుకోదగినవి (ఉపసంహార్యములు) కావు అని అంటే సమాధానాన్ని చెపుతున్నారు.

సూ॥ **ఉపస్థితేఽతస్తద్వచనాత్ 3-3-40** పరమాత్మను చేరుకోవడం వల్లనే సర్వలోకకామ చారము కలుగుతున్నది. దాన్నే – కళ్యాణగుణాలు కల పరబ్రహ్మను ఉపాసించాలి అని చెప్పినారు కనుక ఉపస్థితి అనగా ఉపస్థానము, అనగా బ్రహ్మోపసమ్పత్తి. బ్రహ్మ దగ్గరకు చేరుకోవడము. ఉపస్థానము – ఉపాసన చేసిన ప్రత్యగాత్మ సర్వ విధబన్ధాలనుండి విముక్తుడై తనదైన తొంటి రూపాన్ని పొందగా, ఈ కారణము చేతనే సర్వలోకాలలోనూ కామచారము చెప్పబడుతున్నది. **పరంజ్యోతిరుప సమ్పద్య స్వేనరూపేణ అభినిష్పద్యతే 2) స ఉత్తమః పురుషః. 3) సతత్రపర్యేతి జక్షత్ క్రీడన్ రమమాణః స్త్రీ భిర్వాయానైర్వా జ్ఞాతిభిర్వా నోపజనం స్మరన్నిదం శరీరమ్ 4) స స్వరాడ్ భవతి 5) తస్య సర్వేషులోకేషు కామచారో భవతి** అని. ఇదంతా నాలుగవ అధ్యాయములో చాల తేటగా ఉపపాదింపబడగలదు. కనుక అన్నిలోకాలలో కామ చారత్వము ముక్తునికి అనుభవింపదగిన ఫలమైనందున మోక్షము కోరేవాడు సత్యకామత్వాది గుణాలను ఉపసంహారము చేసుకోవాలి. **ఇది కామాద్యధికరణము.**

★ ★ ★

## ఇక తన్నిర్ధారణానియమాధికరణము.

సూ॥ **తన్నిర్ధారణాని యమః తద్దృష్టేః పృథక్ హి అప్రతిబన్ధః ఫలమ్ 3-3-41** కర్మలయందు ఉద్గీథాద్యుపాసనలకు నియమము లేదు. అనియమమే కనబడ్తున్నది కాబట్టి. కర్మఫలము వేరుగానే ఉన్నది. ప్రతిబన్ధము లేక ఫలము కనిపించుచుతూ ఉన్నది. **ఓమిత్యేత దక్షరమ్ ఉద్గీథము పాసీత.** ఓమ్ అనే ఏకాక్షరము గల ఉద్గీథాన్ని

ఉపాసించాలి. ఇత్యాదులై కర్మలకు అంగాలైన ఉపాసనాలు కర్మలకు అంగములైన ఉద్గీథాదుల ద్వారా, జుహూ ఆదుల ద్వారా పర్ణతాదుల వలె కర్మాంగాలుగా ప్రసిద్ధి కెక్కిన అనుష్ఠానాలు కావున ఉద్గీథాదులైన ఉపాసనలతో సమ్బన్ధము కలవి. **యదేవ విద్యయాకరోతి శ్రద్ధయాఉపనిషదా తదేవవీర్యవత్తరం భవతి.** ఏ కర్మనైతే బాగుగా తెల్సుకొని జ్ఞానముతో శ్రద్ధతో చక్కని మనస్సుతో చేస్తాడో అదే మరింత శక్తిమన్తము అవుతుంది. అని వర్తమానకాలముతో నిర్దేశింపబడిన దానికి పర్ణతాదులతో సమ్బన్ధము కల పాపము లేకపోవుటను కీర్తించే విషయము వినిపించిన తీరుగా విడిగా ఫలము ఉన్నదని కల్పించడము కుదురదు. కనుక క్రతువుల యందు నియమంగా (తప్పని సరిగా) ఉపసంహరించుకోవలెను అని పూర్వపక్షము సిద్ధముకాగా సమాధానమును చెపుతున్నాము. తన్నిర్ధారణా నియమః అని. నిర్ధారణమ్ అనగా మనస్సును దృఢ నిశ్చయముతో నిలుపడము. అనగా ధ్యానము అని అర్థము. తన్నిర్ధారణా నియమము – కర్మలయందు ఉద్గీథాద్యుపాసనలు తప్పక చేయాలి అనే నియమము లేదు. ఎందువల్లనంటే తద్దృష్టేః అది కనిపిస్తున్నది కాబట్టి. ఉపాసనలు అనుష్టించాలనే నియమము లేకపోవుట కనిపిస్తున్నది. **తేనో భౌకురుతో యశ్చైతదేవం వేద యశ్చన వేద.** ఆ కారణము చేత ఇద్దరూ చేస్తున్నారు. ఎవడిట్లాగని తెల్సుకుంటున్నాడో, ఎవడు ఎరుగక ఉన్నాడో, అనే వాక్యము ప్రకారము తెలియనివాడు కూడా అనుష్ఠానము చేస్తున్నాడని చెప్పినందువల్ల. అంగము ఐనప్పుడు ఉపాసనను చేయకుండా ఉండడము చెల్లదు. ఈ తీరుగా ఉపాసనము అంగము కాదని నిశ్చయింపబడితే ఉపాసన విధికి ఫలాకాంక్ష (ఫలము ఏది అనే కోరిక) కలిగినప్పుడు రాత్రి సత్రన్యాయము ప్రకారము వీర్యవత్తరత్వము, కర్మ యొక్క ఫలము కంటే వేరుగానే ఫలము ఉంటున్నదని తెలుస్తున్నది. వీర్యవత్తరత్వము అంటే ఏమిటి? అంటే కర్మఫలము నిల్చిపోకుండా ఉండడము – దేనిచేత కూడా అడ్డుకోబడకుండా ఉండడమే, ప్రబలమైన ఏదో ఒక కర్మ ఫలముచేత అది ముగిసిపోయేంతవరకు నిలిపివేయబడడము. అది జరుగకుండడమే అప్రతిబన్ధము. ఆ అప్రతిబన్ధము స్వర్గాది లక్షణమైన కర్మ ఫలము కంటే విడిగా ఉన్నటువంటిదే.

అందుచేత ఇదీ చెప్పబడుతున్నది. పృథక్హి అప్రతిబన్ధః ఫలమ్ అని. కనుక కర్మాంగములుగా ఆశ్రయించిన వాటికిన్నీ వేరుగా ఫలము ఉంటున్నది. కనుక గోదోహనము – ఆవుపాలనుపిండడము – ఇది యజ్ఞంలో అధ్వర్యుడు చేసేది.

కొన్నిసార్లు యజమాని కూడా చేయవచ్చు. అప్పుడు ఫలము వేరుగా ఉంటుంది – మొదలైనవాటి వలె కర్మలలో ఉద్గీథాది ఉపాసనలను తప్పనిసరి అనే నియమం లేకుండా ఉపసంహారము చేసుకోవలెను. **ఇది తన్నిర్ధారణానియమాధికరణము.**

★ ★ ★

**ఇది ప్రదానాధికరణము.**

సూ॥ **ప్రదానవదేవ తదుక్తమ్ 3-3-42** హోమములో ఆహుతులు ఇవ్వడము వలెనే గుణఆవృత్తిని చెయ్యాలి ఆవృత్తి – మళ్ళీ మళ్ళీ చెయ్యడము. దాన్నే సంకర్షణ కాండలో చెప్పినారు. దహర విద్యలో **తద్య ఇహాత్మానమనువిద్యవ్రజన్త్యేతాంశ్చసత్యాన్ కామాన్** అనే వాక్యముతో దహరాకాశమనబడే పరమాత్మను ఉపాసన చేయాలి అని చెప్పి **ఏతాంశ్చ సత్యాన్ కామాన్** అని గుణాలను కూడా విడిగా ఉపాసనము చేయాలని విధించినారు. ఆ విషయములో సంశయము కలుగుతున్నది. గుణాలను చిన్తించి నప్పుడు కూడా ఆయా గుణాలను కలిగి ఉన్నందున దహరమనే ఆత్మను కూడా చిన్తించవలెనా? లేదా? అని. దహరాకాశమే అపహతపాప్మత్వాదులను కలదై గుణి అవుతున్నందువల్ల ఆదహరాకాశాన్నే ఒక్కసారి అనుసన్ధానము చేయడానికి వీలు అవుతుంది. గుణాలను అనుసంధానము చేయడం కొరకు తిరిగి గుణియైన దహరపురుషుడిని చిన్తించడమనే పనిలో ఆ వృత్తి చేయడం తగదు. అని పూర్వపక్షము రాగా చెప్పబడుతున్నది.

ప్రదానవదేవ అని. ప్రదానము వలె – ఆహుతిని ఇవ్వడమువలె ఆ వృత్తిని చేయవలసిందే. దహరాకాశ పురుషుడొక్కడే అపహత పాప్మత్వాదులైన గుణాలకు వాటిని కలిగిన గుణి అవుతున్నా ఆయన ముందుగా చిన్తించబడినాడు. అట్లయినా స్వరూపము ఒక్కదానివల్లనే గుణాలతో కూడిన ఆకారము కలవాడు వేరవుతున్నాడు కనుక **అపహత పాప్మా విజరః** ఇత్యాదుల చేత గుణ విశిష్టుడైనందున, ఉపాస్యుడుగా విధింపబడినందువల్ల, తొలుత స్వరూపము ప్రకారము అనుసన్ధానము చేయబడిన వాడిని అపహత పాప్మత్వాదుల చేత విశిష్టుడుగా అనుసన్ధానము చేయడం కొరకు ఆ వృత్తి చేయవలసి ఉంటుంది. **యథేన్ద్రాయరాజ్ఞేపురోడాశమేకాదశకపాలం నిర్వపేత్** ఎట్లాగైతే రాజైన ఇంద్రుని కొరకు పదకొండు **కపాలముల**పురోడాశముతో (చిప్పల) హోమాన్ని చేయాలి. **ఇంద్రాయాధి రాజాయ, ఇంద్రాయ స్వరాజ్ఞే** రాజులకు రాజైన

ఇంద్రుని కొరకు, తనకు తానే రాజైన ఇంద్రుని కొరకు అని ఇంద్రుడు రాజత్వాది గుణవిశిష్టుడైనా ఆయా గుణములతో సమ్బన్ధము ఉన్న ఆకారము వేరవుతున్నది కాబట్టి మళ్ళీ ప్రదానావృత్తి చేయబడుతున్నది. అందుకే సంకర్షణ కాండ – పూర్వమీమాంసలో ఇట్లా చెప్పబడింది. **నానా వా దేవతా పృథక్త్వాత్.** గుణాలు వేరయినందువల్ల దేవత వేరవుతున్నది అని. **ఇది ప్రదానాధికరణము.**

★ ★ ★

## ఇక లింగభూయస్త్వాధికరణము

సూ॥ **లింగభూయస్త్వాత్ తద్ధిబలీయః తదపి 3-3-43** గుర్తులు ఎక్కువగా ఉన్నందువల్ల అదే బలవన్తము ఐనది. ప్రకరణము కంటే. ఆ మాట కూడా చెప్పబడింది. తైత్తిరీయోపనిషత్తులో దహర విద్య తరువాత ఈ విధంగా చదువుతున్నారు. **సహస్ర శీర్షందేవం విశ్వాక్షం విశ్వ శంభువమ్ విశ్వంనారాయణం దేవం అక్షరం పరమం ప్రభుమ్.** వేలకొలది శిరస్సులు కలవాడు గొప్పగా వెలిగేవాడు విశ్వానికంతటికీ కన్నువంటివాడు. విశ్వానికి మంగళాలను / మేళ్ళను శాన్తిని ఇచ్చెడివాడు, తానే విశ్వము ఐనవాడు. దేవుడైన నారాయణుడు తరుగుదల లేనివాడు. తనకంటే మించిన వాడు లేనట్టి గొప్ప ప్రభువు అని మొదలుపెట్టి **సోఽక్షరః పరమః స్వరాట్** ఆయనే అక్షరుడు పెద్దల మనుకొనే వారందరికన్నా పెద్దవాడు. స్వతన్త్రుడు (ఆయనను శాసించే ఎటువంటి అధికారీ లేనివాడు) అనేంత దాకా. అక్కడ సంశయము కలుగుతున్నది. దీనికి ముందు చెప్పబడిన విద్యతో ఐక్యము ఉన్నందువలన / ఒకే విద్య కావడాన్ని బట్టి అందులో చెప్పబడిన ఉపాస్యుడైన వానియందలి విశేష నిర్ధారణము దీనిద్వారా చేయబడుతున్నదా? లేక అన్ని వేదాన్తాలలో చెప్పబడిన పరవిద్యయందు ఉపాస్యుడైన వాడి నిర్ధారణము చేయబడుతున్నదా? అని. ఏది తగును? దహరవిద్యలో ఉపాస్యుడైన విశిష్ట పురుషుడి నిర్ధారణమే అని. ఎందుకు? అని అంటే ప్రకరణాన్ని బట్టి. దీనికి ముందరి అనువాకములో దహర విద్య చెప్పబడింది.

**దహ్రం విపాప్మం పరవేశ్మభూతం యత్పుండరీకం పురమధ్యసంస్థమ్. తత్రాపి దహ్రం గగనం విశోకస్తస్మిన్ యదన్త స్తదుపాసితవ్యమ్.** పురమనబడే జీవుని యొక్క శరీరము నడుమన పరమాత్మకు నివాస స్థానమైన పాపాలు (దోషాలు) లేనటువంటి తామర మొగ్గ వంటిది దహ్రమనబడేది ఉన్నది. దానిలో కూడా

దహ్రమనబడే ఆకాశము ఉన్నది. అది శోకము (దిగులు) లేనిది. దానిలోపలనున్నూ ఏది ఉన్నదో దాన్ని ఉపాసించాలి అని. ఈ అనువాకము నందు **పద్మకోశప్రతీకాశం హృదయంచాప్యధోముఖమ్** తామరమొగ్గ వలె ఉండి తలకిందులుగా వేలాడుతూ హృదయమున్నది. ఇత్యాది వాక్యముతో హృదయ పుండరీకాన్ని చెప్పడము ఈ నారాయణానువాకము దహరవిద్యలో ఉపాసింపతగినవాడిని నిర్ధారణము చేయడము కొరకనే అభిప్రాయాన్ని బలపరుస్తున్నది. అని పూర్వపక్షము రాగా చెప్పుతున్నాము. లింగ భూయస్త్వాత్ అని. ఈ నారాయణానువాకము అన్ని పరవిద్యల్లోనూ ఉపాస్యుడైన పురుష విశేషుడిని నిర్ధారణ చేయడం కొరకు చాలా చాలా లింగాలు ఉన్నవి. అది ఎట్లా అంటే? పరవిద్యలందు అక్షర, శివ, శంభు, పరబ్రహ్మ, పరంజ్యోతి, పరతత్త్వ, పరమాత్మ మొదలైన శబ్దాలతో పేర్కొనబడిన ఉపాస్యుడైన వస్తువును ఆ శబ్దాలతోనే అనువదించి (తిరిగి ఎత్తి చెప్పి) ఆయన నారాయణుడు అని విధించుతున్నారు. చాలా విద్యలలో వినిపించబడిన వారిని అనువదించి నారాయణుడని విధానము మాటిమాటికీ చేయడము **"నారాయణుడు మాత్రమే అన్ని బ్రహ్మ విద్యలలోనూ ఉపాసింపదగినవాడు. అస్థూలత్వము మొదలైన గుణాలచేత విశేషితుడై ఆనందగుణప్రధానుడైన వాడే పరంబ్రహ్మ"** అని ప్రత్యేకంగా విశేషంగా నిర్ణయము చేయడంగా / విశేషాన్ని నిర్ధారించడంలో భూయః – మిక్కిలి లింగములు ఉన్నవి. ఇక్కడ లింగశబ్దము చిహ్నము అన్న పదానికి పర్యాయము. మరొక పదము. చిహ్నములైన వాక్యాలు చాలా ఉన్నవి అని అర్థము. ఆ లింగము ప్రకరణము కంటే బలవన్తమైనట్టిది. ఆ మాట కూడా చెప్పబడింది ప్రథమ కాండలో (పూర్వమీమాంసలో) **శ్రుతి లింగ వాక్య ప్రకరణ స్థానసమాఖ్యానాం సమవాయే పరదౌర్బల్యం అర్థ విప్రకర్షాత్** అర్థమును నిర్ణయము చేయడంలో శ్రుతి (వేదము) లింగము, వాక్యము, ప్రకరణము, స్థానము, సమాఖ్య అనే ఆరింటికి పరస్పరం విరోధము వచ్చినపుడు ముందటి వాటికంటే తరువాతిది బలహీనము అవుతుంది అని ఆమాట ప్రమాణంగా నిలువదు. అని ఏదైతే మీరు చెప్పినారో **పద్మకో శప్రతీకాశమ్** ఇత్యాదివాక్యము దహరవిద్యకు శేషము అనే విషయాన్ని బలపరుస్తుందని – అది సరికాదు. బలవంతమైన ప్రమాణాన్ని బట్టి సర్వవిద్యలయందున్నూ ఉపాసింపతగినవాడిని నిర్ధారణ చేయడం కొరకే ఈ విద్య బయలుదేరిందనే విషయమును మనస్సుకు బట్టించుకుంటే గట్టిగా నిల్పుకుంటే దహర విద్యలో కూడా ఆ నారాయణుడినే ఉపాస్యుడిగా ఆ వాక్యము చెప్పిందనే విషయము చక్కగా కుదురుతుంది. ఐతే **సహస్రశీర్షమ్** ఇత్యాదిగా ద్వితీయావిభక్తితో

పేర్కొన్నందువల్ల పూర్వానువాకములో చెప్పబడిన ఉపాస్యుడైన వానితో సమ్బన్ధాన్ని శంకించకూడదు.

**తస్మిన్ యదన్తః తదుపాసితవ్యమ్** అని ఉపాసి శబ్దములో ఉన్న తవ్య అనే కృత్ ప్రత్యయము చేత ఉపాస్యుడైన కర్మను గురించి చెప్పినందువల్ల ఆ ఉపాస్యము నందు ద్వితీయా పొసగకుండా పోతున్నది. **విశ్వమే వేదం పురుషః.** ఈ ప్రపంచమంతా ఆ పురుషుడే (నారాయణుడే) **తత్త్వం నారాయణః పరః** పరతత్త్వమూ నారాయణుడే ఇత్యాదిగా ప్రథమా విభక్తి నిర్దేశమువల్ల కూడా ప్రథమా విభక్తి అర్థములో ద్వితీయావిభక్తి ప్రయోగింపబడింది అని తెలుసుకోవాలి. **అన్తర్ బహిశ్చతత్సర్వం వ్యాప్యనారాయణః స్థితః.** ఈ సమస్త ప్రపంచానికి బయటా లోపల నారాయణుడు నిండి ఉన్నాడు. **తస్యాః శిఖాయాః మధ్యేపరమాత్మా వ్యవస్థితః సబ్రహ్మా సశివః సేన్ద్రః సోఽక్షరః పరమః స్వరాట్.** దానియొక్క తల మధ్యభాగములో పరమాత్మ నెలకొని ఉన్నాడు. ఆయననే బ్రహ్మ ఆయనే శివుడు. ఆయననే ఇంద్రుడు ఆయన అక్షరుడు (తరుగుదల పెరుగుదల లేనివాడు) పరముడు (ఆయన కన్నా అధికుడు లేనట్టివాడు) స్వరాట్టు కూడా (ఆయనను శాసించే ఏవిధమైన అధికారి లేనట్టివాడు.) అని చాలా నిర్దేశాల చేత అందరికన్నా పరుడు (అధికుడు) ఐన నారాయణుడే అన్ని బ్రహ్మ విద్యల లోనూ ఉపాసింపదగినవాడు అని నిర్ణయింపబోతున్నారు. కనుక ప్రథమా విభక్త్యర్థములో ద్వితీయ విభక్తి ప్రయోగింపబడింది అని నిశ్చయింపబడుతున్నది. **ఇది లింగభూయస్త్వాధికరణము.**

★ ★ ★

## ఇక పూర్వవికల్పాధికరణము

సూ॥ **పూర్వవికల్పః ప్రకరణాత్ స్యాత్ క్రియా మానసవత్ 3-3-44**
పూర్వవికల్పమే ప్రకరణాన్ని బట్టి క్రియామయము మానస గ్రహము వలె పొసగుతుంది (ఇది పూర్వపక్షి సూత్రము) వాజసనేయకశాఖలో అగ్నిరహస్యమునందు మనశ్చిదాదులు ఐన అగ్నులు వినిపిస్తున్నవి. **మనశ్చితః, వాక్ చితః, ప్రాణచితః, చక్షుశ్చితః, శ్రోత్రచితః, కర్మచితః అగ్నిచితః** ఇతి. ఇక్కడ సంశయము ఏర్పడుతున్నది. ఈమనశ్చిదాదులు ఐన అగ్నులు సామ్పాదికములు (ఆవిధముగా భావింపబడునటు వంటివి) ఐనందున ఇవి విద్యారూపాలైన అగ్నులా? క్రియలతో కూడిన క్రతువులలో

అనుప్రవేశము చేస్తున్నవి కనుక క్రియారూపాలా? లేక విద్యామయమైన క్రతువులలో అనుప్రవేశించినందువల్ల విద్యా రూపాలేనా? అని సందేహము ఏర్పడితే క్రియారూపాలే అని పూర్వవికల్పః అనే సూత్రము ద్వారా చెప్పబడుతున్నది. చిత్యాగ్నులుగా నిరూపింపబడిన ఈ మనశ్చిదాదులు క్రత్వను ప్రవేశాన్ని కోరుతున్నవి కాబట్టి తమను విధించిన స్థానములో క్రతువు చేసే విధి లేదు కాబట్టీ, ముందు **అసద్వా ఇదమగ్ర ఆసీత్** (అసత్తువలె ఈ ప్రపంచము సృష్టికి పూర్వము కాలములో ఉండినది) ఇత్యాదివాక్యముతో ఇష్టకచితమైన అగ్ని ప్రస్తావింపబడినందువల్ల అది క్రియామయమైన క్రతువుతో వేరు కాకుండా ఉన్నందువల్ల అక్కడ (బుద్ధిలో) క్రతువు ఉన్నది కాబట్టి ఆ ప్రకరణములో గ్రహింపబడిన మనశ్చిదాదులు, ఇష్టకములతో చితమైన అగ్నితో వికల్పము చేయబడినవై క్రియారూపాలే అవుతాయి. విద్యామయములు ఐనప్పటికిన్నీ అవి క్రియలతో కూడిన క్రతువులలో అనుప్రవేశము చేస్తున్నవి కాబట్టి క్రియారూపత్వము మానసగ్రహము వలె కుదురుతుంది. ఎట్లా గంటే పన్నెండు రోజులు చేసే అవి వాక్యము అనే క్రియయందు పదవనాడు మానసగ్రహము మనస్సులోనే సిద్ధముచేసే గ్రహణము ఆసాదనము స్తోత్రము శస్త్రము ప్రత్యాహరణము భక్షణత్వములచేత అది విద్యారూపమైనప్పటికీ క్రియామయమైన క్రతువునకు అంగము అవుతున్నందువల్ల క్రియారూపమే అవుతున్నది. అట్లాగే ఇక్కడ కూడా.

(మనశ్చిదాదులైన అగ్నులు వాస్తవముగా అగ్నులు కావు. అగ్నులుగా భావింపబడేవి మాత్రమే. యధార్థానికి ఈ అగ్నులు క్రియారూపాలు, విద్యారూపాలు అని రెండు విధాలు. క్రియారూపాలు హోమకుండాలను ఏర్పరచి వాటిలో నేయి మొదలైన వాటితో ఆహుతులు ఇస్తారు. విద్యారూపాల్లో సాక్షాత్తుగా అగ్నిజ్వాలలు ఉండవు. అంతా భావననే తల్చుకోవడమే క్రియారూపాల్లో వలెనే మానసికంగా కల్పించుకొని బ్రహ్మనుధ్యానం చేస్తారు. ఇష్టకము అనగా ఇటుక. వాటిని పేర్చి హోమకుండాన్ని ఏర్పాటుచేసి దాంట్లో అగ్నిని ప్రతిష్ఠించి హోమాన్ని చేస్తారు. చితము వృద్ధిచేయబడినది. చితి=మండుతుండే అగ్ని యొక్క స్థానము, తరువాతి కాలములో శ్మశానంలో శవదహనం కొరకై పేర్చబడిన కట్టెల పేర్పుకు పేరు అయ్యింది. క్రియామయము=రకరకాలైన క్రియలతో పనులతో కూడినట్టిది. విద్యామయము=జ్ఞానమే ప్రధానమై నట్టిది. మనస్సు ద్వారా, వాక్కులద్వారా చేయబడుతుంది. ఇదే జ్ఞాన యజ్ఞము. గ్రహము=పాత్ర)

సూ॥ **అతిదేశాచ్చ 3-3-45** ఒకచోట నుండి మరోచోటికి తెచ్చుకోవడము వలన కూడా. ఈ చెప్పబోయే కారణాన్ని బట్టి కూడా ఇష్టకములందు చయనము చేయబడిన అగ్నితో మనశ్చిదాదులకు వికల్పము (రెండుగా ఉండడము) క్రియారూపత్వమున్నూ తెలియవస్తున్నది. **తేషామేకైక ఏవతావాన్ యావా నసౌ పూర్వః.** వాటిలో ఒక్కొక్కటి కూడా ముందటిది – ఎంతపాటిదో తరువాతది కూడా అంతటిదే. అని మొదటిదైన ఇష్టకచితాగ్ని యొక్క వీర్యము (పనిచేసే సామర్థ్యము) మనశ్చిదాదులలో అతిదేశింపబడుతున్నది. దానితో సమానమైన కార్యాన్ని చేస్తున్నది. కాబట్టి వికల్పము చెప్పబడుతున్నది. అందువల్ల ఇష్టకచితమువలె ఆక్రతువులను నిర్వర్తించడము వల్ల ఆక్రియామయ క్రతువులకు అంగాలు ఐన మనశ్చిదాదులు క్రియామయక్రతువులలో అనుప్రవేశము చేసినందువల్ల క్రియారూపాలే అని. పూర్వపక్షము రాగా చెపుతున్నారు.

సూ॥ **విద్యైవతు నిర్ధారణాత్ దర్శనాచ్చ 3-3-46** మనశ్చిదాదులు క్రియారూపాలు కావు విద్యారూపాలే. అట్లాగని నిర్ధారణ చేయబడినందువల్ల/ కనిపిస్తున్నందువల్లనున్నూ. తుశబ్దము పూర్వపక్షాన్ని తిప్పి కొడుతున్నది. మనశ్చిదాదులు క్రియామయము లైన క్రతువులలో అనుప్రవేశము చేస్తున్నందు వల్ల క్రియారూపాలేనని ఏమాట అన్నారో అది సరికాదు. ఇవి విద్యారూపాలే. విద్యారూపమైన క్రతువులోనే అన్వయించుతవి అని అర్థము. ఎందువల్లనంటే నిర్ధారణము దర్శనములవల్ల. నిర్ధారణమైతే **తేహైతే విద్యాచితఏవ. విద్యయాహైవైత ఏవం విద శ్చితాభవన్తి.** ఇవి అన్నీ విద్యాచితములే. విద్యవల్లనే ఇవి ఈ విధమైన చితములు అగ్నులు అవుతున్నవి అని. వాక్ మన శ్చక్షురాది పనులకు ఇటుకలు వలె చయనం కుదరదు కనుక మనస్సుతోనే ఆరోపింపబడిన అగ్నితో విద్యారూపం సిద్ధించినా **విద్యాచిత ఏవ, విద్యయాహైవైతే** అనిన్నీ అవధారణ) నిర్ధారణ చేయడం విద్యామయక్రతువులతో అన్వయముఒకలయిక సమ్బన్ధము ఉన్నందున విద్యారూపత్వమేనని తెలియచేయడం కొరకు అని నిశ్చయింపబడుతున్నది. ఇక్కడనే వీటికి ప్రధానమైన శేషీ, విద్యారూపమైన క్రతువు కనిపిస్తున్నది. **తేమనసైవాధీయన్త మనసైవా చీయన్త మనసైషుగ్రహా అగృహ్యన్త మనసాఽస్తువన్త మనసాఽశంసన్। యత్కించ యజ్ఞేకర్మక్రియతే యత్కించయజ్ఞీయం కర్మ మనసైవతేషు మనోమయేషు మనశ్చిత్సు మనోమయమక్రియత.** అవి మనస్సుతోనే అధ్యయనము చేయబడుతున్నవి. మనస్సుతోనే అగ్నిని పెంపుచేస్తున్నారు. మనస్సు తోనే వీటియందు నెయ్యి, సోమరసము

వంటివి ఉంచుకొనేవి ఇతరము లైన పాత్రలను స్వీకరించుతున్నారు. మనస్సుతోనే స్తోత్రము చేస్తూ మనస్సుతోనే కోరుతూ ఇత్యాదిగా క్రియామయక్రతువులో ఏ ఒక్క క్రియచేయబడుతున్నదో, యజ్ఞానికి అంగమైన క్రియ చేయబడుతున్నదో అవి అన్నీ మనస్సు తోనే ఆ మనోమయమైన మనశ్చిదాదులయందు మనోమయమైన క్రియను చేసినారు అని. ఇష్టకములతో చయనము చేయబడిన అగ్నుల యందు ఏ క్రియామయమైన యజ్ఞాంగమైన కర్మ చేయబడుతున్నదో అదంతా మనస్సు చేత నిర్వర్తింపబడే మనశ్చిదాద్యగ్నులలో మనోమయమే చేయబడింది అని చెప్పినందువల్ల విద్యామయమైన క్రతువే ఇక్కడ తోస్తున్నది.

ఏమండీ ఇక్కడ విధి పదము వినిపించకపోవడము, ఫలముతో సమ్బన్ధము, ప్రతీతి కాకపోవడము, ఇష్టక చిత అగ్ని చేత ముందుంచబడిన క్రియామయ క్రతుప్రకరణాన్ని బట్టి విద్యామయక్రతువుతో అన్వయించుటవలన విద్యారూపత వీటిని బాధించుతుంది కదా! అని అంటే కాదని చెపుతున్నారు.

సూ॥ **శ్రుత్యాదిబలీయస్త్వాచ్చ నబాధః 3-3-47** ప్రకరణము కంటే శ్రుతి లింగ వాక్యాలు బలవన్తములు కాబట్టి బాధింపబడవు. శ్రుతిలింగవాక్యాలు ప్రకరణానికంటే బలీయములు ఐనందువల్ల శ్రుత్యాదుల చేత తెలియవచ్చిన క్రతువు వీటితో అది అన్వయించడమునున్నూ దుర్బలమైన ప్రకరణము బాధించలేదు. శ్రుతి ఐతే **తేహైతే విద్యాచితఏవ** అని చెపుతున్నది. దాన్నే వివరిస్తున్నది. **విద్యయా హైవేతే ఏవం విదశ్చితా భవన్తి.** అని విద్యయా – విద్యామయమైన క్రతువుతో సమ్బన్ధము కల మనశ్చితాదులు చితములు అవుతున్నవి అని అర్థము. **తాన్హ ఏతానేవం విదే సర్వదా సర్వాణిభూతాని చిన్వన్త్యపి స్వపతే.** ఇటువంటి వానియందు / తెల్సిన వానియందు అన్ని భూతాలు ఎల్లపుడూ చయనము చేస్తూ ఉన్నవి. సుఖనిద్రను పొందుతున్నవి. అని లింగము ఉన్నది. వాక్యము కూడా **ఏవం విదే చిన్వన్తి** అనేది. సమభివ్యాహారమే వాక్యము. ఏవం విదేవిద్యామయమైన క్రతువును చేసేవానియందు ఎల్లపుడూ ఎల్లభూతాలూ చయనము చేస్తున్నవి. అని అర్థము. అన్ని భూతాలూ చేసేటువంటి, దినమంతా వ్యాపించి ఉండే చయనము మనస్సుతో మాత్రమే సంపాదింపబడేది (ఆచరింపబడేది)దినములో ఒక పరిమితమైన కర్త, కాల, క్రియలతో, ఇష్టకములతో చేయబడిన కార్యము ద్వారా క్రతువులో అనుప్రవేశమును పొందడము అసంభవాన్ని, పొందకపోవడమున్నూ విద్యామయమైన క్రతువు అని అనడము నందు లింగము అవుతుంది.

విధించే ప్రత్యయము వినిపించక పోవడము వల్ల ఫలముతో సమ్బన్ధము ప్రతీతి కాకపోవడం వల్లనున్నూ క్రియామయమైన క్రతువు కంటే వేరయినది. విద్యామయక్రతువు కాదు అని ఏమాట అన్నారో ఆ విషయములో చెప్పుతూ ఉన్నారు.

సూ॥ **అనుబన్ధాదిభ్యః ప్రజ్ఞాన్తర పృథక్త్వవత్ దృష్టశ్చ తదుక్తమ్. 3-3-48** అనుబన్ధములైన వానివలన వేరు విద్యలాగా దృష్టమవుతున్నది. అదే చెప్పినారు. ఇష్టక చితముతో సమ్బన్ధము కల క్రియామయమైన క్రతువుతో పోల్చినపుడు విద్యామయమైన ఈ క్రతువు వేరు అనడానికి కారణాలైన వాటిద్వారా – (అనుబన్ధాదులు) విడిగా ఉన్నదే అని తెలుస్తున్నది. అనుబన్ధములు అనగా యజ్ఞానికి అనుబన్ధాలైన గ్రహస్తోత్ర శస్త్రాదులు. **మనసైషు గ్రహా అగృహ్యన్త మనసాఽస్తువన్త మనసా ఆశంసన్** ఇత్యాది వాక్యాలచేత ప్రతిపాదింపబడినటువంటివి. (గ్రహము – యజ్ఞములో ఉపయోగించే పాత్ర, స్తోత్రము – ప్రత్యేకమైన రాగాలతో కూడి ఉచ్చరించడము, శస్త్రము – ఒకే స్వరముతో ఉచ్చరించడము) ఆది శబ్దముతో శ్రుత్యాదులు పూర్వోక్తములైనవి గ్రహింపబడుతున్నవి. శ్రుతిలింగాదులు, అనుబంధాలతోనూ విద్యామయమైన క్రతువు వేరే అని అర్థమవుతున్నది అని అర్థము. ప్రజ్ఞాన్తర పృథక్త్వవత్ – ఎట్లాగైతే ప్రజ్ఞాన్తరం – మరొక బ్రహ్మ విద్య. దహరవిద్య మొదలైనవి క్రియామయమైన క్రతువు కంటే వేరయినదిగా శ్రుతి మొదలైన వాటితో తెలియవస్తున్నదో అదేవిధంగా ఇది కూడా. కాగా అనుబన్ధాదుల వల్ల విద్యామయమైన క్రతువు వేరైనది ఐన యజ్ఞమని అవగతమైనప్పుడు దానికి చెందిన విధి కల్పింపబడుతుంది. అనువాదముతో సమానరూపము కలవాటిలో కల్పింపబడుతున్న విధి కనిపిస్తూనే ఉన్నది. అందువల్లనే ఇట్లాగా చెప్పినారు. **వచనానితు అపూర్వ త్వాత్.** ఈ వాక్యము పూర్వమీమాంసలోనిది. ఫలము కూడా **తేషా మేకైక ఏవ తావాన్ యావానసౌ పూర్వః** అని అతిదేశము చేయబడడము వల్ల తనదైన క్రతువు ద్వారా ఇటుకల ద్వారా చయనము చేయబడిన అగ్నికి ఏదైతే ఫలమో అదే ఫలము మనశ్చితాదులకున్నూ ఫలమని (స్వక్రతువుద్వారా) తెలుస్తున్నది.

అతిదేశము చేసుకోవడము ద్వారా రెండూ సమానమైన కార్యములే అని తెలుస్తున్నందువల్ల క్రియామయక్రతువులో అనుప్రవేశము తెలుస్తున్నది అని అన్నారో ఆ విషయంలో చెప్తున్నారు.

సూ॥ **న సామాన్యాద ప్యుపలబ్ధేః మృత్యువన్నలోకాపత్తిః 3-3-49** సమానము కావాల్సిన అవసరము లేదు. సామాన్యమవడం వల్ల అతిదేశము కల్గుతున్నది. మృత్యువు

వచ్చినట్లే ఆ లోకాన్ని పొందడము లేదు. అతిదేశము అవుతున్నందువల్ల మధ్యలో వచ్చి చేరే అవాన్తర వ్యాపారము (క్రియ) కూడా సమానము కావాల్సిన అవసరము లేదు. దేనితోనైతే ఈ విద్యలకు క్రియామయ క్రతువులో అనుప్రవేశము ఏర్పడుతున్నదో. ఏదో ఒక సమానమైన అంశము వల్ల అతిదేశము అవుతూనే ఉన్నది. **సఏష ఏవమృత్యుః యఏషఏతస్మిన్ మండలే పురుషః** ఎవడైతే ఈ మండల మందు పురుషుడు ఉన్నాడో అతడే మృత్యువు. ఇత్యాదులయందు సంహర్తృత్వము మొదలైన సామాన్యముల చేతనే అతిదేశము కావడము లభించుతూనే ఉన్నది. ఆ మండల పురుషుడికి మృత్యువువలె అతని లోకాపత్తి – అతనియొక్క దేశాన్ని చేరుకోవడము కూడా జరుగడం లేదు. ఇదే తీరుగా ఇక్కడ కూడాను, మనశ్చిదాదులకు ఇష్టక చితాగ్నులవలె భావాన్ని అతిదేశము చేసినంతమాత్రాన, ఇష్టక చితాగ్ని దేశరూపక్రియా మయక్రతువులో అనుప్రవేశము చేత కూడా సమానము కావాల్సిన అవసరము లేదు. అందువల్ల ఇష్టకచితాగ్నికి తనదైన క్రతువు ద్వారా ఏది ఫలమో అదే ఫలము మనశ్చిదాదులకున్నూ విద్యామయ క్రతువు ద్వారా కలుగుతుందని అతిదేశము వల్ల తెలుస్తున్నది.

సూ॥ **పరేణచ శబ్దస్య తాద్విధ్యమ్ భూయస్త్వాత్త్వను బన్ధః 3-3-50** తరువాత ఉన్న బ్రాహ్మణముతో దీనికి కూడా దానివంటి ఫలమే కలుగుతున్నది. దాని వంటిదే అవుతున్నది. అధికముగా ఉన్నందువల్ల అనుబన్ధము అవుతున్నది. తరువాత ఉన్నటువంటి బ్రాహ్మణము వలన ఈ మనశ్చిదాదులను చెప్పే శబ్దానికి తాద్విధ్యము – తద్విధత్వము – విద్యా మయక్రతువులను ప్రతిపాదించడము తెలియవస్తున్నది. పరమైన బ్రాహ్మణము ఇది. **అయంవావలోకః ఏషోఽగ్నిః చితః. తస్యాప ఏవ పరిశ్రితః** ఈ చయనము చేయబడిన అగ్నికి ఫలము ఇదే లోకము. భూలోకము. సముద్రాలే పరిస్తరణాలు. ఇత్యాది వాక్యము చేత **సయో హ ఏతదేవం వేద లోకంపృణాం ఏవం భూతం** ఏ తత్సర్వమభి సమ్పద్యతే. ఈ భూలోకాన్ని చుట్టు ముట్టి ఉన్న నీటిని – ఇష్టకాలు భూమి, దానితో చేయబడినవి ఇటుకలు. వాటితో కట్టబడినది వేదిక లేక హోమకుండము. దాన్ని చుట్టి ఉన్నవి జలాలు, పరిస్తరణాలు. క్రమంగా పృథివీ అప్‌లతో చుట్టి ఉన్నటువంటిది కుండములోని అగ్ని. దాన్ని ఉపాసించినవాడు ఈ సమస్తాన్ని పొందుతాడు అని. విడిగా ఫలాన్ని కల్గిన విద్యనే విధింపబడుతున్నది. అట్లాగే వైశ్వానరవిద్య మొదలైనవాటిలోనూ విద్యనే విధింపబడుతున్నది కనుక అగ్ని రహస్యానికి క్రియా ఏకవిషయత్వము (ఒకే క్రియకావడం) లేదు. ఇట్లయినప్పుడు

విద్యామయాలు ఐన మనశ్చితాదులు బృహదారణ్యకములో అనుబన్ధములుగా – సమ్బన్ధము కలవిగా చేర్చబడవలసి ఉండగా ఇక్కడ – ఈ అగ్ని రహస్యములో ఎందుకు అనుబన్ధములుగా చేయబడుతున్నవి? అంటే చెప్పుతున్నారు. భూయస్త్వాత్త్వనుబన్ధః అని. మనశ్చిదాదుల యందు కల్పించుకోదగినవి ఐన సమ్పాదనీయాలైన అగ్ని అంగాలు చాలా ఉన్నందున దానియొక్క సన్నిధిలో ఇక్కడ అనుబన్ధము చేయబడింది. **ఇది పూర్వవికల్పాధికరణము.**

★ ★ ★

## ఇక శరీరేభావాధికరణము.

సూ॥ **ఏక ఆత్మనః శరీరేభావాత్ 3-3-51** ఆత్మ యొక్క స్వరూపము ఒక్కటే, శరీరము నందు ఉన్నందువలన. ఇది పూర్వ పక్షి సూత్రము. పరవిద్యలు అన్నింటిలోనూ ఉపాసింపదగినవాడు, ఉపాసనస్వరూపములవలె ఉపాసన చేసే వానియొక్క స్వరూపాన్ని కూడా తెల్సుకోవలసి ఉన్నదని చెప్పబడింది. **త్రయాణామేవ చైవముపన్యాసః ప్రశ్నశ్చ.** అని చెప్పినారు కాబట్టి. ఈ జీవాత్మ తనను పరమాత్మను ఆత్మను గా కలిగినవాడినని భావించుకోవాలని. **ఆత్మేతి తూపగచ్ఛన్తి గ్రాహయన్తిచ.** అనే సూత్రము ద్వారా చెప్పనున్నాడు కూడా, ఐతే ఈ ప్రత్యగాత్మా జ్ఞాత కర్త భోక్త. ఇహపరలోకాలలోనూ రాకపోకలు చేయగల సమర్థుడని అనుసన్ధానము చేసుకోవలెనా? లేక ప్రజాపతి వాక్యములో చెప్పినట్లు అపహత పాప్మస్వరూపుడినిగా తల్చుకోవాలేనా? అని. ఇందులో ఏది తగినది అని అంటే జ్ఞాతృత్వము మొదలైన ఆకారమును మాత్రమే కలవాడినిగా తలచుకోవాలని కొందరు తలుస్తున్నారు. ఎందువల్లనంటే ఈ ఉపాసకుడు ఐన ఆత్మ శరీరములో ఉంటున్నాడు కాబట్టి అని. శరీరములో ఉంటున్న వానికి అదే రూపం కాబట్టి. అట్లా తలచినపుడే కోరిన ఫలము సిద్ధించుతుంది. ఆయా కర్మలను ఆచరించుటయందు అధికారులై స్వర్గము మొదలైన ఫలాలను కోరేవారికి జ్ఞాతృత్వము మొదలైన దానికంటే వేరుగా ఫలాన్ని అనుభవించేటువంటప్పుడు ఎటువంటి రూపము ఉంటున్నదో అటువంటి రూపమే సాధనదశ అనుష్ఠాన దశలయందు అనుసన్ధానించుకోవలసిన పని లేదు. అంతమాత్రము చేతనే సాధనానుష్ఠానతత్ఫలములు సిద్ధించుతున్నవి కావున అంతకంటే వేరయిన దానిని తల్చుకున్నందువల్ల ఫలితము కనబడడం లేదు కాబట్టి.

అందువల్ల విశేషము ఏమీ లేదు కనుక ఇక్కడ కూడా జ్ఞాతృత్వాది స్వరూపాన్నే అనుసన్ధానించుకోవాలి.

ఐతే ఒక్క మాట. **యథాక్రతురస్మిన్ లోకేపురుషో భవతి తథేతః ప్రేత్యభవతి.** అనే విశేషవచనము ఉన్నది కాబట్టి అపహత పాప్మత్వాది ఆకారమే అనుసన్ధానము చేసుకోవలసి ఉన్నది అని తెలుస్తున్నది కదా! అని అంటున్నారా? అది సరికాదు. **తమ్ యథా యథో పాసతే.** అని చెప్పినదాన్ని బట్టి ఉపాస్యుడైన వానికి సమ్బన్ధించింది కాని ఉపాసకుడిదికాదు. ఈ విధంగా పూర్వపక్షము వస్తే సమాధానాన్ని చెపుతున్నాము.

సూ॥ **వ్యతిరేకః తద్భావభావిత్వాన్న తూపలబ్ధివత్. 3-3-52** ప్రత్యగాత్మ యొక్క ఇప్పుడున్న రూపానికి వ్యతిరేకమైన అపహత పాప్మత్వాదిక రూపాన్నే తల్చుకోవాలి. దాన్నే పొందనున్నాడు కాబట్టి. ఇది పరస్వరూపవిషయమే కాదు. ఆత్మోపలబ్ధి విషయము కూడా. జ్ఞాతృత్వాద్యాకారాన్నే అనుసంధానము చేసుకోవలెననే నియమమేమీ లేదు. ఈ ఆత్మకు సంసారదశలో కన్న మోక్షదశలో ఏ వ్యతిరేక దశ ఉంటున్నదో ఆ అపహత పాప్మత్వాది గుణము కలదాన్నే అనుసన్ధానము చేసుకోవాలి. ఈ జీవుడికి మోక్షము కలిగిన దశలో ఎటువంటి రూపము ఉంటున్నదో అటువంటి రూపాన్నే ఉపాసన చేసే వేళలో కూడ జీవాత్మ అనుసన్ధానము చేసుకోవాలి అని అర్థము. ఎందువల్లనంటే తద్భావ భావిత్వాత్=ఆ రూపాన్నే పొందపోతున్నాడు కనుక. 1) **యథాక్రతురస్మిన్ లోకేభవతి. తథేతః ప్రేత్య భవతి 2) తథేతః ప్రేత్యభవతి తం యథాయథోపాసతే తథైవ భవతి.** 1) ఈ లోకములో ఎటువంటి పనిని చేసినాడో అటువంటి ఫలాన్నే పరలోకములో ఇక్కడనుండి వెళ్ళిపోయినాక పొందుతున్నాడు. 2) ఆ పరమాత్మను ఏఏ రూపము గుణము కలవాడినిగా ఉపాసన చేస్తున్నాడో ఈ శరీరాన్ని విడిచివెళ్ళిన తరువాత అట్లాగే అవుతున్నాడు. అని ఉపాసన చేసిన దానిప్రకారమే ఫలితం దక్కుతుంది అని శ్రుతి వినిపించుతున్నది. ఐతే ఇది కేవలము పరుని యొక్క స్వరూపాన్ని మాత్రమే చెప్పే విషయానికి చెందింది అని అనడానికి వీల్లేదు. జీవాత్మ కూడా ఉపాస్యుడైన పరబ్రహ్మకు శరీరమైనందువల్ల ఉపాస్యమైనవర్గములో ఒకడుగా చేర్చబడినాడు కాబట్టి. కనుక ప్రజాపతి వాక్యములో చెప్పబడిన అపహత పాప్మత్వము మొదలైన గుణములు కల ప్రత్యగాత్మను శరీరంగా చేసుకున్న పరమాత్మను ఉపాసనము చేసినప్పుడు అటువంటి రూపమే పొందదగినది అని చెప్పబడుతున్నది. ఇందువల్లనే **ఏవంక్రతుర్హ అముంలోకం ప్రేత్యాభిసమ్భవతి.** ఇట్లాగా ఉపాసన చేసినవాడు ఈ

బ్రహ్మ లోకాన్ని చేరి బ్రహ్మతో సమానుడు అవుతున్నాడు. అని చెప్పబడుతున్నది. కాబట్టి **"జీవుడు తాను పొందబోయే ఆకారాన్నే అనుసన్ధానము చేయాలి."** ఉపలబ్ధివత్ – బ్రహ్మ ఉపలబ్ధివలె, ఏవిధంగానైతే బ్రహ్మను చేరుకోవడము విధింపబడిందో, అదీ బ్రహ్మయొక్క స్వరూపము ఉన్నది ఉన్నట్లుగా అట్లాగే ఆత్మోపలబ్ధి కూడా. యథాఅవస్థిత ఆత్మ స్వరూప విషయమే. అనగా సంసారబన్ధములో చిక్కుకోకముందు ఎటువంటి జ్ఞానానందస్వరూపమున్నదో అటువంటిది అని అర్థము. యజ్ఞాది కర్మల యందు ఆత్మ యొక్క స్వరూపాన్ని తల్చుకోవడము కర్మలకు అంగముగా కాదు. **యజేత స్వర్గకామః** అని కర్మలను అనుష్ఠించడమే. ఫలాన్ని పొందడం కొరకు పురికొల్పుతున్నారు. దేహానికంటే వేరుగా ఉన్న జ్ఞాతృత్వము మొదలైన ఆకారము గల ఆత్మను గురంచి తెల్సుకోవడము రాబోయే ఎప్పటి కాలంలోనో కలుగబోయే ఫలాన్ని సాధించే కర్మాధికారము కొరకే అని అంతమాత్రమే అక్కడ అవసరము. కనుక ఏ కొరతా లేదు. **ఇది శరీరే భావాధికరణము.**

★ ★ ★

## ఇక అంగావబద్ధాధికరణము.

సూ॥ **అంగా వబద్ధాస్తున శాఖాసుహి ప్రతివేదమ్ 3–3–53** ఉద్గీథము మొదలైనవి, అంగములుగా సంబన్ధాలు కలిగిన ఉపాసనలు ఆయా శాఖల్లోనే, ఆ వేదానికి మాత్రమే సంబన్ధించి ఉండవు. ఇది అన్ని శాఖలకూ సమానమే **1) ఓమిత్యేత దక్షరం ఉద్గీథముపాసీత.** ఓమ్ అనే అక్షరాన్ని ఉద్గీథ మనబడే దాన్ని ఉపాసించాలి. **2) లోకేషు పంచవిధం సామోపాసీత.** లోకము నందు ఐదు విధాలుగా సామవేదాన్ని ఉపాసించాలి. **3) ఉక్థమ్ ఉక్థమితివైప్రజావదన్తి. తదిదమేవ ఉక్థమ్ ఇయమేవ పృథివీ.** ఉక్థము ఉక్థము అని ప్రజలు అంటున్నారు ఈ భూమియే ఉక్థము. **4) అయం వావ లోకః ఏషోఽగ్నిశ్చితః** ఈ చయనము చేయబడిన అగ్నియే లోకము. అని మొదలైనవి క్రతువుయొక్క అంగమును ఆశ్రయించిన ఉపాసనలు అవుతున్నవి / అనబడ్తున్నవి. అవి ఏ వేద శాఖయందు వినిపించినవో దానిలో మాత్రమే సంబన్ధించి ఉంటవా? అన్ని శాఖలకు చెందిన ఉద్గీథాదులతో సమ్బన్ధాన్ని కలిగి ఉంటాయా అని విచారము చేయబడుతున్నది. సర్వవేదాన్త ప్రత్యయం ఉన్నప్పటికీ ప్రతిఒక్కవేదానికి స్వరములో భేదము ఉంటున్నది. కాబట్టి ఉద్గీథాదులు వేరు అవుతున్నాయి. కాబట్టి ఆయా శాఖలకు మాత్రమే సమ్బన్ధించి ఉంటాయా? అన్నపుడు వాటికి మాత్రమే

చెందుతవి అనడమే సరియైనది. కాగా ఏది తగునని అంటే **ఉద్గీథముపాసీత** అని సామాన్యంగా ఉద్గీథముతో సమ్బన్ధము కలదిగా వినిపించిన దానికి అదే శాఖలోనే విశేషమైన స్వరముతో కూడిన ఉద్గీథము దగ్గరగా ఉన్నందున (సన్నిధానాత్) ఆ విశేషయుక్తమైన దాని యందే కలిసిపోవడము తగును. కనుక ఇటువంటివన్నీ ఆయా శాఖల యందే నిల్చి ఉంటవి అని పూర్వపక్షము ఏర్పడగా చెపుతున్నాము.

అంగావబద్ధాస్తు అని. తు శబ్దము పూర్వపక్షాన్ని ప్రక్కకు పెడుతున్నది. అంగావబద్ధములైన ఉద్గీథములు అనే ఉపాసనలు ఆయా శాఖలయందే నిల్చియుండవు. కానీ ప్రతివేదముతోనూ సమ్బన్ధాన్ని కలిగి ఉంటవి. ప్రతిశాఖతో / అన్ని శాఖలతో సమ్బన్ధాన్ని కలిగి ఉంటవి. సూత్రములోని హి శబ్దము హేతువును సూచిస్తున్నది. శ్రుతికారణంగానే ఉద్గీథాది అంగమాత్రములతో సమ్బన్ధము కలిగియున్నందున ఏ శాఖకు చెందిన ఉద్గీథాదులు ఆ వేదానికి చెందిన అన్ని శాఖల్లోనూ సమ్బన్ధించినవే అవుతవి. స్వరభేదాన్ని బట్టి ఉద్గీథాదులు విడివిడిగా భేదాన్ని కలిగి ఉన్నా సామాన్యంగా ఉద్గీథము అని వినబడుతున్నందున అన్ని ఉద్గీథాలు సన్నిహితములే – అన్ని శాఖలలో చేరుతున్నవి. కనుక ఎక్కడ కూడా ఒక కట్టడి చేయడంలో ప్రమాణమేదీ లేదు. సర్వశాఖాప్రత్యయము అనే న్యాయము ప్రకారముగా నున్నూ అన్ని శాఖల్లోను క్రతువు ఒక్కటే. అందువల్ల శాఖలన్నింటిలోనూ ఒకే క్రతువు ఉంటున్నందున క్రతువుకు అంగములైన ఉద్దీథాదులు కూడా సన్నిహితాలే కనుక ఏ ఒక్కదానికో సన్నిధికి ప్రత్యేకత / విశేషము లేదు కాబట్టి ఇది ఈ శాఖకే చెందాలే అనే కట్టుబాటు / వ్యవస్థ లేదు.

సూ॥ **మన్త్రాది వద్వా అవిరోధః 3-3-54** మన్త్రాదులు వలె అన్నింటిలో ఉపయోగించుకోవచ్చును. విరోధం లేదు. వాశబ్దము చకారార్థములో వస్తుంది. ఇక ఆది శబ్దముతో జాతి 2) గుణము 3) సంఖ్య 4) సాదృశ్యము 5) క్రమము 6) ద్రవ్యము 7) కర్మలు గ్రహింపబడుతున్నవి. ఎట్లాగైతే మన్త్రాదులు ఒక్కొక్క శాఖలో పఠింపబడినప్పటికీ శేషి (ప్రధానము) ఐన క్రతువు అన్ని శాఖల్లోనూ ఒక్కటే అవుతున్నది కాబట్టి ఉన్నది ఉన్నట్టు (యథాయథము) శ్రుత్యాదుల్లో అన్ని శాఖల్లో వాడుకోవడములో విరోధము ఎట్లా లేదో ఆ విధంగా ఇక్కడ కూడా విరోధము లేదని అర్థము. **ఇది అంగావబద్ధాధికరణము.**

★ ★ ★

## ఇక భూమజ్యాయస్త్వాధికరణము.

సూ॥ **భూమ్నః క్రతుజ్యాయస్త్వం తథాహి దర్శయతి 3-3-55** భూమావిపులము – సమస్తము దానికే ప్రామాణికత్వము ఉన్నది. క్రతువు వలె. దాన్నే శ్రుతి చూపుతున్నది. **ప్రాచీన శాల ఔపమన్యవః** ప్రాచీనశాలుడనే జౌపమన్యుడు అని మొదలుపెట్టి వైశ్వానరవిద్య పఠింపబడింది. దానిలో వైశ్వానరుడు పరమాత్మ. ఆయన మూడు లోకాలనూ తనకు శరీరముగా చేసుకుని ఉన్నటువంటి వాడు, ఉపాస్యుడుగా వినిపింపబడినాడు. అతనికి స్వర్గలోకము, ఆదిత్యుడు, వాయువు, ఆకాశము, నీళ్ళు, పృథివీలు అవయవాలు. అందులోనూ ద్యులోకము శిరస్సు, ఆదిత్యుడు కన్ను, వాయువు ప్రాణము, ఆకాశము సందేహము – మధ్యకాయము లేక నడుము అని అర్థము, నీళ్ళు వస్తిః అనగా మూత్రపిండములు / మూత్రకోశము, భూమి కాళ్ళు అని అవయవ విశేషాలుగా చూపబడినవి. ఆ వాక్యము వద్ద ఒక సందేహము కలుగుతున్నది. ఈత్రైలోక్య శరీరుడిని విడిగా/ అవయవాలవారీగా ఉపాసన చేయాలా? లేక విడిగా, సమస్తంగా ఉపాసన చెయాల్నా లేక మొత్తముగానా? అని. దీంట్లో తగినది ఏది? అని అంటే వ్యస్తమే/విడిగానే అని. ఎందుకంటే ఉపక్రమంలో వ్యస్తమైన వాడినే ఉపాసన చేయాలని ఉపదేశించి నందువల్ల. అట్లాగే కదా ఉపదేశం చేయబడుతున్నది. ఉద్దాలకునితో కలసి ఆరుగురు ఔపమన్యవాదులు కేకయదేశపు రాజైన అశ్వపతి వద్దకు పోయి **ఆత్మానమేవేమం వైశ్వానరం సంప్రత్యధ్యేషి తమేవనో బ్రూహి** వైశ్వానరుడు అనబడే ఆత్మను నీవిపుడు అధ్యయనం చేస్తున్నావు. ఆయనను గురించి మాకు బోధించు. అని అడిగినారు. ఆయనకు ప్రత్యేకముగా తాము ఉపాసించే ద్యులోకము మొదలైనవాటిని గురించి చెప్పగా విడివిడిగా మూర్ధ మొదలైన వాటిని ఉపాసించడము ఆయా ఉపాసనల యందు కలుగబోయే ఫలాలనున్నా రాజుగారు వాళ్ళకు నిక్కచ్చిగా వెల్లడించినాడు. **అత్తి అన్నం పశ్యతి ప్రియం భవత్యస్య బ్రహ్మవర్చసం కులే య ఏతమేవం ఆత్మానం వైశ్వానరముపాస్తే. మూర్ధాత్వేష ఆత్మనః.** కమ్మని అన్నాలను భుజించుతాడు. ప్రియమైన దాన్ని దర్శించుతాడు. అనగా నచ్చినవాటిని పొందుతాడు. ఇతని వంశములోనివారు బ్రహ్మ వర్చస్సు కలవారు అవుతారు, ఎవరైతే ఈ వైశ్వానరుడైన బ్రహ్మను ఉపాసించుతున్నాడో. ఈ ఆత్మకు మూర్ధ/ శిరస్సు ఐతే ద్యులోకము అని. **ఏష వైసుతేజా ఆత్మావైశ్వానరః.** ఇతడు సుతేజుడు అనబడే వైశ్వానరాత్మ. ఇత్యాదిగా ఆయా ఉపాసనల యందు ఉపాస్యుడైన

వానియొక్క వైశ్వానరత్వాన్ని కూడా చెప్పినాడు. కనుక వ్యస్తము ఐనవాడినే ఉపాసన చేయవలెను. పరత్ర – సమస్త స్వరూపుడైన వాడిని గురించి. **యస్తుఏతమేవం ప్రాదేశమాత్రం అభివిమానం ఆత్మానంవైశ్వానరముపాస్తే.** ఎవడైతే ఇటువంటి ఆత్మను, ప్రాదేశమాత్రుడు – జానెడు అంతగా ఉన్న కొలత చేయబడినవాడిని వైశ్వానరుడిని ఉపాసించుతాడో అని ద్యులోకము మొదలుకొని ఉన్న ప్రదేశాల చేత విడదీయబడిన వాడిని గురించి వైశ్వానరుని యందు చెప్పబడిన మూర్ధాది ఉపాసనను సమాసము / మొత్తముగా ఉపసంహారము అని అర్థము చేసుకోవాలి. అంటే వ్యస్తముగా ఉపాసన చేసి సమస్త రూపుడితో ఉపసంహారము ముగింపుచేసుకోవాలి అని భావము.

ఒకాయన ఇట్లాగా అన్నాడు. ఇట్లాగానే నిండుగా ఉన్న వాడినిగురించి కూడా ఉపాసన చేయాలి అని. ఎందుకంటే దేనికి దానికిగా ఫలాన్ని చెప్పినారు కాబట్టి. **యస్తు ఏతమేవం ప్రాదేశమాత్రం అభివిమానమాత్మానం వైశ్వానరముపాస్తే స సర్వేషు లోకేషు సర్వేషు భూతేషు సర్వేషు ఆత్మసు అన్నమత్తి.** ఎవడైతే ఈ విధంగా ఉన్న ప్రాదేశ మాత్రుడైన ఇంత అని కొలత లేని వైశ్వానర ఆత్మను ఉపాసించుతున్నాడో అతడు అన్ని లోకాల్లోను, అన్ని భూతాల్లోను, అన్ని ఆత్మలలోనూ అన్నమును భుజించుతున్నాడు అని. ఐతే ఇంత మాత్రము చేత వాక్యభేదము వస్తుందని తలచకూడదు ఎట్లాగైతే భూమ విద్యలోని ఉపక్రమంలో / మొదట్లో నామాదులను గురించిన ఉపాసనలను వాటి ఫలాలనున్నూ ఉపదేశించి **ఏషతువా అతివదతి యః సత్యేనాతివదతి.** ఇతడుకదా అతివాది. ఎవడైతే సత్యశబ్దవాచ్యుడిని నమ్మి అతి వాదము చేస్తున్నాడో (అతివాది తాను నమ్మిన దాన్ని గురించి గొప్పగా చెప్పుతుంటాడు. సత్యశబ్దము చేత పిలువబడే పరమాత్మను గురించే చెప్పేవాడు సత్యాతివాది) ఇత్యాది వాక్యముతో భూమవిద్యను ఉపదేశించి **సస్వరాడ్ భవతి తస్యసర్వేషు లోకేషు కామచారో భవతి.** అతడు స్వరాట్టు (ఆయన పైపెత్తనం చేసేవాడు ఎవడూ ఉండడు. కర్మ కూడా ఉండదు.) అవుతున్నాడు. లోకాలన్నింటిలోనూ స్వేచ్ఛగా రాకపోకలు చేయగల్గుతాడు. అని ఆ ఉపాసన (భూమవిద్య)కు ఫలాన్ని కూడా చెప్పుతున్నాడు. ఆ చోట భూమ విద్యను గురించే వాక్యము ఉన్నప్పటికీ నామాదుల యొక్క అవాన్తరోపాసనము (మధ్యలో విడిగా ఉపాసనము) దాని ఫలమున్నూ అంగీకరింపబడుతున్నది. దానిలో వలెనే ఇక్కడ కూడా అని.

ఈ విధంగా పూర్వపక్షము ఎదురయితే చెపుతున్నాము. భూమ్నః జ్యాయస్త్వమ్ అని. భూమ్నః = విపుల మైనదానియొక్క – సమస్తమైనదానికే జ్యాయస్త్వము – ప్రామాణికత్వము అని అర్థము. ఏకవాక్యత్వము – రెండుగా ఉండక, ఒకవేళ ఒకే వాక్యముగా ఉండడము ఒక్క అభిప్రాయాన్నే చెప్పడము తెలుస్తున్నది కాబట్టి. అది ఎట్లాగంటే – **ప్రాచీనశాల ఔపమన్యవః** అని ఆరంభించి **ఉద్దాలకోహవై భగవన్తోఽయమారుణిః సంప్రతీమ మాత్మానం వైశ్వానరమధ్యేతి. తం హన్తాభ్యుప గచ్ఛామః.** ఓ పూజ్యులారా! అరుణుని కుమారుడైన ఉద్దాలకుడు ఇదే ఆత్మ ఐన వైశ్వానరుడిని గురించి ఉపాసన చేస్తున్నాడు. ఆయన దగ్గరకు పోదాము. అని వైశ్వానరాత్మను గురించి తెల్సుకోవాలనే కోరికతో ఔపమన్యుడు మొదలుగా గల ఐదుగురు మహర్షులు ఆ ఉద్దాలకుని వద్దకు పోయి ఆయన వద్ద వైశ్వానరాత్మను గురించి తెలువనివారై ఆయనతోపాటు కలసి వైశ్వానరాత్మను గూర్చి తెల్సినవాడు కేకయదేశానికి రాజు ఐన అశ్వపతిని కలసి **ఆత్మానమేవేమం వైశ్వానరం సమ్ప్రత్యధ్యేషి తమేవ నో బ్రూహి** వైశ్వానరాత్మను గురించి నీ విపుడు అధ్యయనము చేస్తున్నావు. ఆయనను గూర్చి మాకు తెలియజెయ్యి అని అడిగి, ఆయన వద్దనుండి స్వర్గలోకము మొదలుకొని పృథివి దాకా శరీరాన్నిగా కలిగినవైశ్వానరాత్మను ఉపాస్యుడినిగా తెల్సుకొని ఆ ఉపాసనకు ఉన్న ఫలాన్ని సర్వలోకాలయందు సర్వభూతాలయందు సర్వాత్మల యందున్నూ అన్నస్వరూపుడైన బ్రహ్మను అర్థము చేసుకున్నవాళ్ళైనారు. అని ముగింపబడుతున్న వాక్యానికి ఏకవాక్యత్వము తెలియవస్తున్నది. ఈ విధంగా ఏకవాక్యత్వము అర్థముఐనాక వైశ్వానరుని యొక్క అవయవ విశేషాలయందు ఉపాసనలను గురించి చెప్పడము, ఫలాన్ని నిర్దేశించడమున్నూ సమస్త ఉపాసనలో ఒక భాగమును అనువాదము చేయడము (మరొక్కసారి చెప్పడము) అని నిర్ణయము చెయ్యబడుతున్నది.

క్రతువత్ – క్రతువువలె ఎట్లాగైతే **వైశ్వానరం ద్వాదశ కపాలం నిర్వపేత్ పుత్రే జాతే** కొడుకు పుడితే పన్నెండు చిప్పల ద్రవ్యముతో చేయబడే వైశ్వానర హోమాన్ని ఆచరించాలి అని విధింపబడిన దానిలో కొన్ని భాగాలు (ఏకదేశములు) **యదష్టా కపాలో భవతి** ఎప్పుడు అష్టాకపాలుడు (ఎనిమిది చిప్పలు కలవాడు) అవుతున్నాడో ఇత్యాదులద్వారా అనువాదము చేయబడుతున్నవి.

అట్లాగే వైశ్వానరుడిని గురించి కూడా ఒక్కొక్క అవయవాన్ని కాకుండా మొత్తము త్రైలోక్య శరీరుడిని ఉపాసించడమే న్యాయమైనది. విడిగా (వ్యస్త)

ఉపాసనము కాదు. అట్లాగని ఈ దిగువ శ్రుతి చూపుతున్నది. వ్యస్తోపాసనము వల్ల కలిగే అనర్థాన్ని చెప్తూ **మూర్థాతే వ్యప తిష్యత్ యన్మాం నాగమిష్యః** నీవు నా దగ్గరకు రాకపోయినట్లయితే నీతలకాయ క్రింద రాలిపడిపోయేది అని **అన్ధోఽభవిష్యోయన్మాం నా గమిష్యః** నా వద్దకు రాకపోయి ఉంటే గుడ్డివాడివి ఐ ఉండేవాడివి. ఇత్యాదులు. అందువల్ల ఇది కూడా తొలగిపోయింది. నామో పాసనతో పోలికను చెప్పినారో అది. ఆ భూమవిద్యలో నామాది ఉపాసనల్లో కలుగబోయే నష్టము ఏదీ చెప్పబడలేదు. పైగా నామాది ఉపాసనల కంటే భూమోపాసనకే గొప్ప ఫలము ఉన్నది అని చెప్పబడింది. **ఏషతువా అతివదతి యస్సత్యేనాతివదతి** అనే వాక్యము ద్వారా. ఆ కారణము వల్లనే వాక్యము భూమావిద్యాపరమే ఐనప్పటికీ నామాద్యుపాసనలకు ఫలాలను కల్గినవాటికి వివక్షితత్వము ఏర్పడింది. అట్లా కాకుంటే అతిశయమైన ఫలముఉన్నదనే కారణము చేతకల్గిన అతివాదాన్ని బట్టి భూమ విద్యా స్తుతి పొసగకుండా పోయేది. కనుక వ్యస్తోపాసనానికంటే సమస్తోపాసనమే మేలైనది. తగినది. **ఇది భూమజ్యాయస్త్వాధికరణము.**

★ ★ ★

## ఇక శబ్దాదిభేదాధికరణము.

సూ॥ **నానా శబ్దాది భేదాత్ 3-3-56** బ్రహ్మ విద్యలు నానా విధాలుగా ఉన్నవి. శబ్దము మొదలైన భేదాలు ఉన్నందువల్ల. ఇక్కడ విచారించబడే బ్రహ్మ విద్యలన్నీ కూడా బ్రహ్మను చేరుకోవడమనే లక్షణము గల మోక్షము ఒక్కటే ఫలముగా కలిగినట్టివి. 1) సద్విద్య 2) భూమవిద్య 3) దహరవిద్య 4) ఉపకోసల విద్య 5) శాండిల్యవిద్య 6) వైశ్వానరవిద్య 7) ఆనందమయవిద్య 8) అక్షరవిద్య మొదలైనవి. ఒకే వేద శాఖకు చెందినట్టివి. మరికొన్ని ఇతర శాఖలకు చెందినట్టివిన్నీ ఉదాహరణలుగా నిలుస్తున్నవి. కొన్ని ప్రాణవిద్య వంటివి. ఒకే విషయాన్ని ఫలమునుగా గల్గినట్టివి. ఐతే వీటిలో విద్యైక్యము ఉన్నదా? లేక విద్యలలో భేదము ఉన్నదా? అని సంశయము కలుగుతున్నది.

ఇక్కడ ఈ విద్యలన్నింటికీ పరస్పర భేదాన్ని సమర్థించినట్లయితే ఒక్క దహరవిద్యా మొదలైనవాటికి సర్వవేదాన్తప్రత్యయన్యాయము వర్తిస్తుంది. కనుక వీటిలో ఏది తగును అని అంటే విద్యైక్యము అనేదే. ఎందుకంటే ఈ అన్ని విద్యల్లోనూ తెల్సుకోదగిన బ్రహ్మ ఒక్కడే కాబట్టి. విద్యకు రూపము తెల్సుకోదగిన వస్తువే. రూపైక్యము ఉన్నది కాబట్టి విద్యైక్యము అని. ఈ విధంగా అభిప్రాయము వ్యక్తం ఐతే చెప్తున్నాము. నానా అని

అనగా విద్యలు వేరువేరు అని. కారణమేమంటే? శబ్దాదులలో భేదాలున్నాయి కదా! ఆది శబ్దముతో 1) అభ్యాసము 2) సంఖ్యా 3) గుణ 4) ప్రక్రియ 5) నామధేయములు గ్రహింపబడుతున్నవి. వేరువేరు శబ్దాలు మొదలైనవాటిద్వారా ఈ విద్యలలో విధేయము లోని భేదానికి కారణాలు, అనుబన్ధ భేదాలు కూడా కనిపించుతున్నవి. ఒకవేళ వేద, ఉపాసీత మొదలైన శబ్దాలు ప్రత్యయము, ఆ వృత్తులను చెప్పేవి, ప్రత్యయాలున్నూ ఒక్క బ్రహ్మను గురించి తెలిపేవి ఐనా ఆయాప్రకరణాల్లో చెప్పిన జగదేక కారణత్వము, అపహతపాప్మత్వము మొదలైన విశేషణాలతో కూడిన బ్రహ్మకు చెందిన విషయాలైన ప్రత్యయ, ఆవృత్తులను తెలియపరచునట్టివైనందువల్ల ప్రత్యయావృత్తి రూపాలైన విద్యలు విభేదించుతున్నవి. బ్రహ్మ ప్రాప్తి రూపమైన ఫలానికి సమ్బన్ధించిన ఉపాసన విశేషాలను చెప్పేవి ఐన, దేని సహాయాన్నీ కోరని వాక్యాలు ప్రతిప్రకరణములోనూ విలక్షణమైన (ముందు చెప్పిన వాటికంటే వేరైన) విద్యలను బోధించేవి అని నిశ్చయింపబడుతున్నవి. ఈ విషయములో **శబ్దాన్తరే కర్మభేదః** శబ్దము వేరయినప్పుడు కర్మలో భేదము ఉంటుంది. ఇత్యాదులైన పూర్వమీమాంసలో చెప్పబడిన సూత్రాల ద్వారా నిర్ణయము స్పష్ట పడుతున్నప్పటికీ మళ్ళీ ఇక్కడ చెప్పడము / ప్రతిపాదించడము వేదాన్త వాక్యాలు, విధేయమైన జ్ఞానానికి చెందినవి కావు / అవిధేయ జ్ఞానపరములు అని పలికే కుదృష్టులను నిరసించడం కొరకు మాత్రమే. కనుక విద్యా భేదము ఉన్నది. 1) విధేయముఽఅంగములతో కూడిన ప్రధానమైన కర్మ. 2) అనుబన్ధాఃఽకర్మలో ఒక భాగమైన ధాత్వర్థము మొదలైనవి. 3) అవిధేయ జ్ఞానపరములుఽనిర్విశేష విషయమైన బ్రహ్మను గురించి తెలిపేవి 4) కుదృష్టులుఽవంకర చూపులు కలవారు. వస్తువు ఒక విశేషాన్ని కలిగి ఉంటే అది లేదని ఉన్న దానికి భిన్నంగా చూచేవాళ్ళు. మాయావాదులు సగుణ బ్రహ్మను వేదము ప్రతిపాదిస్తుంటే దాన్ని కాదని గొంతు చించుకొనేవాళ్ళు. **ఇది శబ్దాది భేదాధికరణము.**

★ ★ ★

## ఇక వికల్పాధికరణము.

సూ॥ **వికల్పోఽవిశిష్ట ఫలత్వాత్ 3-3-57** బ్రహ్మ విద్యలన్నీ సమానమైన ఫలాలు కలవి కనుక వికల్పమే. దేనినైనా ఉపాసించవచ్చు. కలుపుకోనవసరము లేదు. బ్రహ్మను చేరుకోవడమే ఫలముగా గల సద్విద్య దహరవిద్య మొదలైన వాటికి నానాత్వము చెప్పబడింది. ఇప్పుడు ఈ విద్యలు ఒకే వ్యక్తి యందు

ప్రయోజనమున్నందున సముచ్చయము – ఒకదాని కొకటిగా కల్పుకోవడము – కుదురుతుందా! లేక ప్రయోజనము ఉండదు కనుక ఏదో ఒక్క విద్యను ఉపాసించుతే చాలునా? (వికల్పమేనా?) అని సంశయమేర్పడితే ఏది తగును? అనగా సముచ్చయము ఒకటి రెండింటిని ఒక దగ్గర చేర్చుకోవడము కుదురుతుంది అని అంటున్నారు. ఎందువల్లనంటే శాస్త్రార్థములు భిన్నము (వేరు) ఐనా ఫలము ఒక్కటే కాబట్టి సముచ్చయము లోకములో కనిపించుతున్నది. స్వర్గము మొదలైన ఒకే ఫలాన్ని గురించి అగ్నిహోత్రము దర్శపూర్ణమాసములు మొదలైనవాటిని ఆ స్వర్గఫలము మరింత ఎక్కువగా లభించడం కొరకు ఒకే వ్యక్తి పలుమార్లు ఆచరించుతూ ఉండడము కనిపిస్తున్నది. ఇదే తీరుగా ఎక్కువకాలము బ్రహ్మానుభవాన్ని పొందడం కోసము విద్యలను సముచ్చయము చేసుకోవడము కుదురుతుంది. అని పూర్వపక్షము ఏర్పడింది. దీనికి సమాధానమును చెప్పుతున్నాము. వికల్పమేనని. సముచ్చయము రెండు మూడింటిని కలుపుకోవడం కుదురదు అని. ఎందుకంటే వాటి ఫలములలో తేడా లేదు కాబట్టి. బ్రహ్మ విద్యలన్నింటికీ అనవధిక అతిశయము ఐన బ్రహ్మానందానుభవమే ఫలము. పరస్పరము ఫలాలలో భేదమేమీ లేదు. అని వేదము వినిపిస్తున్నది. **బ్రహ్మవిదాప్నోతిపరమ్** బ్రహ్మను గురించి తెల్సుకొని ఉపాసించినవాడు గొప్పదైన ఫలాన్ని పొందుతాడు. **సఏకో బ్రహ్మణ ఆనన్దః శ్రోత్రియస్య చాకామహతస్య.** శ్రోత్రియుడు కోరికలు లేనివాడు ఐన భగవదు పాసకునికి అది ఒక్క బ్రహ్మానందము. **యథాపశ్యః పశ్యతే రుక్మవర్ణంకర్తారమీశం పురుషంబ్రహ్మయోనిం తదావిద్వాన్ పుణ్యపాపే విధూయ నిరంజనః పరమం సామ్యముపైతి.** ఎప్పుడైతే జ్ఞానిఐనవాడు రుక్మము (బంగారము) వంటి అందమైన మనోహరమైన రూపము కలవాడిని ముల్లోకాలను పుట్టించిన వాడిని బ్రహ్మకు కారణమైన వాడిని దర్శించుకొంటాడో అప్పుడు ఆ ఉపాసకుడు తనదైన పుణ్యమును పాపాన్ని విదిలించుకొని ఎవ్వరితోనూ సమ్బన్ధము లేనివాడై పరమాత్మతో మిక్కిలి సమానత్వాన్ని పొందుతాడు. ఇత్యాది వాక్యాలద్వారా **"బ్రహ్మ తనకు ఎదుటివాడికిన్నీ స్వయంగా అనుభవయోగ్యమైన వాడై అనవధికమైన అతిశయమైన ఆనందాన్ని కలిగించుతున్నాడు. అటువంటి గొప్ప ఆనందము ఒక్కవిద్య చేతనే పొందగల్గినప్పుడు మరొక దాని విద్యా ఉపాసనవల్ల కలిగేదేమిటి?"** కనుక సముచ్చయము (మరొక విద్యను కలుపుకోవడము) తగదు. **"స్వర్గాది ఫలాలు దేశాన్ని కాలాన్ని స్వరూపాన్ని బట్టి పరిమితాలు".** కనుక దేశాదులను బట్టి అధికము కావడానికి అవకాశము ఉన్నది కాబట్టి దాన్ని కోరేవారు ఆయా కర్మలను

సముచ్చయము చేసుకోవచ్చును. ఈ **"బ్రహ్మ విద్యలయందైతే కర్మలకు పూర్తిగా విరుద్ధము కనుక సముచ్చయము చేసుకోవడానికి వీల్లేదు. బ్రహ్మ విద్యలన్నీ కూడా బ్రహ్మానుభవాన్ని పొందడానికి అడ్డంకిగా ఉన్న అనాదిఐన కర్మ, అవిద్యా అనేవాటిని దూరంగా తోసిపారేయడం ద్వారా బ్రహ్మ ప్రాప్తి అనే ఫలాన్ని ప్రసాదిస్తవి. కనుక ఏ ఒక్కదానికీ విశిష్టమైన ఫలము లేదు కాబట్టి బ్రహ్మ విద్యలకన్నింటికీ వికల్పమేకానీ సముచ్చయము లేదు."**

బ్రహ్మప్రాప్తికి వ్యతిరేకమైన ఫలాలను ఇచ్చే విద్యలైతే స్వర్గాది ఫలాలను ఇచ్చే కర్మల వలె తమకు నచ్చినట్లుగా సముచ్చయము చేసుకొనవచ్చును. లేదా వికల్పము చేసుకొనవచ్చును. అవి పరిమితములైన ఫలాలను కలిగినట్టివి. కాబట్టి అధికంగా కావాలని కోరే అవకాశము తప్పక ఉంటున్నది. దాన్నే చెపుతున్నారు.

సూ॥ **కామ్యాస్తు యథాకామం సముచ్చీయేరన్. నవా. పూర్వహేత్వభావాత్ 3-3-58** కామ్యకర్మఫలాలు ఐతే తమ కోరికలకు తగినట్లు సముచ్చయం చేసుకోవచ్చును. లేదా మానుకోవచ్చును. అవి అపరిమితమైన ఫలాన్ని కలవి కావు కనుక అని అర్థము. **ఇది వికల్పాధికరణము**

★ ★ ★

## ఇక యథాశ్రయభావాధికరణము

సూ॥ **అంగేషు యథాశ్రయభావః 3-3-59** ఉద్గీథాది క్రతు అంగాలను ఆశ్రయించిన విద్యలు **ఓమిత్యే తదక్షరం ఉద్గీథము పాసీత** అని చెప్పబడినవిద్యలు క్రతువు కొరకు ఎక్కువ ఫలాన్ని అందించడము కొరకు - క్రతువులలో తప్పక స్వీకరించదగినవా? లేక గోదోహనము వలె పురుషార్థము కొరకు చేయబడేవి కాబట్టి తమ కోరిక మేరకు చేయవచ్చునా? అనే సంశయము కలిగినప్పుడు తప్పనిసరిగా ఉపాదేయములే అని అనడమే తగును అని అంటున్నారు. ఏమండీ! **తన్నిర్ధారణా నియమః తద్దృష్టేః పృథక్ హి అప్రతిబన్ధః ఫలమ్.** అనే సూత్రము ద్వారా ఇవి పురుషార్థము కొరకు చేసేవి కనుక నియమము ఏమీ లేదని చెప్పబడింది కదా! అని అంటే నిజమేనండీ! దాన్నే గట్టిచేయడం కొరకు కొన్ని గుర్తులను (లింగాలను) చూపుతూ, యుక్తిని చెపుతూ ఆక్షేపించుతున్నాము. అక్కడ కదా! **తేనోభౌ కురుతః** అందువలన రెండింటినీ చేస్తున్నారు అని చెప్పిన ప్రకారము నియమము ఏమీ కనిపించడం లేదు కాబట్టి. ఫలాలు వేరువేరుగా ఉన్నట్లు చెప్పబడింది. ఉపాసనలను

ఆశ్రయించినవైన ఉద్గీథాదులవలె ఉపాసనలకు కూడా అంగములుగా ఉపాదానము చేసుకోవాలనే నియమము ఉండడానికి చాలా హేతువులు కనిపించుతున్నవి. ఐతే ఇక్కడ **గోదోహనేన పశుకామస్య ప్రణయేత్** పశువులు సమృద్ధిగా కావాలనే కోరిక గల యజమానికి యజ్ఞములో ఆవుకు పాలుపిండడము ద్వారా ఆ కోరికను నెరవేర్చాలి. ఇత్యాది వాక్యము వలె ఉపాసనను విధించే వాక్యములో ఫలముతో సమ్బన్ధము వినిపించడము లేదు. **ఉద్గీథము పాసీత** అని ఉద్గీథముతో మొదలైన వాటితో సమ్బన్ధము కలదిగానే ఉపాసనము కనిపించుతున్నది. **యదేవవిద్యయాకరోతి శ్రద్ధయా ఉపనిషదా తదేవవీర్యవత్త రమ్** ఏ కర్మనైతే సరియైన జ్ఞానముతో శ్రద్ధతో చేయబడుతుందో అది మాత్రమే శక్తి మన్తము అవుతుంది అని ప్రస్తుతమైన (వర్తమానమైన) విషయాన్ని తెలియచెప్పే మరొక వాక్యము ద్వారా ఫలముతో సమ్బన్ధము తెలుస్తున్నది. తనదైన వాక్యము చేతనే దృఢమైన సమ్బన్ధము కల ఉద్గీథాదులయొక్క సమ్బన్ధముతో నిశ్చితమైన క్రత్వంగభావము కల మరో వాక్యములో ఉన్న వర్తమాన ఫలసమ్బన్ధనిర్దేశము అర్థవాదము – పొగడ్త మాత్రమే అవుతుంది. పాపములేకుండా పోతుంది అని చెప్పే శ్లోకము వినిపించినట్లు. ఇందువల్ల ఉద్గీథాదులు ఎట్లా ఉపాసనలను ఆశ్రయించినవే ఐనా క్రతువులకు అంగములు కావడం చేత ప్రయోగాన్ని చెప్పే విధి ప్రకారము నియమంగా స్వీకరింపబడుతున్నవో. అదే తీరుగా వాటిని ఆశ్రయించిన ఉపాసనలుకూడా ఉద్గీథాదుల ద్వారా క్రతువుకు అంగాలు అవుతున్నాయి కాబట్టి తప్పనిసరిగా స్వీకరించదగినట్టివే.

సూ॥ **శిష్టేశ్చ 3–3–60** శిష్టిఃఽశాసనము విధించుట అని అర్థము. ఉద్గీథము పాసీత అని ఉద్గీథానికి అంగముగా ఉపాసనను విధించినారు కనుక ఉపాదానము చేసుకోవాలని నియమము ఏర్పడుతున్నది. **గోదోహనేన పశుకామస్య ప్రణయేత్.** ఇత్యాది వాక్యములో వలె విధించే వాక్యములో మరొక అధికారము వినిపించడంలేదు కాబట్టి ఉద్గీథాదులకు అంగభావమే విధేయమని తెలియవస్తున్నది.

సూ॥**సమాహారాత్ 3–3–61 హోతృషదనాద్ధైవాపి దురుద్గీథమనుసమాహరతి.** అని ఉపాసనకు సమాహార నియయము కనిపించుతున్నది. దురుద్గీథమ్ఽవేదనం ఉపాసనము, జ్ఞానము లేని ఉద్గీథము. వేదనము, జ్ఞానము లేనప్పుడు మరొకదానితో సమాధానాన్ని (అనువృత్తిని) చెప్పుతూ ఉపాసనను నియమంగా (తప్పనిసరిగా) స్వీకరించుటను చూపుతున్నది.

సూ॥ **గుణసాధారణ్య శ్రుతేశ్చ 3-3-62** గుణము కలిగి ఉండడము సాధారణమేనని వినిపిస్తున్నందువల్లకూడాను. ఉపాసనకు గుణమై ఉపాసనను ఆశ్రయించి ఉన్న ఉపాసనతో కూడి ఉన్న ప్రణవానికి **తేనేయం త్రయీవిద్యావర్తతే ఓమిత్యాశ్రావయతి. ఓమితిశంసతి ఓమిత్యుద్గాయతి.** ఆ ఓంకారము వల్లనే ఈ ఋక్ యజు స్సామ అనే వేద సముదాయము ముందుకు సాగుతున్నది. ఓమ్ అని శ్రావ్యముగా వినిపించుతున్నది. ఓమ్ అని ప్రశంసించుతున్నాడు. ఓమ్ అని గొంతెత్తిపాడుతున్నాడు అని సాధారణ్యశ్రుతివల్ల కూడా ఉపాసనా సమాహారము – ఉపాసనమైన ప్రణవము వెంటనంటి ఉండడము వలన ఉపాసన యొక్క అనువృత్తి – తెలియవస్తున్నది. వాక్యములో తేన అనే శబ్దముతో ప్రకృతమైన విషయమును పరామర్శించుతున్నందువల్ల ఉపాసనతో కూడిన ప్రణవమే అన్నిచోట్లా ప్రవర్తించుతున్నది. అందువల్ల ఉపాసన ప్రణవముతో కలసి ఉండడమనే నియమము కనిపిస్తున్నది. కాబట్టి ఉద్గీథాది ఉపాసనలకు ఉద్గీథాదుల వలెనే తప్పక స్వీకరణము (ఉపాదానము) ఉన్నది (పై నాలుగు సూత్రాలు పూర్వపక్షికి చెందినవి) ఈ విధంగా పూర్వపక్షము ఏర్పడగా చెపుతున్నారు.

సూ॥ **నవా తత్సహభావాశ్రుతేః 3-3-63** ఇట్లా అని నియమం ఏమీ లేదు. ఉద్గీథ ఉపాసనలకు ఉద్గీథము సహభావనియమము లేదు కాబట్టి. ఉద్గీథాద్యుపాసనలకు, ఉద్గీథాదుల వలె ఉపాదాననియమము ఉన్నదనడం సరికాదు. ఎందువల్లనంటే వాటి సహభావము కలసి ఉండి తీరాలి అనే నియమము ఎక్కడా వినిపించడం లేదు కాబట్టి. ఉద్గీథాంగ భావము వినిపించనందువల్ల అని అర్థము. అంగము ఐనప్పుడు సహభావనియమము తప్పక ఉంటుంది. **ఉద్గీథము పాసీత** అనే వాక్యము లోని పదసముదాయము నందు అధికారాన్తరపదము కనిపించడము లేదు. అయినప్పటికీ దానివెంటనే **యదేవ విద్యయా కరోతి శ్రద్ధయా ఉపనిషదాతదేవ వీర్యవత్తరం భవతి** అని విద్య క్రతువు యొక్క వీర్యవత్తరత్వమును గురించి సాధనమగుటను ప్రతిపాదింపబడుతున్నది. అందువల్ల క్రతువు యొక్క ఫలాని కంటే వేరు అయిన ఫలానికి సాధనమైన విద్య **ఉద్గీథము పాసీత** అని చేయవలసినదిగా (కర్తవ్యముగా) విధింపబడుతున్నది. క్రతుఫలము కంటే వేరయిన ఫలసాధనంగా తెలియవచ్చిన ఉపాసన క్రతువుకు అంగమైన ఉద్గీథానికి అంగముగా వినియోగించుట పొసగేది కాదు. ఇందువల్ల ఉపాసనకు ఆశ్రయమేది? అని తెల్సుకోవాల్సి వచ్చినపుడు దగ్గరగా ఉన్న ఉద్గీథము మాత్రమే ఆశ్రయము అవుతుంది. ఉద్గీథము కూడా క్రతువుకు

అంగము ఐనట్టిది కాబట్టి క్రతు ప్రయుక్త మైన ఉద్గీథాదులను ఆశ్రయించిన ఉపాసనము నందు క్రతువుకు అధికారి ఐనవానికి మాత్రమే క్రతువు వీర్యవత్తరము కావాలి అనే కోరిక ఉన్నపుడే ఇది మరొక అధికారమును పొందుతున్నది. కనుక క్రతువులలో దాన్ని ఉపాదానము చేసుకోవాలనే నియమము లేదు. వీర్యవత్తరత్వము అంటే క్రతుఫలము దానికన్నా బలవత్తరమైన ఇతర కర్మయొక్క ఫలము చేత అడ్డుకోబడకుండడము అని చెప్పబడింది. అంటే క్రతువు యొక్క ఫలము ఆలస్యము లేకుండా కర్త ఐన యజమానికి దక్కడమన్న మాట. పర్ణతాదులు ఐతే **యదేవ విద్యయా కరోతి... తదేవ వీర్యవత్తరం భవతి.** అని విద్య ఫలసాధనమైనట్లు అపాప శ్లోక శ్రవణాది ఫలానికి సూటిగా సాధనమగుట వినిపించలేదు. కనుక క్రతువుకు అంగమైన జుహ్వాదులకు అంగమైనందువల్ల వినియోగములో వైరుధ్యము లేదు కాబట్టి దానికి అంగాలైన వాటికి మరో ఫలాన్ని సాధించిపెట్టడానికి ఇది హేతువు అవుతుందని కల్పన (ఊహ) చేయడం సబబు కాదు. కాబట్టి ఆ వాక్యములో / విషయములో ఫల శ్రుతి – ప్రత్యేకఫలాన్ని చెప్పడము – అర్థవాదము మాత్రమే అవుతుంది.

(**పర్ణమయీ జుహూః** జుహువు అనే యజ్ఞసాధనము మోదుగు ఆకులతో సిద్ధము చేసుకొని దానితో హోమం చేస్తే కఱ్ఱతో సిద్ధం చేసిన జుహువు కంటే ఎక్కువ ఫలాన్ని ఇస్తుంది అనే దగ్గర ప్రత్యేక ఫలాన్ని – యజ్ఞము వల్ల లభించే దానికి వేరుగా – చెప్పడము అర్థవాదమే అవుతున్నది. అట్లాగే ఉద్గీథాది ఉపాసనతో చేసిన ఉద్గీథమనబడే, దేవతాస్తోత్రమైన సామవేద మన్త్రము ఇతర కర్మలనుండి కలిగే ఫలాల చేత అడ్డుకోబడకుండా కర్మఫలాన్ని యజమానికి సత్వరంగా అందిస్తుందే కానీ తానుగా ప్రత్యేక ఫలాన్ని ఇవ్వదు. కనుక ఉద్గీథమన్త్రము వలె ఉద్గీథాది ఉపాసన క్రతువుకు తప్పనిసరి అంగము కాదు. కనుక అది ఉపాదేయము కాదు.)

సూ॥**దర్శనాచ్చ 3-3-64**శ్రుతి ఈనియము లేకపోవడాన్ని చూపుతున్నది కూడా. ఉపాసనను ఉపాదానము చేసుకోవాలి అనే నియమము లేదని శ్రుతే చూపుతున్నది. **ఏవం విద్ హవై బ్రహ్మా యజ్ఞం యజమానం సర్వాంశ్చ ఋత్విజోఽభిరక్షతి.** ఈ విధంగా యజ్ఞ స్వరూపాన్ని అంతా తెల్సిన బ్రహ్మ (యజ్ఞములోని ఋత్విక్కులలో ముఖ్యుడు) యజ్ఞాన్ని యజమానిని ఋత్విక్కులనందరినీన్నీ బాగుగా కాపాడుతున్నాడు అని బ్రహ్మ యొక్క వేదనము (ఉపాసనము) చేతనే అందరికీ రక్షణము కలుగుతుందని శ్రుతి చెపుతున్నది. ఉద్గాత – యజ్ఞములో ఆయా సందర్భాలలో ఆయా దేవతలకు

సమ్బన్ధించిన స్తోత్రరూపాలైన సామవేద మన్త్రాలను ఆయా దేవతలు వినిసన్తోషపడేటట్లు గొంతెత్తి పాడేవాడు) మొదలైనవారు ఉపాసనలేనివారైనప్పుడే ఈ వాక్యము చెల్లుతుంది. ఈ ఒక్క లింగము చేతనే ముందు చెప్పిన సమాహారాది లింగాలు ప్రాయికములు అని తెలుస్తున్నది. ఇందువల్ల నియమములేదని చెదరకుండా నిలిచింది. **ఇది యథాశ్రయ భావాధికరణము.**

**ఇంతటితో శ్రీభాష్యమునందు తృతీయాధ్యాయములోని**
తృతీయపాదము ముగిసినది.

శ్రీమతే రామానుజాయనమః

## శ్రీభాష్యము – తృతీయాధ్యాయము – చతుర్థపాదము

### పురుషార్థాధికరణము

సూ॥ **పురుషార్థోఽతశ్శబ్దాదితి బాదరాయణః 3-4-1** బ్రహ్మ విద్యవల్లనే మోక్షరూప పురుషార్థము లభించుతుంది. అని భగవన్తుడైన వ్యాసమహర్షి తలంచుతున్నాడు. గుణాలను ఉపసంహరించుకోవలెనా లేకవద్దా? అనే అంశాన్ని నిర్ణయించడము ద్వారా విద్య ఒక్కటేనా లేక వేరు వేరేనా? అనే విచారము ఇంతవరకూ చేయబడింది. ఇప్పుడు విద్యవల్లనే పురుషార్థమా? లేక విద్యకు అంగమైన కర్మవల్లనా? అనే విషయము చిన్తింపబడుతున్నది. ఏది తగును? అని అంటే అతఃఽఈ బ్రహ్మ విద్యవల్లనే పురుషార్థము లభిస్తుంది అని భగవన్తుడగు బాదరాయణుడు తలుస్తున్నాడు. కారణమేమిటంటే శబ్దము వల్ల. విద్యవల్లనే పురుషార్థము లభించుతుందని చెప్పుతున్న శబ్దాలు ఉపనిషత్తులలో కనిపిస్తున్నవి. **బ్రహ్మ విదాప్నోతి పరమ్ 2) వేదాహమేతం పురుషం మహాన్తం ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్ తమే వం విద్వానమృత ఇహాభవతి. నాన్యః పన్థా విద్యతేఽయనాయ. 3) యథానద్యః స్యన్దమానాః సముద్రేఽస్తంగచ్ఛన్తి నామరూపే విహాయ తథావిద్వాన్నామరూపాద్విముక్తః పరాత్పరం పురుషముపైతిదివ్యం** ఇత్యాదులు. 1) బ్రహ్మవేత్త పరమపదాన్ని పొందుతున్నాడు. 2) ఈ మహాపురుషుడిని తమస్సుకు ఆవల సూర్యుడి వలె వెలిగే వాడిని నేను తెల్సుకున్నాను. ఇటువంటి వాడిని తెల్సి ఉపాసించినవాడు మరణములేని

ఆనందరూపుడు అవుతున్నాడు. మోక్షము పొందడానికి ఇంతకంటే మరో మార్గం లేదు 3) పరుగులు పెట్టే నదులు పారుకుంటూ పోయి సముద్రములోకి పోతూ తమ నామరూపాలను వదిలివేసి ఎట్లా వెళ్ళుతున్నాయో అట్లే విద్వాంసుడు కూడా పరాత్పరుడైన దివ్యపురుషుడిని చేరుతున్నాడు. అని మొదలైన శబ్దాలు తేటగా చెప్తున్నవి. ఇక్కడ పూర్వపక్షి అడ్డము తిరుగుతున్నాడు.

సూ॥ **శేషత్వాత్ పురుషార్థ వాదః యథాఽన్యేష్వితి జైమినిః 3-4-2** కర్తకు సంస్కారాన్ని కలిగించడము ద్వారా విద్యక్రతువుకు శేషము అవుతున్నది. విద్యకు ఫలశ్రుతి అర్థవాదము మాత్రమే. ఎట్లాగంటే మిగతా ద్రవ్యాలలో వలె అని జైమిని అనే ఆచార్యుడు భావిస్తున్నాడు. నీవన్నట్లుకాదు. విద్యవల్లనే పురుషార్థము కల్గుతుంది అని. ఈ వేదశబ్దము **బ్రహ్మ విదాప్నోతిపరమ్** ఇత్యాదులు వేదనము వలన పురుషార్థము కలుగుతుందని తెలుపడము లేదు. కర్మలో కర్త ఐన ఆత్మకు యధార్థమైన స్థితి ఏది ఉన్నదో దాన్ని మాత్రమే ప్రతిపాదిస్తున్నది. కనుక కర్తకు సంస్కారాన్ని కలిగించడము ద్వారా విద్య క్రతువుకు శేషము అవుతున్నది కాబట్టి విద్యకు ఫలాన్ని చెప్పడము అర్థవాదము మాత్రమే అవుతుంది. ఎట్లాగంటే యజ్ఞానికి అంగము లైన ద్రవ్యాదులలో వలె అని జైమిని ఆచార్యుడు తలుస్తున్నాడు. అందుకే **ద్రవ్య సంస్కారకర్మసు పదార్థత్వాత్ ఫలశ్రుతిః అర్థవాదః స్యాత్** ద్రవ్యమునకు చేసే సంస్కార కర్మలలో ప్రయోజనము యజ్ఞానికి చెందినదవుతున్నందువల్ల ప్రత్యేకంగా ఏదైనా ఫలము చెప్పబడితే అది అర్థవాదము మాత్రమే ఔతుంది అని చెప్పినారు. ఔనండీ! కర్మలలో జీవుని కంటే – కర్త – ముముక్షువులచే పొందదగిన వాడుగా వేదాన్తాలలో తెల్సుకోదగినవాడుగా మరొకడు ఉపదేశింపబడుతున్నాడని తొలుతనే ఉపపాదింపబడింది. **నేతరోఽనుపపత్తేః 2) భేదవ్యపదేశాచ్చ 3) అనుపపత్తేస్తు న శారీరః 4) ఇతరపరామర్శాత్స ఇతిచేన్న ఆసంభవాత్** ఇత్యాది సూత్రాలద్వారా ఆ బ్రహ్మనే తత్త్వమసి మొదలైన వాక్యాలద్వారా సామానాధికరణ్యమున్నందు వలన జీవునికంటే వేరయినవాడు కాడని. ఐతే అది కూడా **అధికం తు భేదనిర్దేశాత్** ఇత్యాది సూత్రాల ద్వారా పక్కకు పెట్టినారు.

సామానాధికరణ్య నిర్దేశమున్నా **ఐతదాత్మ్యమిదం సర్వమ్ 2) సర్వం ఖల్విదం బ్రహ్మ** అని సూచించినట్లు చేతనాచేతనాలు రెండింటికీ సమానమైనటువంటిది. **యః పృథివ్యాం తిష్ఠన్, యః ఆత్మనితిష్ఠన్** ఇత్యాదుల ద్వారా తెలుస్తున్నతాదాత్మ్యము కాబట్టి పృథివీ మొదలైనవాటిల్లో ఉంటున్నందువల్ల ఏర్పడినటువంటిది అని **అవస్థితేరితి**

**కాశకృత్స్నః** ఇత్యాది సూత్రాల చేత ప్రతిపాదింపబడింది. అందువల్ల వేదాన్త శబ్దాలు కర్మలలో కర్తఐన ఆత్మకు యాథాత్మ్య స్థితిని తెలిపేటువంటివి అన్న కారణంతో విద్యను కర్మకు అంగము అని ఎట్లా చెప్పవచ్చును? అని అంటే చెప్తున్నాము వినండి. వేదాన్తవాక్యాల యందే విద్యకు కర్మ ప్రాధాన్యాన్ని సూచించే లింగాలతో (గుర్తులతో), వాటిచేత బలపర్చబడిన సామానాధికరణ్యము ప్రకారము వల్లనున్నూ వేదాన్త శబ్దాలు దేహానికంటే వేరయిన జీవుని యొక్క స్వరూపయాథాత్మ్యాన్ని తెలిపేవే అని బలంగా (బలవన్తముగా)అంగీకరించవలెనని పూర్వపక్షియొక్క అభిప్రాయము. అయ్యా! కర్తకు సంస్కారాన్ని చెప్పడమనే మిషతో విద్యను క్రతువులో అనుప్రవేశింపచేయడమును గురించి చెప్పడము తగదు. కర్త లౌకిక వైదిక కర్మలు రెండింటినీ చేస్తున్నాడు. దేనికో ఒక్క దానికి చెందినవాడు కాడు. కనుక అవ్యభి చరితక్రతు సమ్బన్ధిత్వము లేదు కదా! అనగా క్రతువుకే కట్టుబడి లేదు కదా అని అర్థము. అని అంటే అట్లాకాదు. లౌకికమైన కర్మకు దేహానికంటే వేరైనవాడు కాకపోయినప్పటికీ కర్మ చేయడం కుదురుతున్నది. దేహానికంటే వేరైన నిత్యమైన ఆత్మ యొక్క స్వరూప జ్ఞానము క్రతువులోనే ఉపయోగపడుతుంది. అందువల్ల దాని స్వరూపాన్ని ప్రతిపాదించడము ద్వారా క్రత్వను ప్రవేశము చేసితే విద్యతో వైరుధ్యము కలుగదు అందువల్ల విద్య క్రతువుకు శేషము అవుతున్నందువల్ల విద్య వల్ల పురుషార్థము సిద్ధించదు.

ఇంతకుముందు వేదాన్త శబ్దాలు జీవస్వరూపాన్ని తెలియజేసేవే అని అన్నారు కదా. ఆ లింగాలు ఏవి? వాటివల్ల సామానాధికరణ్యము బలపర్చపడుతున్నది. ఏవిధంగా? అని అంటే చెప్తూ ఉన్నారు.

సూ॥ **ఆచారదర్శనాత్ 3-4-3** సామానాధికరణ్యాన్ని బలపరిచే ఆచారము కనపడ్తున్నందువల్ల బ్రహ్మవేత్తలు ప్రధానంగా కర్మలయందే ఆచరణను కలిగి ఉన్నారు. అశ్వపతి ఐన కేకయుడు ఆత్మ విత్తముడుగా ప్రసిద్ధుడు. ఆయన వద్ద విజ్ఞానాన్ని పొందడానికి వచ్చిన ఆ ఋషులతో ఇట్లా అన్నాడు. **యక్ష్యమాణోహవై భగవన్తోఽహమస్మి.** ఓ పూజ్యులారా! నేను యజ్ఞాన్ని చేస్తూ ఉన్నాను అని. బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠులైన జనకాదులు కర్మనిష్ఠ కలవారుగా స్మృతులలో కనపడుతున్నారు. **కర్మణైవహి సంసిద్ధిం ఆస్థితాజనకాదయః** జనకుడు మొదలైనవారు కర్మవల్లనే మోక్షాన్ని పొందినారు. **ఇయాజ సోఽపిసుబహూన్ యజ్ఞాన్ జ్ఞానవ్యపాశ్రయః** జ్ఞానముపైన ఆధారపడి ఆయన కూడా అనేక యజ్ఞాలను చేసినాడు. అని కనుక బ్రహ్మవేత్తలు

కర్మ ప్రధానులుగా కనపడుతున్నందున విద్య అనేది కర్త యొక్క స్వరూపాన్ని తెలుపుతున్నది. కనుక కర్మాంగమే. కాబట్టి విద్యవలన పురుషార్థము సిద్ధించదు. ఇది లింగము మాత్రమే. ప్రాప్తిని చెప్పండి అంటే చెప్తున్నాడు.

సూ॥ **తత్ శ్రుతేః 3-4-4** అది వేదము వల్లనే తెలుస్తున్నది. వేదమే విద్య కర్మాంగమని చెప్పింది. **యదేవ విద్యయా కరోతి శ్రద్ధయో పనిషదా తదేవ వీర్యవత్తరం భవతి.** అని ఐతే ఈ శ్రుతి వాక్యము ప్రకరణాన్నిబట్టి ఉద్గీథమునకు మాత్రమే చెందినది అని కట్టుబాటు చేయడం కుదురదు. ప్రకరణం కంటే శ్రుతి బలమైనది కాదా! కనుక యదేవ విద్య యాకరోతి అనే శ్రుతి విద్యకు మాత్రమే చెందినటువంటిది.

సూ॥ **సమన్వారమ్భణాత్. 3-4-5 తంవిద్యా కర్మణీ సమన్వారభేతే.** క్రతువును విద్యకర్మ రెండున్నూ స్పృశించు తున్నవి. అని విద్యా కర్మలు రెండూ సహితములై ఉండుటమున్నూ కనపడుతున్నది. ఇంతకుమునుపు చెప్పిన న్యాయము ప్రకారము (కర్తఐన ఆత్మ యొక్కకర్మ శేషత్వము, ఆచార దర్శనము) విద్య కర్మకు అంగమైనపుడే సాహిత్యము – కలయిక చక్కగా పొసగుతుంది.

సూ॥ **తద్వతో విధానాత్ 3-4-6** విద్య కలవానికే కర్మలను చేయాలని విధించినారు కాబట్టి. విద్యావంతునికే కర్మను చేయమని విధించినారు కాబట్టి విద్య కర్మాంగమని అర్థమవుతున్నది. **ఆచార్య కులాద్వేదమధీత్య యథావిధానం గురోః కర్మాతి శేషేణ అభిసమా వృత్య కుటుంబే శుచౌదేశే** ఆచార్యుల వారి వద్ద వేదాన్ని అభ్యసించి శాస్త్రము చెప్పిన ప్రకారముగా సంపూర్ణంగా సమావర్తనాన్ని పూర్తి చేసుకొని తన కుటుంబములో/ ఇంట్లో శుభ్రమైన ప్రదేశంలో ఇత్యాదుల యందు విధానము కనపడ్తున్నది. వేదమధీత్య అని అధ్యయనము చేసినవానికే కర్మలను బోధిస్తున్న వాక్యము అర్థాన్ని చక్కగా తెల్సుకొనేంత వరకూ చదువుకున్నవానికి మాత్రమే ఈ కర్మాచరణ విధిని నిర్దేశిస్తున్నది. కనుక అధ్యయనము అని అంటే అర్థము తెల్సుకొనేంతదాకా అని నిశ్చయము చేసినారు. అందువల్ల బ్రహ్మ విద్య కూడా కర్మల యందు వినియోగింపబడుతున్నది కాబట్టి వేరే ఫలానికి తగినది కాదు.

సూ॥ **నియమాత్ 3-4-7** నియమాన్ని ఏర్పరచినారు కాబట్టిన్నీ. ఈ చెప్పబోయే కారణాన్ని బట్టి కూడా బ్రహ్మ విద్య వల్ల పురుషార్థము సిద్ధించదు. **కుర్వన్నేవేహకర్మాణి జిజీవిషేత్ శతగ్ం సమాః** కర్మలను చేసుకుంటూనే వందసంవత్సరాలు జీవించాలని

తలచుకోవాలి. అని ఆత్మవేత్త ఐన పురుషుడు కూడా తన జీవితకాలమంతా కర్మలలోనే వినియోగించడము వల్ల కర్మలకే ఫలము అని అర్థమవుతున్నది. విద్య మాత్రము కర్మకు అంగమవుతున్నది అని. ఈ విధంగా పూర్వపక్షము వస్తే చెప్పుతున్నాము.

సూ॥ **అధికో పదేశాత్తు బాదరాయణస్యైవం తద్దర్శనాత్ 3-4-08** అధికుడైన పరమాత్మను గురించి ఉపదేశించినారు. శ్రుతివాక్యాల్లో అదే కనిపిస్తున్నది. కనుక బాదరాయణుడు ఈ విధంగా తలుస్తున్నాడు. సూత్రములోని తు శబ్దము పూర్వపక్షాన్ని తోసివేస్తున్నది. విద్యవల్లనే పురుషార్థము దక్కుతుంది. ఎందువల్లనంటే అధికోపదేశము వల్ల కర్మలయందు కర్త ఐన జీవుడి కంటే హేయప్రత్యనీకుడు అనవధికము అతిశయము అసంఖ్యేయము ఐన కళ్యాణగుణాలకు గని వంటివాడైన గొప్పవానియొక్క జీవుని కన్నా వేరైనవాడైన పరబ్రహ్మను తెల్సుకోదగిన వాడుగా ఉపదేశించినందువల్ల భగవంతుడైన బాదరాయణునికి విద్యవల్లనే పురుషార్థము ఫలము అని ఉద్దేశ్యము. లింగాలు ఎన్నైనా ఉండనీ, తెల్సుకోవలసినదిగా ఉపదేశము మాత్రము కర్త ఐన ప్రత్యగాత్మ కంటే అధికుడైన వాని గురించే. ఎట్లాగా తెలుస్తున్నదంటే. తద్దర్శనాత్ ప్రత్యగాత్మ శుద్ధుడైనా పుణ్యపాపరూపకర్మలను కల్గి ఉన్నందున అశుద్ధుడు ఐనా, ఊహకు అందరానన్ని అనన్త గుణాలకు ఆకరమువంటి వాడు కావుననే తెల్సుకోదగినవాడు నిరస్తనిఖిల హేయగన్ధుడు తన సంకల్పం చేత మాత్రాననే జగత్తును పుట్టించడము, గొప్పగా జీవింపచేయడము ప్రళయము చేయడము అనే లీలావినోదము కలవాడు సర్వజ్ఞుడు అన్నివిధాలైన శక్తులు కలవాడు వాక్కులతో కానీ మనస్సుతో కానీ ఇంత అని ఊహించడానికి వీలుకాని ఆనందము కలవాడు జీవుని కంటే అధికుడైనవాడు సమస్త చరాచర ప్రపంచాన్ని శాసించేటువంటివాడు ఐన పరబ్రహ్మ వేదన (జ్ఞానము) ను తెలిపేవాక్యాల్లో కనిపించుతున్నాడు కాబట్టి. **1) అపహత పాప్మా విజరో విమృత్యుః విశోకోఽ విజిఘత్సోఽపిపాసః సత్యకామః సత్య సంకల్పః 2) తదైక్షత బహుస్యాం ప్రజాయేయేతి తత్తే జోఽసృజత 3) యః సర్వజ్ఞః సర్వవిత్ 4) పరాఽస్య శక్తిః వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞాన బలక్రియాచ 5) సఏకో బ్రహ్మణ ఆనందః 6) యతో వాచోనివర్తన్తే అప్రాప్యమనసాసహ। ఆనందం బ్రహ్మణో విద్వాన్న బిభేతి కుతశ్చనేతి. 7) ఏషసర్వేశ్వరః ఏషభూతాధి పతిరేష భూతపాల ఏషసేతుర్విధరణః 8) సకారణం కరణాధిపాధిపోనచాస్య కశ్చిత్ జనితాన చాధిపః 9) ఏతస్య వా అక్షరస్య ప్రశాసనే గార్గి సూర్యా చంద్రమసౌ విధృతౌ తిష్ఠతః 10) ఏతస్య వా అక్షరస్య ప్రశాసనే గార్గి**

**ద్యావా పృథివ్యౌ విధృతే తిష్ఠతః 11) భీషాఽ స్మాద్వాతః పవతే భీషో దేతిసూర్యః భీషాఽస్మాదగ్నిశ్చేన్ద్రశ్చ. మృత్యుర్ధావతి పంచమ ఇతి.** మొదలైన వాక్యాలలో. అందువల్ల వేదనోపదేశ శబ్దాల యందుకర్త ఐన ప్రత్యగాత్మ మిణుగురు పురుగు వంటివాడు. అవిద్య మొదలైన హేయగుణాలతో సమ్బన్ధము గలవాడిని గురించి మచ్చుకైనా ప్రస్తావన లేదు కాబట్టి పరమ పురుషుడిని గురించి తెలిపే విద్య, ఆయనను పొందడమనే రూపముకల అమృతత్వము ఆయా స్థలాల్లో వినిపించేదే ఫలము. కావున విద్య వల్లనే పురుషార్థము లభించుతుంది అని బాగా చెప్పినారు. ఇక లింగాలు తోసివేయబడుతున్నవి.

సూ॥ **తుల్యంతు దర్శనమ్ 3-4-9** విద్యకర్మాంగమని కనిపించుతున్నది అని ఏ మాట అన్నారో అదిసరికాదు. విద్యకు కర్మాంగమని కూడా కనిపిస్తున్నది. బ్రహ్మవేత్తలు కర్మలను ఆచరించుతుండడము కనపిస్తున్నది కనుక విద్య కర్మాంగమని ఏ మాట చెప్పినారో అది సరికాదు. విద్య అంగము కాకపోయినప్పటికీ ఆ విధమైన దర్శనము సమానముగానే కనిపిస్తున్నది. అనగా బ్రహ్మవేత్తల కర్మానుష్ఠానము ఏకాన్తికము కాదని అర్థము. అనుష్ఠానము లేకపోవడమున్నూ కనిపిస్తున్నది. బ్రహ్మవేత్తలు కర్మలను వదలిపెట్టడమూ ఉన్నది. **ఋషయః కావషేయాః, కిమర్థా వయ మధ్యేష్యామహే కిమర్థావయం యక్ష్యామహే** కావషేయులు అనబడే ఋషులు దేని కొరకు మనము అధ్యయనము చేస్తున్నాము దేనికొరకు యజ్ఞాలను చేస్తున్నాము అని విచారించడము ఇత్యాది వాక్యాల్లో కనిపిస్తున్నది. కనుక బ్రహ్మవేత్తలు కర్మ త్యాగము చేయడమున్నది కాబట్టి బ్రహ్మ విద్య కర్మలకు అంగము కాదు. ఇది ఎట్లా పొసగుతుంది. ఏదో ఒకటి మాత్రమే ఉండాలికానీ వదిలి వేయడం, వదలక పోవడం రెండూ అతుకవు కదా? అని అంటే ఫలము కావాలని కోరుకోకుండా చేసే యజ్ఞాది కర్మలు బ్రహ్మ విద్యకు అంగములు అవుతున్నాయి. కనుక ఆ విధమైన కర్మానుష్ఠానము పొసగుతుంది. అందుకే మున్ముందు **సర్వాపేక్షా చయజ్ఞాది శ్రుతేరశ్వవత్** యజ్ఞాదులన్నీ అవసరమైనటువంటివే. ప్రయాణసాధనమైన ఒక్క గుఱ్ఱమే కాకుండా జీనువంటివి అవసరమే కదా! అని చెప్పనున్నాడు. ఫలము కొరకైన ఆయజ్ఞాది కర్మ మోక్షము ఒక్కటే ఫలముగా గల బ్రహ్మవిద్యకు వ్యతిరేకము కావున దాన్ని పాటించకపోవడమున్నూ సమంజసమే. విద్య కర్మాంగమే గనుక ఐనప్పుడు కర్మత్యాగము ఏ తీరుగానూ చెల్లదు. శ్రుతివల్లనే విద్య కర్మకు అంగమని తెలుస్తున్నదని ఏ మాట చెప్పినారో దాని గురించి చెప్పుతున్నారు.

సూ॥ **అసార్వత్రికీ 3-4-10** ఆ శ్రుతి అన్నింటికీ వర్తించేది కాదు. మీరు చూపిన ఈ శ్రుతివాక్యము అన్ని బ్రహ్మవిద్యలకూ సమ్బన్ధించిందికాదు. ఒక్క ఉద్గీథ విద్యకు చెందింది మాత్రమే. **యదేవ విద్యయా కరోతి** అనే వాక్యములోని దేన్నీ నిర్ధారణ చేయని విశేషము కల యచ్ఛబ్దము **ఉద్గీథముపాసీత** అని ప్రస్తావింపబడిన ఉద్‌గీథ విశేషమునందే నిల్చిపోయింది. ఐతే దేన్ని చేస్తున్నాడో దాన్ని విద్యతో చేస్తున్నాడు అని సమ్బన్ధము లేదు. దేన్నైతే విద్యతో చేస్తున్నాడో అదే వీర్యవత్తరము అని విద్యతో చేయబడే దానిని యత్ శబ్దముతో నిర్దేశించి దానికి వీర్యవత్తరత్వము చెప్పబడుతున్నది.

**తం విద్యాకర్మణీ సమన్వారభేతే** అనే వాక్యాన్ని బట్టి విద్యా కర్మలకు సాహిత్యము (కలయిక) కనిపించుతున్నందున విద్య కర్మకు అంగమని ఏ మాట చెప్పినారో ఆ విషయంలో –

సూ॥ **విభాగః శతవత్ 3-4-11** విభాగము ఉన్నది. వందరూపాయల వలె. **తంవిద్యా కర్మణీ సమన్వార భేతే** అనుచోట చెప్పిన న్యాయము ప్రకారము విద్య, కర్మ రెండూ వేరువేరు ఫలాలు కలవి కాబట్టి విద్య తన ఫలముతో సమ్బన్ధాన్ని కలిగి ఉంటుంది. కర్మకూడా తనదైన ఫలముతో అని విభాగాన్ని చూచుకోవాలి. శతవత్ – క్షేత్ర రత్నములను విక్రయించేవాడికి శతద్వయము – రెండు వందలు దక్కుతవి అన్నపుడు భూమి కొరకు వంద దానిలోని రత్నాలకు వంద అని విభాగము ఎట్లా తోస్తుందో అట్లాగే ఇక్కడ కూడా ఫల విభాగం చెయ్యబడుతుంది.

సూ॥ **అధ్యయన మాత్రవతః 3-4-12** అధ్యయనము మాత్రము చేసిన వాడికే కర్మలను విధిస్తున్నది. విద్యావన్తుడికే కర్మలను విధించినారు కనుక విద్య కర్మకు అంగము అవుతున్నది అని ఏ మాట అన్నారో అది తగినది కాదు. వేద మధీత్య అని అధ్యయనము చేసినవాడికి మాత్రము విధించినందువల్ల. అధ్యయనము చెయ్యమని చెపితే అర్థావబోధము (దాని అర్థము తెల్సుకోనెంత వరకు) వరకు నడిపించదు. అగ్ని ఆధానము వలె అధ్యయనము అక్షరరాశిని గ్రహించడముతోనే ముగిసిపోతుంది. గ్రహించిన స్వాధ్యాయము ఫలవన్తములైన కర్మలను బోధిస్తున్నది కనుక దాన్ని నిర్ణయించడమే ఫలముగా గల వేదార్థ విచారము కొరకు పురుషుడు తనకు తానే పూనుకుంటాడు. అందువల్ల కర్మలను గురించి తెల్సుకోదల్చినవాడు కర్మలను గురించిన జ్ఞానాన్ని సమ్పాదించుకోవడానికి, మోక్షాన్ని కోరుకున్నవాడు బ్రహ్మజ్ఞానమును పొందడానికి ప్రయత్నించుతాడు. కనుక బ్రహ్మవిద్యకర్మకు అంగము

కాదు. అధ్యయనము చేయాలి అనిచెప్పి విధించే శాస్త్రము అర్థాన్ని తెల్సుకోవడంలో పురికొల్పినా అప్పుడు కూడా బ్రహ్మ విద్య కర్మకు అంగము కాబోదు. ఎందుకంటే వేదార్థ జ్ఞానము కంటే విద్య వేరవుతున్నది కాబట్టి. ఎట్లాగైతే జ్యోతిష్టోమము మున్నగు కర్మలయొక్క స్వరూపాన్ని తెల్సుకోవడం వలన ఫలాన్ని సమ్పాదించుకోవడానికి సాధనమైన కర్మానుష్ఠానము అర్థాన్తరము / వేరు అవుతున్నదో అట్లాగే వేదార్థ జ్ఞానరూప మైన బ్రహ్మ స్వరూపవిజ్ఞానము కంటే ధ్యానము ఉపాసనము మొదలైన శబ్దాల చేత చెప్పబడే పురుషార్థానికి సాధనమైన విద్య వేరైనది కనుక దానికి కర్మ సమ్బన్ధము అనే దాని వాసన కూడా లేదు.

సూ॥ **నావిశేషాత్ 3-4-13** బ్రహ్మ జ్ఞానిని ఆత్మ జ్ఞానాన్నించి మళ్ళించి బ్రతికి ఉన్నంతవరకు కర్మానుష్ఠానము చేయాలి అనే నియమము కుదురదు. విశేషము లేదు కాబట్టి. ఏదైతే చెప్పినారో – **కుర్వన్నే వేహకర్మాణి** అని ఆత్మజ్ఞానము కలవాడిని బ్రహ్మ జ్ఞానాన్నించి వెనుకకు మళ్ళించి కర్మానుష్ఠానము చేయడము నందే నియమిస్తున్నది అని. అది ఒప్పదు. విశేషము లేదు కాబట్టి. ఈ నియమము పురుషార్థ ఫలాన్ని సమ్పాదించుకోవడానికి సాధనమైన స్వతంత్ర కర్మకు చెందినది అని విశేషహేతువేమీలేదు. విద్యాంగమైన కర్మకు సమ్బన్ధించినది ఐనందు వల్ల కూడా చెల్లుతుంది. **కర్మణైవహి సంసిద్ధిం ఆస్థితా జనకాదయః** అనే వాక్యము కూడా బ్రహ్మవేత్త శరీరాన్ని విడిచిపెట్టిపోయేంతవరకు చేసే ఉపాసనకు కూడా వర్తించుతుంది కాబట్టి కర్మానుష్ఠానమే చేయాలి అనే నియమం లేదు. ఈ విధంగా అర్థము యొక్క స్వభావాన్ని బట్టి శంకను తొలగించి కుర్వన్నేవేహకర్మాణి అనే వాక్యానికి అర్థాన్ని చెపుతున్నారు –

సూ॥ **స్తుతయేఽనుమతిర్వా 3-4-14** బ్రహ్మవిద్యను పొగడడము కొరకు ఎల్లపుడూ కర్మను అనుష్ఠించడానికి అనుమతిని ఇవ్వడము. సూత్రములోని వా శబ్దము అవధారణ కొరకు. **ఈశావాస్యమిదం సర్వమ్.** ఈశ్వరుడైన పరమాత్మ చేత నివసింపబడునట్టిది ఈ ప్రపంచమంతా పైగా ఈశ్వరునికి లొంగి ఉండునటువంటిది. అనే వాక్యము విద్యాప్రకరణానికి చెందింది. విద్యను స్తుతించడానికిగాను ఎల్లపుడూ కర్మను అనుష్ఠించాలి అనే అనుమతి వాక్యము. విద్యయొక్క మహిమ వల్ల ఎల్లప్పుడూ కర్మలు చేస్తున్నా ఆ కర్మలతో సమ్బన్ధము లేనివాడు గానే ఉంటాడు అని విద్య ప్రశంసింపబడుతున్నది. వాక్యము యొక్క శేషము – తరువాతి భాగము కూడా ఈ విషయాన్నే చూపుతున్నది. **ఏవంత్వయి నాన్యథా ఇతోఽస్తి నకర్మ లిప్యతే నరే.** ఈ

విధంగా నీవు సదా పరమాత్మ చిన్తనలో ఉంటే ఇంతకంటే వేరుగా ఏదీ ఉండదు. నిస్సంగుడవైన నిన్ను కర్మ అంటుకోదు. ఇదే తత్త్వము కనుక బ్రహ్మ విద్య కర్మకు అంగం కాదు. (**ఈశా వాస్యమ్ఽ** ఈశ + ఆవాస్యమ్ఽ ఈశ్వరునికి ఉండేచోటు ఇల్లు. 2) ఈశా + వాస్యమ్ఽ ఈశ్వరుని చేత ఉజ్జీవింపచేయబడేది. బ్రతికింపబడేది. ఈట్ శబ్దము యొక్క తృతీయావిభక్తి రూపము ఈశా అనే పదము. **నరే=నరమతే ఇతినరః** బయటి ప్రపంచమందలి విషయభోగాల యందు ఆనందించడు కనుక నరుడు అనగా సంగము లేనివాడు నిస్సంగుడు.)

సూ॥ **కామకారేణచైకే 3-4-15** కొందరు తమ ఇష్టము ప్రకారము కర్మలన్నింటినీ ఆచరించాల్సిన గృహ స్థాశ్రమాన్ని వదిలిపెడుతున్నారు. ఇంకా కొంతమంది వేదశాఖలకు చెందినవారు స్వేచ్ఛగా కామకారముతో గృహ స్థాశ్రమాన్ని వదులు తున్నారని పఠించుతూ ఉన్నారు. **కింప్రజయాకరిష్యామః యేషాం నోఽయమాత్మాఽయం లోకః** ఎవరికి ఈ పరమాత్మతో, లోకముతోనూ సమ్బన్ధము లేదో అట్టి మనకు ప్రజల (సన్తానము) తో ఏమి పని? అని. విరక్తుడైన విద్వాంసుడు తన కోరిక ప్రకారము గృహస్థాశ్రమానికి చెందిన కర్మలను త్యాగము చేస్తున్నాడని చెప్పే ఈ వాక్యము బ్రహ్మ విద్య కర్మకు అంగము కాకుండడాన్ని చూపిస్తున్నది. విద్య, యజ్ఞాది కర్మలకు అంగమే ఐనట్లయితే విద్యానిష్ఠుడు తన ఇష్టం ప్రకారము గృహస్థాశ్రమాన్ని వదలిపెట్టడం కుదరదు. కాబట్టి విద్య కర్మాంగము కాదు.

సూ॥ **ఉపమర్దంచ 3-4-16** బ్రహ్మవిద్య కర్మలను అణచివేస్తుంది కూడా! పుణ్యాపుణ్యరూపమైన సమస్త సంసార దుఃఖాలకు మూలము ఐన కర్మను బ్రహ్మ విద్య అణచివేస్తుంది అని ప్రతి ఉపనిషత్తులోనూ పఠింపబడుతూ ఉన్నది. **భిద్యతే హృదయగ్రన్థిః ఛిద్యన్తే సర్వసంశయాః। క్షీయన్తే చాస్యకర్మాణి తస్మిన్ దృష్టే పరావరే।** ఆ పరమాత్మను దర్శించితే ఈ ఉపాసకుడికి మనస్సుతో సమ్బన్ధమున్న రాగద్వేషాదులు అన్నీ ముక్కలు ముక్కలుగా అయిపోతవి. అన్ని సందేహాలూ తీరుతవి. ఇతని పుణ్యపాపరూపకర్మలు అన్నీ అడుగుమట్టానికి తరిగిపోతవి. ఇట్లాంటివి ఇంకా ఎన్నో. అందువల్ల విద్య కర్మకు అంగమైతే ఈ ఉపమర్దము ఎంతమాత్రమూ పొసగదు.

సూ॥ **ఊర్ధ్వరేతస్సు చ శబ్దేహి 3-4-17** బ్రహ్మ చర్యాన్ని అవలంబించిన ఊర్ధ్వరేతస్కులకు ఈ కర్మలు లేవు. గృహస్థులకు మాత్రమే కర్మలు ఉన్నట్లు వేదంలో వినిపిస్తున్నది. వివాహము చేసుకోకుండా ఊర్ధ్వరేతస్కులై ఉండే ఆశ్రమాలలోనివారికి

బ్రహ్మ విద్య ఉన్నట్లు కనిపిస్తున్నందువల్ల, వాటిలోనే అగ్నిహోత్రము చెయ్యడం, దర్శ, పూర్ణమాసాది కర్మలు లేకపోవడాన్ని బట్టి కూడా బ్రహ్మ విద్య కర్మకు అంగము కాదు. ఔనండీ! ఊర్ధ్వరేతస్కులకు ఆశ్రమాలున్నాయి కదా! **యావజ్జీవమగ్నిహోత్రంజుహోతి.** బ్రతికి ఉన్నంతవరకూ అగ్నిహోత్రాన్ని చేస్తున్నాడు. ఇత్యాది వాక్యాలద్వారా అగ్నిహోత్రము దర్శపూర్ణమాసాదులు చేయ్యాలి అని యావజ్జీవాధికారము వినిపిస్తున్నది. శ్రుతికి విరుద్ధంగా చెప్పే స్మృతులు ప్రామాణికాలు కావు. ఇందువల్లనే శాబ్దేహి అని చెప్పినాడు అని అంటే. వైదిక శబ్దాలలో మాత్రమే అవి కనిపించుతున్నవి. **త్రయోధర్మస్కన్ధాః** మూడు ధర్మాలకు ఆశ్రయములైనవి ఆశ్రమాలు. **యేచేమే అరణ్యే శ్రద్ధాతప ఇత్యుపాసతే.** ఎవరైతే అడవిలో శ్రద్ధా తపస్సు అని ఉపాసించుతున్నారో. **ఏతమేవ ప్రవ్రాజినోలోకమిచ్ఛన్తో ప్రవ్రజన్తి.** ఈ బ్రహ్మ లోకాన్ని పొందాలని కోరుతున్నవారై విరక్తులు సన్యాసాన్ని పుచ్చుకుంటున్నారు. ఇత్యాదుల యందు కనిపిస్తున్నవి. ఇక యావజ్జీవ శ్రుతి ఏది ఉన్నదో అది వైరాగ్యాన్ని పొందనివారికి సమ్బన్ధించినటువంటిది.

సూ॥ **పరామర్శం జైమినిః అచోదనాచ్చాప వదతి హి 3-4-18** ఆశ్రమాలను గురించి పరామర్శ మాత్రమే చేయబడుతున్నది. విధానము మాత్రము లేదు. గృహస్థాశ్రమాన్ని వదిలి మరో ఆశ్రమాన్ని పుచ్చుకున్నట్లయితే దాన్ని నిందిస్తున్నారు. అని జైమిని అభిప్రాయము. **త్రయోధర్మస్కన్ధాః** ఇత్యాది వైదిక శబ్దాలయందు ఊర్ధ్వరేతస్కుల ఆశ్రమాలు కనిపిస్తూ ఉన్నాయి. కనుక అవి ఉన్నవే. అని అన్నమాట కుదరదు. ఎందువల్లనంటే త్రయోధర్మస్కన్ధాః ఇత్యాది వాక్యాలలో ఆయా ఆశ్రమాలను గురించి పరామర్శ మాత్రమే చేయబడుతున్నది. అనగా అనువాదము మాత్రమే అని అర్థము. ఎందువల్ల ఈ అభిప్రాయము అని అనేట్లయితే అచోదనాత్ – విధించకపోవడము వల్ల అని అర్థము. ఇక్కడ చెయ్యమని చెప్పే విధి శబ్దము వినిపించడము లేదు. త్రయో ధర్మస్కంధాః ఇత్యాది వాక్యము చేత ప్రకృతమైన ప్రణవము ద్వారా బ్రహ్మోపాసన స్తోత్రము చేయబడుతున్నది. **బ్రహ్మ సంస్థోఽమృతత్వ మేతి.** బ్రహ్మ యందు నిష్ఠ కలవాడు మరణరహితము ఆనందమయము ఐన అమృతత్వాన్ని పొందుతున్నాడు. అని ముగించినారు గనుక. అందువల్ల బ్రహ్మోపాసన స్తుత్యర్థము ఆ ఆశ్రమాలను గురించి అనువాదము మాత్రమే ఇక్కడ చేయబడ్తున్నది. **యేచేమే అరణ్యే శ్రద్ధాతప ఇత్యుపాసతే** అనే వాక్యమున్నూ దేవయాన విధికి చెందింది

కాబట్టి అక్కడ కూడా మరొక ఆశ్రమాన్తరాన్ని శ్రుతి నిందిస్తూ ఉన్నది కూడాను. **వీరహావాఏష దేవానాంయోఽగ్ని ముద్వాసయతే.** ఎవడైతే అగ్నికి ఉద్వాసన పలుకుతున్నాడో / అగ్ని హోత్రము చెయ్యడాన్ని మానుకుంటున్నాడో అటువంటి వీడు వీరుడిని చంపినవాడవుతున్నాడు అని. ఇటువంటివి ఇంకా ఉన్నాయి. అందువల్ల ఊర్ధ్వరేతస్కులకు ఆశ్రమాలు లేవని జైమిని ఆచార్యుడు తలంచుతున్నాడు.

సూ॥**అనుష్ఠేయంబాదరాయణఃసామ్యశ్రుతేః 3-4-19** గృహస్థాశ్రమమువలెనే ఇతర ఆశ్రమాలనున్నూ పాటించాలి అని బాదరాయణుడు తలుస్తున్నాడు. అన్నీ సమానములే అనే సామ్యశ్రుతి కారణంగా అని. గృహస్థాశ్రమము వలెనే ఇతరములైన ఆశ్రమాలున్నూ అనుష్ఠించాల్సినవే అని భగవన్తుడగు బాదరాయణుడు తలుస్తున్నాడు. ఎందువల్లననగా సామ్యశ్రుతి వల్ల. ఉపాదేయమైనదిగా అంగీకరింపబడిన గృహస్థాశ్రమముతో మిగతా ఆశ్రమాలకు సామ్యము వినిపించుతున్నది కదా! త్రయో ధర్మస్కంధాః అని మొదలుపెట్టి బ్రహ్మ నిష్ఠను స్తుతించడం కొరకు సంకీర్తనము చేయడం గృహస్థాశ్రమానికీ తక్కిన వాటికిన్నీ సమానమే. ఇక గృహస్థాశ్రమానికి అనువాదము ప్రాప్తించినప్పుడు మాత్రమే సమ్భవించుతుంది కనుక దానియొక్క ప్రాప్తి తప్పక అంగీకరించి తీరాలనేదే పట్టుదల ఐనట్లయితే అది తక్కినవాటికిన్నీ సమానమే. పట్టుదల / (నా మాటనే నెగ్గాలనే) తప్ప మిగిలేది ఏమీ లేదు. గృహస్థ ధర్మమే యజ్ఞము అధ్యయనము తపస్సు బ్రహ్మ చర్యము అని అన్నిశబ్దాల చేత చెప్పబడుతున్నది. గృహస్థునికి మాత్రమే బ్రహ్మచర్యము తపస్సులు ఉన్నాయి గనుక అని అనడం తగినది కాదు. త్రయోధర్మస్కంన్ధాః అన్నపుడు మూడు ఉన్నవి కనుక వాటిని ఒక్క దగ్గర చేర్చి మొదటిది.. రెండవది... మూడవది అని విభాగము చేయడము పొసగదు. కనుక యజ్ఞో అధ్యయనం దానమ్ అనే వాక్యము చేత గృహస్థాశ్రమమే చెప్పబడుతున్నది. అధ్యయన శబ్దము వేదాధ్యయనాన్ని చెప్తున్నది. అనగా అభ్యాసము చేయడము. తపశ్శబ్దము చేత వానప్రస్థము, సన్యాసములను గ్రహించాలి. అవి రెండూ తపస్సుకే ప్రాధాన్యతను ఇచ్చెడివి. తపస్సు అంటే శరీరాన్ని కష్టపెట్టడము. దానియందే రూఢి ఉన్నది. ఆకాయక్లేశము వానప్రస్థ సంన్యాసాశ్రమాలకు సమానమే. బ్రహ్మచారి ధర్మమే బ్రహ్మ చర్య శబ్దముతో చెప్పబడుతున్నది. బ్రహ్మసంస్థోఽమృతత్వమేతి. మరొక దానియందు వినిపించబడే బ్రహ్మ సంస్థశబ్దము యౌగికము (శబ్ద శక్తులలో ఒకటి) అయ్యి అన్ని ఆశ్రమాలనూ బోధిస్తుంది. అన్ని ఆశ్రమాలలో ఉన్నవారున్నూ

బ్రహ్మసంస్థులు అవుతున్నారు కదా! బ్రహ్మణి సంస్థా – బ్రహ్మ సంస్థా. బ్రహ్మ యందు నిష్ఠ కలిగి ఉండడమే బ్రహ్మ సంస్థత్వము అది అందరికీ కలుగుతుంది. బ్రహ్మ నిష్ఠలేని కేవల ఆశ్రమ ధర్మాలను పాటించేవారు పుణ్యలోకాలకు పోతారు. వారిలో పరమాత్మ యందు నిష్ఠ కలవాడు అమృతత్వాన్ని పొందుతున్నాడు. ఇదే విషయాన్ని చాలా తేటగా భగవన్తుడగు పరాశరుడు చెప్పినాడు. **ప్రాజాపత్యం బ్రాహ్మణానాం** అని ఆరంభించి **బ్రాహ్మం సంన్యాసినాం స్మృతమ్.** అనేదాకా కేవల వర్ణాశ్రమాల వారికి బ్రహ్మలోక ప్రాప్తియే చివరదిగా ఫలాన్ని చెప్పి **ఏకాన్తినః సదాబ్రహ్మధ్యాయినో యోగినోహియే। తేషాంతత్ పరమంస్థానం యద్వైపశ్యన్తి సూరయః।** ఒక స్థిరమైన బుద్ధి కలవారై ఎల్లప్పుడూ బ్రహ్మను ధ్యానము చేసే యోగులు ఎవరు ఉన్నారో వారికి ఆపరమమైన స్థానము లభించుతున్నది. దేన్నైతే ఆ సూరులు దర్శించుతూ ఉన్నారో అని కేవలా శ్రమనిష్ఠులలో బ్రహ్మనిష్ఠ కలవారికి బ్రహ్మ ప్రాప్తిని చెప్పినాడు.

ఇందువల్ల గృహస్థాశ్రమముతో సమానమైన ఊర్ధ్వరేతస్కులయొక్క ఆశ్రమాలు కనుపించుతున్నవి. కాబట్టి వాటిని అనుష్ఠించాలి. యే చేమేஉరణ్యే శ్రద్ధాతప ఇత్యుపాసతే అనే వాక్యములో అరణ్యే అని తపస్సు ప్రధానముగా కల ఆశ్రమప్రాప్తిని అపేక్షించుతున్నందువల్ల దేవయాన విధానము కొరకు అనువాదము చేయబడినా వానప్రస్థ సంన్యాసాశ్రమాల వారికిన్నీ విధి ఉన్నది అని అంగీకరించాలి.

పరామర్శ పక్షము నందుగాని విధానపక్షము నందుగానీ ఈ ఆశ్రమాలు గృహస్థాశ్రమముతో సమానాలు కనుక అనుష్ఠేయములు అని ఉపపాదించి ఇది (బ్రహ్మ సంస్థితి) అన్ని ఆశ్రమాలకూ విధియే. అనువాదము కాదు అని ఉపపాదించడానికి గాను చెపుతున్నాడు.

సూ॥ **విధిర్వా ధా రణవత్ 3-4-20** ఇది విధే ఆశ్రమాలన్నింటికీ. ధారణ వలె వా శబ్దము అవధారణార్థములో ప్రయోగింపబడింది. ఇది ఆశ్రమాలకు విధియే. ధారణ వలె.ఎలాగంటేదిష్టాగ్నిహోత్రములో **అధస్తాత్సమిధంధారయన్అనుద్రవేత్।ఉపరిహి దేవేభ్యోధారయతి.** అడుగు నుంచి సమిధలను పట్టుకొని వెంట వేగంగా నడచిపోవాలి. పైనుండి దేతవలనుండి ధరించుతాడు. అనుచోట అనువాదముతో సమానమైన వాక్యమువల్ల ఉపరిధారణము ప్రాప్తించలేదు కాబట్టి విధిని ఆశ్రయిస్తున్నారు. కనుకనే శేషలక్షణము అనే గ్రన్థములో ఇట్లా చెప్పబడింది. **విధిస్తుధారణేஉపూర్వత్వాత్.** అపూర్వము ఐనందువల్ల, (ఇంతకుముందు చెప్పబడనందు వల్ల) ధారణము నందు

విధి ఆశ్రయింపబడుతున్నది అని. ఆ విధంగానే ఇక్కడ కూడా అప్రాప్తమైనందున విధిని మాత్రమే ఆశ్రయించాలి.

**బ్రహ్మచర్యం సమాప్యగృహీభవేత్. గృహాత్ వనీభూత్వాప్రవ్రజేత్. యదివేత రథా బ్రహ్మచర్యాదేవ ప్రవ్రజేత్ గృహాద్వావనాద్వా. యదహరేవవిరజేత్ తదహరేవ ప్రవ్రజేత్.** బ్రహ్మ చర్యాన్ని ముగించుకొని గృహస్థుడు కావలెను. ఇంటి నుండి వానప్రస్థుడై అడవిలోకి పోయి తరువాత సంన్యాసాన్ని పుచ్చుకోవలెను. ఒకవేళ ఇప్పుడు చెప్పినట్లు కాకపోతే బ్రహ్మ చర్యము నుండే సంన్యాసాన్ని పుచ్చుకోవలెను. లేదా గృహము నుండి కానీ వనము నుండి కానీ సంన్యాసి కావలెను. మొత్తమ్మీద ఏనాడు విరక్తి చెందుతాడో ఆనాడే సంన్యాసాన్ని స్వీకరించి ఇంటి నుండి వెళ్ళిపోవాలి. అని జాబాలివర్గీయుల ఆశ్రమ విధిని లేనిదానిగా తలచి ఈ అన్యపరములైన వాక్యాలలో (ఏదో ఒక) ఆశ్రమాన్ని తప్పక ఆశ్రయించాలి అని ఉపపాదించబడింది. ఈ విధంగా ఏదో ఒక ఆశ్రమాన్ని విధించినందువల్ల ఋణశ్రుతి, యావజ్జీవ శ్రుతి, అపవాద శ్రుతినీ వైరాగ్యము లేనివారి విషయములే అని తెల్సుకోవాలి. బ్రహ్మవేత్తకు కర్మలను ఆ ప్రయాణము (మరణము) వారు తప్పక ఆచరించవలసినదిగా విధించే ఇతర శ్రుతులు స్మృతులున్నూ వారివారి ఆశ్రమ ధర్మాలకు చెందినటువంటివి. కనుక ఊర్ధ్వరేతస్కులకు కూడా బ్రహ్మ విద్య విధింపబడుతున్నది కనుక విద్య వల్లనే పురుషార్థము అని సిద్ధించింది. 1) యావజ్జీవ శ్రుతి – యావజ్జీవ మగ్ని హోత్రంజు హుయాత్ అనే వాక్యము ద్వారా సన్యాసి కానివాడు బ్రతికి ఉన్నంతవరకు అగ్నిహోత్రాన్ని ఆరాధించాలి అనేది. 2) అపవాద శ్రుతి – వీరహావా ఏష దేవానాం యోఽగ్నిముద్వాసయతి అనే వాక్యము ద్వారా అగ్నిహోత్రాన్ని మానుకొంటే కలుగబోయే దోషాన్ని చెప్పేది. 3) ఋణ శ్రుతి – **త్రిభిః ఋణైః ఋణీవాజాయతే** మూడు ఋణాల చేత మానవుడు ఋణవన్తుడు – బాకీ పడినవాడు – గాపుడుతున్నాడు 1) దేవఋణము 2) ఋషి ఋణము 3) పితృ ఋణము. అని మూడు. దేవతల ఋణాన్ని యజ్ఞయాగాది కర్మలనాచరించడము ద్వారా. ఋషిఋణాన్ని వేదాలు శాస్త్రాలు ప్రాచీన గ్రన్థాలను అధ్యయనము చేసి శిష్యుల ద్వారా తరువాతి తరాల వారికి అందించడము ద్వారా, పితృఋణాన్ని పెండ్లి చేసుకొని సన్తానాన్ని పొంది, వృద్ధాప్యములో తన తల్లిదండ్రులకు సేవ చేసి, వారి మరణము తరువాత పితృకర్మలు చేయడం ప్రతిఏటా శ్రాద్ధాలు పెట్టడముల ద్వారా తీర్చుకోవాలి. **ఇది పురుషార్థాధికరణము.**

★ ★ ★

## ఇక స్తుతి మాత్రాధికరణము.

సూ॥ **స్తుతిమాత్రము పాదానాదితి చేన్న అపూర్వత్వాత్ 3-4-21** క్రత్వవయవములు ఐన ఉద్గీథాదులు స్తోత్రము చేసెడివే. వాటిని స్వీకరించుతున్నారు కాబట్టి అని అంటే కాదు. అపూర్వములు అప్రాప్తములు అని అంటున్నారు. ఇప్పుడు దీన్ని గురించి విచారిస్తున్నారు. **సఏషరసానాం రస తమః పరమః పరార్ధ్యః అష్టమోయ ఉద్గీథః.** ఈ ఎనిమిదవ ఉద్గీథము ఏదైతే ఉన్నదో అది రసాలన్నింటిలోకెల్ల రసవన్తమైనది. అన్నింటికన్నా గొప్పది. అందరిచేతనున్నూ కోరబడేది. ఇటువంటి వాక్యాలు క్రతువుకు అంగమైన ఉద్గీథాదులను పొగిడేవి మాత్రమేనా? లేక ఉద్గీథాదులయందు రసతమాలు అని దృష్టిని ఉంచాలి అని చెప్పడం కొరకైనవా? అని సంశయము. ఇక్కడ ప్రతిపాదింపబడిన ఉపాసన పరత్వాన్ని అంగీకరించి ఉపాసనము పురుషార్థము కొరకు ఐనది కాబట్టి క్రతువులయందు ఉపాదానానికి నియమము లేదని చెప్పబడింది. వీటిలో ఏది తగును అని అంటే స్తుతి మాత్రపరములే అని. ఎందువల్లననగా ఉద్గీథాదులను ఉపాదానము చేసినారు కాబట్టి. క్రతువులకు అంగములు ఐన ఉద్గీథాదులను ఉపాదానము చేసికొని వాటికి రసతమత్వం ప్రతిపాదింపబడింది. ఎట్లాగైతే జుహూ మొదలైన వాటికి భూమి మొదలైన వాటినిగా ప్రతిపాదించే వచనానికి **ఇయమేవజుహూః స్వర్గోలోక ఆహవనీయః** ఇదియే జుహువు. ఆహవనీయమైనట్టిదే స్వర్గలోకము. ఇత్యాదికమైన దానికి ఆజుహువును స్తోత్రము చేసేదిగా ఎట్లా గుర్తింపు ఉన్నదో అట్లాగే ఈ వాక్యాలకున్నూ స్తుతి మాత్రత్వమే వివక్షితమైనది. అని అంటే. దీనికి సమాధానము – న అపూర్వత్వాత్ అని. స్తుతి – ప్రశంసా – మాత్రత్వమే అనడము ఉపపన్నము కాదు. అపూర్వత్వాత్ – అప్రాప్తము కాబట్టి. ఉద్గీథాదులు రసతమాదులుగా ఇతర ప్రమాణాల చేత ప్రతిపన్నములు కావు. దేనిచేతనైతే వాటిపై ప్రాశస్త్య బుద్ధి కలగడం కొరకు రసతమాదిత్వముతో అనువాదము చేసెడివారో. అంతేకాదు ఉద్గీథాదులను చేర్చుకోవాలనే విధి ఇక్కడ సన్నిహితము కాదు అట్లా ఐనప్పుడు **ఇయమేవ జుహూః స్వర్గోలోక ఆహవనీయః** ఇత్యాదుల వలె దానితో ఐకవాక్యత్వము ఉన్నందువలన ఏదో ఒక విధంగా దాన్ని స్తుతి పరమైనదిగా ఆశ్రయించెడివారు. అందువల్ల క్రతువు శక్తిమన్తము కావడము అనే మొదలైన ఫలాలు దక్కడం కొరకు ఉద్గీథాదుల యందు రసతమాది దృష్టిని ఉంచడమే న్యాయమైనది.

సూ॥ **భావశబ్దాచ్చ 3-4-22** క్రియావాచకమైన భావశబ్దము వల్లనున్నూ. ఉపాసీత ఇత్యాదులైన భావశబ్దము వల్లనున్నూ విధి పరములుగానే తలచడము న్యాయమైనది. విధి ప్రత్యయముతో కూడిన భావశబ్దము తనకు అర్థముఐన విధేయమునే తెలుపుతుంది. అందువల్ల ఉపాసనను విధించడం కొరకైనవే ఈ శ్రుతులు విధించడము - చెయ్యి అని చెప్పడము. ఇదే విధి. విధేయము. **ఇది స్తుతిమాత్రాధికరణము**

★ ★ ★

## ఇక పారిప్లవార్థాధికరణము.

సూ॥ **పారిప్లవార్థా ఇతి చేన్న విశేషితత్వాత్ 3-4-23** పారిప్లవము - ప్రశంసించడము. ఉపనిషత్తులలో కనిపించే కథలు వాటిని పొగడడం కొరకు అని అంటే కాదు. విద్యను విధించడం కొరకు మాత్రమే. **ప్రతర్ధనోహవై దైవోదాసిః ఇన్ద్రస్యప్రియంధామోపజగామ.** దివోదాసు యొక్క కుమారుడైన ప్రతర్దనుడు ఇంద్రునికి ప్రియమైన అమరావతీ నగరానికి పోయినాడు. **శ్వేతకేతుర్హ ఆరుణేయ ఆస** అరుణుడు అనే ఋషి యొక్క కుమారుడు శ్వేత కేతువు అనేవాడుండే వాడు. ఇటువంటి వేదాన్తాల్లోని ఆఖ్యానాలు (కథలు) ఆయా ఆఖ్యానాలను ప్రశంసించడం కొరకు ఏర్పడినవా? లేక **విద్యా విశేషాన్ని ప్రతిపాదించడం కొరకు ఏర్పడినవా? విద్యలో ఉండే విశేషాన్ని, ప్రాశస్త్యాన్ని ప్రతిపాదించునట్టివి. ఇవి స్తోత్రము చేసేవిగా ఉంటున్నవి.** అని విచారము జరిగినపుడు **ఆఖ్యానాని శంసన్తి** ఆఖ్యానాలు ప్రశంసించుతున్నాయి అని చెప్పిన ప్రకారంగా ఆఖ్యానాలు పారిప్లవము నందు వినియోగింపబడుతున్నవి కనుక విద్యాప్రాధాన్యాన్ని తెలిపేవి కావు అనడమే న్యాయము అని అంటే కాదు. ఆఖ్యానాలు అన్నీ పారిప్లవ ప్రయోగము నందే వినియోగింపబడవు. ఎందువల్లనంటే వినియోగానికి విశేషితములైనందువల్ల ఆఖ్యానాని శంసన్తి అని చెప్పి అక్కడనే మనుర్వైవస్వతో రాజా ఇత్యాది వాక్యముతో మన్వాదుల కథలు విశేషింపబడుతున్నవి. అందువల్ల విశేషార్థములోనే వాటికి అక్కడ వినియోగము అని తెలుస్తున్నది. కనుక వేదాన్తాల్లో వినిపంచే ఆఖ్యానాలు అన్నీ పారిప్లవప్రయోగాని కోసము కావు. కాన విద్యలను విధించడము కొరకే **విద్యా విధికి శేషభూతములే.**

(**పరిప్లవము** అనగా కదలునది అని అర్థము. ఆఖ్యానములు = కథలు. ఉపనిషత్తులు జటిలమైన విషయముతో కూడి ఉన్నందున తేలికగా అర్థం కావడం కొరకు కథలను జోడించుతారు. ఈ శైలి ఉపనిషత్తులలో తరచుగా కనిపిస్తున్నది. ఐతే ఇక్కడ శ్రుతప్రకాశికలో **పారిప్లవ శబ్దేన ఆఖ్యాన శంసనం వివక్షితమ్** అని వ్రాసినారు. కథను గురించి అనగా అందులో వివరింపబడే విద్యను గురించి అందులో చెప్పబడే విశేషాన్ని బట్టి దానిగొప్పతనాన్ని / శ్రేష్ఠతను వెల్లడించడము అని అర్థము).

సూ॥ **తథాచ ఏకవాక్య ఉపబన్ధాత్ 3-4-24 ఆత్మావా అరేద్రష్టవ్యః** ఓరీ! ఆత్మనే (పరమాత్మనే కదా) తప్పక చూడదగినవాడు. ఇత్యాది వాక్యముతో ఏకవాక్యత్వము (ఒకే అభిప్రాయాన్ని కలిగి ఉండడము) ఉన్నందువల్ల ఉపబన్ధము – అన్వయము – కలసిపోవుట – ను ఆఖ్యానాలు కలిగి ఉన్నవి. కనుక విద్యను విధించడం కొరకు ఈ ఆఖ్యానాలు చెప్పబడుతున్నవి అని తెలియవస్తున్నది. ఎట్లాగంటే **సోఽరోదీత్** ఇట్లాంటివి కర్మలను విధించుట కొరకని ఎట్లా తెలుస్తున్నవో అట్లే ఇవి కూడా విద్యను విధించడం కొరకే. పారిప్లవార్థము కాదు. **ఇది పారిప్లవార్థాధికరణము.**

★ ★ ★

## ఇక అగ్నీంధనాద్యధి కరణము.

సూ॥ **అతఏవచ అగ్నీన్ధనాద్యనపేక్షా 3-4-25** ఊర్ధ్వరేతస్కులు విద్యాసమ్బన్ధులు కాబట్టి వారికి దర్శపూర్ణమాసాదులు అగ్నీన్ధనములతో అవసరము లేదు. స్తుతిని గురించి వచ్చిన ప్రస్తావనతో అవాన్తర సంగతి విశేషాన్ని కల అంశాలు రెండు చిన్తించబడినవి. ఊర్ధ్వరేతస్కులైన విద్యావన్తులైన ఆశ్రమాలు కలవారు ఉన్నారు అని చెప్పబడింది. ఊర్ధ్వరేతస్సు చశబ్దేహి ఇత్యాది సూత్రాలతో. ఇప్పుడు ఊర్ధ్వరేతస్కులకు యజ్ఞము మొదలైనవి లేవు కావున వాటికి అంగమైన విద్యకూడా ఉండదు అని సందేహించుకొని చెపుతున్నారు. అత ఏవ చాగ్నీంధనాద్యనపేక్షా అని. ఊర్ధ్వరేతస్కులైన ఆశ్రమాలవారు విద్యాసమ్బన్ధులుగా శ్రుతిచేత పరిగణింపబడు తున్నారు. **బ్రహ్మ సంస్థోఽమృతత్వమేతి 2) యే చేమేఽరణ్యే శ్రద్ధాతప ఇత్యుపాసతే 3) ఏతమేవ ప్రవ్రాజినో లోకమిచ్ఛన్తః ప్రవ్రజన్తి. 4) యదిచ్ఛన్తో బ్రహ్మ చర్యం చరన్తి** ఇత్యాదులైన శ్రుతివాక్యాల చేత.

ఇందువల్లనే ఊర్ధ్వరేతస్కులకు విద్య అగ్నీన్ధనాదులతో సమ్బన్ధము కలది కాదు. అగ్నీంధనమ్ అనగా అగ్న్యాధానము. హోమము చేసుకోవాల్సిన అవసరము. ఆధాన పూర్వకమైన అగ్నిహోత్రము దర్శ పూర్ణమాసము మొదలైన కర్మలతో అవసరము విద్యకు లేదు. కనుక బ్రహ్మనిష్ఠులైన ఊర్ధ్వరేతస్కులు విద్యోపాసకులు కాబట్టి వారికి కర్మలతో అక్కరలేదు. ఐతే వారు ఏ ఆశ్రమంలో ఉన్నారో దానికి సమ్బన్ధించిన నిత్యకర్మలను మాత్రము ఆచరించాలి. **ఇది అగ్నీంధనాద్యధికరణము.**

★ ★ ★

## ఇక సర్వాపేక్షాధికరణము

సూ॥ **సర్వాపేక్షాచ యజ్ఞాది శ్రుతేరశ్వవత్ 3-4-26** కర్మలనాచరించే గృహస్థులకు బ్రహ్మవిద్య కర్మలతో అవసరాన్ని కల్గియే ఉన్నది. యజ్ఞాది శ్రుతి వినిపిస్తున్నందున ప్రయాణసాధనమైన గుఱ్ఱానికి కళ్ళెము జీను వంటివి ఉండాలి కదా! అట్లాగే విద్యకూడా. విద్య యజ్ఞాదులతో అవసరము లేకుండానే అమృతత్వాన్ని/ మోక్షాన్ని సాధించిపెట్టేటట్లయితే గృహస్థులకు కూడా యజ్ఞాదులతో సమ్బన్ధము లేకుండానే మోక్షమును సాధించి పెట్టగలదు. యజ్ఞాది శ్రుతి కూడా "**వివిదిషన్తి**" అనే శబ్దాన్ని బట్టి కర్మ విద్యాంగము అనడాన్ని ప్రతిపాదించడము లేదు కదా! అంటే చెపుతున్నాడు. సర్వాపేక్షా అని. అన్నిటితో అవసరము ఉన్నదని. కర్మవన్తులైన గృహస్థులకు యజ్ఞాదులైన సర్వకర్మలతోనూ అవసరము ఉన్నది. ఎందువల్లనంటే యజ్ఞాది శ్రుతివల్ల. **తమేతంవేదానువచనేన బ్రాహ్మణాః వివిదిషన్తి యజ్ఞేన దానేన తపసాఽనాశకేన** బ్రహ్మ యందు నిష్ఠ గలవారు ఈ మహాపురుషుడిని వేదార్థాధ్యయనము ద్వారా, యజ్ఞము, దానము, తపస్సు, ఉపవాసము మొదలైన కర్మల ద్వారా తెల్సుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇత్యాదియైన వాక్యాన్నిబట్టి, యజ్ఞాదులు విద్యకు అంగములు అని తెలుస్తున్నది. యజ్ఞాదుల ద్వారా వివిదిషన్తి – తెల్సుకోవడానికి కోరుతున్నారు. యజ్ఞాదులద్వారా జ్ఞానాన్ని పొందడానికి ఇష్టపడ్తున్నారు అని అర్థము. యజ్ఞాదులు జ్ఞానాన్ని పొందడానికి సాధనములు ఐనప్పుడు యజ్ఞాదుల ద్వారా జ్ఞానాన్ని పొందడానికి ప్రయత్నిస్తున్నారు తలుస్తున్నారు అని చెప్పడము కుదురుతుందో. ఎట్లాగైతే కత్తి చంపడానికి సాధనమైనప్పుడే కత్తితో చంపదల్చుకున్నాడు అనే వ్యపదేశము / అనడము కుదురుతుందో. అందువల్ల యజ్ఞాదులు జ్ఞానసాధనాలు అని అర్థమవుతున్నది. జ్ఞానమున్నూ తత్త్వమసి అనే వాక్యార్థజ్ఞానము కంటే వేరైనది.

ధ్యానము ఉపాసనము మొదలైన శబ్దాలచేత చెప్పబడేది. మిక్కిలి తేటగా కంటికి కనపడునట్లుగా అవస్థను పొందిన స్మృతి రూపమైనది. నిరతిశయమైన ప్రియము ప్రతిదినమూ చేయబడే అభ్యాసముపై ఆధారపడిన ఆధిక్యము కల్గినట్టిది. శరీరాన్ని వదిలిపెట్టేంతవరకూ జీవుడితో వెంటనంటి ఉండేదిఐ మోక్షమును పొందడానికి సాధనము ఐనటువంటిది అని మేము ముందే చెప్పి ఉన్నాము. సూత్రకారుడు కూడా **ఆ వృత్తిః అసకృదుపదేశాత్** అని చెప్పనున్నాడు. అనగా ఆచార్యుడి వద్ద ఉపదేశము పొందిన నాటి నుండి ఊపిరిఉన్నంతవరకూ మాటిమాటికి ఆవృత్తి చేయడము. మళ్ళీ మళ్ళీ తలుచుకోవడం అని. ఇటువంటి ధ్యానము ప్రతిదినమూ ఆచరించబడే నిత్యములూ నైమిత్తికములూ ఐన పరమపురుషుని యొక్క ఆరాధనారూపాలైన కర్మల ద్వారా లభించిన పరమపురుషుని యొక్క అనుగ్రహము వలన కలుగుతుంది. కనుక యజ్ఞాదుల ద్వారా తెల్సుకోదల్చుకుంటున్నారు అని శాస్త్రము చేత ప్రతిపాదింపబడుతున్నది. కాబట్టి కర్మ వన్తులైన గృహస్థుల యందు విద్యయజ్ఞాదులైన నిత్యనై మిత్తికాలైన అన్ని కర్మలతో అవసరాన్ని / అపేక్షను కల్గి ఉన్నది. అశ్వవత్ – గుఱ్ఱము వలె. ఎట్లాగైతే ప్రయాణ సాధనమైన గుర్రము పరికరములన్నింటితో బంధింపబడడాన్ని కోరుకుంటుందో అదేవిధంగా మోక్షానికి సాధన మైన విద్య కూడా నిత్యనైమిత్తిక కర్మలు అనే పరికరాలతో అపేక్ష కలిగి ఉన్నది. ఈ విషయాన్నే భగవన్తుడు స్వయంగా ఇట్లాగా చెప్పినాడు. **శ్లో॥ యజ్ఞదాన తపః కర్మ నత్యాజ్యం కార్యమేవ తత్। యజ్ఞోదానం తపశ్చైవ పావనాని మనీషిణామ్॥** యజ్ఞాలు చేయడం దానము చేయడం తపస్సు చేయడం అనే కర్మలను విడిచిపెట్టకూడదు. వాటిని తప్పక ఆచరించాల్సిందే. బుద్ధిమన్తులగు వారి అభిప్రాయములో అవి – యజ్ఞ దాన తపః కర్మలు పవిత్రములైనవి అనగా ఆచరించినవారి యొక్క పాపాలను పోగొట్టి పవిత్రులను చేస్తవి.

**శ్లో॥ యతఃప్రవృత్తిః భూతానాం యేనసర్వమిదం తతమ్। స్వకర్మణా తమభ్యర్చ సిద్ధిమ్ విన్దతిమానవః.** ఎవనివల్లనైతే ప్రాణులన్నీ తమ తమ పనులను చేసుకోగల్గుతున్నవో ఎవడు ఈ విశ్వము నందంతటి లోపలా బయటా నిండి ఉన్నాడో అటువంటివాడిని తనకు సంబన్ధించిన నిత్యకర్మలతో పూజించినట్లయితే మనుష్యుడు పరమాత్మానుగ్రహరూపమైన సిద్ధిని (మోక్షాన్ని) పొందుతున్నాడు అని. **ఇది సర్వాపేక్షాధికరణము.**

★ ★ ★

## ఇక శమదమాద్యధికరణము.

సూ॥ **శమదమాద్యుపేతః స్యాత్. తథాఽపి తు తద్విధేః తదంగతయా తేషాం అవశ్యానుష్ఠేయత్వాత్ 3-4-27** గృహస్థుడు శమ దమాదులతో కూడినవాడై ఉండాలి. కర్మలలో అన్వయించుతున్నా ఇవి తప్పక అవసరమైనటువంటివే. వాటిని అంగములుగా విధించినారు కాబట్టి. అవి తప్పక అనుష్ఠించవలసినటువంటివి. గృహస్థుడు శమదమాదులను కూడా అనుష్ఠించాల్నా? వద్దా? అని విచారము వస్తే కర్మ అనుష్ఠానము అన్తరింద్రియము, బయటి ఇంద్రియాలయొక్క వ్యాపారము ఐనందువల్ల, శమదమాదులేమో వాటికి విపరీతరూపాలు కాబట్టి అనుష్ఠించాల్సిన అవసరము లేదు. అని పూర్వపక్షము ఏర్పడితే చెప్పబడుతున్నది. గృహస్థుడు కరణ వ్యాపారరూపములైన కర్మలయందు పూనుకున్నవాడైనా ఆ విద్వాంసుడు శమదమాదులతో కూడిన వాడే అయ్యి ఉండాలి. ఎందువల్లనంటే తదంగతయాతద్విధేః – విద్యకు అంగముగా వాటిని విధించినారు కాబట్టి. **తస్మాదేవంవిత్ శాన్తో దాన్త ఉపరతస్తితిక్షుః సమాహితో భూత్వా ఆత్మన్యే వాత్మానం పశ్యేత్.** అందువల్ల ఈ విధంగా పరమాత్మ స్వరూపాన్ని తెల్సుకున్నవాడు. మనస్సును ఇంద్రియాలను అదుపులో నుంచుకొన్నవాడై అన్ని కర్మల నుండి మానుకొని ఓపిక గలవాడై ఏకాగ్రతతో కూడి ఉండి తన మనస్సులోనే పరమాత్మను దర్శించుకోవాలి అని. శమదమాదులు విద్య కలుగడానికి సాధనాలుగా ప్రత్యక్షంగా కనబడుతున్నాయి. విద్యను / ఉపాసనను అనుష్ఠించడానికి ఆ శమదమాదులు కూడా తప్పక అనుష్ఠింపవలసినవే కనుక వాటిని కూడా పాటించాలి. కొన్ని కరణ వ్యాపారములు మరికొన్ని వాటికి తలక్రిందులు ఐనవిగా ఉంటున్నందున కర్మలు శమదమాదులకున్నూ పరస్పరము విరోధము ఉంటున్నది అని అనకూడదు. అవి వేరువేరు విషయాలకు చెందినవి కనుక వాటిని కూడా పాటించాలి. కొన్ని కరణ వ్యాపారములు మరికొన్ని వాటికి తలక్రిందుల ఐనవిగా ఉంటున్నందున కర్మలు శమదమాదులకున్నూ పరస్పరము విరోధము ఉంటున్నది అని అనకూడదు. అవి వేరువేరు విషయాలకు చెందినవి కనుక వైరుధ్యము లేదు. చెయ్యవలసినవాటి యందు ఇంద్రియ వ్యాపారము ఉంటున్నది. ప్రయోజనము లేని, శాస్త్రము చెప్పని వాటియందు మానుకోవడము ఉపశమము ఉంటున్నది. ఇంద్రియ వ్యాపార రూపమైన కర్మలయందు ప్రవర్తించుతున్నవాడికి పూర్వజన్మకర్మల యొక్క వాసన వలన శమాదులను ఉపాదానము / స్వీకరించుట జరుగదు. విధింపబడిన కర్మలు పరమ

పురుషుని యొక్క ఆరాధనా రూపాలు ఐనందువల్ల ఆయన యొక్క అనుగ్రహము వల్ల అన్ని రకములైన వాసనలు పటాపంచలు అవుతవి. అందువల్ల గృహస్థుడు శమదమాదులను కూడా పాటించాలి. **ఇది శమ దమాద్యధికరణము.**

★ ★ ★

## ఇక సర్వాన్న అనుమత్యధికరణము

సూ॥ **సర్వాన్నానుమతిశ్చ ప్రాణాత్యయే తద్దర్శనాత్ 3-4-28** ప్రాణ విద్యానిష్ఠుడికి సర్వాన్నానుమతి అన్నివేళల్లో ఇవ్వబడుతున్నదా? లేక ప్రాణము పోయేటువంటి విపత్కర పరిస్థితులలోనా అనగా ప్రాణాలు పోయే పరిస్థితుల్లోనే. అది కనబడుతున్నది కాబట్టి. వాజసనేయశాఖవారు, ఛాన్దోగులు ఐన వారియొక్క శాఖల్లో ప్రాణవిద్య కనిపిస్తున్నది. వాటిలో **న హ వా అస్యానన్నం జగ్ధంభవతి. నానన్నం పరిగృహీతం భవతి 2) నహ వా ఏవం విది కించ అనన్నం భవతి.** అని రెండు వాక్యాలు ఉన్నవి. 1) అనన్నం ఈ ప్రాణ విద్యను ఉపాసించేవాడికి శ్రోత్రియాన్నము కానిది తినగూడనిది ఏమీ కాదు 2) ఈ విధంగా తెలిసిన వాడికి ఏదీ తినకూడనిది కాదు అని ప్రాణవేత్తకు సర్వాన్నానుమతి (అందరి యొక్క అన్నమును తినవచ్చును అని అనుమతి / అంగీకారము) ప్రశంసింపబడుతున్నది) కీర్తింపబడ్తున్నది. ప్రాణవిద్యానిష్ఠుడికి ఈ సర్వాన్నానుమతి అన్నివేళల్లోనా? లేక ప్రాణాలు పోతాయేమో అనుకునేటువంటి సమయాల్లోనా? అని సంశయము ఏర్పడితే ఇక్కడ విశేషము కనపడడం లేదు. కాబట్టి అన్నివేళల్లోనూ అని పూర్వపక్షము ఎదురైతే చెప్పబడుతున్నది. ప్రాణాత్యయే అని. సూత్రములోని చ శబ్దము అవధారణార్థంలో వచ్చింది. అనగా ప్రాణాలు పోతాయేమో అనే సందర్భములోనే అని. ఎందువల్లనంటే అది కనపడుతున్నది.

బ్రహ్మవేత్తలు కాని వారికి కూడా ప్రాణాలు పోయే పరిస్థితిలోనే అందరి అన్నాలను తినడానికి అనుజ్ఞ ఉన్నది. ఐనప్పుడు ప్రాణ విద్యాఉపాసకులను గురించి చెప్పేది ఏమున్నది? చాక్రాయణుడైన ఉషస్తి అను నతడు బ్రహ్మవేత్తలలో అగ్రేసరుడు. రాళ్ళ వానలు కురిసి దుర్భిక్షము ఏర్పడిన కురుదేశంలో మావటి వాళ్ళ ఊళ్ళో ఉంటుండేవాడు. ఆహారము లభించక ప్రాణము ఉంటుందో? ఉండదో అనే అనుమానాన్ని పొందినవాడై బ్రహ్మ విద్యకలుగడానికి గాను ప్రాణాలు క్రుంగిపోకుండా ఉండాలని కోరుకొని ఒక మావటివాడు బొబ్బెరలు లేక ఉలువలను తింటుండగా చూచి అవి కొన్ని పెట్టమని యాచించినాడు. అతడు ఈ ఎంగిలి ఐన వాటికంటే వేరే గింజలు

లేవు అని అనగా మళ్ళీ అతనితో వాటిలో నుంచే కొన్నింటిని పెట్టమని అడిగినాడు. అతడు కొన్నింటిని పెట్టి త్రాగడానికి కొన్ని నీళ్ళు తీసుకో అని అనగా అవి త్రాగితే నేను ఎంగిలి నీళ్ళు త్రాగినవాడిని ఔతాను అని అన్నాడు. ఐతే ఈ గింజలు ఎంగిలివికావా? అని అడిగితే వీటిని తినకపోతే నేను ప్రాణాలతో ఉండను. నీరు త్రాగడము మాత్రము స్వేచ్ఛ అవుతుంది. కట్టుబాటు తప్పినవాడినవుతాను అని చెప్పినాడు. అతడు పెట్టిన గుగ్గిళ్ళతో ప్రాణాలను నిల్పుకొన్న తనకు అతని యొక్క మంచినీళ్ళు త్రాగడం తనకు కామకారితం – కావాలని కోరికతో చేసినటువంటిది – అవుతుంది. అది శాస్త్రముచే నిషేధింపచబడినట్టిది అని ఆ మావటి వానికి చెప్పి తాను తినగా మిగిలిన కొన్నింటిని తీసుకొనిపోయి భార్య చేతికి ఇచ్చినాడు. ఆమె వాటిని దాచిపెట్టి తెల్లారి ఇచ్చింది. మళ్ళీ ప్రాణసంశయాన్ని పొందినవాడై – యజ్ఞాన్ని చేయించడానికి తద్ద్వారా ధనాన్ని సమ్పాదించడానికి పోతూ కూడా – మావటి వాని ఎంగిలిఐనట్టివి, తాను తినగా మిగిలినట్టివి, నిన్న వండినవి బహుశః పాచిపోయిన వాటిని తిన్నాడు. అందువల్ల బ్రహ్మవేత్తలు కూడా ప్రాణసంశయము ఏర్పడినప్పుడే తప్ప సర్వాన్నాలను తినడానికి అనుమతి లేదు. కనుక అందిరికిన్నీ ఇదే నియమము వర్తిస్తుంది.

సూ॥ **అబాధాచ్చ 3-4-29** బాధలోకపోవడము వల్ల కూడా. **ఆహారశుద్ధౌ సత్వశుద్ధిః సత్వశుద్ధౌ ధృవాస్మృతిః** ఆహారము శుద్ధం ఐనప్పుడు సత్వము – మానసికస్థితి – శుద్ధము అవుతుంది. సత్వము పరిశుద్ధము ఐనప్పుడు స్మృతి చెదరకుండా నిలుస్తుంది. అని బ్రహ్మవిద్య కలుగడానికి ఆహారశుద్ధి విధించడాన్ని కాదనే బాధ లేనందువల్లకూడా బ్రహ్మవేత్తలకు సర్వాన్నానుమతి ఆపత్ కాలములో మాత్రమే అనే విషయము తెలుస్తున్నది. ఈ విధంగా గొప్ప శక్తి కలవారైన బ్రహ్మవేత్తలకు కూడా సర్వాన్నానుమతి అపద్విషయము ఐనందువల్ల అల్పశక్తి ఐన ప్రాణవిద్యా ఉపాసకుడికి సర్వాన్నానుమతి ఆపత్ కాలమునకు చెందినదే అవుతున్నది.

సూ॥ **అపిస్మర్యతే 3-4-30** స్మృతి కూడా చెప్పుతున్నది. బ్రహ్మవేత్తలకైనా మరెవ్వరికైనా కూడా సర్వాన్నానుమతి ఆపద్విషయమే అని స్మృతి చెప్తున్నది. **ప్రాణసంశయమాపన్నో యోఽన్నమత్తి యతస్తతః। లిప్యతే నసపాపేన పద్మపత్రమివాంభసా॥** ప్రాణాలపై అపనమ్మకం పొందినవాడు ఎక్కడో ఒక అక్కడ ఎవడి నుంచో ఒకడి నుండి ఆహారాన్ని పొంది తిన్నవాడు పాపాన్ని పొందదు. తామరాకు నీటితో సమ్బన్ధాన్ని పొందనట్లు అని.

సూ॥ **శబ్దశ్చాతోఽకామ కారే 3-4-31** కోరినట్లు నడుచుకోవడానికి వీల్లేకుండా వేద శబ్దము కూడా వినిపిస్తూ ఉన్నది ఇందువల్లనే. బ్రహ్మవేత్తలకైనా, ఇతరులకైనా సర్వాన్నీనత్వము ఆపత్ విషయము ఎందువల్ల ఔతున్నదో ఆకారణము చేతనే అకామకారము నందు శబ్దము – కామకారమును నిషేధించే శబ్దము ఉన్నది/ కనిపిస్తున్నది. కాఠకులు అనే వారి యొక్క సంహితలో కామకారాన్ని నిషేధించే వాక్యము ఇట్లా వినిపిస్తున్నది. **తస్మాత్ బ్రాహ్మణః సురాం నపిబతి పాప్మనానోత్సృజా ఇతి.** పాపముతో అంటుపడినవాడిని కాకుందును గాక అని తలచి బ్రాహ్మణుడు కల్లును / సురను త్రాగడం లేదు అని అర్థము. **ఇది సర్వాన్నానుమతి అధికరణము.**

★ ★ ★

**ఇక విహితత్వాధికరణము.**

సూ॥ **విహిత త్వా చ్చాశ్రమ కర్మాపి 3-4-32** యజ్ఞాదికర్మలు ఆశ్రమాలకు సమ్బన్ధించినటువంటివి నిత్యకర్మలవలె విధింపబడినవి కావున వాటిని కూడా పాటించాలి. బ్రహ్మవిద్యయజ్ఞాదికర్మలను అంగములుగా కలది అని చెప్పబడింది. ఆ యజ్ఞాది కర్మలు మోక్షాన్ని కోరని కేవలము ఆశ్రమ విధులను పాటించేవాడు ఆచరించాల్నా? వద్దా? అని విచారము వచ్చినప్పుడు విద్యకు అంగములుగా ఉంటున్నవి కేవల ఆశ్రమ విధులకు సమ్బన్ధించినవి ఐనప్పుడు నిత్యములు, అనిత్యములకు సంయోగము ఏర్పడుటవలన విరోధము ఏర్పడుతుంది. కనుక యజ్ఞాదులు కేవల ఆశ్రమి ఐనవాడికి ధర్మాలు కావు అని పూర్వపక్షము ఏర్పడితే చెప్పబడ్తున్నది. ఆశ్రమ కర్మాపి అని, ఆశ్రమ కర్మ కూడా అవుతుంది. అనగా బ్రహ్మోపాసన చెయ్యని కేవల ఆశ్రమి కూడా యజ్ఞదానాదులను అనుష్ఠించవలసిందే. ఎందువల్ల అని అంటే **యావజ్జీవ మగ్నిహో త్రంజుహోతి.** బ్రదికి ఉన్నంతవరకు అగ్నిహోత్రాన్ని చేస్తున్నాడు అని విధింపబడినందువల్ల. జీవనం కొరకు – నిమిత్తంగా (బ్రతికి ఉన్నందువల్ల) నిత్యకర్మవలె విధింపబడినందువల్ల అని అర్థము.

అదేవిధంగా విద్యకు అంగమైనందున **తమేతం వేదానువచనేన** ఇత్యాది వాక్యముతో విధింపబడినందువల్ల విద్యకు శేషము (అంగముగా) గా కూడా అనుష్ఠించవలసినవే అని చెప్తున్నాము.

సూ॥ **సహకారిత్వేన చ 3-4-33** విద్యను పుట్టించడము ద్వారా విద్యకు తోడ్పడుతున్నందువల్ల (సహకారితయా) కూడా అనుష్ఠించవలసినవే. అగ్నిహోత్రాదులు జీవనాధికారము వల్ల చేయవలసినవై – శేషములై – స్వర్గాన్ని పొందే అధికారాన్ని కలిగించుతున్నట్లు రెండింటికి వినియోగము వేరువేరయినందువల్ల ఆశ్రమ ధర్మనిర్వహణ విద్యోత్పత్తి ద్వారా మోక్షప్రాప్తికిన్నీ కారణమై ఉభయార్థత్వము అవుతున్నందువల్ల వైరుధ్యము లేదు అని అర్థము. దానివలెనే వేరే కర్మకావడమనేది కూడా లేదని అంటున్నాడు.

సూ॥ **సర్వథాఽపి త ఏవ ఉభయలింగాత్ 3-4-34** అన్నివిధాలుగానూ విద్యకొరకు, ఆశ్రమం కొరకున్నూ అవే యజ్ఞాదులు ఉపయోగపడుతవి అని గుర్తించాలి. కర్మ స్వరూపంలో భేదము లేదు అని అర్థము. ఎందువల్లనంటే ఉభయలింగాత్ రెండింటికీ సమ్బన్ధించిన లింగాలు ఉన్నవి కాబట్టి. ఉభయత్రా – విద్య కర్మలయందున్నూ యజ్ఞాది శబ్దాలచేత ప్రత్యభిజ్ఞానము కలిగించి వినియోగించినందువల్ల కర్మలయొక్క స్వరూపాల్లో భేదము ఉన్నది అని అనడానికి ప్రమాణము లేదు కాబట్టి కూడాను.

సూ॥ **అనభిభవంచ దర్శయతి 3-4-35** బ్రహ్మజ్ఞానములో కర్మలు అడ్డుపడకపోవడాన్ని చూపిస్తున్నది. **ధర్మేణ పాపమపనుదతి.** పుణ్యకార్యాలు చేయడం ద్వారా పాపాన్ని పోగొడుతున్నారు. ధర్మేణఽవర్ణాశ్రమాచార విహిత కర్మలు అవి నిత్యములు, నైమిత్తికములున్నూ – ఇత్యాది వాక్యాలను బట్టి కూడా యజ్ఞాది ధర్మాలను చెప్పి వాటిచేత విద్యకు అనభిభవము – పాపకర్మల చేత జ్ఞానోత్పత్తికి అడ్డంకి లేకపోవడాన్ని చూపుతున్నది వేదము. ప్రతిదినమూ చేయబడే యజ్ఞాల చేత మనస్సు పరిశుద్ధము అవుతూ ఉండగా దినదినమూ మేలైన విద్య పుడుతుంది. అందువల్ల అవేయజ్ఞాదులు విద్యలోనూ, ఆశ్రమకర్మలలోనూ అన్వయించుతవి. **ఇది విహితత్వాధికరణము.**

★ ★ ★

## ఇక విధురాధికరణము.

సూ॥ **అన్తరా చాపి తద్ దృష్టేః 3-4-36** ఆశ్రమాలను కల్గి ఉండనివారికిన్నీ విద్యయందు అధికారమున్నది. రైక్వభీష్మ సంవర్తకాదుల్లో అది కనపడుతున్నది.

నాలుగు ఆశ్రమాలలో ఉన్నవారికిన్నీ బ్రహ్మ విద్యయందు అధికారము ఉన్నది. ఆశ్రమాల ధర్మాలు విద్యకు తోడ్పడేటువంటివి అని చెప్పబడింది. ఎవరైతే ఆశ్రమాలు లేకుండా విధురాదులు ఉన్నారో వారికి బ్రహ్మ విద్యయందు అధికారము ఉన్నదా? లేదా? అని సందేహము కలిగితే విద్య అనేది ఆశ్రమ ధర్మాలతో ఇతికర్తవ్యత – ఇట్లా ఇట్లా దీని తరువాత ఇది చేయాలి – కలది కాబట్టి ఏ ఆశ్రమాలు లేని, భార్య చనిపోయినటువంటి వారు మొదలైన వారికి ఆశ్రమాలు లేవు కనుక వారికి అధికారము లేదు అని సమాధానము ఎదురైతే చెప్పబడుతున్నది. అన్తరాచాపితు అని. తు శబ్దము పక్షాన్ని తిప్పి కొట్టడానికి చేర్చినారు. ఇక చ శబ్దము అవధారణార్థములో ప్రయోగింపబడింది. అన్తరా వర్తమానానాం – ఆశ్రమాలు లేనివారికి కూడా విద్య యందు ఉన్నది అధికారము. ఎందువల్లనంటే తద్దృష్టేః – కనిపిస్తూనే ఉన్నది కదా. రైక్వుడు, భీష్ముడు, సంవర్తుడు మొదలైన వారు ఆశ్రమాలు లేని వారైనా బ్రహ్మవిద్యానిష్ఠులై ఉండడము కనిపిస్తున్నది. ఆశ్రమధర్మాలను పాటిస్తేనే విద్య కలుగుతుంది అని చెప్పడానికి వీల్లేదు. **యజ్ఞేన దానేన తపసా అనాశకేన** అని చెప్పిన ప్రకారము దానాదులు ఆశ్రమాలతోనే ముడి పడినవి కాకపోవడం వల్ల విద్యకు అనుగ్రాహకములే అవుతూ కనిపిస్తున్నవి. ఎట్లాగంటే వివాహము చేసుకోకుండా ఊర్ధ్వరేతస్కులైన వారియందు విద్యానిష్ఠులై ఉండడము కనిపిస్తున్నందున అగ్నిహోత్రాదులు లేనివారికే విద్య బాగా అనుగ్రహిస్తుంది అట్లాగే ఆశ్రమాలు లేనివారికిన్నీ విద్య కనిపిస్తున్నందువల్ల ఏ ఒక్క ఆశ్రమానికి కట్టుబడని జపము ఉపవాసము దానము దేవతారాధన మొదలైనవాటి చేత విద్యానుగ్రహమును పొందవచ్చును.

సూ॥ **అపిస్మర్యతే 3-4-37** స్మృతులు కూడా ఇదే విషయాన్ని చెప్తున్నవి. మరియు ఆశ్రమాలు లేనివారికి కూడా జపాదులతోనే విద్యానుగ్రహము కలుగుతుందని స్మృతి చెప్తున్నది. **జప్యేనాపి చసంసిద్ధ్యేత్ బ్రాహ్మణో నాత్ర సంశయః। కుర్యాదన్యత్ నవాకుర్యాత్ మైత్రో బ్రాహ్మణ ఉచ్యతే.** జపం చేయుట ద్వారా కూడా బ్రాహ్మణుడు బ్రహ్మ విద్యను, దర్శనాన్ని పొందవచ్చును. దీనికి తోడుగా ఇతర కార్యాలు / కర్మలు చేయనూవచ్చు. చేయకనూ పోవచ్చును అని. సంసిద్ధ్యేత్ – అనగా జపాదుల ద్వారా కలిగిన బ్రహ్మ జ్ఞానం ద్వారా సిద్ధుడు అవుతాడని అర్థము.

సూ॥ **విశేషానుగ్రహశ్చ 3-4-38** కేవలము న్యాయముల వల్ల స్మృతుల వలనా ఈ అర్థాన్ని సాధించవలసిన పని లేదు. **తపసాబ్రహ్మ చర్యేణ శ్రద్ధయా విద్యయా ఆత్మాన**

**మన్విష్య.** తపస్సు బ్రహ్మ చర్యము శ్రద్ధ (గురి) జ్ఞానములతో ఆత్మను అన్వేషించి అని ఏ ఆశ్రమానికీ కట్టుబడని వారికి, ఆయా ధర్మ విశేషాల చేత విద్యానుగ్రహము కలుగుతుందని వేదమే వేరుగా చెపుతున్నది.

సూ॥ **అతస్తు ఇతరత్ జ్యాయో లింగాచ్చ 3–4–39** ఆశ్రమాలు లేనివారికంటే ఆశ్రమి ఐనవాడు అధికుడు ఆ విషయాన్ని స్మృతే చెప్తున్నది.

తు శబ్దము అవధారణార్థములో చెప్పబడింది. అతః – ఆశ్రమమును లేకుండా ఉండడము కంటే, ఇతరత్ – ఆశ్రమిఐ ఉండడమే శ్రేష్ఠమైనది. ఆశ్రమాన్ని లేకుండా ఉండడము ఆ పత్కాలానికి సమ్బన్ధించినటువంటిది. శక్తుడైనవాడు – చేతనైనవాడు – ఆశ్రమాన్ని కల్గిఉండడమే మంచిది. దాన్నే స్వీకరించాలి. ఎక్కువ ధర్మాలు కలది కొద్ది ధర్మాలు కలది ఐన ఆశ్రమాలకంటే గృహస్థాశ్రమధర్మము సాటిలేని ప్రయోజనాన్ని కల్గిస్తుంది కాబట్టి. లింగాచ్చ – స్మృతి వల్లనే అని అర్థము. చేతనైనవాడి గురించి ఆశ్రమాన్ని స్వీకరించడమే మంచిదని చెప్తున్నది. **అనాశ్రమీ నతిష్ఠేత్తు దినమేకమపి ద్విజః** బ్రాహ్మణుడు ఒక్కనాడైనా ఆశ్రమం లేకుండా ఉండకూడదు అని. బ్రహ్మ చర్యాన్ని ముగించిన వాడు, భార్య చనిపోయినవాడు వైరాగ్యము లేకపోయినప్పుడు పెండ్లి చేసుకోవడమే ఆపద్విషయము. **ఇది విధురాధికరణము**

★ ★ ★

## తద్ భూతాధికరణము.

సూ॥ **తద్ భూతస్యతు నాతద్భావః జైమినేరపి నియమాత్ తద్రూపాభావేభ్యః 3–4–40** నైష్ఠికబ్రహ్మచారిగా ఉండడం వంటి ఆశ్రమ నిష్ఠలకు అనాశ్రమిగా ఉండడము కుదరదు. ఆ నైష్ఠికులకు ఉండవలసిన ధర్మాలు లేకుండా ఉండకూడదు అని శాస్త్రము చేత నియమము ఉన్నది.

నైష్ఠికబ్రహ్మచారివానప్రస్థుదుసన్యాసఆశ్రమాలనుండిదిగజారిపోయినవారికిన్నీ బ్రహ్మవిద్యయందుఅధికారముఉన్నదా?లేదా?అనివిచారముజరిగిభార్యచనిపోయిన విధురుడు వంటివారివలె ఏ ఆశ్రమానికీ చెందని దానాదుల వలన విద్యానుగ్రహము కలుగడానికి అవకాశము ఉన్నది. కాబట్టి అధికారము ఉన్నది అని పూర్వపక్షము వస్తే తద్భూతస్యనాతద్భావః అని సమాధానము చెప్పబడుతున్నది. తుశబ్దము పూర్వపక్షాన్ని తిప్పికొట్టడానికి. తద్భూతస్య – నైష్ఠికాది ఆశ్రమ నిష్ఠుడైనవానికి నాతద్భావః

అతథాభావము అనగా ఏదో ఒక ఆశ్రమానికీ చెందకుండా ఉండడము కుదరదు. ఎందువల్లనంటే తద్రూపాభావములనుండి నియమమున్నందువల్ల. తద్రూపాణి – ఆనైష్ఠికాదులయొక్క రూపాణిఽవేషములు, ధర్మములు అని అర్థము. తేషామభావాః = తద్రూపాలయొక్క అభావము (లేకుండడము) వాటినుండి శాస్త్రాల ద్వారా కట్టడి చేయబడి ఉన్నది కనుక. అనగా ఆయా ఆశ్రమాల ధర్మాలను తప్పక కలిగి ఉండాలి. నైష్ఠికాదిఆశ్రమాలలో ప్రవేశించిన వారిని తమ ఆశ్రమధర్మాలను పాటించే విషయంలో నియమాలను తప్పక పాటించి తీరాలి. భ్రష్ఠులు కావద్దు. మానుకోవద్దు అని శాస్త్రాలు కట్టడిని చేస్తున్నవి. **బ్రహ్మచారీ ఆచార్యకుల వాసీతృతీయోఽత్యన్తమాత్మానమాచార్య కులే అవసాదయన్** బ్రహ్మచారియై ఆచార్యులవారి ఇంటివద్దనే ఉంటూ ఆచార్యులవారి కుటుంబములో, మూడవవాడుగా/ వానప్రస్థుడు వలె తనను గురువుగారి సేవలో బాగా క్రుంగదీసుకుంటూ అనగా ఇంద్రియాలను అణచిపెడ్తూ (ఉండవలెను) అని. మరియు **అరణ్యమియాత్। తతోనపునరేయాత్.** విద్యాభ్యాసము పూర్తికాగానే అడవికి వెళ్ళిపోవాలి. అనగా తపస్సు చేసుకుంటూ ఉండాలి. తిరిగి ఇంటికి/ గృహస్థా శ్రమానికి రాకూడదు. అని మరియు **సంన్యస్య అగ్నిం న పునః ఆవర్తయేత్** సన్యాసము పుచ్చుకున్నాక వెనుకకు వచ్చి పెండ్లి చేసుకొని అగ్నిహోత్రాన్ని చేయడము మొదలుపెట్టకూడదు. అనిన్నీ. అందువల్ల విధురుడు మొదలైనవారివలె నైష్ఠికాదులు కూడా ఆశ్రమికులు కారు కనుక వారికి బ్రహ్మ విద్యయందు అధికారములేదు. సూత్రములో జైమినేరపి అని చెప్పడము ద్వారా ఆయన అభిప్రాయము కూడా ఇదే అని తన అభిప్రాయాన్ని బలపర్చుకుంటున్నాడు – సూత్రకారుడు.

ఐతే ఇట్లా కావచ్చును – నైష్ఠికాదులకు బ్రహ్మచర్యాన్నుండి దిగజారి పోయినవారికి ప్రాయశ్చిత్తము చేసుకొంటే అధికారము కలుగుతుంది. బ్రహ్మచర్యము అనగా **స్త్రీతో కలయిక లేకుండా ఉండడము.** ఈ కట్టుబడి నుండి భ్రష్టులు కావడము జరిగితే అందుకు తగిన కొన్ని ప్రాయశ్చిత్తాలు విధింపబడి ఉన్నాయి. పూర్వమీమాంసలో ఆరవ అధ్యాయము – అధికార లక్షణములో ఏ ఏ ప్రాయశ్చిత్తాలు ఎట్లా ఎట్లా చేసుకోవాలి అనే పద్ధతిన్నీ చెప్పబడి ఉన్నది. **అవకీర్ణీపశుశ్చ తద్వత్** స్త్రీతో కూడరాదు అనే నియమాన్ని తప్పిన వాడు అవకీర్ణి అనబడుతున్నాడు. అతడు పశువుతో సమానుడు అని. అందువల్ల బ్రహ్మ చర్యాన్నుంచి దిగజారిపోయిన వాడికి ప్రాయశ్చిత్తము ఉన్నది కాబట్టి. ప్రాయశ్చిత్తాన్ని చేసుకొని బ్రహ్మ విద్యయందు అధికారాన్ని పొందగలడు అని. ఆ విషయంలో చెపుతున్నాడు.

సూ॥ **నచాధికారికమపి పతనానుమానాత్ తదయోగాత్ 3-4-41** నైష్ఠికాది ఆశ్రమభ్రష్టులకు ప్రాయశ్చిత్తము లేదు. తిరిగి నిష్ఠ నుండి భ్రష్టుడయ్యే అవకాశమున్నది. కనుక దానికి అర్హుడు కాదు. అధికార లక్షణములో చెప్పబడిన ప్రాయశ్చిత్తము కూడా నైష్ఠికాదులకు, దాన్నించి భ్రష్టులైనవారికి చెల్లదు. ఎందువల్లనంటే తిరిగి పతనమయ్యే అవకాశమున్నందువల్ల. అది తగదు కనుక. ప్రచ్యుతులైన నైష్ఠికాదులకు పతనావకాశము ఉన్నందవల్ల అతడికి ప్రాయశ్చిత్తమేలేదు. **శ్లో॥ ఆరూఢో నైష్ఠికమ్ ధర్మం యస్తుప్రచ్యవతే ద్విజః। ప్రాయశ్చిత్తంనపశ్యామి యేనశుద్ధ్యేత్స ఆత్మహా॥** నైష్ఠికమైన ధర్మాన్ని చేపట్టి దాన్నుంచి ఏ బ్రహ్మణుడు దిగజారి పోతాడో అతనికి ప్రాయశ్చిత్తము ఏదో నాకు తెలియదు. ఆతడు తననుతాను చంపుకున్నవాడు / ఆత్మ జ్ఞానాన్ని నశింపచేసుకున్నవాడు దేనితోనైతే పరిశుద్ధిని పొందగల్గుతాడో అని స్మృతి వచనము ప్రాయశ్చిత్తము లేదని చెప్తున్నది. కనుక అధికార లక్షణములో చెప్పినటువంటిది ఐన ప్రాయశ్చిత్తము ఇతరులైన సాధారణ బ్రహ్మచారులకు సమ్బన్ధించినది.

సూ॥ **ఉపపూర్వమపీత్యేకే. భావమశనవత్ తదుక్తమ్ 3-4-42** ఈ పతనము మహాపాతకము కాదు. ఉపపాతకమే. కనుక దీనికి ప్రాయశ్చిత్తము ఉన్నది అని కొందరు ఆచార్యులు చెప్పినారు. నైష్ఠికాదులయొక్క బ్రహ్మచర్యము నుండి కలిగిన దిగజారుట ఉపపాతకమే. మహాపాతకాల్లో దీన్ని లెక్కపెట్టలేదు కనుక ప్రాయశ్చిత్తము ఉన్నదని కొందరు ఆచార్యులు తలుస్తున్నారు. అశనవత్ – అశనమువలె. కల్లును త్రాగడం వంటి నిషేధము, దానికి ప్రాయశ్చిత్తమున్నూ ఉపకరించే బ్రహ్మచారి భ్రష్టుడైనప్పుడున్నూ నైష్ఠికాదులున్నూ సమానులే. కాబట్టే స్మృతికారులున్నూ ఆ విషయాన్నే చెప్పినారు. **ఉత్తరేషాంచైతదవిరోధి.** తరువాతి వారికిన్నీ ఇది విరోధి కాదు అని. గురుకులములో ఉండే వాడికి ఏది చెప్పబడిందో అది తమ ఆశ్రమానికిన్నీ విరోధికాదు. తరువాతి ఆశ్రమాలు వారికిన్నీ కలుగుతుంది అని అర్థము. దానివలెనే ఇక్కడకూడా బ్రహ్మచర్యాన్నుంచి దిగజారిపోతే ప్రాయశ్చిత్తము ఒకటి ఉన్నది కాబట్టి బ్రహ్మ విద్యాయోగ్యత ఉన్నది.

సూ॥ **బహిస్తూభయథాऽపి స్మృతేరాచారాచ్చ 3-4-43** మహాపాతకము ఐనా ఉపపాతకమే ఐనా బ్రహ్మవిద్యయందు అధికారము లేనివారే. కారణము ముందు చెప్పిన ప తన స్మరణమువలన. పెద్దలయొక్క ఆచారము కూడా అట్లాగే ఉన్నది. తు శబ్దము మతాన్తరాన్ని (వేరు అభిప్రాయాన్ని) తొలగించడానికి ఉపపాతకము ఐనా

మహాపాతకమే ఐనా కూడా భ్రష్టులైన వీరు బ్రహ్మ విద్యా అధికారులనుండి ప్రక్కకు పెట్టబడినవారే. అనగా బ్రహ్మవిద్యయందు అధికారము లేనివారు అని అర్థము. ఎందువల్లనంటే స్మృతేః – ముందు చెప్పిన పతనాన్ని తల్చుకోవడమువల్ల. కొందరి వాక్కు ప్రకారము పాపాన్ని తుడిచివేసుకోవడానికి ప్రాయశ్చిత్తము ఉన్నప్పటికీ కర్మాధికారము కొరకు శుద్ధి కావడానికి ప్రాయశ్చిత్తము మాత్రము లేదు. **ప్రాయశ్చిత్తం న పశ్యామి యేన శుధ్యేత్ స ఆత్మహా** అని స్మృతి వివరించుతున్నది కాబట్టి అని అర్థము. ఆచారాచ్చ – ఆచారము వల్లకూడా. శిష్టులు, భ్రష్ట లైన నైష్ఠికాదులను ప్రాయశ్చిత్తాదులు చేసుకున్నప్పటికీ కూడా దూరంగానే ఉంచుతున్నారు. దరికి రానివ్వడం లేదు. వాళ్ళకు బ్రహ్మ విద్య మొదలైన వాటిని ఉపదేశించడం లేదు. ఇందువల్ల వాళ్ళకు బ్రహ్మవిద్య యందు అధికారము లేదు. **ఇది తద్ భూతాధికరణము.**

★ ★ ★

## ఇక మీదట స్వామ్యధికరణము.

సూ॥ **స్వామినః ఫలశ్రుతేరిత్యాత్రేయః 3-4-44** ఇది పూర్వపక్షసూత్రము. కర్మాంగములను ఆశ్రయించిన ఉద్గీథాద్యుపాసనలను యజమానుడే చేయాలని ఆత్రేయుడు భావిస్తున్నాడు. ఫలశ్రుతి ఉన్నది కాబట్టి. కర్మాంగములను ఆశ్రయించి ఉండేవిఐన ఉద్గీథాద్యుపాసనలను యజమాని చేయాల్నా? లేక ఋత్విక్కులు చేయాల్నా అని విచారం చేసినప్పుడు యజమానే చేయాలి అని ఆత్రేయుడు అనే మహర్షి తలపోసినాడు. ఎందువల్లనంటే ఫలము వినిపిస్తున్నది కాబట్టి వేదాన్తాల చేత విధింపబడిన దహరవిద్య మొదలైన ఉపాసనలయందు ఫలము ఉపాసనమున్ను ఒక్కరిని ఆశ్రయించి ఉన్నవిగా కనిపిస్తున్నది. కాబట్టి ఇక్కడ కూడా క్రతువుయొక్క ఫలము సకాలములో దక్కకుండా అడ్డుకునే ఇతర కర్మఫలాలను పక్కకు నెట్టివేసే రూపమైన ఉద్గీథో పాసన ఫలము యజమానిని ఆశ్రయించి ఉన్నదని వినిపించుతున్నందువల్ల అని అర్థము. (ఏకాశ్రయము – ఒక్కరినే ఆశ్రయించుట. అనగా ఉపాసన ఎవడు చేస్తున్నాడో ఫలము దక్కడము వానికే. ఉపాసన యజమానే చేస్తున్నాడు. కాబట్టి ఫలమూ అతనికే దక్కుతుందని అర్థము) ఐతే గోదోహనము – ఆవు నుండి పాలు పిండుకోవడము – మొదలైనవాటివలె అంగాశ్రయమైనందువల్ల యజమాని కర్త కావడానికి వీలులేదు. అని అనకూడదు. గోదోహనము మొదలైనవాటియందు అధ్వర్యుడు చేసే ప్రణయనము (అగ్ని సంస్కారములో ఒక

భేదము) ను ఆశ్రయించిన గోదోహనమును ఇతరుడు చేయడానికి కుదరదు. ఇక్కడ మాత్రము ఉద్గీథము ఉద్గాత అనే ఋత్విక్కు చేసేది ఐనా ఆ ఉద్గీథాదులకు మరింత రసతమత్వాన్ని కలుగజేయడం కోసం యజమానుడే చేయవచ్చును. అని పూర్వ పక్షము రాగా చెప్పబడుతున్నది.

సూ॥ **ఆర్త్విజ్యమితి ఔడులోమిః తస్మైహిపరిక్రియతే 3-4-45** ఉద్గీథాది ఉపాసనా క్రియలు ఋత్విక్కులు చేయవలసినవే అని ఔడులోమి అనే ఆచార్యుడు గట్టిగా నమ్ముతున్నాడు. ఋత్విక్కు ఆయజ్ఞకర్మను యజమాని కొరకు చేయడానికే నియమింపబడుతున్నాడు కదా! ఆర్త్విజ్యమ్ – ఋత్విక్కులు చేసే పని ఉద్గీథాద్యుపాసనము అని ఔడులోమి అనే ఆచార్యుడు తలుస్తున్నాడు. ఎందువల్లనంటే యజమానియొక్క ప్రయోజనము కొరకు / ఉద్గీథాది ఉపాసనలు చేయడం కొరకే ఋత్విక్కు ఎంచుకోబడుతున్నాడు. ఫలసాధనమైన అవయవాలతో / అంగాలతో కూడి క్రతువును నిర్వహించడము కొరకు అని అర్థము. కర్మవిధులలో **ఋత్విజోవృణీతే** ఋత్విక్కులను వరించుతున్నాడు. **ఋత్విగ్భ్యో దక్షిణాం దదాతి** ఋత్విక్కులకు దక్షిణలను ఇచ్చుచున్నాడు అని ఋత్విక్కులే కర్తలుగా కలది అని శాస్త్రమే చెప్తున్నందున ఫలసాధన భూతమైన సాంగమగు కర్మ ఋత్విక్కులచే చేయబడవలసినది ఐ ఉన్నది అని తెలుస్తున్నది. అనగా ఋత్విక్కులే చేయాలి. యజ్ఞభాగాలైన శరీరముతో పనులు, మనస్సుతో చేయాల్సిన పనులున్నూ ఋత్విక్కులు చేయవలసినవే. ఐతే చేతనవుతుందా కాదా అనే నియమం ఏదీ లేదు. ఉద్గీథాద్యుపాసనము పురుషార్థమే ఐనా కూడా క్రతువునందు చేయుటకు ఋత్విక్కులకు అధికారమివ్వబడింది కనుకను సాంగమైన క్రతువు ఋత్విక్ కర్తృకము కాబట్టి యదేవ విద్యయా కరోతి తదేవ వీర్య **వత్తరమ్** దేన్ని తెల్సుకొని విద్యతో పాటు చేస్తున్నాడో అది శక్తిమన్తము, ఫలాన్ని ఇవ్వడంలో అడ్డంకులు ఏవీ లేనిదిగా అవుతుంది. అని ఋత్విక్కులు చేసే క్రియకు ఉపయోగపడుతున్నందువల్ల ఈ పనులు అన్నీ ఋత్విక్కులు చేయవలసినవే. దహరాది ఉపాసనల యందైతేనో ఇవి ఋత్విక్కులే చేయాలి అని వినిపించనందువల్ల, **శాస్త్రఫలం ప్రయోక్తరి.** శాస్త్రము చెప్పిన క్రియను ఆచరించినందువల్ల కలిగే ప్రయోజనము / ఫలము దానికి ప్రయోక్త ఎవడో / చేయించినవాడెవడో అతనికే దక్కుతుంది. కానీ ప్రయోజ్యకర్తలకు కాదు. అని చెప్పిన న్యాయము ప్రకారము ఫలి కర్తృకమే. **ఇది స్వామ్యధికరణము.**

★ ★ ★

## ఇకపైన సహకార్యన్తర విధ్యధికరణము.

సూ॥ **సహకార్యన్తర విధిః పక్షేణ తృతీయం తద్వతో విధ్యాదివత్ 3-4-46** విద్యావన్తుడైన వానికి విధ్యాదులవలె సహకారి ఐన మరొక విధి కూడా చేయాలని చెప్పుతున్నది. అది మూడవది. అనగా పాండిత్య బాల్యములకు తోడుగా మూడవదైన మౌనము విధింపబడుతున్నది. **తస్మాద్ బ్రాహ్మణః పాండిత్యం నిర్విద్య బాల్యేన తిష్ఠాసేత్. బాల్యంచ పాండిత్యంచ నిర్విద్యాథమునిః.** అందువలన బ్రహ్మవేత్తఐనవాడు బ్రహ్మజ్ఞానాన్ని సమగ్రంగా తెల్సినవాడై బాల్యావస్థను పొంది ఉండాలి. ఈ రెండింటికీ తోడుగా మౌని కూడా కావాలి. అనే వాక్యము వద్ద మౌనము కూడా శాస్త్రము చేత విధింపబడుతున్నదా? లేక అనువాదము చేయబడుతున్నదా? అని సందేహము కలిగితే మౌన పాండిత్య శబ్దాలు రెండు కూడా జ్ఞానము అనే అర్థాన్ని కలిగినటువంటివి కనుక పాండిత్యం నిర్విద్య అనే వాక్యము చేత విధింపబడిన జ్ఞానమే అథమునిః అనుదానిచేత అనువాదము చేయబడుతున్నది. (అనువాదము మునుపు చెప్పినదాన్నే మళ్ళీ చెప్పడాన్ని అనువాదము అంటారు) ఇక్కడ చేయాలి అని చెప్పే విధి శబ్దము వినుపించడము లేదు. అని పూర్వపక్షము రాగా చెపుతున్నాము. సహకార్యన్తర విధిః అని. తద్వతః - విద్యావన్తుడికి. విధ్యాదులవలె. విధింపబడ్తున్నది కాబట్టి విధి. అదే యజ్ఞాదులైన అన్ని ఆశ్రమాలవారికి ధర్మమైన శమదమాదులు కూడా విధి శబ్ధము చేత చెప్పబడుతున్నవి. ఆది అనే పదాన్ని బట్టి శ్రవణ మననాలు గ్రహింపబడుతున్నవి. సహకార్యన్తర విధిః అని అన్నచోట కూడా విధీయతే ఇతి విధిః అని అన్వయించుకోవాలి. సహకారియైన మరొకటి విధిన్నీ కలిపి సహకార్యన్తర విధిః అని అనబడ్తున్నది. మొత్తమ్మీద ఇదీ చెప్పబడ్తున్న విషయము - ఎట్లాగైతే **తమేతం వేదానువచనేన బ్రాహ్మణాః వివి దిషన్తి యజ్ఞే నదానేన** అనువాక్యముతో పాటు **శాన్తోదాన్తః** అనే వాక్యముతోనూ సహకారి ఐన యజ్ఞాదులైన కర్మలు, శమదమాదులున్నూ విధింపబడుతున్నవో, ఎట్లాగైతే **శ్రోతవ్యోమన్తవ్యో** అని శ్రవణ మననములున్నూ అర్థమును బట్టి వచ్చి చేరుతూ తోడ్పడేవిగా (సహకారులుగా) గ్రహింపబడుతున్నవో అట్లాగే **తస్మాద్ బ్రాహ్మణః పాండిత్యం నిర్విద్య** ఇత్యాది వాక్యముతో పాండిత్యము బాల్యము మౌనము అనే మూడున్నూ బ్రహ్మవిద్యకు సహకరించేవిగా విధింపబడుతున్నవి అని. పక్షేణ అనే పదము ద్వారా మౌనము కూడా పాండిత్యము కంటే వేరయినది అని చెప్పినారు. ముని శబ్దానికి పక్షముతో ప్రకృష్టమైన మననము శీలములున్నూ వ్యాసమహర్షి మొదలైన వారియందు ప్రయోగము

కనిపిస్తున్నది. మౌనము పాండిత్య బాల్యాదుల తరువాతది కాబట్టి మూడవది అని అనబడుతున్నది. ఒకవేళ అథమునిః అనుచోట విధి ప్రత్యయము వినబడకున్నా మౌనము అప్రాప్తము కాబట్టి విధేయము అనియే అంగీకరించాలి. అథ – ఇక మీదట ముని కావాలి అని. ఈ మౌనము విన్నదాన్ని చెదరిపోకుండా మనస్సులో నిల్చుకోవడం కొరకు కాబట్టి మననంకంటే వేరే ఇంకొకటి ఐనట్టిది, ఉపాసనకు ఆలంబనము (ఆధారము) ఐన దానిని మాటిమాటికీ సంశీలనం – తరుచుగా పరిశీలించడము దానియొక్క భావనారూపమే. అందువలన వాక్యార్థము ఇట్లా ఉంటున్నది. బ్రాహ్మణుడు – విద్యావన్తుడు పాండిత్యాన్ని పొంది – ఉపాస్యమైన బ్రహ్మతత్వాన్ని పరిశుద్ధంగా పరిపూర్ణంగానూ తెల్సుకొని – శ్రవణమననాల ద్వారా లభించని వేదనాన్ని జ్ఞానాన్ని ప్రతిలభ్య – పొంది అని అర్థము. ఆ వేదనమున్నూ భగవన్తుని యందలి భక్తి చేత సహకరింపబడిన సత్వము యొక్క విశేషణమైన పెరుగుదల వల్ల ఏర్పడినటువంటిది. అందుకే ఇట్లాగా చెప్పబడింది. **నాహంవేదైః** అని మొదలుపెట్టి **భక్త్యాత్వనన్యయా శక్యః.... జ్ఞాతుమ్.** నేను వేదాలచే తెలియబడే వాణ్ణి కాను. ఇతరులతో సమ్బన్ధము లేని నాయందు మాత్రమే నిల్చిన భక్తితో మాత్రమే తెల్సుకోబడుతాను అని. ఇక శ్రుతి కూడా **యస్య దేవేపరాభక్తిః** ఎవనికి భగవన్తుని యందు గొప్ప భక్తి ఉండగలదో **నాయమాత్మా ప్రవచనేన లభ్యః.** ఈ పరమాత్మ ప్రవచనములచేత లభించడు. ఇత్యాదిగా చెప్తూ ఉన్నది. బాల్యేన తిష్ఠాసేత్. బాలుని యొక్క స్వభావము వంటి స్వభావముతో ఉండాలి. బాల్యస్వరూపము ఎటువంటిదో తదనన్తరమే చెప్పబడగలదు. బాల్యంచ పాండిత్యం చనిర్విద్య అథమునిః స్యాత్ – అనగా బాల్యపాండిత్యాలను ఉన్నది ఉన్నట్లుగా గ్రహించి పరిశుద్ధుడు పరిపూర్ణుడు ఐన బ్రహ్మయందు మననము చేయుటయే స్వభావముగా కలవాడై ఉండవలెను. ఎందుకొరకనగా నిది ధ్యాసన రూపమైన విద్యను పొందడానికి. ఈ విధంగానే మూడింటినీ – పాండిత్యము, బాల్యము, మౌనము – స్వీకరించడం ద్వారా విద్యను చేజిక్కించుకున్నవాడవుతున్నాడు. **అమౌనంచ మౌనంచ నిర్విద్యాథ బ్రాహ్మణః** అని. అమౌనమ్ – మౌనానికంటే వేరయిన సహకారి – తోడుపడే – కలాపము, (బాల్య పాండిత్యాలు) దాన్ని, మౌనాన్ని యథావిధిగా స్వీకరించుతున్నవాడై దానిచేత మాత్రమే లభించేదైన విద్యయొక్క కాష్ఠాం – శిఖరాగ్ర దశను పొందవలెను అని అర్థము. **సబ్రాహ్మణః కేనస్యాత్.** అతడు ఏ కారణము చేత బ్రాహ్మణుడు కాగలడు అని ఇప్పటివరకూ చెప్పిన ఉపాయము కంటే మరేదైనా ఉపాయము ఉన్నదా? అని అడిగితే **యేనస్యాత్ తేనేదృశ ఏవ** అని – యేన – ఏ మౌనము దాకా ఉన్నదానిచేతనే

బ్రాహ్మణుడు కాగలడు అని చెప్పబడిందో. దానిచేత మాత్రమే ఇటువంటివాడు అవుతాడు. మరో ఉపాయము చేతనున్నూ కాదు అని శంకను కొట్టి పారేసినారు. అందువల్ల అన్ని ఆశ్రమాల్లోనూ ఉన్న విద్వాంసునికి యజ్ఞము మొదలైన తానున్న ఆశ్రమధర్మాలవలెనే పాండిత్యము మొదలైన, మౌనము మూడవదిగా ఉన్న విద్యకు సహకార్యన్తరం – తోడు పడే మరొక ధర్మాన్ని విధిస్తున్నారు.

ఐతే ఇట్లా కావచ్చును – అన్ని ఆశ్రమాలలో ఉన్న విద్వాంసులకు ఆయా ఆశ్రమధర్మాలకు సహకరించేది, మౌనము మూడవదిగా ఉన్నవాటిని సచివులుగా ఉన్న విద్యయే బ్రహ్మ ప్రాప్తికి సాధనమని ఒకవేళ చెప్పితే అప్పుడు ఛాన్దోగ్యములో **అభిసమావృత్య కుటుంబేశు చౌదేశే** చక్కగా అలంకరింపబడిన గృహములోని పరిశుద్ధ స్థలములో అని మొదలుపెట్టి **సఖల్వేవం వర్తయన్ యావదాయుషం బ్రహ్మలోకమభి సమ్పద్యతే.** ఈ విధంగా అతడు ఆయుష్యము ఉన్నంతవరకు గడుపుకుంటూ బ్రహ్మలోకానికి చేరుకుంటున్నాడు. **నచపునరావర్తతే.** తిరిగి వెనుకకు రాడు అని ఆయుష్యము ఉన్నంతవరకూ గృహస్థ ధర్మముతో కూడి ఉండడము కనిపిస్తున్నది కదా! అని అంటే చెపుతున్నాడు.

సూ॥ **కృత్స్నభావాత్తు గృహిణోపసంహారః 3-4-47** అన్ని ఆశ్రమాలలోనూ విద్య ఉంటున్నది కాబట్టి – గృహస్థుడికీ ఉంటున్నది. దానితో ముగింపు పలుకుతున్నాడు. తు శబ్దముతో చోద్యమును / శంకను తిప్పికొడుతున్నాడు. కృత్స్నభావాత్ – అన్నింటియందున్నూ ఉండడము వలన అన్ని ఆశ్రమాలయందున్నూ విద్య ఉన్నది కాబట్టి గృహస్థుడికీ ఉన్నదని తేన దానితో ముగించుతున్నారు. అందువల్ల అన్ని ఆశ్రమాల ధర్మాన్ని ప్రదర్శించడము కొరకు గృహీ ఐన వానితో ఉపసంహారము అని అభిప్రాయము.

పైన చెప్పినట్లే ఈ వాక్యములో కూడా **బ్రాహ్మణాః పుత్రైషణాయాశ్చ విత్తైషణాయాశ్చ లోకైషణాయాశ్చ వ్యుత్థాయాథ భిక్షా చర్యంచరన్తి.** బ్రాహ్మణులు – బ్రహ్మవిద్యను తెల్సినవారు పుత్రులు కావాలి, ధనము కావాలి, అందరిలోనూ కలసి ఉండాలి అనే కోరికలను విడచి పెట్టి తరువాత బిచ్చమెత్తుకుంటున్నారు. అని పరివ్రాజకులకు మాత్రమే చెందిన ధర్మాన్ని ప్రతిపాదించి **తస్మాత్ బ్రాహ్మణః పాండిత్యం నిర్విద్య** ఇత్యాది వాక్యముతో పారి వ్రాజ్య ధర్మము నందు ఉండడానికి కారణమైన మౌన తృతీయముతో సహకారి ధర్మాలను విధించడం ప్రదర్శనార్థము అని చెపుతున్నాడు.

(పరివ్రాజకుడు – ప్రతిదినమూ ఒక్కొక్క గ్రామంలో ఉంటూ దేశ సంచారము చేస్తూ ధర్మాన్ని ప్రచారము చేసే సన్యాసి)

సూ॥ **మౌనవదితరేషాం అప్యుపదేశాత్ 3-4-48** ఈషణలు అన్నింటినీ వదిలించుకొని భిక్షము అడుగుకుంటూ మౌనంగా ఉండాలి అని ఉపదేశించడము కేవలం సన్యాసులకే కాదు. ఈ ధర్మము కొరకు. ఆ విధంగా ఉపదేశము ఉన్నందువల్ల. అన్ని ఆశ్రమాల వారికిన్నీ ప్రదర్శన అన్ని ఈషణల నుండి పూర్తిగా ముక్తుడైన వానికి భిక్షా పూర్వకంగా మౌనాన్ని కలిగి ఉండాలని ఉపదేశించడము అన్ని ఆశ్రమధర్మాలనూ ప్రదర్శించడం కొరకు. ఎందువల్లనంటే ఈ విధమైన మౌనాన్ని ఉపదేశించినట్లే ఇతర ఆశ్రమముల వారికిన్నీ **త్రయోధర్మ స్కంధాః** ధర్మాన్ని నిలబెట్టే ధర్మస్తంభాలు మూడు ఉన్నవి. అని మొదలుపెట్టి **బ్రహ్మసంస్థోఽమృతత్వమేతి** బ్రహ్మోపాసన యందునిలిచినవాడు మోక్షాన్నిపొందుతాడు అని బ్రహ్మప్రాప్తిని ఉపదేశించినందువల్ల. బ్రహ్మసంస్థ శబ్దము అన్ని ఆశ్రమాలకూ సాధారణమయినదే అని ఇంతకుముందే ప్రతిపాదింపబడింది. అందువల్ల చక్కగా చెప్పబడింది. అనగా యజ్ఞాదులు అన్ని ఆశ్రమాల వారికీ సాధారణ ధర్మము ఐనట్లే మౌనమే మూడవదిగా కల పాండిత్యాదులు విద్యకు తోడుపడేవిగా విధింపబడుతున్నవి అని. **ఇది సహకార్యన్తర విధ్యధికరణము.**

★ ★ ★

## ఇక అనావిష్కారాధికరణము.

సూ॥ **అనావిష్కుర్వన్ అన్వయాత్ 3-4-49** బాలునియొక్క తన స్వభావాన్ని వెల్లడించకపోవడము అనే దాన్ని స్వీకరించాలి విద్వాంసుడు. బాలుని ప్రవర్తన విద్వాంసునికీ వర్తిస్తుంది అది. **తస్మాత్ బ్రాహ్మణః పాండిత్యం నిర్విద్య బాల్యేన తిష్ఠాసేత్** అనే వాక్యము వద్ద విద్వాంసుడు బాల్యాన్ని స్వీకరించాలి అని వినపడింది. బాలునియొక్క భావము లేక కర్మగానీ బాల్యము అనబడుతుంది. ఒకానొక వయస్సు, ఒక అవస్థా విశేషము ఉపాదేయము కాదు గనుక కర్మనే గ్రహింపబడుతున్నది. అటువంటప్పుడు బాలుని యొక్క కర్మ అంటే కామచారము – తనకు తోచినట్లుగా నడచుకోవడము మొదలైనవి అన్నీ విద్వాంసుడు స్వీకరించాల్నా? లేక దంభము మొదలైనవి లేకపోవడమేనా? అని సంశయము ఏర్పడితే విశేషము లేదు కావున అతని నడవడిక నంతటినీ స్వీకరించదగినదే. ఇట్లా ఉండాలి ఇట్లా చేయాలి అనే నియమ

శాస్త్రాలు ఇప్పుడు చెప్పిన ఈ ప్రత్యేకమైన శాస్త్ర విధి ప్రకారము బాధింపబడుతవి అని పూర్వ పక్షము ఎదుట నిలుస్తే చెప్పబడుతున్నది. అనావిష్కుర్వన్ అని. బాలుని యొక్క ఏ స్వభావాన్ని వెల్లడించని రూపమైన ఏ కర్మ ఉన్నదో దాన్ని స్వీకరించి విద్వాంసుడు నడుచుకుంటూ ఉండాలి. ఎందువల్లనంటే అన్వయము వలన అది మాత్రమే అన్వయిస్తున్నది /కలుస్తున్నది. **బాల్యేన తిష్ఠాసేత్** అనే ఈ విధిలో దానికి మాత్రమే అన్వయము కుదుర్తుంది. తక్కినవి విద్యకు విరోధులు అని వినిపిస్తున్నవి. **నావిరతో దుశ్చరి తాత్ నాశాన్తో నాసమాహితః। నా శాన్తమనసోవాఽపిప్రజ్ఞానేనైన మాప్నుయాత్** చెడు నడత నుండి మానుకోక పోవడము, ప్రశాంతత లేకపోవడము, ఏకాగ్రత లేకుండడము, మనఃప్రశాన్తి లేకపోవడం వంటి లక్షణాలు కలవాడు కేవలము జ్ఞానము ఉన్నంతమాత్రాన పరమాత్మను చేరుకోలేడు. **ఆహార శుద్ధౌ సత్వశుద్ధిః** తినే ఆహారము శుద్ధమైనది ఐతే మానసిక స్థితి కూడా త్రిగుణాలు లేకుండా పరిశుద్ధంగా ఉంటుంది.ఇత్యాది వాక్యాలయందు. **ఇది అనావిష్కరణాధికరణము.**

★ ★ ★

### ఇక ఐహికాధికరణము.

సూ॥ **ఐహికం అప్రస్తుత ప్రతిబంధే తద్దర్శనాత్ 3-4-50** ఈ జన్మలో కలిగే అభ్యుదయ ఫలమైన ఉపాసనము ప్రతిబన్ధము అడ్డకుండా ఉంటే కర్మ తరువాత ఫలము సిద్ధించుతుంది. అట్లాగే కనిపించుతున్నందువల్ల. విద్య రెండు విధాలుగా ఉంటుంది. అభ్యుదయమే – ఇప్పుడున్న స్థితికంటే మరింత మెరుగ్గా బాగుపడడము – ఫలముగా గలది ఒకటి. ఇక రెండవది మోక్షమే ఫలముగా కలది. వాటిలో అభ్యుదయమే ఫలముగా గల విద్య తనకు సాధనాలైన పుణ్యకర్మలు చేయబడగా వాటిచేత పుణ్యకర్మ ముగిసిన తరువాతనే పుడుతుండా? లేక పుణ్యకర్మల తరువాత ఎప్పుడో ఏదో ఒక కాలములో అనే నియయము లేదా? అని సంశయము కలుగుతున్నది. విద్వాంసుడు తాను పూర్వ జన్మలో చేసుకున్న పుణ్యకర్మల చేత ఈ జన్మలో విద్వాంసుడుగా పుడుతున్నాడు. అదే విషయాన్ని భగవన్తుడు చెప్పినాడు. **చతుర్విధా భజన్తే మామ్ జనాః సుకృతినోఽర్జున!** ఓ అర్జునా! పుణ్యాత్ములైన జనులు నన్ను నాలుగు విధాలుగా సేవిస్తున్నారు. అని కనుక సాధనమైన కర్మను పూర్తి చేసితే ఆలస్యానికి కారణం లేదు కాబట్టి వెంటనే ఫలము చేతిలో పడుతుంది అని **పూర్వపక్షము** ముందుకు వచ్చింది. దీనికి ప్రత్యుత్తరము చెప్పబడుతున్నది. ఐహికమ ప్రస్తుత ప్రతిబన్ధే అని. ఐహికము అనగా అభ్యుదయమే

ఫలముగా కల ఉపాసన. అప్రస్తుత ప్రతిబన్ధే = ప్రబలమైన మరొక కర్మ ఫలము ప్రతిబన్ధకము కాకపోతే కర్మ ముగిసిన తరువాతనే చిక్కుతుంది. ఇక ప్రతిబన్ధమే ఎదురు ఐతే దాని తరువాతనే. కనుక నియమము లేదు. ఎందువల్లనంటారా? తద్దర్శనాత్. అది కనిపిస్తున్నది. ప్రబలమైన మరొక కర్మ చేత కర్మఫలము యొక్క అడ్డగింపు శ్రుతిలో కనిపిస్తున్నది. **యదేవ విద్యయా కరోతి శ్రద్ధయా ఉపనిషదా తదేవ వీర్యవత్తరమ్.** అని చెప్పిన ప్రకారము ఉద్గీథవిద్యతో కూడిన కర్మఫలము అడ్డగింపబడకపోవడం వినిపిస్తున్నది కాబట్టి. **ఇది ఐహికాధికరణము.**

★ ★ ★

## ఇక ముక్తి ఫలాధికరణము

సూ॥ **ఏవం ముక్తిఫలానియమః తదవస్థావధృతేః. తదవస్థావధృతేః 3-4-51**

ఇదే తీరుగా ముక్తియే ఫలముగా కల విద్యయందునూ ఒక నియమము లేకపోవడము కనిపిస్తున్నది. అక్కడ కూడా ఇదే అవస్థ ఉన్నది అని తెలుస్తున్నది. ముక్తి ఫలముగా కల ఉపాసనకు తనకు సాధనములైన గొప్పవైన కర్మలచేత ఫలోత్పత్తి కలుగడంలో కాలనియమము ఏదీ లేదు. దానికి కూడా ముందరి అభ్యుదయ ఫలము కల ఉపాసన వలె ప్రతిబంధము లేకపోవడము, ప్రతిబన్ధము ముగిసిపోవడము అనే అవస్థలు ఉన్నవి అని అర్థమవుతున్నందువల్ల. ఇక్కడ కూడా ఆ హేతువు సమానంగా ప్రవర్తిస్తున్నది కాబట్టి అని అర్థము. అన్ని కర్మలకంటే ముక్తిపలవిద్యాసాధనమైన కర్మ ప్రబలమైనది కాబట్టి ప్రతిబన్ధము కలుగకపోవచ్చును అని అధిక ఆశంక ఏర్పడుతున్నది. అది ఎంత గొప్పదైనా కావచ్చు కానీ పూర్వజన్మలో చేసిన బ్రహ్మవేత్తల విషయములోని అపచారాలు అనేవి అంతకంటే బలవంతములైనవి ఉండవచ్చును గనుక ప్రతిబన్ధము ఏర్పడుతుందనడానికి అవకాశము ఉన్నది. కనుక అధిక శంకకు ఇది పరిహారము. సూత్రములోని చివరి పదము రెండుసార్లు చెప్పబడడము అధ్యాయం ముగిసిందని సూచిస్తున్నది.

**భగవద్ రామానుజ విరచితమైన శ్రీభాష్యమునందు తృతీయాధ్యాయములోని**
చతుర్థపాదము, తృతీయ అధ్యాయము ముగిసినది.

**విజయతాం రామనుజ దివాకరః.**

శ్రీమతే రామానుజాయనమః

# శ్రీభాష్యము – చతుర్థాధ్యాయము – ప్రథమపాదము

## ఆవృత్తి అధికరణము

సూ॥ **ఆవృత్తిః అసకృదుపదేశాత్ 4-1-1** మూడవ అధ్యాయము నందు సాధనములతో సహ విద్య విచారించబడింది. ఇక ఇప్పుడు విద్యాస్వరూపాన్ని విశేషంగా శోధనము చేయడం ద్వారా విద్య యొక్క ఫలము ఏమిటి? అని విచారణ చేయబడుతున్నది. ఆ సందర్భములో **బ్రహ్మవిదాప్నో తి పరమ్.** బ్రహ్మవేత్త ఐనవాడు పరమ పదాన్ని పొందుతున్నాడు. **తమేవ విదిత్వాఽతిమృత్యుమేతి** ఆ మహా పురుషుడిని తెల్సుకొని ఉపాసించి మృత్యువును దాటుకుంటున్నాడు. **బ్రహ్మవేద బ్రహ్మైవభవతి** బ్రహ్మను గురించి తెల్సినవాడు బ్రహ్మవలె అవుతున్నాడు. **యదా పశ్యః పశ్యతే రుక్మ వర్ణమ్** ఎప్పుడైతే రుక్మవర్ణము గల పరమాత్మను దర్శించుతాడో ఇటువంటి వేదాన్త వాక్యాలయందు బ్రహ్మను చేరుకోవడానికి సాధనముగా విధించబడిన జ్ఞానము ఒకసారి చేయబడితే చాలునా? అదే శాస్త్రముతో నిర్ణయింపబడిందా? లేక మాటిమాటికీ ఆ వృత్తము చేయబడాల్నా? అని సంశయము కలుగుతున్నది. ఈ రెండింటిలో ఏది సరిఐనది? అని అంటే ఒక్కసారి చేయబడితే చాలును. ఎందుకంటే **బ్రహ్మవేద బ్రహ్మైవభవతి** అని కేవలము జ్ఞానము మాత్రమే విధింపబడింది. మాటిమాటికి ఆ వృత్తిచేయాలనే విషయంలో ప్రమాణము లేదు. ఐతే అవఘాతము – దంచుట మొదలైనవాటి వలె జ్ఞానము బ్రహ్మను ప్రత్యక్షము చేసుకోవడములో దృష్టోపాయము కనుక పనిజరిగేంతవరకూ ఆ వృత్తి చేయాలి అని అనకూడదు. వాస్తవానికి జ్ఞానము దృష్టోపాయము కాదు. జ్యోతిష్టోమము మొదలైన కర్మలు ఉపనిషత్తులచేత విధింపబడిన జ్ఞానమున్నూ పరమ పురుషుని యొక్క ఆరాధనా రూపము. చక్కగా ఆరాధింపబడిన పరమ పురుషుడి నుండి ధర్మము అర్థము కామము మోక్షము అనే పురుషార్థాలు లభించుతున్నాయి అని **ఫలమతః ఉపపత్తేః** అనే సూత్రము వద్ద ప్రతిపాదింపబడింది. అందువలన జ్యోతిష్టోమాదుల వలె వేదశాస్త్రము యొక్క శబ్దము ప్రకారము ఒక్కసారి చేయడమే శాస్త్రార్థము. అని పూర్వపక్షము రాగా చెపుతున్నాము. ఆ వృత్తిః అసకృత్ అని. మాటిమాటికీ ఆవృత్తి చేయాలి అని. కారణము ఏమిటంటే ధ్యానము ఉపాసనము అనే పర్యాయపదాలు గల వేదన శబ్దము

చేత ఉపదేశింపబడుతున్నది గనుక ఆ పదాలకు పర్యాయపదత్వము ఎట్లాగంటే విది ఉపాస్తి ధ్యాయత అనే పదములకు ఒకే విషయము నందు వేదనాన్ని / జ్ఞానాన్ని ఉపదేశించేవైన వాక్యాలయందు ప్రయోగింపబడినందువలన తెలుస్తున్నది. అది ఎట్లాగంటే **మనోబ్రహ్మేత్యుపాసీత.** మనస్సునే బ్రహ్మ అని ఉపాసించాలి. అని ఉపాసి పదముతో ఆరంభింపబడిన అర్థము **భాతిచ తపతి చ కీర్త్యా యశసా బ్రహ్మవర్చసేన య ఏవంవేద** ప్రకాశిస్తున్నాడు. తనదైన **కీర్తి యశస్సులతో** కీర్తి అనగా అతనియొక్క ఎక్కువతనాన్ని గురించిన పేరు. యశస్సు అంటే అందరికీ అందుబాటులో ఉండుట. ఈ రెండింటితో ప్రకాశించుతున్నాడు. బ్రహ్మ వర్చస్సుతో ఆలోచింపచేస్తున్నాడు. బ్రహ్మ వర్చస్సుతో – అనగా బ్రహ్మను గురించిన జ్ఞానము వల్ల కల్గిన ముఖమునందలి కాన్తితో – ఆలోచింప చేస్తున్నాడు. అని చెప్పుతూ వేదపదముతో ముగించుతున్నాడు. అదేవిధంగా **యస్తద్వేద యత్ సవేద సమయైత దుక్తః** ఎవడు ఆ పరమాత్మను గురించి తెల్సుకుంటున్నాడో ఏది అతడిని గురించి తెల్సుకుంటున్నదో ఆ విషయము / జ్ఞానము నా చేత తెలుపబడింది. ప్రపంచము పరమాత్మలకున్ను అభేదము / తాదాత్మ్యము నేను తెలిపినానని అర్థము. అని ఆరంభములో /ఉపక్రమములో రైక్వుని చేత చెప్పబడిన జ్ఞానము **అనుమ ఏతాం భగవోదేవతాం శాధియాందేవతాముపాస్సే.** ఓ పూజ్యుడా! ఏ దేవతనైతే నీవు ఉపాసించుతున్నావో ఆ దేవతను గురించి నాకు తెలియచెయ్యి. అని ఉపాసి పదముతో ముగించుతున్నాడు. అదే తీరుగా **బ్రహ్మవిదాప్నోతి పరమ్** ఇత్యాదులైన వాక్యములతో సమానమైన అర్థము గల వాక్యాలలో **ఆత్మావా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యః** ఓరీ! ఆత్మనే కదా చూడదగినది. వినతగినది. మననము చేయతగినది. బాగుగా ధ్యానము చేయతగినది. **తతస్తుతం పశ్యతినిష్కలంధ్యాయమానః** పిమ్మట అవయవాలు లేని ఆ పరమాత్మను ధ్యానము చేస్తున్నవాడై దర్శించుకుంటున్నాడు. ఇత్యాదులయందు ధ్యాయతి అను పదముతో వేదనము / జ్ఞానము చెప్పబడుతున్నది. ధ్యానం అనగా చింతించుట. అది స్మృతి యొక్క ఎడతెగని తలంపు రూపమైనట్టిది. కేవలము ఒక్కసారి తలచుకోవడము మాత్రమే కాదు. ఉపాస్తి/ఉపాసనము కూడా దానితో సమానమైన రూపము కలదే. రెండింటికి ఒకటే అర్థము. ఏకాగ్రమైన చిత్తము యొక్క వ్యాపారము ఎడతెగకుండా కొనసాగడము నందు ప్రయోగము కనపడ్తున్నందువల్ల. ఆ రెండూ ఏకార్థతను కల్గియున్నందువల్ల ఆ వృత్తము చేయబడిన సంతత స్మృతియే ఇక్కడ **బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి, జ్ఞాత్వాదేవం ముచ్యతే సర్వపాశైః** పరమాత్మను ఉపాసించి అన్ని రకాలైన త్రాళ్ళ నుండి విడుదల

పొందుతున్నాడు. ఇత్యాది వాక్యాలయందు వేదన మొదలైన శబ్దాలతో చెప్పబడుతున్నది అని నిశ్చయింపబడుతున్నది.

సూ॥ **లింగాచ్చ 4-1-2** లింగము అనగా స్మృతిగ్రన్థము. దానివలన కూడా ఈ అర్థమే తెలుస్తూ ఉన్నది. మోక్షానికి సాధనమైన జ్ఞానము స్మృతి సన్తతి రూపము అని స్మృతులలో చెప్పబడుతున్నది. **తద్రూప ప్రత్యయే చైకా సన్తతి శ్చాన్య నిస్పృహా। తద్ధ్యానమ్ ప్రథమైః షడ్భిః అంగైః నిష్పాద్యతే తథా॥** అతని యొక్క రూపాన్ని గుర్తించడములో ఇంకొకదానిపై ఆధారపడని ఒక సన్తతి మరియు అతని గురించిన ధ్యానము మొదటి ఆరు అంగాలతో పుట్టింపబడుతున్నది అని. అందువల్ల మాటిమాటికీ ఆవృత్తి చేయబడిన జ్ఞానమే శాస్త్రము తేల్చిన అర్థము. **ఇది ఆవృత్త్యధికరణము.**

★ ★ ★

## ఇక ఆత్మత్వోపాసనాధికరణము.

సూ॥ **ఆత్మేతి తూ పగచ్ఛన్తి. గ్రాహయన్తిచ 4-1-03** పరమాత్మను తమకు ఆత్మ అని ఉపాసిస్తున్నారు. ఇతరులకు తెలియపరుస్తున్నారు కూడా. ఇప్పుడు ఇది విచారము చేయబడుతున్నది. ఉపాస్యుడైన బ్రహ్మను ఉపాసించే తనకంటే వేరయినవాడుగా ఉపాసించాల్నా? లేక ఉపాసన చేసేవాడికి ఆత్మగా ఉపాసన చేయాల్నా అని. తగినది ఏది అంటే వేరయినవాడని అనడమే సబబు అని. ఎందువల్లనంటారా? బ్రహ్మ ఉపాసన చేసే ప్రత్యగాత్మ కంటే వేరయినవాడవడం వల్ల. అర్థాన్తరత్వము అని **అధికంతు భేదనిర్దేశాత్ 2) అధికోపదేశాత్ 3) నేతరోఽనుపపత్తేః** ఇత్యాది సూత్రాలయందు ప్రతిపాదించినారు. ఎలాంటి స్వరూపాన్ని కల్గి ఉన్నాడో అటువంటి బ్రహ్మనే కదా ఉపాసింపదగిన వాడవుతున్నాడు. ఉన్న తీరుగా కాకుండా ఉపాసన చేసినట్లయితే బ్రహ్మ ప్రాప్తి కూడావేరుగానే అవుతుంది. **యథాక్రతురస్మిన్ లోకేపురుషోభవతి తథేతః ప్రేత్యభవతి** ఈ లోకములో ఎటువంటి పనులను చేస్తున్నాడో అటువంటి ఫలాలను మాత్రమే పైలోకాలలో అనుభవిస్తున్నాడు అని కదా న్యాయము ఉన్నది. అందువలన తనకంటే వేరైనవాడుగా బ్రహ్మను ఉపాసన చేయాలె అని. ఈ విధంగా పూర్వపక్షము వస్తే చెప్పబడుతున్నది. ఆత్మేతితు ఆత్మఅని. తు శబ్దము అవధారణార్థములో ప్రయోగించినారు. ఉపాసించేవానికి బ్రహ్మ ఆత్మ అనియే ఉపాసనను చెయ్యాలి. ఉపాసకుడైన ప్రత్యగాత్మ తన శరీరానికి తాను ఎట్లా

ఆత్మ అవుతున్నాడో అట్లాగే తనకు కూడా పరం బ్రహ్మ ఆత్మ అని ఉపాసించాలి అని అర్థము. ఎందువల్ల అంటారా? మనకంటే ముందు ఉన్న ఉపాసకులు **త్వంవా అహమస్మి భగవోదేవతే. అహంవై త్వమసి** ఓ పూజ్యురాలవగు దేవతా నీవేనేనై ఉన్నాను. నేనే నీవై ఉన్నావు అని ఇట్లాగే ఉపాసించుతున్నారు. ఉపాసన చేసే వాడి కంటే అర్థాన్తరమైనవాడు బ్రహ్మ ఉపాసించేవాళ్ళు నేను అని తమను / ఉపాసించు తున్నవారు అనే విషయాన్ని ఎట్లా తెల్సుకుంటున్నారు అంటే గ్రాహయన్తి చ అని చెప్తున్నారు. పరస్పర విరోధము లేని అర్థాన్ని శాస్త్రాలు తెల్పుతున్నాయి. తెలుసుకొనేట్లు చేస్తున్నాయి. వాటిని ఉపపాదించుతున్నాయి అని అర్థము. **యఆత్మని తిష్ఠన్ ఆత్మనోఽన్తరోయమాత్మానవేద యస్మాత్మా శరీరం యఆత్మాన మన్తరో యమయతి సత ఆత్మాఽన్తర్యామ్యమృతః** అని. అదేవిధంగా **సమ్మూలాః సోమ్యేమాః సర్వాః ప్రజాః సదాయతనాః సత్ప్రతిష్ఠాః ఐతదాత్మ్యమిదంసర్వమ్.** ఓ సోమ్యుడా! ఈ ప్రజలందరూ సచ్ఛబ్దవాచ్యుడినే మూలకారణము – ఉపాదానకారణముగా కలవారు. సత్తు అనబడే ఆయనయందే ఆధారపడి ఉన్నారు. ఈ చరాచర ప్రపంచము అంతా ఈ సత్ శబ్దము చేత పిలువబడే వాడినే తమకు ఆత్మగా కలిగి ఉన్నది. **సర్వం ఖల్విదం బ్రహ్మ తజ్జలానితి** అనిన్నీ. చిదచిద్వస్తువంతా ఆయననుండే పుట్టినందువల్ల, ఆయనలో కలుస్తూ ఉన్నందువల్ల ఆయనచేత బ్రతికింపబడుతున్నందువల్ల ఆయనచేత నియమింప బడుతున్నందువల్ల, ఆయనకు శరీరమై ఉన్నందువల్ల ఈ అంతటికీ ఆయనయే ఆత్మ. అందువల్ల ఆయన నీకు ఆత్మ. కనుక ప్రత్యాగాత్మ తన శరీరానికి తాను ఆత్మఐనందువల్ల నేను దేవుడిని, నేను మనిషిని అని ఏ విధంగా తల్చుకుంటున్నాడో / తెల్సుకుంటున్నాడో ఆ విధంగానే ప్రత్యగాత్మ కూడా పరమాత్మ ఆత్మఐనందువల్ల అతడిని కూడా నేను అనియే అనుసన్ధానము చేయడము తగును అని. ఈ విధంగా శాస్త్రములచేత ఉపపాదింపబడినది కాబట్టి అందరి బుద్ధులూ / అన్ని బుద్ధులూ ఒక్క బ్రహ్మయందే నిల్చి ఉన్నందువల్ల అన్ని శబ్దాలూ బ్రహ్మ ఒక్కనియందే చెల్లుతున్నవి అని ఒప్పుకుంటున్నవారై **త్వంవా అహమస్మిభగవోదేవతే అహం వైత్వమసీ భగవోదేవతే** అని వ్యతిరేకముగా, అదల్ బదల్‌గా / ఒకదానికి మరొకటిగా చెప్పినారు. ఈ అంతటి మీద **అథయోఽన్యాందేవతాము పాస్తేఽన్యోఽసావన్యోఽహమస్మీతి నసవేద.** ఇక ఎవడైతే ఇతరమైన దానిని దేవతగా ఉపాసిస్తున్నాడో అతనికి జ్ఞానము ఏమీ లేదు. అతను ఎరుగడు. **సర్వంతం పరాదాత్ యోఽన్యత్రాత్మనః సర్వం వేద** ఆసమస్తాన్నీ పక్కకు పెట్టండి. ఎవడైతే ఆత్మ అనబడే పరమపురుషుడి కంటే వేరయినదిగా ఈ

సర్వాన్నీ భావిస్తున్నాడో అని పరమాత్మ కంటే వేరయినది ఉన్నదని తలచడాన్ని నిషేధించడము, **పృథక్ ఆత్మానం ప్రేరితారం చ మత్వా** తనను వేరుగా, తాను ఆయా పనులు చేయడంలో ఎవడు ప్రోత్సాహకుడుగా ప్రేరేపకుడుగా ఉన్నాడో అతడిని వేరుగా తెల్సుకొని అనే వాక్యము ప్రకారము పరస్పరము వేరు వేరు అని అనుసన్ధానము చేయుము అని విధించడమున్నూ విరుద్ధము కాదు. అహం (నేను) అని తనకు ఆత్మగా (స్వాత్మ తయా) అనుసన్ధానము చేయడం వల్ల వేరు అని అనుసంధానము చేయడాన్ని నిషేధించడమున్నూ కాపాడబడింది. తన శరీరానికంటే తనను అధికుడుగా అనుసన్ధానము చేయడం వలెనే, తనకంటే పరమాత్మను అధికుడుగా అనుసన్ధానము చేయడం వల్ల పృథక్త్వ అనుసన్ధాన విధానమున్నూ కాపాడబడింది. అధికుడైన బ్రహ్మ ప్రత్యగాత్మకు (జీవుడికి) ఆత్మ ఐనందువల్ల, ఆయనకున్నూ బ్రహ్మ శరీరమగుటవలన నిషేధవాక్యము నందు "**అకృత్స్నో హ్యేషః**" ఇతడు పూర్ణుడు కాడు. అకృత్స్నః – పూర్ణుడు కాడు. గుణాలు మాత్రమే పరమైతే పూర్తి నిండుదనము ఉండదు. గుణములతో విశిష్టుడైనప్పుడే పూర్తి అని చెప్పబడింది. అందువల్ల ఉపాసితఐనవానికి ఆత్మగా బ్రహ్మను ఉపాసించాలి అని అర్థము. **ఇది ఆత్మత్వోపాసనాధికరణము.**

★ ★ ★

## ఇక ప్రతీకాధికరణము.

సూ॥ **న ప్రతీకే నహిసః 4–1–4** ప్రతీకను ఆత్మనుగా తలచరాదు. ఉపాసించేవారికి ప్రతీక ఆత్మకాదు. **మనోబ్రహ్మేత్యుపాసీత** మనస్సును బ్రహ్మగా భావించి ఉపాసించాలి. **సయో నామ బ్రహ్మేత్యుపాసతే.** ఎవడైతే నామమును బ్రహ్మ అని ఉపాసించుతున్నాడో మొదలైన ప్రతీక ఉపాసనల యందు కూడా ఆత్మాను సంధానము చేయాల్నాలేక చేయవద్దా? అని విచారము కలిగితే **మనో బ్రహ్మేత్యుపాసీత** మనస్సునే బ్రహ్మగా ఉపాసించాలి అని బ్రహ్మోపాసనతో సమానముగా ఉన్నందున, బ్రహ్మ ఉపాసించేవాడికి ఆత్మఐనందువల్లనున్నూ ఆత్మ అనియే ఉపాసించాలి అని. పూర్వపక్షము సిద్ధమైతే చెప్పబడుతున్నది. నప్రతీకే అని. ప్రతీకయందు ఆత్మత్వాను సంధానము చేయకూడదు. నహిసః – ఉపాసించేవాడికి ప్రతీక ఆత్మ కాదు. ప్రతీక ఉపాసనలయందు ప్రతీకనే ఉపాసించదగినది. బ్రహ్మ కాదు. బ్రహ్మ ఐతేనో ఆ ప్రతీకయందు దృష్టికి విశేషణము మాత్రమే. దృష్టి అనగా భావన. చూచుట. ప్రతీకోపాసనమంటే బ్రహ్మ కాని దానియందు బ్రహ్మ అని తలచుకొని అనుసన్ధానము

చేయుట, ఆ ప్రతీక యందు ఉపాసింపదగిన ప్రతీకకు ఆత్మత్వము – ఆత్మకావడము – లేదు. కావున అట్లా అనుసన్ధానము చేయకూడదు.

ఏమండీ! ఇక్కడ కూడా బ్రహ్మనే ఉపాసింపబడేవాడు. బ్రహ్మకు ఉపాస్యత్వము ఉన్నప్పుడు అల్పశక్తులు అచేతనములు ఐన మనస్సు మొదలైన వాటిని ఉపాస్యములుగా ఆశ్రయించడము న్యాయము కాదు. అందువల్ల మనస్సు ఆది దృష్టితో బ్రహ్మనే ఉపాస్యుడు అని అంటే దానికి సమాధానాన్ని చెపుతున్నారు.

సూ॥ **బ్రహ్మ దృష్టిరుత్కర్షాత్ 4–1–5** మనస్సు మొదలైనవాటియందు బ్రహ్మగా దృష్టి పెట్టడమే మంచిది బ్రహ్మ యందు మనస్సు మొదలైనవాటినిగా దృష్టి పెట్టడము తగదు. బ్రహ్మ మనస్సు మొదలైనవాటికంటే గొప్పవాడు. అవేమో చాలా నీచమైనవి ఆయన దృష్ట్యా. గొప్పవాడైన రాజు నందు బంటుగా భావన చేయడం ప్రత్యవాయాన్ని (దోషాన్ని) కలుగచేస్తుంది. భృత్యుని యందు రాజు అనే భావన పెడితే మేలు కలుగచేస్తుంది. **ఇది ప్రతీకాధికరణము.**

★ ★ ★

## ఇక ఆదిత్యాది మత్యధికరణము.

సూ॥ **ఆదిత్యాది మతయ శ్చాంగ ఉపపత్తేః 4–1–06** క్రతువునకు అంగమైన ఉద్గీథాదుల యందు ఆదిత్యాది దృష్టినే చేయాలి. ఆదిత్యాదులే ఉత్కృష్టులు అనే విషయము పొసగుతున్నది. **య ఏ వాసౌ తపతి తముద్గీథము పాసీత.** ఈ తపించేవాడు ఎవడు ఉన్నాడో అతడిని ఉద్గీథముగా ఉపాసించాలి ఇత్యాది కర్మలకు అంగాలను ఆశ్రయించే ఉపాసనల యందు సంశయము కలుగుతున్నది. కర్మాంగమైన ఉద్గీథాదుల యందు ఆదిత్యాది దృష్టి చేయాలా లేక ఆదిత్యాదుల యందే ఉద్గీథాది దృష్టి చేయాల్నా అని. నికృష్టుని యందు – తక్కువ స్థాయి వ్యక్తియందు ఉత్కృష్ట దృష్టి చూపాలి అనే న్యాయము ప్రకారము ఉద్గీథాదులు ఫలాన్ని సాధించిపెట్టే కర్మలకు అంగము ఐనందున ఫలములు కాని ఆదిత్యాదుల కంటే ఉత్కృష్టులు ఐన ఆదిత్యాదుల యందు ఉద్గీథాధి దృష్టి చేయాలి. అని పూర్వపక్షము వస్తే సమాధానము చెప్తున్నారు. ఆదిత్యాది మతయశ్చాంగే అని. చశబ్దము అవధారణార్థములో క్రతువునకు అంగముఐన ఉద్గీథాదులయందు ఆదిత్యాది దృష్టినే చేయాలి. ఎందుకనగా? ఉపపత్తేః ఆదిత్యాదులే ఉత్ కృష్టులు అనడమే పొసగుతుంది కాబట్టి ఆదిత్యుడు

మొదలైన దేవతలను ఆరాధించడము ద్వారా కర్మలు కూడా ఫలసాధనాలవుతున్నవి. అందువల్ల ఉద్గీథాది అంగముల యందు ఆదిత్యాది దృష్టిని చేయవలెను. **ఇది ఆదిత్యాదిమత్యధికరణము.**

★ ★ ★

## ఇక ఆసీనాధికరణము.

సూ॥ **ఆసీనః సమ్భవాత్ 4-1-7** కూర్చొనియే ధ్యానమును చేయాలి. అప్పుడైతేనే కుదురుతుంది. మోక్షాన్ని సాధించిపెట్టేదిగా వేదాన్త శాస్త్రాలచేత, విధింపబడిన – జ్ఞానము ధ్యానము, ఉపాసన మొదలైన శబ్దాలచేత చెప్పబడేది. మాటిమాటికి అవృత్తము చేయబడుతున్నదైన సన్తత స్మృతి రూపమైనట్టిది అని చెప్పబడింది. అటువంటి ధ్యానాన్ని కూర్చొని, పడుకొని, నిలబడి, నడుస్తూ ఐనా చేయవచ్చు. భేదము ఏమీ ఉండదు కాబట్టి ఇట్లాగానే ధ్యానము చేయాలి అనే నియమము లేనందువల్ల ఏ తీరుగానైనా ధ్యానము చేయవచ్చును అని ఎదురు వాదము వస్తే చెప్పబడుతున్నది. అసీనః అని. కూర్చునియే ఉపాసనము చెయ్యాలి. ఎందువల్ల అంటే అట్లాగైతేనే ధ్యానము చేయడం కుదురుతుంది కనుక. కూర్చున్నవాడికి మాత్రమే మనస్సు ఏకాగ్రంగా ఉండడానికి అవకాశము ఉన్నది. నిల్చుండడము నడుస్తూ ఉండడాలకు ప్రత్యేక ప్రయత్నాలు అవసరము. ఇక పడుకొని గనుక ధ్యానము చేసేటట్లయితే నిద్ర వస్తుంది. పశ్చార్ధధారణ ప్రయత్నము – వెనుకకు ఆనుకొని ఉండాలనే ప్రయత్నము – ను నివారించడానికి సాపాశ్రయము నందు కూచోని ధ్యానము చేయాలి.

సూ॥ **ధ్యానాచ్చ 4-1-08 నిదిధ్యాసితవ్యః** అని ఉపాసన ధ్యానరూపమైనది కాబట్టి ఏకాగ్రమైన మనస్సు తప్పక ఉండాలి. ఏకాగ్రము ఒక్క విషయముపైననే కదలక మెదలక నిల్చి ఉండుట. ధ్యానము అంటే విజాతీయములు – చేస్తున్న పనికి భిన్నములైనవి – ఐన ప్రత్యయాలతో అన్తరాయము – ఎడము / మధ్యలో చొరబాటు లేకుండడము. ఒకే వస్తువును చిన్తించుతూ / తలుస్తూ ఉండడము అని చెప్పబడింది.

సూ॥ **అచలత్వం చాపేక్ష్య 4-1-9** ధ్యానము చేసేటప్పుడు మనస్సుతో పాటు శరీరము కూడా కదలక మెదలక ఉండాలి. అది అవసరము కాబట్టే పృథివీ అన్తరిక్షము మొదలైనవాటియందు ధ్యానము చేస్తున్నట్లు ఉన్నవి అని చెప్పడం కనిపిస్తున్నది. **ధ్యాయతీవ పృథివీ; ధ్యాయతీవాన్తరిక్షమ్. ధ్యాయతీవద్యౌః ధ్యాయన్తీవాఽపః.**

**ధ్యాయన్తీ వపర్వతాః.** భూమి, ఆకాశం, ద్యులోకము, నీళ్ళు, కొండలు ధ్యానము చేస్తున్నట్లుగా ఉన్నవి. అని ప్రయోగాలు ఉన్నవి. కావున పృథివీ పర్వతాదుల వలె ఏకాగ్ర చిత్తంతో నిశ్చలంగా ఉండడము కూర్చున్న ఉపాసకుడికే సాధ్యమవుతుంది.

సూ॥ **స్మరన్తిచ 4-1-10** కూర్చున్నవాడికే ధ్యానము సాధ్యమవుతుందని స్మృతులు చెప్పుతున్నవి. శ్లో॥ **శుచౌదేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసనమాత్మనః। నాత్యుచ్ఛ్రితమ్ నాతినీచం చేలాజిన కుశోత్తరమ్। తత్రైకాగ్రం మనఃకృత్వా యతచిత్తేన్ద్రియక్రియః। ఉపవిశ్యాఽ సనే యుంజ్యాత్ యోగమాత్మ విశుద్ధయే.**

**తా॥** పరిశుభ్రమైన ప్రదేశములో మరీ ఎత్తు కాకుండా మరీ దిగువకు కాకుండా దర్భలు దానిపైన వస్త్రము, దానిపైన జింకచర్మములను పర్చుకొని ఆ ఆసనముపైన కూర్చొని మనస్సు, ఇంద్రియాలయొక్క పనులను మాని మనస్సును ఒక్కవిషయము పైననే నిలిపి ఉంచి యోగమును చేయాలి. ఇది ఆత్మ (మనస్సు) శుద్ధికి అవసరము అని భగవద్ గీత యందు చెప్పబడింది.

సూ॥ **యత్రైకాగ్రతా తత్రావిశేషాత్ 4-1-11** ఏకాగ్రతకు మించిన దేశము కాలముల యొక్క విశేషాలు ఇవి అని వినిపించలేదు కాబట్టి ఏకాగ్రతకు అనుకూలమైన ఏ దేశము కాలము ఉన్నదో అదే ఉపానను చేసేవానికి తగినదేశము కాలము. **సమే శుచౌ శర్కరావహ్ని వాలుకావర్జితే** చదునుగా, పరిశుభ్రంగా, గులకరాళ్ళు వేడిమి ఇసుక వంటివి లేని ప్రదేశములో అని చెప్పడము ఏకాగ్రతకు బాగా అనుకూలమైన దేశాన్ని చెపుతున్నది. కాని ఈ ప్రదేశములోనే అని పేరెత్తి చెప్పి నియన్త్రించడం లేదు. వాక్యము యొక్క చివరలో **మనోఽనుకూలే** మనస్సుకు నచ్చినచోట అని ఉన్నది కాబట్టి. **ఇది ఆసీనాధికరణము.**

★ ★ ★

## ఇక ఆప్రయాణాధికరణము.

సూ॥ **ఆప్రయాణాత్ తత్రాపిహి దృష్టమ్ 4-1-12** ఈ ఉపాసనను మరణము కలిగేంతవరకూ కొనసాగించాలి అది ఆరంభింప బడిన నాటి నుండి మధ్యకాలములో కూడా కనిపిస్తున్నది. ఈ విధంగా అపవర్గానికి (మోక్షానికి) సాధనమైనట్టిది చెప్పబడిన లక్షణాలు గలది ఐన ఉపాసనను ఒక్కనాడే ఆచరించాల్నా? లేక శరీరాన్నుండి బయలుదేరి పోయేంతవరకు ప్రతిదినమూ కొనసాగించాల్నా? అని

సన్దేహము తల ఎత్తితే శాస్త్రార్థము ఒక్కనాడే చేయబడింది కాబట్టి అంతటి తోనే ముగించాలని సిద్ధమైంది. దానికి సమాధానము ఆప్రయాణాత్ అని చెప్పబడుతున్నది. అనగా మరణము కలిగేంతవరకూ ఉపాసనను చేయవలెను. ఎందుకని అంటే తత్రాపి హిదృష్టమ్ – ఉపాసనకు పూనుకున్నది మొదలు మరణము వరకు ఉండే కాలమేది ఉన్నదో ఆ నడుమ కాలమంతా ఉపాసన చేయబడడము కనిపిస్తున్నది. **సఖల్వేవం వర్తయన్ యావదా యుషం బ్రహ్మలోకమభి సమ్పద్యతే ఇతి** అతడు ఈ విధంగా ఆయుష్యము ఉన్నంతవరకూ నడుపుకొంటూ బ్రహ్మ లోకానికి చేరుకుంటున్నాడు అని శ్రుతివాక్యమున్నది. **ఇది ఆ ప్రయాణాధికరణము.**

★ ★ ★

## ఇక పైన తదధిగమాధికరణము.

సూ॥ **తదధిగమః ఉత్తర పూర్వాఘయోః అశ్లేషవినాశౌతద్వ్యప దేశాత్ 4–1–13** బ్రహ్మ విద్యను పొందితే పురుషుడికి ఆ విద్య యొక్క మహిమ వలన ఉత్తర పూర్వాఘములు అంటకపోవడము, నాశనమై పోవడము జరుగుతవి. అట్లాగని చెప్పినందువల్ల. ఈ విద్యా స్వరూపాన్ని ఇంతకు మునుపు చెప్పినట్లు శోధించి ప్రస్తుతము విద్య యొక్క ఫలాన్ని చింతించడానికి పూనుకొంటున్నాడు. బ్రహ్మ విద్య లభించితే పురుషుడి యొక్క తొలుతటి పాపాలు, తరువాత పాపాలు నశించడము, అంటకుండా పోవడమున్నూ జరుగుతవి. అని వినిపిస్తున్నది. **తద్యథా పుష్కరపలాశ ఆపోనశ్లిష్యన్తే, ఏవమేవం విది పాపం కర్మన శ్లిష్యతే.** అది ఎట్లాగంటే తామరాకుకు పైన నీళ్ళు అంటవో ఆ తీరుగానే ఈ పరమాత్మ యొక్క స్వరూపాన్ని తెల్సుకుని ఉపాసించేవాడిని పాపపు కర్మ తాకదు. **తస్యైవాత్మా పదవిత్తం విదిత్వా నకర్మణా లిప్యతే పాపకేన** ఈ తీరున ఆ పరమపురుషునియొక్క పాదపద్మాలను తెల్సుకొని ఉపాసించి పాపపు కర్మలతో అంటుబడడు పరమాత్మకు చెందిన జ్ఞానాన్ని(బ్రహ్మవిద్యను) పొందిన తరువాత జరిగిన పొరపాట్ల వల్ల కలిగిన పాపాలు (ఉత్తరాఘాలు) అంటుకొనవు. **తద్యథా ఇషీ కతూలమగ్నౌప్రోతం ప్రదూయేత ఏవం హాస్యసర్వేపాప్మానః ప్రదూయన్తే.** రెల్లు దూదిని అగ్నిలో వేసితే ఎట్లా మాడిమసి ఐపోతుందో అట్లాగే ఈ బ్రహ్మోపాసకుని యొక్క అన్ని పాపాలు నామరూపాలు లేకుండా నశించిపోతవి. **క్షీయన్తే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే.** అందరికన్నా, అన్నింటిలో, మిన్న ఐన ఆ పురుషోత్తముడిని దర్శించినవాడికి అన్ని కర్మలు అడుగులేకుండా తరిగిపోతవి. అని బ్రహ్మను పొందడానికి జ్ఞానాని కన్న

ముందరివైన పాపాలు (పూర్వాఘాలు) నశించిపోతవి. ఈ అశ్లేషము, వినాశాలు బ్రహ్మ విద్యయొక్క ఫలములు అనడం పొసుగుతుందా? పొసగదా? అని సంశయము. ఏది తగును అని అంటే పొసగవు అనడమే సరి. ఎందువల్లనంటే **నా భుక్తం క్షీయతే కర్మకల్పకోటిశతైరపి.** కల్పాలు కోటి సంఖ్యగలవి గడచిపోయినా సరే తను చేసిన పుణ్యపాపరూపకర్మ అనుభవించక తరిగిపోదు. ఇత్యాదిగా ఉన్న శాస్త్రముతో విరోధము వస్తుంది కాబట్టి, ఐతే ఇంతకుముందు చూపిన అశ్లేష వినాశాలు మోక్షసాధనమైన విద్యను విధించే వాక్యశేషమునందున్నట్టివి. ఎట్లాగో ఒకట్లాగ విద్యాస్తుతికి చెందినవి అని ప్రతిపాదించినట్లయితే పొసగుతవి. ఐతే విద్యపూర్వోత్తరాఘములకు ప్రాయశ్చిత్తముగా విధింపబడడము లేదు. ఐనప్పుడు ప్రాయశ్చిత్తముతో పాపాల వినాశము చెప్పబడుతుంది. విద్య కదా! **బ్రహ్మవిదాప్నోతి పరమ్, బ్రహ్మవేద బ్రహ్మైవభవతి.** అని బ్రహ్మను చేరుకొనే మార్గముగా విధింపబడుతున్నది. అందువల్ల ఈ పాపాల వినాశనము, అంటకపోవడాలను గురించి చెప్పడము అర్థవాదము – (విద్యను పొగిడేది మాత్రమే). అని ఈ విధంగా పూర్వపక్షము ప్రాప్తిస్తే సమాధానము చెప్పబడుతున్నది. తదధిగమే అని. విద్యాప్రాప్తి కలిగిన పురుషుడికి విద్య యొక్క మహిమ వలన ఉత్తర పూర్వాఘముల యొక్క అశ్లేషము వినాశములు జరుగడం పొసగుతుంది. ఎందువల్లనంటే ఇటువంటిదిగా విద్యామహాత్మ్యము తెలియవస్తున్నది. **ఏవం విది పాపంకర్మనశ్లిష్యతే 2) ఏవం హాస్యసర్వేపాప్మానః ప్రదూయన్తే** ఇత్యాదులైన వాక్యాలవల్ల.

**నాభుక్తం క్షీయతేకర్మ** అనే శాస్త్రముతో దీనికి విరోధము వస్తుంది కదా అని అనగూడదు. అది వేరే విషయానికి చెందింది. ఆ వాక్యము కర్మలయొక్క ఫలాన్ని పుట్టించే సామర్థ్యాన్ని గట్టి చేసే విషయానికి సమ్బన్ధించింది. ఇదేమో పుట్టిన విద్య అంతకుమునుపు చేసిన పాపాలయొక్క ఫలజనన సామర్థ్యాన్ని నశింపచేసే శక్తిని మరియు పుట్టబోయే కర్మలయొక్క ఫల జనన శక్తిని పుట్టకుండా అడ్డగించగల సామర్థ్యాన్నిన్నీ ప్రతిపాదిస్తున్నది. కాబట్టి రెండు వాక్యాలయొక్క విషయము వేరువేరు అవుతున్నది. ఎట్లాగంటే అగ్ని జలములకు వేడిమి, దాన్ని నివారించగల సామర్థ్యాలకు చెందిన విషయాలు రెండింటికిన్నీ, వాటిని తెలిపే ప్రమాణాలకున్నూ విషయభేదముండడాన్ని బట్టి రెండూ ప్రమాణాలు అవుతున్నట్లుగానే ఇక్కడ రెండు విషయాలు వేర్వేరు కాబట్టి విరోధము లేదు.

పాపాన్ని అంటకుండా చేయడము – వైదిక కర్మను చెయ్యడానికి వీలు గాకుండా అయోగ్యత, వాసన, ప్రత్యవాయానికి కారణము ఐన శక్తి ఉత్పత్తికి అడ్డంకులు ఏర్పర్చడమును అఘస్య అశ్లేషకరణము అని అంటారు. పురుషుడికి అతడు అంతకుముందు చేసిన పాపాలు వైదిక కర్మ అయోగ్యతను తనతో సమానమైన మరొక పాపకర్మను ఆరంభించడములో కోరికను పుట్టించడము, అందువల్ల ప్రత్యవాయమును (దోషాన్ని) కలుగచేస్తవి.

అఘస్య వినాశకరణము / పాపాన్ని నశింపచేయడము – పుట్టినట్టి పాపము యొక్క శక్తిని లేకుండా చేయడము – (వినాశకరణము) అటువంటి శక్తి ఏది? అని అంటే వాటియందు పరమపురుషునికి ప్రీతి లేకపోవడమే. అందువల్ల ఈ విధంగా విద్య తెల్సినవాడికి వేద్యమైన అర్థము – తెల్సుకోదగిన అంశము / భగవన్తుడు మిక్కిలి ప్రియమైన వాడు కావడం వల్ల, విద్య తాను కూడా ఉపాసకుడికి నిరతిశయమైన ప్రీతిపాత్రమవుతూ వేద్యుడైన పరమపురుషుని యొక్క ఆరాధన స్వరూపము కలదై, ఉపాసకుడు తొలుత చేసిన పాపముల రాశి నుండి పుట్టిన పరమ పురుషుని యొక్క అప్రీతిని లేకుండా చేస్తుంది. ఆ విద్యనే తాను పుట్టిన తరువాత కాలములో కలుగబోయే పాపముల కారణంగా పరమ పురుషునిలో పుట్టబోయే అప్రీతిని పుట్టకుండా అడ్డుకుంటుంది. ఐతే ఈ అశ్లేషవచనము ప్రామాదికములైన కర్మల వలన పుట్టినదానికి చెందినదిగా తలచాలి. **నావిరతోదుశ్చరితాత్ చెడునడతలను మానుకొననివాడు.** ఇత్యాదివాక్యాల చేత చనిపోయేంత వరకు ప్రతిదినమూ పుట్టేటువంటి పోను పోనూ మరింత ఎక్కువ అవుతూ ఉండే విద్య చెడు నడవడికల నుంచి విరమించినప్పుడే పుడుతున్నదని తెలుస్తున్నది. **ఇది తదధిగమాధికరణము.**

★ ★ ★

## ఇక ముందు ఇతరాధికరణము.

సూ॥ **ఇతరస్యాప్యేవమసంశ్లేషః పాతేతు 4-1-14** పాపానికి వ్యతిరేకమైన పుణ్యముకూడా అది ముందరిది ఐనా తర్వాతిది ఐనా సరే ఈ పాపము వలెనే అశ్లేషవినాశాలను పొందుతుంది. శరీరము పడిపోతే మాత్రము అవి నశిస్తాయి. విద్య వల్ల ఉపాసకుని యొక్క ముందు వెనుకల పాపాలు అశ్లేష వినాశాలను పొందుతవి అని చెప్పబడింది. ఇతరస్య – పుణ్యమునకు కూడా, ఏవమ్ – చెప్పిన

న్యాయము ప్రకారము విద్య వల్ల అశ్లేష వినాశాలు జరుగుతవి. విద్యా ఫలానికి విరోధి కావడమనేది పాపపుణ్యాలు రెండింటికీ సమానమే. అట్లాగని చెప్పడము వల్లనున్నూ. సుకృత దుష్కృతాలను రెండింటినీ ఉద్దేశించి **సర్వేపాప్మానోఽతో నివర్తనే** ఈ బ్రహ్మ విద్యా ఉపాసన వలన ఇతడి నుండి పాపాలన్నీ తొలగిపోతవి. అని నిర్దేశము. **తత్ సుకృతదుష్కృతే ధూనుతే.** ఆ కారణంగా పుణ్యపాపాలను రెండింటినీ దులిపి వేసుకుంటాడు. అనిన్నీ నిర్దేశము – పేర్లు ఎత్తి చెప్పడము ఉన్నది. మోక్షాన్ని పొందాలని కోరుకునే వానికి పుణ్యఫలము కూడా నచ్చనిదే కాబట్టి సుకృతాన్ని కూడా పాప శబ్దముతో చెప్పినారు. సుకృతము కూడా శాస్త్రీయమైనదే కాబట్టి దాని ఫలముపై కొందరికి ఇష్టము ఉన్నందువల్ల, ఆ ముచ్చట బయటపడ్తున్నది కాబట్టి విద్యతో అవిరోధ శంకను తొలిగించడానికి అతిదేశము చేసుకున్నారు. విద్వాంసుడికి కూడా ఇతి కర్తవ్యతతో కూడిన ఉపాసనను నిర్వర్తించడానికి వర్షములు కురవడము, పంటలు సమృద్ధిగా పండి ఆహారము ఇబ్బడి ముబ్బడిగా పొందడమున్నూ ఇష్టాలే కదా ఐనప్పుడు అవి విద్యతో విరోధమున్నందువల్ల నశించుతాయి అనడం ఎట్లా ఒప్పుతుంది అని అనకూడదు. ఆ విషయంలోనే పాతేతు అని చెప్పినారు. శరీరము కూలిపోయినప్పుడు అవి – వృష్ట్యన్నాదులు నశించి పోతవి అని. శరీరపాతము ఐన తరువాత విద్యకు అనుగుణమైన అదృష్టఫలాలు అనగా సుకృతాలు నశించుతవి అని అర్థము. **ఇది ఇతరాధికరణము.**

★ ★ ★

## ఇంక అనారబ్ధకార్యాధికరణము.

సూ॥ **అనారబ్ధ కార్యే ఏ వతు పూర్వే తదవధేః 4-1-15** బ్రహ్మ విద్య పుట్టడానికి ముందు ఉన్నటువంటి సుకృత దుష్కృతాలే తమవైన ఫలాలను అనుభవింపచేయడానికి పూనుకోనినవే నశించుతవి. వాటికి హద్దు శరీరము నశించి పోవడముతో ముగుస్తుంది కనుక. బ్రహ్మ విద్య ఉత్పత్తి కావడానికి ముందు వెనుకల్లో అనుభవింపవలసిన సుకృత దుష్కృతాలు అశ్లేష వినాశాలను పొందుతవి అని చెప్పినారు. ఐతే దానికంటే ముందున్న పాపపుణ్యాలు తేడా ఏమీ లేకుండా నశించిపోతాయా? లేక అనారబ్ధకార్యములు – తమ పనిని చేయడం ఆరంభించనివేనా? అని సందేహము కలిగితే **సర్వేపాప్మానః ప్రదూయన్తే** పాపాలన్నీ నశించిపోతవి అని వినిపించుతున్నందువల్ల, మరియు విద్య ఉత్పత్తి ఐన తరువాత కూడా శరీరము నిల్చి ఉంటున్నందువల్లనున్నూ కుమ్మరివాని

సారే (చక్రము) తిరిగినట్లు పూర్వ సంస్కారము ప్రకారము జీవనము కొనసాగడానికి అవకాశము ఉన్నందువల్ల అవిశేషముగానే – మిగులు ఏమీ లేకుండానే పుణ్యపాపాలు రెండూ నశించుతవి అని పూర్వపక్షము వస్తే చెప్పబడుతున్నది. అనారబ్ధ కార్యే ఏవతు పూర్వే అని. విద్య కలుగడానికి ముందరివైన ఫలములను ఇవ్వడం మొదలుపెట్టని సుకృత దుష్కృతాలే – విద్య వల్ల నశించుతవి. ఎందువల్లనంటే తదవధేః అదే అవధి కనుక – **తస్యతావదేవ చిరమ్. యావన్న విమోక్ష్యే అథ సమ్పత్స్యే.** ఆ మోక్షము పొందడానికి శరీరము పడి పోవడమే ఆలస్యము. ఎంతవరకు విడిపోనో అంతవరకు ఇక్కడే ఉంటాను. ఆకాస్త జరిగిందా. ఇక ఆలస్యము లేదు పరమాత్మను చేరుకుంటాను అని శరీరము పడిపోవడమే ఆలస్యము అని అవధి – గడువు వేదముచే చెప్పబడుతున్నది. పుణ్యాపుణ్య కర్మల వలన పుట్టిన భగవన్తుని ప్రీతి అప్రీతులకు వ్యతిరేకంగా / భిన్నముగా శరీరము నిలువడానికి కారణమైన సంస్కారము కొనసాగుతుందని అనడానికి ప్రమాణము లేదు. **ఇది అనారబ్ధ కార్యాధికరణము.**

★ ★ ★

## ఇక పైన అగ్ని హోత్రాద్యధికరణము.

సూ॥ **అగ్నిహోత్రాది తు తత్ కార్యాయైవ తద్దర్శనాత్ 4-1-16** అగ్నిహోత్రాది ఆశ్రమధర్మాలు ఫలముతో అశ్లేషము – అంటకపోవడము – కుదురదు కనుక అనుష్ఠించవలసినవే. ఆ విషయము కనిపించుతున్నది. **ఇతరస్యాऽప్యేవమసంశ్లేషః** అనే సూత్రము వద్ద విద్యాబలము చేత పుణ్యఫలము కూడా బ్రహ్మవేత్తతో అశ్లేషాన్నే పొందుతుంది అని చెప్పబడింది. నిత్యనైమిత్తికాలు ఐన అగ్నిహోత్రాదులు అవి ఆశ్రమధర్మాలు ఐనా తాను చేసేవే కాబట్టి వాటి ఫలాలతో అశ్లేషము వల్ల ఏవగింపుతో అనుష్ఠానము చేయకపోయినట్లయితే కర్తవ్యము ఏమిటో విశదీకరించుతున్నారు. అగ్నిహోత్రాదితు అని. తు శబ్దము ఇతరములైన సుకృతాలను గురించి విశేషము చెప్పడం కొరకు. (విశేషణార్థః) అగ్నిహోత్రము మొదలైన ఆశ్రమధర్మాలు ఫలములతో అంటు (శ్లేషము) లేకపోవడం వల్ల అనుష్ఠించాల్సినవే. వాటితో అశ్లేషానికి కారణము ఏమిటంటే అగ్నిహోత్రాదులు విద్యోత్పత్తికి కారణాలు అవుతున్నవి కనుక. విద్య అనే కార్యము కొరకే గదా విద్వాంసుడు అగ్నిహోత్రాదులను అనుష్ఠించుతున్నాడు. ఇది ఎట్లా తెలుస్తున్నదంటే తద్దర్శనాత్ కనిపించడం వలన. **తమేతం వేదానువచనేన బ్రాహ్మణాః వివిదిషన్తియజ్ఞేనదానేన తపసాऽనాశకేన** ఇత్యాది వాక్యాల ద్వారా అగ్నిహోత్రాదులు

విద్యాసాధనాలు అని తెలుస్తున్నది కనిపిస్తున్నది. విద్య మరణము వరకు ఆచరించుట వలన మరింతగా పెరిగిన అభ్యాసాధేయాతిశయము కలది అయ్యి ప్రతిదినమూ కొత్తకొత్త చిగుళ్ళను వేస్తున్నందువలన దాని పుట్టుక కోసము ఆశ్రమకర్మలను కూడా ప్రతిదినమూ ఆచరించాల్సిందే. కాని తీరుకు ఆశ్రమకర్మలోపము ఏర్పడి అన్తఃకరణము దూషితము కావడంవల్ల విద్యోత్పత్తే లేకుండా పోతుంది.

ఒకవేళ అగ్నిహోత్రము మొదలైన సత్ కర్మలు విద్యోత్పత్తి కొరకు ఆచరించవలసినటువంటివి. విద్యోత్పత్తి కంటే ముందటి పుణ్యము **యావత్ సమ్పాత ముషిత్వా** శరీరము పడిపోయేంతవరకు ఉండి **ప్రాప్యాన్తం కర్మణః** కర్మయొక్క పొలిమేరదాటి అని చెప్పినట్లు అనుభవము చేత నశించిపోయింది. ఇక ప్రారబ్ధఫలము అనుభవించగా ఇంకా కొంత మిగిలే ఉన్నది. **సుహృదః సాధుకృత్యామ్** మంచి మనస్సు కల మిత్రులు అతనియొక్క సత్ కర్మ విశేషాన్ని / పుణ్యాన్ని పొందుతున్నారు. అని చెప్పినపుడు ఆ వాక్యానికి చెప్పదల్చుకొన్న విషయము ఏమిటి? అంటే చెప్తున్నారు.

సూ॥ **అతోఽన్యాఽపిహ్యేకేషాముభయోః 4-1-17** ఈ అగ్నిహోత్రాది కర్మకంటే వేరయిన సుకృతము ఇంకొంత ఉండనే ఉంటుంది. దానికి సమ్బన్ధించిన శ్రుతి ఒకరి శాఖలో వినిపిస్తున్నది. విద్యవల్ల అశ్లేష వినాశాలు కల్గుతాయి అని చెప్పే శ్రుతి కూడా వాటికి సమ్బన్ధించిందే. అతః = అగ్నిహోత్రము మొదలైన సాధుకృత్యము కంటే విద్యోత్పత్తి కోసము ఐన దానికంటే, అన్యాఽపిఽవిద్యాధిగమానికంటే పూర్వోత్తరములు ఐన పుణ్యకర్మలు ప్రబలమైన మరొక్క కర్మచేత అడ్డగింపబడి నిల్చి పోయినటువంటిది ఐన సాధుకృత్యము అనన్తమైనది – ముగియనట్టిది – ఇంకా మిగిలి ఉంటుంది. దానికి సమ్బన్ధించినది ఒకానొక వేద శాఖ వారి ఈ వచనము. **తస్యపుత్రాః దాయము పయన్తి. సుహృదఃసాధు కృత్యామ్.** చనిపోయిన బ్రహ్మవేత్త యొక్క కొడుకులు ఆస్తిలో భాగాన్ని పొందుతారు. స్నేహితులు పుణ్యఫలాన్ని పొందుతున్నారు అని. విద్య చేత అశ్లేష వినాశాలు కలుగుతాయి అనే శ్రుతికూడా ఆ పుణ్యకర్మకు చెందినదే.

అనుష్ఠింపబడిన కర్మ ఫలముతో ప్రతిబన్ధ సమ్భవము – సమ్బన్ధాన్ని కల్గి ఉండడము గురించి ఇంతకుముందు చెప్పినదాన్ని గుర్తుచేస్తున్నాడు.

సూ॥ **యదేవ విద్యయేతి హి 4-1-18 యదేవ విద్యయాకరోతి తదేవ వీర్యవత్తరమ్** అని ఉద్గీథ విద్యకు క్రతుఫలముతో సమ్బన్ధము లేదు. దాని ఫలము

వేరుగానే ఉన్నది అని చెప్పినందువల్ల అనుష్ఠితమైన కర్మకు కూడా ఫలముతో ప్రతిబన్ధము సూచింపబడుతున్నది కదా? అందువలన ఇది విద్వాంసుడు – బ్రహ్మవేత్త – అనుష్ఠించిన ప్రతిబద్ధ ఫలాన్ని గూర్చిన విషయము. సుహృదః సాధుకృత్యామ్ అనే మాట శాట్యాయనుడి అభిప్రాయానికి చెందింది. **ఇది అగ్నిహోత్రాద్యధికరణము.**

★ ★ ★

## ఇక ఇతరక్షపణాధికరణము

సూ॥ **భోగేనతు ఇతరే క్షపయిత్వాఽథ సమ్పద్యతే 4-1-19** ప్రారంభించబడిన పుణ్యపాప ఫలాలను అనుభవించిన పిదపనే పరమాత్మ సన్నిధికి చేరుకుంటారు. ఏ పుణ్యపాపాలకు అశ్లేష వినాశాలు చెప్పబడినాయో వాటికంటే వేరుగా ఉన్న ఆరంభింపబడిన కార్యములు గలవి ఐన పుణ్యపాపాలు (అనుభవించుతున్నట్టివి) – విద్య పుట్టిన శరీరము యొక్క చివరలోనా? లేక ఆ శరీరము యొక్క అవధి ముగిసిన తరువాతనేనా? అది కాకుంటే మరొక శరీరము పొందినాక దాని చివరలోనా? ఎప్పుడు అవి నాశనమును పొందుతాయి? ప్రారబ్ధకర్మల ముగింపు ఎప్పుడు? వాటికి నియమము లేదా? అని సంశయము కలిగింది. **తస్య తావదేవ చిరం యావన్న విమోక్ష్యే. అథసమ్పత్స్యే.** అని ఆ శరీరము యొక్క అవసానములో అని వినిపించుతున్నది కాబట్టి ఆ శరీరము యొక్క చివరలోనే అని సమాధానము రాగా చెప్పబడుతున్నది భోగేనతు అని. తు శబ్దము పక్షాన్ని తిప్పికొట్టడం కొరకు. ఇతరే – తమ ఫలాలను ఇవ్వడాన్ని మొదలుపెట్టిన పుణ్యపాపాలను వాటియొక్క ఫలాలను అనుభవించి **ముగింపు చేసుకొని** ఆ తరువాత బ్రహ్మను చేరుకుంటాడు. ఆ ఆరబ్ధపుణ్యపాప ఫలాలు ఒక్క శరీరముతో అనుభవింపబడేవి మాత్రమే ఐతే ఆ శరీరము యొక్క అవసానము నందే బ్రహ్మను చేరుకుంటాడు. అనేక శరీరాలలో అనుభవించదగిన ఫలాలు ఉన్నట్లయితే వాటి చివరలోనే బ్రహ్మప్రాప్తి కల్గుతుంది. ప్రారబ్ధకర్మఫలాలు అనుభవము ద్వారానే ముగింపు చేసుకోదగినవి. తస్య తావదేవ చిరం యావన్న విమోక్ష్యే అనే వాక్యమున్నూ భోగముచేత మాత్రముగానే ఆ కర్మల విమోక్షము కల్గుతుంది అని చెప్పుతున్నది. కారణము ఏమిటంటే దేహావధి నియమమే. అది వినిపించుతున్నది కదా!

అందువల్ల ఈ విధంగా బ్రహ్మవిద్యకంటే ముందు ఆచరించబడినట్టిది, ఫలానుభవము కానిది, అనారబ్ధఫలము ఐన పుణ్యపాపరూపమైన కర్మ అనాదికాలముగా

పోగుచేసి కూడబెట్టుకున్నది. అనన్తము ఐనట్టిది అగు కర్మమాత్రమే విద్యయొక్క మహిమవల్ల నశించిపోతుంది. విద్యను ఆరంభించిన కాలము తరువాత అనుష్ఠించబడినట్టిది మాత్రము తాకదు. అంటుకోదు. ఆ ముక్తుని / బ్రహ్మవేత్త యొక్క పుణ్యరూపమైన కర్మను ఆయన మిత్రులందరూ పుచ్చుకుంటారు. పాపాన్నేమో శత్రువులు తీసుకుంటారు. కనుక తప్పేమీ లేదు. **ఇది ఇతరక్ష పణాధికరణము.**

**ఇంతటితో శ్రీభాష్యమునందు చతుర్థాధ్యాయములోని**
ప్రథమపాదము ముగిసినది.

శ్రీమతే రామానుజాయనమః

## శ్రీభాష్యము – చతుర్థాధ్యాయము – ద్వితీయపాదము

### వాగధికరణము

సూ॥ **వాక్ మనసి. దర్శనాత్ శబ్దాచ్చ 4–2–1** ఇపుడు బ్రహ్మ విద్యా ఉపాసకుడు బ్రహ్మలోకానిపోయేగతి ప్రకారాన్ని విచారించడానికి పూనుకుంటున్నాడు. ముందుగా ఉత్క్రాన్తి – శరీరాన్నుండి జీవుడు లేచిపోవడము చిన్తింపబడుతున్నది. ఆ విషయములో ఇది ఉపదేశింపబడుతున్నది. **అస్యసోమ్య పురుషస్యప్రయతోవాక్ మనసి సమ్పద్యతే మనః ప్రాణే ప్రాణస్తేజసి, తేజః పరస్యాందేవతాయామ్ ఇతి.** ఓ సోమ్యుడా! ఈ విధంగా బయలుదేరి పోతున్న పురుషునియొక్క వాక్కు / మాట మనస్సునందు కలుస్తున్నది. మనస్సు ప్రాణము నందు కలుస్తున్నది అని. ఇక్కడ వాక్ మనసి సమ్పద్యతే అని వాక్కు మనస్సులో కలువడము వాక్ వృత్తికి మాత్రమే చెందిందా? లేక వాక్కునకు మాత్రమే చెందినదా? అని సంశయము కలుగుతున్నది. దీనికి సమాధానము వృత్తి మాత్రవిషయమే అని. ఎందువల్లనంటే మనస్సు వాక్కుకు ప్రకృతికాదు గనుక మనస్సులో వాక్స్వరూపసమ్పత్తి కుదరదు. వాక్కు మొదలైన వృత్తులు – వ్యాపారాలు (క్రియలు) మనస్సుకు లొంగి ఉంటున్నందున వృత్తి సమ్పత్తి వాక్యము ఎట్లాగో ఒకట్లాగా చెల్లుతుంది అని పూర్వపక్షము రాగా చెప్పబడుతున్నది. వాక్ మనసి అని. వాక్కుయొక్క స్వరూపమే మనస్సును చేరుకుంటున్నది. ఎందువల్లననగా దర్శనాత్

– కనిపించుతున్నందువలన. వాగింద్రియము పనిచేయకుండా మనఃప్రవృత్తి కనిపిస్తున్నది. అంటే మాట పడిపోయినా ఏదో మాట్లాడాలని ప్రయత్నం చేస్తూ తపన పడడం కనిపిస్తున్నది కదా! అని. వృత్తి మాత్రమే మనస్సును చేరినా అది కుదురుతుంది అని అంటే ఆ విషయంలో చెప్పుతున్నాడు శబ్దాచ్చ అని. వాక్ మనసి సంపద్యతే అని వాక్ స్వరూపము సమ్పన్నము ఐనప్పుడే శబ్దము వస్తుంది. వృత్తి మాత్రమే సమ్పన్నము ఐనప్పుడు కాదు. అపుడు వృత్తి ఉడిగిపోతే వాగింద్రియము మరొక ప్రమాణము చేత తెలియరాదు. అపుడు మాత్రమే సంపద్యతే అని చెప్పవచ్చును. మనస్సు వాక్కుకు ప్రకృతి కాదు కాబట్టి వాక్కు మనస్సు(తో)లో చేరడం పొసగదు అని ఏమాట అన్నారో అది వాక్ మనసి సంపద్యతే అని చెప్పినందువల్ల **"మనస్సుతో వాక్కు సంయోగము చెందుతుంది. కాని దానిలో లీనము కాదు"** అని పరిహారమును చెప్పుకోవాలి.

సూ॥ **అత ఏవసర్వాణ్యను 4-2-2** ఎందువల్ల మనస్సుతో కలయిక మాత్రమే సమ్పత్తి అనబడుతున్నదో లయము కాదో అందువల్లనే వాక్కును అనుసరించి తక్కిన అన్ని ఇంద్రియాలు కూడా మనస్సుతో సమ్పత్తిని చెప్పే శ్రుతి సబబు అవుతున్నది. **తస్మాదు పశాన్తతేజాః పునర్భవమ్ ఇంద్రియైః మనసి సమ్పద్యమానైః ఇతి.** ఆ శరీరాన్నుండి తరిగిపోయిన కాన్తి గలవాడైన జీవుడు వెడలిపోయి మనస్సుతో కూడి ఉన్న ఇంద్రియాలతో పాటు తిరిగి మరొక శరీరములో దూరి జన్మనెత్తుతున్నాడు అని. **ఇది వాగధికరణము.**

★ ★ ★

## ఇక మనోఽధికరణము

సూ॥ **తన్మనః ప్రాణ ఉత్తరాత్ 4-2-3** ఆ విధంగా అన్ని ఇంద్రియాలతో కూడి ఉన్న మనస్సు ప్రాణము నందు కలుస్తున్నది. అనగా ప్రాణములో సంయోగాన్ని పొందుతున్నది. మనోవృత్తి మాత్రమే కాదు. ఎందువల్ల నంటే ఉత్తరాత్ – తరువాతిదైన **మనః ప్రాణే** అనే వాక్యాన్నిబట్టి. ఇక్కడ అధిక శంక ఏమిటంటే – **అన్నమయంహి సోమ్య మనః.** ఓ సోమ్యుడా? ఈ మనస్సు అన్నవికారమైనది కదా! అనే వాక్యాన్ని బట్టి మనస్సు అన్నమును ప్రకృతిగా కలది (కారణము) అని తెలుస్తున్నది. అన్నము **తా అన్నమసృజన్త** ఆ నీళ్ళు అన్నాన్ని (భూమిని) పుట్టించినవి అని చెప్పిన ప్రకారము అమ్మయము (నీటి వికారము) గా తేలుతున్నది. **ఆపోమయః ప్రాణః** ప్రాణము నీటి

వికారము అని ప్రాణము అప్ ప్రకృతిగా కలదనినీ తెలుస్తున్నది. ఇందువల్ల మనః ప్రాణేసమ్పద్యతే అనేచోట ప్రాణశబ్దముతో ప్రాణానికి ప్రకృతి (కారణము) ఐన నీటిని నిర్దేశించి, వాటిలో మనస్సు కలిసిపోతుంది అని ప్రతిపాదించినప్పుడు పరమ్పరగా – (ఒకదాని వెంట ఒకటి చొప్పున) తన పుట్టుకకు కారణమైన దానిలో కలువడమే లయము కాబట్టి సమ్పత్తని చెప్పే వాక్యము ఎట్లా పొసగుతుంది అని.

అధిక శంకకు పరిహారమైతేనో! **అన్నమయంహి సోమ్య మనః అపోమయః ప్రాణః** అని చెప్పినట్లు మనః ప్రాణాలు అన్నముతో, అన్నము నీటితో, నీటివల్ల ఆప్యాయనము (తిరిగి శక్తిని పుంజుకోవడము) చెప్పబడుతున్నది. అంతేకాని వాటికి ప్రకృతి కావడం చెప్పబడడం లేదు. మనస్సు అహంకారతత్వానికి చెందింది. ప్రాణమేమో ఆకాశము యొక్క వికారము. పైగా ప్రాణశబ్దముతో నీరును ప్రకృతిత్వము చెప్పితే అపుడు నీటికి లక్షణను చెప్పుకోవలసి వస్తుంది. **ఇది మనో అధికరణము.**

★ ★ ★

## ఇక అధ్యక్షాధికరణము.

సూ॥ **సోఽధ్యక్షే తదుపగమాదిభ్యః 4-2-4** ప్రాణము అధ్యక్షుడు ఐన జీవుని యందు చేరుతున్నది. ప్రాణము జీవుని యందు చేరుతున్నట్లు శ్రుతివాక్యాలు వినిపిస్తున్నవి. **యథా వాఙ్మనసిసమ్పద్యతే మనః ప్రాణే** అనే వచనాన్ననుసరించి ఏవిధంగా మనస్సు ప్రాణములు రెండింటిలో మాత్రమే వాక్ మనస్సులు చేరుతున్నవో అట్లాగే ప్రాణస్తేజసి అని చెప్పినందువల్ల తేజస్సు నందు మాత్రమే ప్రాణము చేరుతున్నది అని ఎదురైనప్పుడు చెప్పబడుతున్నది. సోఽధ్యక్షే అని. ఆ ప్రాణము అధ్యక్షుడు ఇంద్రియాలకు అధిపతి ఐన జీవుడి యందు చేరుతున్నది. ఎందువల్లనంటే తదుపగమాదిభ్యః. ప్రాణము జీవుని యందు చేరుట వినపడుతున్నది. **ఉపగమము – సమ్బన్ధము ఏవమేవ ఇమమాత్మాన మంతకాలే సర్వేప్రాణాః అభిసమాయాన్తి.** ఇదే తీరుగా ఈ ఆత్మను చివరి కాలములో అన్ని ఇంద్రియాలు చేరుకుంటున్నవి అని. అట్లే జీవునితో సహా ప్రాణము ఉత్క్రాన్తి చెందుట (శరీరాన్ని విడిచిపోవుట) కూడా వినిపించుతూ ఉన్నది. **తముత్క్రామన్తం ప్రాణోఽనూత్క్రామతి** శరీరములో నుండి లేచిపోతూ ఉన్న జీవునితోపాటు ప్రాణము కూడా వెళ్ళిపోతున్నది అని. ప్రతిష్ఠకూడా జీవునితోనే అని వినిపిస్తున్నది. ప్రతిష్ఠ – శరీరములోకి వచ్చి నిల్చుట. **కస్మిన్**

**ఉత్క్రాన్తే ఉత్క్రాన్తోభవిష్యామి.** కస్మిన్వా**ప్రతిష్ఠితే ప్రతిష్ఠాస్యామి.** ఎవడు లేచిపోతే లేచిపోగలను. ఎవడు నిల్చి స్థిరంగా ఉంటే స్థిరంగా నేనుండగలను అని. ఈ విధంగా జీవుడిని కలసి అతనితోపాటు తేజస్సులో సమ్పత్తి (కల్సిపోవడము) జరుగుతుంది. కనుక ప్రాణస్తేజసి అని చెప్పబడుతున్నది. ఎట్లాగైతే యమునా నది గంగతో కలిసి సాగరానికి చేరుకున్నా యమున సముద్రానికి వెళ్ళుతున్నది అనే మాట విరుద్ధము కాదో దానివలెనే ప్రాణస్తేజసి అనడమున్నూ. **ఇది అధ్యక్షాధికరణము.**

★ ★ ★

**ఇక భూతాధికరణము.**

సూ॥ **భూతేషుతత్ శ్రుతేః 4-2-05 ప్రాణస్తేజసి** అని జీవునితో కూడి ఉన్న తేజస్సు నందు చేరుతున్నది అని చెప్పబడింది. ఆ సమ్పత్తి తేజోమాత్రమునందేనా? లేకపోతే అన్ని భూతాలూ ఒకే దగ్గర చేరితే వాటిలోనా? అని అనుమానము వచ్చినపుడు శ్రుతి వాక్యములో తేజోమాత్రము నందు – ఒక్క తేజస్సులోనే – అని తేజస్సు నందని పదమున్నందువల్ల ఆ ఒక్క భూతములోనే అని సమాధానము రాగా చెప్పబడుతున్నది భూతేషు భూతాలయందు అని. భూతాలయందు కలుస్తున్నాడు అని. ఏ కారణము చేత అని అంటే తత్ శ్రుతేః – వేదము చెప్తున్నందువల్ల. **పృథివీమయః ఆపోమయః తేజోమయః** అని అన్నింటిలో సంచరిస్తున్న జీవుడిని సర్వభూతమయుడు అని శ్రుతి చెప్తున్నది కనుక.

తేజస్సు మొదలైన భూతాలయందు క్రమంగా ఒక్కొక్కదానిలో చేర్తున్నప్పటికీ పృథివీమయః ఇత్యాదియైన శ్రుతి ఎట్లా ఒప్పుతుంది అని అంటే చెప్పుతున్నారు.

సూ॥ **నైకస్మిన్ దర్శయతోహి 4-2-6** ఒక్కదాంట్లోనే కాదు. ఏ ఒక్కటీ కూడా పనిచేయడానికి చాలదు. శ్రుతి స్మృతులు వాటి అసమర్థతను చూపుతున్నవి. **అనేన జీవేన ఆత్మనాఽనుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి. తాసాంత్రివృతంత్రి వృతం ఏకైకాం కరవాణి.** నా అంశ ఐన ఈ జీవునితో పాటు అనుప్రవేశము చేసి నామరూపాలను చేస్తాను. వాటిలో ఒక్కొక్కదాన్నీ మూడుమూడు భూతాలయొక్క భాగాలను కల దానినిగా చేస్తాను అని. నామము రూపములతో విభాగము చేయడానికి యోగ్యత కలుగడం కొరకు త్రివృత్ కరణము చెప్పబడుతున్నది. **శ్లో॥ నానావీర్యాః పృథక్ భూతాః తతస్తే సంహతింవినా। నాశక్నువన్ ప్రజాః స్రష్టుమసమాగమ్యకృత్స్నశః।**

**సమేత్యాన్యోన్యసంయోగం పరస్పర సమాశ్రయాః। మహదాద్యావిశేషాన్తాః హ్యండము త్పాదయన్తితే.** ఆ తేజో అప్ అన్నములు పలురకాలైన శక్తులు కలవిఐనా ఒక్కదగ్గర పరస్పరం కలసిపోకుండా మొత్తంగానే ప్రజలను పుట్టించడానికి అసమర్థములు ఐనవి. పిదప ఒక్కటికి ఒక్కటి పరస్పరము మూడు శక్తులు కలిసిపోయి మహత్తు మొదలుకొని విశేషము దాకా అండాన్ని పుట్టించుతున్నవి అని. ఇందువల్ల ప్రాణస్తేజసి అని తేజశ్శబ్దముతో ఇతర భూతాలతో కూడి ఉన్న తేజస్సే చెప్పబడుతున్నది. కావున భూతాలయందే సమ్పత్తి. **ఇది భూతాధికరణము.**

★ ★ ★

## ఇక ఆసృత్యుపక్రమాధికరణము.

సూ॥ **సమానా చాసృత్యుపక్రమాదమృతత్వంచానుపోష్య 4-2-7** బ్రహ్మవేత్త ఐనవానికి కూడా శరీరాన్ని విడిచిపెట్టి పోయే వేళలో నాడులలోకి ప్రవేశించడాని కంటే ముందు సాధారణ ఆత్మతో సమానంగా ఉత్ క్రాన్తి సమానమే. ఇక్కడనే అమృతత్వాన్ని పొందడమనే విషయంలో ఏ అమృతత్వము చెప్పబడిందో అది శరీరము, ఇంద్రియాలు మొదలైనవాటితో సమ్బన్ధము తొలగిపోకుండానే కలుగుతుంది. ఈ విధమైన ఉత్క్రాన్తి బ్రహ్మవేత్తలకు, కానివారికిన్నీ సమానమేనా? లేక బ్రహ్మవేత్తలు కాని వారికి మాత్రమేనా? అనే విచారము జరిగినప్పుడు విద్వాంసులు కాని వారికి మాత్రమే అని నిర్ణయము ఎదురయ్యింది. ఎందువల్లనంటే విద్వాంసుడికి ఇక్కడనే అమృతత్వము లభించుతున్నదని చెప్పబడినందువల్ల, ఆకారణంగా ఉత్క్రాన్తి లేకపోవడము వల్లనున్నూ విద్వాంసుడికి ఇక్కడనే అమృతత్వము లభించుతున్నది అని వేదము చెపుతున్నది. **యదాసర్వే ప్రముచ్యన్తే కామాయేఽస్యహృదిస్థితాః అథమర్త్యోఽఅమృతో భవత్యత్రబ్రహ్మ సమశ్నుతే.** బ్రహ్మవేత్త ఐనవానియొక్క హృదయములో ఉన్న కామాలు అన్నీ ఎప్పుడు అతడిని విడిచి పెడ్తున్నాయో అప్పుడా మరణస్వభావము కల జీవుడు అమృతుడు (కర్మ సమ్బన్ధము లేనివాడు) అవుతున్నాడు. కర్మలతో సమ్బన్ధము లేనివాడయినందువల్ల ఈ లోకములోనే బ్రహ్మానుభవాన్ని పొందుతున్నాడు అని. కనుక అవిద్వాంసుడికే ఉత్క్రాన్తి ఉన్నది అని పూర్వపక్షము వస్తే చెప్పబడుతున్నది సమానాచాసృత్యు పక్రమాత్ అని. విద్వాంసునికి కూడా ఆసృత్యుప్రక్రమాన్నుండి ఉత్క్రాన్తి సమానమే. ఆసృత్యుప్రకమాత్ - ఆగత్యుపక్రమము నుండి - అనగా నాడులలో ప్రవేశించడానికి ముందు నుండి అని అర్థము. విద్వాంసుడికి కూడా

నాడులలోని ఒకానొక విశేషమైన నాడి నుండి పైకి లేచి బ్రహ్మ లోకానికి పోవడము వినిపించుతున్నది. **శతం చైకాచ హృదయస్యనాడ్యః తాసాం మూర్ధానమభి నిస్సృతైకా. తయోర్ధ్వమాయన్నమృతత్వమేతి. విష్వఙ్ జన్యా ఉత్ క్రమణే భవన్తి ఇతి.** హృదయంతో సమ్బన్ధమును కలిగిన నాడులు మొత్తం నూటా ఒక్కటి ఉన్నవి. వాటిలోనుండి ఒక్కటి తలపైనున్న మాడవైపుగా బయలుదేరిపోతున్నది. బ్రహ్మవేత్త ఆ మూర్ధన్యనాడి ద్వారా శరీరం నుంచి బయలుదేరిపోయి అమృతత్వాన్ని పొందుతున్నాడు. ఇక బ్రహ్మవేత్తలు కాని వారందరూ అంతటా వ్యాపించి ఉన్న మూర్ధన్యనాడి కంటే వేరయిన నాడులలో నుంచి ఏదో ఒక దాని ద్వారా శరీరాన్నుండి బయటపడుతున్నారు అని. ఈ విధంగా నాడీ విశేషము ద్వారా లేచిపోవడం గతి వినిపిస్తున్నది కాబట్టి విద్వాంసుడికి కూడా ఉత్క్రాన్తి తప్పనిసరి ఐనట్టిదే. అది కూడా నాడులలోనికి ప్రవేశించడానికి ముందువరకు విశేషము / ప్రత్యేకత వినిపించడము లేదు కాబట్టి ఉత్క్రాన్తి సమానమే. ఆ నాడులలోకి ప్రవేశించే దశలో మాత్రము విశేషము / ప్రత్యేకత వినిపిస్తున్నది. ఈ వాక్యము ద్వారా **తేనప్రద్యోతేనైషఆత్మా నిష్క్రమతి చక్షుషో వా మూర్ధ్నో వా అన్యేభ్యోవా శరీరదేశేభ్యః.** ఆ విధమైన వెలుగు ద్వారా ఈ ఆత్మ కండ్లలో నుండి గానీ, మాడ నుండి (బ్రహ్మరంధ్రము) గానీ లేక ఇతరములైన శరీర ప్రదేశాలనుండి గానీ బయటపడుతున్నాడు అని. **శతం చైకా చ హృదయస్య** అనే శ్రుతితో ఏకార్థతను / ఏకీభావాన్ని కల్గిఉంటున్నందువల్ల మూర్ధ నుండి మాత్రమే శరీరాన్నుంచి బయటకు రావడమనేది బ్రహ్మవేత్తఐన విద్వాంసునికి సమ్బన్ధించిన ముచ్చట అవుతున్నది.

**విదుషోఽత్రైవామృతత్వము** – విద్వాంసుడికి ఇహ లోకము నందే అమృతత్వము లభించుతున్నది అని ఏ మాట చెప్పినారో ఆ విషయంలో సమాధానము చెప్పబడుతున్నది. "**అమృతత్వంచానుపోష్య**" అని. ఇందులోని చశబ్దము అవధారణార్థములో ప్రయోగింపబడింది. అనుపోష్య అనగా – శరీరముతో ఇంద్రియాలతోనూ సమ్బన్ధము పటాపంచలు కాకుండా / కాలిపోకుండానే (ఉషదాహే అని ధాతువుకు కాలిపోవడము అని అర్థము ఉన్నందువల్ల) ఏ అమృతత్వము – ఉత్తర పూర్వాఘములతో అశ్లేషము, వినాశరూపము ఐనది – పొందబడుతున్నదో దాన్నే **యదా సర్వేప్రముచ్యన్తే** అనే శ్రుతి ద్వారా చెప్పుతున్నారు. ఇక **అత్రబ్రహ్మ సమశ్నుతే** అనే వాక్యఖండము ద్వారా ఉపాసన వేళయందు ఏ బ్రహ్మానుభవము కల్గుతున్నదో దానికి చెందినటువంటిది అని అభిప్రాయమే.

సూ॥ **తదపీతేః సంసారవ్యపదేశాత్ 4-2-08** అపీతి అనగా బ్రహ్మను పొందడము / చేరుకోవడము అంతదాకా సంసారము అనియే పేర్కొంటున్నందువల్ల. తప్పనిసరిగా ఆ అమృతత్వము దేహసమ్బన్ధము కాలిపోనివానికే అని తెల్సుకోవాలి. అపీతి వరకూ సంసారము అనియే పేర్కొనబడుతున్నది కాబట్టి. అపీతి అనగా అప్యయము అనగా బ్రహ్మను చేరుకోవడము. ఆ బ్రహ్మ ప్రాప్తి కూడా అర్చిరాది మార్గము ద్వారా దేశవిశేషమైన బ్రహ్మ లోకాన్ని చేరుకున్న తరువాతనే అని చెప్పబడనున్నది. అటువంటి అవస్థను పొందడము వరకు ఉన్న స్థితిని దేహముతో సమ్బన్ధాన్ని కల్గి ఉండడము అనే లక్షణము గల సంసారము అని పేర్కొనబడుతున్నది. **తస్య తావదేవ చిరమ్ యావన్నవిమోక్ష్యే** అని, **అశ్వఇవరోమాణివిధూయ పాపం చన్ద్రఇవ రాహోర్ముఖాత్ ప్రముచ్య। ధూత్వా శరీరమ కృతంకృతాత్మాబ్రహ్మలోకమభి సమ్భవామి** అనిన్నీ.

సూ॥ **సూక్ష్మం ప్రమాణతశ్చ తథోపలబ్ధేః 4-2-9** విద్వాంసుడికి ఈ పంచభూతాత్మకమైన శరీరాన్ని వదిలిపెట్టినాక సూక్ష్మ శరీరము వస్తుంది. దాని సాయంతో అర్చిరాది మార్గంగా బ్రహ్మలోకానికి చేరుకుంటున్నాడు. అందుకు తగిన ప్రమాణము ఉన్నది. అది ఒట్టి మాట కాదు. అట్లా శరీరాన్ని పొందడము కనిపిస్తున్నది.

ఈ చెప్పబోయే కారణము వల్లనున్నూ విద్వాంసుడికి శరీరముతో సమ్బన్ధము తగులబడి పోలేదు. కాబట్టే సూక్ష్మ శరీరము కొనసాగుతున్నది. దేనివల్ల ఈ విషయము తెలుస్తున్నదంటే తగిన ప్రమాణాన్ని బట్టి అటువంటి ఉపలబ్ధి ఉన్నది కాబట్టి. దేవయానము అనే మార్గము ద్వారా వెళ్ళుతున్న బ్రహ్మవేత్తకు **తంప్రతి బ్రూయాత్... సత్యంబ్రూయాత్.** ఆయనకు ప్రత్యుత్తరాన్ని ఇవ్వాలి. సత్యమును చెప్పాలి అని చంద్రునితో సంవాదము – సంభాషణము చెప్పబడినందువల్ల శరీరముతో ఉనికి తెలుస్తున్నది. కావున బ్రహ్మవేత్తకు సూక్ష్మశరీరము కొనసాగుతున్నది. ఇందువల్ల శరీర సమ్బన్ధము కాలిపోలేదు.

సూ॥ **నోపమర్దేనాతః 4-2-10** ఇందువల్ల **యదాసర్వేప్రముచ్యన్తేకామాయేఽస్యహృదిస్థితాః। అథమర్త్యోఽ మృతో భవత్యత్ర బ్రహ్మసమశ్నుతే.** అనే వాక్యము బన్ధాలు – కర్మ బంధాలు తెగిపోవడం తోనే అమృతత్వము లభించుతుంది అని చెప్పడం లేదు. కనుక జీవన్ముక్తి లేదు. అట్లా కాకుండా జీవన్ముక్తి సత్యమే అని చెప్పినట్లయితే 1) ఉపాసనను చెయ్యమని చెప్పడము 2) ఆ బ్రహ్మను గురించిన ఉపాసనను ప్రాణము

ఉన్నంతవరకూ కొనసాగించాలని చెప్పడము 3) ఉత్క్రాన్తి వినిపించుతుండడము 4) శరీరాన్ని విడిచిన విద్వాంసుడికి అర్చిరాదిమార్గము ద్వారా బ్రహ్మలోక ప్రాప్తి కలుగుతున్నదని చెప్పడము 5) దేశవిశేషము ఐన పరమ పదాన్ని చేరుకున్న తరువాతనే అన్ని బన్ధాలూ తెగిపోతున్నాయనే శ్రుతులకు బాధ కలుగుతున్నందువల్ల 6) లోకంలో కనిపించుతున్న దానికి విరోధం వస్తున్నది కాబట్టి జీవించి ఉండగానే మోక్షము వస్తుందని చెప్పడం పొసగదు గాక పొసగదు.

సూ॥ **అస్యైవ చోపపత్తే రూష్మా 4-2-11** ఈ సూక్ష్మ శరీరము ఉండడమనేది చక్కగా పొసుగుతున్నందువల్లనే శరీరములో (మరణించిన తరువాత కూడా) ఊష్మము – వేడిమి/వెచ్చదనము ఉండడమనేది కనిపిస్తున్నది. అస్య – ఈ సూక్ష్మ శరీరము కొన్నిచోట్లలో ఉండడము పొసగుతున్నందువల్ల దేహత్యాగము చేయడానికి (మరణించుటకు) పూనుకున్న విద్వాంసుడి మరణానికి ముందు ఊష్మము / వేడిమి / వెచ్చదనము స్థూలశరీరములో కొన్ని సందర్భాలలో క్వాచిత్కముగా కనబడుతున్నది. ఐతే ఈ వేడిమి స్థూలశరీరానికే చెందింది అని అనగూడదు. దీనికంటే వేరయిన సూక్ష్మ శరీరంలో కనిపించడము లేదు గదా! అందువల్ల వేడిమి కొన్నిచోట్లలో ఒకానొకప్పుడు లభించడమనేది విద్వాంసునికి సూక్ష్మశరీరము నుండి ఉత్ క్రాన్తితో సమ్బన్ధము కలిగి ఉన్నదని తెలుస్తున్నది. అందువలన విద్వాంసునికి కూడా నాడీ ప్రవేశానికంటే ముందు వరకు ఉత్ క్రాన్తి సమానమేనని చక్కగా చెప్పబడింది. ఇట్లా ఐనా కూడా విద్వాంసుడికి ఉత్క్రాన్తి లేదని శంకించుకొని పరిహరించుతున్నారు.

సూ॥ **ప్రతిషేధాదితి చేన్న శారీరాత్ స్పష్టోహ్యేకేషాం 4-2-12** విద్వాంసుడికి ఉత్క్రాన్తి లేదని నిషేధింపబడింది కదా అని అంటేకాదు. శరీరము కలవాడైన జీవుడి నుండి ప్రాణాలు లేచిపోవడము నిషేధింపబడుతున్నది కానీ శరీరాన్నించి కాదు. వేరొక శాఖలో ఈ విషయము తేటగా చెప్పబడింది కదా! విద్వాంసునికి కూడా ఉత్ క్రాన్తి సమానమేనని ఏ మాట అన్నారో అది సరికాదు. ఎందుకంటే విద్వాంసుడికి ఉత్క్రాన్తి నిషేధింపబడింది కాబట్టి.

అది ఇట్లాగా – **సఏతాస్తేజోమాత్రాః సమభ్యాదదానో హృదయమేవా న్వపక్రామతి.** అతడు ఈ తేజోమాత్రలు అనబడే పంచభూతాలయొక్క సూక్ష్మాంశాలను చేబూనినవాడై హృదయాన్నుండి బయటపడుతున్నాడు. అని మొదలుపెట్టి **తేనప్రద్యోతేనైష ఆత్మానిష్క్రామతి. తముత్ క్రామన్తమ్ ప్రాణోఽనూత్క్రామతి** ఆ

వెలుగుల ద్వారా ఈ ఆత్మ బయటకు వస్తున్నాడు. అట్లా బయలుదేరి పోతున్నవాడిని ప్రాణము అనుసరించిపోతున్నది. అని బ్రహ్మ వేత్త కాని వాని యొక్క ఉత్క్రాన్తి పద్ధతిని చెప్పి **అన్యన్నవతరం కళ్యాణతరం రూపం కురుతే** మంగళకరమైన అందమైన మరొక్కరూపాన్ని పొందుతున్నాడు. అని మరొక శరీరాన్ని చేపట్టడాన్ని కూడా చెప్పి **ప్రాప్యాన్తం కర్మణస్తస్యయత్ కించేహ కరోత్యయమ్। తస్మాల్లోకాత్ పునరేత్యస్మై లోకాయకర్మణే ఇతితుకామయమానః.** ఇక్కడ ఈ శరీరంతో చేసిన పుణ్యకర్మయొక్క ఫలాన్ని ముగించుకొని పైలోకాన్నుంచి తిరిగి ఈ లోకానికి వస్తున్నాడు. మళ్ళీ కొత్తగా కర్మలను చేసుకోవాలని కోరుతున్నవాడై. అని బ్రహ్మ ఉపాసన చేయని వాడి యొక్క విషయాన్ని ముగించి, **అథాకామయమానః యోఽకామోనిష్కామః ఆప్తకామః ఆత్మకామః. నతస్యప్రాణాః ఉత్క్రామన్తి. బ్రహ్మైవసన్ బ్రహ్మాప్యేతి.** ఇక ఏ కోరికలను కోరనివాడు – ఎవడైతే కోరనివాడో, భార్యను, ధనాన్ని సంతానాన్ని కోరనివాడు, అన్ని కోరికలూ తీరినవాడు, పరమాత్మ సాన్నిధ్యాన్ని మాత్రమే కోరేవాడు ఎవడు ఉన్నాడో – అతని ప్రాణాలు లేచిపోవు. ఆయనే బ్రహ్మగా అయ్యి బ్రహ్మలో కలసిపోతాడు అని విద్వాంసునికి ఉత్క్రమణము నిషేధింపబడుతున్నది. అట్లాగే దీనికి ముందు భాగములోనూ ఆర్తభాగపక్షము నందు కూడా విద్వాంసునికి ఉత్క్రాన్తి లేదని చెప్పడము కనిపించుతున్నది. **అపపునర్మృత్యుంజయతి** సకాలమృత్యువును, అపమృత్యువునున్నూ జయించుతున్నాడు. అని విద్వాంసుడిని పొగిడి **యాజ్ఞ వల్క్యేతిహోవాచ యత్రాయం పురుషోమ్రియతే ఉదస్మాత్ ప్రాణాః క్రామన్త్యహో న** ఓయాజ్ఞ వల్క్యుడా? ఈ పురుషుడు మరణించినపుడు అతని యొక్క ప్రాణాలు బయటికి వెళ్ళిపోతున్నవా? లేవా? అని అడగబడినవాడైన యాజ్ఞ్యవల్క్యుడు లేదని చెప్పినాడు. **అత్రైవ సమవలీయన్తే సఉత్శ్వయతి ఆధ్మాయతి. ఆధ్మాతో మృతః శేతే ఇతి.** శరీరములోనే కలిసిపోతవి. వాయువుతో నింపబడి ఉబ్బిపోతాడు. రోగముతో చనిపోయి పడి ఉంటాడు అని. ఇందువల్ల బ్రహ్మోపాసన చేసినవాడు ఇక్కడనే అమృతత్వాన్ని పొందుతున్నాడు అని అన్నట్లయితే అది సరికాదు. శరీరాన్ని కలవాడైన ప్రత్యగాత్మకు ప్రాణాల నుండి ఉత్క్రాన్తి ఇక్కడ నిషేధింపబడుతున్నది. **న తస్యప్రాణాః ఉత్క్రామన్తి** అను వాక్యము లోని తత్ శబ్దముతో **అథాకామ యమానః** అని ప్రస్తావింపబడిన శారీరుడే పరామర్శింపబడుతూ ఉన్నాడు. కానీ ప్రస్తావనలేని శరీరము కాదు. తస్య అనే షష్ఠీ విభక్తికి ప్రాణాలతో సమ్బన్ధము ఉన్నందువల్ల శారీరుడు (శరీరము కలవాడు) పేర్కొనబడినాడు. కానీ ఉత్క్రాన్తికి అపాదానముగా కాదు. (అపాదానము అనగా **ధృవమపాయేఽపాదానమ్**

అనే సూత్రము ద్వారా ఈ విధంగా వివరింపబడింది. రెండు వస్తువులు కలసి ఉన్నపుడు వాటిలో ఒకటి మరొకదాని నుండి విడిపోగా చెదరక నిలిచి ఉన్నదానిని అపాదానము అని అంటారు) ఉత్క్రాన్తి అపాదానము శరీరమే అని అనేట్లయితే కాదు. అపాదానము ఏది అనే అపేక్ష ఏర్పడినపుడు అశ్రుతము (వినిపించనిది) ఐన శరీరము కంటే సమ్బన్ధము కలవాడుగా వినిపించబడుతున్న ఆత్మకే సాన్నిహిత్యము (దగ్గరితనము) ఉన్నందువల్ల ఆత్మనే అపాదానముగా కూడా గ్రహింపబడుతున్నది. ఇంతేకాకుండా జీవుడితో సమ్బన్ధము కలవిగా బాగుగా ఎరుకగలిగిన వాటికి తత్సమ్బన్ధాన్ని చెప్పినపుడు ప్రయోజనము లేదు కాబట్టి సమ్బన్ధాన్ని మాత్రమే తెలిపే షష్ఠీ విభక్తి కంటే అపాదానాన్ని తెలిపే పంచమిని గ్రహించడమే విశేషము అని నిర్ణయింపబడుతున్నది (**శేషే షష్ఠీ అని** పరస్పర సమ్బన్ధాన్ని మాత్రమే షష్ఠీ విభక్తి చెప్పుతుంది.) ఎట్లాగంటే నటస్య శృణోతి – నటుని యొక్క వింటున్నాడు – అనే ప్రయోగము వలె.

ఐతే ఈ విషయములో వివాద పడవలసిన అవసరము లేదు. ఒకానొక శాఖ వారి పాఠములో ఈ విషయము తేటగా తెలుస్తున్నది. మాధ్యన్దినుల యొక్క పాఠములో "**శారీరుడు జీవుడు**" మాత్రమే అపాదానము అని తెలుస్తున్నది. **యోఽకామోనిష్కామ ఆప్తకామ ఆత్మకామః నతస్మాత్ ప్రాణాః ఉత్క్రామన్తి** అని. ఎవడు అకాముడు నిష్కాముడు ఆప్తకాముడు బ్రహ్మను పొందాలని కోరుకునేవాడు ఉన్నాడో అతని నుండి ప్రాణాలు లేచిపోవు అని. శరీరము నుండి ప్రాణాలు లేచిపోయే ప్రసంగము లేదు కాబట్టి ఆ నిషేధము పొసగదు అని అంటే కాదు. **తస్యతావదే వచిరమ్** అనే వాక్యము ప్రకారము విద్వాంసుని శరీరవియోగము కాలములో బ్రహ్మను చేరుకుంటాడని చెప్పడము చేత ప్రాణాలు కూడా ఆ కాలములో శారీరుడైన విద్వాంసుడినుండి వియోగాన్ని పొందుతవి. ఆకారణంగా దేవయాన మార్గము ద్వారా బ్రహ్మను చేరుకోవడము కుదురదు. కనుక ఆతని ప్రాణాలు లేచిపోవు. దేవయాన మార్గము ప్రకారము బ్రహ్మను చేరుకోవడానికి మునుపు జీవుడైన విద్వాంసుడి నుండి ప్రాణాలు ఎడబాసి పోవు అని చెప్పబడుతున్నది. ఇక ఆర్త భాగ ప్రశ్నమునందు కూడా ఎప్పుడు విద్వద్విషయము వస్తుందో అప్పుడున్నూ ఇదే పరిష్కారము చెప్పుకోవాలి. అది అవిద్వాంసుని విషయము. అక్కడ ప్రశ్న ప్రతివచనాలయందు బ్రహ్మ విద్యాప్రసంగము కనిపించుట లేదు కాబట్టి. అందులో గ్రహాతిగ్రహముల రూపములో ఇంద్రియార్థములయొక్క స్వభావము, నీళ్ళు అగ్నికి ఆహారము కావడము, చనిపోనున్న జీవుడు ప్రాణాలను విడిచి పెట్టడము,

చనిపోయినవాడి పేరుతో చెప్పబడే కీర్తి కొనసాగడము (అనువృత్తి) అతడు తాను చేసిన పుణ్యపాపాలకు తగ్గట్లు గతులను పొందడము అనే విషయాలు ప్రశ్న సమాధానాలు రూపములో చెప్పబడినవి. అందులోనూ "**అపపునర్మృత్యుం జయతి**" అనే వాక్యము ప్రకారము జలాలు అగ్నికి అన్నము అవుతున్నవి అనే జ్ఞానమును పొందడము వలన అగ్నిని జయించడమే మృత్యుజయము అని చెప్పబడుతున్నది. అందువల్ల ఇక్కడ విద్వాంసుని ప్రసక్తి లేదు. విద్వాంసుడు కాని వానికి చెందిన ప్రాణానుత్క్రాన్తి వచనము మాత్రము స్థూలదేహము వలె ప్రాణాలు విడిచిపెట్టవు. ఐతే భూత సూక్ష్మాలవలె జీవుడిని బిగ్గరగా కావిలించుకొని పోతవి అని ప్రతిపాదించుతున్నది. కాబట్టి దోషములేదు. నిరవద్యమే.

సూ॥ **స్మర్యతేచ 4-2-13** విద్వాంసుడు కూడా మూర్ధన్యనాడి ద్వారానే ఉత్క్రమణాన్ని పొందుతున్నాడని యాజ్ఞవల్క్యస్మృతి చెప్పుతున్నది. **శ్లో॥ ఊర్ధ్వ మేకః స్థితస్తేషాం యోభిత్త్వా సూర్య మండలమ్। బ్రహ్మలోకమతిక్రమ్యతేన యాతిపరాం గతిమ్॥** ఆ నాడీ విశేషాలలో ఒకటి పైకి పోయేదిగా ఉన్నది. దాన్ని ఛేదించుకొని సూర్యమండలానికి, అదే వరుసలో బ్రహ్మయొక్క లోకాన్ని కూడా తాటుకొని చివరకు పరమపదాన్ని చేరుకుంటున్నాడు అని. **ఇది ఆసృత్యుపక్రమాధికరణము.**

★ ★ ★

## ఇక పరసమ్పత్తి అధికరణము.

సూ॥ **తానిపరే తథా హ్యాహ 4-2-14** జీవుడిని వదలకుండా అంటిపెట్టుకొని ఉన్న భూతసూక్ష్మాలు పరమాత్మ యందు లీనమవుతున్నవి. అట్లాగని శ్రుతి చెపుతున్నది. ఇంద్రియాలు, ప్రాణాలతో పాటు కరణాధ్యక్షుడు (ఇంద్రియాలకు అధిపతి) ఐన ప్రత్యగాత్మ ఉత్క్రాన్తి వేళయందు తేజస్సు మొదలైన భూతసూక్ష్మాలయందు చేరుతున్నాడని ఇంతకుమునుపు చెప్పబడింది. ఆ విధమైన సమ్పత్తి విద్వాంసుడు కానివానికి లేదని అనుమానపడి పరిహారాన్ని చెప్పినారు. జీవుడిని కావలించుకొని వదలకుండా ఉన్న భూతసూక్ష్మాలు అతనియొక్క కర్మను, ఉపాసనను అనుసరించి తమవైన పనులను చేయడానికి వెళ్ళుతాయా? లేక పరమాత్మలో చేరుతాయా? అని సందేహము కలిగితే నడమలో పరమాత్మయందు కలిసిపోయినప్పుడు సుఖదుఃఖాలను అనుభవించడమనే కార్యము కనబడడం లేదు కాబట్టి ఆ సుఖదుఃఖాల

భోగాలను అనుబవించడానికి తగ్గట్లు, కర్మ ఎట్లున్నదో విద్య ఎట్లున్నదో ఆ ప్రకారంగా ముందుకుపోతవి అని పూర్వపక్షము వచ్చింది. దానికి సమాధానము తాని పరే అని చెప్పబడుతున్నది. అవి పరమాత్మను చేరుకుంటున్నవి. ఎందువల్లనంటే అట్లాగని శ్రుతిచెప్పింది**తేజఃపరస్యాందేవతాయామ్**తేజస్సుపరమాత్మయందులీనమవుతున్నది అని వేదము ఎట్లా చెప్పిందో దానికి తగినట్లు కార్యాన్ని కల్పించుకోవాలని అర్థము. వేదవిరుద్ధంగా కల్పించుకోకూడదు. గాఢనిద్ర (సుషుప్తి) ప్రళయకాలాలలో ఎట్లాగైతే పరమాత్మను చేరుకోవడం ద్వారా సుఖదుఃఖాలను అనుభవించడము ద్వారా కల్గిన ఆయాసము నుండి విశ్రాన్తి ఎట్లా లభించుతున్నదో అట్లాగే ఇక్కడ కూడా అని అర్థము.
**ఇది పరసమ్పత్తి అధికరణము**

★ ★ ★

## ఇక అవిభాగాధికరణము.

సూ॥ **అవిభాగోవచనాత్ 4-2-15** పరమాత్మలో సమ్పత్తి అనేది విడదీసి చెప్పడానికి వీలుకానట్లు కలసి పోవడమే. సంయోగమే. వేదవచనము ప్రకారమే ఈ విషయము చెప్పబడుతున్నది. పరమాత్మయందు ఈవిధమైన సమ్పత్తిని పొందడము ప్రాకృతలయములో వలె కారణాపత్తిరూపమైనదా? లేక **వాక్మనసి** ఇత్యాదులవలె అవిభాగరూపమా? (విడదీసి ఇది ఇట్లా? ఇది ఇట్లా అని చెప్పడానికి వీలుగాకుండా ఉండడమా?) అని చిన్త చేయబడితే పరమాత్మ అందరికీ అన్నింటికీ కారణమైనవాడు కాబట్టి కారణాపత్తి రూపమే అని సమాధానము వచ్చింది. దాన్నికాదంటూ సిద్ధాన్తి ఇట్లాగా చెపుతున్నాడు అవిభాగము అని. అవిభాగము అనగా అపృథక్భావము అంటే ఇది వేరు, ఇది వేరు అని వ్యవహరించడానికి వీలుకానట్లుగా సంసర్గాన్ని చెందడము. కలువడము అని అర్థము. ఎందువల్లనంటే వచనము వల్ల. **తేజఃపరస్యాం దేవతాయామ్** అనే వాక్యము నందుకూడా **వాక్ మనసి సమ్పద్యతే** అనే వాక్యమునుండి సమ్పద్యతే అనే వచనము అనుషంగము - (జతకావడం) జరుగుతున్నందువల్ల. అది సంసర్గవిశేషాన్ని తెలుపుతున్నది. అనుషక్తమైన దానికి అభిధానములో (అర్థాన్ని మార్చిచెప్పడంలో) ప్రమాణము లేదు కాబట్టిన్నీ. ఉత్క్రాన్తి వేళయందు కారణాపత్తిని చెప్పుకుంటే ప్రయోజనము లేదు. కారణాపత్తి జరిగిన తరువాత సృష్టికాలములోవలె అవ్యక్తము మొదలైనవాటియొక్క సృష్టిని గురించి చెప్పనందువల్ల కూడా అవిభాగమే తప్ప కారణాపత్తి రూపముకాదు. (కారణాపత్తి అంటే ప్రతివస్తువూ తాను పుట్టడానికి

కారణమైన పదార్థములో కలిసిపోవడము. అంటే అపుడు కారణమైన పదార్థము మిగిలి ఉంటుంది. కార్యానికి ఉనికి ఉండదు. బంగారు నగలను కరిగించితే కారణమైన బంగారమే మిగులుతుంది. కార్యాలైన రకరకాలనగలు అనేవిసోదిలో లేకుండా పోతవి). **ఇది అవి భాగాధికరణము.**

★ ★ ★

## ఇకపైనతదోకోఽధికరణము.

సూ॥ **తదోకోఽగ్రజ్వలనం తత్ప్రకాశితద్వారో విద్యాసామర్థ్యాత్ తత్ శేషగత్యను స్మృతి యోగాచ్చ హార్దానుగృహీతః శతాధికయా 4-2-16** విద్వాంసుడు ఉత్క్రమించేటప్పుడు హృదయస్థానము ప్రకాశించుతుంది. దాని ద్వారా బయటకు పోయే ద్వారము కనిపిస్తుంది. విద్య యొక్క శక్తిని బట్టి దానికి అనుబన్ధంగా ప్రతిదినమూ శరీరాన్నుండి వెళ్ళిపోయే మార్గాన్ని తలుచుకోవడం వల్లనూ, హార్దపురుషుని యొక్క దయవల్లనూ నూటా ఒకటవనాడి ద్వారా విద్వాంసుడు ఉత్క్రమిస్తాడు. ఈ విధంగా గత్యుపక్రమము యొక్క చివరివరకూ విద్వాంసునికి, కానివానికీ ఇద్దరికినీ ఉత్క్రాన్తి ప్రకారము సమానము అని చెప్పబడింది. ఇప్పుడు విద్వాంసుడికి ఉండే విశేషము చెప్పబడుతున్నది. ఆ విషయములో ఈ విధంగా ఉపదేశింపబడుతున్నది. **శతంచైకా చ హృదయస్యసాద్యస్తాసామ్ మూర్ధాన మభినిస్సృతైకా। తయోర్ధ్వమాయన్నమృతత్వమేతి. విష్వఙ్ జన్యా ఉత్క్రమణేభవన్తి.** హృదయానికి సమ్బన్ధించిన నాడులు నూటా ఒక్కటి వాటిలో ఒక్కటి తలపైన మాడప్రదేశానికి బయలుదేరి పోతుంది. విద్వాంసుడు దాని ద్వారా పైకి వచ్చి అమృతత్వాన్ని పొందుతున్నాడు. ఇతరులు అన్ని నాడులనుండి ఉత్క్రమించుతారు అని నాడులలో ఈ నూటా ఒకటవదైన మూర్ధన్యనాడి ద్వారానే విద్వాంసుడు బయలుదేరిపోతాడు. తక్కినవాటితోనే విద్వాంసులు కానివారు వెళ్ళిపోతారు. అనే నియమము పొసగుతుందా? లేదా? అని సంశయం ఏర్పడుతున్నది. వీటిలో ఏది తగును? అని అంటే నియమము చెల్లదు అని. ఎందువల్లనంటే నాడులు చాలా ఉన్నవి. అవి మరీ చిన్నవిగానూ ఉన్నవి. ఏది ఎటువెళ్ళుతుంది? దేనిద్వారా పోవాలి అనే విషయము నిశ్చయించుకోవడము సాధ్యముకాదు. అందువల్ల జీవుడు తన మార్గాన్ని ఎంచుకోవడం కష్టమవుతుంది. కనుక **తయోర్ధ్వమాయ న్నమృతత్వమేతి విష్వఙ్జన్యా ఉత్క్రమణేభవన్తి** అని అనడము యాదృచ్ఛికమైన ఉత్క్రాన్తిని అనువదించుతున్నదనడము తగి ఉన్నది అని.

ఈ విధంగా పూర్వపక్షము రాగా చెపుతున్నాము. శతాధికయా అని. విద్వాంసుడు నూటా ఒక్కటవదైన మూర్ధన్యనాడీ ద్వారానే ఉత్క్రమించుతున్నాడు. ఈ మూర్ధన్యనాడిని ఎంచుకోవడము / గుర్తుపట్టడము విద్వాంసుడికి కష్టము కాదు. విద్వాంసుడు పరమపురుషుడిని ఆరాధించడమనే మిక్కిలి ప్రియమైన విద్య యొక్క సామర్థ్యము వలన, విద్యకు సమ్బన్ధించినదైన తనకు మిక్కిలి ప్రియమైన అర్చిరాదిగతిని ఎప్పుడూ తల్చుకుంటుండడము వలననున్నూ ప్రసన్నుడైన తన హృదయములో ఎల్లపుడూ ఉండే హార్ద పురుషుడు అనబడే పరమ పురుషుని చేత అనుగ్రహింపబడినవాడు అవుతున్నాడు. అందువల్ల తదోకము – ఆ జీవుని యొక్క స్థానమైన హృదయము యొక్క ముందుభాగము చీకట్లు లేకుండా వెలుగుతుంది. అగ్రజ్వలనము అనగా అగ్రే = ముందు భాగములో జ్వలనం=ప్రకాశించడము యస్య=దేనికో అదియే అగ్రజ్వలనమ్ అని అనబడుతుంది. పరమ పురుషుని యొక్క ప్రసాదము – దయ వలన ప్రకాశింపచేయబడిన బయటకు వచ్చే ద్వారము కలవాడైన విద్వాంసుడు ఆ నాడిని (మూర్ధన్యనాడిని) బాగుగా తెల్సుకుంటాడు. గుర్తుపడుతాడు. దానిద్వారా విద్వాంసుడికి గతి చెల్లుతుంది. **ఇది తదోకో అధికరణము.**

★ ★ ★

## ఇక రశ్మి అనుసార్యధికరణము.

సూ॥ **రశ్మ్యనుసారీ 4-2-17** విద్వాంసుడు సూర్యునికిరణాల ద్వారానే ఊర్ధ్వలోకమైన సూర్యమండలాన్నుండి క్రమంగా పరమ పదానికి చేరుకుంటున్నారు. హృదయము నుండి నూటా ఒక్కటవదైన మూర్ధన్యనాడి ద్వారా బయటకు వచ్చిన విద్వాంసుడికి సూర్యుని యొక్క కిరణాల వెంట ఆదిత్యమండలానికి చేరుకోవడము వినిపిస్తున్నది. **అథయత్రైతదస్మాచ్ఛరీరాదుత్క్రామతి, అథైతేరేవ రశ్మి భిరూర్ధ్వమా క్రమతే.** ఇక ఎప్పుడైతే ఈ విద్వాంసుడు ఈ పాంచభౌతిక శరీరాన్నుండి పైకి లేస్తాడో అప్పుడు ఈ సూర్యకిరణాల ద్వారానే ఊర్ధ్వ లోకాలను ఆక్రమించుతాడు అని. ఆ సందర్భములో సూర్యరశ్మిని అనుసరించియే ఊర్ధ్వ లోకాలకు వెళ్ళుతాడు అనే గతి నియమము ఏర్పడుతున్నదా? లేదా? అని విచారము జరిగినప్పుడు రాత్రి వేళ చనిపోయిన విద్వాంసుడికి సూర్యరశ్మి లేదు కాబట్టి నియమము చెల్లదు. అట్లా చెప్పడము మాత్రము పాక్షికమైనదే అని నిర్ణయము చెయ్యబడితే చెప్పబడుతున్నది. రశ్మిని అనుసరించియే అని. రశ్మ్యను సారి అయ్యే విద్వాంసుడు ఊర్ధ్వలోకాలకు

పోతున్నాడు. ఎందువల్లనంటే **అథైతైరేవ రశ్మిభిః** అని నిర్ధారణ చేయబడినందువల్ల. సాక్షికమే గనుక ఐనట్లయితే **ఏవకారము** అర్థము లేనిది అవుతుంది. రాత్రిపూట చనిపోయిన వానికి సూర్యరశ్మి ఉండదు కాబట్టి రశ్ములననుసరించి గమనము కుదరదు అని ఏమాట అన్నారో అది తప్పు. రాత్రిపూట కూడా రశ్మిని అనుసరించి గమనము జరుగుతుంది. ఎండకాలములో రాత్రివేళలోనూ ఊష్మము – వేడిమి లభించుతున్నది కాబట్టి రశ్మి యొక్క ఉనికి చిక్కుతున్నది. హేమన్త శిశిరఋతువులలో మాత్రమే, వాన కాలములోను దుర్దినము వంటి సమయాల్లో మంచు ప్రబలంగా ఉన్నందువల్ల దుర్దినములోవలె ఊష్మము లభించదు. (దుర్దినం అనగా సూర్యుడు కనబడకుండా మబ్బులు కమ్మి ఉన్నదినము) శరీరములోని నాడులకు సూర్యకిరణాలకున్నూ అన్యోన్యము అన్వయము ఎల్లప్పుడూ ఉంటున్నట్లు వేదము ద్వారా వినవస్తూ ఉన్నది. **తద్యథామహాపథ ఆతతః ఉభౌగ్రామౌగచ్ఛతీమంచా ముంచ, ఏవమేవైత ఆదిత్యస్య రశ్మయః ఉభౌలోకౌగచ్ఛన్తీమంచాముంచ। అముష్మాదాదిత్యాత్ ప్రతాయన్తే తా ఆసు నాడీషు సృప్తాః ఆభ్యోనాడీభ్యో ప్రతాయన్తే తేఽముష్మిన్నాదిత్యేసృప్తాః.** అది ఎట్లాగంటే దండుబాట వెడల్పుగా ఉండి ఇటూ అటూ కొసలలో ఉండే రెండు గ్రామాలను వ్యాపించి అక్కడికీ ఇక్కడికీ పోయినట్లే సూర్యుని యొక్క కిరణాలు కూడా భూలోకానికీ స్వర్గలోకానికిన్నీ వ్యాపించి ఉంటవి. ఆ కిరణాలు ఆ సూర్యుడి నుండి బయలు దేరి భూలోకములోని జీవుల వరకూ వ్యాపించి వారిలోని నాడులతో సమ్బన్ధాన్ని కలిగి ఉంటున్నవి. ఈ నాడుల యందు సమ్బన్ధాన్ని కలిగిన కిరణాలు ఆపైన ఉండే సూర్యునితో సమ్బన్ధాన్ని పొందుతున్నవి అని. అందువల్ల రాత్రి పూట కూడా సూర్యరశ్మి ఉండనే ఉంటున్నది. కాబట్టి రాత్రివేళ చనిపోయిన వాళ్ళకు కూడా విద్వాంసులైన వారికి రశ్మిని అనుసరించియే బ్రహ్మ ప్రాప్తి ఉన్నది. **ఇది రశ్మ్యను సార్యధికరణము.**

★ ★ ★

## ఇక నిశాధికరణము.

సూ॥ **నిశినేతిచేన్న. సమ్బన్ధస్యయావద్దేహ భావిత్వాత్ దర్శయతి చ 4-2-18**
రాత్రిపూట చనిపోయినవాడికి బ్రహ్మప్రాప్తి లేదనడం తగదు. విద్వాంసుడికి కర్మ సమ్బన్ధము దేహము ఉన్నంతవరకు ఉంటుంది. దేహము పోయిన తరువాత అడ్డంకి లేదు కాబట్టి రాత్రి మరణించిన వాడికిన్నీ బ్రహ్మ ప్రాప్తి కలుగుతుంది. ఆ విషయాన్ని శ్రుతి చూపిస్తున్నది కూడా. ఇప్పుడు ఈ విషయము విచారించబడుతున్నది. రాత్రివేళ

చనిపోయిన బ్రహ్మోపాసకుడికి బ్రహ్మప్రాప్తి ఉన్నదా? లేదా? అని. ఒకవేళ రాత్రి పూట సూర్యరశ్మి ఉన్నందువల్ల దాన్ని అనుసరించి పరమ పదానికి పోవడము కలిగినా నిశామరణాన్ని శాస్త్రాలలో నిందించినారు కాబట్టి పరమపురుషార్థరూపమైన బ్రహ్మప్రాప్తి నిశామృతునికి అప్రశస్తము అని తేటగా చెప్పబడింది. **శ్లో॥ దివాచ శుక్లపక్షశ్చ ఉత్తరాయణమేవచ। ముమూర్షతాం ప్రశస్తాని విపరీతం తుగర్హితమ్॥** పగలు, శుక్లపక్షము, ఉత్తరాయణములు మరణించే వారికి మెచ్చదగిన సమయాలు. ఇందుకు భిన్నంగా వ్యతిరేకమైనవి ఏవి ఉన్నవో అవి నింద్యములైనట్టివి అని దివా మరణనిశామరణాలు ప్రశస్తా ప్రశస్తము లైనందువల్ల ఉత్తమగతి, అధోగతులకు హేతువులవుతవి. అందువల్ల రాత్రి పూట చనిపోవడము అధోగతి కలుగడానికి కారణమవుతున్నందువల్ల బ్రహ్మప్రాప్తికి హేతువుకాదు అనిఅంటే అది సరికాదు. బ్రహ్మోపాసన చేసేవాడికి కర్మ సమ్బన్ధము దేహము ఉన్నంతవరకు ఉంటుంది. ఇదీ ఇక్కడ చెప్పబడుతున్నవిషయము – తమ కార్యమును ఆరంభించనివి. అధోగతికి కారణమైనటువంటివి ఐన కర్మలు విద్యాసమ్బన్ధము చేతనే నశించితున్నవి. ఇక విద్యాప్రాప్తి తరువాత జరిగిన కర్మలు అంటకపోవడము వల్లనూ, ప్రారంభించిన కార్యము గల కర్మలు దేహము ఉన్నంతవరకూ – చివరిదేహమే అవధిగా కలది ఐనందున శరీరములో బన్ధించడానికి కారణము లేదు కాబట్టి విద్వాంసుడు రాత్రిపూట మరణించినా బ్రహ్మప్రాప్తి తప్పక కలుగుతుంది. శ్రుతి వాక్యము కూడా ఇదే విషయాన్ని చూపుతున్నది. **తస్యతావదేవ చిరం యావన్నవిమోక్ష్యే. అథసమ్పత్స్యే.** అని ఇక **దివాచ శుక్లపక్షశ్చ** ఇత్యాది వాక్యాలు మాత్రము బ్రహ్మోపాసన చేయనివాడికి చెందినవి. **ఇది నిశాధికరణము.**

★ ★ ★

## ఇక దక్షిణాయన అధికరణము.

సూ॥ **అతశ్చాయనేఽపిదక్షిణే 4-2-19** మునుపు చెప్పిన కారణము వల్లనే దక్షిణాయనములో మరణించిన వాడికిన్నీ బ్రహ్మప్రాప్తి ఉన్నది. రాత్రిపూట చనిపోయిన విద్వాంసుడికి బ్రహ్మప్రాప్తి కల్గుతుంది అనడములో ఏ హేతువు చెప్పబడిందో దానివల్లనే దక్షిణాయనములో చనిపోయిన వానికిన్నీ బ్రహ్మప్రాప్తి కలుగుతుంది. ఐతే ఇక్కడ అధికశంక ఏమిటంటే? **అథయోదక్షిణే ప్రమీయతే పితృణామేవ మహిమానంగత్వా**

**చన్ద్రమసః సాయుజ్యంగచ్ఛతి.** ఇంక ఎవడైతే దక్షిణాయనములో మరణించుతాడో అతడు పితరులు గొప్పగా వెలుగొందే స్థానానికి పోయి తరువాత చంద్రునితో సాయుజ్యాన్ని పొందుతాడు. (సాయుజ్యము అనగా ఆ లోకాధిపతితో కలిసి మెలసి భోగాలను అనుభవించుతూ ఉండడము) అని దక్షిణాయనములో మృతి చెందినవాడికి చంద్రుడిని చేరుకోవడమనే ఫలము వినిపిస్తున్నది కాబట్టి మరియు చంద్రుని దగ్గరకు పోయిన వారికి **తేషాం యదా తత్ పర్యవైతి, అథఏతమే వాధ్వానం పునర్నివర్తన్తే** అని పునరావృత్తి (తిరిగి భూలోకానికి రావడం) వినిపిస్తున్నందువల్లనున్నూ, భీష్ముడు మొదలైన బ్రహ్మవిద్యానిష్ఠులైనవారు ఉత్తరాయణము వచ్చేంతవరకూ ఎదురుచూచి నందువల్లనున్నూ దక్షిణాయనములో చనిపోయిన వాడికి బ్రహ్మప్రాప్తి కలుగదు అని.

దీనికి పరిహారము ఏమిటంటే – బ్రహ్మోపాసన చేయని, పితృయాణమార్గము ద్వారా చంద్రుడిని చేరుకున్నవారికి మాత్రమే పునరావృత్తి ఉన్నది. విద్వాంసుడు చంద్రుని వద్దకు పోయినా **తస్మాద్ బ్రహ్మణో మహిమానమాప్నోతి** అందువలన బ్రహ్మయొక్క మహిమను (గొప్పతనాన్ని పొందుతున్నాడు) అనే వాక్య శేషాన్ని బట్టి ఆ దక్షిణాయన మృతుడికి చంద్రప్రాప్తి కలుగడము బ్రహ్మ వద్దకు పోయేవానికి విశ్రాన్తికి హేతువు మాత్రమే అని తెలుస్తున్నది.

వాక్యశేషము లేకపోయినప్పటికిన్నీ ముందుచెప్పిన బన్ధానికి హేతువు లేకపోయినందువల్ల చంద్రుడిని చేరిన విద్వాంసుడికి బ్రహ్మప్రాప్తి అడ్డుకోరానిదే. భీష్మాదులు తమయొక్క యోగము ప్రభావము వల్ల తమ ఇష్టము వచ్చినపుడు మరణించగల సమర్థులు కాబట్టి ధర్మాన్ని ప్రవర్తింపచేయడం కొరకు ఉత్తరాయణము యొక్క ప్రాశస్త్యాన్ని చూపడం కొరకున్నూ అటువంటి ఆచారాన్ని పాటించినారు.

ఇక్కడొక శంకను లేవనెత్తుతున్నారు. విద్వాంసులకు, చావదల్చుకున్నవారికిన్నీ పునరావృత్తి, అపునరావృత్తుల కొరకుగాను కాలవిశేషవిధి కనిపించుతున్నది. **శ్లో॥ యత్రకాలేత్వనా వృత్తిమ్ ఆవృత్తిం చైవయోగినః। ప్రయాతా యాన్తి తంకాలం వక్ష్యామి భర తర్షభ। అగ్నిర్జ్యో తిరహశ్శుక్లః షణ్మాసా ఉత్తరాయణమ్। తత్రప్రయాతా గచ్ఛన్తి బ్రహ్మబ్రహ్మవిదోజనాః। ధూమోరాత్రి స్తథా కృష్ణః షణ్మాసాదక్షిణాయనమ్। తత్ర చాన్ద్రమసం జ్యోతిః యోగీప్రాప్యనివర్తతే। శుక్లకృష్ణేగతీహ్యేతే జగతః శాశ్వతేమతే। ఏకయా యాత్యనావృత్తిం అన్యయాఆవర్తతే పునః ఇతి.**

ఏ కాలములోనైతే యోగులు తమ శరీరాలను విడిచివెడ్తున్నారో వారు ఆవృత్తిని, అనావృత్తిని పొందుతున్నారో ఆ కాలాన్ని గురించి చెప్తున్నాను విను. అగ్ని, జ్యోతిస్సు, పగలు, శుక్లపక్షము, ఉత్తరాయణము యొక్క ఆరు నెలలు ఈ సమయాల్లో బయలుదేరి పోయిన బ్రహ్మవేత్తలు పరమాత్మను చేరుకుంటున్నారు. ఇక ధూమము రాత్రిపూట, కృష్ణపక్షము, దక్షిణాయనపు ఆరునెలలు ఈ సమయంలో చనిపోయిన వారు, యోగులు చంద్రునివద్దకు పోయి తమ పుణ్యఫలాలను అనుభవించి తిరిగి భూలోకములో పుడుతున్నారు. ఈ శుక్లగతి, కృష్ణగతి అనేవి రెండున్నూ శాశ్వతమైనవి. మొదటిదానితో ఊర్ధ్వ లోకాలకు పోయినవారు తిరిగి వెనుకకు రారు. రెండవ మార్గము ద్వారా పోయినవారు తిరిగి భూలోకానికి వస్తారు అని. దీనికి సమాధానాన్ని చెపుతున్నారు.

సూ॥ **యోగినః ప్రతి స్మర్యేతే స్మార్తేచైతే. 4-2-20** ఇచ్చట యోగనిష్ఠులను గురించి చెపుతూ దేవయాన పితృయానాలను గురించి చెపుతున్నారు. యోగములో అంగముగా ఇవి ప్రతిదినమూ స్మరించుకోదగినవి. చావదల్చుకున్నవారి గురించి మరణకాలము చెప్పబడడము లేదు.

నీవు ఉదాహరించిన చోట మరణకాల విశేషాన్ని గురించి దీన్ని ఎంచుకొనే మరణించాలనిగానీ స్మృతిలో చెప్పడం లేదు. ఐతే యోగం నందు నిష్ఠులైనవారి గురించి స్మృతిగ్రన్థాలలో చెప్పబడిన తలచుకోదగినవైన దేవయాన పితృయాన మార్గాలు స్మరింపబడుతున్నవి. యోగంలో భాగంగా ప్రతిదినమూ ఇవి స్మరించుకోదగినవి. స్మృతిలో ఉపసంహారము కూడా ఆ విధంగానే ఉన్నది. **శ్లో॥ నైతేసృతీ పార్థజానన్ యోగీ ముహ్యతికశ్చన। తస్మాత్ సర్వేషుకాలేషు యోగయుక్తో భవార్జున।** ఓ అర్జునా! ఈ మార్గాలను తెలిసిన యోగి అజ్ఞానములో పడిపోడు. అందుకని అన్నివేళల్లోనూ అర్చిరాది మార్గాన్ని అనుసన్ధానము చేసుకోవడమనే రూపములో నున్న యోగయుక్తుడవుకమ్ము అని. **అగ్నిర్జ్యోతిః, ధూమోరాత్రిః** అనువాటి ద్వారా దేవయాన పితృయాన మార్గాలు ప్రత్యభిజ్ఞ చేయబడుతున్నవి. ఇక ఉపక్రమములోనూ **యత్రకాలేతు** అని కాలశబ్దము కాలాన్ని అభిమానించే దేవత ఐన ఆతివాహికునికి చెందింది. అగ్న్యాదులకు కాలత్వము సంభవించదు. అందువల్ల **తేఽర్చిష మభిసంభవన్తి** వారు అర్చిఃపురుషుడిని చేరుకుంటున్నారు అని విధింపబడిన దేవయానము యొక్క అనుస్మృతి ఇక్కడ విద్వానిష్ఠులను గురించి విధింపబడుతున్నది.

కానీ మరణించదల్చుకున్న వారి గురించి మరణకాల విశేషము విధింపబడడం లేదు. **ఇది దక్షిణాయన అధికరణము.**

**ఇంతటితో శ్రీభాష్యమునందు చతుర్థాధ్యాయములోని**
ద్వితీయపాదము ముగిసినది.

శ్రీమతే రామానుజాయనమః

## శ్రీభాష్యము – చతుర్థాధ్యాయము – తృతీయపాదము

### అర్చిరాద్యధికరణము.

సూ॥ **అర్చిరాదినా తత్ ప్రథితేః 4-3-01** అర్చిరాది మార్గము ఒక్కటే దాని ద్వారానే బ్రహ్మోపాసకుడు మోక్షానికి చేరుకుంటున్నాడు. దానికే ప్రసిద్ధి ఉన్నది. అవాన్తరభేదాలు ఎన్ని ఉన్నా దానికే ప్రత్యభిజ్ఞ ఉంటున్నది.

ఉత్క్రాన్తిని పొందిన విద్వాంసుడు హార్దపురుషుని యొక్క అనుగ్రహము వల్ల నాడీ విశేషము ద్వారా బయలుదేరి పోతున్నాడని గత్యుపక్రమము ఇంతవరకు చెప్పబడింది. అట్లా బయలుదేరి పోతూ ఉన్నవానియొక్క మార్గము ఇప్పుడు నిర్ణయింపబడుతున్నది. ఐతే ఈ విషయంలో వేదాలయందు మార్గాలు అనేకవిధాలుగా ఉపదేశింబడుతున్నవి. **ఛాన్దోగ్యము నందైతే – యథాపుష్కరపలాశే ఆపోనశ్లిష్యన్తే ఏవమేవంవిది పాపం కర్మ న శ్లిష్యతే** తామర పాకు మీద ఎట్లాగైతే నీళ్ళు అంటుకోవో – తాకకుండా, తడిలేకుండా ఉంటాయో ఆ విధంగానే బ్రహ్మజ్ఞానము కలిగి ఉపాసకుడైనవానికి పాపపు కర్మ తాకదు. అని మొదలుపెట్టి బ్రహ్మవిద్యను ఉపదేశించి ఈక్రింది విధంగా పఠింపబడుతున్నది. **అథయదుచైవ అస్మిన్ శవ్యం కుర్వన్తి యదుచన. అర్చిషమేవాభి సంభవన్తి. అర్చిషోఽహరహ్న ఆపూర్యమాణపక్షం ఆపూర్యమాణపక్షాత్ యాన్ షడుదఙ్ ఏతిమాసాంస్తాన్, మాసేభ్యః సంవత్సరం సంవత్సరాదాదిత్యం ఆదిత్యాత్ చన్ద్రమసం చంద్రమసో విద్యుతమ్। తత్పురుషోఽమానవః స ఏనాన్ బ్రహ్మగమయతి. ఏషదేవపథో బ్రహ్మపథః ఏతేన ప్రతి పద్యమానా ఇమం మానవ మావర్తం నావర్తన్తే. ఇతి.** తరువాత ఈ బ్రహ్మవేత్త ఐనవాని శరీరానికి – శవానికి – చేసే ఉత్తరక్రియలు

చెయ్యనీ! చెయ్యకపోనీ! వారు మాత్రము అర్చిఃపురుషుని వద్దకే చేరుకుంటారు. అర్చిస్సు నుండి పగలు అక్కడనుండి శుక్లపక్షము దానినుండి ఉత్తరాయణానికి చెందిన ఆరు మాసాలను, వాటినుండి సంవత్సరానికి, దాని నుండి సూర్యుని వద్దకు, ఆయననుండి చంద్రుని వద్దకు చంద్రుని నుండి విద్యుత్ పురుషుడి వద్దకు ఆయన నుండి అమానవుడు అనబడే తత్పురుషుని వద్దకు – తస్యపురుషః ఆ పరమాత్మకు సమ్బన్ధించిన పురుషుడు – ఆయన వీళ్ళను బ్రహ్మ వద్దకు చేరుస్తాడు.

ఇదే దేవపథము (దేవయానము) బ్రహ్మపథమున్నూ, బ్రహ్మవద్దకు పోయే మార్గము) దీనిద్వారా పోయేవారు ఈ మానవ జన్మలో తిరిగి జన్మించరు. అక్కడనే శాశ్వతంగా ఉండిపోతారు అని. ఛాన్దోగ్యములోనే అష్టమ భాగములో **అథఏతైరేవ రశ్మిభిః ఊర్ధ్వ మాక్రమతే** ఈ సూర్యకిరణాలతోనే ఊర్ధ్వలోకాలకు చేరుకుంటున్నాడు అని చెప్పబడింది. **కౌషీతకీ ఉపనిషత్తుకు** చెందిన వారు దేవయానమార్గాన్ని మరొక విధంగా ఉపదేశిస్తున్నారు. **స ఏతం దేవయానం పన్థానమాపద్య అగ్నిలోకమాగచ్ఛతి. సవాయు లోకం స వరుణలోకం స ఇంద్రలోకం సప్రజాపతి లోకం స బ్రహ్మ లోకమ్ ఇతి.** ఈ దేవయాన మనబడే బాటను చేరుకొని తద్ద్వారా అగ్నిలోకానికి అక్కడనుండి వాయులోకానికి, వరుణలోకానికి, ఇంద్రలోకానికి, బ్రహ్మలోకానికి (ప్రజాపతి) చివరగా పరబ్రహ్మ లోకానికి చేరుకుంటాడు అని. అదేవిధంగా **బృహదారణ్యకము** నందున్నూ **యఏవమేత ద్విదుః. యేచేమేఽరణ్యే శ్రద్ధాం సత్య ముపాసతే తే అర్చిషమభిసమ్భవన్తి. అర్చిషోఽహరహ్న ఆపూర్య మాణ పక్షమా పూర్యమాణ పక్షాత్ యాన్ షణ్మాసానుదజ్ ఆదిత్య ఏతి మాసేభ్యో దేవలోకం దేవలోకాదాదిత్యం ఆదిత్యాత్ వైద్యుతం వైద్యుతాత్ పురుషోఅమానవస్స ఏత్య బ్రహ్మలోకాన్ గమయతి.**

ఎవరైతే దీన్ని ఈవిధంగా తెల్సుకుంటున్నారో వారు, మరియు ఎవరైతే అడవిలో శ్రద్ధను సత్యాన్ని ఉపాసిస్తున్నారో వారున్నూ దేహత్యాగము చేసిన పిదప అర్చిర్లోకానికి వెళ్తున్నారు. అక్కడనుండి పగలు శుక్లపక్షము, ఉత్తరాయణపు ఆరునెలలు, వాటినుండి దేవలోకము దానినుండి సూర్యుడు, విద్యుత్ పురుషుడు / లోకము దానినుండి అమానవపురుషుడు / అమానవుడు వచ్చి బ్రహ్మలోకాలకు చేర్చుతాడు అని. దానిలోనే మరొకతీరుగా **యదా వైపురుషోఽస్మాల్లోకాత్ ప్రైతి సవాయు మాగచ్ఛతి తస్మై సతత్రవిజిహీతే యథారథ చక్రస్యఖమ్. తేన స ఊర్ధ్వ మాక్రమతే. సఆదిత్యమాగచ్ఛతి. తస్మైసతత్ర విజిహీతే, యథా ఆడమ్బరస్య ఖమ్. తేనస ఊర్ధ్వమాక్రమతే.**

**సచన్ద్రమసమాగచ్ఛతి. తస్మైసతత్రవిజిహీతే యథా దున్దుభేఃఖమ్. ఇత్యాది.** ఎప్పుడైతే పురుషుడు ఈ లోకాన్నుండి బయలు దేరిపోతున్నాడో అప్పుడతడు వాయులోకానికి వెళ్ళుతున్నాడు.

ఇచ్చట సందేము కలుగుతున్నది. ఈ శ్రుతులన్నింటిచేత అర్చిరాదిమార్గము ఒక్కటే ప్రతిపాదింపబడుతున్నదా? ఉపాసకుడైన విద్వాంసుడు ఆ మార్గం ద్వారానే బ్రహ్మ వద్దకు పోతున్నాడా? లేక అర్చిరాది కంటే మిగతావి వేరు మార్గాలైనప్పుడు వాటిద్వారాగాని లేకఈ దేవయానముతో నేనా? లేక ఏదో ఒక మార్గములో వెళ్ళవచ్చును కనుక నియమము లేదనియా? అని. వీటిలో ఏది యుక్తమైనది? అని అంటే నియమము లేకపోవడమే అని. ఎందువల్లనంటే అవి అనేకరూపాలుగా ఉన్నందువలన మరియు దీనితోనే బ్రహ్మ లోకం లోనికి పోవాలనే అపేక్ష లేదు కాబట్టినీ. అని నిర్ణయము చేయబడితే చెప్పబడుతున్నది. అర్చిరాదినా అని. అర్చిరాది మార్గము ఒక్కటి మాత్రమే అన్ని శ్రుతులలోనూ ప్రతిపాదింపబడుతున్నది. కనుక విద్వాంసుడు అర్చిరాది మార్గములోనే పోతున్నాడు. ఎందువల్లనంటే ప్రసిద్ధి దానికే ఉన్నది. దానికే అన్ని శ్రుతులలోనూ ప్రసిద్ధి ఉన్నది. ప్రథితిః = ప్రసిద్ధి. దానికే అన్నింటిలో ప్రత్యభిజ్ఞ కనిపిస్తున్నది అని అర్థము. ప్రత్యభిజ్ఞ వలన అర్చిరాది మార్గమే ఎక్కువతక్కువలతో (న్యూనాధిక భావముతో) అన్నిచోట్ల ప్రతిపాదింపబడుతున్నది కనుక విద్యలయందు గుణాలను ఉపసంహారము చేసుకొన్నట్లు ఒకచోట చెప్పినదానిని మరొకచోట ఉపసంహారము చేయబడుతుంది. ఛాన్దోగ్యము నందైతే ఉపకోసల విద్యయందు, పంచాగ్నియందున్నూ ఒకే విధముగా ఉపదేశింపబడుతున్నది వాజసనేయకమునందున్నూ పంచాగ్ని విద్యయందు కొద్దపాటి భేదముతో ఉపదేశింపబడుతున్నది. అందువల్ల అక్కడకూడా అర్చిరాదిమార్గము అనే తోస్తున్నది. తక్కినవాటిలోనూ అగ్ని, ఆదిత్యుడు మొదలైనవారు ప్రత్యభిజ్ఞ చేయబడుతున్నారు. **ఇది అర్చిరాది అధికరణము.**

★ ★ ★

## ఇక వాయ్వధికరణము.

సూ॥ **వాయుమబ్దాదవిశేష విశేషాభ్యామ్ 4-3-2** సంవత్సరము కంటే పైన వాయువు వద్దకే వెళ్ళుతాడు. విశేషము అవిశేషము వల్ల వాయువే నిర్దేశింపబడినాడు

కనుక. విద్వాంసులు అర్చిరాది మార్గముతోనే బ్రహ్మలోకానికి వెళ్ళుతారు అని చెప్పబడింది. ఆ అర్చిరాది మార్గములో ఛాన్దోగులు మాసము ఆదిత్యునికి నడుమ సంవత్సరాన్ని పఠించుతున్నారు. **మాసేభ్యః సంవత్సరం సంవత్సరాదా దిత్యమ్** అని. వాజసనేయులు మాత్రము వాటికి నడుమన దేవలోకాన్ని పఠించుతున్నారు. **మాసేభ్యోదేవలోకమ్ దేవలోకాదాదిత్యమ్** అని. రెండుచోట్లలోనూ మార్గము ఒకటే కాబట్టి రెండింటినీ రెండుచోట్లా ఉపసంహారము చేసుకోవాలి. ఆ సందర్భములో మాసము కంటే పైన చెప్పబడిన సంవత్సర దేవలోకాలకంటే పంచమీ విభక్తితో చెప్పబడిన శ్రౌతక్రమము – శ్రుతి/వేదములో వినపడిన క్రమము వరుస సమానమే ఐనా **అర్చిషోఅహః అహ్నఆపూర్యమాణపక్షమ్ ఆపూర్యమాణపక్షాత్ యాన్ షడుద జ్ఞేతిమాసాంస్తాన్** అని అధికకాలము కల వాటిని న్యూనకాలము కల వాటికంటే ఉత్తరోత్తరముగా – తరువాత తరువాతగా – ఉంచడము కనిపిస్తున్నది కాబట్టి మాసము తరువాత సంవత్సరమే బుద్ధియందు తిరుగుతున్నందువల్ల సంవత్సరమే మాసానికిపైన ఉంచవలసి ఉన్నది. దానికి పైన దేవలోకము అని నిశ్చయింపబడుతున్నది. మరొకచోట వాజసనేయులు **యదావైపురుషోఽస్మాల్లోకాత్ ప్రైతి స వాయు మాగచ్ఛతి. తస్మైసతత్ర విజిహీతే యథారథ చక్రస్యఖమ్. తేనస ఊర్ధ్వమాక్రమతే. స ఆదిత్యమాగచ్ఛతి.** అని ఆదిత్యుని కన్నాముందు వాయువును పేర్కొంటున్నారు. కౌషీతకులు ఐతేనో **సఏతం దేవయానం పన్థానమాపద్య అగ్నిలోకమాగచ్ఛతి సవాయులోకమ్.** అని అగ్నిలోకశబ్దము చేత నిర్దేశింపబడిన అర్చిస్సు కంటేపైన వాయువును పఠించుతున్నారు. కౌషీతకులయొక్క పాఠము యొక్క క్రమము ప్రకారము అర్చిస్సు కంటే పైన వచ్చిన వాయువును, వాజసనేయులు పాఠములో **తేన స ఊర్ధ్వమాక్రమతే స ఆదిత్యమాగచ్ఛతి** అని ఊర్ధ్వ శబ్దముచేత నిర్దేశింపబడిన శ్రౌత క్రమము ప్రకారము పాఠక్రమాన్ని బట్టి బలీయముఐన ఆదిత్యునికంటే ముందు ప్రవేశించడము నిశ్చయింపబడుతున్నది. ఇందువల్ల ఆదిత్యుని కంటే ముందు సంవత్సరానికి పైన దేవలోకము వాయువున్నూ పొందినవి.

ఈ విషయములో విచారింపబడుతున్నది ఇది – దేవలోకము వాయువున్నూ వేరువేరుగా ఉన్నాయా? అట్లయినప్పుడు విద్వాంసుడు తన ఇష్టము ప్రకారము పోగల్గుతాడు. లేక రెండూ అర్థాన్తరములు కాక ఒక్కటే ఐనప్పుడు సంవత్సరానికి పైన ఉన్న దేవలోకము అనబడే వాయువును గురించి వెళ్ళుతాడా? అని. ఏది తగును? అంటే

భిన్నార్థములు అనియే. అటువంటి ప్రసిద్ధే ఉన్నది కాబట్టి. భిన్నార్థములు ఐనప్పుడు ఊర్ధ్వ శబ్దము తోను, పంచమీ విభక్తి వల్లనున్నూ రెండింటికీ సంవత్సరము ఆదిత్యులకు నడుమ శ్రుతిక్రమము ప్రకారము స్థానము లభించినందువల్ల విశేషము లేదు కాబట్టి విద్వాంసుడు తన ఇష్టము ప్రకారము పోవచ్చును.

అని నిర్ణయము చేయబడితే చెప్పబడుతున్నది వాయుమబ్దాత్ అని. సంవత్సరానికి పైన వాయువు వద్దకు పోవలెను అని. ఎందువల్ల? అని అంటే అవిశేషము, విశేషములు రెండింటివల్లనూ వాయువే నిర్దేశించబడింది కనుక. దేవలోక శబ్దము అవిశేషముగా – సామాన్యంగా దేవానాంలోకః అనే విగ్రహవాక్యము ప్రకారము వాయువునే చెప్పుతున్నది. **సవాయు మాగచ్ఛతి. తస్మైసతత్ర** అని వాయు శబ్దము విశేషణ వాయువునే చెపుతున్నది. కనుక దేవలోక వాయుశబ్దాల చేత – అవిశేషవిశేషాల చేత – వాయువే చెప్పబడుతున్నది. కనుక సంవత్సరానికి తరువాత / పైన వాయువునే చేరాలి. కౌషీతకుల యొక్క వాయుశబ్దము కూడా అగ్నిలోక శబ్దము వలె వాయుశ్చాసౌ లోకశ్చ అనే వ్యుత్పత్తి ప్రకారము వాయువునే చెప్పుతున్నది. వాయువు కూడా దేవతలకు నివాసస్థానము అని మరొక శ్రుతిలో వినిపిస్తున్నది. **యోఽయం పవతే ఏషదేవా నాంగృహః** ఎవరైతే వీచుతున్నారో ఆయన దేవతలకు ఇండ్లవంటివాడు అని. **ఇది వాయ్వధికరణము.**

★ ★ ★

## ఇక వరుణాధికరణము.

సూ॥ **తటితో ఽ ధివరుణః సమ్బన్ధాత్. 4–3–3** వరుణుడిని విద్యుత్తుకంటే పైన చేర్చుకోవాలి. సమ్బన్ధము పరస్పరము ఉన్నది కాబట్టి. వరుణుడు – జలము, విద్యుత్తు రెండున్నూ మేఘాల యొక్క నడుమ ఉంటున్నవి కదా! కౌషీతకుల యొక్క పాఠములో **సఏతం దేవయానం పన్థానమాపద్య అగ్నిలోకమాగచ్ఛతి స వాయులోకం సవరుణలోకం సఇన్ద్రలోకం సప్రజాపతి లోకం సబ్రహ్మలోకం** అనుచోట అగ్నిలోక శబ్దము అర్చిశ్శబ్దానికి పర్యాయపదమైనందున ప్రాథమ్యము (మొదటిస్థానం) వివాదాస్పదము కాదు. వాయువుకున్నూ సంవత్సరానికంటే పైన ఉంచడము చెప్పబడింది. ఆదిత్యుడికిన్నీ కౌషీతకి వాక్యములో లభించిన పాఠక్రమము యొక్క బాధవలన **దేవలోకాదాదిత్యం ఆదిత్యాద్వైద్యుతమ్** వాజసనేయకములో చెప్పబడిన

శ్రుతి క్రమము ప్రకారము దేవలోక శబ్దము చేత చెప్పబడిన వాయువుకు ఉపరినివేశము సిద్ధమయ్యింది. ఇప్పుడు వరుణేంద్రుల (యందు) గురించి చిన్తచేయబడుతున్నది. ఈ వరుణాదులు పాఠములో ఉన్నదున్నట్లు వాయువుకంటే పైన ఉంచాల్నా? లేక విద్యుత్తు కంటే పైననా? అని సంశయము ఏర్పడింది. అర్చిస్సు మొదలుకొని ఉన్న అన్నిటిలో "**అర్చిషో అహః**" మొదలైన శ్రుతిక్రమ ప్రకారము విద్యుత్తు కంటే పిదప **తత్పురుషోఽమానవః సఏనాన్ బ్రహ్మగమయతి** అని బ్రహ్మను చేర్చేవాడుగా విద్యుత్ పురుషుడు వినపడుతున్నందువల్ల, అన్నిచోట్లలోనూ అవకాశము లేనందువల్ల, ప్రాప్తిలేకపోయిందువల్ల ఉపదేశము వ్యర్థము కాకుండడం కొరకు తప్పక ఎవరినో ఒకరిని బాధించవలసి వచ్చినప్పుడు పాఠక్రమాన్ననుసరించి వాయువు తరువాత వరుణుడిని చేర్చుకోవాలి. వాయువు ఆదిత్యుల యొక్క క్రమము బాధింపబడినందున ఇన్ద్రప్రజాపతులను కూడా ఇక్కడే చేర్చవలసి ఉంటుంది అని పూర్వపక్షము రాగా చెప్పబడుతున్నది. తటితోఽధివరుణః అని.

వరుణుడు విద్యుత్తు కంటే పైన ఉంచదగినవాడు. ఎందువల్లనంటే సమ్బన్ధము వల్ల. మేఘము లోపల ఉండేది కాబట్టి విద్యుత్తుకు వరుణుడితో సమ్బన్ధము లోకము లోను వేదములోను అందరికీ తెలిసినటువంటిదే. ప్రసిద్ధమైనదే. అనగా ఇదీ చెప్పబడుతున్న విషయము. వరుణాదులయొక్క ఉపదేశము వ్యర్థము కాకుండా ఉండడం కోసము ఎక్కడో ఒక దగ్గర ఉంచవలసి వస్తే పాఠక్రమము కంటే అర్థక్రమము బలీయము కాబట్టి విద్యుత్తు కంటే పైన వరుణుడిని ఉంచాలి. ఆ తరువాత / అమానవుడి యొక్క గమయితృత్వము – చేర్చేవాడు కావడము – కొంత వ్యవధానమును – ఎడమును ఓర్వదగినదని తెలుస్తున్నది. అమానవుడు వ్యవధానాన్ని సహించేవాడడవడం వల్ల, ఉపదేశింపబడిన ఇంద్రాదులు తప్పక చేర్చుకోదగిన వారైనందువల్ల వరుణుని కంటే పైన ఉపదేశింపబడినందువల్ల నడుమ వచ్చిన వారిని చివరలో ఉంచవలసి యున్నందువల్ల, వరుణుడి కంటే పైన ఇంద్రాదులు ఉంచదగిన వారవుతున్నారు అని. ఇక్కడ పరమార్థ ద్వయ శ్లోకాలను అనుసంధించుకోవడం మంచిది.

శ్లో॥ **ముక్తోఽర్చిర్దిన పూర్వపక్ష షడుదఙ్ మాసాబ్దవాతాంశుమత్ గ్లౌవిద్యుద్వరుణేంద్ర ధాతృమహితః సీమాన్తసింధ్వాప్లుతః** శ్రీవైకుంఠము పేత్యనిత్యమజడంతస్మిన్‌పరబ్రహ్మణఃసాయుజ్యమ్‌సమవాప్యనన్దతిసమంతేనైవధన్యః పుమాన్. తా॥ ముక్తుడు తొలుతగా అర్చిః పురుషుడిని / అగ్నిని / సూర్యకిరణాలను

చేరుకుంటాడు. అక్కడినుండి కాలములో భాగమైన దినము/ పగలు, శుక్లపక్షము, ఉత్తరాయణము, సంవత్సరము, వాయువు, సూర్యుడు, చంద్రుడు, విద్యుత్తు, వరుణుడు, ఇంద్రుడు, బ్రహ్మలోకముల మీదుగా లీలావిభూతికి, నిత్యవిభూతికి నడుమ ఉన్న సరిహద్దు నది ఐన విరజా నదిని చేరుకొని దానిలో స్నానము చేసి శ్రీవైకుంఠనగరానికి చేరుకొని అందులో పరబ్రహ్మ ఐన నారాయణుడి సాయుజ్యాన్ని చేరుకొని (కలసిమెలసి ఉండడాన్ని) పొంది ఆయనతో పాటుగా ఆనందాన్ని అనుభవిస్తాడు. దానితో జీవుడు ధన్యుడు అవుతున్నాడు. **ఇది వరుణాధికరణము.**

★ ★ ★

## ఇకపైన ఆతివాహికాధికరణము.

సూ॥ **ఆతివాహికాః తల్లింగాత్ 4-3-4** ఈ అర్చిరాదులందరూ ఆతివాహికులు. దానికి చెందిన గుర్తులు కనపడుతున్నవి కనుక. ఇప్పుడు ఇది విచారింపబడుతున్నది. ఈ అర్చిరాదులు అన్నీ మార్గాన్నీ సూచించే గుర్తులువంటివా? లేక భోగాలు అనుభవించే భూములా? లేకపోతే బ్రహ్మను చేరుకోబోయే ఉపాసకులకు మార్గాన్ని చూపుతూ ముందుకు తీసుకొని పోయేవారా? అని. వీటిలో ఏది తగినది. అని అంటే మార్గాన్ని సూచించే గుర్తులవంటివి. అని అనడం తగినట్టిది. ఎందువల్లనంటే ఈ ఉపదేశము ఆ విధంగా కనపడుతున్నది. లోకంలో ఆయాగ్రామాలకు పోయేవారికి ఈవిధంగా పెద్దలచేత చెప్పబడడం కనిపించుతున్నది కదా! ఇక్కడ నుండి బయలుదేరి ఈ చెట్టు దగ్గరికి, ఈ నది వద్దకు ఈ కొండ పక్కకు పోయి అక్కడ నుండి ఈ గ్రామానికి వెళ్ళు అని. లేదా ఇవన్నీ భోగభూములైనా కావచ్చును. కాలములో విశేషములుగా ప్రసిద్ధి కెక్కిన అహరాదులు మార్గ చిహ్నాలు కావడము పొసగదు. దానికంటే వేరయిన మార్గచిహ్నమయినది వీటిని చెప్పలేదు. ఇక భోగభూమిత్వము- **ఏతఏవలోకాః యదహో రాత్రాణి అర్ధమాసా మాసాః ఋతవః సంవత్సరాః** అని అహరాదులకు లోకములుగా చెప్పడం వల్ల పొసగుతుంది. ఇందువల్లనే కౌషీతకులు **అగ్నిలోక మాగచ్ఛతి** ఇత్యాది వాక్యాలతో లోకశబ్దాన్ని జతచేసి అర్చిరాదులను పఠించుతున్నారు అని.

ఈ విధంగా పూర్వపక్షము ఎదురైతే చెపుతున్నాము. ఆతివాహికులు అని. విద్వాంసులైన ఉపాసకులను తన వద్దకు చేర్చడము కొరకు పరమపురుషునిచేత

నియమింపబడిన దేవతా విశేషాలే ఆతివాహికులనబడే అర్చిరాదులు. ఎందువల్లనంటే తల్లింగాత్ – అతివహనము అనే లింగము వలన. అతివహనం అంటే ఒక గమ్యానికి బయలుదేరి పోయేవారిని అక్కడకు చేర్చడము. గమయితృత్వమనేది **తత్పురుషోఽమానవః సఏనాన్ బ్రహ్మగమయతి** అని ముగింపులో వినబడే వాక్యము అమానవునికంటే ముందున్న వారికి, ఈయన కంటే విశేషము ఏమీలేకుండా వినిపించబడిన వారికిన్నీ అదే ముందుకు తీసుకొనిపోవడమే సమ్బన్ధం అని తెల్పుతున్నది. అర్చిరాది శబ్దాలు కూడా అర్చిరాదుల – ఆత్మల వంటివారైన అభిమాన దేవతావిశేషాలను చెప్తున్నవి. **తం పృథివీ అబ్రవీత్** అన్నట్లుగా.

ఒకవేళ ఇది ఇట్లాగే ఐనట్లయితే **తత్పురుషోఽమానవః సఏనాన్ బ్రహ్మగమయతి** అని విద్యుత్ పురుషుడు బ్రహ్మ వద్దకు చేరుస్తాడని అని బ్రహ్మగమయితృత్వము వినిపిస్తున్నది కాబట్టి విద్యుత్ పురుషుడికంటే తరువాత ఉన్న వరుణాదులకు ఆతివాహికత్వముతో సమ్బన్ధము ఎట్లా? ఉంటుంది? అని అంటే చెప్తున్నారు.

సూ॥ **వైద్యుతేనైవ తతః తత్ శ్రుతేః 4–3–5** తతః – విద్యుత్ కంటే పైన, వైద్యుతేనఽఅమానవుడనబడే ఆతి వాహికుని చేత విద్వాంసులు బ్రహ్మను చేరుకొనేంతవరకు గమనము కనపడుతున్నది. ఏ కారణము చేత అని అంటే అది శ్రుతి వాక్యము వల్ల తెలుస్తున్నది. **సఏనాన్ బ్రహ్మ గమయతి** అని అతనికే గమయితృత్వము వినిపిస్తున్నది కాబట్టి. వరుణాదులైతే మాత్రము అనుగ్రాహకులు – సహకరించేవారు. కనుక వారికి కూడా ఆతివాహకత్వముతో సమ్బన్ధం ఉండనే ఉన్నది. **ఇది ఆతివాహికాధికరణము.**

★ ★ ★

## ఇక కార్యాధికరణము.

సూ॥ **కార్యం బాదరిరస్యగత్యుపపత్తేః 4–3–6** కార్యబ్రహ్మను ఉపాసించిన వారినే అమానవ పురుషుడు ఆయన వద్దకు చేరుస్తున్నాడని బాదరి అనే ఆచార్యుడు చెప్తున్నాడు. ఉపాసకుడికి ఆయన వద్దకు పోవడమే కుదురుతుంది కనుక. పరబ్రహ్మోపాసకుడు అర్చిరాదిమార్గము ద్వారానే ఆయన వద్దకు వెళ్తున్నాడు. అర్చిఃపురుషుడు మొదలుకొని అమానవుడు వరకు ఉన్న గణము – ఆతివాహికులు – విద్వాంసుడిని బ్రహ్మ వద్దకు చేరుస్తారు అని చెప్పబడింది. ఇప్పుడు దీని గురించి విచారించుతున్నారు.

ఈ అర్చిరాది గణము కార్య బ్రహ్మ ఐన హిరణ్య గర్భుడిని ఉపాసించిన వారిని తీసుకొనిపోతారా? లేక పరబ్రహ్మనే ఉపాసించినవారినా? అది కాకపోతే పరబ్రహ్మో ఉపాసన చేసిన వారిని, ప్రత్యగాత్మను బ్రహ్మాత్మకుడుగా ఉపాసించినవారినిన్నీ తీసుకొని పోతారా అని సందేహము కలిగితే కార్యబ్రహ్మను ఉపాసించిన వారినే హిరణ్య గర్భుని వద్దకు చేరుస్తారు అని ఆచార్యుడైన బాదరి తలుస్తున్నాడు. ఎందువల్లనంటే అస్యఽహిరణ్యగర్భుడిని ఉపాసించిన వాడికే గమనము చెల్లుతుంది గనుక. ఆత్మఐనవాడు ఐన పరబ్రహ్మను ఉపాసించిన వానికి ఆయనను పొందడము కోసం ఏదో ఒక దేశానికి పోవడము నప్పదు. ఆయనను పొందడము జరిగింది కాబట్టే ఎప్పుడూ అందుబాటులో ఉండే పరబ్రహ్మకు చెందిన అవిద్యా నివృత్తి మాత్రమే పరవిద్యయొక్క కార్యము కదా! కార్యబ్రహ్మ ఐన హిరణ్యగర్భుడిని ఉపాసించినవాడికి పరిమితమైన ఒకానొక దేశములో ఉండే ప్రాప్యమైన వాడిని చేరుకోవడము కొరకు బయలుదేరి పోవడము చెల్లుతుంది. అందువల్ల అర్చిరాది ఆతివాహక గణము చతుర్ముఖ బ్రహ్మ వద్దకే చేరుస్తుంది.

సూ॥ **విశేషితత్వాచ్చ 4-3-7** విశేషితమైనందువల్ల కూడా. **పురుషోమానస ఏత్య బ్రహ్మ 'లోకాన్' గమయతి** అని లోకశబ్దముతో, బహువచనముతోనూ విశేషమైన లోకమునందు ఉండే హిరణ్య గర్భుడిని ఉపాసించిన వాడిని మాత్రమే చేర్చుతున్నాడని విశేషింపబడుతున్నది. (మానస= సంకల్పరూపుడైన అమానవ పురుషుడు) ఇంతేకాకుండా **ప్రజాపతేః సభాం వేశ్మ ప్రపద్యే** ప్రజాపతి యొక్క సభను, ఇంటిని చేరుకుంటాను అని కార్యమైన హిరణ్య గర్భుని వద్దకు / దగ్గరకు పోతాను అని అర్చిరాది మార్గముగా పోయినవాడు తల్చుకుంటున్నాడు కదా!

**తత్పురుషోఽమానవః సఏనాన్ బ్రహ్మ గమయతి** అనే ఈ నిర్దేశము చెల్లదు. హిరణ్యగర్భుడి వద్దకే చేర్చినట్లయితే **సఏనాన్ "బ్రహ్మాణం" గమయతి** అని చెప్పవలసి ఉంటుంది కదా! అని అన్నట్లయితే చెప్తున్నారు.

సూ॥ **సామీప్యాత్తుతద్వ్యపదేశః 4-3-08** దగ్గరగా ఉన్నందువలన బ్రహ్మకు బదులు బ్రహ్మ అని పేర్కొన్నారు.

**యో బ్రహ్మాణం విదధాతి** ఎవడు బ్రహ్మను పుట్టించుతున్నాడో అని చెప్పినట్లు హిరణ్యగర్భుడు మొదటగా పుట్టినందువల్ల బ్రహ్మతో సామీప్యము ఉన్నందువల్ల

ఆయనను బ్రహ్మశబ్దముతో పేర్కొన్నారు అని గత్యను పపత్తి, విశేషణాదులైన వానితో, ఇంతకుముందు చెప్పబడిన కారణాలవల్ల నిశ్చయింపబడుతున్నది అని అర్థము.

ఐతే ఇట్లా కావచ్చును. అర్చిరాది మార్గంగా హిరణ్యగర్భుడిని చేరుకున్నట్లయితే **ఏష దేవపథో బ్రహ్మపథః ఏతేనప్రతిపద్యమానాః ఇమం మానవమావర్తం నావర్తన్తే 2) తయోర్ధ్వమాయన్నమృతత్వ మేతి** అనే వాక్యాల ప్రకారము అమృతత్వప్రాప్తి అపునరావృత్తులను గురించి చెప్పడం కుదురదు. మరొకనికి కార్యము ఐన హిరణ్యగర్భుడు ద్విపరార్ధకాలము ముగిసిన తరువాత నశించిపోతున్నాడని శాస్త్రము చెప్తున్నది. **ఆబ్రహ్మ భువనాల్లోకాః పునరావర్తినోఽర్జున** బ్రహ్మలోకము మొదలుకొని లోకాలన్నీ కూడా మళ్ళీ మళ్ళీ పుట్టి నశించేవే సుమా! అని చెప్పినందువల్ల హిరణ్యగర్భుడిని చేరుకున్నవానికి పునరావృత్తి తప్పడం లేదు కదా! అని అంటే దానికి సమాధానాన్ని చెప్తున్నారు.

సూ॥ **కార్యాత్యయే తదధ్యక్షేణ సహాతః పరమభిధానాత్ 4-3-9** కార్యస్యఽ బ్రహ్మలోకము నశించిపోయినప్పుడు దానికి అధ్యక్షుడు ఐన హిరణ్యగర్భునితో అధికారము ముగిసిన విద్వాంసునితో పాటు స్వయంగా విద్యను పొందినవాడై, అతఃఽకార్యబ్రహ్మలోకము నుండి పరంబ్రహ్మను పొందుతున్నాడు. అని అర్చిరాది మార్గంగా పోయినవానికి అమృతప్రాప్తి, అపునరావృత్తి చెప్పబడింది.

కాబట్టి **తేబ్రహ్మలోకేతు పరాన్తకాలే పరామృతాత్ పరిముచ్యన్తి సర్వే** వారు బ్రహ్మలోకము నందు పరార్ధకాలము ముగిసిన తరువాత పరామృతత్వాన్ని పొంది అందరూ విముక్తులు అవుతున్నారు అని చెప్పడం వల్లనున్నూ హిరణ్యగర్భుడిని చేరుకున్నవారు ఆయన కాలము ముగిసిన పిదప ఆయనతో పాటు మోక్షాన్ని పొందుతున్నారు అని తెలుస్తున్నది.

సూ॥ **స్మృతేశ్చ 4-3-10** స్మృతి వల్ల కూడా ఈ అర్థము తెలుస్తున్నది. **బ్రహ్మణా సహతే సర్వే సంప్రాప్తే ప్రతిసంచరే। పరస్యాన్తే కృతాత్మానః ప్రవిశన్తి పరం పదమ్॥** వారందరూ ప్రళయకాలము వచ్చినపుడు, పరార్ధ కాలము ముగిసినప్పుడు బ్రహ్మతో సహ పరమపదములోకి ప్రవేశించుతున్నారు అని. కనుక కార్యబ్రహ్మను ఉపాసించిన వాడినే అర్చిరాది గణము తీసుకొని పోతుంది అని బాదరి యొక్క మతము. ఈ సందర్భములో మరొక పక్షాన్ని గ్రహించి జైమిని ఎదురుపడుతున్నాడు.

సూ॥ **పరం జైమినిః ముఖ్యత్వాత్ 4–3–11** పరబ్రహ్మను ఉపాసించిన వారినే అర్చిరాది గణము తీసుకొనిపోతుంది అని జైమిని తలుస్తున్నాడు. బ్రహ్మశబ్దము పరబ్రహ్మ యందే ముఖ్యము కనుక.

పరబ్రహ్మను ఉపాసించినవాడినే అర్చిరాది గణము తీసుకొనిపోతుంది అని జైమిని అనే ఆచార్యుడు భావించుతున్నాడు. ఎందువల్లనంటే ముఖ్యముఐనందువల్ల. **తత్పురుషోఽమానవః సఏనాన్ బ్రహ్మ గమయతి** అని బ్రహ్మ శబ్దము పరబ్రహ్మ యందే ముఖ్యము ఐనందువల్ల. ఇతర ప్రమాణము చేత కార్యత్వము నిశ్చయము ఐనప్పుడు లక్షణను ఆశ్రయించడము తగును. ఐతే గమనానుపపత్తి ప్రమాణము కాదు.

పరబ్రహ్మ అంతటా నిండియున్నవాడే ఐనా విశిష్టదేశము నందు ఉన్నవానివల్లనే ఉపాసకుని యొక్క అవిద్య తొలగి పోతుంది అని శాస్త్రము చెప్పుతున్నది. ఎట్లాగైతే విద్యా ఉత్పత్తి అనేది జరగడానికి వర్ణము, ఆశ్రమము, ధర్మము, శౌచము, ఆచారము, దేశము, కాలము, ఆదులతో అవసరము ఉన్నట్లు, **తమేతం వేదానువచనేన** ఇత్యాది శాస్త్రాదులతో తెలుస్తున్నదో ఆ విధంగానే బొత్తిగా అవిద్యతొలగిపోవడమనే విద్యానిష్పత్తి కూడా విశిష్టమైన దేశానికి పోవడమనే దానితో సాపేక్ష కలిగి ఉన్నదని గతిని చెప్పే శాస్త్రాన్ని బట్టి తెలుస్తున్నది. విద్వాంసునికి ఉత్క్రాన్తి లేదు అనే ప్రతిషేధాదులు ఇంతకు మునుపే పరిహరింపబడినవి.

బ్రహ్మలోకాన్ అని లోకశబ్దము, బహువచనము వలన విశేషింప బడుతున్నందు వల్ల కార్యమైన హిరణ్యగర్భుడు స్ఫురించుతున్నాడని ఏమాట చెప్పినారో అది తగిన మాటకాదు. నిషాదస్థపతి న్యాయము ప్రకారముగా ఇక్కడ బ్రహ్మైవ లోకః (బ్రహ్మయే లోకము) అని కర్మధారయ సమాసము చెప్పకోవడమే సమంజసము. అర్థమైన బ్రహ్మ ఒక్కడే అని నిశ్చయించినప్పుడు బహువచనాన్ని **అదితిః పాశాన్** అన్నప్పుడు బహువచనము ఎట్లా సమన్వయించుకోబడిందో ఆ విధంగా మల్చుకోవాలి. అప్పుడు సరిపోతుంది. పరిపూర్ణుడు, సర్వగతుడు, సత్యసంకల్పుడు ఐన పరబ్రహ్మకు తన ఇష్టము మేరకు పుట్టింపబడినవి తనకు మాత్రమే అసాధారణములైనట్టివి ప్రకృతితో సమ్బన్ధము లేనివి ఐన లోకాలు ఉన్నాయి. ఈ విషయము శ్రుతి, స్మృతి, ఇతిహాస, పురాణాల వల్ల స్పష్టంగా తెలుస్తున్నవి.

సూ॥ **దర్శనాచ్చ 4–3–12** మూర్ధన్య నాడీ ద్వారా శరీరములో నుండి బయటపడి దేవయాన మార్గము ద్వారా ముందుకుసాగిపోయిన వాడికి బ్రహ్మప్రాప్తి కల్గుటను శ్రుతి చూపించుచున్నది. **ఏషసమ్ప్రసాదోఽస్మాత్ శరీరాత్ సముత్థాయ పరంజ్యోతి రుపసమ్పద్య స్వేన రూపేణాభి నిష్పద్యతే** ఈ భగవదనుగ్రహపాత్రుడైన జీవుడు ఈ శరీరంలోనుంచి పైకి లేచి పోయి పరంజ్యోతి ఐన పరమాత్మను చేరుకొని తనదైన తొట్టతొలి రూపాన్ని పొందుతున్నాడు అని.

**ప్రజాపతేః సభాం వేశ్మప్రపద్యే** అని అర్చిరాది మార్గంగా పోయినవాడికి ప్రత్యభిసన్ధి కనిపిస్తున్నది అని చెప్పినారో దానికి సమాధానాన్ని చెపుతున్నారు.

సూ॥ **నచ కార్యేప్రత్యభిసన్ధిః 4–3–13** కార్యమైన హిరణ్యగర్భుని యందు ప్రత్యభి సంధి లేదు. ఈ ప్రత్యభి సంధి, కార్యమైన హిరణ్యగర్భుని యందు కాదు. పరబ్రహ్మ యందు మాత్రమే. వాక్యశేషము నందు **యశోఽహంభవామి బ్రాహ్మణానాం.** బ్రహ్మవేత్త లకు పేరు తెచ్చేవాడిని అవుతాను. అని అభిసంధానము చేసేవాడికి అన్నిరకాలైన అవిద్యల నుండి విమోకపూర్వకముగా సర్వాత్మ భావాన్ని అభిసంధానము చేస్తున్నందువల్ల **అశ్వఇవరోమాణి విధూయ పాపం చంద్రఇవరాహోర్ముఖాత్ ప్రముచ్య, ధూత్వా శరీరమకృతం కృతాత్మా బ్రహ్మలోకమభిసంభవామి.** అని అభిసంభావ్యమైన (గొప్పగా భావింపబడుతున్న) బ్రహ్మలోకము అకృతము అని వినిపిస్తున్నది. సర్వబన్ధముల నుండి విముక్తి నేరుగా వినిపిస్తున్నది. ఇందువల్ల పరబ్రహ్మనే ఉపాసించుచున్నవాడిని అర్చిరాదులైన ఆతివాహక గణము తీసుకొనిపోతున్నదని జైమినిగారి మతము.

ఇప్పుడు భగవన్తుడైన బాదరాయణుడు తన అభిప్రాయము ప్రకారము సిద్ధాన్తాన్ని ప్రకటించుచున్నాడు.

సూ॥ **అప్రతీకాలమ్బనాన్నయతీతి బాదరాయణః ఉభయధాచ దోషాత్ తత్క్రతుశ్చ 4–3–14** ప్రతీకలను ఆధారముగా చేసుకొని ఉపాసించని వారిని తీసుకొని పోతారని బాదరాయణుడు తలుస్తున్నాడు. ఇంతకు మునుపు చెప్పిన వారి రెండు పక్షాల్లోను దోషము ఉన్నది. తత్ క్రతు న్యాయము ఇక్కడ వర్తించుచుంది. అప్రతీకాలంబనులను, ప్రతీకలను ఆలంబనముగా చేసుకొని ఉపాసించేవారిని కాకుండా వారికి వ్యతిరేకులైన వారిని అర్చిరాదులైన ఆతివాహకగణము తీసుకొనిపోతుందని భగవన్తుడైన

బాదరాయణుడు తలుస్తున్నాడు. ఇదీ చెప్పబడ్తున్న విషయము – కార్యబ్రహ్మను ఉపాసించే వారిని తీసుకొని పోతారనే పక్షము కుదరదు. పరబ్రహ్మను ధ్యానము చేసే వారినే తీసుకొనిపోతారనడమున్నూ చెల్లదు అటువంటి నియమేమీ లేదు. ప్రతీకాలమ్బనులనూ తీసుకొని పోరు. ఐతే ఎవరైతే పరంబ్రహ్మను ఉపాసించుతారో, ఎవరైతే ప్రకృతి సమ్బన్ధము లేని ఆత్మను బ్రహ్మాత్మకమని ఉపాసిస్తున్నారో ఆ రెండు రకాల వారినీ తీసుకొనిపోతారు. ఎవరైతే బ్రహ్మయొక్క కార్యమైన జగత్తులో అన్తర్భాగమైన నామాదులైన వస్తువులను, దేవదత్తాదులయందు సింహాది దృష్టివలె బ్రహ్మదృష్ట్యాగానీ కేవలమైన దానినిగా కానీ ఆయా వస్తువులను ఉపాసించుతారో వారిని తీసుకొనిపోరు. ఇందువల్ల పరబ్రహ్మను ఉపాసించే వారిని ప్రకృతితో సమ్బన్ధము లేని ఆత్మను బ్రహ్మాత్మకుడుగా ఉపాసించేవారిని తీసుకొని పోతారు అని. ఎందువల్ల ఇట్లా చెప్తున్నారు అంటే రెండురకాలుగానూ దోషము కనబడుతున్నది కాబట్టి. కార్యబ్రహ్మను ఉపాసించేవారిని తీసుకుపోతున్నారనే పక్షములో **అస్మాత్ శరీరాత్ సముత్థాయ పరంజ్యోతి రుపసమ్పద్య** ఇత్యాదులైన శ్రుతులు తమకు విరుద్ధంగా చెప్పినందుకు కోపం చేస్తవి. ఇక పరబ్రహ్మనే ఉపాసించినవారిని అనే పక్షములో ఆ నియమము ఉన్నదన్నపుడు **తద్యఇత్థం విదుర్యేచేమేఽరణ్యే శ్రద్ధాతప ఇత్యుపాసతే, తేఽర్చిషమభి సమ్భవన్తి** అని పంచాగ్ని విదులను అర్చిరాది గణము తీసుకొని పోతుందని ఈ శ్రుతి కండ్లెర్ర చేస్తుంది. ఇందువల్ల రెండు పక్షాలలోనూ దోషము ఏర్పడుతుంది. కావున పైన చెప్పిన ఇద్దరిని మాత్రమే తీసుకొనిపోతుంది. అందుకే ఈ విధంగా చెప్పినారు. తత్క్రతుశ్చ అని. తత్క్రతుః – అంటే ఆ విధంగా ఉపాసన చేసిన వాడు ఆ విధమైన ఫలితాన్నే పొందుతున్నాడు అని అర్థము. **యథాక్రతురస్మిన్ లోకేపురుషోభవతి తథేతః ప్రేత్యభవతి. 2) తంయథాయథోపాసతే** అనే న్యాయాలను బట్టి. పంచాగ్ని విద్యను తెల్సినవారు కూడా అర్చిరాది మార్గము ద్వారా పోతారు అని గతి శ్రవణము వలన అర్చిరాది మార్గాన పోయిన వాడికి బ్రహ్మప్రాప్తి, పునరావృత్తి లేక పోవడాలు వినిపించుతున్నందువల్ల కూడానూ. ఈ కారణంగానే తత్క్రతున్యాయము ప్రకారము ప్రకృతి నుండి పూర్తిగా విడివడిన బ్రహ్మాత్మకమైన ఆత్మాను సన్ధానము సిద్ధించింది. నామము మొదలుకొని ప్రాణము దాకా ఉన్న ప్రతీకలను ఆలంబనము చేసుకొని ఉపాసించేవారికి రెండు విధాలైన శ్రుతివలన సిద్ధమైన ఉపాసనలు లేవు గనుక. అచిత్‌తో మిశ్రమైన ఆత్మను ఉపాసించినప్పుడు తత్క్రతున్యాయము వర్తించి

అర్చిరాది మార్గములో ప్రయాణించడము బ్రహ్మప్రాప్తిన్నీ ఉండబోవు. ఐతే ఈ విశేషాన్ని శ్రుతే చూపిస్తున్నదని అంటున్నారు.

సూ॥ **విశేషం చ దర్శయతి 4-3-15 యావన్నామ్నోగతమ్, తత్రాస్యయథా కామచారో భవతి** ఇత్యాది ఐన శ్రుతి నామము మొదలుకొని ప్రాణము దాకా ఉన్న ప్రతీకలను ఉపాసించేవారికి గతితో అవసరము లేకుండా పరిమితమైన ఫలవిశేషాన్ని చూపుతున్నది. అందువలన అచిత్తుతో కూడిన, కూడని చిద్వస్తువును బ్రహ్మ దృష్టితో గాని, బ్రహ్మదృష్టిలేకుండాగానీ ఎవరు ఉపాసిస్తున్నారో వారిని తీసుకొనిపోరు. కానీ పరబ్రహ్మను ఉపాసించేవారిని, ఆత్మను ప్రకృతితో ఎడబాసిన బ్రహ్మాత్మకుడైన వాడిని ఉపాసించేవారిని ఆతివాహికగణము తీసుకుపోతుందని తెలిపోయింది. **అని కార్యాధికరణము.**

**ఇంతటితో శ్రీభాష్యమునందు చతుర్థాధ్యాయములోని**
తృతీయపాదము ముగిసినది.

శ్రీమతే రామానుజాయనమః

## శ్రీభాష్యము – చతుర్థాధ్యాయము – చతుర్థపాదము

### సమ్పద్యావిర్భావాధికరణము.

సూ॥ **సమ్పద్యావిర్భావః స్వేనశబ్దాత్ 4-4-01** పరబ్రహ్మను ఉపాసించే వారిని, ఆత్మనున్నూ ప్రకృతితో ఎడబాసిన వాడిని, బ్రహ్మాత్మకుడైన వాడిని ఉపాసించేవారికిన్నీ అర్చిరాది మార్గముగా తిరిగి వెనుకకు రావడమనేది లేని గతి చెప్పబడింది. ఇపుడు ముక్తులయొక్క ఐశ్వర్యప్రకారాన్ని చింతించడాన్ని ఆరంభించుతున్నారు. ఇది ఉపదేశింపబడుతున్నది.

**ఏవమేవైష సంప్రసాదోऽస్మాత్ శరీరాత్ సముత్థాయ పరంజ్యోతి రుప సమ్పద్యస్వేన రూపేణాభినిష్పద్యతే** అని. ఈ శరీరాన్నుండి పైకిలేచి పరంజ్యోతియైన పరమాత్మను చేరుకొన్నవానికి దేవాదుల రూపమువలె సాధ్యమైన రూపముతో సమ్బన్ధము ఈ వాక్యముతో ప్రతిపాదింపబడ్తున్నదా? లేక సహజమైన

స్వరూపావిర్భావమా? అని సంశయము కలిగితే సాధ్యము ఐన రూపముతో సమ్బన్ధము అనడమే యుక్తము. అట్లాకాకపోయినప్పుడు మోక్షశాస్త్రము పురుషార్థాన్ని బోధించేది కాకుండా పోతుంది. (అపురుషార్థావబోధిత్వము అవుతుంది) స్వరూపము సహజంగా అపురుషార్థమైనదిగా కనిపిస్తున్నది. సుషుప్తి వేళయందు దేహము యొక్క ఇంద్రియాలయొక్క పనులు ఉడిగిపోతే కేవలమైన ఆత్మ స్వరూపమునకు పురుషార్థ సమ్బన్ధము కనిపిస్తున్నది. కేవలము దుఃఖనివృత్తియే పరంజ్యోతిని చేరుకున్నవానికి పురుషార్థము కాదు. అప్పుడు స్వరూపావిర్భావమే మోక్షము అని చెప్పవలసి ఉంటుంది. **సఏకో బ్రహ్మణ ఆనన్దః శ్రోత్రియస్యచాకామహతస్య.** శ్రోత్రియుడు కామములతో కొట్టుపడనివానికి అది ఒక ఆనందము. **రసగ్గ్ం హ్యేవాయం లబ్ధ్వా ఆనందీ భవతి.** రసము అనబడేవాడిని పొంది ఆనందము కలవాడవుతున్నాడు. ఇత్యాది శ్రుతివాక్యాలవల్ల ముక్తుడికి అనన్తమైన సుఖము కూడా కలుగుతున్నదని వినిపించుతున్నది. అపరిచ్ఛిన్నమైన ఆనందరూపచైతన్యమే ఇతనికి స్వరూపముకాదు. అది సంసారి దశలో అవిద్య చేత కప్పివేయబడినది. పరంజ్యోతిని చేరుకున్నవాడికి పుట్టుకొస్తున్నది. అని చెప్పవచ్చును. జ్ఞానస్వరూపానికి తిరోధానము కుదురదు. ప్రకాశము అనే పర్యాయపదము గల జ్ఞానానికి తిరోధానము అని అంటే అది దానికి వినాశమేనని ఇంతకుముందే చెప్పబడింది. కేవల ప్రకాశానికి ఆనందత సంభవించదు. ఆనంద స్వరూపత అంటే సుఖ స్వరూపత. సుఖస్వరూపము అంటే తనకు అనుకూలమై ఉండుట. ప్రకాశము మాత్రమే ఆత్మ అని చెప్పేవారు ఎవని ప్రకాశము అనుకూలముగా తెల్సుకోదగినది (వేదనీయమో) అవుతుందో అని, ప్రకాశము మాత్రమే ఆత్మ అని వాదించే వారికి ఎంత కష్టపడినా ఆనంద స్వరూపత ఉపపాదించడానికి వీలుకాదు. కేవలము స్వరూపాపత్తి మాత్రమే సాధ్యము ఐనప్పుడు స్వరూపము ఎప్పుడూ సిద్ధమైనందువల్ల (నిత్యనిష్పన్నత్వాత్) – ఎప్పుడూ ఉండేదే గనుక పరమాత్మను చేరుకున్నవాడికి **స్వేన రూపేణ అభినిష్పద్యతే** అనే వచనము అర్థము లేనిది కాగలదు. ఇందువల్ల అపూర్వమైన (ఇంతకు మునుపులేని) సాధ్యమైన రూపముతో సమ్బన్ధము కలవాడవుతాడు. ఇట్లా ఐనందువల్ల "**అభినిష్పద్యతే**" అనే వచనము ముఖ్యార్థం అవుతుంది. స్వేనరూపేణ అనేదికూడా కేవలము ఆనందమే కల తనకు మాత్రమే అసాధారణమైన రూపముతో ఆవిర్భవించుతాడు కనుక చక్కగా పొసగుతుంది. అని పూర్వపక్షము ఎదురవుతే చెప్పుతున్నాము సమ్పద్యావిర్భావః అని. ఈ ప్రత్యగాత్మ అర్చిరాది మార్గము ద్వారా పరంజ్యోతిని చేరుకొని ఏ దశావిశేషాన్ని పొందుతున్నాడో

అదే స్వరూపావిర్భావరూపము. అంతేకాని అపూర్వమైన ఆకారము పుట్టుకొని రావడము అనే రూపము కాదు. ఎందువల్లనంటే స్వేనశబ్దము వలన. స్వేనరూపేణ అనే విశేషణాన్ని చేర్చుకున్నారు కాబట్టి. ఆగన్తుకము – (అంతకుముందులేక అప్పుడు వచ్చి చేరినది) ఐన విశేషాన్ని పరిగ్రహించితే స్వేనరూపేణ అనే విశేషణము దండుగ / వ్యర్థము / అర్థము లేనిది అవుతుంది. విశేషణము లేకపోయినప్పటికీ ఆ రూపము తనదైన రూపము అనబడ్తూనే ఉంటుంది.

స్వరూపము నిత్యప్రాప్తమైనదే కాబట్టి **ఉపసమ్పద్య అభినిష్పద్యతే** అనే వచనము అనర్థకము అని ఏది చెప్పబడిందో దానికి సమాధానమును చెపుతున్నారు.

సూ॥ **ముక్తః ప్రతిజ్ఞానాత్ 4-4-2** కర్మసంబన్ధము, దానివల్ల కల్గిన దేహాదుల నుండి విముక్తుడు ఐనవాడు తనయొక్క సహజమైన రూపముతో నిల్చిఉన్నాడు. ఇది ప్రతిజ్ఞానం వల్ల తెలుస్తున్నది. కర్మసమ్బన్ధము, దానిచేత వచ్చి చేరినదేహాదుల నుంచి వదలిపెట్టబడినవాడై సహజరూపముతో ఉన్నటువంటి వాడు ఇక్కడ **స్వేన రూపేణ అభినిష్పద్యతే** అని చెప్పబడుతున్నాడు. ఇందువల్ల రూపము నిత్యప్రాప్తమే ఐనా కర్మరూపమైన అవిద్య చేత తిరోహిత మైన వానికి తిరోధానము తొలగిపోవడమే ఇక్కడ అభినిష్పత్తి అనబడుతున్నది. ఎందువల్లనంటే ప్రతిజ్ఞానము వల్ల. ఆ తిరోధాననివృత్తి ప్రతిపాధింపబడేదిగా ప్రతిజ్ఞాతమై ఉన్నది. దేనివల్ల ఈ విషయము తెలుస్తున్నది అని అంటే "**యఆత్మా**" అని ప్రకృతమైన ప్రత్యగాత్మను జాగరితము మొదలైన అవస్థాత్రయము – (జాగ్రత్, స్వప్న, సుషుప్తి) నుండి బొత్తిగా ముక్తుడైన వాడిని ప్రియాప్రియములకు కారణమైన కర్మవలన వచ్చిన శరీరము నుండి విడుదల పొందినవాడిని ప్రతిపాదించుటకొరకు **ఏతం త్వేవ భూయోఽను వ్యాఖ్యాస్యామి** దీనినే తిరిగి మళ్ళీ ఒకసారి వ్యాఖ్యానిస్తాను అని మళ్ళీ మళ్ళీ చెప్పి **ఏవమేవైష సంప్రసాదోఽస్మాత్ శరీరాత్ సముత్థాయ పరంజ్యోతి రుపసమ్పద్యస్వేన రూపేణాభినిష్పద్యతే** అని చెప్పినారు కాబట్టి. కావున కర్మతో కట్టుబడిన వాడికి పరంజ్యోతిని చేరుకున్న తరువాత బన్ధము తొలగిపోవడమనే రూపము గల ముక్తి స్వేనరూపేణ అభినిష్పద్యతే అని చెప్పబడుతున్నది. **స్వరూపావిర్ భావము** పొందిన తరువాత కూడా అభినిష్పత్తి శబ్దము కనిపించుతున్నది. **యుక్త్యాఽయమర్థో నిష్పద్యతే** ఇత్యాదులలో వలె.

ఆత్మ స్వరూపము సుషుప్తి యందు అపురుషార్థముగా కనిపిస్తున్నది కాబట్టి స్వరూపావిర్భావము జరిగినప్పుడు మోక్షశాస్త్రము అపురుషార్థ అవబోధికావలసి వస్తుంది. అందువల్ల దేవాది అవస్థలవలె సుఖముతో సమ్బన్ధము కల మరొక అవస్థను పొందడమే అభినిష్పత్తి అని ఏమాట అన్నారో దానికి చెందిన సమాధానాన్ని దిగువ సూత్రంతో చెప్తున్నారు.

సూ॥ **ఆత్మాప్రకరణాత్ 4-4-3** స్వరూపము చేతనే (సహజంగానే) ఈ ఆత్మ అపహత పాప్మత్వాది సత్య సంకల్పత్వము వరకు ఉన్న గుణాలు కలది అని ప్రకరణాన్ని బట్టి తెలియవస్తున్నది. **య ఆత్మాఽపహత పాప్మా విజరోవిమృత్యుః విశోకోఽవిజిఘత్సోఽపిపాసః సత్యకామః సత్యసంకల్పః** అని గదా ప్రజాపతి వాక్యము యొక్క ఆరంభము ఉన్నది. ఈ ప్రకరణము ప్రత్యగాత్మకు చెందినట్టిది అని **ఉత్తరాచ్చేదావిర్భూతస్వరూపస్తు** అనే సూత్రము వద్ద ప్రతిపాదింపబడింది. ఇందువల్ల అపహత పాప్మాత్వాది స్వరూపము గలవాడే ఈ ఆత్మ. ఇతడే సంసారావస్థ యందు కర్మ అనబడే అవిద్య చేత కప్పివేయబడిన స్వరూపము గలవాడై ప్రస్తుతము పరంజ్యోతిని చేరుకొని ఆవిర్భూత స్వరూపుడు అవుతున్నాడు. ఇందువల్ల ప్రత్యగాత్మకు అపహత పాప్మత్వాదులు స్వాభావిక గుణాలు పరంజ్యోతిని చేరుకున్నవాడికి వెల్లడి అవుతున్నాయి. కానీ కొత్తగా ఏమీ పుట్టుకొనిరావడం లేదు. భగవన్తుడు శౌనకమహర్షి కూడా ఈ విధంగానే చెప్పినాడు. **యథానక్రియతే జ్యోత్స్నా మలప్రక్షాలనాన్మణేః। దోషప్రహాణాన్న జ్ఞానమాత్మనః క్రియతేతథా** మణికిపైన అంటుకున్న మురికిని తొలగించడము ద్వారా కొత్త కాన్తిని ఎట్లా తెచ్చిపెట్టలేమో అదేవిధంగా ఆత్మకు అంటిన దోషాన్ని తుడిచివేయడం ద్వారా జ్ఞానాన్ని కలిగించలేము. **శ్లో॥ యథోదపాన కరణాత్ క్రియతే న జలామ్బరమ్। సదేవనీయతే వ్యక్తిమ్ అసతః సమ్భవః కుతః॥** ఏ విధంగా నైతే త్రాగేనీటి కొరకు చెరువు ఏర్పర్చబడడం లేదో అట్లాగే ఉన్న వస్తువే వెల్లడి చేయబడుతున్నది. లేని దానికి పుట్టుక ఎక్కడ నుండి కలుగుతుంది? అనగా వంపు ఉన్నచోటనే నీరు నిల్పితే చెరువు అనబడుతుంది. ఒంపులేనిచోట నీరు నిలచేది ఎట్లా? అట్లాగే ఉన్న వస్తువు నుండే మరొక వస్తువు పుడుతుంది. ఉన్నదే వెల్లడి అవుతుంది. **శ్లో॥ తథాహేయగుణధ్వంసాత్ అవబోధాద యోగుణాః। ప్రకాశ్యన్తేన జన్యన్తే "నిత్యాఏవాత్మనోహితే".** పైన చెప్పినట్లుగానే హేయాలైన గుణాలు నాశనమైపోవడం ద్వారా జ్ఞానము మొదలైనగుణాలు ప్రకాశింపచేయబడుతున్నవి. అంతేకాని కొత్తగా

పుట్టడము లేదు. ఆత్మకు జ్ఞానము మొదలైన గుణాలు ఎల్లప్పుడూ ఉండేవే. నిత్యాలే పుట్టేవి కావు అని. ఇందువల్ల జ్ఞానానందాదిగుణాలు కర్మ కారణంగా ఆత్మలో ముడుచుకుని / కుదించుకొని పోయినట్టివి. పరంజ్యోతిని చేరుకొనిన పిదప కర్మరూపమైన బన్ధము తరిగిపోయిన తరువాత / నశించగా వికాసము / విచ్చుకోవడము రూపమైన ఆవిర్భావము అనుపపన్నము కాదు. కనుక సమ్పద్యావిర్భావము అని చక్కగా చెప్పబడింది. **ఇది సమ్పద్యావిర్భావ అధికరణము.**

★ ★ ★

## ఇక అవిభాగేన దృష్టత్వాధికరణము.

సూ॥ **అవిభాగేన దృష్టత్వాత్ 4-4-4** పరబ్రహ్మకంటే తనను అవిభాగముగా ముక్తుడు అనుభవిస్తున్నాడు. అట్లాగా కనపడుతున్నది కాబట్టి. పరంజ్యోతి వద్దకున్న చేరుకున్న అన్ని బన్ధాలనుండి విడివడిన ప్రత్యగాత్మ తనను పరమాత్మకంటే వేరయినవాడుగా అనుభవించుతున్నాడా? లేక ఆయనకు విశేషణముగా ఆయననుండి వేరు చేయబడకుండా అనుభవిస్తున్నాడా? అని సందేహము ఏర్పడితే. **సోఽశ్నుతే సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణా విపశ్చితా** ముక్తుడైన ప్రత్యగాత్మ విపశ్చిత్ ఐన పరమాత్మ తో కలిసి అన్ని కామాలను అనుభవిస్తున్నాడు. **2) యథాపశ్యః పశ్యతే రుక్మవర్ణం కర్తారమీశం పురుషం బ్రహ్మయోనిమ్। తదావిద్వాన్ పుణ్యపాపేవిధూయ నిరంజనః పరమంసామ్యముపైతి.** జ్ఞానము కలవాడు ఎప్పుడైతే బంగారము వలె మనోహరమైన రూపము గలవాడిని అన్ని లోకాలకు కర్తఐన వాడిని చరాచరాలను ఏలుకొనేవాడిని ప్రకృతిని పుట్టించినవాడిని దర్శించుకుంటున్నాడో అపుడు ఆ విద్వాంసుడు తనవైన పుణ్యపాపాలను దులిపేసుకొని ఏకర్మ సమ్బన్ధము లేనివాడై ఆయనతో పరమ సామ్యాన్ని పొందుతున్నాడు. **3) ఇదం జ్ఞానముపాశ్రిత్యమమ సాధర్మ్యమాగతాః। సర్గేఽపినోపజాయన్తే ప్రలయే నవ్యధన్తిచ॥** ఈ జ్ఞానాన్ని ఆధారంగా చేసుకొని నాతో సమానమైన ధర్మాలను పొందినవారు పునః సృష్టి జరిగినప్పుడు పుట్టరు. ప్రళయకాలము వచ్చినప్పుడు బాధపడరు. ఇత్యాదులైన శ్రుతి స్మృతులవలన ముక్తునికి పరమాత్మతో సాహిత్యము (కలిసి భోగాలను అనుభవించడం) సామ్యము, సాధర్మ్యము కలిగినవాడై ఉంటున్నాడని తెలుస్తున్నందువల్ల విడిగా ఉంటూనే పరమాత్మానుభవాన్ని పొందుతున్నాడు. అని పూర్వపక్షము ఎదురవగా చెపుతున్నారు. అవిభాగేన అని. ముక్తుడు పరబ్రహ్మ కంటే తనను అవిభాగము (వేరుగా

లేకుండుట – విభాగము లేకుండా) గా అనుభవిస్తున్నాడు. ఎందువల్లనంటే అట్లా కనపడ్తున్నందువల్ల. పరబ్రహ్మ వద్దకు చేరుకోవడము వల్ల అవిద్య అనే తిరోధానము తొలగినవాడైనందువల్ల యథాతథంగా తనను (స్వాత్మను) చూచినందువల్ల. తనయొక్క స్వరూపము **తత్త్వమసి, అయమాత్మాబ్రహ్మ, ఐతదాత్మ్యమిదం సర్వమ్, సర్వంఖల్విదం బ్రహ్మ** ఇత్యాదులు ఐన సామానాధికరణ్యాన్ని చెప్పే వాక్యాల చేత, **యః ఆత్మనితిష్ఠన్ ఆత్మనోఽన్తరో యమాత్మా నవేద యస్యఆత్మా శరీరమ్ య ఆత్మానమన్తరో యమ యతి. సతే ఆత్మా అన్తర్యామీ అమృతః అన్తః ప్రవిష్టః శాస్తా జనానామ్ సర్వాత్మా ఇ**త్యాదుల చేతనున్నూ జీవుడు / ప్రత్యగాత్మ పరమాత్మను ఆత్మగా కలవాడు. ఆయనకు శరీరమైనందున ఆయనకు ప్రకారమైనవాడు అని ప్రతిపాదింపబడింది. అవస్థితేరితి కాశకృత్స్నః అనే సూత్రము వద్ద. ఇందువల్ల అవిభాగేన – అహంబ్రహ్మాస్మి – నేను బ్రహ్మను ఐ ఉన్నాను అనియే అనుభవించుతున్నాడు. సామ్యము, సాధర్మ్యాలను చెప్పడము బ్రహ్మకు ప్రకారభూతుడైన ప్రత్యగాత్మకే స్వరూపము. ఆయనతో సమానమైనది అని దేవాదులైన ప్రకృతికి సమ్బన్ధించిన రూపాన్ని వదిలివేయడం ద్వారా బ్రహ్మతో సమానమైన శుద్ధిని ప్రతిపాదిస్తున్నది. సహశ్రుతి – కలసి అనుభవిస్తున్నాడని చెప్పేవేదవాక్యము – ఏతేన ఈ విధమైన ప్రత్యగాత్మకు ప్రకారి ఐన బ్రహ్మతో సహా తద్గుణానుభవము – ఆయనలోని గుణాలను అనుభవించడము – ను ప్రతిపాదిస్తున్నది. కనుక విరోధము ఏదీ లేదు. బ్రహ్మకు ప్రకారమైనందువల్ల ఆయనతో అవిభాగముగా ఉంటున్నాడని చెప్పినందువల్ల **సంకల్పాదేవతత్ శ్రుతేః** అనే సూత్రముతో విరోధము లేదు. **అధికంతుభేద నిర్దేశాత్, అధికోపదేశాత్** మొదలైన సూత్రాలతోనూ వైరుధ్యము రాదు. **ఇది అవిభాగేన దృష్టత్వాధికరణము.**

★ ★ ★

## ఇక పైన బ్రాహ్మాధికరణము.

సూ॥**బ్రాహ్మేణజైమినిః ఉపన్యాసాదిభ్యః 4–4–5**ముక్తునికిస్వరూపావిర్భావము అపహత పాప్మత్వాది గుణాలతో జరుగుతుంది అని జైమిని ఆచార్యుడు భావిస్తున్నాడు. కారణము పరమాత్మ కళ్యాణగుణాలను ప్రకటించే ఉపన్యాసాలవల్ల అని. పరంజ్యోతిని చేరుకొని అవిద్యాతిరోధానము తొలగిన ముక్తునికి స్వరూపావిర్భావమే అవుతుంది అని చెప్పబడింది. ఆ సందర్భములో ఏ స్వరూపముతో ఆవిర్భావము కలుగుతుందో దానిని శ్రుతులలో ఉండే వైవిధ్యం కారణంగా విచారణ చేయబడుతున్నది. ఇతని

యొక్క స్వరూపము అపహత పాప్మత్వాదికమే కాబట్టి ఆ రూపముతో ఆవిర్భవిస్తాడా? విజ్ఞానము మాత్రమే కనుక ఆ రూపము తోనా? ఇక ఈ రెండింటికీ విరోధము లేకుండా ఉండడానికి ఉభయ స్వరూపంగానా? అని విచారము కలిగితే ఆచార్యుడైన జైమిని బ్రాహ్మస్వరూపముతోనని తలుస్తున్నాడు.

బ్రాహ్మేణ – అపహత పాప్మత్వాదులతో అని అర్థము. దహర వాక్యము నందు అపహత్య పాప్మత్వాదులు బ్రహ్మకు సమ్బన్ధించినవిగా వినిపించినవి. సరి అట్లాగని ఏ హేతువువల్ల తెలుస్తున్నది అని అంటే ఉపన్యాసాదుల వల్ల. బ్రహ్మ యొక్క గుణాలైన అపహత పాప్మత్వాదులు ప్రత్యగాత్మకు కూడా ఉన్నాయని ప్రజాపతి వాక్యములో ఉపన్యసింపబడుతున్నవి. **య ఆత్మా అపహత పాప్మా** అని మొదలుపెట్టి **సత్యసంకల్పః** అనేంత దాకా. ఆది శబ్దము చేత సత్యసంకల్పాది గుణాలతో జతపడిన జక్షణాదులు కూడా తెలుస్తున్నవి. **జక్షత్ క్రీడన్ రమమాణః** ఇత్యాది వాక్యము చేత అర్థమవుతున్న వ్యవహారాలు గ్రహింపబడుతున్నవి.

అందువల్ల ఈ ఉపన్యాసాదులను బట్టి ప్రత్యగాత్మకు కేవలము విజ్ఞాన మాత్ర స్వరూపము ఏర్పడదు అని జైమిని యొక్క మతము.

సూ॥ **చితితన్మాత్రేణ తదాత్మక త్వాది త్యౌడులోమిః 4-4-6** చైతన్యము మాత్రమే ఆత్మకు స్వరూపము కాబట్టి జ్ఞానస్వరూపం తోనే ఆవిర్భవిస్తాడు. అని ఔడులోమిగారు తలుస్తున్నారు. చైతన్యము మాత్రమే ఆత్మకు స్వరూపము. కావున ఆ రూపంతోనే ఆవిర్భవించుతున్నాడని ఔడులోమి అనే ఆచార్యుడు తలుస్తున్నాడు. ఎందువల్ల నంటే తదాత్మకుడు కాబట్టి. ప్రత్యగాత్మ జ్ఞానాత్మకుడు మాత్రమే కనుక **సయథాసైన్ధ వ ఘనోఽనన్తరోఽబాహ్యో కృత్స్నో రసఘన ఏవ, ఏవంవా అరే ఉయమాత్మాఽనన్తరోఽబాహ్యః కృత్స్నః ప్రజ్ఞానఘనః ఏవ. విజ్ఞానఘన ఏవ** ఉప్పుగడ్డ ఏ విధంగా నైతే లోపలా వెలుపలా మొత్తంగా రసఘనమై ఉంటుందో అదే తీరుగా ఈ ఆత్మ కూడా వెలుపల లోపల అనే భేదము లేకుండా మొత్తంగా ప్రజ్ఞానమే గడ్డకట్టి ఉన్నాడు. విజ్ఞాన ఘనుడే అని అవధారణ చేయబడుతున్నందువలన విజ్ఞానము మాత్రమే ఈ ఆత్మకు స్వరూపము అని తెలుస్తున్నది. అందువలన ఇతనికి విజ్ఞానము తప్ప మరొక గుణము లేదు కాబట్టి అపహత పాప్మా ఇత్యాదులు ఐన శబ్దాలు వికారాలు సుఖము, దుఃఖము మొదలైన అవిద్యకు సమ్బన్ధించిన ధర్మాలు లేవు అని చెప్పేవి మాత్రమే. కనుక చితి (జ్ఞానము) తన్మాత్ర రూపముతోనే ఆవిర్భవించుతున్నాడు అని

ఔడులోమిగారి మతము. ప్రస్తుతము భగవన్తుడగు బాదరాయణుడు తన అభిప్రాయం ప్రకారము సిద్ధాన్తాన్ని చెప్పుతున్నాడు.

సూ॥ **ఏవమపి ఉపన్యాసాత్ పూర్వభావాదవిరోధం బాదరాయణః 4-4-07** విజ్ఞాన మాత్రస్వరూపుడు అని చెప్పినప్పటికీ ముందు చెప్పిన గుణాలతో విరోధము ఏమీ లేదని బాదరాయణుడు నమ్ముతున్నాడు.

ఏవమపి - విజ్ఞానమాత్రస్వరూపుడు అని ప్రతిపాదించినప్పటికీ ముందు చెప్పిన సత్యకామత్వాదులైన గుణాలకు విరోధము లేదని బాదరాయణాచార్యుడు తలుస్తున్నాడు. ఎందువల్లనంటే ఉపన్యాసమువల్ల పూర్వభావమువల్ల. **య ఆత్మా అపహతపాప్మా** ఇత్యాది ఉపనిషత్ సమ్బన్ధమైన ఉపన్యాసము వల్ల, ప్రమాణము వల్లనున్నూ ముందటివి ఐన అపహత పాప్మత్వ సత్యసంకల్పత్వాదులు కూడా, భావాత్ = ఉంటున్నందువల్ల, విద్యమానత్వాత్, అనగా రెండింటికీ ఉపనిషత్తులే ప్రమాణము కాబట్టి. తుల్య ప్రమాణాలైన వాక్యాలు పరస్పరము బాధించుకోవడము తగదు. యుక్తము కాదు అని అర్థము. వస్తు విరోధం వల్ల అపహత పాప్మత్వాదులను అవిద్య చేతకల్పింపబడినవి అని అనగూడదు. అది న్యాయము కాదు. విశేషము లేకపోయినప్పుడు విపరీతం ఎందువల్ల కాదు? అనే న్యాయము వర్తిస్తుంది కాబట్టి. రెండూ సమానబలము కలవి ఐనప్పుడు అశక్యమైన అవధారణకు (నిశ్చయానికి) అన్యపరత్వమే (వేరొకదానికి చెందినదనడమే) న్యాయమవుతుంది. అట్లయినా అవిరోధమే (ఏవమప్యపి అవిరోధః) అని ఎదుటివాని వాదాన్ని అంగీకరించుకుంటూ చెప్తూ జ్ఞానము మాత్రమే ఇతనికి స్వరూపము. మరొకటి కాదు. ఇంతకంటే ఇతరమైనది లేదు అనే ఈ అర్థము "**విజ్ఞాన ఘన ఏవ**" ఇత్యాదుల చేత ప్రతిపాదింపబడడంలేదు. అని తలుస్తున్నాడు. ఐతే **విజ్ఞాన ఘన ఏవ** అనే అవధారణకు అర్థమేది? అని అంటే ఆత్మ మొత్తమూ జడము నుండి వేరుచేయబడిన స్వప్రకాశము గల్గినట్టిది. అన్యాయత్తప్రకాశము ఐన ప్రదేశము స్వల్పము కూడా లేదు. ఈ అర్థము వాక్యము వల్లనే తేటగా తెలుస్తున్నది. **సయథాసైన్ధవ ఘనోఽనన్తరోఽబాహ్యః కృత్స్నో రసఘనఏవ ఏవం వా అరేఽయమాత్మాఽనన్తరోఽబాహ్యః కృత్స్నః ప్రజ్ఞానఘనఏవ.** అని ఈవిధంగా ధర్మి (ధర్మము కలవాడు) స్వరూపము గల ప్రత్యగాత్మ మొత్తం మొత్తంగా విజ్ఞానపు కణిక అయినప్పటికీ అపహతపాప్మత్వ సత్యసంకల్పత్వాధి ధర్మాలతో సమ్బన్ధము - ఇతర వాక్యాలతో తెలియవచ్చినటువంటిది - విరుద్ధము

కాబోదు. ఎట్లాగంటే ఉప్పు గడ్డ మొత్తమూ రసఘనమే ఐనా అది నాలుక ద్వారా తెలుస్తున్నప్పటికీ కన్ను మొదలైన ఇంద్రియాల ద్వారా తెలుస్తున్న రూపము, కాఠిన్యము మొదలైనవి విరోధించవు కదా! ఇక్కడ వాక్యము యొక్క తాత్పర్యము ఇది. – ఏ విధంగానైతే రసముతో నిండిన మామిడిపండ్లు మొదలైనవాటి యందు చర్మము – (తోడ్క) మొదలైన ప్రదేశాల యొక్క భేదాన్ని బట్టి రసభేదము ఉన్నప్పటికీ, ఉప్పుగడ్డలో మాత్రము అంతటా ఉప్పదనమే ఉంటున్నదో అట్లాగే ఆత్మలో కూడా అంతటా విజ్ఞాన ఘనత్వమే, విజ్ఞానస్వరూపమే స్వప్రకాశస్వరూపత్వమే ఉంటుంది అని అర్థము. **ఇది బ్రాహ్మాధికరణము.**

★ ★ ★

## ఇక సంకల్పాధికరణము.

సూ॥ **సంకల్పాదేవ తత్ శ్రుతేః 4-4-08** ముక్తపురుషుడికి స్వరూపావిర్భావము ఐన తరువాత తాను తలచినవన్నీ సంకల్పము వల్లనే నెరవేరుతున్నవి. శ్రుతివల్ల ఆ విషయము వెల్లడి అవుతున్నది. మరొక ప్రయత్నము అవసరము లేదు. ముక్తుడు పరంబ్రహ్మను చేరుకొని జ్ఞానస్వరూపుడయ్యి అపహత పాప్మత్వము మొదలుకొని సత్యసంకల్పత్వము వరకూ ఉన్న గుణాలను కల్గినవాడై ఆవిర్భవిస్తున్నాడని చెప్పబడింది. దాన్ని ఆధారంగా చేసుకొని సత్యసంకల్పత్వము కారణంగా వ్యవహారాలున్నూ సిద్ధించుతున్నవని వినిపిస్తున్నవి. **సతత్ర పర్యేతిజక్షత్ క్రీడన్ రమమాణః స్త్రీభిర్వాయానైర్వా జ్ఞాతిభి ర్వా ఇతి.** ఆయన తాను కోరిన చోటికి పోతున్నాడు తినుకుంటూ ఆడుకుంటూ ఆనందపడుతూ స్త్రీలతో కానీ వాహనాలతోకానీ జ్ఞాతులతో కానీ అని. ఈయనకు జ్ఞాత్యాదులతో ప్రాప్తి ప్రయత్నాన్తరాన్ని కోరుతున్నదా? లేక పరమపురుషునికి వలెనే సంకల్పము – తలచుకోవడము – మాత్రాననే జరుగుతున్నదా? అని సందేహము కలిగితే – లోకములో రాజులు మొదలైనవారికి సత్యసంకల్పులుగా వ్యవహరింపబడుతున్న వార్కి పని పూర్తి చేసుకోవడంలో సంకల్పము మాత్రమే కాకుండా వేరుగా ప్రయత్నం చేయవలసిన అవసరము ఏర్పడుతున్నది. కాబట్టి ఈ ముక్త పురుషునికి కూడా ప్రయత్నము యొక్క సాపేక్ష ఉన్నది అని పూర్వపక్షము ఎదురు కాగా చెప్పబడుతున్నది. సంకల్పాదేవ సంకల్పము వల్లనే అని. తత్ శ్రుతేః. **సయది పితృలోకకామో భవతి సంకల్పాదేవాస్య పితరః సముత్తిష్ఠన్తి.** ఆముక్తపురుషుడు ఒకవేళ పితృలోకాన్ని చూడాలని – తల్లిదండ్రులను –

తల్చుకున్నట్లయితే ఆ సంకల్పము వల్లనే పిత్రాదులు ప్రత్యక్షము కావడం వినిపిస్తున్నది. ఇతర ప్రయత్నము యొక్క అవసరాన్ని తెలిపే మరే శ్రుతి వినిపించడం లేదు. దేనివల్లనైతే ఇతనికి సంకల్పాదేవ అని అవధారణను, విజ్ఞాన ఘన ఏవ అనేదానివలె వ్యవస్థాపన (కట్టడి) చేయబడుతున్నదో.

సూ॥ **అతఏవ చానన్యాధిపతిః 4-4-9** ఈ సత్యసంకల్పము కారణంగానే ముక్త పురుషుడు అనన్యాధిపతి అవుతున్నాడు. ముక్తుడు ఏ కారణం వల్లనైతే సత్యసంకల్పుడు అవుతున్నాడో అందువల్లనే అనన్యాధిపతిన్నీ అవుతున్నాడు. (తనకు పైన తనను నియన్త్రించే అధిపతిని కల్గినవాడు అన్యాధిపతి. అట్లాకాకుండా తనపైన పెత్తనం చేస్తూ తనను నియన్త్రించే వాడు లేనట్టివాడు అనన్యాధిపతి అనబడుతున్నాడు. ఐతే పరమాత్మ మాత్రము ఇతనిపైన నియన్త్రించే అధికారాన్ని కలిగి ఉంటున్నాడు.) అన్యాధిపతిత్వము అనగా విధి నిషేధాలకు యోగ్యుడై ఉండడము. అటువంటప్పుడు తన సంకల్పం అడ్డగింపబడుతుంది. లేదా నేరవేరవచ్చును. నెరవేరకపోవచ్చును. ఇందువల్ల సత్యసంకల్పత్వ శ్రుతివల్లనే అనన్యాధిపతిత్వమున్నూ సిద్ధించుతూ ఉన్నది. ఇందుచేతనే **స స్వరాట్ భవతి** అతను తనకు తానే రాజు అవుతున్నాడు అని చెప్పబడుతున్నది. **ఇది సంకల్పాధికరణము.**

★ ★ ★

## ఇకపైన అభావాధికరణము.

సూ॥ **అభావం బాదరి రాహ హ్యేవమ్ 4-4-10** ముక్తుడికి శరీరము ఇంద్రియాలు ఉన్నవా? లేవా? అని సందేహము కలిగితే బాదరి అనే ఆచార్యుడు లేవని తలుస్తున్నాడు. వేదము కూడా దీన్నే చెపుతున్నది. ముక్తాత్మకు దేహము ఇంద్రియాలు ఉన్నాయా? లేవా? లేకపోతే సందర్భాన్ని బట్టి ఉంటున్నవా. లేకపోతున్నవా? అని సంశయము ఏర్పడినప్పుడు బాదరి అనే ఆచార్యుడు శరీరము ఇంద్రియాలు లేవనియే తలుస్తున్నాడు. ఎందువల్లనంటే వేదము ఇట్లాగనే చెప్పింది కదా! **నహవైస శరీరస్య సతః ప్రియాప్రియయోః అపహతి రస్తి. అశరీరంవావ సన్తం నప్రియాప్రియే స్పృశతః.** శరీరమును కలిగి ఉన్నవానికి ప్రియాప్రియములు దూరము కావు. శరీరము లేనివాడిని ప్రియాప్రియములు తాకవు అని శరీరముతో సమ్బన్ధము ఉన్నపుడు దుఃఖము తప్పించుకో జాలనిది అని చెప్పి **అస్మాత్ శరీరాత్ సముత్థాయ పరంజ్యోతి రుపసమ్పద్య**

**స్వేనరూపేణ అభినిష్పద్యతే** ఈ శరీరాన్నుంచి పైకిలేచి పోయి పరమాత్మను చేరుకొని తనదైన మొదటి రూపాన్ని పొందుతున్నాడు. అని ముక్తుడికి శరీరము లేదని శ్రుతి చెప్పింది.

సూ॥ **భావంజైమినిః వికల్పామననాత్ 4-4-11** జైమిని అనే ఆచార్యుడు శరీరేంద్రియాలున్నాయి అంటున్నాడు. ఎందువల్లనంటే వివిధములైన కల్పములు ఉన్నట్లు కొన్ని ఉపనిషత్తులలో ఉపదేశింపబడుతున్నది కాబట్టి. ముక్తునికి శరీరము ఇంద్రియాలు ఉన్నవని జైమిని అనే ఆచార్యుడు భావించుతున్నాడు. ఎందువల్లనంటే వికల్పాన్ని ఉపదేశించుతున్నారు కనుక. వివిధములు ఐన కల్పము వికల్పము. అనగా వైవిధ్యము అని అర్థము. **సఏకధా భవతి. త్రిధాభవతి పంచధాభవతి** ఆముక్తాత్మ ఒకప్పుడు ఒక్క శరీరముతో మరొకప్పుడు మూడు శరీరాలతో మరొక్కసారి ఐదు శరీరాలతోనూ ఉంటున్నాడు అని శ్రుతి చెపుతున్నది కనుక. ఆత్మ విడదీయబడేది కాదు అది ఒక్కటే అనేకము కాలేదు. కనుక మూడుగా ఐదుగా కావడమనేది శరీరానికే సంబంధించినది అని తెలుస్తున్నది. ఐతే ముక్తుడు అశరీరుడు అని చెప్పడం మాత్రము కర్మ కారణంగా వచ్చిన శరీరము లేని వాడనే విషయానికి చెందింది. అటువంటి శరీరము మాత్రమే – ప్రియాప్రియాలు కలుగడానికి కారణమవుతుంది కదా! ఈ విషయములో భగవన్తుడైన బాదరాయణుడు మాత్రము తన అభిప్రాయాన్ని వెల్లడించుతూ సిద్ధాన్తాన్ని చెపుతున్నాడు –

సూ॥ **ద్వాదశాహవత్ ఉభయవిధమ్ బాదరాయణః అతః 4-4-12** ద్వాదశాహము అనే యజ్ఞము వలే రెండురకాలుగానూ ఉంటుంది అని బాదరాయణుడు అంటున్నాడు. ఈ సూత్రములోనికి ముందు చెప్పబడిన సూత్రములో నుంచి "**సంకల్పాదేవ**" అనే పదము అతః అనే శబ్దము చేత పరామర్శించబడుతున్నది. ఇందువల్ల తనయొక్క సంకల్పము ప్రకారముగానే ఉభయవిధాలుగా – సశరీరుడుగా, శరీరము లేనివాడుగా ముక్తుడు ఉంటున్నాడని భగవన్తుడగు బాదరాయణుడు తలుస్తున్నాడు. ఇట్లాగైనందువల్ల రెండు విధాలుగా నున్న శ్రుతులున్నూ పొసగుతున్నవి. ఎట్లాగంటే ద్వాదశాహము వలె. 1) **ద్వాదశా హంబుద్ధికామాఉపేయుః** అభివృద్ధిని కోరుకునే వారు ద్వాదశాహమనే యాగాన్ని ఆచరించాలి. 2) **ద్వాదశా హేన ప్రజాకామం యాజయేత్.** సన్తానము కావాలని కోరుకునేవానితో ద్వాదశాహము అనే యాగాన్ని చేయించాలి. అని ఉపైతి, యజతి అని చోదనను తెలిపే శబ్దాలతో సత్రము,

అహీనమున్నూ అవుతుంది. అని 1) సత్రము అనగా యజ్ఞము ఇది అనేక మంది యజమానులతో సంకల్పించబడితే సత్రము అనబడుతుంది. 2) అహీనము ఒక్కడే యజమానుడు సంకల్పమును చెప్పుకొని చేస్తే ఆ యాగము అహీనము అవుతుంది. ఒకే యాగము ఇట్లా రెండు విధాలుగానూ కావడానికి కారణము సంకల్పము యొక్క భేదము మాత్రమే. ఒకప్పుడు పలువురు యాగానికి యజమానులుగా సంకల్పమును చెప్పుకొని యజమానులు కావచ్చు. ఒకప్పుడు ఒక్క వ్యక్తి మాత్రమే యజమానుడుగా సంకల్పాన్ని చెప్పుకొని యాగము చేయవచ్చును. ఇది పన్నెండు దినాలు చేయబడుతుంది కనుక దీనికి ద్వాదశాహము అని పేరు.

ఎప్పుడైతే శరీరము ఇంద్రియాలు వంటి ఉపకరణాలను కల్గి ముక్తుడు ఉంటాడో అప్పుడు ఆ ఉపకరణాలన్నీ తనచేత మాత్రమే పుట్టింపబడాలనే నియమము ఏదీ లేదనే విషయంలో వివరిస్తున్నాడు.

సూ॥ **తన్వభావే సంధ్యవదుపపత్తేః 4-4-13** సత్యసంకల్పుడు కాబట్టి తానే సృష్టించుకొనే శరీరము లేకపోయినప్పటికీ స్వప్నములో వలే భోగాన్ని ముక్తుడు అనుభవించుతాడు. ముక్తుడు తానుగా సృష్టించుకొన్న శరీరము మొదలైన ఉపకరణాలు లేకున్నా పరమపురుషుడు సృష్టించిన ఉపకరణాలతో భోగాలననుభవించడం కుదురుతుంది. కనుక ముక్తుడు తాను సత్యసంకల్పుడైనా స్వయంగా భోగోపకరణాలను సృష్టించుకోడు. ఎట్లాగైతే కలలో **అథరథాన్ రథయోగాన్ పథః సృజతే** అనన్తరము రథాలను గుఱ్ఱాలను అవి పరుగెత్తే బాటలనున్నూ సృష్టిస్తున్నాడు అని మొదలుపెట్టి **అథవేశాన్తాన్ పుష్కరిణ్యః స్రవన్త్యః సృజతే సహికర్తా** ఇంక ఇంటివెనుక పెరడులను (పెరటితోట) వాటిలో పెద్దపెద్ద కొలనులను, సెలఏళ్ళనున్నూ పుట్టించుతున్నాడు. ఆయన గదా సృష్టికర్త అని, **య ఏష సుప్తేషు జాగర్తి కామం కామం పురుషోనిర్మిమాణః తదేవ శుక్రం తద్బ్రహ్మ తదేవా మృతము చ్యతే. తస్మిన్ లోకాః శ్రితాః సర్వే తదునాత్యేతి కశ్చన.** ఏ సత్యసంకల్పుడు ఐన పురుషుడు ఉన్నాడో అతడు అందరూ నిదురిస్తున్నప్పుడు కూడా వారివారి కోరికలకు తగినట్లు ఆయావస్తువులను స్వేచ్ఛగా సృష్టి చేస్తూ మెలకువగా ఉంటున్నాడో ఆయన శుక్రము – ఏ విధమైన పుణ్యపాపరూప కర్మ సమ్బన్ధము లేనివాడు. ఆయననే బ్రహ్మ. ఆయననే ఆనంద స్వరూపుడు అని చెప్పబడుతున్నాడు. లోకాలన్నీ ఆయనపైన ఆధారపడి జీవిస్తున్నవి. ఈ లోకాలన్నింటిలో నున్న వాళ్ళలో ఏ ఒక్కడు కూడా ఆయన

ఆజ్ఞను అతిక్రమించడు. అనిన్నీ చెప్పిన విధంగా భగవన్తుడు సృష్టించిన రథము మొదలైన ఉపకరణాలనే జీవుడు అనుభవించుతున్నాడు. అదేవిధంగా ముక్తుడు కూడా ఆటలాడుకోవడంలో మునిగి తేలుతున్న భగవన్తుడు సృష్టించిన పితృలోకాదులతో లీలారసాన్ని అనుభవించుతాడు.

సూ॥ **భావేజాగ్రద్వత్ 4-4-14** ముక్తుడు సత్యసంకల్పుడు కలవాడైనందున లీలోపకరణాలైన శరీరేంద్రియాలను సృష్టించుకున్నపుడు మెలకువలో ఉన్న మానవుని వలె తనకు కావలసిన వాటిని సృష్టించుకొని ఆనందపడుతాడు. తనయొక్క సంకల్పము ప్రకారంగానే శరీరము, ఇంద్రియాలు, పితృలోకాదులు మొదలగు ఉపకరణాలను పుట్టించుకున్నపుడు మెలకువతో ఉన్న మనిషివలె ముక్తుడు కూడా లీలారసాన్ని అనుభవించుతాడు. పరమపురుషుడు కూడా తన వినోదము (లీల) కొరకు దశరథుడు, వసుదేవుడు మొదలైన పితరులను ఇంకా ఇతరములను తనలోనుంచే పుట్టించుకొని వాటితో మనుష్యుల యొక్క ధర్మాలను అనుభవించడమనే లీలారసాన్ని ఎట్లా అనుభవిస్తున్నాడో అదే విధంగా ముక్తుల కొరకు కూడా తన లీలలో భాగంగా పితృ లోకము మొదలైనవాటిని ఒకానొకప్పుడు సృష్టించుతాడు. మరొకప్పుడు ముక్తులే తాము కూడా పరమాత్మ వలె సత్యసంకల్పులు కనుక పరమపురుషుని యొక్క లీలలో ఒక భాగమైన తమ పితృలోకాదులను తాముగానే సృష్టి చేసుకుంటారు. కనుక పై ఇద్దరి పెద్దల అభిప్రాయాలు సమంజసమే.

ఏమండీ! ఆత్మ అణువంతటి పరిమాణము (ఆకారము) కలవాడని కదా చెప్పినారు. ఐనపుడు అతడు అనేక శరీరాలను కల్గి ఉండి వాటిలో తానుంటూ ఇవి నా శరీరాలు అని అభిమానించిడము ఎట్లా? కుదురుతుంది అని అంటే చెపుతున్నారు.

సూ॥ **ప్రదీప వదావేశః తథాహిదర్శయతి 4-4-15** దీపము తానొక చోట ఉన్నా తన కాంతితో అంతటా వ్యాపించినట్లు గానే ఆత్మ కూడా తనచైతన్యముతో అన్ని శరీరాల్లో వ్యాపించుతుంది. దాన్నే వేదము చూపుతున్నది కూడా. ఏవిధంగానైతే ఒకే ప్రదేశములో ఉన్న ప్రదీపము తనదైన ప్రభతో ఇతర ప్రదేశాల్లో ఆవేశించుతుందో అదేవిధంగా ఆత్మ ఒక దేశములో నున్నప్పటికీ తనదైన ప్రభవంటి చైతన్యముతో అన్ని శరీరాలలో ఆవేశించడము పొసగనిదేమీ కాదు. ఎట్లాగైతే ఒకే శరీరములో కూడా హృదయము మొదలైన ఒక్కచోట ఆత్మ నిలిచి ఉంటున్నప్పటికీ తనదైన చైతన్యముతో దేహము అంతటా వ్యాపించి ఇదంతా నా శరీరమే అని ఎట్లా అభిమానించడము

జరుగుతున్నదో దానివలెనే ఒక్క శరీరములో అణువుగా నిల్చి ఉన్నా తనదైన చైతన్యముతో అన్ని దేహాలలో వ్యాపించి ఉండి ఇవన్నీ నా దేహాలనే భావించడమున్నూ పొసగుతుంది. అయితే ఇక్కడొక విశేషము ఉన్నది –

ముక్తుడు కాని ప్రాణి తన పూర్వకర్మ కారణంగా నిండైన జ్ఞానాన్ని కల్గి ఉండక కొద్దిపాటి జ్ఞానముతో కుదించుకొని పోయి ఉంటున్నాడు. కనుక అతడికి ఇతర దేహాలలో వ్యాప్తిలేక ఆవేశము చెల్లదు. ముక్తునికైతే సంకుచితమైన జ్ఞానము కలవాడు కానందువల్ల తన సంకల్పము ప్రకారము, ఇవన్నీ నా శరీరాలే అనే అభిమానానికి తగినట్లు వ్యాప్తి / ఆవేశము / నిండి ఉండడము చక్కగా అమరుతున్నది. ఇది లోకంలో మనకు కనపడుతున్నదాన్ని పట్టి పొసగని మాట కాదు. దాన్నే వేదపురుషుడు చూపిస్తున్నాడు. **వాలాగ్ర శతభాగస్య శతథా కల్పితస్యచ। భాగోజీవః సవిజ్ఞేయః సచ ఆనన్త్యాయకల్పతే॥** బుడమ వడ్ల గింజయొక్క కొసను వాలము అని అంటారు అది ముల్లు వలె కొస దేరి ఉంటుంది. దాన్ని నూరు ముక్కలుగా చేసుకోవాలి. మళ్ళీ అందులోనుంచి ఒక ముక్కను తీసుకొని వంద భాగాలు చేసి వాటిలోంటి ఒక ముక్కను వేరుచేస్తే అది ఎంత చిన్నగా ఉంటుందో అంతటి చిన్న ఆకారాన్ని ఆత్మ కలిగి ఉంటుంది. ఐనా ఆ ఆత్మ అనన్త శరీరాలను కలిగి ఉంటుంది అని. ముక్తుడు కాని ఆత్మకు తన ఇష్టము వచ్చినట్లు, తన సంకల్పము ప్రకారము వ్యాప్తిని చెందకుండా వాని కర్మ అడుగడుగునా అడ్డుపడుతుంది. ముక్తుడు కర్మలు లేని వాడు కాబట్టి తన ఇచ్ఛ / ఇష్టము ప్రకారము ఎన్ని శరీరాలలోనైనా వ్యాపించగల్గుతాడు. ఇదే విశేషము.

ఏమండీ! పరబ్రహ్మను చేరుకున్న ముక్తుడికి బాహ్యజ్ఞానం లోపలి జ్ఞానమూ లేదని శ్రుతి చూపుతున్నది. **ప్రాజ్ఞేనాత్మనా సమ్పరిష్వక్తః నబాహ్యం కించనవేద నాన్తరమ్.** అన్నీ తెల్సినవాడైన పరమాత్మ చేత ఆలింగనము చేసుకోబడినవాడు బయటి ప్రపంచజ్ఞానాన్ని గాని మానసిక జ్ఞానాన్ని గానీ ఎరుగడు. అని గదా శ్రుతి వాక్యము వినిపిస్తున్నది. ఐనప్పుడు ముక్తుడికి సర్వజ్ఞత్వము చెప్పడము ఎట్లా కుదురుతుంది. అనిఅంటే ప్రత్యుత్తరాన్ని చెప్తున్నారు.

సూ॥**స్వాప్యయ సంపత్త్యోరన్యతరాపేక్షమావిష్కృతంహి 4-4-16**నీవు చూపిన వాక్యము ముక్తుడికి చెందింది కాదు. సుషుప్తి మరణాల్లో ఒకదానికి చెందినటువంటిది. ముక్తునికి సర్వజ్ఞత్వము వేదముచేతనే ఆవిష్కరింపబడింది కదా! ఈ వాక్యము ముక్తునికి సమ్బన్ధించినది కాదు. కానీ స్వాప్యయ సంపత్తులలో ఒకదానికి చెందినట్టిది.

స్వాప్యయః సుషుప్తి లేక ఒళ్ళు మరిచి నిద్రపోవుట. సమ్పత్తి అంటే మరణము చావు **వాక్ మనసి సమ్పద్యతే** అని మొదలుపెట్టి **తేజః పరస్యాం దేవతాయాం** (వాక్కు మనస్సులో కలుస్తుంది. తేజస్సు పరమాత్మలో) అని చెప్పినందువల్ల. ఆ రెండు అవస్థలలో ప్రాజ్ఞుడిని చేరుకోవడము, నిస్సమ్బోధత్వమున్నూ ఉంటున్నవి. కావున వాటిలో ఒకదానికి చెందినదీ వాక్యము. సుషుప్తి మరణాలల్లో నిస్సంబోధత్వము, ముక్తుడికి సర్వజ్ఞత్వమున్నూ శ్రుతి చేత ఆవిష్కరించబడినవి కదా! **నా హఖలు అయమేవం సంప్రత్యాత్మానం జానాత్యయమహమస్మీతి. నోఏవేమాని భూతాని వినాశమే వాపీతో భవతి. నాహమత్ర భోగ్యం పశ్యామి.** ఇతడు ఇప్పుడు తనను గురించి నేను ఇటువంటి వాడనై ఉన్నాను అని ఎరుగడు. ఈ భూతాలను గురించి ఎరుగడు. పూర్తిగా వినాశనాన్నే పొందుతున్నాడు. ఇప్పుడిక్కడ ఇది భుజింపదగిన పదార్థమని ఎరుగను. అని సుషుప్తి సమయంలో దేనిని గురించి కూడా తెలియని నిస్సంబోధత్వాన్ని చెప్పి, అదే వాక్యములో ముక్తుడిని గురించి **సవాఏష దివ్యేన చక్షుషా మనసైతాన్ కామాన్ పశ్యన్ రమతే యఏతే బ్రహ్మలోకే.** ఆ విధంగా శరీరాన్నించి విడుదలను పొందిన ఆత్మ దివ్యమైన చూపుతో, మనస్సుతోనూ ఈ కామములను చూస్తూ ఆనందపడుతున్నాడు. ఈ బ్రహ్మ లోకము నందు అని జీవుడికి సర్వజ్ఞత్వము చెప్పబడుతున్నది. అట్లాగే **సర్వం హపశ్యః పశ్యతి. సర్వమాప్నోతి సర్వశః** జ్ఞానస్వరూపుడైన అతడు అన్నింటినీ దర్శించుతున్నాడు. అన్నివిధాలుగానూ తాను కోరిన వాటినన్నింటినీ పొందుతున్నాడు అనిన్నీ తేటతెల్లముగా సర్వజ్ఞత్వము చెప్పబడుతున్నది. మరియు మరణములోనూ నిస్సంబోధత్వము **ఏతే భ్యో భూతేభ్యః సముత్థాయ తాన్యేవానువినశ్యతి.** ఈ భూతాల నుండి విడివడి పైకి లేచిపోయి వాటితో పాటే నశించుతున్నాడు. అని చెప్పబడింది. వినశ్యతి అనగా చూడడు. (నపశ్యతి) అని అర్థము. కావున **ప్రాజ్ఞేనాత్మనా** అనే వచనము స్వాప్యయము సమ్పత్తిలలో ఏదో ఒకదానికి సమ్బన్ధించినట్టిది. **ఇది అభావాధికరణము.**

★ ★ ★

## ఇక జగద్వ్యాపార వర్జాధికరణము.

సూ॥ **జగద్వ్యాపారవర్జమ్ ప్రకరణాత్ అసన్నిహిత త్వాచ్చ 4-4-17** ముక్తునికి కలుగబోయే ఐశ్వర్యము జగత్తు యొక్క సృష్టిస్థితి లయాలకు సమ్బన్ధించనిదే. ప్రకరణము పరమాత్మకు మాత్రమే సంబన్ధించి నటువంటిది.

సృష్టిస్థితి లయాదులను తెలిపే సందర్భాలలో ముక్తునికి సమ్బన్ధము లేదు. ముక్తునికి కలిగే ఐశ్వర్యము జగత్తును సృష్టించడము మొదలైన పరమ పురుషుడికి మాత్రమే చెందిన అసాధారణ సర్వేశ్వరత్వముతో కూడినదా?లేక అది లేకుండా కేవలము పరమ పురుషుడిని అనుభవించడమనే అంశము ఒక్కటి మాత్రమేనా ఏమి? అని సంశయము ఏర్పడుతున్నది. వీటిలో ఏది తగును అని అన్నట్లైతే జగదీశ్వరత్వము కూడా అని సమాధానము. ఎందుకంటే **నిరంజనః పరమం సామ్యముపైతి.** దేనితోనూ సమ్బన్ధము లేని వాడై ఆ పరమాత్మతో పూర్తిగా సమానత్వాన్ని పొందుతున్నాడు. అని పరమపురుషునితో పరమసామ్యాపత్తి, సత్యసంకల్పత్వ శ్రుతి కూడా వినిపించుతున్నది కదా! పరమ సామ్యము సత్యసంకల్పత్వమున్నూ సర్వేశ్వరుని అసాధారణమైన జగన్నియమనము లేకపోతే ఒప్పవు. కనుక సత్యసంకల్పత్వము పరమసామ్యత్వమలు పొసగడం కొరకు సమస్త జగత్తునున్నూ నియమించగల ఐశ్వర్యమున్నూ ముక్తుడికి ఉన్నది అని అంగీకరించాలి అని పూర్వపక్షము యొక్క వాదము ముందుకు వచ్చింది. దీనికి సమాధానాన్ని చెపుతున్నారు.

జగద్ వ్యాపారవర్జమ్ అని. జగత్ వ్యాపారము అంటే చేతనములు అచేతనములు ఐన వాటన్నింటి యొక్క స్వరూపము, స్థితి, ప్రవృత్తి భేదాలను నియమించడము అని అర్థము. అది లేకపోవుటయే జగత్ వ్యాపారవర్జము. తేటగా చెప్పుకున్నట్లయితే ప్రకృతినీ, జీవులనూ పుట్టించడము – ప్రపంచాన్ని పుట్టించడము, వాటియొక్క కర్మలననుసరించి ఆయా సుఖదుఃఖాలను అనుభవించేటట్లు చూడడము, చివరకు వాటిని లయము చేసుకోవడము. ఇదే జగత్తు యొక్క వ్యాపారము – పని. ఇది లేకపోవడమే, పుట్టించుట నిలబెట్టుట గిట్టించుట అనే పని లేకుండుటయే జగద్వ్యాపారవర్జము అని అనబడ్తున్నది. ఇందువల్ల తేలిన సారాంశము ఏమిటంటే అన్ని రకాలైన తిరోధానాలు తొలగిపోయి ఏవంకా లేకుండా పరమాత్మను దర్శించుకుంటూ ఆనందాన్ని అనుభవించుటయే ముక్తుని యొక్క ఐశ్వర్యము. ఎందువల్లనంటే ప్రకరణము కారణంగా అని. సమస్త ప్రపంచాన్ని నియమించడమనేది పరమాత్మకే సమ్బన్ధించినది అని ఉపదేశించుతున్నందువల్ల. **యతోవా ఇమాని భూతాని జాయన్తే, యేనజాతాని జీవన్తి, యత్ ప్రయన్త్యభిసం విశన్తి. తద్ విజిజ్ఞాసస్వ. తద్ బ్రహ్మ.** ఎవడినుండైతే ఈ ప్రాణులు పుడ్తున్నవో, పుట్టినవి ఎవనివల్ల బ్రతుకుతున్నవో, చివరకు ఎవని వద్దకు పోతున్నవో (ఇదే ముక్తి) ఎవనిలో కల్సిపోతున్నదో అతడు బ్రహ్మ అని తెల్సుకో అని.

ఒకవేళ ఈ జగన్నియమనము ముక్తులకు కూడా సాధారణమే అయినట్లయితే అప్పుడు జగదీశ్వరత్వరూపమైన బ్రహ్మలక్షణము చెల్లకుండా పోతుంది. లక్షణము అన్నప్పుడు ఆ ధర్మము ఇతరులలో మరే ఒక్కని యందూ ఉండకూడదు కదా!

అట్లే **సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్. తదైక్షత బహుస్యామ్ ప్రజాయేయేతి. తత్తేజోఽసృజత** ఓ సోమ్యుడా! సృష్టికి ముందటికాలంలో ఈ ప్రపంచము ఒక్కటిగానే ఉన్నది. రెండవది లేదు అట్లా ఒక్కటిగానే ఉన్న సత్‌పదార్థము తల్చుకున్నది. నేను అనేకములుగా అవుతాను అని. అందుకొరకు పలురూపాలుగా పుడుతాను అని. ఆ సత్తు ముందుగా తేజస్సు సృష్టించినది. **2) బ్రహ్మవా ఇదమగ్ర ఆసీత్. ఏకమేవ తదేకం సన్నవ్య భవత్. తత్ శ్రేయోరూపమత్యసృజత క్షత్రమ్. యాన్యే తానిదేవత్రాక్షత్రాణి ఇంద్రోవరుణః సోమోరుద్రః పర్జన్యో యమోమృత్యురీశానః ఇతి** ఈ ప్రపంచము అంతా తొలినాళ్ళలో ఒక్కటిగానే ఉండెను. దానికి బ్రహ్మ అని పేరు. అది ఒక్కటిగా ఉంటూ పలురూపాలుగా లేకుండినది. ఆ బ్రహ్మ అనబడునదే శ్రేయస్సును కలిగించే క్షత్రమును – క్షత్రియ – రక్షించే – జాతిని సృష్టించెను. ఏవైతే దేవతా రూపాలుగా చెప్పబడుతున్నవో! ఇంద్రుడు వరుణుడు చంద్రుడు (సోముడు) రుద్రుడు పర్జన్యుడు (మేఘుడు) యముడు మృత్యువు ఈశానుడు అని. **3) ఆత్మావా ఇదమేక ఏవాగ్రఆసీత్. నాన్యత్ కించన మిషత్. సఈక్షత లోకాన్ను సృజాఇతి. స ఇమాన్‌లోకా నసృజత** ఈ సృష్టి జరుగడానికి ముందు ఆత్మ ఒక్కటి మాత్రమే ఉండింది. మరొక్కటి ఏదీ కనిపించలేదు. ఆ ఆత్మ లోకాలను సృష్టించుతాను అని తలచింది. అట్లా తలచిన ఆత్మ ఈ లోకాలను సృష్టించింది. **4) ఏకోహవై నారాయణ ఆసీత్ న బ్రహ్మా నేశానః నేమే పృథివీ ననక్షత్రాణి నాపోనాగ్నిర్నసోమో న సూర్యః. సఏకాకీ నరమేత. తస్యధ్యానాన్తఃస్థస్య ఏకా కన్యా దశేన్ద్రి యాణి.** తొట్టతొలినాళ్ళల్లో నారాయణుడు ఒక్కడే ఉండినాడు. బ్రహ్మ, ఈశానుడు, ఈ భూమి ఆకాశాలు, నక్షత్రాలు, నీళ్ళు అగ్ని సోముడు సూర్యుడు ఎవ్వరూ లేరు. ఆయన ఒంటరిగా నుండినాడు. కనుక ఆనందము లేనివాడుగా నుండెను. ధ్యానములో (సంకల్పరూపమైన జ్ఞానము) నున్న ఆయనకు ఒక్క అమ్మాయి. పది ఇంద్రియాలు (జన్మించినవి) కన్యా = కనదీప్తౌ అనే ధాతువు నుండి ఈ పదము పుట్టింది. ప్రకాశము కలది మనస్సు. ప్రకాశము అనగా వెలుతురు / జ్ఞానము అని. అది ప్రకాశిస్తూ ఇంద్రియాలపై ఆధారపడి ఉంటుంది. అది స్వతంత్రమైనది. ఏ ఒక్కఇంద్రియానికీ చెందదు. అన్ని ఇంద్రియాల ద్వారా వివిధ విషయాలను గ్రహిస్తుంది. ఉజ్జ్వలముగా వెలుగుతూ ఉంటుంది కనుక కన్య అని పేరు.

**యః పృథివ్యాం తిష్ఠన్ పృథివ్యా అన్తరః** అని మొదలుపెట్టి **యః ఆత్మని తిష్ఠన్.** ఇత్యాదుల యందున్నూ నిఖిల జగత్తునూ నియమించడమనేది పరమ పురుషుడిని గురించే వినిపించబడుతున్నది. అసంనిహితత్వాచ్చ – ఈ నిఖిల జగత్తులనూ నియమించే విషయాన్ని చెప్పే వాక్యాల యందు / సందర్భాలలో ముక్త పురుషునికి సాన్నిధ్యము లేదు. ఉండినట్లయితే అతనికి కూడా జగద్ వ్యాపారము కలిగెడిది.

సూ॥ **ప్రత్యక్షోపదేశాన్న ఇతి చేన్న. ఆధికారిక మండలస్థోక్తేః 4–4–18** నేరుగానే ముక్తునికి జగద్వ్యాపారము కూడా ఉన్నదని చెప్పబడుతున్నందువల్ల లేదనకూడదని అంటేకాదు. ఆయా మండలాలకు అధికారులైన వారియొక్క మండలాల్లో ఉన్న భోగాలను గురించే అక్కడ చెప్పబడింది కనుక జగద్వ్యాపారము ముక్త పురుషునికి లేదు. 1) **సస్వరాట్ భవతి. తస్య సర్వేషులోకేషు కామచారోభవతి** అతడు తనకు తానే రాజు అవుతున్నాడు. అతనికి లోకాలు అన్నింటిలోనూ స్వేచ్ఛగా వచ్చీపోయే అధికారము ఉన్నది. 2) **సఇమాన్ లోకాన్ కామాన్నీ కామరూప్యను సంచరన్** అతడు ఈ లోకాలనన్నింటినీ ప్రత్యేకంగా కోరిక ఏమీ లేకుండా తిరుగుతూ అని చెప్పినట్లు ప్రత్యక్షంగా మరియు వేదము చేతనున్నూ ముక్తునికి జగద్ వ్యాపారము ఉపదేశింపబడుతున్నది. కనుక జగద్ వ్యాపారము లేదు అని చెప్పకూడదని అంటే అది సరికాదు. ఆధికారిక మండలస్థుడుగా చెప్పబడింది. ఆధికారికాః – ఆయా అధికారాల యందు నియమింపబడిన హిరణ్యగర్భుడు మొదలైనవారు. మండలాని వారియొక్క లోకాలు. తత్స్థాః – అక్కడ ఉన్నటువంటి భోగాలు. కర్మవశ్యుడు కాని ముక్తునికి లభించుతవి (భవన్తి) అని అర్థము. ఈ విషయము **తస్యసర్వేషులోకేషు కామ చారో భవతి** ఇత్యాది వాక్యము ద్వారా చెప్పబడుతున్నది. కర్మలచేత అడ్డుకోబడని జ్ఞానము కల ముక్తుడు వికారలోకాలను – కార్యములు ఐన లోకాలను, అవీ బ్రహ్మ యొక్క విభూతి – ఐశ్వర్యములో భాగాలు ఐన వాటిని అనుభవించి తన కోరిక మేరకు తృప్తిని చెందుతాడు అని అర్థము. అందువల్ల ఈ వికారలోకాలలో భాగాలైన ఆధికారిక మండలాల్లో ఉన్న భోగాలను అన్నిటినీ, అవిన్నీ బ్రహ్మయొక్క విభూతి ఐనటువంటి వాటిని అనుభవించుతాడు అని ఈ వాక్యము చేత సస్వరాట్ భవతి ఇత్యాది వాక్యము చేత – చెప్పబడుతున్నది. కనుక జగద్ వ్యాపారము లేదు.

ముక్తుడు కూడా సంసారి వలె వికార లోకాలలో ఉండే భోగాలను అనుభవించేట్లయితే బద్ధుడికి వలెనే ముక్తుడికి కూడాభోగపదార్థాలు అన్తవన్తములే –

ఒకదగ్గర ముగిసిపోయేవే – ఒక పరిమితి కలిగి. అల్పములే కావలసి వస్తుంది కదా? అని సంశయము కలిగితే సమాధానాన్ని చెపుతున్నారు.

సూ॥ **వికారావర్తి చ తథాహిస్థితి మాహ 4–4–19** ముక్తుడు వికారాలయందు ప్రవర్తించడు. పరమాత్మను సకల కళ్యాణ గుణాభిరాముడినే అనుభవించుతాడు. విశ్వమంతా పరమపురుషునికి విభూతి దాని భగవద్విభూతిగా అనుభవిస్తాడు. ఆవిధమైన స్థితిని వేదము చూపుతున్నది. వికారాలైన జన్మాదుల యందు ప్రవర్తించడు – ఉండడు కనుక వికారావర్తి. (వికార + అవర్తిఽవికారావర్తి) నిఖిల వికారాలను దులిపేసుకున్నవాడు (వాటితో సమ్బన్ధము లేనివాడు) అన్నిరకాలైన హేయగుణాలకు ప్రత్యనీకము (శత్రువు) ఐన కళ్యాణ గుణాలకు ఒకే ఒక్క స్థానము ఐనవాడు. సాటి, మేటి లేని ఆనందము కలవాడు ఐన పరబ్రహ్మను అతని విభూతితోపాటుగా సకల కళ్యాణాలు కలవాడిని ముక్తుడు అనుభవించుతాడు. వికారవర్తులు ఐన లోకాలు ఆ పరబ్రహ్మ యొక్క విభూతిలో ఒక భాగమే అవుతున్నాయి. కనుక ముక్తునికి భోగ్యములే అవుతున్నవి. ఆ విధము ఎట్లనగా నిర్వికారుడైన అవధిలేని అతిశయమైన ఆనందము కలవాడు ఐన పరబ్రహ్మయందు ముక్తుడికి అనుభవించేవాడుగా స్థితిని వేదము చెప్పింది. **యదా హ్యేవైష ఏతస్మిన్నదృశ్యే అనాత్మ్యే అనిరుక్తే అనిలయనే అభయం ప్రతిష్ఠామ్ విన్దతే అథసోఽభయంగతో భవతి.** ఎప్పుడైతే ఈ ఉపాసకుడు ఈ కంటికి కనిపించనివాడు, తనకంటూ వేరే ఆత్మను లేనివాడు (తనకుతానే ఆత్మ) ఒకానొక పేరు లేనివాడు, ఒకచోట నివాసము లేక అంతటా నిండి ఉన్నవాడు ఐన పరమాత్మ యందు అభయాన్ని ప్రతిష్ఠను – నిష్ఠను, నిలుకడను – పొందుతున్నాడో దాని తరువాత అతడు దేనినుంచీ భయము లేకపోవడాన్ని – శరణాన్ని, రక్షణను పొందుతున్నాడు. **2) రసోవైసః రసగ్ం హ్యేవాయం లబ్ధ్వా ఆనందీ భవతి** ఆ పరబ్రహ్మ రసస్వరూపుడు. ఈ ఉపాసకుడైన జీవుడు ఆ రసస్వరూపుడిని పొంది ఆనందమునే కలవాడవుతున్నాడు. ఇత్యాది వాక్యాలు పరమాత్మ స్వరూపాన్ని చెపుతున్నవి. ఆయనయొక్క ఐశ్వర్యం ఐన ఈ జగత్తు కూడా ఆయన యందే ఉంటున్నది. **తస్మిన్ లోకాః శ్రితాస్సర్వే తదునాత్యేతి కశ్చన** లోకాలన్నీ ఆయనయందే ఆధారపడి / ఆశ్రయించి ఉన్నవి. ఏ ఒక్కటి కూడా ఆయనను కాదని పోలేవు. అని శ్రుతి చెప్తున్నది. కనుక ఈ విధంగా లోకాలన్నిటితో కూడిఉన్న సవిభూతికుడు ఐన బ్రహ్మను అనుభవించుతూ వికారాన్తర్వర్తులు ఐన ఆధికారికుల మండలాలలో ఉన్న భోగాలనున్నూ అనుభవించుతాడు అని

**సర్వేషులోకేషు కామ చారః** ఇత్యాది వాక్యము చేత చెప్పబడుతున్నది. కానీ ముక్తునికి జగద్వ్యాపారము చెప్పబడడం లేదు.

సూ॥ **దర్శయతశ్చైవం ప్రత్యక్షానుమానే. 4-4-20** శ్రుతి స్మృతులు ఇదే విషయాన్ని చూపిస్తున్నవి. పరుని చేత నియమింపబడేవాడు ముక్తుడైన ఈ ప్రత్యగాత్మకు నియన్తఐన పరమపురుషునికి మాత్రమే అసాధారణమైన జగద్ వ్యాపారరూపమైన నియమనము సమ్భవించదు అని చెప్పబడింది. నిఖిల జగన్నియమన రూపమైన వ్యాపారము పరమపురుషునికే అసాధారణమని శ్రుతిస్మృతులు చూపిస్తున్నవి. **1) భీషాఽస్మాద్వాతః పవతే. భీషోదేతి సూర్యః భీషాఽస్మాదగ్నిశ్చేన్ద్రశ్చ మృత్యుర్ధావతి పంచమః** ఈ ఈశ్వరుని యొక్క భయము వల్ల గాలి వీస్తున్నది. భయమువల్లనే సూర్యుడు సరియైన సమయానికి పొడుస్తున్నాడు. భయము వలననే అగ్ని, ఇంద్రుడు తమ విధులను చక్కగా నిర్వర్తిస్తున్నారు. నన్ను కూడా సంహరించేవాడు అని భయపడుతూ మృత్యుదేవత పరుగులు పెడుతున్నాడు. **2) ఏత స్యవా అక్షరస్య ప్రశాసనే గార్గి సూర్యా చంద్ర మసౌ విధృతౌ తిష్ఠతః** ఓ గార్గి! ఈ అక్షర పరబ్రహ్మ యొక్క ఆజ్ఞలకు కట్టుబడియే సూర్యచంద్రులు ప్రవర్తిస్తున్నారు **3) ఏష సర్వేశ్వరః ఏషభూతాధిపతిః ఏషభూతపాలః ఏషసేతుర్విధరణః ఏషాం లోకానామ సంభేదాయ.** ఈయన సర్వేశ్వరుడు భూతాలకు అధిపతి. భూతాలను పాలించేవాడు / రక్షించేవాడు. రెండు లోకాలను కల్సిపోకుండా రెండింటితో సమ్బన్ధమున్న సేతువు వంటివాడు. అని శ్రుతి చెప్తున్నది. ఇక స్మృతి కూడా – **శ్లో॥ మయాఽధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరా చరమ్। హేతునాఽనేన కౌన్తేయ జగత్ విపరివర్తతే.** నేను అధ్యక్షుడినై పర్యవేక్షణ చేస్తుండగా ప్రకృతి చరాచరాలను పుట్టిస్తున్నది. ఈ కారణం చేతనే ఓ అర్జునా! ఈ జగత్తు పలువిధాలైన మార్పులను పొందుతున్నది అని. **శ్లో॥ విష్టభ్యాహమిదం కృత్స్నమేకాం శేన స్థితోజగత్।** ఈ సమస్త ప్రపంచాన్ని నాలోని ఒక్క అంశముతోనే వ్యాపించి నిల్పుతూ ఉన్నాను. అనిన్నీ చెప్పినారు. ఆ విధంగానే ముక్తుడికి సత్యసంకల్పత్వాది గుణపూర్వకముగా ఆనందము కలుగడానికి పరమ పురుషుడే కారణము అని శ్రుతి స్మృతులు చూపుతున్నవి. **1) ఏషహ్యేవా నందయాతి.** ఇతడు మాత్రమే ఆనందింపచేస్తున్నాడు. **2) శ్లో॥ మాంచయోఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే। సగుణాన్ సమతీ త్యైతాన్ బ్రహ్మభూయాయకల్పతే। బ్రహ్మణోహి**

**ప్రతిష్ఠాఽహమమృతస్యావ్యయస్యచ। శాశ్వతస్య చధర్మస్య సుఖస్యైకాన్తికస్యచ।** నన్ను ఎవడైతే చెక్కుచెదరని (ఇతరులపైకిపోని) భక్తితో సేవిస్తున్నాడో అతడు సత్వరజస్తమస్సు లనే మూడు గుణాలను దాటుకొని పోయి అధికమైన బ్రహ్మభావాన్ని పొందుతున్నాడు. నేను జీవుడికి ప్రతిష్ఠ / చేరుకోదగినవాడిని నేను. మోక్షాన్ని నేనే. అది ఏనాటికీ తరుగనిది. శాశ్వతమై ఉండే జ్ఞాన ధర్మాన్ని నేనే. దుఃఖముతో ఎంత మాత్రమూ పొత్తులేని సుఖాన్ని ఆనందాన్ని నేనే అని. అపహత పాప్మత్వాది ఐ సత్యసంకల్పత్వము వరకు ఉన్న గుణగణము ప్రత్యగాత్మ స్వాభావికమైనదే ఆవిర్భవించినప్పటికీ అతడికి అట్లా ఆవిర్భవించడము స్వాభావికత్వము పరమ పురుషుడికి వశమైఉంటుంది. అది ఎన్నటికీ చెదరకుండా ఉండడమనేది కూడా ఆయన ఇష్టానికి అనుగుణమై ఉంటుంది. స్వాభావికమైన కళ్యాణ గుణగణాలు జీవుడికి ఎల్లపుడూ ఉండాలి అని పరమాత్మ కోరుకుంటున్నాడు కనుక సత్యసంకల్పత్వాదులు జీవుడికి ఎల్లకాలము ఉంటున్నాయి. కనుక విరోధము ఏదీలేదు. ఈ తీరుగనే పరమపురుషుని యొక్క భోగోపకరణములు లీలోపకరణములున్నూ నిత్యములే అని శాస్త్రము ద్వారా తెలుస్తున్నది. పరమ పురుషుడికి నిత్యేష్టము ఐనందువల్లనే అవి అట్లా నిత్యాలుగా ఉంటున్నవి అని శాస్త్రము / వేదము వల్లనే తెలుస్తున్నది. కనుక ముక్తునికి సత్యసంకల్పత్వము, పరమపురుషుడితో సామ్యమున్నూ జగద్వ్యాపారము లేకుండానే కలుగుతవి.

సూ॥ **భోగమాత్రసామ్య లింగాచ్చ 4-4-21** సామ్యము అని అంటే ఆయనతో సమానంగా భోగాలను అనుభవించడము మాత్రమే. అటువంటి లింగములే (గురుతులే) కనిపిస్తున్నందువల్ల కూడా జగద్ వ్యాపారవర్జమే. బ్రహ్మ యొక్క యాథాత్మ్యాన్ని అనుభవించడమనే రూపములో ఉన్న భోగము మాత్రము చేతనే ముక్తుడికి బ్రహ్మతో సామ్యాన్ని ప్రతిపాదించిన లింగాన్ని హేతువును బట్టి జగద్వ్యాపారము లేకుండానే అని అర్థమవుతున్నది. **సోఽశ్నుతే సర్వాన్ కామాన్ సహబ్రహ్మ ణా విపశ్చితా.** ఆ ముక్తుడైన పురుషుడు విపశ్చిత్తు ఐన బ్రహ్మతో కలిసి సర్వకామాలను కళ్యాణగుణాలను అనుభవించుతున్నాడు అని చెప్తున్నందువల్ల. కనుక ముక్తునికి పరమ పురుషునితో సామ్యము, సత్యసంకల్పత్వమున్నూ పరమ పురుషునికి అసాధారణమైన నిఖిల జగత్తునూ నియమించడాన్ని చెప్పే శ్రుతికి తగినట్లుగా వర్ణించవలసినదై యున్నది. కనుక జగద్ వ్యాపారాన్ని వదిలిపెట్టే ముక్తుని ఐశ్వర్యము ఉంటున్నది.

ముక్తునియొక్క ఐశ్వర్యము పరమపురుషుని యొక్క ఇష్టానికి అనుగుణంగా ఉంటుంది అని చెప్పేట్లయితే, పరమ పురుషుడు సత్వంత్రుడు. ఆయన ఎవరి మాటా వినడు. ఎవరికీ లొంగడు. తటాలున ఆయనకు ఏదో ఒక కారణంగా సంకల్పములో మార్పు వస్తే ఈ ముక్తుడు తిరిగి సంసారములోకి వచ్చి పడాల్సి వస్తుంది కదా! అనే శంక కలిగితే దానికి సమాధానాన్ని చెప్తున్నారు.

సూ॥ **అనావృత్తిః శబ్దాత్. అనావృత్తి శ్శబ్దాత్ 4-4-22** పరమ పదాన్నించి తిరిగి సంసారములోకి రావడము లేదు. రావడము లేదు. వేదము చెపుతున్నది గనుక. ఎట్లాగైతే వేదము ద్వారా అన్ని హేయములకు ప్రత్యనీకమైన, కళ్యాణములకు ఒకేఒక్క స్థానమైనవాడు, జగత్తు యొక్క జన్మ మొదలైన వాటికి కారణమైనవాడు, వస్తువులన్నింటికంటే విలక్షణం ఐనవాడు, అన్నీ తెల్సినవాడు, సత్యసంకల్పుడు, తనను ఆశ్రయించినవారికి వాత్సల్య గుణసముద్రుడు, గొప్పదయ కలవాడు. తనతో సాటియైనవాడు, మేటియైన వాడు ఉన్నాడని ఊహించడానికైనా అవకాశము ఇవ్వనివాడు పరబ్రహ్మ అనే పేరు కలవాడు పరమ పురుషుడు ఉన్నాడని వేదశబ్దముతో తెలుస్తున్నదో అదేవిధముగా ప్రతిదినమూ అనుష్ఠింపబడే వర్ణ, ఆశ్రమ ధర్మాలతో సహకరించబడిన, ఆ పరమ పురుషుడిని ఉపాసించడమనే రూపములో ఉన్న ఆయన యొక్క అర్చనచేత సంతోషించినవాడు, తనను ఉపాసించిన వారిని అనాది ఐన కాలము నుండి కొనసాగుతూ వస్తున్న అంతము లేనిదై దాటుకొని పోవడానికి వీలుకాని కర్మల రాశి అనే అవిద్యను మళ్ళించి / తొలగించి తనయొక్క యధార్థస్థితిని అనుభవించడమనే రూపముకల హద్దులేని గొప్పదైన ఆనందాన్ని పొందేవాళ్ళనుగా చేసి తిరిగి సంసారములోకి పోయేటట్లు చేయడు అనే విషయమున్నూ వేదశబ్దాల ద్వారానే తెలుస్తున్నది. ఆ శబ్దము ఏది అంటే? **సఖలు ఏవం వర్తయన్ యావదా యుషం బ్రహ్మలోకమభి సమ్పద్యతే. నచపునరావర్తతే. నచపునరావర్తతే.** అతడు ఈ విధంగా ఊపిరి ఉన్నంతవరకూ నడుపుకుంటూ వచ్చి చివరకు బ్రహ్మ లోకానికి చేరుకుంటున్నాడు. తిరిగి వెనుకకురాడు. తిరిగి వెనుకకు రాడు. ఇది మొదలుగా గల్గినట్టిది. అదే విషయాన్ని భగవన్తుడైన శ్రీకృష్ణుడు స్వయముగా చెప్పినాడు.

**శ్లో॥ మాముపేత్య పునర్జన్మ దుఃఖాలయ మశాశ్వతమ్। నాప్నువన్తి మహాత్మానః సంసిద్ధిం పరమాంగతాః। ఆ బ్రహ్మ భువనాల్లోకాః పునరావర్తినోఽర్జున। మాముపేత్యతుకౌన్తేయ పునర్జన్మ న విద్యతే.**

గొప్పదైన సాటిలేనిదైన పరమగతిని మోక్షాన్ని పొందిన మహానుభావులు నన్ను పొందిన తరువాత అశాశ్వతమౌ దుఃఖాలకే నెలవు ఐన ఈ లోకానికి తిరిగి రారు. ఓ అర్జునా! బ్రహ్మగారు ఉండే లోకం మొదలుకొని ఈ లోకాలన్నీ తిరిగి తిరిగి మళ్లీ మళ్ళీ పుడుతూ నశించేవే సుమా! నన్ను చేరిన తరువాత ఆ జీవుడికి పుట్టుక అనేది లేనే లేదు. అని.

కర్మలు అనే బంధాలు బొత్తిగా తెగి పోయినట్టివాడు సంకుచితము కాని జ్ఞానం కలవాడు పరబ్రహ్మానుభవమును పొందుట అనే ఒకే ఒక స్వభావము కలవాడు పరమాత్మ మాత్రమే తనకు ప్రియముగా కలవాడు, పరమాత్మకు ఇష్టమైన ఒకే ఒక్కడు ఐనవాడు, అనవధిక అతిశయమైన ఆనంద స్వరూపుడగు పరబ్రహ్మను అనుభవించే ముక్తునికి మరొక వస్తువు కావాలనే కోరిక కలుగడము. దానికై ప్రయత్నించడమున్నూ కలుగవు. కనుక పునరావృత్తి కలుగుతుందేమో అని శంకించడానికి అవకాశము లేదు.

ఇక పరమపురుషుడు కూడా సత్య సంకల్పుడు ఐనందువల్ల చాలా చాలా ప్రీతి పాత్రుడైన జ్ఞానిని పొంది అతడిని ఒకప్పుడైనా తిరిగి సంసారము లోకి పంపించడు. స్వయంగా ఆయనే చెప్పినమాట ఇట్లా ఉన్నది. ప్రియోహిజ్ఞానినోఽత్యర్థమ్.

**శ్లో॥ ప్రియో హిజ్ఞానినోఽత్యర్థమ్. అహం సచమమప్రియః। ఉదారాః సర్వఏవైతే జ్ఞానీత్వాత్మైవ మేమతమ్॥ ఆస్థితః సహియుక్తాత్మా మామేవానుత్తమాంగతిమ్। బహూనాం జన్మనామన్తే జ్ఞానవాన్మాం ప్రపద్యతే। వాసుదేవః సర్వమితి సమహాత్మాసుదుర్లభః ఇతి.** జ్ఞానికి నేను చాలా చాలా ఇష్టమైన వాడిని. అతడు కూడా నాకు చాలా ఇష్టమైనవాడు. వీరందరున్నూ ఉదారులు. గొప్పవారు. జ్ఞాని ఐతే మాత్రము నాకు ఆత్మవంటివాడు. నేను శరీరాన్ని, అతను ఆత్మ. ఆత్మలేకుంటే శరీరము నిలువజాలదు కదా! ఆజ్ఞాని అనుత్తమమైన గతిఐన నన్ను బాగుగా ఆశ్రయించి ఉన్నాడు. అనేక జన్మలను ఎత్తిన తరువాత జ్ఞానవన్తుడగునరుడు నన్ను శరణు వేడుతున్నాడు. అతడు వాసుదేవుడొక్కడే నాకు అన్నీ అవుతున్నాడు అని సుదృఢంగా నమ్మి ఉంటున్నాడు. అటువంటి మహాత్ముడు మిక్కిలి కష్టపడినా లభించడు అని.

సూత్రములో అనావృత్తి శ్శబ్దాత్, అనావృతిశ్శబ్దాత్ అని రెండుసార్లు పఠించడము శాస్త్రము ముగిసింది అనే విషయాన్ని సూచిస్తున్నది. కనుక సర్వజగత్తుయొక్క పుట్టుక, నిలదొక్కుకొనుట, గిట్టుట అనే వాటికి ఏకైక కారణము ఐన పరబ్రహ్మ నారాయణుడు

ఉన్నాడు అని వేదము / శబ్దము అనే ప్రమాణము తెలుపగల్గుతున్నది. అతడు జీవునికి ముక్తిదాత. కనుక అతడిని జీవుడు తన సంసారబాధలనుండి విముక్తి పొందడానికి ఉపాసన చేయాలి. దానికి ముందు పరమాత్మను తెలిపే వేదాన్ని అధ్యయనం చేయాలి అది కూడా ఆచార్యముఖతః జరుగాలి. కేవల అక్షరరాశిని గ్రహించిన తరువాత పూర్వభాగము యొక్క అర్థాన్ని మీమాంసా శాస్త్రము ద్వారా తెల్సుకోవాలి. కర్మలు అల్పములు ఐన ఫలాలను ఇస్తున్నవి అని తెల్సుకొని రెండవ భాగమైన ఉపనిషత్తులలో చెప్పబడిన పరబ్రహ్మ యొక్క స్వరూపాన్ని, అతడిచ్చే ముక్తి ఫలాన్ని చేజిక్కించుకోవడానికి ఆయనయొక్క స్వరూప స్వభావ కళ్యాణగుణాలను ఉపాసన విధానాన్ని తెల్సుకోవడానికి బ్రహ్మ జిజ్ఞాస చేయాలి. కనుక అంతా సమంజసమే. **అని జగద్వ్యాపార వర్జాధికరణము.**

**భగవద్ రామానుజ విరచితమైన శ్రీభాష్యమునందు చతుర్థాధ్యాయములోని**
**చతుర్థపాదము, చతుర్థాధ్యాయము ముగిసినది.**

**గ్రంథము సమాప్తము**

**శ్రీమతే రామానుజాయ నమః**

**దీనిని కండ్లకుంట వంశస్థుడు, భారద్వాజ గోత్రుడు, సీతారామానుజాచార్యులు శ్రీమతి లక్ష్మమ్మ అనే దివ్యదమ్పతుల తొలి సన్తానము, శ్రీమాన్ న.చ. రఘునాథ దేశిక మణి శిష్యుడూ ఐన కండ్లకుంట వెంకట నరసింహాచార్యులు తెలుగుభాషలోకి అనువాదము చేసి ధన్యుడైనాడు.**

**అస్మద్ గురుభ్యోనమః.**